# నటి

నవల

– అత్తలూరి విజయలక్ష్మి



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 141

2014 జనవరి నుంచి 2015 డిసెంబర్

వరకూ

కౌముది లో 'యవనిక' పేరుతో వచ్చిన

సీరియల్

కొన్ని అనివార్యకారణాల వలన ఈ నవల పేరుని 'యవనిక'నుంచి 'నటి'గా మారుస్తున్నాను. ఇక ముందు నుంచీ 'నటి'గా ఈ నవలను గుర్తుపెట్టుకుని ఎప్పటిలా ఆదరిస్తారని ఆశిస్తూ, ఈ అసౌకర్యాన్ని మన్నించి, ఈ మార్పుని సహృదయంతో అర్ధం చేసుకుంటారని ఆశిస్తున్నాను.

**ఆత్తలూరి విజయలక్ష్మి.**

## (ప్రారంభం)

***మహిళా కళాకారుల వేదిక !***

**నీలం రంగు వెల్వెట్ బట్టమీద బంగారు రంగు** అక్షరాలతో రాయించిన బోర్డు చెరో చేత్తో పట్టుకుని ఎక్కడ పెట్టాలి ఇది అన్నట్టు గుమ్మానికిపైన ఉన్న ఖాళీ స్థలం వైపు చూస్తున్నారు పద్మిని, వసంత.

"పైన వద్దులే అక్కా! పక్కకి పెడదాం" అంది వసంత.

"అదే ఆలోచిస్తున్నాను. మరీ పైకి ఎవరూ చూడరు. ఇలా పట్టుకో గుమ్మానికి కుడిపక్కన పెడదాం. సాధారణంగా అందరి కళ్ళు ఎక్కువగా కుడివైపే చూస్తాయి" అంది పద్మిని.

మేకులున్న చిన్న అట్ట పెట్టె, సుత్తి తీసుకుని ఎత్తైన స్టూలు మీద ఎక్కి మేకు కొట్టసాగింది పద్మిని.

చేతులు నొప్పి పెడుతోంటే, వసంత బోర్డు గోడకానించి పక్కగా పెట్టింది.

"ఆ, ఆ పడిపోతావు ఏంటి ఆ సాహసం. ఆడపిల్లవి కాళ్ళో, చేతులో విరిగితే ఎంత ప్రమాదమో తెలుసా!" గట్టిగా అరుస్తూ వచ్చాడు శివరామ్.

స్టూలు దిగుతూ, అతని దగ్గరగా వచ్చి చేతిలో ఉన్న సుత్తి, మేకులు అతని చేతిలో పెడుతూ "వచ్చావుగా మగాడివి. నువ్వు కొట్టి పెడుదూ" అంది పద్మిని.

"అనుకున్నా ఇలాంటిదేదో ఉంటుందనుకుంటూనే వచ్చా. సర్లే ఇలా ఇవ్వు" అంటూ ఆమె చేతిలోంచి సుత్తి తీసుకుని "నేను స్టూలు ఎక్కాక ఒక్కో మేకు ఇవ్వు. ఇది నేనెక్కడ పట్టుకోను" అంటూ స్టూలు దగ్గరకు నడిచాడు.

వసంత అంది. "శ్రేయోభిలాషులెప్పుడూ ఇలాంటి ఆపత్సమయాల్లోనే వస్తుంటారు శివా."

"అంతేలే అందితే జుట్టు, అందకపోతే కాళ్ళు." స్టూలెక్కి మేకివ్వమన్నట్టు పద్మినివైపు చేయిచాపాడు.

పద్మిని మేకులందిస్తుంటే ఆ చివరా, ఈ చివరా, మధ్యలో మొత్తం మూడు పెద్ద మేకులు కొట్టి వసంత, పద్మిని కలిసి పట్టుకుని అందించిన బోర్డు తగిలించాడు.

"కొంచెం ఎడం పక్కకి జరుపు. వంకరగా ఉంది" అంది పద్మిని.

"కాదు కుడిపక్కకి జరుపు" అంది వసంత.

"లేదులే కరెక్ట్‌గానే ఉంది" అన్నారిద్దరూ మళ్ళీ మధ్యలో నుంచుని చూస్తూ.

"దిగనా?" అడిగాడు.

"ఆఁ..! దిగు" అన్నారిద్దరూ.

వసంత స్టూలు పట్టుకుంటే, శివరావు సుత్తి పద్మినికిచ్చి చేతులు దులుపుకున్నాడు.

"చేయి కడుక్కుందువుగాని. అలా పెరట్లోకి పంపు దగ్గరకి పద" అంది పద్మిని.

"పర్లేదులే. పెద్ద మట్టేం కాలేదు" అంటూ వాళ్ళ వెనకే లోపలికి నడిచాడు.

ఒకే ఒక పెద్ద గది. దాంట్లోనే లోపలికి వెళ్ళగానే గుమ్మానికి ఎడం వైపు ఒక మంచం. దాని వెనకాల తలాపి వైపు ఒక చిన్న బీరువా, దానిపైన ఒక పెద్ద సూట్ కేసు. మంచానికి మరోవైపు అంటే కాళ్ళవేపు ఒక షెల్ఫ్ అందులో కొన్ని పుస్తకాలు, ఫైల్స్.

మధ్యలో నడవడానికి కొంచెం దారిచ్చి కుడిపక్క రెండు పక్కలా గోడలకి మేకులు కొట్టి కట్టిన ప్లాస్టిక్ వైరు, దానిమీద కొన్ని చీరలు, జాకెట్లు, రకరకాల ఫ్యాన్సీ డ్రెసులు మడిచి పొందిగ్గా పెట్టి ఉన్నాయి. గోడలకి నాలుగువైపులా క్యాలండర్లు వాటి మీద పద్మినికి అప్పుడప్పుడూ సన్మానం చేసి మెడలో వేసిన ముత్యాల చమ్కీ పూలదండలూ వేలాడుతున్నాయి. మరో పక్క షెల్ఫ్లో ఆమె మేకప్ సామాను, ఆర్టిఫిషియల్ జ్యూవలరీ అంటే చెవుల జూకాలు, లోలకులు, మెడలో పూసల దండలు, పట్టాగొలుసులు, గాజులు, పాపిడి బిళ్ళలు, వగైరా పెట్టిన రెండు పెద్ద ప్లాస్టిక్ డబ్బాలున్నాయి. గది మధ్యలోంచి ముందుకి వెళితే బైట పెరట్లోకి వెళ్ళడానికి ద్వారం ఉంది. పెరట్లో పంపు, బాత్రూమ్, లావెట్రీ ఓ పక్క జామచెట్టు, కాంపౌండ్ వాల్ నానుకుని కొన్ని కనకాంబరం మొక్కలు, జామచెట్టుపక్కన చిన్న తులసికోట. పెరటికి రెండువైపుల చిన్న సందులా ఉంది ముందు వైపుకి వెళ్ళడానికి.

అయితే ఆ పెద్ద గదిలోనే పెరటి వైపు వెళ్ళే ద్వారానికి కుడివైపు గట్టులా ఉంది. దాని మీద సింగిల్ గ్యాస్ స్టవ్ ఉంది. గట్టుకింద సిలిండర్, మంచినీళ్ళ బిందె, గట్టు పక్క వేసిన చెక్క బల్లమీద తోమి బోర్లించిన స్టీలు పళ్ళాలు, గ్లాసులు, గిన్నెలు, గరిటెలు, వరసగా పేర్చిన ప్లాస్టిక్ డబ్బాలు వాటిలో సరుకులు. చూడగానే ఆమె పేదరికాన్ని చాటుతున్నట్టు అనిపిస్తుంది ఆ గది.

"కూర్చో శివా.. టీ తాగుదాం" అంటూ పద్మిని స్టవ్ దగ్గరకు వెళ్ళి వెలిగించి, టీ కెటిల్తో నీళ్ళు పెట్టింది.

"మొత్తానికి నువ్వు అనుకున్నది చేస్తున్నావు కదా" అన్నాడు శివరామ్.

"చేయాలికదా ఒకసారి అనుకున్నాక ఆగేది లేదు" అంది పద్మిని టీ పొడి వేస్తూ. వసంత చెక్కబల్ల దగ్గరకు నడిచి దానిమీద ప్లాస్టిక్ డబ్బాలో ఉన్న మిక్చర్ తీసుకుని, ఒక చిన్న ప్లేటులో వేసింది. ఆ డబ్బా మూతపెట్టి యథాస్థానంలో పెట్టి మిక్చర్ ప్లేటు తీసుకుని శివరామ్ దగ్గరకు వచ్చి అతనికి కొంచె ఎడంగా మంచం మీద కూర్చుని "తిను శివా" అంది తను కొంచెం అరచేతిలో వేసుకుని.

కొంచెం మిక్చర్ కుడిచేత్తో తీసుకుని ఎడం చేయి అరచేతిలో వేసుకుని తింటూ అన్నాడు శివ. "ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచించి చేయడం మంచిది పద్మినీ. ఆనక మనం చేసిన పని మనకే తిప్పికొడితే తిరిగి సాయం చేసేవాళ్ళు ఉండరు."

పూర్తి అయిన టీ కప్పుల్లో పోసి మూడు కప్పులు ఒక పెద్ద స్టీలు ప్లేటులో పెట్టి తీసుకుని వచ్చి అక్కడే ఉన్న ప్లాస్టిక్ స్టూలు జరిపి దానిమీద పెట్టి వసంత పక్కన సెటిల్ అయింది పద్మిని.

"ఇంతకాలం నుంచీ ఎంత ఓపిక పట్టాను. రాను, రానూ ప్రతివాళ్ళలో స్వార్థం పెరిగిపోతోంది. వేదిక ఎక్కాలంటే ఎంత వేదన పడాలో ఎవరికీ అర్థం కావడంలేదు. సాంఘిక నాటకానికి పది, పదిహేనురోజులు వరసగా రిహార్సల్స్ చేయాలా? పౌరాణిక నాటకం అయితే నెలల తరబడి రిహార్సల్స్ చేయాలా? ప్రతిసారీ రిహార్సల్స్కి వెళ్ళడానికి బస్సుకే రాను, పోనూ పదిహేను రూపాయలు అవుతోంది రిక్షా ఎక్కకపోతేనే. అదే రిక్షా ఎక్కితే ఇంకా ఎక్కువ అవుతుంది కదా. మరి నా మేకప్ నేను కొనుక్కున్నాను. గిల్టు నగలు, రెండు,

మూడుసార్లు వేసుకున్న డ్రెస్ మళ్ళీ వేసుకోవద్దు. ఎంత ఖర్చు అవుతుందో ఆలోచించరు సంస్థలవాళ్ళు. మగాళ్ళు తాగడానికి, సిగరెట్లకీ ఎంత డబ్బు అవుతోంది. అదంతా ఆర్గనైజర్స్ ఇచ్చే పారితోషికంలోంచేగా ఖర్చుపెడతారు. వాళ్ళ జేబుల్లోంచి ఎవరన్నా ఖర్చుపెడుతున్నారా? మాకు డబ్బులివ్వడానికి అంత బాధపడతారేంటి?'' కొంచెం ఆవేశంగా అంది పద్మిని.

''నీకో సంగతి తెలియాలి పద్మినీ. ఆర్గనైజర్స్ కూడా ప్రోగ్రాం ముందు ఒప్పుకున్న డబ్బు పూర్తిగా ఇవ్వరు. ఇదిగో, అదిగో అంటూ తిప్పిస్తారు కొందరు.''

''ఒకసారి తెలిసాక అలాంటి వాళ్ళకి అసలు మన ప్రోగ్రాం ఒప్పుకో కూడదు'' అంది పద్మిని.

వసంత కల్పించుకుంటూ అంది. ''మొన్నటికి మొన్న ఆ సాంస్కృతిక సంస్థవాళ్ళు కుంతీ పరితాపం నాటకంలో వేయమని బతిమాలి, మూడువేలిస్తామని చెప్పి, నెలరోజులు రిహార్సల్స్‌కి తిప్పి పదిహేను వందలు చేతిలో పెట్టారు. ఇదేంటి అంటే మీకు రోజూ రావడానికి యాభై రూపాయలు ఇచ్చాం కదండీ అన్నారు. వాళ్ళిచ్చింది రోజు విడిచి రోజు. రోజూ అని దబాయించారు. మగాళ్ళతో గట్టిగా మాట్లాడితే అమ్మో! ఈవిడ గయ్యాళి అంటారు.''

''ఏదో కళాసేవ చేస్తున్నాం అని చెప్పుకుంటారు గానీ, కళాసేవ చేసేవాళ్ళు నిజంగా ఎవరున్నారు శివా చెప్పు'' అంది పద్మిని.

మిక్చర్ తినడం పూర్తిచేసి టీ కప్పు అందుకున్నాడు శివ.

సాయంత్రం నాలుగు దాటింది. బైట రిక్షా ఆగి శబ్దం వినిపించింది.

''యవని వచ్చినట్టుంది'' అంది వసంత.

''అవును. నాలుగు దాటింది కదా'' అంటూ లేచి గుమ్మం దగ్గరకు వెళ్ళింది పద్మిని.

యవనిక లోపలికి వచ్చింది. రెండు జడలు మడిచి నల్లటి రిబ్బన్లు కట్టి పైకి ముడివేసింది. ముదురు నీలం రంగు స్కర్ట్, తెల్ల జాకెట్టు, పన్నెండేళ్ళ యవనిక పద్మినిలాగే తెల్లగా, బొద్దుగా ఉంది. ఉదయం వేసిన జడలు చెక్కు చెదరలేదు. నూనె రాసి నున్నగా దువ్వి గట్టిగా వేసిందేమో ఒక్క వెంట్రుక కూడా బైటకి రాలేదు. కళ్ళనిండా కాటుక. మొహం మాత్రం కొంచెం వడిలింది.

శివ యవనికను చూడగానే పలకరించాడు. ''ఏరా యవనీ ఎలా ఉన్నావు?'' అంటూ.

''బాగున్నాను మావయ్యా నాకేం తెచ్చావు?'' అంటూ స్కూలు బ్యాగు భుజం మీద నుంచి తీసి గోడవారగా పెడుతూ అడిగింది.

''ఏం తీసుకురాలేదురా. పద వెళ్ళికొనుక్కుందాం నీకేం కావాలో.''

''ఇప్పుడేం వద్దులే శివా అదలాగే అడుగుతుంది అంటూ, యవనీ నువ్వెళ్ళి యూనిఫారమ్ మార్చుకుని కాళ్ళూ, చేతులూ కడుక్కురా మిక్చర్ తిని, పాలు తాగుదువుగాని'' అంది పద్మిని.

యవనిక బీరువా దగ్గరకు నడిచి, అందులో ఉన్న గౌను తీసుకుని పెరట్లో ఉన్న బాత్ రూములోకి వెళ్ళిపోయింది.

''దీనికి ఈ పేరు ఎందుకు పెట్టావు? దీన్ని కూడా నీలాగా రంగస్థల నటిని చేస్తావా? ఏం?''

''లేదు ఎట్టి పరిస్థితుల్లో కూడా చేయను. అది బాగా చదువుకోవాలి. దాన్ని చదివించడానికి నేనెంత అయినా కష్టపడతాను. నాకు రంగస్థలం మీద ఉన్న అభిమానం, గౌరవం, నాకు ఈ ఫీల్డ్‌తో ఉన్న అనుబంధానికి గుర్తుగా ఈ రంగానికి సంబంధించిన పేరు పెట్టాలనుకున్నాను. ఏది పెడితే బాగుంటుందో అని ఆలోచిస్తుంటే ఆవిడ పూర్ణిమగారు ఈ పేరు పెట్టారు.'' అంది పద్మిని.

''పూర్ణిమగారు ఎవరు?'' అడిగింది వసంత.

"చాలా మంచి ఆర్టిస్టు. ఆవిడ పౌరాణిక నాటకాల్లో ఏం వేషం కట్టినా అటు సీత, ఇటు ద్రౌపది, చంద్రమతి ఏ పాత్ర వేసినా వేదిక మీద వాళ్ళు ప్రత్యక్షం అయినట్టుండేది. మధురమైన స్వరంతో పద్యాలు పాడుతుంటే హాలంతా చప్పట్లతో మోగిపోయేది. నేను ఆవిడ దగ్గరే నేర్చుకున్నాను పద్యాలు పాడడం. క్యాన్సర్ వచ్చి చనిపోయారు" చెప్పింది పద్మిని.

"ఆవిడ కూడా నీలాగే కూతుర్ని ఈ రంగంలోకి రానివ్వకూడదని నిర్ణయించుకుని బాగా చదివించారు. ఆ అమ్మాయి ఇప్పుడు భర్తతో అమెరికాలో ఉందిట. కాకపోతే మీ ఆయనలా వాళ్ళాయన స్వార్ధపరుడు కాదు. చాలా పెద్దమనిషి. భార్యనీ, పిల్లనీ అపురూపంగా చూసుకునేవాడు" అన్నాడు శివ.

"అసలైనా అక్కా నీదే తప్పు. నువ్వెందుకింత కష్టపడతావు? వాళ్ళ నాన్నకి మాత్రం బాధ్యతలేదా? దాని స్కూలు ఫీజులు కట్టమను. సంపాదించిందంతా తాగి, తందనాలాడుతున్నాడు దరిద్రుడు" వసంత కోపంగా అంది.

"ఎవరి బాధ్యత వాళ్ళకి తెలియాలి వసంతా. బాధ్యత లేనివాడు మనం అడిగితే మాత్రం చేస్తాడా ఏంటి?" నిరాశగా అంది పద్మిని.

"కోర్టుకి వెళితే ముక్కుపిండి వసూలు చేయచ్చు ఎవరికోసం ఇస్తాడు."

"కోర్టుకి వెళ్ళినంత మాత్రాన ఇస్తాడా? నాకు ఆదాయం లేదు అని ఋజువు చేస్తాడు. ఈ ఫీల్డులో ఉన్న సౌలభ్యం అదేకదా. ఎంత సంపాదించినా లెక్కా పత్రం ఉండదు. సినిమాల్లో అయితే ఇన్కమ్ టాక్సులు, ఆ టాక్సులు అంటూ కట్టుకోవాలి. ఈయనగారి సంస్థ పచ్చగా ఉన్నంత కాలం ఎవరికీ చిక్కడు."

శివ లేస్తూ అన్నాడు. "సరేలే పద్మినీ. నువ్వు మన సంస్థ నుంచీ విడిపోయి మహిళా కళాకారులతో విడిగా ఓ సంస్థ పెట్టావన్న విషయం కొందరికి ఇప్పటికే తెలిసిపోయింది. కాకపోతే మీరిద్దరూ మంచి కళాకారులు. మిమ్మల్ని ఒదులుకోలేకపోవచ్చు. మీకన్నా కాస్త మంచి కళాకారులు దొరికేదాకా అయినా మీతో గొడవ పెట్టుకోరు. ఆ తరువాత మిమ్మల్ని పిలవలేకపోతే మీరు బాధపడకూడదు. ఇకపోతే మీ సంస్థకి గుర్తింపు వచ్చి మీకు అవకాశాలు వచ్చిందాకా కొంత ఆర్ధికంగా ఇబ్బందులు పడాల్సివస్తుంది. వీటన్నిటికీ మానసికంగా సిద్ధంగా ఉండు. లేకపోతే ఉన్న బాధలకు తోడు కొత్తగా వచ్చిపడతాయి మరికొన్ని బాధలు. ఓ స్నేహితుడిగా, నీ శ్రేయోభిలాషిగా చెబుతున్నాను."

"నువ్వు నా మంచికే చెబుతున్నావని నాకు తెలుసు శివా. కానీ, చూస్తున్నావుగా ఆ రైటర్ ఎట్లా అవమానిస్తున్నాడో! ప్రతిసారి వీళ్ళు ఆయన నాటకాలు తప్ప ఆడరు. ఆయనకి చాలా అహంకారం. ఈయనకన్నా పెద్ద రైటర్స్ లేరా? రెండు సినిమాలకి రాసేటప్పటికి కళ్ళు నెత్తిమీదకొచ్చాయి. మేము సినిమా వాళ్ళంత గ్లామరస్‌గా ఉండకపోవచ్చు. కానీ, వాళ్ళకన్నా ఎక్కువ ప్రతిభా, పాటవాలు ఉన్నవాళ్ళం. వాళ్ళు కనీసం డైలాగ్ చెప్పుకోలేరు. కానీ మేము పెద్ద పెద్ద డైలాగులు కూడా అలవోకగా చెప్పేస్తాము, వాళ్ళు కన్నీళ్ళు కార్చడానికి గ్లిసరిన్ కావాలి. మాకు మా కళ్ళముందు మా జీవనవిధానం కనిపిస్తే చాలు మాకూ, వాళ్ళకీ తేడాలేదా? వాళ్ళతో పోల్చి మీరంతా లావైపోతున్నారు. పెద్దవాళ్ళవుతున్నారు. హీరోయిన్స్‌గా పనికిరారు. సైడ్ క్యారెక్టర్ వేయండి. తల్లి పాత్ర వేయండి అంటూ అవమానిస్తుంటే ఎలా భరించటం."

శివకి ఆమె చెప్పేదంతా నిజమనిపించింది. తనూ గమనిస్తున్నాడు. ఈ మధ్య రైటర్ చక్రధరం నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నాడు. పదేళ్ళ నుంచీ ఏ పరిషత్తులో అయినా అతని నాటకాలకే ఉత్తమ రచన, ఉత్తమ నిర్వహణ బహుమతులు వస్తున్నాయి. అన్ని పరిషత్తుల్లో అతని నాటకాలే ఆడాలి. పోటీ నాటకాలకు ఎలా రాస్తే ప్రైజులు వస్తాయో ఆ కిటుకులన్నీ అతనికి తెలుసు ఈ మధ్యే రెండు సినిమా అవకాశాలు వచ్చాయి. సంస్థకూడా అతనే నిర్వహిస్తున్నాడీ మధ్య. అతని పరపతి ఉపయోగించి ప్రతి నాటకప్రదర్శనకు,

ఎవరో ఒక ఇండస్ట్రీవాళ్ళద్వారానో, కాంట్రాక్టర్ల ద్వారానో స్పాన్సర్‌షిప్ కూడా తెచ్చుకుంటాడు. ప్రధానమైన పురుషపాత్రలన్నీ అతని ముఖ్యమైన స్నేహితులు వేస్తారు. వాళ్ళంతా ఒక గ్రూపు. వచ్చిన డబ్బులు ఎలా పంచుకుంటారో తెలియదు కానీ మిగతా ఆర్టిస్టులకి, మ్యూజిషియన్‌కీ డబ్బులివ్వాలంటే మనసొప్పదు. డబ్బివ్వకపోతే లేడీ ఆర్టిస్టులు రారు కాబట్టి చచ్చినట్టు వాళ్ళకిస్తాడు. కానీ ఇచ్చేముందు నానారకాలుగా ఏడిపించి ఇస్తాడు. చులకనగా మాట్లాడతాడు. మీరంతా నలభైలు దాటి హీరోయిన్స్ ఏంటో మా ఖర్మకాకపోతే అంటాడు. రిహార్సల్స్ టైంలో కనీసం కాఫీ, టీలన్నా ఇప్పించడు. ఈ విధమైన మార్పులన్నీ గత రెండేళ్ళుగా వస్తున్నాయి సంస్థలో అంతకు ముందు అతనిలా ఇంత పొగరమోత్తనం ఉండేదికాదు. ఈ మార్పులన్నీ పద్మిని జీర్ణం చేసుకోలేకపోతోంది.

అందుకే ఆమె తనకంటూ కేవలం మహిళా కళాకారులతో ఒక సంస్థ రిజిస్టర్ చేయించింది ఇటీవల. ఉన్నదే మొత్తం ఆంధ్రదేశం అంతా కలిపితే ముప్పై మంది ఉంటారు. వాళ్ళల్లో ప్రధానమైన అంటే కథానాయిక, తల్లి, ఇవి రెండే స్త్రీ పాత్రల్లో ఉండే ప్రధానమైన పాత్రలు. అవి వేసేవాళ్ళు పది, పన్నెండుమంది ఉన్నారు. మిగతావాళ్ళంతా చిన్న, చిన్న పాత్రలు పక్కింటావిడ, పేరంటాలు, స్నేహితురాలు ఇలాంటి పాత్రల వరకే పరిమితం. వాళ్ళంతా వేరే దిక్కులేక ఈ రంగంలో ఉన్నారే కానీ, వాళ్ళకి ఆర్టిస్టులుగా గుర్తింపు తక్కువే.

యవనిక బట్టలు మార్చుకుని రావడంతో సంభాషణ ఆగిపోయింది. శివ ఆలోచనలు కూడా ఆగిపోయాయి. "సరే మరి నేను వెళ్ళొస్తానమ్మా" అంటూ లేచాడు శివ.

వాళ్ళ ట్రూపులో అతనొక్కడే కష్టసుఖాలు తెలిసినవాడు, సంస్కారవంతుడు అంతో, ఇంతో చదువుకున్నవాడు. పద్మిని అంటే అభిమానం. వసంత కూడా పద్మినిని అభిమానించే వ్యక్తి. భర్త తాగుబోతై వదిలేస్తే దిక్కులేని ఆమెని చేరదీసి నటన నేర్పి, అవకాశాలు ఇప్పిస్తూ ఆమెని కూడా రంగస్థల కళాకారిణిని చేసింది. పద్మిని దగ్గరే ఉంటుంది వసంత.

"సరే శివా ఏదన్నా ఉంటే చెప్పుండు. మమ్మల్ని దృష్టిలో ఉంచుకో" అంది వసంత.

"అదేంటి వసంతా ఎందుకు చెప్పను" అన్నాడు శివ.

"నువ్వు లేకపోయి ఉంటే ఈ సంస్థలోంచి మేమెప్పుడో వెళ్ళిపోయేవాళ్ళం" అంది పద్మిని.

"దానికేంలే పద్మినీ నా చెల్లెలే అయితే చేయనూ" అంటూ బైటకి నడిచాడు.

"బై మామయ్యా" అంది యవనిక.

"బై తల్లీ" అంటూ వెళ్ళిపోయాడు.

పద్మిని గుమ్మం వరకూ వెళ్ళి అతన్ని సాగనంపి తిరిగి వచ్చి యవనికకి ప్లేటులో మిక్చర్ పెట్టిచ్చింది.

యవనిక ఆ ప్లేటు ఒళ్ళో పెట్టుకుని మంచం మీద బాసిం పెట్టు వేసుకుని కూర్చుంది.

"అమ్మా మనింటిలో టీ.వి లేదు. ఈమధ్య టీ.వీలో చాలా మంచి కార్యక్రమాలు వస్తున్నాయట. మనమూ టీ.వి కొనుక్కుందామే" గారంగా అంది యవనిక.

"కడుపు నిండా తిండి, ఒంటినిండా బట్ట ఉంటే చాలమ్మా. టీ.వీలు కొనుక్కునే శక్తి మనకెక్కడిది" నిట్టూర్చుస్తూ అంది పద్మిని.

"ఏం? నువ్వు నాటకాలాడుతున్నావుగా. బోలెడు డబ్బులొస్తాయిగా"

హు.. నవ్వింది పద్మిని. "నిజంగా నువ్వన్నట్టు బోలెడు డబ్బులొచ్చేరోజు తప్పకుండా కొంటాను. సరేనా? ఇప్పుడు నా దగ్గర డబ్బుల్లేవు. ఒక్క చేత్తో ఈదుకొస్తున్నాను సంసారాన్ని."

"అయితే నేను కూడా నాటకాలాడుతా బోలెడు డబ్బులొస్తాయి" అంది యవనిక.

"నోరుమూసుకో బుద్దులు భూములేలుతుంటే అదృష్టాలు గాడిదలు కాస్తున్నాయట. హాయిగా చదువుకుని ఏ డాక్టరో, ఇంజనీరో అవవే అంటే నాటకాలాడుతుంది.. నాటకాలు" మండిపడుతూ అరిచింది పద్మిని.

బిక్కమొహం వేసిన యవనికని మండిపడుతున్న పద్మినిని చిత్రంగా చూస్తూ అడిగింది వసంత.

"అదేంటక్కా అంత కోపం ఎందుకు నీకు ఒక ఆర్టిస్టువై ఉండీ"

"మన బతుకులు చూస్తూ కూడా ఆ రొంపిలోకి పిల్లను దింపే ధైర్యం నాకు లేదు వసంతా"

వసంత సానుభూతిగా చూసింది.

"అక్కా నిన్నెప్పుడూ అడగాలనుకుంటూ మర్చిపోతున్నాను. నువ్వసలు ఈ ఫీల్డులోకి ఎలా వచ్చావు? మీ పుట్టింటివారెవరు? అసలు మీ ఊరేది?" అడిగిద్మి వసంత కుతూహలంగా.

"అదంతా ఓ పెద్ద కథ వసంతా. మా పుట్టింటివారిది చాలా మంచి కుటుంబం. నేనే పాపిష్టిదాన్ని ఒద్దన్నా వినకుండా నాటకాలంటూ ఎగేసుకుని వచ్చాను."

"అయినా నువ్వేం నష్టపోయావులే అక్కా! ప్రతినాటకంలోనూ నీకేగా ఉత్తమ నటి బహుమతులు. ఎన్ని సన్మానాలు, ఎంత గౌరవం"

"ఎందుకు వసంతా.. అవి నాలిక గీసుకోడానికి పనికిరావు ఆ పటాలు" అంది గోడలకున్న సన్మానపత్రాల పటాలు చూస్తూ "ఇంటినిండా పనికిరాని శాలువాలు. ఏం చేసుకోను? కొన్ని దీనికి పరికిణీలు కుట్టిస్తా. ఒకప్పుడు మా నాన్న అన్నాడు. నేను మొదటి నాటకం వేసి, భుజం నిండా సంస్థవాళ్ళు కప్పిన శాలువా వేసుకుని, మెడలో చిన్న ముత్యాల దండ వేసుకుని ఇంటికి వస్తే ఈ దుప్పట్లకోసమా ఆ రంగులేసుకుని వేదికలెక్కేది అంటూ. ఈ దుప్పట్ల కోసమే బంగారం లాంటి భవిష్యత్తు పాడుచేసుకున్నానన్న వేదన కలిగినప్పుడల్లా ఈ శాలువాలన్నీ విసిరి పారేయాలనిపిస్తుంది. శాలువా కప్పేవాళ్ళు ఆ డబ్బులు కవర్లో పెట్టి ఇస్తే దేనికైనా పనికి వస్తుంది కదా. ఏంటో "నిట్టూర్చింది బాధగా.

"సర్లె పద.. వంట సంగతి చూద్దాం" అంటూ వసంత లేచేటప్పటికి తను కూడా లేచింది.

"యవనీ అవి తినేశాక, పాలు తాగి హోం వర్కు చేసుకో" అంటూ యవనికని హెచ్చరించి కూరగాయలేమన్నా ఉన్నాయేమో వెతికింది.

బంగాళ దుంపలు, ఉల్లిపాయలు తప్ప ఏమీ కనిపించలేదు.

"ఇవే వేయించేద్దాం. అన్నం వండేద్దాం" అంది బంగాళాదుంప కట్ చేయడానికి తీస్తూ.

"కొంచెం పెరుగన్నా లేదుకదా. ఉల్లిపాయ పచ్చిపులుసు చేద్దామా" అంది వసంత.

"సరే" అంది పద్మిని.

ఆ తరువాత ఎవరి ఆలోచనల్లో వాళ్ళుండి వంట మౌనంగా పూర్తిచేసారు.

"ఇవాళ వాతావరణం చాలా హాయిగా, చల్లగా ఉంది. జామచెట్టు కింద కూర్చుని తిందామా అన్నాలు?" అడిగింది వసంత పెరటి గుమ్మంలో నుంచుని బైట వాతావరణం చూస్తుంది.

"దానికేం అలాగే తిందాం అని యవనీ, హోం వర్కు అయిందా" అని అడిగింది.

"ఇంకా కొంచెం ఉందమ్మా. లెక్కలు అర్థం కావడం లేదు. ట్యూషన్ చెప్పేవాళ్ళు కావాలి నాకు" అంది యవనిక.

"ట్యూషన్? ఎవరున్నారే. నాకు కూడా లెక్కల్లో పెద్దగా మార్కులెప్పుడూ రాలేదు. వానాకాలం చదువులు మావి. సరేలే రేపు మావయ్య ఎక్కడన్నా చేర్పిస్తాడులే" అంది పద్మిని.

"నా క్లాస్ మేట్ పావని వెళ్తుందమ్మా మనింటికి దగ్గరే ఆ ట్యూషన్ మాస్టారిగారిల్లు"

"ఎంత తీసుకుంటాడో ఆయన."

"అడగనా పావనిని?"

"అడిగి చూడు రేపు."

"సరే" యవనిక గొంతులో ఉత్సాహం కనిపించి నిట్టూర్చింది. ఈ పిల్లని బాగా చదివించాలంటే డబ్బు కావాలి. ఎక్కడినుంచి తేవాలి? గవర్నమెంటు స్కూల్లో తెలుగు మీడియం చదువుతోంది యవనిక. ఈ ఏడాదే ఆరు పాసై ఏడోక్లాసులోకి వచ్చింది. ఏడో తరగతి పబ్లిక్ పరీక్షలు. లెక్కలు కష్టంగానే ఉంటాయి. తెలుగు మీడియం పిల్లకాబట్టి ఇంగ్లీషుకి కూడా ట్యూషన్ ఉంటే మంచిదే కానీ, మళ్ళీ ట్యూషనంటే నెలకి కనీసం రెండొందలన్నా కావాలి. నెలకి ఒకప్పుడు ఎంత లేదన్నా పది నాటకాలాడేవాళ్ళు. నాటకం ఎక్కడా లేదు. పరిషత్తు నాటకాలు కూడా చాలా పోటీ వచ్చింది ఈసారి. గత మాసంలో రెండు పరిషత్తులకి వెళ్ళొచ్చింది. ఆరువేలు వచ్చాయి. రానూ, పోనూ చార్జీలు వాళ్ళు పెట్టుకుని, తిండి కూడా వాళ్ళే ఏర్పాటు చేసారు కాబట్టి. ఈ నెల ఎలాగో, ఏం చేయాలో పంతానికి పోయి ఒక సంస్థ అయితే పెట్టింది. ఇప్పుడా సంస్థ గురించి నలుగురికీ తెలిసేదాకా ఊరికే బోర్డు పెట్టుకోడమే తెలియాలంటే ఏదన్నా ఫంక్షన్ చేయాలి. ఫంక్షన్ చేయడం అంటే మాటలా? ఎవరినన్నా పట్టుకుని బతిమాలి స్పాన్సర్ షిప్ సంపాదించుకుంటే రెండో, మూడో నాటకాలాడితే కొద్దిగా ప్రచారం వస్తుంది. ఏం చేయాలన్నా కావాల్సింది. డబ్బు. డబ్బు.

ఈ ప్రపంచాన్ని డబ్బు శాసిస్తోంది.

రోజు, రోజుకీ పెరుగుతున్న నిత్యావసర ధరలు, ఆకాశాన్నంటుతున్న బస్సు ఛార్జీలు, ఎలా ఈ బతుకుబండి నెట్టుకురావాలో మహారాజు వదిలేసి చేతులు దులుపుకున్నాడు. పిల్లని ఆయనికి అప్పచెప్పి దాని బాగోగులు చూసుకోమంటే సరి, కానీ అది లేకుండా తను బతకగలదా. తనకున్న ఒకే ఒక్క తోడూ, నీడా, అదే తన ప్రాణం. దానికోసమేగా తనింత కష్టపడుతోంది. దాన్ని వాళ్ళ నాన్న దగ్గరకి పంపించి తను బతికి ఏం చేయాలి? ఎవరికోసం బతకాలి?

"ఏంటక్కా ఆలోచిస్తున్నావు?" అంటూ వచ్చిన వసంత వైపు చూసి అంది. "నీ స్నేహితురాలెవరో చిన్న, చిన్న కథలు రాస్తుంటుంది అన్నావు కదా. మనకి ఇద్దరాడవాళ్ళతో ఒక గంట నాటిక రాసిస్తుందేమో అడుగుతావా? ప్రదర్శన రోజా శాలువ కప్పి సన్మానిద్దాం. అంతకన్నా మనం ఏం చేయలేం కదా"

వసంతకి నవ్వొచ్చింది. ఇంతకు ముందేకదా అంది శాలువా బదులు ఆ డబ్బులిస్తే దేనికైనా పనికి వస్తాయని మళ్ళీ ఇప్పుడు తను కూడా శాలువా కప్పుతానంటోంది.

"ఏంటే నవ్వుతున్నావు" అడిగింది పద్మిని.

"నీ మాటలు గుర్తొచ్చాయక్కా. శాలువా కప్పుతానంటే"

"అదా ఏం చేయను? నా దగ్గర ఉన్నాయి కదా. అందుకే కప్పుతానన్నాను. లేకుంటే అది కొనడానికి కూడా నా దగ్గర డబ్బుల్లేవు"

"అందరూ అంతే మనకి శాలువాలు కప్పేవాళ్ళంతా కొంటారనుకుంటున్నావా? వాళ్ళకెవరో కప్పినవే మనకి కప్పుతారు."

"అదీ నిజమేలే"

"అయినా అడుగుతాలే. ఆవిడకి డబ్బు పెద్దగా అవసరం లేదు. వాళ్ళాయనకి మంచి ఉద్యోగం ఉంది. ఏదో సరదాకి రాస్తూ ఉంటుంది పెద్ద రచయిత్రేం కాదు"

"అలాంటి వాళ్ళే నయం మనల్ని డబ్బడగరు. పేరొస్తే చాలనుకుంటారు."

"సరే రేపే అడుగుతాలే. అన్నాలు తిందామా ఆకలేస్తోంది."

"అలాగే దాని హోం వర్కు అయిపోతే తినేద్దాం."

"అయిపోయిందమ్మా" పుస్తకాలన్ని సర్దుతూ అంది యవనిక.

"సరే రా మరి" అంటూ మూడు స్టీలు ప్లేట్లలో అన్నం పెట్టి బంగాళదుంప వేపుడు వేసింది. వసంత మంచినీళ్ళ గ్లాసులు పట్టుకుంది. యవనికను పచ్చిపులుసు గిన్నె పట్టుకోమని ముగ్గురూ జామచెట్టు కిందకి చేరారు.

**అదొక కమ్యూనిటీ హాలు.** పూర్తిగా పాతబడి ఉంది. పడిపోతున్నట్టున్న కాంపౌండ్‌వాలు, లోపల ఖాళీ స్థలం అంతా చెత్తా చెదారంతో నిండి చాలాకాలంగా అక్కడ ఎవరూ శుభ్రం చేస్తున్న సూచనలు ఎక్కడా కనిపించడంలేదు. రంగులు వెలిసి, ఎప్పటినుంచో నిర్లక్ష్యానికి గురైనట్టు పెచ్చులూడిపోయిన గోడలతో ఏ క్షణమైనా పడిపోవచ్చనిపిస్తోంది. లోపల ఒకటే పెద్ద హాలు, ఆ హాలు దాటి వెళితే ఖాళీస్థలం. ఆ ఖాళీ స్థలంలో రేకులు కప్పిన రెండు బాత్‌రూములు, రెండు లావెట్రీలు, గచ్చంతా పాచితో నిండి ఏ మాత్రం జాగ్రత్తగా లేకపోయినా జారిపడేట్టు ఉన్నాయి. ఆ ఖాళీస్థలం దాటాక ఒక నడవా, నడవాకి రెండు పక్కలా రెండు గదులు. వాటిలో ఒకటి పెద్ద పెద్ద వంటలు చేసుకోడానికి వీలుగా పెద్ద పొయ్యిలు, రెండో, మూడో షెల్ఫులతో ఉంది. గోడలన్నీ మసిబారి ఛండాలంగా ఉన్నాయి. బల్లులు స్వైరవిహారం చేస్తున్నాయి.

ఒకప్పుడు ఆ ఊళ్ళో మధ్య తరగతి కుటుంబాల్లో జరిగే పెళ్ళిళ్ళకు చౌకగా అందరికీ అందుబాటులో ఉన్న ఒకే ఒక్క కమ్యూనిటీ హాలది. అక్కడ చాలామంది పెళ్ళిళ్ళయ్యాయి. అక్కడ పెళ్ళి చేసుకున్న వాళ్ళంతా ఎంతో సంతోషంగా, పిల్లా పాపలతో కళకళ్ళాడుతున్నారనే సెంటిమెంటూ ఉంది. కానీ పరిస్థితులు మారి కళ్యాణమంటపాలు కూడా వ్యాపారానికి అనువుగా మారడంతో కొందరి చొరవ వల్ల నాలుగు కళ్యాణమంటపాలు, వాటిలో అనేక రకాల సౌకర్యాలు రావడం, మనుషుల జీవన విధానంలో కూడా మార్పు రావడం వలన లగ్జరీకి అలవాటు పడిన వాళ్ళంతా పాతకాలం కమ్యూనిటీ హాలుని వదిలేసి కల్యాణ మంటపాల మీద పడడంతో ఆదాయం తగ్గిపోయి, మెయిన్‌టెనెన్సు చేయలేక చేతులెత్తేసారు కమిటీ వాళ్ళు.

ఆ ఊళ్ళో మొత్తం నాలుగు నాటక సమాజాలున్నాయి. కళాంజలి, కళాపూర్ణ, కాళిదాసు నాటక సంస్థ, డియర్ ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్. వీటిలో కళాపూర్ణ నాటక సంస్థకి మూలస్థంభం రచయిత చక్రధరం. ఆ ఊళ్ళో అతనికి మంచి పరపతి ఉంది. ప్రతి ఏటా ఆంధ్రదేశంలో జరిగే అనేక పరిషత్తుల్లో నాటకాలు ఆడుతూ బహుమతులందుకుంటూ, అటు అడపా, దడపా పత్రికల్లో కథలు అచ్చవుతూ రచయితగా పేరు పొందిన చక్రధరం అంటే ఆ ఊళ్ళో వాళ్ళకి మహా అభిమానం. అందులోనూ ఇటీవల అతని నాటకం ఒకటి సినిమా వాళ్ళు వచ్చినపుడు ప్రదర్శింపబడడం, ఆ నాటకం సినిమావాళ్ళు చూసి మెచ్చుకుని, దానిమీద హక్కులు తీసుకుని అతనికి ఓ పదివేలు ఇవ్వడం అతడిని ఆ ఊళ్ళో హీరోని చేశాయి. ఆ పరపతి ఉపయోగించి చిన్న, చిన్న పరిశ్రమలవారి దగ్గరనుంచి ప్రతి

నాటకానికీ స్పాన్సర్‌షిప్ సంపాదించుకోడం అతనికి తెలిసిన గొప్ప విద్య. అలా ప్రదర్శింపబడే నాటకాల రిహార్సల్స్ కోసం రూపాయి కూడా అద్దె కట్టక్కర్లేని ఈ పాత కమ్యూనిటీ హాలు యధేచ్ఛగా ఉపయోగించుకుంటాడు. కమ్యూనిటీ హాలు కాంపౌండ్ వాల్ నానుకుని టీ బండివాడు, పచ్చి మిరపకాయ బజ్జీల వాడు ఉండడంతో రిహార్సల్స్‌కి వచ్చిన వాళ్ళకి ఉదయం నుంచీ అరగదీసి అరకప్పు టీ, ఓ బజ్జీ ఇప్పించి అదే మహాప్రసాదంగా భావించమంటాడు.

అతనికి వరసకి బంధువు, మిత్రుడు హరికృష్ణ, మరో చిన్ననాటి మిత్రుడు శంకరం, ప్రభాకరం అతనికి చాలా సన్నిహితులు. అదృష్టం బాగుండి చక్రధరం అందగాడు కాదుగానీ, అంతో, ఇంతో పర్సనాలిటీ ఉండి ఉంటే రచన, దర్శకత్వం, సమర్పణలతో పాటు కథానాయకుడిగా కూడా అతనే వేసేవాడు. కాకపోతే చక్రధరం ఐదడుగుల, రెండు అంగుళాలు మాత్రం ఉంటాడు. బలంగా ఉంటాడు. మొహం మొత్తం స్ఫోటకం మచ్చలతో ఉంటుంది. ప్రతిపదినిమిషాలకూ సిగరెట్ కాల్చడం వల్ల అతని పక్కనుంచి వెళ్ళినా కంపు కొట్టేస్తుంటుంది. అందుకే సాధారణంగా లేడీ ఆర్టిస్టులెవరూ అతని సమక్షంలో రిహార్సల్స్‌కి రావడానికి ఆసక్తి చూపించరు. దానికి తోడు అపరిశుభ్రంగా ఉండే కమ్యూనిటీ హాలు కూడా వాళ్ళకి నరకంలా అనిపిస్తుంది. అక్కడ తప్ప అతను మరెక్కడా రిహార్సల్స్ పెట్టకపోవడం అతని మీద మరీ కోపం కలగచేస్తుంటుంది. పద్మిని, వసంత.. కాక సుందరి, కళావతి అనే మరిద్దరు ఆర్టిస్టులు కూడా అతని సంస్థలోనే చేస్తారు.

ఉన్నవాళ్ళలో పద్మిని చక్కనిది. అందమైన రూపం, మంచి స్వరం ఆమెకి ఆభరణాలు. నలభైకి దగ్గరవుతున్నా ఆమెలో లావణ్యం తగ్గకపోవడంతో ఇంకా ఆమే కథానాయకగా వేస్తోంది. ఎక్కడ మంచి నాటక ప్రదర్శన ఉన్నా అందులో ప్రధాన స్త్రీ పాత్రకి అన్ని సంస్థలవాళ్ళు ఈమెనే పిలుస్తుండేవాళ్ళు. రెండేళ్ళ క్రితం చక్రధరం సంస్థలో ప్రమీలార్జునీయం నాటకం ద్వారా ప్రవేశించింది. అప్పటినుంచీ వేరే సంస్థలో వేయడంలేదు. కారణం వరసగా ప్రతినెలా అతని నాటకాలు ఎక్కడోక్కడ ప్రదర్శింపబడడం వలన నెలకింత అని ఖచ్చితంగా ఆదాయం ఉండడం.

వసంత పద్మినికన్నా చిన్నదే అయినా ఆమె వాచికం అంతగా బాగోకపోవడంతో ఆమెకి కథానాయిక పాత్రలకన్నా ప్రతినాయక పాత్రలే బాగా నప్పుతాయని అవే ఇస్తుంటాడు. కళావతి ప్రతి నాటకంలో పర్మనెంటు తల్లి. సుందరిలో అందమూ లేదు, నటనాలేదు. కేవలం దిక్కులేనిది, పైగా చక్రధరం మేనత్త రికమండేషన్ అవడంతో ఆమెకోసం ఓ పక్కింటి ఇల్లాలి పాత్ర సృష్టించి పాతికో పరకో ఇస్తుంటాడు చక్రధరం. పద్మిని కథానాయిక పాత్ర వేస్తే ఆ నాటకం సక్సెస్ అవుతుందన్నది అందరి నమ్మకం.

తనకి కాక మరో సంస్థ వాళ్ళెవరన్నా ఎక్కువ బహుమతులు పొందారంటే సహించలేని చక్రధరం అందుకు కారణం కళాకారులే అని నిర్ణయించేసి వాళ్ళని అవమానిస్తూ ఉంటాడు. అది కొందరికి బాధాకరంగా పరిణమించింది.

ఇటీవల తిరుపతిలో ప్రదర్శించిన సాంఘిక నాటకం ప్రదర్శనా పరంగా మూడో బహుమతి పొందడం, పద్మిని ఉత్తమ నటిగా బహుమతి పొందడం, ఉత్తమ రచనగా బహుమతి, ఉత్తమ రచనగా ఎన్నిక కాకపోవడంతో అహాన్ని దెబ్బతీసింది. చిందులేసాడు మొత్తం సభ్యులందరి మీదా విరుచుకుపడ్డాడు.

"మీరెవరూ సరిగా రిహార్సల్స్ చెయ్యలేదు. మీ అందరికీ కాఫీలకి, స్నాక్స్‌కీ డబ్బులు తగలేయడానికా నేను నాటకాలాడేది? " అంటూ అవమానకరంగా మాట్లాడ్డమేకాక, "ఈవిడేం గొప్పగా నటించిందని ఉత్తమ నటిగా ఎన్నికయింది. అయినా ప్రతిసారీ ఈవిడే ఉత్తమ నటిగా రావడం చాలా చిత్రంగానే ఉంది. విశాఖపట్నం సరళకన్నా మంచి నటా ఈవిడ? రాజమండ్రి పావనికన్నా గొప్పనటా?" అంటూ ఇతర కళాకారిణులతో పోలుస్తూ "ఈవిడ ఆ జడ్జీలకి ఏం ఎర చూపించిందో? " అంటూ పద్మిని గురించి అసహ్యంగా మాట్లాడడం ఆమె నోటీస్‌కి వచ్చింది. దాంతో అవమానంతో పద్మిని కుంచించుకుపోయింది. అతని కోపానికి మరో కారణంఉందని

కూడా ఆమెకి తెలుసు. ఆమెకి నెమ్మదిగా అర్థం అవుతోంది ఇతను తననిలాగే అవమానిస్తుంటాడు అని. అతను తీసేసేలోపు తనే అతని నుంచి విడిపోతే? ఆ నిర్ణయమే యవనిక మహిళా కళాకారుల వేదిక ఆవిర్భావానికి నాంది పలికింది.

ఇప్పుడీ విషయం చక్రధరంతో సహా మిగతా సభ్యులందరికీ తెలిసింది.

"ఔరా ఎంత ధైర్యం ఆవిడకి. ఒక సంస్థ నిర్వహించే శక్తి ఆమెకెక్కడిది? ఏ పూటకాపూట తిండికి వెతుక్కునే ఆమె ఓ సంస్థ నిర్వహిస్తు, ఆడవాళ్ళతో నాటకాలాడగలదా" అంటూ చర్చించుకుంటుంటే అది విన్న చక్రధరం అహం దెబ్బతిన్నది.

ఆ రోజే విజయవాడలో జరిగే పరిషత్తుకి ఒక మంచి స్క్రిప్టు రెడీ చేసుకుని సభ్యులకి చదివి వినిపించడానికి వచ్చాడు. అందులో కథానాయిక పాత్ర చుట్టూనే కథంతా తిరుగుతుంది. ఉమెన్ ఓరియంటెడ్ సబ్జెక్ట్‌కి ఈ మధ్య ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిసింది అతనికి.

అందుకే కథానాయికకి ప్రాధాన్యం ఉన్న నాటకం తయారుచేశాడు. ఆ పాత్రకి పద్మిని తప్ప దీటైన ఆర్టిస్టు ఎవరూ లేరని అతనికి తెలుసు. సరిగ్గా అప్పుడే అతనికి పద్మిని తనది అనే సంస్థ పెట్టుకుందన్న విషయం తెలిసింది.

శివరామ్ వైపు చూస్తూ అడిగాడు "సంస్థ రిజిస్టర్ అయిందా?"

"ఆ.. అయింది. వారం క్రితం బోర్డు కూడా రాయించి ఇంటిముందు పెట్టుకుంది" అన్నాడు శివరామ్. ఈ విషయం తెలిస్తే చక్రధరం గోల చేస్తాడని తెలుసు అతనికి. పద్మినికి ఆ సంస్థలో ఎంత ప్రాధాన్యత ఉందో తెలుసు కాబట్టి ఆమె అలిగి మరో సంస్థ పెట్టుకుందని, అదికూడా స్వంతంగా అని తెలిస్తే అతనిలో కలిగే రియాక్షన్ అతనూహించాడు. అలాంటి రియాక్షన్‌తో పాటు అతని ప్రవర్తనలో కొంత మార్పు రావచ్చని శివరామ్ ఊహించాడు. కానీ, ఆ వార్త తెలియగానే చక్రధరం కళ్ళల్లో నిప్పులు కురిశాయి. అతనినలా చూడగానే శివరామ్‌కి కొంచెం భయం వేసింది. అయ్యో! అనవసరంగా చెప్పానా అనుకున్నాడు.

చక్రధరం చేతిలో ఉన్న సిగిరెట్టు ఆఖరి దమ్ము పీల్చి విసిరిపారేస్తూ కోపంగా అన్నాడు.

"ఆవిడకంత ధైర్యం ఎలా వచ్చింది? ఏం చూసుకుని అంత పొగరు? కూటికోసం వేషం కట్టేవాళ్ళక్కూడా అంత పొగరా?"

శివరామ్‌కి అతనలా మాట్లాడుతుంటే ఒళ్ళు మండిపోయింది. కానీ తనని తాను తమాయించుకుంటూ అన్నాడు. "ఇందులో పొగరేం ఉంది లెండి మాష్టారూ! ఆవిడకెప్పటినుంచో ఆడవాళ్ళతో నాటకాలు వేయించాలని ఉందిట. అందుకోసం ఓ బ్యానర్ కావాలికదా ఏర్పాటు చేసుకుంది. అందువలన మనకొచ్చిన నష్టం ఏముంది?"

"నష్టం మనకెప్పటికీ ఉండదు. ఏదన్నా నష్టం, కష్టం ఉంటే ఆవిడకే. నవంబరులో విజయవాడలో జరిగే పరిషత్తుకి నేను బ్రహ్మాండమైన నాటకం రాశాను. ఖచ్చితంగా మనకే మొదటి బహుమతి వస్తుంది. అందులో స్త్రీపాత్ర ఎంతో ఉదాత్తమైన పాత్ర. ఉత్తమనటిగా బహుమతి అందుకోడానికి అవకాశం ఉన్న పాత్ర. ఆ పాత్రకి మరో ఆర్టిస్టుని బుక్ చేస్తాను"

"నవంబరు అంటే వచ్చేనెలేగా ఇప్పటికిప్పుడూ మీకు మరో ఆర్టిస్టు కావాలంటే మీరు బాగా ట్రైనింగ్ ఇవ్వాలి. అంత రిస్కు తీసుకోడం ఎందుకులెండి?" అన్నాడు శివరామ్.

"అయితే ఏం చేయను? ఆవిడ కాళ్ళమీద పడి నువ్వు తప్ప నాకు వేరే దిక్కులేదు నన్ను క్షమించి నా నాటకంలో నటించి నన్ను తరింపచేయి అని బతిమాలనా?" వెటకారంగా అన్నాడు.

"అంతమాట ఎందుకులెండి. సంస్థలో చిన్న, చిన్న కలతలు, మాట వట్టింపులు మామూలే. ఈజీగా తీసుకోండి"

" తీసుకుని ఏం చేయను? నువ్వే నా దిక్కని కాళ్ళావేళ్ళా పడమంటావా?"

"అంటే ఇంక ఆవిడకి ఈ బ్యానర్‌లో ప్రవేశం లేదా?"

"లేదు. నాకు పోటీగా ఆవిడ విడిగా సంస్థ పెట్టుకున్నాక నాకావిడతో ఏం పని?"

"అలా అనకండి. ఆవిడలాంటి సీనియర్ నటిని కాదని కొత్తవాళ్ళని పెట్టుకుంటే మన నాటకం పాడయే ప్రమాదం ఉంది. ఎన్నో ఏళ్ళ నుంచీ మన సంస్థ ద్వారా ప్రదర్శించే నాటకాలన్నిటిలో ఆవిడే కదా కథానాయిక."

"ఆవిడ ఇంక కథానాయికగా పనికి రాదు. ఎప్పటినుంచో అనుకుంటున్నాను. చిన్నపిల్లల్ని తీసుకోవాలని."

"మనం అనుకుంటే సరా. నాటకాల్లో నటించడానికి ఎవరొస్తారు? ఈ మధ్య చాలా మందికి టీ.వీ సీరియల్స్‌లో బోలెడు అవకాశాలు వస్తున్నాయని అందరూ టీ.వి వైపు వెళ్తున్నారు. హైదరాబాదులో నాటకం వేయించాలంటే పెద్ద తలనొప్పిగా ఉందట.

ఒక్కళ్ళు కూడా రిహార్సల్స్‌కి రమ్మంటే రాకుండా టీ.వి అవకాశాల కోసం స్టూడియోల చుట్టూ తిరుగుతున్నారట. కొంచెం ఫోటోజెనిక్ ఫేస్ ఉంటే చాలు. డైలాగులు చెప్పడం రాకపోయినా, హావభావాలు లేకపోయినా సెలక్ట్ అయిపోయేవాళ్ళు అయిపోతున్నారు కూడా.

అయినా రంగస్థల కళాకారిణులకి వయసుతో పనేం ఉంది. మంచి నటీమణులు కావాలి. మంచి వాచికం, మంచి హావభావాలు ఆవిడంత గొప్పగా నటించే వాళ్ళెవరున్నారు?" శివరామ్ నచ్చచెపుతున్నట్టుగా అన్నాడు. "మాష్టారూ! నిజం చెప్పాలంటే మనవాళ్ళెవరో ఆవిడ మనసుని గాయపరిచారనిపిస్తోంది నాకు. లేకపోతే నాకు. లేకపోతే అంత హఠాత్తుగా ఆవిడా సంస్థ ఎందుకు పెట్టుకుంటుంది?"

చక్రధరం కొంచె చికాగ్గా చూశాడతనివైపు. "నాకర్థం కాక అడుగుతాను. నువ్వెందుకింతగా సపోర్టు చేస్తున్నావావిడని. నీకూ ఆవిడకీ ఏమన్నా?!"

శివరామ్ మొహం కోపంతో జేవురించింది. ఛీ ఇంత కుసంస్కారి ఇతను రచయితనా? రచయిత అంటే ఎంతో ఆదర్శభావాలున్నవాడు అయి ఉండాలి. ఆడవాళ్ళంటే గౌరవంలేదు. తోటి కళాకారులను ఆదరించి, అభిమానించే సహృదయతలేదు. మంచి మనసులేదు. ఇతను రచయితా!?.

"ఇంకోసారి ఆవిడని వెనకేసుకువస్తే నీక్కూడా నా సంస్థలో చోటుండదు గుర్తుంచుకో" హెచ్చరిస్తున్నట్లుగా అంటూ జేబులోంచి సిగరెట్ ప్యాకెట్ తీసి అందులోంచి మరో సిగరెట్ తీసుకుని తిరిగి జేబులోకి ప్యాకెట్ తోసేసి సిగరెట్ నోట్లో పెట్టుకుని, అగ్గిపెట్టె తీసుకున్నాడు. పుల్ల తీసి, సిగరెట్ వెలిగించుకుంటూ అన్నాడు. "నాతో పెట్టుకుంటే ఎవరైనా సరే నా దృష్టిలో ఈ సిగరెట్‌తో సమానం" అంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

శివరామ్ గుండె కుత, కుత ఉడికిపోయినట్టు అయింది.

ఇతనిలాంటివాడు కాబట్టే పద్మిని మనసంత కష్టపెట్టుకుంది. ఆత్మాభిమానం ఉన్న ఏ ఆడదీ ఆ మాటకొస్తే ఏ మగాడూ కూడా ఇతని సంస్థలో పనిచేయరు. పద్మిని మంచిపని చేసింది అనుకుంటూ అక్కడినుంచి వెళ్ళిపోయాడూ. అతని వెనకే వస్తూ అడిగాడు శంకరం.

"ఏంటి శివా! ఏం జరిగింది? పద్మినికి, చక్రధరానికి గొడవేమన్నా అయిందా?"

శివరామ్ వెనక్కి తిరిగి శంకరాన్ని చూసి తిరిగి మొహం తిప్పుకున్నాడు.

శంకరం మరో రెండు అడుగులు వేసి, అతని పక్కకి చేరి అన్నాడు. "చెప్పవయ్యా బాబు... ఏం జరిగింది? మన సంస్థలోంచి పద్మినిని తీసేయడం ఏంటి? నాకేం అర్థం కావడంలేదు చెప్పచ్చుకదా."

"నీకు తెలీకుండానే ఉంటుందా ఇంతసేపూ. ఆ చక్రధరానికి మీరంతా కావాల్సినవాళ్ళు కదా "వ్యంగ్యంగా అన్నాడు శివరామ్.

"కావాల్సిన వాళ్ళమో, కాదో తరువాత చెప్తాలే ఇంతకీ ఏంటి విషయం? ఆగు కాస్త అట్లా వెళ్ళిపోతావేం? రా టీ తాగుదాం." అంటూ శివరామ్ వైపు చూస్తూ.

"చెప్పడానికేం లేదులే. పద్మిని కళాకారుల వేదిక అంటూ ఓ సంస్థ పెట్టింది. అది ఈయనగారి కోపం."

"అదా సంగతి!" గట్టిగా నవ్వాడు.

"అయ్యా ఇదిగోండి టీ. ఏటి ఇయాల రిహార్సలు లేదా ఎల్లిపోతున్నారు?" అడిగాడు టీ బండి సూరి.

అతని చేతిలోంచి రెండు గాజుగ్లాసులు అందుకుని శివరామ్‌కోటిస్తూ. "వెళ్ళిపోతున్నాం అని ఎవరన్నారు? నీ టీ తాగడానికి బైటకి వచ్చాం" అన్నాడు.

"నాకో యాసం ఇయ్యండి బాబూ.. ఏత్తాను" అన్నాడు సూరి.

"అలాగే ఆడవేషం ఇద్దామనుకుంటున్నాం. రెడీగా ఉండు" నవ్వి టీ సిప్ చేశాడు.

శివరామ్ టీ తాగుతూ అన్నాడు "పాపం ఆడపిల్ల నానా కష్టాలుపడి, కడుపున పుట్టిన పిల్లను చదివించుకోడం కోసం ఈ రంగం నమ్ముకుని బతుకుతోంది. ఆవిడ మీద ఈయనకి అంత కోపం ఎందుకో నాకర్థం కావడంలేదు. ఈ మధ్య బాగా అవమానిస్తున్నాట్ట."

శంకరం కుడిచేత్తో టీ కప్పు పట్టుకుని ఎడం చేయి శివరామ్ భుజమ్మీద వేసి అతడిని కొంచెం పక్కకి తీసుకుని వెళ్ళి రహస్యంగా అన్నాడు "నీకోసంగతి తెలుసా?"

ఏంటన్నట్టు చూశాడు శివరామ్.

"ఆ మధ్య విజయనగరంలో పరిషత్తుకి వెళ్ళాం గుర్తుందా?"

"గుర్తులేకేం"

"ఆ రోజు ఈ రైటర్‌గారు పద్మిని రూముకి వెళ్ళి అసభ్యంగా ప్రవర్తించాడుట. ఆవిడ మీరంటే నాకు చాలా గౌరవం. ఇలా ప్రవర్తించి నా దృష్టిలో చులకన కాకండి అంటూ మెత్త, మెత్తగా చివాట్లు పెట్టిందట. ఆ కోపం మనసులో పెట్టుకుని అప్పటి నుంచీ ఇలా తయారయాడని వినికిడి."

"అలాగా!" ఆశ్చర్యంగా చూశాడు శివరామ్. "నాతో ఆ విషయం చెప్పలేదే పద్మిని."

"అంటే నీకు ప్రతి విషయం చెబుతుందా?" అనుమానంగా చూశాడు శంకరం.

శివరామ్ తొణక్కుండా అన్నాడు "చెబుతుంది. ఆ అమ్మాయి నాకు ఎప్పటినుంచో తెలుసు. నన్ను తోబుట్టువులా భావిస్తుంది. అలాంటిది ఈ విషయం ఎందుకు చెప్పలేదో అర్థం కావటంలేదు. అవమానిస్తున్నాడని అందేకానీ, ఈ కారణంగా అవమానిస్తున్నాడని మాత్రం చెప్పలేదు."

"ఎలా చెబుతుందిలే శివా. ఆడపిల్లలు ఎవరో తన మీద అత్యాచారం జరపబోయాడని ఎలా చెబుతారు? సొంత అన్నకే చెప్పరు. నీకెలా చెబుతుంది. కానీ ఈమాట మాత్రం నిజం. ఎందుకంటే పద్మిని మీద చక్రధరానికి మనసుందని నాకు తెలుసు. ఇంతకు ముందు అతని సమాజంలో కథానాయికల పాత్రలేసిన కవిత అనే అమ్మాయితో ఇతనికి సంబంధాలుండేవి. ఆవిడకి సినిమాల్లో జూనియర్ ఆర్టిస్టుగా చాలా అవకాశాలు రావడంతో ఇతని దగ్గర్నించి వెళ్ళిపోయి ఇండస్ట్రీలో తిరుగుతోంది వేషాలకోసం అని విన్నాను."

"ఈ అందగాడు ఉమనైజరా?" ఎగతాళిగా అన్నాడు శివరామ్.

"బాగా..! వాడికి లేని వ్యసనం లేదులే. ఈ మధ్య పెళ్ళాం కూడా వదిలేసి పుట్టింటికి వెళ్ళిపోయిందని టాక్."

శంకరం చెప్పేది ఎంతవరకు నిజమో అర్థంకాని శివరామ్ ఆలోచిస్తూ నిలబడిపోయాడు. ఒకవేళ నిజమైతే పద్మిని తనతో ఎందుకు చెప్పలేదు? చెపితే గొడవ అవుతుందనా? ఎందుకు దాచింది? తను అల్లరయిపోతుందనే భయమా? శివరామ్‌కి మనసంతా గందరగోళంగా అనిపించింది.

ఇంతలో మిగతా సభ్యులు రావడంతో రిహార్సల్స్‌కి పిలుపొచ్చి లోపలికి వెళ్ళిపోయారిద్దరూ.

"అక్కా ఎక్కడున్నావు?" బైటకి వెళ్ళిన వసంత గట్టిగా పిలుస్తూ లోపలికి వచ్చింది.

పెరట్లో బట్టలు జాడిస్తున్న పద్మిని పలకలేదు. వసంత తనతో కూడా వచ్చిన అమ్మాయిని "ఇక్కడ కూర్చోండి నేను అక్కని పిల్చుకొస్తాను" అంటూ మంచం చూపించి తను పెరటివైపు వెళ్ళింది.

చీర అడ్డకుచ్చిళ్ళు పెట్టి నీళ్ళల్లో జాడిస్తున్న పద్మిని, వసంత తన పక్కనే నిలబడడంతో తలెత్తి చూసింది.

"నేను ఉతికేసేదాన్నికదా ఎందుకు శ్రమ పడుతున్నావు?" నొచ్చుకుంటూ ఆమె చేతిలో చీర అందుకుంది వసంత.

"ఏం ఉందిలే వసంతా.. ఎవరు ఉతికితే ఏం? పని అయిపోవడం ముఖ్యం. సర్లే ఎక్కడికి వెళ్ళొచ్చావు?"

"ఆవిడ్ని తీసుకొచ్చానక్కా" గట్టిగా పిండిన చీర కుచ్చిళ్ళు పెట్టి దులిపి ఆరేస్తూ అంది.

"ఎవరావిడ?"

"అదే మనం మాట్లాడుకున్నాం కదా రైటర్ ఒకావిడ."

"ఓ... ఆవిడ వచ్చిందా?" పద్మిని మొహంలో చిన్న సంతోషం వెలిగింది.

"ఊ.. కూర్చోబెట్టి వచ్చాను."

"అయ్యో అవునా! సర్లే పద మాట్లాడదాం. మిగతావి తరవాత చేసుకోవచ్చు." తడి చేతులు చీరచెంగుకి తుడుచుకుంటూ లోపలికి నడుస్తున్న పద్మిని వెనకాల తనూ నడిచింది వసంత.

లోపలికి వెళ్ళగానే "ఆవిడతో  మాట్లాడుతుండు.. నేను టీ చేసుకుని తెస్తాను" అని నెమ్మదిగా చెప్పి స్టవ్ దగ్గరకి వెళ్ళింది వసంత.

మంచం మీద కూర్చున్న యువతిని చూసి చిరునవ్వుతో పలకరించింది పద్మిని "బాగున్నారా?" అంటూ.

ఆ యువతి నవ్వుతూ "బాగున్నాను. మీరేనా వసంతగారి అక్కగారు" అంది.

"అవునండి. మంచినీళ్ళు తాగుతారా?" అడిగింది పద్మిని.

"ఒద్దండి మీరేదో మాట్లాడాలన్నారని చెప్పారు వసంతగారు. మీ నాటకాలు నేను కొన్ని చూశాను. మీరు చాలా బాగా చేస్తారు. ఓ నాటకంలో మీ నటనకి నేను ఏడ్చేస్తాను."

"చాలా సంతోషమండి. మీలాంటి వాళ్ళు నాటకాలు చూడడం అంటే మాకు అంతకన్నా ఏం కావాలి?" మనస్ఫూర్తిగా అంది పద్మిని.

"నాకు చాలా ఇష్టమండి నాటకాలు. మావారికి పెద్ద ఇంట్రస్ట్ లేదు. అందుకే చాలా తక్కువ చూశాను. మా చెల్లెలు తోడు వస్తానంటే వెళ్తాను." అని నవ్వింది.

"మీ పేరు?" అడిగింది పద్మిని.

"అయ్యో నా పేరు చెప్పలేదా మీకు.. సరోజ."

"మీరు కథలు రాస్తారని చెప్పింది మా వసంత."

అప్పుడే వసంత టీ కప్పుల్తో వచ్చింది. "తీసుకోండి.." అంటూ వసంత సరోజకి టీ కప్పు అందించి పద్మినికి కూడా ఇవ్వబోతుంటే "నాకొద్దు. నువ్వు తాగు" అంది పద్మిని.

వసంత టీ తీసుకుని తనుకూడా పద్మిని పక్కనే కూర్చుంది.

పద్మిని కొంచెం సేపు మౌనంగా సరోజని చూస్తూ ఉండిపోయింది ఆమె టీ తాగుతుంటే. సన్నగా, పొడుగ్గా ఉంది. ఛామనచాయ. చిన్న జడ, చిన్న కళ్ళు గోధుమ రంగు మీద నల్లటి చుక్కలున్న కాటన్ చీర కట్టుకుంది. పద్ధతిగా, అందంగా చీర కట్టుకున్న విధానం బాగా నచ్చింది పద్మినికి.

సరోజ టీ తాగడం ముగించి ఖాళీ కప్పు పట్టుకుని ఎక్కడ పెట్టాలా అన్నట్టు చుట్టూ చూస్తుంటే "ఇలా ఇవ్వండి" అంటూ ఆమె చేతిలో కప్పు అందుకుని సింక్ దగ్గరకు వెళ్ళిపోయింది వసంత.

"మీరు నాటకాలు కూడా రాస్తారా?" అడిగింది పద్మిని సరోజని.

"లేదండి. సరదాకి అప్పుడప్పుడు కథలు, కవితలు రాస్తుంటాను. రెండు కథలు ఈ మధ్యే అచ్చయాయి." కొంచెం సిగ్గుపడుతూ చెప్పింది సరోజ.

"అలాగా. ఎందులో వచ్చాయో. నేను వీక్లీకు కొనను. నాకోసారి ఇవ్వండి చదివిస్తాను" అంది పద్మిని.

"అలాగే" అంటూ నవ్వింది సరోజ.

"మాకు ఓ నాటకం రాసివ్వగలుగుతారా?" విషయంలోకి వస్తూ అడిగింది పద్మిని.

"నేనెప్పుడూ రాయలేదు. దానికేం ఉంది ప్రయత్నిస్తాను. సబ్జెక్ట్ ఏం కావాలి?" అడిగింది సరోజ.

"ఏం ఉంటుందండి? అత్తా, కోడలు, గొడవలు, భార్యాభర్తలు గొడవలు, ఫ్యామిలీ సెంటిమెంట్ ఉన్న నాటకాలే ఎక్కువగా ఆడతారు. జడ్జీలు కూడా అవే ఇష్టపడతారు. మీరు పౌరాణికం, చారిత్రాత్మకం రాయలేరు కదా"

"రాయలేను."

"అలాంటప్పుడు సాంఘికాలే కావాలి. ఒక గంట నాటిక రాసివ్వండి. మా మహిళా కళాకారులచేత ఆడిస్తాము. మేము ఒక సంస్థ పెట్టుకున్నాము అది ప్రారంభోత్సవ సభ చేయాలి. ఆ సభలో ఓ నాటిక ఆడిస్తే బాగుంటుందని"

"అలాగే.. ప్రయత్నిస్తాను ఎన్ని పేజీలు కావాలి?"

"గంట.. అంటే ఒక్కో అంకం పది నిమిషాల చొప్పున అయిదు అంకాలు అంటే సుమారు మీ చేతిరాతలో ముప్పైపేజీలు ఉండేలా చూడండి. లేదంటే మీరు రాయగలిగితే ఏకాంకి నాటిక రాయండి."

"ముప్పై పేజీలే! నేను అన్ని పేజీల కథే రాయలేదింతవరకూ నాలుగు, అయిదు పేజీల కథలు మాత్రమే రాయగలను. పైగా నాకు ఈ అంకాలు, బింకాలు తెలియదు" బిక్కమొహంతో అంది సరోజ.

"అలాగా!" నిరుత్సాహంగా అంది పద్మిని.

"అవునండి.. సారీ.. కావాలంటే నాలుగు పేజీలు రాసిస్తాను."

పద్మిని వసంతవైపు చూసింది. వసంత ఏం మాట్లాడలేదు. పద్మిని కూడా కొంచెం సేపు మౌనంగా ఉండి అంది. నాలుగు పేజీలంటే పేజీకి రెండు నిమిషాల చొప్పున ఎనిమిది నిమిషాలు. అంటే మూమెంట్స్ కొంత ఎక్కువసేపు లాగితే పదినిమిషాలు.

పరిచయాలు, గణపతి స్తోత్రం, ప్రారంభ గీతం కలిపితే మరో ఐదు నిమిషాలు. చాలదు. "ఓ పని చేయండి మీరు నాకు ఇతివృత్తం రాసివ్వండి. మిగతాది నేను చూసుకుంటాను."

సరోజ వికసించిన మొహంతో అడిగింది "మరి స్టేజ్ మీద అనౌన్స్ చేసేటప్పుడు నా పేరు చెప్తారా?"

పద్మినికి నవ్వొచ్చింది ఆమె ఆత్రుతకి. "అలాగే లెండి. నాకు ఇతివృత్తం నచ్చితే తీసుకుంటాను."

సరోజ కొంచెం సేపు ఆలోచించి అంది "నాకు పారితోషికం ఇస్తారా?"

పద్మిని ఆశ్చర్యంగా వసంతవైపు చూసింది. వసంత కూడా అదే ఆశ్చర్యంతో పద్మినివైపు చూసింది. ఇద్దరికీ పెద్దపెట్టున నవ్వొచ్చింది. ఆ నవ్వు బైటికి రాకుండా పెదాలు బిగించి కిందకి చూస్తూ ఉండిపోయింది వసంత. పద్మిని మామూలుగా అంది "నాటకాలు రాసేవాళ్ళకి ఎవరూ డబ్బివ్వరండి. మేము డబ్బివ్వలేము మీకు సన్మానం చేసి శాలువా కప్పుతాము."

సరోజ మొహంలో సంతోషం వెల్లివిరిసింది. "సన్మానమా?" అంది మెరిసే కళ్ళతో.

"అవునండి. మా కళాకారులతో పాటు మిమ్మల్ని కూడా సత్కరించి గౌరవిస్తాము. "

ఆ క్షణంలో ఆ వర్ధమాన రచయిత్రి కళ్ళముందు తన మెడనిండా పూలదండలు, భుజం మీద పట్టుశాలువా, క్లిక్, క్లిక్ మంటూ వెలుగుతున్న కెమెరాలు, పత్రికల్లో తనపేరు ఆనందంతో నోటమాటరాలేదు. "తప్పకుండా రాసిస్తాను. రెండు రోజుల్లో ఇస్తాను" అంది.

"చాలా థాంక్సండి. మా ఇంటికి వచ్చారంటేనే మీరు నిగర్వి అని తెలుస్తోంది. మీ తాహతుకి మా ఇల్లు చాలా చిన్నది మాతో మాట్లాడడానికి మీరు రావడం చాలా ఆనందంగా ఉంది. మా వాసంతి వచ్చి మీ దగ్గర స్క్రిప్ట్ తీసుకుంటుంది. అన్నట్టు కేవలం నాలుగే పాత్రలుండాలండి. ఒక అత్తగారు, ఇద్దరు కోడళ్ళు, ఒక పక్కింటావిడ. వీలైతే ఓ పనిమనిషిని కూడా పెట్టండి."

"అలాగే మీరింత క్లూ ఇచ్చాక చూడండి ఎంత బాగా రాస్తానో పాత్రలు మీరే చెప్పారు కాబట్టి నాకింకా సులువవుతుంది" అంటూ లేచింది.

"వసంతా సరోజగారిని ఇంటిదాకా దిగబెట్టిరా" అంది పద్మిని.

"అలాగే అక్కా" అని "రండి" అంటూ చెప్పులేసుకుని బైటకి దారితీసింది వసంత.

"వెళ్ళొస్తానండి" అంటూ సరోజ సెలవు తీసుకుంది.

పద్మిని వాళ్ళు వెళ్ళాక సన్నగా నిట్టూర్చి అలాగే ఆలోచిస్తూ కూర్చుంది.

ఆమెకి చాలా నిరుత్సాహంగా అనిపించింది. ఈమె వలన పెద్దగా ప్రయోజనం ఉన్నట్టు కనిపించడంలేదు. ఏదో ఉత్సాహం కొద్దీ రాస్తున్న చిన్న, చాలా చిన్న రచయిత్రి. నాటకాలు రాయాలంటే ఎంతో అనుభవం ఉండాలి. అలాంటి వాళ్ళు తనకి ఎవరు లభిస్తారు? కొంచెం పెద్ద రచయితలు డబ్బు ఇవ్వకపోతే రాయరు. సమాజం అయితే పెట్టింది. కానీ దాన్ని నిర్వహించడానికి ఎన్ని ఇబ్బందులు. ఎంతో సమర్ధత ఉన్నవాళ్ళు మాత్రమే నిర్వహించాల్సిన సమాజం తనలాంటి నిస్సహాయురాలు నిర్వహించాలనుకోడం ఎంత అమాయకత్వం.

ఆడవాళ్ళు ఈ సమాజంలో గౌరవంగా బతకాలంటే భర్త అనబడే ఓ గోడ అడ్డుగా ఉండాలి. లేదా డబ్బు అనే అండ కొండంతగా ఉండాలి. ఈ రెండూ లేని ఆడదానికి ఈ సమాజంలో గౌరవమూ లేదు, గుర్తింపూలేదు. ఏం సమాజం ఇది. ఎవరు నిర్మించారీ సమాజాన్ని ఇంత బలహీనంగా.

ఈ జీవితంతో పాతికేళ్ళ నుంచీ పోరాడుతోంది. ఎందుకు? కేవలం తన గౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని, వ్యక్తిత్వాన్ని కాపాడుకోడానికి. ఎక్కడికక్కడ అడ్డుగోడలు, ఆటకాయింపులు, బెదిరింపులూ.

ఆమె కళ్ళముందు ఒకొక్కటిగా పాతికేళ్ళనుంచీ తన జీవితంలో జరిగిన అనేక సంఘటనలు, ఎదురైన వ్యక్తులు, గుర్తుకు రాసాగాయి. కళ్ళుమూసుకుని దిండుమీద వాలింది రెండు కళ్ళ చివర్లనుంచి చెంపలమీదికి కన్నీళ్ళు జారాయి.

చక్రధరం ఎంత పెద్దమనిషిలా అనిపిస్తాడు. లోపల ఎంత నీచమైన స్వభావం తన పట్ల అతను ప్రవర్తించిన విధానం, అతని మాటలు గుర్తొచ్చి దుఃఖం రాసాగింది. ఎవరికి చెప్పుకోవాలో, ఎలా చెప్పుకోవాలో కూడా తెలియని బాధ గుండెల్లో పేరుకుపోయి ఉంది మంచులా. వసంతకి చెబితే "ఈ వయసులో అదేంటక్కా నువ్వే అపార్థం చేసుకున్నావేమో" అంటుందేమో? శివరామ్‌కి చెబితే తనని తనే అవమానించుకున్నట్టు ఉంటుంది. ఎంత ఆత్మీయంగా ఉన్నా పరాయి మగవాడు పరాయివాడే ఇంక ఎవరికి చెప్పుకోవాలి? ఎందుకు వాళ్ళనుంచి విడిపోవాలనుకుంటున్నావు అనే శివరామ్ ప్రశ్నకి ఫలానా కారణం అని చెప్పలేని ఛండాలపు కారణం. పద్మినికి విజయనగరంలో జరిగిన సంఘటన మర్చిపోకుండానే ఇటీవల కమ్యూనిటీ హాల్లో అతను ప్రవర్తించిన తీరు గుర్తొస్తుంటే అవమానంతో శరీరం దహించుకుపోతున్నట్టు అనిపించింది.

విజయనగరంలో పద్మినికీ, మరో ఆర్టిస్టుకీ కలిపి ఒక రూము ఇచ్చారు ఆర్గనైజర్స్. ఆ పరిషత్తు పెద్ద ఎత్తున జరిపారు. చాలామంది స్పాన్సర్స్ ఉండడం చేత పోటీలకు వెళ్ళిన కళాకారులకు హోటల్ రూముల్లో అకామిడేషన్ ఇచ్చారు. ప్రదర్శన అయిపోయిన రోజు సాయంత్రం ఆ ఆర్టిస్టు బంధువులెవరో ఉన్నారని ఊళ్ళోకి వెళ్ళింది. పద్మిని ఒక్కతే మేకప్ తుడిచేసుకుని, నాటకం బాగా వచ్చిందన్న తృప్తితో హాయిగా, విశ్రాంతిగా పడుకుంది. నాటకం అయిపోగానే మేకప్ రూముకే వచ్చేసారెందరో అభిమానులు. చాలా బాగా చేసారండి. చాలా బాగా చేశారు. అంటూ అభినందనలు పరంపరంగా వస్తుంటే సర్వమి మర్చిపోయింది పద్మిని. ఒక రంగస్థల కళాకారిణికి సినిమా తారకున్న గ్లామర్ అభిమానుల్లో ఉంటే అంతకన్నా ఏం కావాలి?

కొందరైతే "మీరు సినిమాల్లోకి ఎందుకు వెళ్ళలేదు?" అంటూ ప్రశ్నలతో ఉక్కిరి, బిక్కిరి చేశారు.

పద్మినికి నవ్వొచ్చింది. పెదాల మీద మందహాసం అలుముకుంటే సీలింగ్ కేసి చూస్తూ ఆ తీపి గుర్తులు పదే, పదే తల్చుకుంటూ పడుకుంది. ఇంతలో కాలింగ్ బెల్.

"ఎవరబ్బా.." తనని డిస్టర్బ్ చేసినందుకు విసుక్కుంటూ లేచి తలుపు తీస్తే చక్రధరం.

"రండి, రండి" గౌరవంగా ఆహ్వానించింది గుమ్మలోంచి అడ్డుతొలగుతూ.

అతను లోపలికి వచ్చి అక్కడే ఉన్న కుర్చీలో కూర్చుంటూ "చాలా అద్భుతంగా చేశావు పద్మినీ. నాకు చాలా, చాలా హ్యాపీగా ఉంది. నాటకం మొత్తం నీమీదే నడిచింది స్టేజ్‌ని తినేశావు" అన్నాడు.

"థాంక్సండీ" అంటూ పద్మిని మంచం మీద ఓ చివర కూర్చుంది.

అతను కుర్చీలోంచి తలతిప్పి వెనక్కి చూస్తూ "హోటల్ రూముల్లో ఉన్నప్పుడు తలుపులు తీసి ఉంచకూడదు. ఎవరున్నా, ఒక్కదానివి ఉన్నా తలుపు వేసేయాలి" అంటూ లేచి తలుపు గడియవేసి వచ్చాడు.

పద్మినికి ఆ క్షణంలో అది ఏమీ తప్పుగా కానీ, అనుచితంగా కానీ అనిపించలేదు. అవునేమో ఈ మర్యాదలు నాకు తెలియవు అనుకుంది.

"త్వరలో మరో మంచి ఉమన్ ఓరియంటెడ్ సబ్జెక్ట్ తీసుకుని రాస్తాను. ఫర్వాలేదు. వయసు మీదపడుతున్నా నువ్వింకా పొంకంగానే ఉన్నావు. ఇవాళ స్టేజ్ మీద చూస్తుంటే ఏ హీరోయిన్‌కీ తీసిపోవనిపించింది. ఇంకా కొంతకాలం హీరోయిన్‌గా వేయచ్చు."

అతని చూపులు, మాటలు చాలా ఇబ్బందికరంగా అనిపించాయి. ఇతనేంటి ఎప్పుడూ లేనిది ఇలా మాట్లాడుతున్నాడు అనుకుంది. కానీ, తన అసంతృప్తి బైటపడనియ్యకుండా చిన్నగా నవ్వి తలవంచుకుంది.

"చూశావా నీలో సిగ్గు, బిడియం కూడా పోలేదు. అంటే నీకేం వయసు మీరలేదు." అంటూనే హఠాత్తుగా లేచి ఆమె దగ్గరగా వచ్చి భుజం పట్టి "ఈ పరిషత్తులో కూడా మనదే ప్రథమ బహుమతి. నాకు చాలా హ్యాపీగా ఉంది. ఇంత ఆనందం నాకిచ్చిన నీకో బహుమతి ఇవ్వాలనుకుంటున్నాను పద్మినీ" అంటూ గట్టిగా దగ్గరకు తీసుకుని ముద్దుపెట్టుకున్నాడు.

ఊహించని ఆ చర్యకి అదిరిపోయింది పద్మిని.

అతడిని విడిపించుకుని దూరం జరిగి "ఏం చేస్తున్నారు మీరు?" అంది భయంగా.

"ఏం ఉంది! ఇదంతా మామూలే పద్మినీ. ఇంతకాలం ఇలా అకామడేషన్ ఇచ్చినవాళ్ళు లేక మనకి అవకాశం రాలేదు. ఇప్పుడొచ్చింది. ఉపయోగించుకుందాం నేను రైటర్‌ని, నువ్వు నా ఆర్టిస్టువి. ఈ అనుభవం మన మధ్య లేకపోతే అనుబంధం బలపడదు" అంటూ మళ్ళీ దగ్గరగా రాబోయాడు.

"దూరంగా ఉండండి." భయంతో ముచ్చెమటలు పోస్తుంటే తనని తాను నిగ్రహించుకుంటూ మందలింపుగా అంది.

"మంచిదానివే ఇంతకాలం నుంచీ షడసోపేతమైన భోజనం కళ్ళందు పెట్టుకుని ఆకలితో మాడాననే బాధపడుతున్నాను. ఇంక దూరంగా ఉండడం నావల్లకాదు" అంటూ చేయందుకున్నాడు.

"వదలండి" విసురుగా చేయిలాక్కుంది.

"పెద్ద పతివ్రత్తుల్లా మాట్లాడకు పద్మినీ. కళాకారిణులకు పాతివ్రత్యం పనికిరాదు. పైకి ఎదగాలంటే నిచ్చెనలు వేసేవాళ్ళకి సహకరించాలి" అన్నాడు.

ఆ క్షణంలో అతని కళ్ళల్లో మోహం, కాంక్ష అతనెంత మాత్రం సంకోచించకుండా పైపైకి వస్తున్న విధానం ఏ క్షణమైనా ఏదైనా జరగచ్చు అనిపించింది పద్మినికి.

"చక్రధరంగారూ మీకు కళాకారిణుల మీద ఉన్న అభిప్రాయానికి ధన్యవాదాలు. దయచేసి వెంటనే మీ అభిప్రాయం మార్చుకోండి. లేదంటే నేను నా దారి మార్చుకోవాల్సి వస్తుంది" అంది.

"అనవసరంగా టైం వేస్ట్ చేయకు పద్మినీ. నాకు తెలుసు నీలాంటి వాళ్ళ నాటకాలు. మీరు జీవితంలో కూడా బాగా నటించగలరులే. అయినా నీకు మాత్రం లేదా ఏంటి మనసులో. ఆడదానివి కాబట్టి బైటపడలేకపోతున్నావని నేనే చొరవ చేస్తున్నాను. కమాన్. ఎవరికీ తెలియదులే. డోంట్ వర్రీ"

"దయుంచి దూరంగా ఉండండి. క్షణికోద్రేకంలో చేస్తున్న తప్పుకి జీవితాంతం కుమిలిపోయే పరిస్థితి తెచ్చుకోవద్దు. మనం పెద్దవాళ్ళం. గౌరవం ఇచ్చి పుచ్చుకోడం మర్యాద."

"ఏంటే మర్యాద!? ఈ కబుర్లు చెప్పకు నాకు చిరాకు" అంటూ ఆమెని పట్టుకునేలోగా మంచం ఎక్కి అవతలివైపుకి గెంతి పరిగెత్తుకుంటూ వెళ్ళి బాత్ రూములో దూరి తలుపు వేసుకుంది. మండిపడుతున్న స్వరంతో అరిచింది. "మర్యాదగా వెళ్ళండి నేను బైటకి రాను. ఈ లోగా ఆమె వస్తుంది. అల్లరి అయిపోతారు. వెళ్ళండి ప్లీజ్."

పద్మిని కళ్ళల్లోంచి ప్రవాహంగా నీళ్ళు కారసాగాయి.

పదినిమిషాల తరువాత వచ్చి చూస్తే అతను లేడు. కానీ, అతను చేసిన అవమానం గుండెని దహించివేసింది.

ఆ రోజే తను అతని సంస్థ నుంచి బైటకి వచ్చేయాలనుకుంది. కానీ, యవనిక చదువు, తన నిస్సహాయత గుర్తొచ్చి మరో అవకాశం దొరికిందాకా గడిపేద్దామనుకుంది.

కానీ, మళ్ళీ నెల్రకితం కమ్యూనిటీ హాల్లో..

పద్మిని చిన్నప్పటినుంచీ ఒక క్రమశిక్షణ అలవాటు పడింది. అది నాటకం మీద ఆసక్తితో కావచ్చు. కుతూహలం కావచ్చు. లేక తనకి సపోర్టుగా ఉండి తనని ఈ రంగంలోకి దింపిన మేనత్తకొడుకు హరి నేర్పిన క్రమశిక్షణ కావచ్చు. ఏదైనా రిహార్సల్స్‌కి రావాలన్నా, ప్రదర్శనకు రావాలన్నా చెప్పిన టైం కన్నా పావుగంట ముందే ఉంటుంది. ఒక నాటకం ఒప్పుకున్నాక అది పూర్తయిందాకా ఇంకే నాటకం ఒప్పుకోదు. కళాకారులకి కమిట్‌మెంట్ ఉండాలన్నది ఆమె అభిప్రాయం. ఆమె తోటి కళాకారులను గౌరవిస్తుంది. రచయితలంటే మేధావులని ఆమె అభిప్రాయం అందుకే చక్రధరాన్ని మరీ గౌరవిస్తుంది. అతను తను ఊహించినంత గొప్పవాడు కాదని తెలిశాక కూడా ఆమె అతడిని గౌరవిస్తూనే ఉంది. మనిషన్నాక బలహీనతలుంటాయి. వాళ్ళని కొంచెం మందలిస్తే మారతారు అనే అమాయకపు ఆలోచన ఆమెది. అదే ఆలోచనతో రిహార్సల్స్‌కి ఆరోజు కూడా పావుగంట ముందుగానే వెళ్ళింది. అప్పటికే అక్కడికి వచ్చి ఉన్న చక్రధరం.

"రా, రా నాకు తెలుసు నువ్వు ముందే వస్తావని" అంటూ నవ్వుతూ ఆహ్వానిస్తే పోనీలే మారిపోయాడు అనుకుంది.

"నేను తొందరపడ్డాను. అసలు విషయం నీతో చెప్పకుండా నిన్ను భయపెట్టాను. ఏమీ అనుకోకు. ఇప్పుడు చెప్తాను. నీకో మంచి భవిష్యత్తు ఇవ్వాలని నా ఆశ. అందుకే నేనో నిర్ణయం తీసుకున్నాను."

ఏం చెప్తాడో అన్నట్టు దడ, దడలాడుతున్న గుండెల్ని అదిమిపట్టుకుని చూసింది.

అతను జేబులోంచి సిగరెట్ ప్యాకెట్ తీసి, ఒక సిగరెట్ తీసి పెదాల మధ్య పట్టుకుని ప్యాకెట్ జేబులో పెట్టుకున్నాడు. అగ్గిపెట్టె తీసి సిగరెట్ వెలిగించుకుని, ఆమె కళ్ళల్లోకి చూస్తూ చెప్పసాగాడు "పద్మినీ నీ జీవితం సెటిల్ అయే మార్గం ఒకటి చెప్తాను. నువ్వు అంగీకరించి తీరాలి. నీకు సినిమాల్లో కూడా వేషాలిప్పిస్తాను. నీ కూతుర్ని డాక్టర్ని చేయాలని నీకుంది కదా. నీ కోరిక కూడా తీరుతుంది"

"నా భార్య నన్ను చాలా అపార్థం చేసుకుని వెళ్ళిపోయింది. నేనిప్పుడు ఒంటరివాడిని. నువ్వు ఒంటరివే. అందుకే మనం ఒక నిర్ణయానికి వద్దాం. నిన్ను నేను ఉంచుకుంటాను. నా ప్రతినాటకంలో నువ్వే హీరోయిన్. అంతేగాక నీకు తెలుసుకదా నాకు సినీఫీల్డులో మంచి పరపతి ఉంది. నీకు తగిన వేషాలిప్పించే బాధ్యత నాది."

అతను మాట్లాడుతున్నంతసేపూ నిశ్చేష్టురాలై వింటూన్న పద్మినికి ఆవేశంతో, బాధతో కన్నీళ్ళు వచ్చేశాయి. అతను మాట్లాడేది ఏంటో, ఎందుకలా మాట్లాడుతున్నాడో అర్థంకాని దానిలా వెర్రిచూపులు చూసింది కాసేపు. అర్థం అవుతోంటే గుండెల్లోంచి తన్నుకురాసాగింది దుఃఖం. ఏం మాట్లాడాలో, ఎలా రియాక్ట్ అవాలో తెలీక అలాగే చూస్తున్నదల్లా అతను దగ్గరకు రాగానే వణికిపోతూ రెండు చేతులూ జోడించి అంది "ఇంకెప్పుడూ ఇలా మాట్లాడకండి రైటర్‌గారూ మీరంటే నాకు చాలా గౌరవం. అది పోకుండా చూసుకోండి"

ఆ రెండు చేతులూ తన చేతుల్లోకి తీసుకుని "ఇవన్నీ పనికిరాని మాటలు పద్మినీ. గౌరవం కాదు. నన్ను ప్రేమించు. హాయిగా జీవితాన్ని అనుభవించు. యవ్వనం అంతా వృధాచేశావు. ఇంకా ఎంత ఐదారేళ్ళలో యవ్వనం జారిపోతుంది. ఇంక అప్పుడేం అనుభవిస్తావు జీవితాన్ని" అంటున్న అతడిని నిరుత్తరురాలై చూస్తుండగా అప్పుడే మరో ఇద్దరు కళాకారులు రావడంతో చేతులు వదిలేసి సీన్ వివరిస్తున్నట్టు నటించడం ప్రారంభించాడు.

ఒక్కొక్కటీ గుర్తొస్తుంటే ఈ జీవితం ఇంకా ఎంతకాలం ముళ్ళమీద నడుస్తుంది తండ్రీ అనుకుంది గోడమీద ఉన్న వెంకటేశ్వరస్వామి క్యాలెండర్ చూస్తూ.

"అక్కా!" అంటూ వసంత స్వరం వినిపించడంతో చీరచెంగుతో కళ్ళనీళ్ళు తుడుచుకుని లేచి కూర్చుంది.

"ఆవిడ మనకి నాటకం రాసిచ్చే దానిలా కనిపించడంలేదు కదక్కా" అంది వసంత మంచినీళ్ళు తెచ్చుకుని తాగుతూ.

నిట్టూరుస్తూ అంది పద్మిని. "నాకూ అలాగే అనిపిస్తోంది వసంతా. వేరే రైటర్‌ని వెతుక్కోవాలి మనం"

"మనం తప్పు చేశామక్కా. అనవసరంగా చక్రధరం గారితో గొడవపెట్టుకున్నాం కదూ."

"నేనేమీ అతనితో గొడవపడలేదు. మనసు కష్టపడింది. బైటకి వచ్చాను. మనం గొడవపెట్టుకోకున్నా అతనే మనల్ని వదిలేసేవాడు. నయం కదా మనంతట మనం వచ్చామంటే కొంతలో కొంత తృప్తి. అతనే మనల్ని వెలేసి ఉంటే అవమానంతో తలెత్తుకు తిరగగలిగేవాళ్ళమా?"

"అయితే ఇంక మనల్ని పిలవడంటావా?" నిరాశగా చూసింది వసంత.

పద్మిని ఆమె వైపు చూసింది. నిరుత్సాహం, నిరాశ స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆమెకి వేషాలు దొరకవేమో అనే భయం తప్ప తిండి గడవదన్న దిగుల్లేదు. ఎందుకంటే పద్మిని దగ్గర తిండి, నీడా గడిచిపోతున్నాయి. పిల్లా, జెల్లా బాదరబందీలేం లేవు. వేషాల ద్వారా వచ్చే ఐదొందలలో, వెయ్యో దాచుకుంటోంది. తనలాగా తిండి ఎలా గడుస్తుందన్న బాధగానీ, పిల్ల చదువెలా అనే బెంగకానీ ఏమీలేవు. పైగా ఆమె  వేసే చిన్న, చిన్న పాత్రలు ఎక్కడోక్కడ దొరుకుతాయి. తనకే కథానాయికగా అంటే ఎవరిస్తారు? అసలిస్తారో లేదో.. తల్లి పాత్రకో, అత్తగారి పాత్రలో తీసుకుంటే పెద్దగా రెమ్యునరేషన్ ఇవ్వరు. తన బతుకుబండి లాగడానికి ఈ కళ తప్ప మరో పని తెలీదు తనకి. టెంత్ కూడా పాసు కాని తనకి ఉద్యోగం ఇచ్చే నాథుడెవరు ఈ చిన్న ఊళ్ళో. హైదరాబాద్ వెళ్ళిపోతే .. ఎలా వెళ్ళాలి? వెళ్ళి అక్కడ ఎక్కడుండాలి? వెళ్ళిన వెంటనే అవకాశాలు వస్తాయా? ఎన్ని రోజులు ఆకలితో మాడాలో, పిల్ల చదువు అర్ధాంతరంగా ఆగిపోతుంది. దేవుడా ఏం చేయమంటావు?

పద్మిని రెండు చేతులూ తలమీద పెట్టుకుంది.

"అమ్మాయ్.. పద్మినీ" లోపలికి అడుగుపెడుతూ పిలిచాడు శివరామ్.

"రా శివా..!" పద్మిని గబుక్కున మంచం మీంచి కిందకి దిగి ఆహ్వానించింది.

**శివ లోపలికి వచ్చి స్టూలు జరుపుకుని కూర్చున్నాడు.** "ఏంటమ్మా? కొత్తసంగతులేమన్నా ఉన్నాయా?" అడిగాడు.

"ఏం ఉంటాయి. ఏం ఉన్నాయని చెప్పాలి."

"నువ్వే చెప్పాలి శివా! మాకేం తెలుస్తాయి నీకే తెలియాలి నాలుగుచోట్ల తిరిగేవాడివి, నలుగురుతో స్నేహంగాఉండే ఉండేవాడివి" అంది పద్మిని తిరిగి మంచం మీదే కూలబడుతూ.

"ఆయన కొత్త నాటకం రాశాడు. కొత్త హీరోయిన్ కోసం చూస్తున్నాడు."

పద్మిని గుండెల్లో రాయిపడింది. అనుకున్నంతా అయింది. ఆడదానిగా కాకపోయినా ఒక నిస్సహాయురాలైన కళాకారిణిగా అరిటాకు ముల్లు సామెత తనకి వర్తిస్తోంది. అంతేకదా అతను అరిటాకులాంటివాడు. వడ్డించుకుంటే కడుపునిండా తినచ్చు. అతనితో గొడవపడడం వల్ల తనే నష్టపోతోంది. అలాగని అతను చెప్పినదానికల్లా బసవన్నలా తలాడించే అవసరం ఉందా? కళాకారిణిని అన్న ఒక్క విషయం మర్చిపోతే ఎలా అయినా బతకచ్చు. నాలుగిళ్ళల్లో పనిచేసుకోవచ్చు. కావాలంటే రెండిళ్ళలో వంటమనిషిగా చేయచ్చు. ఇంకా కావాలంటే ఇంట్లోనే చిన్నపాటి హోటల్ కూడా నడుపుకోవచ్చు.

నెమ్మదిగా నిట్టూర్చి అంది "పోనీలే శివా! ఆయనిష్టం. అయినా నేనూ పెద్దదాన్ని అవుతున్నాకదా ఎంతకాలం నన్నే హీరోయిన్‌గా పెట్టుకోగలుగుతాడు" అంది.

శివకి జాలేసింది. అలా అనక ఇంకేం అంటుంది. పద్మినిలాంటి వాళ్ళు మలినమైపోతున్న ఈ రంగంలో నెట్టుకురావడం చాలా కష్టం. పద్మిని నిజంగానే పద్మంలాంటిది. బురదలో పుట్టినా ఆ బురద అంటని పవిత్రమైన పుష్పం పద్మం. జీవితంలో ఒక వ్యక్తిని నమ్మి భార్య అయి, ఒక పిల్లకి తల్లి అయింది. ఆ వ్యక్తి నమ్మించి గొంతుకోస్తే ఆ పిల్లని గుండెల్లో దాచుకుని కంటికి రెప్పలా కాపాడుకుంటోంది. అందుకోసం పడరాని పాట్లు పడుతోంది. ఇలాంటి పిల్లతో అసభ్యకరంగా ప్రవర్తించడానికి మనసెలా ఒప్పింది ఆ చక్రధరానికి. ఒక రచయితగా ఎవరూ చూడని అనేక కోణాల్లో జీవితాన్ని చూడగల శక్తి ఉన్నవాడు. మనస్తత్వాలను అవపోసన పట్టి అనేక రకాల పాత్రలను సృష్టించినవాడు తనతోటి కళాకారిణిని అర్థం చేసుకోలేడా? ఒక స్త్రీని గౌరవించలేని అతని మేధాసంపత్తి ఎంత గొప్పదైతే ఏం? కనీసం సంస్కారం లేనివాడు. కానీ, ఎలా బతుకుతుంది పద్మిని. ఆమెకి అవకాశాలు రావనికాదు. సీనియర్ నటీమణిగా తప్పకుండా మంచి అవకాశాలు వస్తాయి. కానీ, సంస్థలవాళ్ళ సంగతి తనకి తెలియందికాదు అనేకరకాల వాళ్ళుంటారు. ప్రతిచోటా ఏదో ఒకమనస్తాపం ఉండచ్చు. ఘర్షణ ఉండచ్చు ఎలా తట్టుకోగలదీమె. సానుభూతిగా అన్నాడు.

"ఓ పని చేయకూడదూ పద్మిని?"

"చెప్పు శివా. ఏం చేయమంటావు?" చిరునవ్వుతో చూసింది పద్మిని.

"ఒక్కసారి ఆ చక్రధరంతోటే మాట్లాడకూడదూ."

"నేనా?"

"తప్పదమ్మా. అవసరం నీదే పైగా రెండేళ్ళు తన సంస్థలో తప్ప మరెక్కడా చేయకూడదని నీతో అగ్రిమెంటు రాయించుకున్నవాడు అతనికి నైతిక బాధ్యత లేదా? ఉన్నట్టుండి నిన్ను తీసేస్తే నువ్వెక్కడికి పోతావని అతని ఉద్దేశం. మాట్లాడడం కాదు. నన్నడిగితే జాడించు.. వెళ్ళి" ఆవేశంగా అన్నాడు శివ.

నవ్వింది పద్మిని. వసంత వైపు చూసి "టీ పెట్టు వసంతా" అంది.

వసంత స్టవ్ దగ్గరకు నడిచింది.

"ఏమని దెబ్బలాడమంటావు? నా ఇష్టం అంటాడు. నేను రెండేళ్ళకి రాయమంటే ఏడాదికే కదా రాశాను. ఆ తరువాత మరి రెండు సంస్థల్లో చేశాను. ఇకపోతే బతిమాలాలి. నాకు నువ్వే దిక్కు. నన్ను తీసేయకు అని బతిమాలాననుకో ఇంకా చులకనైపోతానా లేదా? అతను అనే స్థాయిలో ఉన్నాడు, నేను పడే స్థాయిలో ఉన్నాను. అనిపించుకున్నాను. చాలింక. నా వల్లకాదు శివా ఒక తలుపు మూసుకున్నా మరో తలుపు తెరుచుకుంటుందని నమ్మే మనిషిని. ఈ నమ్మకం, ఈ ఆశా లేకపోయి ఉంటే ఎప్పుడో నన్ను నేను అంతం చేసుకునేదాన్ని.

వసంత టీ తెచ్చి ఇస్తూ అంది. "మనం ఈ ఊరునుంచి వెళ్ళిపోదామక్కా. వేరే ఊళ్ళో ఇంకా బాగా బతకగలమేమో"

"ఏ ఊరు వెళ్ళాలనుకుంటున్నావు వసంతా?" టీ కప్పు అందుకుంటూ అన్నాడు శివ.

"ఏదో ఒకటి. హైదరాబాదు వెళ్ళిపోతే బాగుంటుందేమో. ఈ నాటకాలని నమ్ముకుంటే తిండి లేకుండా మాడాల్సి వస్తుంది. అక్కడికెళ్ళి టీ.వి సీరియల్స్‌లో ప్రయత్నించుకోవచ్చుకదా"

శివ నవ్వాడు. "నీకు ఆశలు బాగానే ఉన్నాయి. అవి నెరవేరాలంటే చాలా కావాలి వసంతా!" అన్నాడు.

సాలోచనగా అంది పద్మిని. "నేనూ అదే అనుకుంటున్నాను శివా! ఏ చిన్న పాత్ర వేసినా డబ్బులొస్తాయికదా హీరోయిన్ కావాలని నేను కోరుకోవడంలేదు. "

శివ ఆశ్చర్యంగా చూశాడు. హైదరాబాద్ వెళ్ళటమా? ఈ ఆడపిల్లలిద్దరూ, మరో ఆడపిల్లని వెంటపెట్టుకుని ఎన్నడూ చూడని ఓ మహాపట్నానికి వెళ్ళడమా? వెళ్ళి ఎక్కడ ఉంటారు? ఎలా బతుకుతారు? టీ. వి సీరియల్స్‌లో వీళ్ళని తీసుకునేదెవరు? మగవాళ్ళే స్టూడియోల చుట్టూ తిరుగుతూ వేషాల్లేక చిన్న, చిన్న ఎక్స్‌ట్రా వేషాలతో బతికేస్తున్నారు. వసంత అనాలోచితంగా అన్నా, ఆ మాటకి పద్మిని సానుకూలంగా స్పందించడం మరీ ఆశ్చర్యం అనిపించింది. ముఖ్యంగా యవనిక చదువు సంగతి ఏంటి? ఏనాడూ హైదరాబాదు రైలు కూడా ఎక్కని వీళ్ళు అక్కడికెళ్ళి బతకాలనుకోడం దురాశకాదా. ఏ ధైర్యంతో వీళ్ళు అక్కడికెళ్ళాలనుకుంటున్నారు.

"ఏంటి శివా ఆలోచిస్తున్నావు?" అడిగింది పద్మిని.

"ఆలోచన కాదు పద్మినీ. మీరెంత తెలివితక్కువ ఆలోచన చేస్తున్నారో తల్చుకుంటే ఆశ్చర్యంగా అనిపిస్తోంది. టీ.వీలో వేషాలంటే అంత సులభంగా వస్తాయని అనుకుంటున్నారా? పరపతి కావాలి. నీకో బ్యాక్ గ్రౌండ్ ఉండాలి. ఇలా పొట్టకూటికోసం వెళ్ళి, మాకు వేషాలివ్వండి అని బతిమాలితే చాలా అసహ్యంగా చూస్తారు మిమ్మల్ని. దర్జాగా పట్టుచీర కట్టుకుని వెళ్ళి నాకు చాలా డబ్బుంది జస్ట్ సరదాకి ఏదన్నా వేషం ఇవ్వండి అంటే ఏదో ఒకటి క్రియేట్ చేసి అయినా ఇస్తారు. అలాంటి ఫీల్డ్ అది. నాటకరంగంలో ప్రతిభ ఉంటే పట్టం గడతారు. అక్కడ ప్రతిభా, పాటవాలు అవసరంలేదు. లౌక్యం, చొరవ, చాకచక్యం, తెలివితేటలు కావాలి. నీకు డైలాగ్ చెప్పడం రాకపోతే వేరేవాళ్ళతో చెప్పిస్తారు. నీకు మొహంలో భావాలు పలికించడం చేతకాకపోతే ప్రతి భావానికీ కళ్ళు పెద్దవి చేసి చూస్తే చాలు. అందులోనే రక, రకాల భావప్రకటనలను ఆపాదించుకుంటారు. ఇంకా చాలా ఉన్నాయి. చెబితే భయపడతారు. అయితే మిమ్మల్ని నిరాశపరచడం నా అభిమతం కాదు. కానీ, చెప్పాల్సిన బాధ్యత ఉంది కాబట్టి చెబుతున్నాను. ఆ ఆలోచన పక్కన పెట్టి ప్రస్తుతానికి బతుకుబండి నడిచే మార్గం ఆలోచించండి."

వసంతకి విసుగ్గా అనిపించింది.

ఏదో మాటవరసకి అంటే మొత్తం జీవితం మీదే విరక్తి కలిగేలా చెప్పేసాడు శివ. ఇంక ఆ ఆలోచన చేయడం కూడానా. "అయితే నాలుగిళ్ళల్లో పాచిపని చేసుకోవాల్సిందే మేము" అంది అక్కసుగా.

"అంతమాటనుకులే వసంతా! దేశం గొడ్డుపోలేదు. ఏదో ఒక మార్గం తప్పక దొరుకుతుంది. ఏదన్నా స్కూల్లో చిన్న ఉద్యోగం చూడు శివా!" అంది పద్మిని.

"ఆ మాటన్నావు బాగుంది. అలాగే చూస్తాలే "అంటూ గదిలో కలయచూస్తూ "యవని ఇంకా స్కూలు నుంచి రాలేదా?" అడిగాడు.

"దానికి ట్యూషన్ కావాలంటే పెట్టించాను. నెలకి రెండువందలు. ఆ ఖర్చు కూడా ఇప్పుడే వచ్చిపడింది చూద్దాం ఏం జరుగుతుందో?"

శివకి ఏం చెప్పాలో తెలియలేదు. తను మాటసాయం తప్ప ఆర్థిక సాయం చేయలేడు. తన ఆర్థిక పరిస్థితి కూడా అంతంతమాత్రమే. శివ ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. నెలకి ఆరున్నరవేలు జీతం. అదిగాక ఇంటిదగ్గర అతని భార్య ఎలిమెంటరీ స్కూలు పిల్లలకి ట్యూషన్లు చెప్పి పదిహేనువందలదాకా సంపాదిస్తుంది. తండ్రి ఇచ్చిన స్వంత పెంకుటిల్లుంది. పిల్లలు లేకపోవడంతో ఉన్నది చిన్నపాటి పల్లెటూరు కావడంతో ఆర్థిక లాభం లేకపోయినా నాటకాలాడుతూ బతుకు వెళ్ళదీస్తున్నాడు.

అలాంటిది తనేం సాయంచేయగలడు. అసలు రజనీతో ఓసారి మాట్లాడి పద్మినికి నలుగురు పిల్లల్ని ట్యూషన్‌కి కుదిరిస్తే ఎలా ఉంటుంది.

"నువ్వు ఏ క్లాసు పిల్లలకు పాఠాలు చెప్పగలుగుతావు పద్మినీ? ఏ సబ్జెక్టు చెప్పగలుగుతావు?" అడిగాడు.

"తెలుగు నేర్పగలను. తెలుగు మీడియం పిల్లలైతే ఐదోక్లాసు వరకూ చెప్పగలను శివా. నాకు డిగ్రీలు లేకపోయినా చదువు మీద బానే ఆసక్తి ఉండేది. బాగానే చదివేదాన్ని. ఏవిటో ఒక డిగ్రీ సంపాదించుకున్నా బాగుండేది. ఈ వెధవ నాటకాలంటూ వచ్చి ఏమీ సాధించలేకపోయాను." నిరుత్సాహంగా అంది పద్మిని.

ఆమెకి కళ్ళముందు తనకి నాటక రంగంలో వచ్చిన బహుమతులు, పురస్కారాలు, కప్పిన శాలువాలు కనిపిస్తున్నంతసేపూ మనసు చాలా ఆహ్లాదంగా, ఆనందంగా ఉంటుంది. కానీ, ఆర్థిక పరిస్థితి తల్చుకుంటే మాత్రం దుఃఖం వచ్చేస్తుంది. చిన్న వయసులో తను అనాలోచితంగా తీసుకున్న నిర్ణయం పట్ల కోపం వస్తుంది.

"శివా ఎవరింట్లోనైనా వంటమనిషి కావాలేమో చెప్పు నేను చేస్తాను" అంది వసంత.

శివ నవ్వాడు. "ఈ ఊళ్ళో నాలుగొందల మందికైనా అవలీలగా వంటలు చేయగల సమర్థులైన ఆడవాళ్ళు ప్రతి ఇంట్లో ఉన్నారు. నీకెక్కడ అవకాశం దొరుకుతుంది. కాకపోతే లేసు ఫ్యాక్టరీలో ఏదన్నా పని దొరుకుతుందేమో చూస్తాలే. ఇంతకీ మీరు పెట్టుకున్న సంస్థనేం చేయాలనుకుంటున్నారు? ఆవేశంగా బోర్డు పెట్టేశావు. కనీసం ఒక్క కార్యక్రమం అయినా చేయకపోతే అభాసుపాలవుతావు పద్మినీ."

పద్మిని నిట్టూర్చి అంది. "అవును కోపంతో నేను చేయలేనా అనుకున్నాను. కానీ, ఏం చేయాలన్నా డబ్బు కావాలన్న సూత్రం మర్చిపోయాను. కాకపోతే ఎప్పటికైనా నేను నా సంస్థని అభివృద్ధి చేస్తాను. నేనోడిపోను శివా. నేను గెలుస్తాను. ఈ జీవితంతో నేను ముప్పై ఏళ్ళ నుంచీ పోరాడుతున్నాను. ఓడిపోతున్నాను అనిపించినప్పుడల్లా గెలుపు కోసం ఆరాటపడి కొంతైనా గెలుపు సాధిస్తున్నాను. తప్పకుండా గెలుస్తాను" ఆత్మవిశ్వాసంతో అంది.

"మంచిదమ్మా. దేవుడు నీకు సాయం చేయాలని కోరుకుంటున్నాను. మరి నేవస్తాను" అంటూ శివ లేచాడు.

"సరే శివా" అంది పద్మిని.

శివ వెళ్ళిపోగానే అంది వసంత "మనకి ధైర్యం చెప్పడానికి శివలేకపోయి ఉంటే ఏమయేవాళ్ళం అక్కా"

తల పంకిస్తూ అంది పద్మిని. "అవును శివ మంచివాడు మంచి మిత్రుడు" అంటూ గూట్లో ఉన్న అలారం టైం పీసు వైపు చూసి "అమ్మో ఆరవుతోంది. ఈ పిల్ల ఇంకా రాలేదేంటబ్బా" అంది గుమ్మం వైపు నడుస్తూ.

అప్పుడే యవనిక సందుమలుపు తిరిగి ఇంటివైపు వస్తోంది.

హమ్మయ్య అని నిట్టూర్చింది పద్మిని.

"అమ్మా మా స్కూల్లో ఆగస్టు పదిహేను స్వాతంత్ర్య దినోత్సవానికి సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తున్నారట. మా హెడ్ మిస్ట్రెస్ మేడమ్ నిన్ను ఓసారి మాట్లాడమన్నారు" వస్తూనే భుజాన ఉన్న పుస్తకాల సంచి గూట్లో పెడుతూ చెప్పింది యవనిక.

"అలాగా ఏం కార్యక్రమాలు చేస్తున్నారు?" కుతూహలంగా చూసింది పద్మిని.

"చాలా చేస్తారట. దుర్గాబాయి దేశ్‌ముఖ్ జీవితచరిత్రను ప్రదర్శిస్తారట. ఆ విషయం నీతో మాట్లాడాలిట రేపు నువ్వు నాతోపాటు మా స్కూల్‌కి రావాలి" అంది యవనిక కాళ్ళు కడుక్కోడానికి పెరటివైపు వెళుతూ.

పద్మిని సాలోచనగా చూసింది వసంతవైపు. "ఎందుకు రమ్మని ఉంటారావిడ నన్ను. మన యవనికతో ఏదన్నా పాత్ర వేయించడానికి అనుమతి కోసమా? లేక.."

"అంతే అయి ఉంటుందక్కా లేకపోతే నీతో పనేం ఉంటుందావిడకి. ఎప్పుడూ ఇలా రమ్మని చెప్పలేదుకదా" అంది వసంత.

అంతే అయి ఉంటుంది అన్నట్టు తలూపి గుమ్మం దాటి వెళ్ళి గుమ్మం పక్కనే ఉన్న అరుగు మీద కుర్చుంది.

ఎదురుగా ఉన్న వేపచెట్టు మీంచి మంచిగాలి వీస్తోంది. పక్క వీధిలో ఆడుకుంటున్న పిల్లల కేరింతలు వినిపిస్తున్నాయి. పక్కింట్లోంచి వంట చేస్తున్న సూచనగా కమ్మటి ఇంగువపోపు వస్తోంది.

కమ్మటి భోజనం చేసి ఎన్నిరోజులైందో, ఉల్లిపాయ పులుసు, చింతకాయపచ్చడి, ఆవకాయ, ముద్దపప్పు, కమ్మటి పెరుగు, ఇష్టమైన కూరలు కొనడానికి డబ్బేది? అరలీటర్ పాలప్యాకెట్టు తెచ్చుకుంటే యవనికి గ్లాసుపాలు, వసంతకీ, తనకీ రెండు పూటలు టీతాగడానికి సరిపోతున్నాయి. ఆ మధ్య తక్కువలో వస్తున్నాయని, చేతిలో డబ్బులున్నాయని అరబస్తా బియ్యం వేయించుకోడం మంచిదైంది. కనీసం అవన్నా ఉన్నాయి. ఎలా ఈ కష్టాలు గట్టెక్కడం?

వసంత యవనిక తినడానికి అటుకులు పెట్టి వచ్చి పద్మిని పక్కన కూర్చుంది.

"అక్కా నేను అప్పడాలు బాగా చేయగలుగుతాను. అవిచేసి అమ్మితే ఎలా ఉంటుంది?"

"అవన్నీ పట్నాల్లో అయితే ఏమన్నా లాభదాయకం వసంతా. ఈ పల్లెటూళ్ళో ఎవరికి కావాల్సినవి వాళ్ళు చేసుకుంటారుగాని మన దగ్గరకొనే అవసరం ఎవరికుంది?"

"అయితే పట్నం పోదాం పా.. విజయవాడో, హైదరాబాదో వెళ్ళిపోదామక్కా ఇక్కడ మనం ఎంత కష్టపడ్డా ఈ బతుకులింతే. మహాపట్నాల్లో కష్టపడితే కొంతకన్నా ఫలితం ఉంటుంది."

"శివ చెప్పింది విన్నావుగా వసంతా!"

"ఆ, శివ మరీ మనకి పిరికిమందు నూరిపోస్తాడులే. మనం నమ్మకంతో వెళితే తప్పకుండా మనకి మంచి అవకాశాలువస్తాయి."

"ఇంకో రెణ్ణెల్లలో యవనిక పరీక్షలైపోతాయి. అప్పుడాలోచిద్దాం. ఇప్పుడు వెళితే దాని చదువు పాడైపోతుంది. మనకో ఆసరా దొరకాలి. దాన్ని స్కూల్లో చేర్చాలి. చాలా కష్టంకదా" అంది పద్మిని.

వసంత ఏం మాట్లాడలేదు. ఇద్దరూ మౌనంగా అటూ, ఇటూ తిరుగుతున్న మనుషులని చూస్తూ కూర్చున్నారు పశువుల మెళ్ళో మువ్వల సందడి ఉండి, ఉండీ వినిపిస్తోంది. గుంపుగా ఎగురుతున్న పక్షులు కువకువలు సంగీతం పాడుతున్నట్టుగా అనిపిస్తోంది. క్రమంగా చీకట్లు ముసురుకోసాగాయి. లోపలికి వెళ్ళిపోదాం అంటూ పద్మిని లేవబోతుంటే పక్కింటి వాళ్ళ వీధి గుమ్మంలో లైటు వెలగడం పిన్నిగారు వీధివాకిట్లోకి రావడం ఒకేసారి జరిగాయి.

వీళ్ళిద్దరినీ చూస్తు అడిగిందావిడ "ఏమ్మాయిలూ వంటైందా? చీకట్లో కూర్చున్నారేంటి?"

పద్మిని లేచి నిలబడి గోడకున్న స్విచ్ నొక్కి నవ్వుతూ అంది. "ఊరికే చల్లగా ఉందని కూర్చున్నాం పిన్నిగారూ!"

"ఈ మజ్జెన నువ్వేం నాటకాలాడుతున్నట్టు లేవే? ఇంత ఖాళీగా ఎప్పుడూ చూడలా నిన్ను" అందావిడ.

పద్మిని వసంతవైపు చూసింది. "లేకేం పిన్నిగారు పదిహేనురోజులైంది పొన్నూరులో నాటకం వేసొచ్చాంగా" అంది వసంత.

ఆవిడతో అంతకన్నా వివరంగా చెప్పడం ఇష్టంలేదు ఇద్దరికీ ఆవిడసలే ఆకాశవాణి. మనిషి మంచిదే కష్టసుఖాలు తెలిసిన మనిషి కానీ, నోట్లో నువ్వు గింజనానదు. అడిగినవాళ్ళకీ, అడగనివాళ్ళకీ నోటిప్రచారం బాగా చేస్తుంది. ఆవిడ ద్వార పొరపాటున ఇంటి ఓనర్‌కి వీళ్ళకి అవకాశాల్లేవని తెలిసిందంటే అద్దె ఇవ్వరేమో అని ఖంగారుపడి ఇల్లు ఖాళీ చేయమంటుంది.

"అవునేంటి ఏదో బోర్డు పెట్టారు ఇంటి ముందు. నాకు చదవడం రాదుగా. మీ బాబాయిగారు చూసి చెప్పారు. ఏదో ఆడవాళ్ళ నాటకం కంపెనీటగా. ఎందుకమ్మా మీకా కంపెనీలు పాడూనూ. ఏదో వేషం కట్టొచ్చి హాయిగా ఉండక."

పద్మిని గుండెల్లో రాయిపడినట్లైంది. పోయి, పోయి ముందు ఈవిడ కళ్ళనే పడిందే ఖర్మ. తన ప్రయత్నం విజయవంతం అవడం సంగతి అటుంచి ఆదిలోనే ఆటంకాలు ఏర్పడతాయి. ఎలాగో అలా తంటాలు పడి ఈ సంస్థని అభివృద్ధి చేయాలి. ఏం చెప్పాలి

ఈవిడకి. తను చెప్పేది విని అర్థం చేసుకునేంత ఆలోచన ఆమెకు లేదు. ఆవిడకి అర్థం అయేలా చెప్పాలి. ఆలోచిస్తూ వసంతవైపు చూసింది. వసంత తలగోక్కుంటోంది.

"ఏదో సరదాగా అప్పుడప్పుడు ఆడవాళ్ళతో నాటకాలు వేయించాలనుకుంటున్నాం పిన్నిగారూ. బాగుంటుంది కదా అలా" అంది ఆవిడని హుషారుపరచడానికి ప్రయత్నిస్తూ.

"ఏవోలే చట్టబండలు నాకేం తెలుసివన్నీ. మీరు భోజనాలు చేశారా?" అడిగింది పిన్నిగారు.

"లేదండి చేయాలి" అంది వసంత.

"ఉదయం కాస్త పులిహోర చేశాను ఇస్తానుండండి పిల్లకి పెడుదురుగాని" అంటూ ఆవిడ లోపలికి వెళ్ళిపోయింది.

పద్మిని నిట్టూర్చింది.

పిన్నిగారు.. ఆవిడ పేరు ఇంతవరకూ తెలియదు. అందరూ పిన్నిగారు అంటారు. తనూ పిన్నిగారు అనే అంటుంది. యవనిక కూడా పిన్నిగారు అనే అంటుంది. ఆవిడకి చిన్నప్పుడే పదమూడేళ్ళ వయసులోనే పెళ్ళయింది. ఆవిడ భర్త గవర్నమెంటు స్కూల్లో టీచరుగా చేసి రిటైర్ అయారు. వాళ్ళకి ఎనిమంది పిల్లలు. నలుగురు మగపిల్లలు, నలుగురు ఆడపిల్లలు. ఆడపిల్లలని స్కూలు ఫైనల్‌దాకా, మగపిల్లలని డిగ్రీదాకా చదివించారు. అందరికీ పెళ్ళిళ్ళు అయిపోయాయి. ఆవిడకి డెబ్బైపైన ఉంటుంది వయసు. ఇద్దరు కొడుకులు, కోడళ్ళు, మనవళ్ళు, మనవరాళ్ళతో చాలా పెద్దకుటుంబం. వాళ్ళది సొంతిల్లు. పద్మిని వాళ్ళుండే పోర్షను వేరేవాళ్ళది. చాలా పాతకాలం నాటిది. ఆ ఇంటివాళ్ళ పిల్లలు అమెరికా వెళ్ళిపోయారు. ఆయన పోయారు. ఆవిడ రాజమండ్రిలో మరో కొడుకు దగ్గర ఉంటుంది. నెలకి రెండువందలు అద్దె ఇస్తుంది పద్మిని. ఒక్కటే గది పద్మిని తీసుకుంది. పద్మిని పోర్షన్‌కి వెనకవైపు మరో రెండుగదులు, వంటగది ఉంటాయి. అవి వేరే కుటుంబం వాళ్ళు తీసుకున్నారు. పద్మినితో పక్కింటి పిన్నిగారు మాత్రమే అడపాదడపా మాట్లాడుతూ పండగలు, పబ్బాలు వచ్చినపుడు పులిహోరో, చక్కెరపొంగలో, పాయసమో, అరిశెలో ఇస్తూ ఉంటుంది. ఆవిడ చూడడానికి లావుగా, మొరటుగా ఉన్నా మనసు చాలా మంచిది. పక్కనున్న ఆడపిల్లల గురించి చుట్టూ ఉన్నవాళ్ళు తేలిగ్గా మాట్లాడుతున్నా ఆవిడ వీళ్ళ మంచితనం తెలిసిన మనిషిగా ఎప్పటికప్పుడు విమర్శించేవాళ్ళ నోళ్ళు మూయిస్తుండడంతో పద్మిని వాళ్ళు ఆ వీధిలో రెండేళ్ళుగా ఉండగలుగుతున్నారు. సాధారణంగా పల్లెటూళ్ళలో ఒంటరిగా ఉండే ఆడపిల్లల పట్ల చులకన భావం ఉంటుంది పిన్నిగారి అండలేకపోతే ఏమయిపోయేవాళ్ళమో అనుకుంటూ ఉంటుంది పద్మిని.

"వసంతా!" అని పక్కింట్లోంచి పిన్నిగారు పిలుపు విని వసంత ఒక్క అంగలో వస్తున్నా పిన్నిగారు అంటూ ఆవిడ పోర్షనులోకి పరిగెత్తింది. పద్మిని లోపలికి వెళ్ళిపోయింది.

ఐదు నిమిషాల్లో వసంత పెద్ద స్టీలు గిన్నెనిండా పులిహోర, నాలుగు గారెలు తెచ్చింది.

అవి చూసి దీర్ఘంగా నిట్టూర్చింది పద్మిని.

"యవనీ! రామ్మా భోంచేద్దాం" అంటూ వసంత తెచ్చిన స్టీలు గిన్నెలు మీద పెళ్ళి పళ్ళాలకోసం వెళ్ళింది.

యవనిక చదువుతున్న పుస్తకంలోంచి ఓసారి కళ్ళెత్తి ఆ గిన్నెలవైపు చూసి, పుస్తకాలు ఒళ్ళోంచి తీసి పక్కన పెట్టి లేచింది.

పద్మిని చెవుల్లో శివరామ్ మాటలు పదే, పదే వినిపిస్తుంటే మౌనంగా కూర్చున్నదల్లా "రా అక్కా" అన్న వసంత మాటతో కూర్చున్న దగ్గర్నించి లేస్తూ అనుకుంది. రేపట్నించీ మళ్ళీ సమరం మొదలు. కొత్త శత్రువుని వెతుకుతూ.

మర్నాడు యవనికతోపాటు స్కూలుకి వెళ్ళింది పద్మిని.

ప్రార్థన అయిపోయి పిల్లలంతా క్లాసులకి వెళ్ళిందాకా చెట్టుకింద కూర్చుంది హెడ్‌మిస్ట్రెస్ కమలని కలవడం కోసం ఎదురుచూస్తూ.

ప్రార్థన అయిపోగానే పిల్లలంతా బిలబిల్లాడుతూ క్లాసులకి వెళ్ళగానే ఆ ప్రదేశం అంతా నిశ్శబ్దం ఆవరించింది.

చాలా చిన్న ఖాళీ స్థలం. పాతకాలం బిల్డింగ్. ప్రభుత్వ పాఠశాల అనే బోర్డు కూడా ఓ పక్క ఊడిపోయి ఏ క్షణంలోనైనా కిందపడిపోయేలా ఉంది. ప్రహరీగోడ సిమెంటు పోయి మట్టిగోడలు కనిపిస్తున్నాయి. వెల్లవేసి చాలాకాలం అయినట్టుగా గోడలన్నీ మాసిపోయి వికారంగా ఉన్నాయి.

పద్మిని నెమ్మదిగా లోపలికి నడిచి హెడ్‌మిస్ట్రెస్ అని ఉన్న గదివైపు నడిచింది. పాతబడి, అక్కడక్కడా చినిగిన తెర గుమ్మానికి వేళ్ళాడుతోంది. బైట స్టూలు మీద కూర్చున్న ప్యూన్ పద్మినిని చూసి అమ్మగారి కోసమా అని అడిగాడు. పద్మిని తలూపింది.

''వెళ్ళండి ఎవరూ లేరు'' అన్నాడు.

పద్మిని నెమ్మదిగా తెరపక్కకి జరిపి లోపలికి అడుగుపెట్టింది.

గది చిన్నదైన పరిశుభ్రంగా ఉంది. పెద్ద చెక్క టేబుల్ వెనక మరో చెక్క కుర్చీలో కూర్చుని ఉంది కమల. ఆవిడ వెనకాల ఒక కిటికీ. ఆ కిటికీ బైట పెద్ద వేపచెట్టు. చల్లనిగాలి ఆహ్లాదంగా వీస్తోంది. గోడలకి గాంధీ, నెహ్రూ, ఇందిరాగాంధీ ఫోటోలున్నాయి. ఆవిడ టేబుల్ మీద పేపర్ వెయిట్, ఒక ఫోన్ వ్రాసుకునే అట్టపెన్నులున్న స్టాండ్, చిన్న పతాకం రెపరెపలాడుతోంది.

పద్మినిని చూస్తూనే ''ఓ పద్మినీ... రండి రండి'' అంది చిరునవ్వుతో.

పద్మిని లోపలికి నడిచి ''నమస్కారం మేడమ్ మీరు రమ్మన్నారని చెప్పింది మా అమ్మాయి'' అంది.

''అవును.. రండి కూర్చోండి'' టేబుల్ దగ్గరగా అతిథులకోసం వేసిన కుర్చీ చూపించింది. పద్మిని కూర్చుంది.

''మీ నాటకాలు నేను అప్పుడప్పుడూ చూస్తుంటాను. మీరు మంచి ఆర్టిస్టు'' అంది ఆవిడ.

పద్మిని నవ్వింది.

యవనిక తల్లి ఒక నాటక కళాకారిణి అని ఆ స్కూల్లో కమలతోపాటు మిగతా టీచర్లకి కూడా బాగా తెలుసు. ఆ ఊళ్ళో నాటక ప్రదర్శన జరుగుతుందంటే అందరూ ఆ ప్రదర్శన చూడటానికి వస్తుంటారు. నాటకం అంటే అభిమానం, గౌరవం ఉన్న ఊరది. అందుకు కారణం చక్రధరం తన సంస్థ ద్వార తరచూ ప్రదర్శించే నాటకాలు. అతను ఉపయోగించే ట్రిక్స్. కాబట్టి కళాకారులందరూ కూడా అందరికీ తెలుసు. అందులో పద్మినిని వ్యక్తిగతంగా తెలియకున్నా ఓ నటిగా మాత్రం చాలామంది అభిమానిస్తారు.

''మన ఊరికి కొత్తగా ఎం.ఎల్.ఏ గారు వచ్చారు. ఈ మధ్య జరిగిన ఎలక్షన్స్‌లో ఆయన ఈ ఊరివాడేట. మేమంతా ఆయన్ని కలిసి స్కూలు అభివృద్ధి గురించి మెయిన్‌టెనెన్స్ గురించి మాట్లాడాం. చూశారుగా ఎలా ఉందో బిల్డింగ్. ఏ క్షణంలోనైనా ఉధృతంగా వర్షం కురిస్తే పడిపోవటానికి సిద్ధంగా ఉంది. ఇంతకు ముందు మేము ఎంతమందికి చెప్పినా ఎలాంటి ప్రయోజనం కనిపించలేదు. కాకపోతే ఆఅన చెల్లెలో ఎవరో ఒకప్పుడు ఈ స్కూల్లోనే కొంతకాలం చదువుకుందిట. ఆ అభిమానంతో కాబోలు మా వినతిని ఒప్పుకున్నారు. ఈలోగా ఏదన్నా కార్యక్రమం చేసి ఆయన్ని గెస్టుగా పిలవాలని సంకల్పించి స్కులు వార్షికోత్సవం చేయాలని అనుకున్నాం. ఈ సందర్భంగా కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలు చేయాలనుకుంటున్నాం. మా టీచర్ ఒకావిడ దుర్గాబాయి దేశ్‌ముఖ్ జీవిత చరిత్ర నాటకంగా రాశారు. ఆ నాటకం మా స్కూలు పిల్లలతో వేయించాలి ఈ విషయంలో మీ సహాయం కావాలి'' అంది కమల.

''నేనేం సహాయం చేయగలను మేడమ్'' అంది పద్మిని.

"మేము మొదటిసారి నాటకం వేయిస్తున్నాము మా టీచర్ ఒకావిడ డైరెక్ట్ చేస్తానన్నారు. కానీ, మీలాంటి అనుభవజ్ఞులు పర్యవేక్షిస్తే మేము ఏవన్నా పొరపాట్లు చేసినా సరిదిద్దుకునే అవకాశం ఉంటుందని. మీరు ఎంతోకాలంగా నాటకరంగంలో ఉంటున్నారు. మీరు ఆడిన నాటకాలెన్నో మేము చూశాము. అందుకే మీ సహాయం కోరుతున్నాం" ఆవిడ మాటల్లో వినిపిస్తున్న అర్థింపు, తన పట్ల గౌరవం గమనించిన పద్మిని పొంగిపోయింది. ప్రత్యేకంగా ఇలా పిలిచి అడుగుతున్నారంటే ఆమెకి తనంటే సదభిప్రాయం ఉన్నట్టు. ఎంతో మర్యాద ఉన్నట్టు. కానీ, వీళ్ళేం డబ్బులిచ్చేలా లేరు. పైనుంచి తనే నాటకం రిహార్సల్స్ ఉన్నప్పుడల్లా రిక్షాకి పెట్టుకుని రావాలి. రాగలదా?

ఆవిడ పద్మిని ఆలోచన గమనించినదానిలా అంది. "ఏమీ అనుకోకండి. మీకు మేమేం పారితోషికం ఇవ్వలేకపోయినా రిహార్సల్స్‌కి రావడానికి చార్జీలు మాత్రం ఇస్తాం. ఆ విషయంలో మీరు అనుమానించనవసరంలేదు."

పద్మిని సిగ్గుపడింది. ఆవిడ తన మొహంలో భావాలు చదివేస్తోంది. తన పేదరికం ఆవిడకి తెలిసిపోతోంది. కొంచెం అవమానకరంగా కూడా అనిపించింది. వెంటనే తనలాంటి వాళ్ళు ఇలాంటి విషయాల్లో మొహమాట పడితే ఏం జరుగుతుందో ఆమెకి అనుభవపూర్వకంగా తెలుసు. సన్నగా నిట్టూర్చి అంది.

"తప్పకుండా నా చేతనైన సాయం చేస్తాను. మీరు రిహార్సల్ ఉన్నపుడు కబురుపెట్టండి తప్పకుండా వస్తాను."

"థాంక్స్ పద్మినిగారూ! నేను యవనికతో మీకు కబురు చేస్తాను" అంటూ కుర్చీ కొంచెం వెనక్కి జరుపుకుని డెస్క్‌లోంచి కాగితాల కట్ట తీసిస్తూ అంది. "ఇది స్క్రిప్ట్. మీరోసారి చదివితే మీకు విషయం తెలుస్తుంది."

పద్మిని ఆ కాగితాల కట్ట అందుకుంది. "ఎంతసేపు వేస్తారు నాటకం?" అడిగింది.

"ఓ గంట."

"ఈ స్క్రిప్ట్ చూస్తుంటే పెద్దగా అనిపిస్తోంది. గంటదాటుతుందేమో"

"లేదులెండి కుదిస్తాం. గంటకు సరిపడా కుదిస్తాం. మీరు చదివాక ఓరోజు కాస్సేపు కూర్చుని ఆవిడా, నేనూ మీరూ కలిసి గంటలకి సరిపోయేలాగా చేద్దాం."

తలాడించింది పద్మిని. "సరేనండి వస్తాను మరి" అంటూ లేచింది.

"నేను కబురంపగానే వచ్చినందుకు థాంక్స్" అంది కమల.

"ఎంతమాట. మీకెప్పుడు ఏం కావాలన్నా కబురు చేయండి. ఇంతకీ మా అమ్మాయి ఎలా చదువుతోంది?"

"చాలా బుద్ధిమంతురాలు. చక్కగా చదువుకుంటుంది."

పద్మినికి ఆ మాటకి ఆమె మనసు కడలి తరంగంలా ఎగిసిపడింది.

"థాంక్యూ మేడమ్" అంది.

ఆవిడ కుర్చీలోంచి లేచి గుమ్మం దాకా పద్మిని వెనకాలే వచ్చింది.

వస్తానండి. పద్మిని బైట నిలబడి చేతులు జోడించి సెలవు తీసుకుంది.

ఇంటికి వెళ్తూ ఆలోచిస్తూనే ఉంది పద్మిని.

**అదొక చిన్న పెంకుటిల్లు. చుట్టూ మట్టిగోడ ప్రహరీలా వచ్చి** చెక్కగేటు ఉంది. గేటు తోసుకుని లోపలికి వెళితే చిన్న ఖాళీ స్థలం ఆవుపేడతో కలిపిన చిక్కటి కళ్ళాపి చల్లి అందంగా ముగ్గేసి ఉంది. ద్వారానికి రెండువైపులా చిన్న అరుగులు, రెండు మెట్లు ఎక్కి

గడపదాటి లోపలికి వెళితే చల్లగా చలివేంద్రంలా ఉంది. అది నాపరాళ్ళ గచ్చు. గచ్చు శుభ్రంగా కడిగి ఉంది. ఓ మూల చాప పరిచి ఉంది. అదికాక రెండు ఇనపకుర్చీలు మడిచి గోడకి ఆనించి ఉన్నాయి. గోడకి ఒక వెంకటేశ్వరస్వామి సతీసమేతంగా ఉన్న క్యాలెండర్, మరోటి రాధాకృష్ణుల క్యాలండర్ ఉన్నాయి. అది దాటి లోపలికి వెళితే పాతకాలం నాటి ఇనపమంచం, దానిమీద ఓ పక్కగా పెట్టిన నాలుగు బొంతలు, నాలుగు దిళ్ళు, మంచం మీద పరుపు పరిచి, పరిశుభ్రమైన దుప్పటితో కాస్సేపు నడుం వాలుద్దామా అనిపించేలా ఉంది. ఆ గదిలోనే మరో మూల చిన్న చెక్క టేబుల్ దాని ముందు ఒక చెక్క కుర్చీ. టేబుల్ మీద అలారం టైం పీసు, పిల్లల పుస్తకాలు ఉన్న టేబుల్ కూడా దుమ్ము లేకుండా శుభ్రంగా ఉంది.

అదికూడా దాటి వెళితే వంటగది, వంటగదికి అవతల పెరడు, పెరట్లో తులసికోట, రెండు కనకాంబరం మొక్కలు, నాలుగు బంతిమొక్కలు నిండుగా పూలతో ఆ పెరటికి శోభనిస్తున్నాయి.

ఈశాన్య మూల పెరడు దాని చుట్టూ సిమెంటుతో గచ్చు ఉంది. ఒక ప్లాస్టిక్, ఒక ఇత్తడి చెంబులు ఉన్నాయి. మరో పక్క సిమెంటురేకుల కప్పుతో బాత్‌రూం, లావెట్రీ ఉన్నాయి. ఆ పరిసరాలు, ఆ ఇల్లు చూస్తుంటే ఇంటిని చూసి ఇల్లాల్ని చూడాలి అనే సామెత ఉంది. ఆమె అంతకుముందే స్నానం చేసి, సంధ్యాదీపం పెట్టినట్టు గూట్లో దేవుడి పటాల ముందు వెలుగుతున్న దీపం చెబుతోంది. ఆమె ఎరుపు మీద పసుపు పూలున్న వాయిల్ చీర కట్టుకుని, ఎరుపు జాకెట్టు వేసుకుంది. పొడుగ్గా, ఒత్తుగా ఉన్న జుట్టుకి కొబ్బరి నూనె రాసి, గట్టిగా అల్లుకున్న జడబిళ్ళలు, బిళ్ళలుగా అందంగా ఆమె కూర్చున్న పీట మీదనుంచి కింద గచ్చుమీదకి జారి ఉంది. చామనఛాయగా ఉన్నా నల్లని కాటుక కళ్ళతో, నుదుట కుంకుమతో కళగా ఉంది. మెడలో పచ్చతాడుకి మంగళసూత్రాలు, గొంతుకి చుట్టుకుని నల్లపూసలు, ఆ పూసల మధ్యలో నాలుగు చిన్న, చిన్న బంగారు గుళ్ళు.. పదహారణాల తెలుగింటి ఆడపడచులా చూడగానే మంచి గృహిణి అనిపించేలా ఉంది ఆమె.

వేగిన దొండకాయ ముక్కల్లో ఉప్పు, కారం వేసి, మూకుడు దించి పక్కన పెట్టింది. అప్పటికే చారుకి కావలసిన దినుసులన్నీ వేసి సిద్ధంగా పెట్టుకున్న స్టీలు గిన్నె స్టవ్ మీద పెట్టి పీట మీంచి లేచింది. అప్పుడే గేటు చప్పుడైంది. ఆమె భుజం మీదుగా వెనక్కి వీధి గుమ్మం వైపు చూసింది. శివరామ్ గేటు తీసుకుని వచ్చి మళ్ళీ గేటు వేసి లోపలికి వస్తున్నాడు. ఆమె గిరుక్కున వెనక్కి తిరిగి వంట గది గుమ్మంలోంచి మధ్య గదిలోకి, మధ్యగదిలోంచి, వీధి గదిలోకి వచ్చింది. లోపలికి వచ్చిన భర్త చేతిలోంచి క్యారేజీ తీసుకుని పలకరింపుగా నవ్వింది.

అతను కూడా నవ్వి "ఉల్లిపాయ వేగిన కమ్మటి వాసనొస్తోంది. దొండకాయ ఉల్లిపాయ ముక్కలు కలిపి వేయించావా?" అనడిగాడు.

ఆమె అవునన్నట్టు తల ఊపి, మంచి నీళ్ళు తెస్తాను అంటూ లోపలికి వెళ్ళబోయింది.

"ఒద్దులే రజనీ నేను అలా పద్మిని వాళ్ళింటికి వెళ్ళొచ్చాను. టీ కూడా తాగేశాలే" అన్నాడు.

"అలాగా.. ఎలా ఉంది పద్మిని?" అడిగింది రజని.

"ప్చ్.... " పెదవి విరుస్తూ అన్నాడు. "ఎలా ఉంటుంది స్వాభిమానంగల పిల్ల. ఏదో నెట్టుకొస్తోంది." అంటూ షర్ట్ విప్పి మధ్య గదిలోకి నడిచాడు. తలుపు పక్కగా గోడకి ఉన్న హ్యాంగర్‌కి షర్ట్ తగిలించి రజని అందించిన లుంగీ తీసుకుని పెరట్లోకి నడిచాడు. అతను కాళ్ళూ, చేతులు కడుక్కుని వచ్చేలోగా రజని వంటగది అలమరలో ఉన్న ప్లాస్టిక్ డబ్బాలోంచి మిక్చర్ తీసి ప్లేటులో వేసింది. గ్లాసుతో మంచినీళ్ళు కూడా తీసుకుని వచ్చి మధ్యగదిలో టేబుల్ మీద పెట్టి అలారం టైం పీసు చూసింది. సమయం ఏడు కావస్తోంది.

పిల్లలింకా కనిపించకపోవడంతో తిరిగి వంటగదిలోకి వచ్చి మరుగుతున్న చారు స్టవ్ మీంచి దింపి, పోపువేయడానికి చిన్న మూకుడు పెట్టింది. ఇంతలో శివరామ్ టవల్‌తో మొహం తుడుచుకుంటూ వచ్చాడు.

మధ్యగదిలోకి వెళ్ళి అడిగాడు "పిల్లలింకా ట్యూషన్ నుంచి రాలేదా?"

రజని పోపు వేసి చిటపటలాడుతున్న ఆవగింజలు, జీలకర్ర ఘుమ, ఘుమలాడుతున్న ఇంగువ చారులోకి వంచింది. స్టవ్ ఆర్పేసి వచ్చి "వచ్చే టైం అయిందిలెండి" అంది.

"నీ ట్యూషన్ పిల్లలు వెళ్ళిపోయారా?" అడిగాడు శివరామ్ ఆమె అందించిన మిక్చర్ అందుకుని కొద్దిగా నోట్లో వేసుకుంటూ.

"ఆహా వచ్చి వెళ్ళారు. పిల్లలు ఎంత బాగా చదువుతున్నారో" అంది రజని.

"పద్మిని కూడా తెలుగు చెప్పగలదట ఎవరన్నా నలుగురు పిల్లలుంటే చెప్పకూడదూ?" అన్నాడు శివరామ్.

రజని ఆలోచిస్తూ అంది. "నిన్ననే కాంతమ్మగారు కబురు పెట్టారండి ఇంకా నలుగురు పిల్లలున్నారు పంపించనా అని. నేనే మరీ హైరానా అవుతుందేమో అని ఆలోచించి చెప్తానన్నాను."

"ఐతే ఇంకేం వాళ్ళని పద్మిని దగ్గరకు పంపిద్దాం" అన్నాడు.

"అలాగే దానికేం? నాకున్న ఈ పదిమంది పిల్లలు చాలు. చిన్న క్లాసు పిల్లలు కాబట్టి తెలుగు, ఇంగ్లీష్ నేర్పగలుగుతున్నాను. మన పిల్లల ట్యూషన్ ఫీజులకి సరిపోతోంది" అంది రజని.

రజని స్కూల్ ఫైనల్ పాసయింది. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఉన్నప్పుడు పెళ్ళయింది. కాపురానికి వచ్చిన దగ్గర్నుంచీ అత్తగార్నీ, మావగార్నీ ఒక ఆడపడుచునీ మర్యాదగా చూసుకుంటూ పొందిగ్గా కాపురం చేసుకుంది. శివరామ్, రజని దంపతులకి ఇద్దరు పిల్లలు. పెద్దవాడు ఏడు, రెండోవాడు అయిదు చదువుతున్నారు. ఆ ఊళ్ళో ఉన్న ఒకే ఇంగ్లీష్ మీడియం స్కూల్లో వేశాడు శివరామ్. వాళ్ళిద్దరికీ లెక్కలు, సైన్సు చెప్పడానికి ఈ మధ్యే ట్యూషన్ కుదిర్చాడు. నెలకి ఇద్దరికీ కలిపి నాలుగువందలు ట్యూషన్ ఫీజు ఇవ్వాల్సి వస్తోంది. రజని నాలుగో తరగతి పిల్లలవరకూ ఇంగ్లీషు, తెలుగు నేర్పిస్తోంది. నెలకి పదిమంది పిల్లలకి కలిపి పదిహేనువందల రూపాయలు ఆమె సంపాదించడంతో నాలుగు వందలు పిల్లల ట్యూషన్‌కి అయినా శివరామ్‌కి అది అదనపు భారంగా అనిపించడంలేదు. అదికాక రజని చీరలకి ఫాల్స్ కుడుతుంది, కొంగులు కుడుతుంది. కొద్దిగా ఎంబ్రాయిడరీ కూడా చేస్తుంటుంది. పండగలు వచ్చినప్పుడు చుట్టుపక్కల ఆడవాళ్ళు కొత్త చీరలు ఫాల్స్ కుట్టడానికి ఇస్తుంటారు. ఒకళ్ళిద్దరు మధ్య మధ్య ఎంబ్రాయిడరీ కూడా చేయించుకున్నారు. అందులో కొంత సంపాదిస్తుంటుంది. ఈ విధంగా అనుకూలవతి అయిన భార్యనుంచి సహకారం లభిస్తుండడంతో శివరామ్‌కి జీవితం పెద్ద సమస్యగా తోచడంలేదు. ఎటొచ్చీ అతనికిష్టమైన నాటక రంగంలోనే స్వార్థపరుడైన చక్రధరం ద్వారా ఆశించినంత ప్రోత్సాహం లభించడం లేదన్న అసంతృప్తి మాత్రమే అతన్ని అప్పుడప్పుడూ బాధిస్తుంటుంది.

శివరామ్, రజనిలది మెత్తటి మనసు. ఎవర్ని నొప్పింపక తానొవ్వక అన్నట్టు మసలుకుంటుంటారు. చుట్టుపక్కల వాళ్ళకే కాక, ఆ ఊళ్ళో తెలిసిన వాళ్ళందరి దగ్గరా మంచి దంపతులుగా పేరు తెచ్చుకున్నారు. పిల్లల్ని కూడా తనకు తోచినంతలో ఒక క్రమశిక్షణతో పెంచుతోంది రజని. నిజానికి ఆమెదివింది స్కూల్ ఫిఅనల్ అయిన డిగ్రీ చదివినవాళ్ళకి ఏమాత్రం తీసిపోని తెలివితేటలు, సంసారాన్ని గుట్టుగా లాక్కొచ్చే చాకచక్యం ఆమెకి దేవుడిచ్చిన వరాలుగా అబ్బాయి. అత్తగారు, మావగారు ఒకరొకరుగా పోయి సుమారు ఏడాది దాటుతోంది. అప్పటిదాకా సొంత అమ్మా, నాన్నల్ని చూసుకున్నట్టే చూసుకుని పక్షవాతంతో రెండేళ్ళు మంచాన తీసుకున్న మావగారికి చేయని సేవ అని లేకుండా అన్ని సేవలూ చేసింది. ఆమె పెళ్ళినాటికి ఆడపడచు పధ్నాలుగేళ్ళ పిల్ల. ఆ పిల్లని కూడా ఎంతో బాధ్యతగా

చూసుకుని ఇరవై ఏళ్ళకి మంచి సంబంధం చూసి పెళ్ళిచేసి పంపించారు భార్యాభర్తలు. అటు అత్తమావలు, ఇటు ఆడపడుచు కూడా రజనిని ఏనాడూ పల్లెత్తి ఒక్కమాట అనలేదు. అనే అవకాశం రజని వాళ్ళకివ్వలేదు కూడా.

శివరామ్ తండ్రిది కూడా చిన్న ఉద్యోగమే అవడంతో ఆయనకి పెన్షన్ కూడా లేకపోవడంతో శివరామ్ ఒక్కడి సంపాదనతోటే గడిచేది. అప్పులు చేస్తూ, గడిపేసాడు. ఆ అప్పులన్నీ రజని కూడబెట్టిన డబ్బులద్వారా తీర్చేసుకున్నారు. అందరికన్నా ధనవంతుడు రూపాయి కూడా అప్పులేనివాడు అనే సూత్రాన్ని నమ్మిన రజని ఇంక అప్పుచేయద్దు అని భర్తకి చెప్పేసింది. ఏనాడూ నాకీ చీరకావాలి, ఈ నగ కావాలి అని శివరామ్‌ని కోరలేదు. కానీ, శివరామ్‌కే ఒక కోరిక రజనికి ఒకసూత్రం గొలుసు, ఒక నల్లపూసల గొలుసు ఏనాటికైనా కొనాలని అతని వాంఛ. ఆ విషయం రజనికి మాత్రం తెలియనివ్వలేదు. ఏనాటికైనా ఆమెకి తెలియకుండా అమాంతం ఆ నగలు తెచ్చిచ్చి క్షణంలో ఆమె కళ్ళల్లో మెరిసే మెరుపుల్ని చూడాలన్నదే అతని ఆశ. చాలాసార్లు అతనికి అనిపిస్తుంటుంది. సాయంకాలాలు ఆ పనికిమాలిన నాటకాల కోసం ఏదన్నా పార్ట్ టైం చేద్దామా అని కానీ, మనిషికి అంతర్గతంగా ఉండే ఒక తెలియని తృష్ణ అతనిలో ఉండడం వలన అతను ఆ మైకంలోంచి బైటపడలేక తన ఆలోచనని కార్యరూపంలో పెట్టలేకపోతున్నాడు.

గేటు చప్పుడవడంతో రజని వీధిగుమ్మంలోకి వచ్చి గేటులోపలికి వస్తున్న పిల్లలిద్దరినీ చూసి గడపదాటి బైటకి అరుగుమీద నిలబడింది. వీధిలైట్లు వెలుగుతున్నాయి, అంతేకాక చుట్టుపక్కల ఇళ్ళల్లోంచి విద్యుద్దీపకాంతి వీధిలోకి ప్రసరిస్తూ పరిసరాలను కాంతిమయం చేస్తోంది. గళ్ళచొక్కాలు, సిమెంట్ కలర్ నిక్కర్లు వేసుకున్న సుధామ, సుధీర్‌లు పరిగెత్తుకుంటూ వచ్చి చాచిన చేతులకి వాళ్ళ భుజాలకున్న బ్యాగులు అందించారు. బ్యాగులతోపాటు వాళ్ళిద్దరినీ కూడా చెరోచేత్తో పొదవి పట్టుకుని లోపలికి తీసుకువస్తూ అడిగింది. "ఏం నాన్నా ఇవాళ ఆలస్యమైందేం?"

"మా టీచర్ గారి పుట్టినరోజని మాకు కూడా పార్టీ ఇచ్చారమ్మా" చెప్పాడు పెద్దవాడు సుధామ.

"అలాగా ఏం తిన్నారు?" అడిగింది బ్యాగులు గోడకున్న మేకుకి తగిలిస్తూ.

"కేకుముక్కలు, మిక్చర్, బజ్జీలు పెట్టారు" చెప్పాడు సుధీర్.

"మీ టీచర్ గారు కేకు కట్ చేశారా ఏంటి?" నవ్వుతూ అడిగాడు శివరామ్.

"అవును నాన్నా వాళ్ళింట్లో ఎవరి పుట్టినరోజైనా కేకు కట్ చేస్తారుట."

శివరామ్ భార్యవైపు అనుమానంగా చూస్తూ "వాళ్ళు క్రిస్టియన్లా ?" అనడిగాడు.

రజని తలూపుతూ "ఆయన పేరు జాన్సన్ ఏలూరు మిషనరీ స్కూల్లో చదువుకున్నారు" అంది.

శివరామ్ పిల్లలిద్దర్నీ దగ్గరకి తీసుకుని నుదుటి మీద ముద్దుపెట్టుకుంటూ" వెళ్ళి బట్టలు మార్చుకుని రండి" అన్నాడు.

"హోం వర్క్‌లు చేసేశారా" అడిగింది రజని.

"మొత్తం చేశామమ్మా" అన్నాడు సుధీర్.

"సరే హాయిగా అన్నాలు తిని పడుకోండి" అంది రజని.

అలాగే అంటూ ఇద్దరూ బట్టలు మార్చుకోడానికి వెళ్ళిపోయారు.

"అయితే ఆ పని చెయ్యి రజనీ. రేపే కాంతమ్మగారితో మాట్లాడి ఆ పిల్లలని పద్మిని దగ్గరకు పంపించు" అప్పటిదాకా సాగిన సంభాషణ ముగిస్తూ అన్నాడు శివరామ్.

"అలాగే దానికేం భాగ్యం. కాకపోతే ఆ పిల్లలకి పద్మిని ఇల్లు ఓసారి చూపించాలికదా వాళ్ళని తీసుకుని నేనుకూడా ఓసారి వెళ్ళొస్తాను పలకరించినట్లుగా ఉంటుంది" అంది రజని.

వెళ్ళిరా కాస్త ధైర్యంగా ఉంటుంది"

"రండి భోజనాలు వడ్డిస్తాను" అంటూ రజని వంటగదిలోకి దారితీసింది.

యవనిక స్కూల్లో హెడ్మిస్ట్రెస్ అప్ప చెప్పిన దుర్గాబాయ్ దేశ్ముఖ్ జీవిత చరిత్ర నాటకాన్ని పద్మిని చాలా సీరియస్‌గా చదివింది.

నాటకం ట్రూప్‌కి కేటాయించిన సమయం ఒక గంట. అదికూడా ఎంతో చర్చ తర్వాత గంట సమయం కేటాయించగలిగానని చెప్పింది కమల. కాకపోతే రాసినావిడ నాటకంలా కాక మరో చరిత్రలా రాయడం వలన రెండుగంటలు దాటేలా ఉంది నాటకం. పద్మిని రెండు రోజులు కూర్చుని మొత్తం నాటకాన్ని నాలుగు భాగాలుగా విభజించి గంటకు కుదించింది. దుర్గాబాయి బాల్యం, ఆమె వివాహం, ఆమె సామాజిక సేవ, ఆమె రాజకీయ సేవ, గాంధీ, నెహ్రూలతో ఆమెకి ఉన్న అనుబంధం అంతా కలిపి కుదించిన నాటకం పట్టుకుని యవనిక స్కూలుకి బయలుదేరింది.

వసంత కూడా వస్తాననడంతో ఇద్దరూ ఇంటికి తాళం వేసి బయలుదేరారు. వాళ్ళు వీధి మలుపు తిరుగుతుండగానే రజని రిక్షాలోంచి దిగడం, ఆమె వెనక ఇద్దరు పిల్లలని చూసి ఆగిపోయారిద్దరు. అంతకు ముందు రజనితో పరిచయం ఉండడం వలన ఆమెని చూడగానే పద్మిని ఆనందంగా పలకరించింది "బాగున్నావా రజనీ.." అంటూ.

" బాగున్నాను పద్మినీ! ఎక్కడికో వెళ్తున్నట్టున్నావే" అంది రజని.

"యవనిక స్కూల్‌కి వెళుతున్నాను" అంటూనే తాళం తీసి లోపలికి రండి అంటూ వాళ్ళని ఆహ్వానిస్తూ తానూ లోపలికి నడిచింది పద్మిని.

వసంత ఆ పిల్లలవైపు చూస్తూ "వీళ్ళెవరక్కా?" అనడిగింది రజనిని.

"దీనిపేరు హరిప్రియ, దానిపేరు కృష్ణప్రియ" అంటూ ఆ పిల్లలిద్దరినీ పరిచయం చేసి పద్మినిని చూపిస్తూ వాళ్ళతో అంది రజని "ఈవిడే రేపట్నించి మీకు తెలుగు నేర్పే టీచరుగారు."

పద్మినికి ఆ మాట వినగానే బోలెడంత ఆశ్చర్యంతో పాటు చాలా ఆనందంగా అనిపించింది.

"ఏంటి రజనీ?" అంది అర్థోక్తిగా చూస్తూ.

రజని అంది "అవును పద్మినీ నాకు అసలు తీరడంలేదు. వీళ్ళిద్దరూ తెలుగునేర్పమంటున్నారు. అందుకే నీదగ్గరకు తీసుకొచ్చాను. వీళ్ళతో పాటు రేపు మరో ఇద్దరు పిల్లలొస్తారు."

పద్మిని వాళ్ళని చూస్తూ అడిగింది "ఏం చదువుతున్నారమ్మా మీరు?"

కృష్ణప్రియ చెప్పింది. "మూడోతరగతి"

"ఇద్దరూ కవలలా?" రజనిని చూస్తూ అడిగింది పద్మిని.

అవును అన్నట్టు తలూపుతూ ఒకేలా ఉన్నారుగా అంది.

"అదే చూస్తున్నాను" నవ్విద్మి పద్మిని.

వసంత "టీ పెట్టనక్కా?" అంది పద్మినితో.

రజని కల్పించుకుని "ఇప్పుడేం వద్దు వసంతా! మీరెక్కడికో వెళ్తున్నారు కదా బయలుదేరండి వీళ్ళకి ఇల్లు చూపిద్దామని తీసుకొచ్చాను" అంటూ "రేపట్నించీ రమ్మంటావా పద్మినీ వీళ్ళని?" అనడిగింది.

పద్మిని టైం చూస్తూ "ఇంకా ఒంటిగంటేగా వీళ్ళకివాళే ప్రారంభిస్తాను. ఓ అరగంట చెప్తాను నీతో తీసుకెళ్ళు రేపట్నించీ వాళ్ళు వస్తారు" అంది.

"సరే అయితే" అంటూ పిల్లలతో అంది "వెళ్ళి చదువుకోండి."

వాళ్ళు పద్మిని దగ్గరగా వచ్చారు.

వసంతా, రజనీ పెరట్లోకి వెళ్ళారు. ఎండ చురుగ్గా ఉన్నా జామచెట్టుకింద నీడగా ఉంది. దానిమీదకి పక్కింటి మావిడి చెట్టు కొమ్మలనీడ కూడా పడి మరింత చల్లగా ఉండడంతో ఇద్దరూ జామచెట్టుకిందకి చేరారు.

"నువ్వేం చదువుకున్నావు వసంతా? " అడిగింది రజని వసంత చెట్టుకింద పరిచిన జంపకానా మీద కూర్చుంటూ.

"నేనేం చదువుకోలేదక్కా! తినడానికి తప్ప ఇంకెందుకూ పనికిరాను. ఏంటో ఈ బతుకు పద్మినక్క లేకపోయి ఉంటే ఎప్పుడో పోయేదాన్ని" అంది వసంత కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటే.

"ఛ అంతమాటనుకులే! దేనికీ పనికిరాకపోవడమేం పచ్చళ్ళవీ బాగా చేస్తావుటగా ఆయన చెప్పారు. రాబోయేది ఊరగాయలకాలమేగా ఎవరన్నా సాయం కావాలని అడిగితే నీకు చెబుతాలే పదో పరకో ఇచ్చినా చాలుగా" అంది రజని.

"ఏదోలే నా చేతిఖర్చులన్నా వెళ్ళిపోతే చాలు అలాంటిదేమన్నా ఉంటే చెప్పు నీకు ఋణపడి ఉంటాను" అంది వసంత దీనంగా.

"ఊరుకో వసంతా అంత ప్రాధేయపడతావేం" ఓదార్చింది రజని.

ఇద్దరూ కాసేపు పిచ్చాపాటీ మాట్లడుకునేలోగా పద్మిని పిల్లలకి వేమన పద్యాలతో తెలుగు క్లాసులకి శ్రీకారం చుట్టింది.

శ్రావ్యంగా, శృతిబద్ధంగా ఆమె వేమన శతకాలు పాడుతుంటే లోపల్నుంచీ వినిపిస్తున్న ఆమె తీయని స్వరం వింటూ ఎంత తీయటి గాత్రమిచ్చాడు ఈమెకి భగవంతుడు అనుకుంది రజని.

అరగంట తరువాత పిల్లలతో పాటు పెరట్లోకి వచ్చిన పద్మిని రజనితో అంది "స్పష్టమైన పలుకు రజనీ వీళ్ళది. ముచ్చటైన పిల్లలు"

రజని నవ్వుతూ లేచి నిలబడి పిల్లల్ని అడిగింది "టీచరమ్మగారు ఎలా ఉన్నారు? నచ్చారా?"

వాళ్ళిద్దరూ గబగబా నచ్చిందన్నట్టు తలూపారు.

వసంత కూడా లేచి జంపకానా దులిపి మడతపెట్టి చెట్టుకానించి పెట్టింది.

"కొంచెం టీ తాగి వెళ్ళు రజనీ" అంది పద్మిని స్టవ్ దగ్గరగా నడుస్తూ.

"ఒద్దు పద్మినీ" అంటూన్న రజని మాటలు వినిపించుకోకుండా స్టవ్ వెలిగించి టీకి నీళ్ళు పెట్టింది.

రజని మాట్లాడలేదు. కాసేపట్లో అందరూ టీ తాగాక కలిసి బైటకి వచ్చారు. వసంతా, పద్మినీ స్కూల్ వైపు వెళుతుంటే, రజని పిల్లల్ని తీసుకుని రిక్షా ఎక్కింది.

వీళ్ళు వెళ్ళేసరికి కమల టీచర్స్‌తో మీటింగ్‌లో ఉంది. వసంతా, పద్మిని స్కూలు ఆవరణంతా కలయ తిరిగి నందివర్ధనం పూలుంటే కోసుకున్నారు. స్కూలు వెనకభాగంలో దాదాపు కూలిపోతున్నాయి రెండు బాత్‌రూము అవి కడిగి చాలాకాలమైందన్నట్టు చాలా అసహ్యంగా ఉన్నాయి.

"అయ్యో పిల్లలు ఇవే వాడుకుంటారా?" ఆందోళనగా అడిగింది వసంత.

"ఇది గవర్నమెంటు స్కూలు. మన ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైనవెన్నో ఉన్నాయి. అందులో ఈ స్కూలు ఒకటి. ఏమో త్వరలో దీనికి మోక్షం కలుగుతుందని పెద్దావిడ ఆశపడుతున్నారు చూద్దాం" అంది పద్మిని.

"మన యువని కూడా ఇదే బాత్ రూము వాడుకుంటుందేమో కదక్కా రోగాలు రావూ?"

వసంత ఆ మాట అన్నాక పద్మినికి కూడా కొంచెం కంగారనిపించింది. "అవునుకదా! ఈ ఆలోచన నాకు రాలేదెంచేతో?" అనుకుంది

కానీ చేసేదేం ఉంది. ఏడెనిమిది గంటలు స్కూల్లో ఉండే పిల్లలు బాత్ రూం వాడుకోకుండా ఎలా ఉంటారు? అందులోనూ ఆడపిల్లలకి వేరే మార్గం ఉందా?

ఇంతలో ప్యూన్ వచ్చి మీటింగ్ అయిపోయిందని చెప్పడంతో ఇద్దరూ లోపలికి నడిచారు.

పద్మినిని ఆదరంగా ఆహ్వానించింది కమల.

వసంతని తన చెల్లెలుగా పరిచయం చేస్తూ కుదించి రాసిన నాటకం కాగితాలు ఆవిడకి అందిస్తూ "మీ అనుమతి లేకుండా కుదించానండి. మీరు చూశాక అవసరాన్ని బట్టి మళ్ళీ ఒకసారి ముగ్గురం కూర్చుని మార్పులేమన్నా ఉంటే చేసుకుందాం" వినయంగా అంది పద్మిని.

"ఓ కుదించేశారా? సరేలెండి పర్లేదు మాక్కూడా టైమ్ సేవ్ అయిందికదా!" అంటూ కాగితాలందుకుని చూస్తూ అంది. "రేపు నేను, మా టీచర్ గారు చదివి మీకు కబురు చేస్తాను."

"మీ ఇష్టం.. మీకు నచ్చకపోతే మళ్ళీ రాద్దాం. నేను డైరక్షన్ చేయగలను"

పద్మిని మాటలు ఆపుతూ అంది కమల "మీరు దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌గా పాత్ర వేయాలి. డైరెక్షన్ అవసరంలేదు."

"నేనా? " నివ్వెరపోతూ చూసింది పద్మిని. "మీరు.. పిల్లలతో వేయిస్తాను" అన్నారు.

"అవును అలాగే అనుకున్నాం కానీ మా ఎం.ఎల్.ఏ గారు ప్రొఫెషనల్స్‌తో వేయించండి ఖర్చు ఎంతైనా పర్లేదన్నారు. అంచేత అనుకున్న దానికన్నా మేము గ్రాండ్‌గా ప్లాన్ చేస్తున్నాం. పిల్లలతో కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తున్నాం. అందులో మీ యువనిక కూడా పాల్గొంటుంది. కాకపోతే ఈ నాటకం మీ ట్రూప్‌తో వేయిస్తే మీకు కావల్సిన ఖర్చులు, పారితోషికం కూడా మేము ఇస్తాము."

కమల మాటలు అవసాన దశలో ఉన్న వ్యక్తికి ఆ భగవంతుడే దిగివచ్చి మరికొంతకాలం ఆయుర్దాయం పొడిగించినప్పుడు కలిగే భావనలాంటిది కలిగింది. ఇంక ఏమీ చేయలేకపోతున్నానన్న నిరాశా, నిస్పృహలతో ఉన్న తనకి ఎంత మంచి అవకాశం లభిస్తోంది. కానీ ఇదొక బాధ్యత. చాలా పెద్ద బాధ్యత తను ఊహించలేని బాధ్యత నెరవేర్చగలదా? పద్మిని ఆలోచిస్తుంటే ఎక్కడ కాదంటుందో అన్నట్టుగా వసంత పద్మిని కాలివేళ్ళ మీద సన్నగా కాలితో తట్టింది.

పద్మిని ఉలిక్కిపడి చూసింది వసంతవైపు.

కాగితాల్లోకి చూస్తున్న కమల చూడకుండా సరే అను అన్నట్టుగా సైగచేసింది వసంత.

పద్మిని సంతోషంతో ఉక్కిరి, బిక్కిరి అవుతూ అంది. "మీకెలా థాంక్స్ చెప్పాలో తెలీడంలేదు మేడమ్. మీరు నామీద పెట్టిన ఈ బాధ్యత మనస్ఫూర్తిగా స్వీకరిస్తాను. ఈ మధ్యే మహిళా కలాకారుల వేదిక అని ఒక సంస్థ రిజిస్టర్ చేయించాను. ఆ సంస్థ ద్వారా నేనీ నాటక ఆడతాను. మీ కార్యక్రమం దిగ్విజయం చేసే బాధ్యత నాది."

ఆవిడ తలెత్తి పద్మిని వైపు చిరునవ్వుతో చూసింది. "నాకు మీమీద నమ్మకం ఉండబట్టేగా మీకు అప్పచెప్పాను."

తిరిగి అడిగింది "మీ సంస్థలో ఎంతమంది ఉన్నారు మెంబర్స్?"

వెంటనే సమాధానం చెప్పలేకపోయింది పద్మిని. ఏడుగురు సభ్యులతో రిజిస్టర్ చేయించింది. అందులో తాను, వసంత, శివరామ్, యవనిక, మరో మేకప్ ఆర్టిస్టు కుమార్, ఇంకా ఇద్దరు ఈ ఊళ్ళో లేని ఆర్టిస్టుల పేర్లు వాళ్ళతో సంప్రదించకుండానే చేర్చింది. ఇవన్నీ ఆవిడకు చెప్పడం ఎలా? అలాగని ఎవరూ లేరండి నేనూ, వసంతా తప్ప అనికూడా అనలేదు.

ఆమె మౌనం చూసి కమల అంది "మీకు ఆర్టిస్టులు కావాలంటే మా టీచర్లు కూడా చేస్తారు. వాళ్ళల్లో ఉత్సాహం ఉన్నవాళ్ళున్నారు వాళ్ళని మీరు తీసుకోవచ్చు. కాకపోతే మేల్ ఆర్టిస్టులు మీ వాళ్ళే కావాలి."

పద్మిని చప్పున అంది. "మొత్తం నాటకం మహిళలతో వేయిస్తే ఎలా ఉంటుంది?"

ఆవిడ అర్థంకానట్టు చూసింది "ఎలా? "

"అంటే అన్ని పాత్రలు గాంధీగారు, నెహ్రూగారు పాత్రలతో సహా ఆడవాళ్ళే వేస్తే ఎలా ఉంటుంది?"

ఆవిడ ఆలోచనగా చూసింది. కొన్ని క్షణాలు ఆలోచిస్తూ కూర్చున్న ఆవిడ మొహంలో క్రమంగా ఆనందం వెల్లివిరిసింది.

"ఎక్సలెంట్ ఐడియా అలాగే చేద్దాం. నా చిన్నప్పుడు ఆడవాళ్ళ పాత్రలు కూడా మగాళ్ళే వేసి నాటకాలాడారని విన్నాను."

"అవునండి అలా చాలా నాటకాలు మగవాళ్ళే ఆడేసేవారు. నాకూ తెలుసా విషయం. ఇప్పటికీ స్త్రీ పాత్రలు లేకుండానే నాటకాలు రాసుకుంటారు కొంతమంది మేమే దెబ్బలాడాం అలా అయితే లేడీ ఆర్టిస్టులు ఏమైపోవాలని. అంచేత ఒకటో, రెండో పెడతారు స్త్రీ పాత్రలు" అంది పద్మిని.

"అవును. నేనూ విన్నాను. సరేలెండి వాళ్ళ సాధకబాధకలేవో వాళ్ళకున్నాయి. వదిలేద్దాం మీరు చెప్పిన ఐడియా బాగుంది. వెంటనే మీరు ఇది అమలు పరచే పద్ధతి ఆలోచించి మీకెంతమంది ఆర్టిస్టులు కావాలో నాకు చెప్పండి. ఇద్దరు, ముగ్గురైతే నేను ఏర్పాటు చేయగలను. మనం శనివారం ఓ గంట సేపు కూర్చుని చర్చిద్దాం. సోమవారం నుంచీ రిహార్సల్స్ ప్రారంభిద్దాం."

"అలాగే.. " పద్మినికి గాల్లో తేలిపోతున్నట్టే అనిపించసాగింది.

ఇంత త్వరగా తన ఆశయం కార్యరూపం దాల్చగలదని ఏనాడు ఊహించలేకపోయింది. ఊహించని ఆనందం ఎంత మధురంగా ఉంటుందో ఇప్పుడే తెలుస్తున్నట్టు అనిపిస్తోంది. అయితే, ఆనందంతోపాటు కొంత ఆందోళన కూడా కలుగుతోంది. దుర్గాబాయ్ దేశ్ముఖ్ నాటకంలో చాలానే పాత్రలు కావాల్సి ఉంది. ముందు తను క్యారెక్టర్స్ లిస్టు రాసుకోవాలి. ఎవరెవరు వేస్తారో తనకు తెలిసిన ఆర్టిస్టులందరినీ అడగాలి. ఎవరెవరు ఏ, ఏ పాత్రలకి సరిపోతారో చూసుకోవాలి. చాలా పని ఉంది. ఇదంతా ఆవిడిచ్చిన వ్యవధిలో చేయగలుగుతుందా తను.

పద్మిని ఆలోచనలకి ఆటంకం కలిగిస్తూ అంది కమల "మీరు శనివారం వచ్చేటప్పుడు బడ్జెట్ కూడా వేసుకుని రండి మీకెంత కావాలో చెబితే నేను ఎమ్.ఎల్.ఏ గారితో మాట్లాడతాను."

అలాగే మెరిసే కళ్ళతో అంగీకరించింది.

ఆవిడ పద్మిని ఇచ్చిన పేపర్స్‌లోకి తలవంచుకోవడంతో వసంతా, పద్మినీ మొహాలు చూసుకున్నారు. ఇక వెళ్దామా? అన్నట్టు చూసింది వసంత.

పద్మిని కళ్ళతో సరే అన్నట్టు సైగ చేసి నెమ్మదిగా అడిగింది "మేడమ్ మరి మేం వెళ్ళచ్చా?"

కమల తలెత్తి "ఆ, బయలుదేరండి నేను స్క్రిప్ట్ చూసి చెప్తాను" అంది.

పద్మిని నమస్కరించి లేవబోతుండగా వసంత అంది "మేడమ్ స్కూల్లో బాత్‌రూములు సరిగా లేవు పిల్లలకి జబ్బులొస్తాయికదా అలాంటి బాత్ రూములు వాడితే?"

కమల అనుకోని ప్రశ్నకు తలెత్తి వసంతవైపు చూసి ఆమె ప్రశ్న అర్థం చేసుకుంటున్నదానిలా కొన్ని క్షణాలు తదేకంగా చూస్తూ ఫక్కున నవ్వింది.

"అమ్మా ఇది గవర్నమెంటు స్కూలు. పిల్లలు కూర్చోడానికి కుర్చీలు, బల్లలు సరిగా లేవు మీరు బాత్‌రూం గురించి ఆలోచిస్తున్నారా? పైగా ఇది భారతదేశం ఇక్కడ ఆడవాళ్ళ బతుకుల గురించే సీరియస్‌గా ఆలోచించని వాళ్ళు, ఆడవాళ్ళకి అత్యవసరమైన బాత్‌రూము గురించి ఆలోచిస్తారంటారా? ఇక్కడే కాదు మీరెక్కడికి వెళ్ళినా ఇళ్ళల్లో తప్ప మరెక్కడా ఆడవాళ్ళకి ప్రత్యేకమైన టాయిలెట్ సదుపాయం ఉండదు. సిటీల్లో కూడా లేదంటే మీరు నమ్ముతారా! వాటికోసం ఆడవాళ్ళు ఉద్యమాలు కూడా మొదలుపెడుతున్నారు. ఇది మన దౌర్భాగ్యం"

ఆవిడ మాటలకి వసంత విస్తుబోయి చూస్తోంది.

"సిటీల్లో బాత్ రూములుండవా? ఇక్కడే నయమే రేకులు కప్పో, మట్టిగోడలో ఏదో ఒకటి ఉంటుంది" అనుకుంది మనసులో. పైకి మాత్రం ఏం మాట్లాడకుండా కుర్చీలోంచి లేచింది.

పద్మిని కూడా లేచి "వెళ్ళొస్తాం" అంటూ ఆవిడకి నమస్కరించి వసంత చేయి పట్టుకుని బైటకి లాక్కొచ్చింది.

గేటుదాకా గబగబా నడిచి "నీకు బుద్ధుందా! ఎందుకా ప్రశ్న అసలు? ఇదేం మహాపట్నమా పాలరాతి గచ్చుతో బాత్‌రూంలు కట్టడానికి" అంది కోపంగా.

"పట్నాల్లో కూడా లేవంటోంటే ఇంకా పాలరాయి గురించి ఆలోచిస్తావేంటక్కా? ఇక్కడే నయంగా ఏమీ లేకపోతే తోపుల్లోకి వెళ్ళినా నీటుగా ఉంటుంది" అంది అక్కసుగా వసంత.

"నోరుమూసుకో ఇప్పుడా ప్రసక్తి అవసరమా? ఇంత పెద్దపని ఉంది మనకి ఇది ఆలోచించు డబ్బులు కూడా వస్తాయి. పద, పద ముందు శివరామ్ ఇంటికి వెళ్దాం ప్రస్తుతం అతనొక్కడే మనకి కావలసిన సలహాలిచ్చి సాయం చేసేవ్యక్తి.."

"శివరామ్ అప్పుడే ఇంటికి వస్తాడా ఇంకా నాలుగేగా?"పద్మిని అప్పుడే ఆ సంగతి గుర్తొచ్చినట్టు పెదాలు కొరుక్కుంటూ అంది వెళ్ళి "రజనితో మాట్లాడుతూ ఉండేలోగా వస్తాడుగా"

"ఏమో? కమ్యూనిటీ హాలుకి వెళితే!?"

పద్మినికి కూడా వసంతమాట నిజమే అనిపించింది. "నాటకం ఉన్నా లేకపోయినా ప్రతిరోజూ సాయంత్రం అక్కడ కలుసుకుని వెళతాను. యవనిక వచ్చేటైం కాబట్టి ఇంట్లో ఎవరో ఒకళ్ళం ఉండాలిగా"

"సరే నేనుంటాలే నువ్వెళ్ళు" అంది వసంత.

ఇద్దరూ అడుగులు వేగంగా వేశారు ఇంటివైపు.

**చాలా రోజుల తర్వాత కమ్యూనిటీ** హాలు వైపు నడుస్తుంటే పద్మినికి కొంచెం జంకులాంటిది కలిగింది. ఒకప్పుడు ఒక హక్కుగా, ధీమాగా వచ్చేది. ఇప్పుడు తప్పుచేసిన దానిలా బెరుగ్గా, ఎవరికో, దేనికోసమో భయపెడుతూ ఒక్క క్షణం వెళ్ళిపోవాలనిపించింది. అక్కడ అడుగుపెట్టగానే అతనే కనిపిస్తాడు. అందరికన్నా ముందు వచ్చి కూర్చుని, ప్రతి అరగంటకీ కాఫీ

తాగుతూ, సిగరెట్లు కాలుస్తూ ఏదో ఆలోచిస్తూ, మరేదో ప్రణాళికలు రచిస్తూ కూర్చుని ఉంటాడు. శివ వచ్చాడో, లేదో - రాకపోతే వెళ్ళగానే తనకి ఎదురయేది అతనే. ఏం మాట్లాడాలి? ఎలా మాట్లాడాలి? అప్పుడే కొత్తగా పరిచయం అయినట్టు ఇబ్బందిగా ఉంటుందేమో మాట్లాడాలంటే అసలు అతను మాట్లాడతాడా? ఎందుకొచ్చావని అడిగితే ఏం చెప్పాలి? శివకోసం అంటే వేరే విధంగా మాట్లాడే అవకాశం ఉంది. పద్మిని పరిపరివిధాల ఆలోచిస్తూ కమ్యూనిటీ హాలు దగ్గరకు వచ్చింది సగం విరిగిన గేటులోంచి లోపలికి నడిచింది.

ఆవరణంతా మరింత ఛండాలంగా ఉంది. లోపలికి వెళ్ళేందుకు ఎక్కవలసిన నాలుగుమెట్లు కాఫీ మరకలతో, సిగరెట్ పీకలతో అడుగుపెట్టడానికి కూడా అసహ్యం వేసేలా ఉన్నాయి. చీరకుచ్చిళ్ళు కొద్దిగా ఎత్తిపట్టుకుని మెట్లు ఎక్కి ద్వారం ముందుకు వచ్చింది సిగరెట్ వాసన గుప్పుమంది. చెంగు ముక్కుకి అడ్డం పెట్టుకుంది. అడుగుల చప్పుడు వినిపించి కాబోలు పచార్లు చేస్తున్న అతను లోపలినుంచి ద్వారం దగ్గరకు వచ్చాడు.

''నువ్వా? ఓ ఏంటి ఇటుగాలి మళ్ళింది? '' అంటూ సిగరెట్ ఆఖరి దమ్ము పీల్చి పద్మిని తలమీదుగా బైటకి విసిరేశాడు.

అతని మాటల్లోని హేళన ఆమె మనసుని సూటిగా తాకి ఒక్క క్షణం బాధనిపించింది. అతని స్వభావం అలవాటు అయినదానిలా తనని తాను తమాయించుకుని ''బాగున్నారా?'' అంది.

''నాకేం దివ్యంగా ఉన్నాను. ఎలా ఉంది మీ మహిళా కళాకారుల వేదిక?'' అదోరకంగా చూస్తూ అడిగాడు.

ఆమె ఏం మాట్లాడలేదు. ఇంకా ఎవరూ రాలేదు. మేకప్ ఆర్టిస్ట్ రాము కూర్చుని ఉన్నాడు.

పద్మిని చూడగానే ''బాగున్నావా అక్కా?'' అనడిగాడు ఆప్యాయంగా.

''నువ్వెలా ఉన్నావు రామూ బాగున్నావా?'' అడిగింది పద్మిని అతనక్కడ ఉన్నందుకు సంతోషిస్తూ.

''బాగున్నానక్కా. ఏంటక్కా ఈ మజ్జెన ఇటు రావట్లేదేంటి?''

ఆమె ఏం చెబుతుందా అన్నట్టు చెవులు రిక్కించి చూస్తున్నాడు చక్రధరం. అతనికి ఆమెని చూడగానే బలవంతంగా అణచుకున్న కోరిక కోరలు చాచుకుని విజృంభిస్తున్నట్టు అనిపించింది. నలభై దాటుతున్నా ఇంత అందంగా, నేవళంగా ఉన్న డ్రామా ఆర్టిస్టులు చాల అరుదు. ఈమె సినిమా హీరోయిన్ కావాల్సింది. అదృష్టం బాగాలేక రంగస్థలం మీద ఆగిపోయింది.

పద్మిని స్వరం వినిపించింది. ''ఈ మధ్యన నాటకాలేం ఆడినట్టులేరు కదా రామూ. రిహార్సల్స్‌కి రమ్మని నాకు కబురు కూడా ఏం అందలేదు. అందుకని ఇంటిదగ్గర ఉండిపోయాను. ఇవాళే అందర్నీ చూడాలనిపించి ఇలా వచ్చాను.''

''మంచిపని చేశావక్కా. సార్ కొత్తనాటకం రాశారు. హీరోయిన్ దొరకలేదు''

రాము మాటలు పూర్తికాకుండానే సీరియస్‌గా పిలిచాడు చక్రధరం ''రామూ!''

రాము కొంచెం బెదురుగా అతనివైపు చూసి మౌనంగా ఉండిపోయాడు.

వస్తున్నప్పుడు కలిగిన బెదురు, బింకం ఇప్పుడు చక్రధరం మాటలు, ప్రవర్తనతో పోయి కొంచెం ధైర్యం వచ్చింది పద్మినికి. నేనేం తప్పు చేశానని ఇతనికి భయపడాలి అనుకుంది. కాలితో తొక్కిపెట్టి అణచడానికి ప్రయిత్నిస్తున్న కొద్దీ ఎగిరిపడుతున్న గాలి బెలూన్‌లా ఆమె ఎంత అణకువగా ఉండాలనుకున్నా ఆత్మ విశ్వాసం ఎగిసిపడుతోంటే కొంచెం చుబకం ఎత్తి అతనివైపు చూసింది.

''హీరోయిన్ దొరక్కపోడానికి దేశం గొడ్డుపోయిందా? నాకు టైం లేక నాటకాలకు ప్రస్తుత విరామం ఇచ్చాను. సినిమాలకి రాయడానికి నాకు చాలా అవకాశాలు వస్తున్నాయి'' అన్నాడు.

ఆమె నవ్వింది.

"ఏం నవ్వుతున్నావు? నేను చెప్పేది జోక్‌లాగా ఉందా? నీకన్నా గొప్ప ఆర్టిస్టులు నాకు దొరకరని ధీమానా? నిన్ను బతిమాలి మళ్ళీ వేషానికి పిలుస్తాననుకున్నావా?" సీరియస్‌గా అడిగాడు.

ఆమె ఇంక భయపడదల్చుకోలేదు. ఇంతకాలం గౌరవంతో కూడిన ఒక భయం ఉండేది. ఇప్పుడు ఆ గౌరవమే పోయాక భయం దేనికి? అనుకుంది. అందుకే కొంచెం తెగింపుతో అంది "మీరేం కంగారుపడకండి సార్. నేను వేషాలకోసం మీ దగ్గరకు రాలేదు. నా తోటి కళాకారులు, అందరితో రెండేళ్ళ అనుబంధం ఉంది. అందరం ఓ కుటుంబంలా కలసి ఉన్నాం. నాలుగురోజులు దూరంగా ఉన్నంత మాత్రాన అభిమానాలు ఉండవా? చూసి వెళదాం అని వచ్చాను. అంతేకాదు శివతో పనుండి వచ్చాను."

"ఓహో అదా సంగతి. ఏం పనో?" వెటకారంగా అడిగాడు.

పద్మినికి అసహ్యం కలిగింది. అయినా బైటపడకుండా కొంచెం గర్వంగా చెప్పింది. "మహిళా కళాకారులతో మంచి నాటకం ఆడే అవకాశం కలిగింది. ఆ విషయమై అతనితో మాట్లాడాలని వచ్చాను."

"ఓ కంగ్రాట్స్ సాధించావు. ఇంతకీ ఎక్కడ, ఎవరు వేయిస్తున్నారు.?"

"నా కూతురు చదువుతున్న స్కూల్లో వార్షికోత్సవాలున్నాయి. ఆ సందర్భంగా దుర్గాభాయి దేశ్‌ముఖ్ జీవితచరిత్ర నాటకంగా వేస్తున్నాం."

"అలాగా నువ్వేనా దుర్గాబాయివి?" అతని స్వరంలో అంతకంతకు అధికమవుతున్న వ్యంగ్యం.

"అవును. నేనే ఏం పనికిరానంటారా?" నవ్వుతూ చూసింది.

ఆమె అంత సూటిగా, నిర్భయంగా చూడడం, మాట్లాడడం ఎరుగని చక్రధరం దిమ్మెరపోయాడు. వేషాలేక తిండి తినడానికి కూడా వెతుక్కునే పరిస్థితి వస్తే తన కాళ్ళదగ్గరకు దిగి వస్తుందనుకున్నాడు. పంతంకొద్దీ కొత్త హీరోయిన్ కోసం వెతుకుతున్నాడు కానీ, రంగస్థల నటిగా ప్రధాన పాత్రలు పోషించడంలో పద్మినిలాంటి కళాకారిణి ఆంధ్రదేశం మొత్తం మీదా లేదు. ఖచ్చితంగా మరో ఐదేళ్ళపాటు ఈమె కథానాయిక పాత్రలకు సరిపోతుంది. ఈమె వేసిన తన ప్రతినాటకం విజయం సాధిస్తూనే ఉంది.

చక్రధరం ఎప్పటినుంచో ఈ రంగంలో ఉన్నాడు. కొంతకాలం పంచాయితీ రాజ్ డిపార్ట్‌మెంట్లో ఉద్యోగం చేసి, నాటకాల మీద ఉన్న పిచ్చితో ఉద్యోగం మానేశాడు. ఆ తరువాత మరికొన్ని ఉద్యోగాలు కూడా చేశాడు కానీ ఎందులోనూ కుదురులేకపోవడంతో కొందరు అతన్ని తీసేయడం, కొన్ని అతనే మానేయడం జరిగింది. రచయితగా వెలిగిపోవాలని ఆడపడ్డాడు. పత్రికలకు కథలు, కవితలు పంపించడం అవి వచ్చేయడం జరిగింది. ఇంక లాభం లేదనుకుని నాటకాలు రాయడం ప్రారంభించాడు. రాసిన నాటకాలు పట్టుకుని కొన్ని సంస్థల చుట్టూ తిరగడం ప్రతి సంస్థలోనూ వాళ్ళకంటూ ఒక రచయిత ఉండడం వల్ల అతని నాటకాలు ఎవరూ ఆడలేదు. ఆఖరికి తనే మిత్రులు హరికృష్ణ, శంకరం, ప్రభాకరంలతో పాటు నాటకం వల్ల ఆసక్తి ఉన్న మరికొంతమంది కుర్రవాళ్ళను చేరదీసి ఒక సంస్థ రిజిస్టర్ చేయించుకుని తన నాటకాలు తనే ఆడించడం మొదలుపెట్టాడు. అతను గొప్ప రచయిత కాకపోయినా రాసి, రాసి కొద్దిగా చేయితిరిగింది కానీ, కళాకారుల నటన బాగోలేకో సంస్థ కొత్తది కావడం చేతో కొంతకాలంపాటు ఆశించినంత పేరురాలేదు.

ఎప్పుడైతే పద్మిని ప్రవేశించిందో అప్పటినుంచీ అతనికి దశ తిరిగినట్టు అయింది. ప్రదర్శించబడిన ప్రతినాటకం బహుమతులు గెల్చుకోడంతో నాటకరంగంలో అతని పేరు వినిపించడం మొదలైంది. అనుకోకుండా ఒక నాటకం హక్కులు సినిమా నిర్మాత తీసుకోడం జరిగిన దగ్గర్నుంచీ ఇంకా కొంచెం పేరు వచ్చింది. అడపా, దడపా కథలు కూడా అచ్చవసాగాయి. అయితే అతనికి పేరు వచ్చింది కొంత చాకచక్యంతో పదిమందినీ ఆకట్టుకుని వచ్చిన పేరు పెంచుకుంది కొంత. చిన్నప్పటినుంచీ చక్రధరానికి అహంకారం, పొగరు ఎక్కువే.

తల్లిమాట వినేవాడు కాదు. స్కూలుకి వెళ్ళకుండా తండ్రితో దెబ్బలు తినేవాడు. అయినా మారకపోగా మొండితనం ఎక్కువ అయి అది మూర్ఖత్వంగా మారింది తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్టు. అతను స్కూలు ఫైనల్ కష్టం మీద పాసై కాలేజీలో చేరి అంతకన్నా ఎదగలేక చదువు మానేశాడు. ఒక్క మగపిల్లాడు చెడిపోతున్నాడని బాధపడ్డ తండ్రి రక, రకాల ఉద్యోగాల్లో పెట్టినా అవేవీ నిలుపుకోలేకపోయాడు.

మగపిల్లాడు చెడిపోతున్నాడని బాధపడే ప్రతి తల్లీ, తండ్రీ ఆలోచించినట్టే అతని తల్లి, తండ్రులు కూడా ఆలోచించి పెళ్ళిచేస్తే మారతాడనుకుని పెళ్ళిచేశారు. పెళ్ళి అయిన ఒక ఏడాదిదాకా చిన్న ప్రైవేటు ఉద్యోగం చేస్తూ బాగానే ఉన్నాడు. తిరిగి అసలు స్వభావం బైటపడి, భార్యమీద చెయ్యికూడా చేసుకునేంత అహంకారం వచ్చేసింది. ఇద్దరు పిల్లలు పుట్టి వాళ్ళు ఎదుగుతున్నా భర్త తనమీద చేయిచేసుకోడంతో ఈ మధ్యే అతని భార్యా పిల్లల్ని కూడా తనతో తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది.

అప్పటినుంచీ నిస్సహాయురాలు, ఆర్థికంగా తనమీద ఆధారపడి ఉన్న పద్మినిని ఎలాగైనా తన దారికి తెచ్చుకుని శాశ్వతంగా ఆమెని తన చెప్పుచేతుల్లో పెట్టుకుంటే తన సంస్థ నిరాటంకంగా నడుస్తుందని స్వార్థపు ఆలోచన అతని మనసులో బీజం వేసుకుని అదిప్పుడు ఓ మహావృక్షమైపోయింది.

పద్మినికి వేషాలు కావాలి. ఆమె చదువుకోలేదు. సినీరంగంలో ఇంతకుముందే ప్రయత్నించి విఫలురాలైంది. ఆమెకిప్పుడు సినిమాల్లో వేషాలకు అవకాశం లేదు. భర్తలేడు. ఒక్క కూతురుని చదివించుకోవాలి. ఆమె, కూతురు నాటకాలమీదే బతకాలి. ఈ రంగం తప్ప మరో రంగం ఎరుగని పద్మినికి తను ఆశ్రయం ఇచ్చినట్టు ఇచ్చి తన గ్రిప్‌లో పెట్టుకోవచ్చు.

అయితే, ఆత్మాభిమానంగల స్త్రీ ఆకలితో మాడుతుంది కానీ, తన అంతరాత్మకి విరుద్ధంగా దిగజారదన్న వాస్తవం అతనికి అర్థమయేంత సంస్కారం అతనిలో లేకపోవడం అతనికున్న చెడగుణాల్లో ఒకటి. అందుకే ఆమెని సాధించడానికి అనేక విధాలుగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు. వేరే దిక్కులేని పద్మిని తప్పకుండా మళ్ళీ తన పాదాల దగ్గరకే చేరుతుందని గట్టి నమ్మకంతో ఉన్నాడు. ఇవాళ పద్మిని కమ్యూనిటీ హాలుకి రావడంతో తన నమ్మకం ఫలించిందని అతనికి మహా ఆనందంగా ఉంది అయితే ఆ ఆనందం మీద బిందెడు నీళ్ళు పోసినట్టు ఆమె మహిళా కళాకారులతో నాటకం వేయిస్తున్నానని చెప్పడం, శివకోసం వచ్చాననడం అతనిలో ఉవ్వెత్తున క్రోధాగ్నిజ్వాలల్ని రేపింది. కళ్ళల్లో ఎర్రజీరలు కనిపించాయి. ఆమెని అవమానించాలని ఉంది. ఆమె కళ్ళు వర్షిస్తుంటే చూడాలన్న పాశవికానందం అంతకంతకూ ఎక్కువవుతోంది.

స్వరంలో వీలైనంత కాఠిన్యం నింపుకుని అన్నాడు. " ఆ పాత్ర పోషించినంత మాత్రాన నువ్వు ఆవిడవు కాలేవుకదా!" అన్నాడు.

పద్మినికి చిరాకేసింది అయినా చెదిరిపోని చిరునవ్వుతో అంది "అదేంటిసార్ నేను ప్రమీలార్జునీయంలో ప్రమీలగా వేశాను ప్రమీలనైపోయానా? మీరు సృష్టించిన అనేక పాత్రలు నేను పోషించాను. అవన్నీ అయానా? సినిమాల్లో కె.ఆర్.విజయగారు దేవతల పాత్రలెన్నో పోషించారు. ఆవిడ దేవత అయారా? కళాకారులెవరూ కూడా తమ అసలు రూపం వదిలేసి పోషించిన పాత్రల్లోకి పరకాయ ప్రవేశం చేయరుకదా! అలా చేయడం ప్రారంభిస్తే రోజుకో రూపంలో కనిపించాలి."

"డైలాగులు చెప్పి, చెప్పి బాగా అలవాటు అయింది బానే చెప్తున్నావ్ సొంత డైలాగులు కూడా, రాతలు కూడా మొదలుపెట్టావేంటి?"

"లేదు సార్. ఆ అదృష్టం ఉంటే ముందు నా రాత మార్చుకుని మరో రాత రాసుకునేదాన్ని" అంది కొంచెం విరక్తిగా.

ఇంతలో శివ రావడంతో అతని దగ్గరగా నడిచి "ఏం శివా? లేట అయిందే" అంది.

"ఇంటికెళ్ళి వస్తున్నాను పద్మినీ. నువ్వేంటి ఇలా వచ్చావు?" అడిగాడు.

వాళ్ళిద్దరినీ నిప్పులు రాలుస్తున్న కళ్ళతో చూస్తూ జేబులోంచి సిగరెట్ పాకెట్ తీసి సిగరెట్ నోట్లో పెట్టుకుని ఖాళీ అయిన పాకెట్ మరోసారి బైటకి విసిరేశాడు చక్రధరం.

"నీతో పనుండి వచ్చాను శివా" అంది పద్మిని.

"ఇక్కడ నువ్వు కూర్చోవడానికి సౌకర్యంగా కూడాలేదు ఇంటికి రాకపోయావా? రా అలా కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం బండిదగ్గర" అంటూ చక్రధరం వైపు చూసి "రండి సార్ కాఫీ తాగుదాం" అన్నాడు శివ.

సిగరెట్ పొగ గట్టిగా వదుల్తూ "థాంక్స్ మీ మధ్యలో నేనెందుకులే" అన్నాడు.

పద్మిని చురుగ్గా ఏదో అనబోతుంటే శివకళ్ళతో సైగచేసి నవ్వాడు. "ఈ వయసులో మాకు రహస్యాలేం ఉంటాయి సార్. అంటూ దా పద్మినీ" అంటూ బైటకి నడిచాడు.

పద్మిని వెనక్కి తిరిగి రామూ వైపు చూసి "రామూ నువ్వు కూడా రా" అంది.

రాము గభాల్న లేచి "అవునక్కా నాకూ కాఫీ కావాలి" అంటూ వాళ్ళని అనుసరించాడు.

పద్మిని, శివ, రాము కాంపౌండ్ వాల్‌ని ఆనుకుని ఉన్న బండి దగ్గరకు వచ్చారు.

శివ మూడు కాఫీ చెప్పాడు.

రాము కసిగా అన్నాడు "వీడిపొగరెప్పుడు తగ్గుతుందో పెళ్ళాం వదిలేసినా సిగ్గులేదు వీడికి"

శివ తలాడిస్తూ "దుష్టులకు దూరంగా ఉండమన్నారు పద్మినీ! నువ్వెప్పుడూ ఇక్కడికి రాకు నాతో పనుంటే ఇంటికి వచ్చెయ్" అన్నాడు.

"నువ్వు ఇంటికి వెళ్తావనుకోలేదు శివా. అందుకే ఇక్కడికి వచ్చాను. అయినా మనుషుల మాటలు పట్టించుకోవాలిగానీ, మనిషి రూపంలో ఉన్న పశువు మాటలు పట్టించుకోడం దేనికి?"

"అంతేలే ఇంతకీ ఏంటి సంగతి?" అడిగాడు శివ.

పద్మిని మొహంలో ఆనందం వెల్లివిరిసింది. "యువని వాళ్ళ స్కూల్లో వార్షికోత్సవాలట శివా! హెడ్ మిస్ట్రెస్ నన్ను పిలిచి దుర్గాబాయి దేశ్‌ముఖ్ గారి జీవితచరిత్ర నాటకం వేయమన్నారు."

"అలాగా! చాలా సంతోషం పద్మినీ" ఆనందంగా అంటూ వెంటనే నొసలు ముడిచి "ఫ్రీ సర్వీసా? డబ్బులిస్తారా?" అన్నాడు.

"నేను ముందు ఫ్రీ అనుకున్నాను. కానీ, ఈ రోజే చెప్పారు. మహిళా కళాకారులతో వేయిస్తే బాగుంటుందన్న నా సూచన నచ్చింది. ట్రూప్ తయారుచేసి, బడ్జెట్ వేసి ఎంత ఖర్చుఅవుతుందో చెప్పమన్నారు. ఎం.ఎల్.ఏ గారు వేయిస్తానన్నారుట. ఈ విషయంలో నీ సహాయంకావాలి శివా!" అంది పద్మిని.

"తప్పకుండా పద్మినీ నాకు చేతనైనంత సాయం చేస్తాను" మనస్ఫూర్తిగా అన్నాడు శివ.

"అక్కా మేకప్ ఆర్టిస్టులు కూడా ఆడాళ్ళే అక్కర్లేదుకదా!" అడిగాడు రాము.

పద్మిని చిరునవ్వుతో అంది. "లేదు రామూ నువ్వే మాకు మేకప్, కాస్ట్యూమ్స్ అన్నీ చేయాల్సింది."

"థాంక్సక్కా" రాము కళ్ళల్లో పల్చటి కన్నీటి తెర కదిలింది.

రాము పదోతరగతి కూడా పాసుకాలేదు. చాలా పేద కుటుంబం నుంచి వచ్చాడు. రంగస్థలం మీద అభిమానంతో కొంతకాలం వేషాలు కోసం తిరిగి ఇచ్చిన వేషాలు నిలబెట్టుకోలేకపోయాడు. అతనికి జ్ఞాపకశక్తి తక్కువ అవడంతో ప్రాంప్టింగ్ ఇచ్చినా డైలాగులు చెప్పలేకపోయేవాడు. అంచేత నెమ్మదిగా అందరిలోకి సీనియర్ మేకప్ మాన్ హనుమంతు దగ్గర మేకప్ చేయడం నేర్చుకుని చక్రధరం

సంస్థలో చేరాడు. పాతికేళ్ళుంటాయి అతనికి ఇంకా పెళ్ళికాలేదు. చక్రధరం అడపా, దడపా ఇచ్చే చిన్న అమౌంట్ తల్లికిచ్చి నా కొడుకు సంపాదన పరుడు అనే తృప్తి కలిగించడానికి ప్రయత్నిస్తుంటాడు. పద్మిని అంటే అతనికి విపరీతమైన అభిమానం. చక్రధరం పద్మిని తీసేసాడని తెలిసిన దగ్గర్నుంచీ విపరీతంగా బాధపడుతున్న వ్యక్తుల్లో అతను మొదటివాడు. ఇవాళ పద్మినిని చూడగానే అతనికి మహా ఆనందంగా ఉంది.

"రేపు సాయంత్రం మీ ఇంటికి వస్తాను పద్మినీ అక్కడ కూర్చుని ఆర్టిస్టులని ప్లాన్ చేద్దాం. ఆదివారం కూర్చుని బడ్జెట్ ప్లాన్ చేద్దాం ఇక్కడెందుకు ఆ వెధవ ఏడుపుకొడుతుంది మనకి" అన్నాడు శివ.

"కానీ, శనివారం ఆవిడ మీటింగ్ పెట్టారు శివా. ఆ రోజున బడ్జెట్, ఆర్టిస్టుల లిస్టు ఇవ్వాలి. ఆవిడ స్కూలు టీచర్ల్ కూడా ఒకరిద్దరు నటించడానికి ఆసక్తి చూపిస్తున్నారట వాళ్ళని కూడా ఆ రోజు పిలుస్తానన్నారావిడ"

"అలాగా! " ఆలోచిస్తూ అన్నాడు.

ఇంతలో కాఫీ కప్పులు తీసుకుని కుర్రాడు రావడంతో ముగ్గురూ కాఫీ అందుకున్నారు.

"బాగున్నావాక్కా?" అడిగాడు కాఫీ ఇచ్చిన కుర్రాడు సూరి.

"బాగున్నానురా ఎలా ఉంది నీ బడ్డీ?" అడిగింది పద్మిని.

"నా బడ్డీకేంటి? మీరందరూ చల్లగుంటే నా బడ్డీకూడా చల్లగుంటాది"

"నీ బడ్డీ వేడిగా ఉండాలిరా. చల్లగా ఉంటే కూల్‌డ్రింక్ షాపు అవుతుంది."

శివ హాస్యానికి అందరూ నవ్వారు.

కాఫీ తాగి సూరికి డబ్బులిచ్చి ముగ్గురూ అక్కడ్నించి కదిలారు.

"నువ్వు ఇంటికెళ్ళిపో పద్మినీ నేను వస్తాలే" అన్నాడు శివ.

"అలాగే వెళ్ళొస్తాను రామూ. నువ్వు కూడా శివతో రా రేపు" అంది పద్మిని.

"వస్తానక్కా" సంతోషంగా అన్నాడు రాము.

పద్మిని ఇంటివైపు బయలుదేరితే రామూ, శివా చక్రధరం ఉన్న వైపు నడిచారు.

"పంపించివచ్చావా నీ పద్మినిని?" వెటకారంగా అడిగాడు చక్రధరం.

"అలా మాట్లాడకండి సార్ పద్మిని నాకు చెల్లెల్లాంటిది" నెమ్మదిగా అన్నాడు శివ.

"నేను మాత్రం ఏమన్నాను?" అమాయకత్వం నటించాడు చక్రధరం.

శివ మాటమారుస్తూ అన్నాడు. "ఇవాళ మనవాళ్ళెవరూ వచ్చినట్టు లేరుసార్"

వెంటనే విసుగ్గా అన్నాడు చక్రధరం. "ఒక్కడన్నా వచ్చి వస్తాం, రాము అని చెప్పిచావచ్చుగా నేనిక్కడ వెధవలాగా ఎదురుచూస్తూ కూర్చోవాలా? నేనేం పనీపాటా లేనివాడినా"

"సార్ ఈ మధ్య సెల్ ఫోన్‌లు వస్తున్నాయి. మీరొకటి కొనుక్కోండి. ఇలాంటి సమస్యలేం లేకుండా ఫోన్‌లో మీకేం చెప్పాలన్నా చెప్పచ్చు" అన్నాడు శివ.

"ఎంతుంటుంది?" అడిగాడు చక్రధరం సాలోచనగా.

"ఏమో రెండు వేలనుంచి లక్షదాకా చాలా రకాలున్నాయిట. మనకి తెలియదుకదా ముందు రెండువేల ఫోన్‌తో మొదలుపెడితే సరి.

"ఎక్కడ దొరుకుతుంది? మన ఊళ్ళో ఉందా?"

శివ నవ్వాడు. "మన ఊళ్ళో దొరుకుతోందా సార్. భలేవారు మీరు. విజయవాడకో, గుంటూరో వెళ్ళి చూడండి ఎలక్ట్రానిక్ షాపుల్లో దొరుకుతుందిట."

అతను తలపంకించి ఊరుకున్నాడు.

అతను ఆ విషయం తీవ్రంగా ఆలోచిస్తున్నాడని అర్థమైంది శివకి.

"సార్ ఇంక ఎవరూ వచ్చేట్టులేరు. వెళ్ళిపొమ్మంటారా?" అడిగాడు.

"వెళ్దాం పదండి" అంటూ చేతిలో మిగిలిన సిగరెట్ పీక అక్కడ పారేసి చటుక్కున లేచాడు.

రాము, శివ అతని వెనకే బైటకి వచ్చారు. బైటకి వచ్చేటప్పుడు అడిగాడు చక్రధరం. "పద్మిని కూతురు ఏ స్కూల్లో చదువుతోంది?"

"గవర్నమెంట్ గర్ల్ హైస్కూల్"

"గవర్నమెంట్ స్కూలు వార్షికోత్సవాలా? వాళ్ళు ఈవిడ్ని నాటకమాడమన్నారా?" పెద్ద జోక్‌లా ఫెళ్ళున నవ్వుతూ అన్నాడు.

శివ, రాము చిరాగ్గా చూశారు.

ఆ తరువాత ఎవరూ మాట్లాడలేదు. చక్రధరం తను ఈ మధ్యే సెకండ్ హ్యాండ్‌లో కొనుక్కున్న లూనా ఎక్కి స్టార్ట్ చేశాడు. రాము, శివ నడక ప్రారంభించారు.

🦋🦋🦋

శివ పద్మిని కలిసి ఆర్టిస్టులని ఒక్కొక్కళ్ళనీ గుర్తుచేసుకుంటూ వాళ్ళ పేర్లు రాసుకున్నారు. వాళ్ళల్లో సుందరి, కళావతి ఆ ఊరికి దగ్గర్లోనే ఉండే మరో ఊళ్ళో ఉంటారు కాబట్టి వాళ్ళని పిలిపించడం తేలిక. మిగతావాళ్ళని ఓ ముగ్గురిని విజయవాడనుంచీ, మరో ముగ్గురిని మంగళగిరినుంచీ పిలిపించాలి. వాళ్ళకి ఛార్జీలు ఇవ్వాలి.

కళాకారులకివ్వాల్సిన చార్జీలు, రిహార్సల్స్‌కి అయే టీ, కాఫీలు, భోజనం ఖర్చు.

పక్క ఊళ్ళనుంచి పిలిపించినప్పుడు వాళ్ళ భోజనం ఏర్పాట్లు కూడా చూడాల్సిన బాధ్యత ఉంది. ఉండడానికి పద్మినింట్లో సుందరి ఇంట్లో సర్దుకోవచ్చు.

సుందరి ఇల్లు కొంచెం పెద్దదే, మావగారి స్వార్జితంతో ఆ ఊళ్ళో కట్టుకున్న ఆ ఇల్లు పంపకాల్లో సుందరి భర్తకు వచ్చింది. ఆయన బాగానే సంపాదించి ఇల్లు, పొలం కొనడంతో ఉన్న నలుగురు కొడుకులకే కాక ఆడపిల్లలిద్దరికీ కూడా ఆస్తిపంచి కన్నుమూశాడు. అత్తగారు, సుందరి, ఆమె భర్త ముగ్గురు పిల్లలు ఉన్నా విశాలంగా, ఎక్కువ గదులతో ఉండే ఆ ఇంట్లో అప్పుడప్పుడూ బైటనుంచీ వచ్చిన లేడీ ఆర్టిస్టులకి వసతి కల్పిస్తుంది. అత్తగారు కూడా చాలా మంచావిడ అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తుంది. ఇంక భోజనం ఒకపూట సుందరి వాళ్ళింట్లో తిన్నా, చేతిలో డబ్బులుంటాయి కాబట్టి తనే ఇంటికి కావలసిన సరుకులు తెచ్చేస్తే ఇక్కడే భోజనాలు ఏర్పాటు చేయచ్చు. వంట చేయడంలో వసంతకి చాలా నేర్పు ఉంది, ఓపిక కూడా ఉంది. నలుగురూ తలా ఒక చేయి వేస్తారు కాబట్టి ఇబ్బందిగా కూడా ఉండదు.

ఇకపోతే లైటింగ్‌కి, మేకప్‌కి, కాస్ట్యూమ్స్‌కి స్టేజ్ ప్రాపర్టీ.

"స్వాతంత్ర్యపోరాటానికి సంబంధించిన సన్నివేశాలే కాబట్టి కాస్ట్యూమ్స్ పెద్దగా ఏం ఉంటాయి శివా!. ఆవిడ ఖద్దరు చీరలే కట్టేవారు. నా దగ్గర రెండు తెల్ల ఖద్దరు చీరలున్నాయి" అంది పద్మిని.

"అదీ నిజమే అనుకో అయినా కొంత ఖర్చు వేసుకుంటే తప్పేం లేదుగా" అన్నాడు శివ.

వసంత కూడా శివని సమర్థించడంతో సరే అంది పద్మిని.

"కాకపోతే రిహార్సల్స్ ఎక్కడ వేస్తారు? మనకి తెలిసింది కమ్యూనిటీ హాలొక్కటే అది ఎలాగా ఆయన చేతుల్లో ఉంది" అంటున్న శివ మాటలకి అడ్డొస్తూ "ఆ కంపులో మేమెక్కడ ఉంటాంలే శివా. పిన్నిగారిని అడిగి వాళ్ళ పెరట్లో వేసుకుంటాం. ఆవిడ చాలా మంచావిడ ఒద్దనరు. వేసంకాలమే కాబట్టి ఏ ఆటంకం కూడా ఉండదు. మరీకాదు, కూడదంటే అప్పుడు చూద్దాం."

"ఎందుకక్కా ఎచ్.ఎమ్‌గారిని అడిగితే వాళ్ళ స్కూల్లోనే వేసుకోవచ్చుకదా?" అంది వసంత.

"నిజమే సుమా" తనకా ఆలోచన రానందుకు తన మందబుద్ధిని తిట్టుకుంటా అంగీకరించింది పద్మిని.

"అక్కా నీకు వంటకి సాయంకావాలంటే చెప్పు మా అమ్మని కూడా రమ్మంటాను" అన్నాడు రాము. అతని మనసులో అప్పటికప్పుడే ఇంత కష్టపడుతున్న పద్మినికి ఉడతాభక్తిగా తనూ ఏదన్నా సాయం చేయాలన్న ఆలోచన వచ్చింది. అమ్మ తను అడిగితే కాదనదు అనుకుంటూ నిస్సంకోసచంగా అనేశాడు.

"తప్పకుండా రామూ అవసరమైతే తప్పకుండా చెప్తాను" అంది నవ్వుతూ పద్మిని.

"మొత్తం బడ్జెట్ వేసి, పెద్ద నాటకం కదా పద్మినీ సుమారు పాతికవేల ఖర్చు వస్తోంది" అన్నాడు శివ.

"పాతికవేలా?" గుండె బాదుకుంది పద్మిని. "అమ్మో ఆవిడ ఏమంటారో, అంత అవుతుందా శివా" బేలగా అడిగింది.

"అవుతుంది. నువ్వు లేడీ ఆర్టిస్టులతో వేస్తున్నావు. పేమెంట్ ఇవ్వకుండా ఎవరూ రారు. అందరూ దీనిమీదే ఆధారపడి బతుకుతున్నవాళ్ళు"

"అవుననుకో కానీ, అంతఖర్చా? మనకి థియేటర్ అవసరంలేదుకదా! ఆయన ప్రమీలార్జునీయం వేయించినప్పుడే ఇంతకాలేదు నాకు తెలుసా విషయం"

"నువ్వు ఒక విషయం మర్చిపోతున్నావు. అందులో లేడీ ఆర్టిస్టులు ముగ్గురే. మీ ముగ్గురికీ ఎంత ఇచ్చాడు. పైగా మీకేం చార్జీలిచ్చాడా? ప్రదర్శనా పారితోషికమేగా! ఇంకా చెప్పాలంటే ఆ రోజులకి ఈ రోజుకి చాలా తేడా ఉంది పద్మినీ"

పద్మిని ఆలోచనలో పడింది. ఇంత ఖర్చు ఆవిడ ఒప్పుకుంటుందో లేదో వచ్చిన అవకాశం చేజారకూడదు. ఏం చేయాలి? సన్నగా నిట్టూర్చి అంది "సరేలే ఇది ఆవిడ ముందు పెడతాను. సరే అంటే చేద్దాం లేదంటే వదిలేద్దాం"

అంతే అన్నాడు శివ.

రాము కొంచెం సందేహంగా అన్నాడు. "అక్కా పోనీ నేను మేకప్ ఫ్రీగా వేస్తాను కానీ, ప్యాక్‌లవీ నువ్వు తెప్పించి ఇవ్వు."

పద్మిని నవ్వింది. అతని అమాయకత్వం, మంచితనం కలిసి ఒక చిన్న త్యాగానికి మార్గం చేసుకుంటున్నట్టు అనిపించింది.

"నీ ఒక్కడి ఖర్చు ఎంత తగ్గుతుంది రామూ. లాభపడితే అందరం లాభపడదాం. లేదంటే అందరం ఊరుకుందాం" అంది.

పద్మిని మంచి మనసుకి అందరికీ కళ్ళు చెమర్చాయి.

వసంత గబ, గబా వెళ్ళి మరమరాలు కొద్దిగా వేయించి, అందులో కాసిని వేయించిన శెనగపప్పు, ఉప్పు, కారం సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు కొంచెం నూనెతో కలిపి అందరికీ ప్లాస్టి ప్లేట్లలో పెట్టి తెచ్చింది.

ఏంటి మరమరాలా అంటూ ప్లేటు అందుకున్నాడు శివ.

వసంత దగ్గర ఉన్న మంచి అలవాటు అది. ఉన్న దాంట్లోనే ఏదో ఒకటి చేసి వచ్చిన వాళ్ళకి మర్యాద చేస్తుంది. ఆ మర్యాదలో ఆప్యాయత అనే రుచి, అమాయకత్వం అనే పరిమళం కలిసి ఆ పదార్థం మరీ, మరీ తినాలనిపిస్తుంది.

పద్మిని వసంతవైపు అభినందనగా చూసింది ప్లేటు అందుకుంటూ అప్పుడే స్కూలు బ్యాగుతో వచ్చిన యవనికను చూసి బాగున్నావా తల్లీ అని పలకరించాడు శివ.

"బాగున్నాను మావయ్యా" అంటు ప్లేట్లలోకి తొంగిచూస్తూ "ఏంటి పిన్నీ. ఏం చేశావు తినడానికి?" అనడిగింది స్కూలు బ్యాగు గూట్లో పెట్టి.

"కాళ్ళు, చేతులూ కడుక్కురా నీకూ పెడతాను" అంది వసంత.

"ఇప్పుడే వస్తా బాగా ఆకలిగా ఉంది" అంటూ పెరట్లోకి పరిగెత్తిన యవనిక ఐదు నిమిషాల్లో వచ్చింది. వసంత ఆమెక్కూడా మరో ప్లేటులో పెట్టి ఇచ్చింది.

"మా స్కూల్లో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి మావయ్యా" అంది యవనిక.

"ఆ విషయం మాట్లాడడానికే వచ్చాం తల్లీ" అన్నాడు శివ.

"నీకో సంగతి తెలుసా. నేను కూడా వేషం కడుతున్నాను."

"ఓ అలాగా ఏం వేషం?" సంతోషంగా చూశాడు. పద్మిని యవనిక ఏం చెబుతుందా అన్నట్టు కుతూహలంగా చూడసాగింది.

"శాకుంతలం అనే రూపకంలో నేను శకుంతల చెలి ప్రియవందగా వేస్తున్నాను."

"ఓ.. గుడ్ బాగుంది. మరోసారి వేసినప్పుడు శకుంతలగా వేయాలి" అన్నాడు ప్రోత్సహిస్తూ.

"అమ్మకి నేను వేషం కట్టడం ఇష్టం లేదు." బుంగమూతి పెట్టి అంది పద్మినిని చూస్తూ.

అవునా అన్నట్టు చూశారు శివ, రాముకూడా.

పద్మిని నిట్టూరుస్తూ అంది. "ఎందుకు చెప్పు కూడు, గుడ్డ ఇవ్వని నాటకాలు. నేను కూరుకుపోయాను చాలు. ఇప్పుడే ఇలా ఉంది ఈ రంగం రాను, రానూ ఇంకెలా ఉంటుందో, అసలుంటుందో లేదో కూడా తెలియని పరిస్థితిలో దాన్ని నేను నాటకరంగంలోకి అనుమతించలేను శివా. అది బాగా చదువుకుని హాయిగా ఉద్యోగం చేసుకుంటూ దర్జాగా బతకాలి. అదే నా కోరిక, అదే నా ఆశయం, ఆశ కూడా."

శివకి పద్మిని అలా అనుకోడంలో ఏ మాత్రం తప్పు కనిపించలేదు. నిజమే ఆమె ఎదుర్కొన్న ఒడిదుడుకులు, దాటి వచ్చిన ముళ్ళ కంచెలు, ఎత్తుపల్లాలు, ఆకలి, దరిద్రం, కన్నీళ్ళు అవమానాలు, కష్టాలు తన కూతురికి చూస్తూ, చూస్తూ ఎలా వారసత్వంగా ఇవ్వగలదు. తల్లిగా కూతురు హాయిగా ఆనందంగా బతకాలని కోరుకోవాలి తప్పదు. సరదాకి స్కూల్లో వేషాలేయడం తప్ప అది వృత్తిగా తీసుకుని యవనిక జీవించే అవసరం రాకుడదు.

దీర్ఘంగా శ్వాస విడిచి "రామూ అలా వీధిలోకి వెళ్ళి పాలు దొరుకుతాయేమో చూసి వస్తావా?" అంటూ జేబులోంచి పదిరూపాయలనోటు ఇచ్చాడు.

వసంత సాధారణంగా శివని చూడగానే టీ తెస్తుంది. కానీ, ఈ రోజు పాలు లేకపోడంతో ఆమె ఏం చేయలేకపోయింది. ఆ విషయం వాళ్ళు చెప్పనక్కరలేకుండానే గ్రహించిన శివ రాముకి ఆ పని పురమాయించాడు. అది అర్థమైనా ఏం చేయలేక, వారించలేకా నిస్సహాయంగానే మౌనంగా ఉండిపోయారు పద్మిని, వసంత.

రాము శివ ఇచ్చిన పదిరూపాయల నోటు తీసుకుని అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

**మహిళా కళాకారుల వేదిక వెలుగు చూస్తుందని,** ఇక నుంచీ ఈ బ్యానర్ ద్వారా మరిన్ని కార్యక్రమాలు చేసి పరిషత్తుల్లో పాల్గొనే స్థాయిలో నాటకాలు తయారుచేయించి ఆంధ్రదేశం అంతటా తన సంస్థను విస్తరించగలనని, ఆత్మాభిమానం చంపుకుంటూ బతుకు తెరువుకోసం చక్రధరంలాంటి అనైతిక వ్యక్తుల కాళ్ళు పట్టుకునే అవసరం ఉండదని, ఆర్థికంగా నెమ్మదిగా నిలదొక్కుకోవచ్చని ఎన్నెన్నో ఊహించుకుని, ఎంతో కష్టపడి ఎదురవుతున్న ఆటంకాలను అధిగమిస్తూ దుర్గాబాయి దేశ్‌ముఖ్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శన కోసం ఎదురు చూసింది పద్మిని.

అయితే ఆమెకి ఆదిలోనే ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. కమల పద్మిని చూపించిన బడ్జెట్ చూశాక

"అమ్మో ఇంత డబ్బు ఇవ్వగలమో లేదోనండి. ఎం.ఎల్.ఏ గారు స్వంత డబ్బుతో చేయిస్తున్నారు. ఆయన ఏమంటారో అయినా ఇందరు ఆర్టిస్టులను బైటనుంచి పిలిపించి వాళ్ళకి వసతి, భోజనాలు, దారిఖర్చులు ఇవ్వడం అంటే మాటలు కాదు. వాళ్ళంతా ఎందుకులెండి మా టీచర్లలో ఉత్సాహవంతులున్నారు వాళ్ళ ప్రతిభను ప్రోత్సహించినట్టు ఉంటుంది మనకి ఖర్చులు కూడా కలిసి వస్తాయి" అంది.

పద్మిని నీరుకారిపోయింది ఆ మాటకి. తనతో ఎంతోకాలంగా సన్నిహితంగా ఉంటూ, కష్టసుఖాలు పంచుకుంటూ కలిసి అనేక ప్రదర్శనలు ఇస్తున్న తోటి కళాకారులు, భవిష్యత్తులో తన సంస్థలో శాశ్వతసభ్యులుగా చేరి ముందు, ముందు అనేక ప్రదర్శనలు ఇవ్వాల్సినవాళ్ళు వాళ్ళని తను తీసుకోకపోతే తన గురించి ఏమనుకుంటారు. పద్మిని స్వార్ధపరురాలు అనుకుంటారు కదా! మొదటిసారిగా తన బ్యానర్ మీద ప్రదర్శిస్తున్న నాటకం ఎంత ఉత్సాహంగా ఎదురుచూస్తారు వాళ్ళంతా. అలాంటిది వాళ్ళ మనసు కష్టపెట్టడం, కోరి మనస్పర్ధలు తెచ్చుకోడం అవుతుంది. ఈవిడకి ఆ విషయం ఎలా చెప్పడం? పోనీ కొంత ఖర్చు తగ్గించమంటే!? శివా, తనూ కలిసి ముందే దాదాపు ఖర్చులన్నీ తగ్గించి వేసిన బడ్జెట్, ఇంకా తగ్గించడం అంటే తన పారితోషికం వదులుకోవాలి. తను కష్టపడేదే అందుకోసం ఎలా వదులుకోడం? పోనీ ముందు బ్యానర్ వెలుగులోకి వస్తుంది, డబ్బు సంగతి వదిలేద్దామా అంటే తెల్లవారి లేస్తే పాలు, నీళ్ళు ఏవి కావాలన్నా డబ్బులేంది ఎక్కడినుంచి తేగలదు? పద్మినికి కళ్ళముందు అంధకారం అలుముకున్నట్టుగా అనిపించింది. నిరుత్తరురాలై ఆవిడవైపు నిస్సహాయంగా చూసింది.

ఆవిడ అదేం గమనించకుండా మళ్ళీ అంది " పద్మినిగారూ మీరు, మరో ఇద్దరు మాత్రం పాల్గొనండి మిగతా పాత్రలన్నీ మావాళ్ళతో వేయిస్తాను. పైగా ఇది స్కూలు వార్షికోత్సవం కాబట్టి స్కూలు తరపున ఇస్తున్న ప్రదర్శన కాబట్టి స్కూలుకి సంబంధించిన వాళ్ళు పాల్గొనడం ధర్మం కూడా."

"అంటే! ఇది మా బ్యానర్ ద్వారా వేస్తున్నాం కాబట్టి మా సంస్థలో సభ్యులు వేయకపోతే.. "

సణుగుతున్నట్టుగా అంటున్న పద్మిని మాటల్ని ఆపేస్తూ అంది ఆవిడ.

"లేదు, లేదు స్కూలు నుంచే వేస్తున్నాం. మీ బ్యానర్ కాదు. "

పద్మిని గుండెలమీద పెద్ద కొండచరియ విరిగిపడినట్టు అనిపించింది. అయ్యో ఆఖరికి ఇలా అయిందేంటి? బాధగా అనుకుంది.

పద్మిని మనసు చదువుతున్నట్టు అంది కమల

"ఇంకోసారి ఎప్పుడైనా అవకాశం ఉంటే మీ బ్యానర్ ద్వారా ప్రదర్శించే ఏర్పాటు చేస్తాను. మీకు తలా పదిహేను వందలు ఇస్తాము టీలు, టిఫిన్‌లు కలిపి మొత్తం ఐదువేలతో సరిపోతుంది. "

గుండెల్లో పొంగిన గోదావరి గొంతుదాకా రాగానే ఎవరో ఆనకట్ట వేసి ఆపేసినట్టు సంస్కారం, విచక్షణ ఆమె దుఃఖాన్ని గుండెల్లోనే అణిచివేసాయి. కళ్ళు కన్నీటి సముద్రాలయ్యాయి..

మౌనంగా తలాడించి అక్కడినుంచి వచ్చేసింది. ఏమాశించింది.. ఏం జరుగుతోంది.!?

అనుభవం లేనివాళ్ళతో నాటకం రిహార్సల్స్ వేసేదెలా? డైరెక్టర్ ఎవరు? స్క్రిప్ట్‌లో బలం లేదు. పేలవమైన పేలవమైన సంభాషణలు, బలహీనమైన సన్నివేశాలు, ఎక్కడా నాటకీయత లేదు. అనుభవంలేని టీచర్ ఎవరో పిల్లలకు చెబుతున్న పాఠంలోంచి కొన్ని సన్నివేశాలు తీసుకుని రాయడానికి ప్రయత్నించిన నాటకం. అది ప్రదర్శించాలనుకోడమే సాహసం, ప్రదర్శించాక చూసిన వాళ్ళు ఆనందించాలి. ముందు ప్రేక్షకులకి ఆ నాటకప్రదర్శన చూడాలన్న ఆసక్తి కలగాలి. అలా కలగాలంటే రచన బాగుండాలి. దర్శకత్వం బాగుండాలి. కళాకారుల నటన బాగుండాలి. ప్రేక్షకులను మైమరిపించే సంభాషణలు ఉండాలి. భావోద్వేగాలను ప్రతిబింబించని నటన నటనవుతుందా? నటన గురించి తెలియని వాళ్ళు కేవలం ఉత్సాహం ఉందని వేదిక ఎక్కితే ఏం జరుగుతుంది?

నాటకం అంటేనే భావోద్వేగాల ప్రతిబింబంకదా. పండిత, పామర జనరంజకం నాటకం. ఈ ప్రాథమిక సూత్రం తెలియకుండా ఒక గొప్ప ఆదర్శ మహిళ జీవిత చరిత్రను వేదికమీద ప్రదర్శించాలనుకోడం అందులోనూ అనుభవం లేనివాళ్ళతో ఆవిడది తెలివితక్కువా? అనుభవరాహిత్యమా? అత్యాశా?

పద్మినికి ఏం అర్థంకాలేదు. అసలు రిహార్సల్స్ ఎలా చేయాలి? తన వాళ్ళు ముగ్గురంటే ఎవరికి ఏ పాత్ర ఇవ్వాలి తను, సుందరి, కళావతి. మరి వసంత? వసంతకి పాత్రలేకుండా ఎలా? ఒకవేళ వసంతని ఏదో ఒక పాత్రకి తీసుకుంటే వాళ్ళిద్దరిలో ఎవరిని తీసెయ్యాలి సుందరా? కళావతా? పాపం రాముకి మేకప్‌కి అవకాశం ఇస్తానని చెప్పింది. ఆశగా ఎదురుచూసే అమాయకుడికి ఏమని చెప్పాలి? పద్మిని మనసంతా కకావికలం అయిపోయింది. ఏంటో దేవుడు మనుషుల్ని, రాక్షసుల్ని ఒకేలా భావిస్తాడు కాబోలు. సాగరమథనంలో లభించిన అమృతాన్ని రాక్షసుల నోటిదాకా తీసుకొచ్చి వాళ్ళకు దక్కకుండా చేసినట్టే తనలాంటి వాళ్ళకి అవకాశాలు అందించినట్టే అందించి దూరం చేస్తుంటాడు.

నీరసంగా ఇల్లుచేరిన పద్మిని మొహం చూసి ఖంగారుగా అడిగింది వసంత "ఏమైందక్కా అట్లా ఉన్నావేం?"

"ఏం లేదు కాసిని మంచినీళ్ళివ్వు వసంతా" అంటూ మంచం మీద వాలిపోయింది.

వసంత అదే ఖంగారుతో వెళ్ళి కుండలోంచి చల్లటి మంచినీళ్ళు తీసుకొచ్చి ఇచ్చింది.

అవి తాగి తిరిగి మంచం మీద వాలిపోయిన పద్మిని పక్కన చేరి లాలనగా అడిగింది "ఏం జరిగింది?"

ఒక్కసారి భళ్ళున బద్దలైన కుండలా కన్నీరు ధారకట్టింది పద్మినికి. వెక్కుతూ అంతా చెప్పింది.

"ఈ మాత్రానికే అంత బాధపడాలా పిచ్చి అక్కా. పోనీలే కనీసం పదిహేనువేలు వస్తాయికదా. నాకు లేకపోయినా ఫర్వాలేదు మాటపోకూడదు కాబట్టి సుందరికి, కళావతికి అవకాశం ఇద్దాం సరేనా! " ఓదార్పుగా, మృదువుగా ఉన్న వసంత మాటలకి పద్మిని నెమ్మదిగా కోలుకోసాగింది.

మర్నాడు సుందరి దగ్గరకు వెళ్ళి విషయం చెప్పింది.

"నాకు ఆర్థికంగా పెద్ద ఇబ్బందులేం లేవు పద్మినీ. ఏదో ఒక కళాతృష్ణతో నటిస్తున్నాను. ఏం ఫర్వాలేదు."

"వసంత, నువ్వు, కళావతి వేయండి. ఇంకోసారి అవకాశం వస్తే నాకు ఇవ్వచ్చు" అంది సుందరి పెద్దమనసుతో.

కళాకారులు ధనవంతులు కాదు కానీ, అభిమానధనులు అనుకుంది పద్మిని. ఎంత సున్నితమైన మనసు ఇచ్చాడు దేవుడు. అందుకే కాబోలు ప్రతి వ్యతిరేక సంఘటనా కళాకారులను అంతగా కదిలిస్తుంది. దీన్నే స్పందన అంటారు కాబోలు. అవును స్పందించని మనసు రాయి. రాయిలాంటి మనసున్న వాళ్ళు కళాకారులు కాలేరు.

ఆ తరువాత కమల యవనికతో కబురుచేసింది. వార్షికోత్సవానికి వారం రోజులు ముందునుంచే వాళ్ళ స్కూలు ఆవరణలో సాయంత్రం నాలుగింటినుంచి ఆరింటిదాకా రిహార్సల్స్ జరపాలని.

రిహార్సల్స్ చేస్తుంటే పద్మినికి ఏడుపొచ్చేది. ఒక్కళ్ళు కూడా సరిగా సంభాషణలు పలకడంలేదు. ఒక్కళ్ళకి కూడా స్వరంలో భావ వ్యక్తీకరణ లేదు. మొహంలో భావాలు లేవు. ఆంగికాభినయంలో కూడా లోపాలు. నాటకానికి అవసరమైన ఆంగికం, వాచికం, ఆహార్యం, సాత్వికం ఏమీ మచ్చుకి కూడా కనపడలేదు టీచర్ల నటనలో. మొక్కుబడిగా రిహార్సల్స్ చేస్తున్నారు. వాళ్ళు గురుస్థానంలో ఉన్నారు తను ఏదన్నా చెబితే ఏం అనుకుంటారో అని మధనపడింది పద్మిని. ఆఖరి రిహార్సల్స్ రోజు మాత్రం కమల కల్పించుకోడంతో పద్మిని డైలాగ్ డెలివరీలో కొద్దిగా వాళ్ళకి శిక్షణ ఇచ్చింది. అదే ప్రదర్శన రోజు నాటకాన్ని నిలబెట్టింది.

శివ, రజని పిల్లలతో వచ్చారు. రాము, సుందరి మరికొందరు తోటి కళాకారులు కూడా పద్మిని మీద అభిమానంతో కార్యక్రమానికి వచ్చారు. తనకి అవకాశం ఇవ్వకపోయినా మంచి మనసుతో వచ్చి అభినందిస్తున్న రాముని దగ్గరకు తీసుకుని దీవించింది పద్మిని.

చక్రధరం కూడా వస్తాడనుకుంటా "పద్మినీ, ఎన్నింటికి కార్యక్రమం?" అని అడిగాడు అన్నాడు శివ.

"వస్తే రానీ, మనకేం" అంది పద్మిని.

కళావతి పద్మినితో అంది. "పద్మినీ ఎప్పుడు, ఏ అవసరం కలిగినా నాకు చెప్పు. నువ్వు డబ్బులివ్వకపోయినా ఫర్వాలేదు. నీకోసం నేను ఏదైనా చేస్తాను. "

"థాంక్స్ కళా. మీ అందరి సహాయ, సహకారాలు, ప్రోత్సాహం ఉంటే నేను ఏదైనా చేయగలనని నాకు ఆత్మవిశ్వాసం కలుగుతుంది. తప్పకుండా మనం మన సంస్థని అభివృద్ధి చేసుకుందాం ఎన్ని ఆటంకాలు వచ్చినా అది వదిలేదు లేదు" అంది పద్మిని స్థిరంగా.

కార్యక్రమాలు మొదలైనాయి.

ప్రార్థనాగీతంతో ప్రారంభం అయింది. నలుగురు పిల్లలు మా తెలుగు తల్లికి మల్లెపూదండ అంటూ పాడుతూంటే పద్మినికి ఒంటిమీద రోమాలు నిక్కపొడుచుకున్నట్టు అయాయి. ఎంతో అద్భుతంగా, స్ఫూర్తిదాయకంగా ఉంది వాళ్ళపాట.

ఆ తరవాత ఇద్దరమాయిలు భరతనాట్యం చేశారు. ఆ తరవాత ఇద్దరు అమ్మాయిలు లలితగీతాలు పాడారు.

వాళ్ళ డాన్సులు చూస్తుంటే, పాటలు వింటోంటే ఈ సూల్లో ఎంత మంది అమ్మాయిల్లో చక్కటి ప్రతిభ ఉంది అని ఆశ్చర్యపోయింది పద్మిని.

ఆ తరువాత పద్మిని ట్రూప్ నాటకం దుర్గాబాయి జీవితం. పద్మిని ఇచ్చిన శిక్షణలో అందులో మొదటిసారిగా నటించిన టీచర్లు ఫర్వాలేదనిపించారు. కళావతి గాంధీగా చక్కగా సరిపోయింది. వసంత నెహ్రూగా ఒదిగిపోయింది.

పద్మిని సంగతి చెప్పక్కర్లేదు అన్నట్టు అలవోకగా దుర్గాబాయి పాత్రలో ఒదిగి నటించింది. ఎంతో సహజంగా, దుర్గాబాయేనా ఈమె అన్నట్టు నటిస్తున్న ఆమె నటనకి అందరూ ముగ్ధులైనారు. నాటకం ముగుస్తుండగా చప్పట్లతో మారుమోగింది ఆడిటోరియం.

ఆ తరువాత శాకుంతలం నాటకంలో ఆమె కూతురుని ప్రియంవద పాత్రలో చూసి ఆశ్చర్యపోయింది. నా కూతురిలో నిగూఢంగా ఇంత ప్రతిభా, పాటవాలున్నాయా, ఇంతటి నటనా కౌశలం దాగి ఉందా అని అని అబ్బురపడింది. మేకప్‌లో ఎంతో అందంగా, ముచ్చటగా అనిపించింది. వసంత కూడా యవనిక నటనకి, అందమైన ఆ రూపానికి ముగ్ధురాలైంది.

శివ, కళ, సుందరి, రాము అందరూ వచ్చి పద్మినిని అభినందనలతో ముంచెత్తారు. యవనిక నటనకి ఆశ్చర్యం ప్రకటించారు.

"పులికడుపున పిల్లి పుట్టదుగా పద్మినీ.. నీ టాలెంట్ నీ కూతురికి కూడా వచ్చింది" అన్నాడు శివ.

నవ్వి ఊరుకుంది పద్మిని. ఆమెకి కూతురి సామర్ధ్యం సంతోషంతోపాటు ఆందోళన కూడా కలిగించింది. కారణం ఆ పిల్లని ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ రంగంలోకి రానివ్వకూడానేది ఆమె కోరిక, ఆశయం కూడా. ఇప్పుడు యవనికకి తప్పకుండా చాలా ప్రశంసలు వస్తాయి. అవి విని ఆ పిల్ల ప్రలోభపడిందంటే తన ఆశలన్నీ కూలిపోతాయి. ఈ వయసులో పొగడ్తల పట్ల ఆకర్షితులు కానివాళ్ళు ఎవరు? అనుకుని నిట్టూర్చింది.

ఆ తరువాత ఎమ్.ఎల్.ఏగారు, సర్పంచ్ గారు, మరి కొంతమంది అతిథులతో మీటింగ్ ఏర్పాటు చేశారు.

కళాకారులందరినీ ఎమ్.ఎల్.ఏ గారు పూలమాలతో, చిన్న మెమెంటోలతో సత్కరించారు.

పద్మినికి స్వయంగా శాలువా కప్పి, పూలమాల ఇచ్చి "చాలా బాగా నటించారమ్మా" అని ప్రశంసిస్తుంటే పద్మినికి ఇన్ని రోజులుగా మనసులో చెలరేగిన బాధ, ఆందోళన తీసేసినట్టు మనసు ఉల్లాసంగా మారింది. తనతోపాటు కళావతిని, వసంతని కూడా పూలమాల, శాలువాలతో సత్కరించిన ఎమ్.ఎల్.ఏ గారికి కృతజ్ఞతగా నమస్కరించింది.

అనంతరం ఎమ్.ఎల్.ఏ గారి ఉపన్యాసం.

ఆయన ఏం మాట్లాడతారో, నాటకం గురించిన అభిప్రాయం ఏం చెప్తారో అని ఉద్వేగంగా కూర్చుంది పద్మిని.

"ప్రేక్షకులకి నమస్కారం. మీరంతా నా మీద అభిమానంతో, ఆదరంతో గత ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించి ఊరికి ఎమ్.ఎల్.ఏ గా సేవలు చేసే అవకాశం ఇచ్చారు. నేను ఈ ఊరిలో పుట్టాను. ఇక్కడే పెరిగాను. ఈ స్కూల్లో నా సోదరి చదువుకుంది. నేను కూడా మగపిల్లల ప్రభుత్వ పాఠశాల చదువుకున్నాను.

ఈ రోజు ఏ స్కూలుతో నాకు, నా కుటుంబ సభ్యులకి కూడా అనుబంధం ఉందో ఆ స్కూలుకి ఒక ముఖ్య అతిథిగా రావడం నాకు గర్వంగా ఉంది. ఈ స్కూలు పరిస్థితి చూశాను. ప్రాథమిక అవసరాలు కూడా తీర్చుకోలేని దీన స్థితిలో ఉన్నారు. ఈ విద్యార్థులు, బిల్డింగ్ కూడా శిథిలావస్థలో ఉంది కూర్చోడానికి కుర్చీలు లేవు, పిల్లలకి బెంచీలు లేవు రాసుకోడానికి సరైన బల్లలు లేవు. ఎక్కడ చూసినా పెచ్చులూడిపోతున్న గోడలు, కొన్ని చోట్ల గోడలకి రావి మొక్కలు, పిచ్చి మొక్కలు మొలిచాయి. ఇదంతా చూస్తుంటే నాకు దుఃఖం ఆగడం లేదు.

ఇక్కడనుంచి ఎందరో విద్యార్థులు అక్షరాస్యులై, విద్యావంతులై, విజ్ఞానధనులైన బైటకి వచ్చి ఈనాడు ఎంతో ఉన్నత స్థానంలో ఉన్నారు. ఇక్కడి నుంచి ఎందరో గురువులు ఈ సమాజానికి మేధావులను అందించారు. అందరికీ నేను శిరసు వంచి నమస్కరిస్తున్నాను. గురుఃబ్రహ్మ, గురుఃవిష్ణు, గురుదేవో మహేశ్వరః, గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః.

తల్లితండ్రులని పూజించినట్టే గురువులను కూడా పూజించే సంస్కృతి మనది. అలాంటి సంస్కృతిలో పుట్టి పెరిగిన నేను ఈ రోజు నుంచీ ఈ స్కూలు అభివృద్ధికి కృషి చేస్తానని మాట ఇస్తున్నాను. "

చప్పట్లతో మారుమోగింది. ఆ చప్పట్ల శబ్దం ఆగిపోయిందాకా మౌనంగా అందరినీ కలయచూస్తున్న ఎమ్.ఎల్.ఏ గారు తిరిగి తన ఉపన్యాసం మొదలు పెట్టాడు.

"ఈ రోజు ఇక్కడ జరిగిన వార్షికోత్సవంలో ఇక్కడి గురువులు, విద్యార్థులు ఎంతో కష్టపడి ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూశాను. ముఖ్యంగా మహిళాలోకానికే ఆదర్శం. మణిపూస దుర్గాబాయి దేశ్‌ముఖ్ గారి జీవిత చరిత్రను నాటకంగా ప్రదర్శించడం గొప్ప విషయం. ఆమె జీవితం మహిళలందరికీ స్ఫూర్తిదాయకం. ఆమె ఈ దేశానికి చేసిన సేవ అనన్యం అద్భుతం. ఈ

నాటకం రాసిన వారికి నా అభినందనలు, అలాగే దుర్గాబాయిగా నటించిన కళాకారిణిని చూస్తుంటే దుర్గాబాయి స్వర్గాన్నించి దిగివచ్చిందేమో అనిపించింది. ''

చప్పట్లతో మరోసారి మారుమోగింది. కళావతి, వసంత బిగ్గరగా, ఉత్సాహంగా చప్పట్లు కొడుతూ ఆనందంగా తనవైపు చూస్తుంటే సన్నగా నవ్వింది పద్మిని.

''నా చిన్నప్పుడు ఈ ఊళ్ళోనేకాక, చుట్టు పక్కల ఏ ఊళ్ళో నాటక ప్రదర్శన ఉన్నా ఎంతో ఉత్సాహంగా వెళ్ళేవాడిని మన ఆంధ్రదేశం పద్యనాటకాలకు ప్రసిద్ధి. ఏ భాషలోనూ లేని ఒక గొప్ప ప్రక్రియ పద్యనాటక ప్రక్రియ అది కేవలం తెలుగువాళ్ళకే దక్కిన వరం. పౌరాణిక నాటకాలు రాత్రంతా ప్రదర్శించేవారు. నాకు బాగా గుర్తు. మైరావణ, హిరణ్యకశిపుడు, జరాసంధ మొదలైన పాత్రల్లో వేమూరి గగ్గయ్యగారు అనే గొప్ప కళాకారుడు వేదికనెక్కి పద్యాలు పాడుతుంటే ఆయన కంచు కంఠం విని భయపడిన రోజులున్నాయి. ఆయన రంగస్థలం మీద భయంకరాకారంతో కనిపించగానే ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని కూర్చునేవాడిని. మా నాన్నగారి ఒడిలో ఒదిగి భీభత్స, రౌద్ర, భయానకరసాలు ఆయన పోషించినంత అద్భుతంగా మరెవరూ పోషించలేదేమో అనిపిస్తుంది. అసలు ఆ స్వరం ఏంటండి. అది స్వరమా? మేఘగర్జనా అనిపించేది. అలాగే ఆచంట వెంకటరత్నం నాయుడుగారు తులసీ జలంధర నాటకంలో జలంధరుడుగా ఆహా ఆ గెటప్‌లో వేదికనెక్కితే సర్వం మరిచిపోయేవాళ్ళం. నా జన్మధన్యమైపోయింది.

కేవలం పౌరాణిక నాటకాలేకాదు. సాంఘికాలు కూడా ఆ రోజుల్లో అద్భుతంగా ఆడేవారు. ఓసారి నేనూ ఓ చిన్న పాత్ర వేశాను. దామరాజుగారని వారు గాంధీజీ ఆశయాన్ని తన నాటకాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్ళి వాళ్ళల్లో స్ఫూర్తిని రగిలించేవారు. లక్షలాదిమందిని సమీకరించి చైతన్యపరిచిన జాతీయ నాటక పితామహుడు దామరాజుగారు వారి పూర్తిపేరు నాకు గుర్తులేదు.

అలాగే హరిశ్చంద్ర నాటకం కూడా డి.వి.సుబ్బారావుగారు పెట్టింది పేరు ఆ పాత్రకి. ఏ.వి. సుబ్బారావుగారు, షణ్ముఖ ఆంజనేయులుగారు, ఈలపాట రఘురామయ్యగారు, స్థానం నరసింహారావుగారు స్త్రీ పాత్రలకి పెట్టింది పేరు. వారు స్త్రీ పాత్రలో వేదికనెక్కితే ఆయన మగవాడన్న విషయమే గుర్తుండేదికాదు ఎవరికీ. అబ్బబ్బ ఎన్నని చెప్పను. ఆ రోజులు, ఆ వైభవం చెప్పుకుంటూ పోతే ఎంతకాలమైనా నేనీ వేదికమీదే ఉండాల్సి వస్తుంది. మీరంతా ఆ కుర్చీల్లో అలా కూర్చునే ఉండాలి.

తెలుగువారికి ఆ భగవంతుడు ప్రసాదించిన వరాలు వీళ్ళంతా. తెలుగుజాతి చరిత్ర ఉన్నంతకాలం ఈ మహానుభావులు చిరంజీవులై ఉంటారు. వీరిలో కొందరు మన జిల్లాకు చెందినవారు కావడం మన అదృష్టం.''

మరోసారి చప్పట్లతో మారుమోగిపోయింది.

''కాబట్టి సోదర, సోదరీమణులారా! అంతటి మహత్తర చరిత్ర ఉన్న మన ఈ ఊరిని, ఈ జిల్లాని అభివృద్ధి చేసుకోడం మన కర్తవ్యం. నేను జీవించి ఉన్నంతకాలం మీ అందరి సేవలో నా జీవితాన్ని తరింపచేసుకుంటానని మాట ఇస్తున్నాను. ఈ స్కూలుని ఎంతో బాగా మన రాష్ట్రానికే గర్వకారణం అయేలా అభివృద్ధి చేస్తానని వాగ్దానం చేస్తున్నాను. గత ఎన్నికల్లో మాదిరిగానే రాబోయే ఎన్నికల్లో కూడా మీరంతా మీ దీవెనలు నాకు అందిస్తే మీ సేవలు చేసుకునే మహద్భాగ్యం కలుగుతుంది. ''

''అక్కా! మనం ఎప్పుడన్నా వీలు చూసుకుని ఈయన్ని కలిసి మన సంస్థకి విరాళం ఇవ్వమని అడుగుదాం తప్పకుండా ఇచ్చేలా ఉన్నారు'' అంది వసంత నెమ్మదిగా పద్మినితో.

అనుభవజ్ఞురాలైన పద్మిని చిరునవ్వుతో అంది. ''వేదికమీద చెప్పిన మాటలు, చేసిన వాగ్దానాలు వేదిక దిగగానే మర్చిపోయేవాళ్ళే రాజకీయనాయకులు. అవన్నీ విని మనమేదో ఊహించుకుంటే ఎదురుదెబ్బలు తగులుతాయి. అవేం పట్టించుకోకు. ''

ఆమె మాటలకి చకితురాలైంది వసంత.

ఆ తరువాత మిగతా అతిథులు కూడా కళాకారులను అభినందించారు.

వాళ్ళ తరువాత కమల మాట్లాడుతూ ఎమ్.ఎల్.ఏ గారికి, అతిథులకి, తోటి టీచర్లకి, విద్యార్థులకి కృతజ్ఞతలు చెప్పింది. అందులో తన పేరుగానీ, తన వాళ్ళ పేరుగానీ లేకపోవడం పద్మినిని మనసుని గాయపరిచింది. తనలాంటి సీనియర్ కళాకారిణిని ప్రత్యేకంగా పిలిచి నాటకం గురించి మాట్లాడి, తన సహాయ, సహకారాలు పొంది, మాట ఇచ్చిన ప్రకారం తన వాళ్ళకి అవకాశం ఇవ్వకపోయినా, తన బ్యానర్ పెట్టించకపోయినా కలగని బాధ ఇప్పుడు ఆవిడ మాటల్లో తన ప్రసక్తి లేకపోవడంతో ముల్లులా గుచ్చుకుంది.

వసంత కూడా అదే అంది. "అదేంటక్కా మన గురించి అసలు మాట్లాడదేం ఆవిడ.?"

"పోనీలే వసంతా. ఇప్పుడు మనకి కొత్తగా ఆవిడ పొగడ్తలు కావాలా? వెళ్ళిపోదాం పద బాగా పొద్దుపోయింది" అంది లేస్తూ.

వసంత యవనికను కూడా పిలుచుకుని రావడానికి వేదిక వెనక్కి వెళ్ళింది.

"ఎమ్.ఎల్.ఏగారికి రంగస్థల నాటకాల గురించిన అవగాహన, విజ్ఞానం బాగా ఉందనిపించింది కదూ! " అంది సుందరి.

"అవును మనక్కూడా తెలియని విషయాలెన్నో చెప్పారు" ఒప్పుకున్నాడు శివ.

"ఆయన వయసుకి ఆ మాత్రం తెలియదా ఏం? అప్పట్లో వేరే కాలక్షేపం ఏముండేది వీళ్ళకి. నాటకాలేగా విరివిగా ఆడేవారు కాబట్టి అందరికీ నాటకాల గురించి బాగనే తెలుస్తుంది" అంది రజని.

"అంతేలే మీరన్నది నిజం రజనక్కా" అంది కళ.

పద్మిని, శివ, రాము, సుందరి, కళావతి నిలబడి మాట్లాడుకుంటుంటే అటుగా బర్రన దూసుకుపోయిన బండిమీద చక్రధరం కనిపించాడు. తన వైపు క్రూరంగా చూసి వెళ్ళడం ఆ లైట్ల వెలుగులో గమనించిన పద్మిని ఒక్క క్షణం భయంతో వణికింది.

"నాకు అనుమానంగా ఉంది పద్మినీ. వీడే ఏదో పుల్ల పెట్టి ఉంటాడు. అందుకే ఆవిడ బ్యానర్ లేకుండా చేసింది. ఖచ్చితంగా వీడే ఏదో చేశాడు" అన్నాడు శివ చక్రధరం వెళ్ళిన వైపు చూస్తూ.

పద్మినికి కూడా ఆ క్షణంలో నిజమే అనిపించింది. తలాడిస్తూ అంది. "నాకూ అలాగే అనిపిస్తోంది. "

యవనిక రావడంతో అందరూ కలిసి నెమ్మదిగా నడుస్తూ ఇంటిదారి పట్టారు.

ఆ రాత్రి యవనికకి దిష్టితీస్తూ అంది పద్మిని. చాలా బాగా నటించావు యవనీ! చక్కగా ఉన్నావు కానీ, ఈ ప్రలోభంలో పడి చదువు మాత్రం నిర్లక్ష్యం చేయకు. "

"అవునమ్మా నేను శకుంతలగా వేసినమ్మాయికన్నా కూడా చాలా అందంగా ఉన్నానటకదా అందరూ అన్నారు. అసలు నువ్వే శకుంతలగా వేస్తే బాగుండేది అని కూడా అన్నారు" అంది యవనిక మెరిసే కళ్ళతో.

"అలాగే అంటారు అవన్నీ పట్టించుకోకు" నిర్లిప్తంగా అనేసి పెరట్లోకి వెళ్ళిపోయింది పద్మిని.

"అమ్మకి నేను నటించడం ఇష్టంలేదు" బుంగమూతితో అంది యవనిక.

"మీ అమ్మకి నిన్ను బాగా చదివించాలని కోరిక యవనీ.. చదువుకో" అంటున్న వసంతవైపు చికాగ్గా చూసింది యవని. వసంత కూడా పెరట్లోకి వెళ్ళిపోడంతో యవనిక లైటార్పేసి మంచం మీద వాలిపోయి ఆలోచనల్లో పడింది.

ఆమెకిప్పుడు తన ఫోటోలు చూసుకోవాలని ఆరాటంగా ఉంది. "అందరూ తను మేకప్‌లో అందంగా ఉందని అంటున్నారు. చీరకట్టుకుని నటించిన ఆ ఫోటోలు చూడాలి. చీరలో తనెలా ఉందో చూసుకోవాలి. "నీ ఫిగర్ చాలా బాగుంది యవనీ" అంది నందిత. ఫిగర్ అంటే ఏంటో? ఒంపుసొంపులట. అంటే తను పొడుగ్గా ఉంటుంది. పుష్టిగా ఉంటుంది తెల్లగా లేకపోయినా కనుముక్కు తీరుగా ఉంటుందంటారు. ముఖ్యంగా కళ్ళు తనవి అమ్మ కళ్ళే. అమ్మ అంత అందంగా ఉంటుందా తను. ఏమో చీర కట్టుకుంటేనే అందం

తెలుస్తుందిట. రోజూ చీర కట్టుకోదు నాటకం కోసం చీర కట్టుకుంది. ఆ చీర తెల్లటి షిఫాన్ చీర. మెత్తగా, ముట్టుకుంటే జారిపోతూ, అరచేతుల్లో ఇమిడిపోయిన ఆ చీర అరుణా టీచర్‌ది. ఆవిడ కూడా చాలా అందంగా ఉంటారు. ఆ చీరంటే ఆవిడ భర్తకి చాలా ఇష్టంట. పాడు చేయకు ఈ చీరంటే మా ఆయనకి చాలా ఇష్టం అంది ఆవిడ తనకి చీరకడుతూ.

అమ్మకెందుకు తను నటించడం ఇష్టంలేదు. సినిమాల్లో నటిస్తే బోలెడంత డబ్బు సంపాదించుకోవచ్చు. అమ్మకంటే అవకాశాలు రాలేదు. తనకెందుకు రావు? వస్తాయి. తప్పకుండా వస్తాయి. ఎంత చదువుకున్నా నెలజీతం తప్ప ఏం వస్తుంది? సినిమాలో అయితే లక్షలు, లక్షలు సంపాదించచ్చు. అయినా చదువుకీ, నటనకీ లంకె పెడుతుందేంటి అమ్మ. "

యవనిక ఆలోచిస్తూనే నిద్రలోకి జారిపోయింది.

జామ చెట్టు కింద ఉన్న అరుగు మీద కూర్చుని ఉన్న పద్మిని పక్కనే కూర్చుంటూ "నిద్రరావడంలేదా అక్కా? " అడిగింది వసంత.

దీర్ఘంగా నిట్టూర్చి "లేదు వసంతా! " అంది పద్మిని.

"ఎందుకక్కా అంత ఆలోచిస్తావు. ఏదో ఒక అవకాశం వచ్చింది. నాలుగు డబ్బులొచ్చాయి సంతోషించు. మళ్ళీ వస్తుంది ఇంకో అవకాశం జీవితాన్నిచ్చిన దేవుడు బతకడానికి దారివ్వడా?"

"దారంతా ముళ్ళు పరిచి ఇచ్చాడు ఎందుకివ్వలేదు? ఒక్కో ముల్లు ఏరిపారేస్తూ, ఇంతదూరం వచ్చాను. నాకు రోజు, రోజుకీ ఓపిక సన్నగిల్లిపోతోంది. వయసుకు మించిన భారాన్ని మోస్తున్న ఈ భుజాలు వంగిపోతున్నాయి వసంతా. "

"నా కెందుకో జీవితం అంటే భయంగా ఉంది. " అకస్మాత్తుగా పద్మిని వెక్కి, వెక్కి ఏడవసాగింది.

ఊహించని ఆ సంఘటనతో బెదిరిపోయింది వసంత. ఆమెక్కూడా ఏడుపొచ్చింది. తను అంధకారంలోంచి నడుచుకుంటూ వచ్చిన రోజున ఈ పద్మినే చేరదీసి చిన్న దీపం వెలిగించింది. ఆ చిరువెలుగులోనే బతుకుబండి లాక్కొస్తోంది గౌరవంగా, సుఖంగా ఉన్నంతలో బతకడమే తెలుసు ఆమెకి ఏదో కావాలని ఆశించి ఆశించింది. ఆశించింది లభించకపోతే నైరాశ్యానికి గురై బతుకునే పరిసమాప్తి చేసుకోవాలన్న పిరికితనాన్ని ఏనాడూ ఆహ్వానించలేదు. బతికినన్నాళ్ళు బతకడమే తెలుసు వసంతకి. పద్మిని పప్పు, కూర, పెరుగు వేసి పెట్టిననాడు ఎంత ఆప్యాయంగా తిన్నదో, ఒట్టి మజ్జిగన్నం పెట్టినరోజూ అంతే ఆప్యాయంగా తింది. కష్టం, సుఖం సమానంగా పంచుకుంది పద్మినితో. అలాంటిది ఇవాళ పద్మిని అకారణంగా ఇలా బేల అయిపోయి ఏడుస్తుంటే వసంతకి ఏం చేయాలో అర్థం కాలేదు. నెమ్మదిగా పద్మిని భుజం మీద చేయేసి గాద్గదికంగా అంది "ఏడవకక్కా. "

పద్మిని చప్పున వసంత ఒళ్ళో వాలిపోయింది.

అమావాస్య రాత్రి ఆకాశం చుక్కల చీర కట్టుకుని, దారి తెలియని పాంధులకి తనవంతు సహకారం అందించడానికి ప్రయత్నిస్తూ చిరువెలుగు పరడానికి కృషి చేస్తున్నట్టుంది. కానీ, చందమామతో కూడినప్పుడే తనకి విలువనిచ్చే మనుషులు మీద అలిగినట్టు తారకలు మేఘాల ముసుగులో తమని తాము దాచుకోడానికి ప్రయత్నిస్తున్నాయి.

పరిసరాలు ప్రశాంతంగా ఉన్నయి. అందరూ నిద్రలోకి జారిపోయినట్టు చుట్టుపక్కల ఇళ్ళల్లో ఎక్కడా లైటు వెలుగుతున్న సూచనలు కనిపించడంలేదు.

"వసంతా! " ఆ నిశ్శబ్ధంలో పద్మిని స్వరం అదోరకంగా వినిపించింది.

"ఏంటక్కా కలవరంగా అడిగింది వసంత.



కౌముది

"నాకివాళ నా మనసు విప్పి నా చరిత్ర చెప్పాలని ఉంది. వింటావా? "

"చెప్పక్కా. ఎప్పటినుంచో అడుగుతున్నాను. నువ్వే చెప్పలేదుగా. " నిష్టూరంగా అంది వసంత.

"చెప్తాను.... తప్పకుండా చెప్తాను. నా మనసులో ఉన్న భారమంతా దించుకుంటాను. ఈ వేదన మోయలేకపోతున్నాను. " అంటూ వసంత ఒడిలోంచి లేచి చీర చెంగుతో మొహం తుడుచుకుంది పద్మిని.

వసంత ఆమె ఏం చెబుతుందో అన్నట్టు ఆసక్తిగా, ఆందోళనగా చూడసాగింది.

**దశరథరామయ్య** జిల్లా పరిషత్తు స్కూల్లో సైన్సు టీచర్. ఆయనకి ముగ్గురు ఆడపిల్లలు, ఒక మగపిల్లాడు. పెద్దమ్మాయి వారిజ, రెండో అమ్మాయి నీరజ, మూడు పద్మిని. ఈ ముగ్గురి తరువాత పుట్టాడు నాలుగోవాడు ప్రవీణ్. ఆయన భార్యపేరు సీతాకుమారి. ఆమె చాలా అందగత్తె. ఆడపిల్లలకేకాదు మగపిల్లాడు ప్రవీణ్‌కి కూడా పూర్తిగా ఆవిడ పోలిక అవడంతో పిల్లలంతా ముత్యాల్లా ఉండేవాళ్ళు.

బొటాబొటీ జీతంతో ముగ్గురు ఆడపిలల్ని, ప్రవీణ్‌ని చదివిస్తూ ఉన్నంతలో సుఖంగా ఉండేవాళ్ళు. గోదావరి జిల్లా ప్రకృతి అందానికేకాక లలిత కళలకు ప్రసిద్ధి. ప్రతి ఇంట్లో ఆడపిల్లలకి తప్పనిసరిగా సంగీతమో, నాట్యమో నేర్పించడం సహజం. ఆడపిల్లలకి సంగీత జ్ఞానం ఉపయోగపడుతుందని నాటి కొందరు తల్లి, తండ్రుల నమ్మకం. లలిత కళల్లో ప్రవేశం ఉంటే పెళ్ళి సంబంధాలు త్వరగా కుదురుతాయని వాళ్ళ అభిప్రాయం.

దశరథరామయ్య కూడా తన కుమార్తెలైన వారిజని సంగీతం, నీరజని, పద్మినినీ కూచిపూడి నాట్యంలో చేర్పించాడు. అలాగే ఆడపిల్లలని పాతకాలంలోలా చాకలిపద్దు చదువుతో ఆపించకుండా మారుతున్న కాలానికి అనుగుణంగా తన కూతుళ్ళు కనీసం డిగ్రీ అయినా పూర్తి చేసి, కాస్త సంగీత జ్ఞానం, మరి కొంత నాట్యంలో ప్రవేశం ఉంది అని చెప్పుకుంటే చాలని మంచి సంబంధాలు కుదిరి పెళ్ళిళ్ళు సులభంగా అవుతాయని ఆయన ఆడపిల్లలు ముగ్గురికీ నాట్యం, సంగీతం నేర్పించాడు. సీతకూడా కూతుళ్ళకి అల్లికలు, కుట్లు నేర్పి, ముగ్గులేయడం నేర్పి తల్లిగా తన బాధ్యతను కూడా తీర్చుకోడానికి ప్రయత్నించింది.

అయితే ఎప్పుడూ కూడా వాళ్ళ చేత కచేరీలిప్పించాలని కానీ, వేదిక మీద నాట్యం చేయించాలని కానీ దశరథరామయ్య ఉద్దేశం కాదు. కేవలం పెళ్ళి సంబంధం కుదరాలన్న ఉద్దేశంతో వారిజకి సంగీతం నేర్పించాడు. అదే సంగీతం ఆయన ఊహించినట్టు ఆమెకి మంచి సంబంధం రావడానికి దోహదం చేసింది.

వారిజకి పదహారేళ్ళు వచ్చేసరికి సంగీతంలో మంచి ప్రవేశం సంపాదించుకుని శ్రీరామనవమి కృష్ణాష్టమి, శివరాత్రి, వైకుంఠ ఏకాదశి మొదలైన ఉత్సవాలకి దేవాలయాల్లో త్యాగరాజస్వామి కృతులు, అష్టపదులు పాడుతూ ఆ ఊళ్ళో అందరికీ అభిమానపాత్రురాలైంది. స్కూల్‌ఫైనల్ పాసై రెండు సంవత్సరాలు ఇంట్లో తల్లికి చేదోడు, వాదోడుగా ఉంటూ మంచి పనిమంతురాలైంది. పద్దెనిమిదేళ్ళు రాగానే వివాహానికి అన్ని విధాలుగా అర్హత సంపాదించుకున్న ఆమెకి ఎమ్.కాం పాసై ఏలూరులో ఒక ప్రైవేటు కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్న శంకరానికిచ్చి పెళ్ళి చేసాడు దశరథరామయ్య.

ఓ శ్రీరామనవమి నాడు దేవాలయంలో వారిజ పాడిన రామదాసు కీర్తనలు విన్న శంకరం తల్లి రాంబాయమ్మ వారిజని చూసి ముచ్చటపడి కోడలిగా ఇంతకన్నా మంచిపిల్లని తీసుకురావడం కష్టమని భర్తకు చెప్పడం, భర్త వెంటనే మధ్యవర్తిద్వారా దశరథరామయ్యకి కబురు చేయడం జరిగింది.

కుర్రాడు సామాన్యంగా ఉన్నా ఎం.కాం చదివిన శంకరం సంబంధం దశరథరామయ్యకి బాగా నచ్చింది. స్కూల్ ఫైనల్ మాత్రం చదివిన తన కూతురికి ఎం.కాం చదువుకున్న కుర్రాడు రావడం అంటే ఆ పిల్ల అదృష్టంగా భావించారు ఆ దంపతులు. ఆనాటికా చదువే గొప్పగా భావించి అమితానందంతో ఆ సంబంధం ఖాయం చేసుకున్నారు. పైగా శంకరం తల్లి, తండ్రులు పెద్దగా కట్నం ఆశించకపోడంతో దశరథరామయ్య ఆ పెళ్ళి సునాయాసంగా చేసి వారిజకి చక్కటి జీవితాన్ని ఇవ్వగలిగాడు. శంకరం కూడా బుద్ధిమంతుడు. భార్యని బాగా చూసుకుంటున్నాడు. ఆమె చేత కచేరీలు ఇప్పించకపోయినా ఆ ఇంట్లో జరిగే ప్రతి శుభకార్యానికి వారిజ పాట ఉండాల్సిందే ఆ విధంగా ఆమె నేర్చుకున్న సంగీతానికి ఓ సార్థకత ఏర్పడింది.

వారిజ అత్తగారింటికి వెళ్ళే సమయానికి నీరజకి పధ్నాలుగేళ్ళు, పద్మినికి పన్నెండేళ్ళు. ప్రవీణ్ పదేళ్ళవాడు.

నీరజకి సంగీతం, నాట్యం కన్నా చదువులో ఆసక్తి ఎక్కువ అవడంతో ఆ పిల్ల అన్ని తరగతుల్లోనూ ఫస్ట్‌క్లాస్‌లో పాసవుతూ, "నేను డాక్టర్‌ని అవుతాను నాన్నా!" అంటూ తన ఆశ వ్యక్తం చేస్తూ ఉండేది. మెడిసిన్ చదివించే శక్తి తనకు లేదని ఆ పిల్ల టెంత్ క్లాస్ అయిపోగానే శంకరం సలహామీద ఏలూరులో అతను పనిచేసే కాలేజీలో ఇంటర్‌లో చేర్పించి అక్కగారి దగ్గర ఉంచాడు నీరజని. నీరజ తన ఆశయం మేరా బాగా చదువుకుంటూ ఉండేది.

అయితే పద్మిని మాత్రం వీళ్ళిద్దరికీ భిన్నంగా తయారైంది. ముగ్గురాడపిల్లల్లో పద్మిని ఎక్కువ అందంగా ఉండేది. నిజం చెప్పాలంటే ముగ్గురూ అందగత్తెలే. ఆ ఊళ్ళో దశరథరామయ్యగారి పిల్లలంటే చందనం బొమ్మలనేవాళ్ళు. కానీ పద్మిని కళ్ళు మిగతా ఇద్దరి కళ్ళకన్నా విశాలంగా ఒత్తైన కనురెప్పలతో, కళ,కళ్ళాడుతూ ఆకర్షణీయంగా ఉండేవి. ముగ్గురికీ పొడుగాటి ఒత్తైన జుట్టు ఉన్నా పద్మిని జుట్టు నడిమీద అలల్లా అందంగా ఉండేది.

పద్మినికి చిన్నప్పటినుంచీ సినిమాలంటే పిచ్చి. ఊళ్ళో కొత్తగా విడుదలైన సినిమాలేకాక, తన స్నేహితురాళ్ళతో కలిసి అప్పుడప్పుడూ స్కూలు ఎగ్గొట్టి మార్నింగ్ షోలో ఆడుతుండే పాత సినిమాలక్కూడా వెళుతూ ఉండేది. ఆ సినిమాల్లోని కథానాయికలు ఆమెని విపరీతంగా ఆకర్షించడమే కాక స్నేహితురాళ్ళంతా నువ్వు పెద్దదానివైతే సరోజాదేవిలా ఉంటావు, జమునలా ఉంటావు అంటుంటే ఉప్పొంగిపోయి అద్దంలో తనని తాను చూసుకుని "నిజమేనా! నేను సినీతారలా ఉంటానా!?" అని అబ్బురపడుతుండేది.

అప్పుడప్పుడు ఎవరూ చూడకుండా అమ్మ చీరో, అక్క చీరో కట్టుకుని బుట్టబొమ్మలా గిర్రున తిరుగుతూ నాట్యం చేస్తుండేది. నెమ్మదిగా ఆ పిల్ల మనసు సినిమా చుట్టూ తిరగడం మొదలై తనో నటి కావాలన్న కోరిక రాజుకోసాగింది.

ఆ ఊళ్ళో రెండో, మూడో నాటక సమాజాలుండేవి. వాళ్ళంతా తరచూ నాటకాలాడుతుండేవాళ్ళు. పౌరాణిక నాటకాలు కృష్ణరాయబారం, కృష్ణలీలలు, రామాంజనేయ యుద్ధం, ఇవికాక చింతామణి నాటకం కూడా ఆడుతుండేవాళ్ళు. దశరథరామయ్యకి నాటకాలంటే పిచ్చి. అంచేత ఊళ్ళో ఏ నాటకం ఆడుతున్నా ఖచ్చితంగా హాజరవుతుండేవాడు. ఆయనతోపాటు అప్పుడప్పుడూ భార్య సీతాకుమారి, పద్మిని కూడా వెళుతుండేవాళ్ళు.

అప్పుడు పద్మినికి పధ్నాలుగేళ్ళు. టెంత్‌క్లాసులోకి వచ్చింది. లంగా జాకెట్ల నుంచి ఓణీల్లోకి వచ్చిన తొలిరోజులు. బాలిక కుమారిగా మారుతున్న పరిణామక్రమంలో ఆమె పొందుపరుచుకున్న పరువాలతో విచ్చుకున్న జాజిపందిరిలా తయారైంది. ఎంత అందమైన కనుముక్కుతీరో, అంతకన్నా చక్కని శరీర సౌష్టవంతో అందానికి అసలైన నిర్వచనంలా తయారైన పద్మిని తను చూసిన సినిమాల్లోని కథానాయికల్లా ఉండాలన్న కోరికతో ఉంటానన్న నమ్మకంతో వాళ్ళలాగే తయారవుతుండడంతో ఆమె అందానికి అలంకరణ తోడై చూపరులను మంత్రముగ్ధులుగా మారుస్తుండేది

వేసవికాలం. పిల్లలంతా పరీక్షలు రాయడం పూర్తయింది. స్కూళ్ళకు సెలవులిచ్చేశారు. వేసవి సెలవల్లో ఆ ఊరంతా పండగ వాతావరణం ఉంటుంది. నాటక ప్రదర్శనలు, ఆటలు, పాటలు, అప్పుడప్పుడూ తిరనాళ్ళతో కోలాహలంగా ఉంటుంది.

దాదాపు ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట ఏదో ఒక నాటక ప్రదర్శన జరగాల్సిందే

చుట్టుపక్కల ఊళ్ళనుంచి కూడా కొన్ని సమాజాలను ఆహ్వానించి నాటకప్రదర్శనలు ఇప్పిస్తున్నారు ఆ ఊరిలోని ఓ నాటక సమాజంవారు. అది మూడురోజుల పండగ. ఉదయం పదిగంటలనుంచి అర్ధరాత్రి దాక రాజమండ్రి నుంచి నటరాజ నాటక సమాజం వారు శ్రీ కృష్ణరాయబారం నాటకం ఆడుతున్నారు. అందులో అందరూ నిరాటంకంగా, నిర్విరామంగా ఆడుతున్నారు. చుట్టుపక్కల ఊళ్ళోనుంచి వచ్చిన సమాజాల వాళ్ళతో ఊరంతా కిక్కిరిసి ఉంది. ప్రతి సమాజం వారికి రెండు అవకాశాలు. ఒక పౌరాణిక నాటకం వేయాలి. ఒక సాంఘిక నాటకం వేయాలి.

రాజమండ్రిలో నటనాసక్తి ఉన్న కొందరు యువతీ, యువకులు అందరూ కలిసి ఏర్పరచుకున్న నాటక సమాజం 'నటరాజ' నాటక సమాజం.

ఆ సమాజం ఏర్పడి రెండేళ్ళు దాటింది. అంతేకానీ, అప్పటికే ఆ సమాజానికి మంచిపేరు వచ్చింది. అందులోని సభ్యులంతా మంచి కళాకారులు, నాట్యంలో, సంగీతంలో నిష్ణాతులు. మంచి అభిరుచి, నటనలో అభినివేశం ఉన్నవారు. ఆంధ్రదేశంలో చాలాచోట్ల ప్రదర్శనలిచ్చి సమాజం ఏర్పరుచుకున్న రెండేళ్ళలోనే అనేక బహుమతులు పొందిన ఘనులు.. వాళ్ళ నాటకం అంటే చాలా జనం పడిచచ్చేవాళ్ళు.

ఆ రోజు ఆ నాటక సమాజం వారు ప్రదర్శిస్తున్న రాయబారం, చింతామణి నాటకం చూడడానికి బయలుదేరాడు దశరథరామయ్య. రెండు నాటకాలు పూర్తయేసరికి బాగా పొద్దుపోతుంది. నిద్ర ఉండదు. మళ్ళీ ఉదయాన్నే లేవాలి అని కూతుర్ని ఇంట్లోనే ఉండమన్నాడు. తండ్రి దగ్గర ఎంత చనువున్నా ఆయన ఒద్దన్న పని చేయడానికి మాత్రం జడుస్తుండేది పద్మిని. తమ్ముడు ప్రవీణ్ తానూ మాత్రమే ఇంట్లో ఉండడంతో చికాకుగా అనిపించింది పద్మినికి. నాటకం చూడాలన్న కోరిక క్షణక్షణం ఎక్కువకాసాగింది.

నెమ్మదిగా తమ్ముడిని మంచి చేసుకునే ప్రయత్నంలో డ్రాయింగ్ వేసుకుంటున్న ప్రవీణ్ దగ్గరకు వెళ్ళి నెమ్మదిగా అడిగింది. "ఒరేయ్. నీకు నాటకాలు చూడాలనిపించడంలేదూ?"

"నాకా.. ఛీ, ఛీ. నాకసలు ఇష్టంలేదు. వాళ్ళంతా మొహం నిండా రంగులు పులుముకుని, చెమటలుకారుతూ అసహ్యంగా ఉంటారు. నాకిష్టంలేదు" అన్నాడు మొహం నిండా వ్యతిరేకభావాన్ని వ్యక్తం చేస్తూ.

"తప్పురా అలా అనకూడదు. వాళ్ళంతా ఆర్టిస్టులు. చాలా బాగుంటుందిరా చూస్తుంటే. నాకు చూడాలని ఉంది..." దిగులుగా అంది.

"నీకు చూడాలని ఉంటే నువ్వెళ్ళు.. నిర్లక్ష్యంగా అన్నాడు."

"నేను వెళితే నువ్వొక్కడివే అవుతావు. నీకు భయం వేయదూ!?"

"నాకేం భయం? నేను మగపిల్లాడిని." ధీమాగా అన్నాడు.

"నిజంగా నీకు భయంవేయదా?"

"నాకేం భయంలేదు."

"మరైతే నేను వెళ్ళనా?" అభ్యర్థనగా అడిగింది.

"వెళ్ళు."

"నిజంగానా.. నాన్నగారడిగితే నువ్వే వెళ్ళమన్నావని చెపుతాను సరేనా?"

"చెప్పు. నాకేం భయంలేదన్నాగా." ఆత్మవిశ్వాసంతో అన్నాడు ప్రవీణ.

"అయితే నిజంగా వెళుతున్నా!" ఉత్సాహంగా లేచింది పద్మిని.

"వెళ్ళవమ్మా తల్లీ విసుక్కున్నాడు" ప్రవీణ్.

ఆ మాటతో పద్మినికి చెప్పరానంత హుషారొచ్చింది.

నాటకం చూడాలన్న ఆరాటంతో గబ, గబా లోపలికి వెళ్ళి బట్టలు మార్చుకుంది.

"వెళుతున్నానురా" అంటూ మరోసారి గట్టిగా కేకేసి తమ్ముడికి చెప్పి బైటపడింది.

అప్పుడు సాయంకాలం ఆరైంది. వేసవికాలం కావడం చేత ఇంకా బాగా వెలుగుంది. ముందు చింతామణి నాటకం ఉందని పరుగులు పెట్టాడు దశరథరామయ్య.

చింతామణి అంటే నాన్నకెందుకో అంత ఇష్టం. చాలాసార్లు చూసాడు. ఈ ఊళ్ళో ఎన్నోసార్లు ప్రదర్శించారు. ప్రతిసారీ చూస్తాడు. తను రెండు మూడుసార్లు అడిగింది కూడా నాటకం చూడడానికి వస్తానని. ఆ నాటకం పిల్లలు చూడకూడదు అంటూ తనని తీసుకెళ్ళలేదు. ఇవాళ ఎలాగైనా చూడాలి అనుకుంటూ వేగంగా నడవసాగింది పద్మిని.

ఎర్రటి జరీ అంచు ఉన్న నీలం రంగు పరికిణీ, అంచున్న ఎర్రజాకెట్టు, మెడలో పగడాల దండ, పొడుగాటి రెండు జడలని కలుపుతూ కనకాంబరం పూలదండ. చేతులకి ఎరుపు మట్టిగాజులు, నడిచి వచ్చే మందారంలా వస్తున్న పద్మిని చూశాడు నటరాజ నాటక సమాజం అధ్యక్షుడు శేషగిరి.

రాజమండ్రి నుంచి వచ్చిన అతని ట్రూప్ అందర్నీ వేదిక దగ్గరకు పంపించేసి, రిహార్సల్స్ వేసిన చోటునుంచి వేదిక దగ్గరకు వెళ్తున్నాడు.

అతని వయసు పాతిక దాటింది. బి.ఏతో చదువాపేసి నాటక సమాజం పెట్టి నాటకాలాడుతూ, ఆడిస్తూ ఊరూరూ తిరిగే శేషగిరి అందమైనవాడే తెలుగు సినిమా హీరో హర్‌నాథ్‌కి తమ్ముడిలా ఉండేవాడు. సన్నని కోరమీసం, బలిష్టమైన ఛాతీ, దాదాపు ఆరడుగుల విగ్రహం, గంభీరమైన స్వరం... ప్రతి నాటకంలోనూ శ్రీకృష్ణుడి పాత్రలో ఒదిగిపోయి, ఒరిగిపోయి నటిస్తూ అందరి మన్ననలు పొందుతుండేవాడు. ఎన్టీఆర్‌కి వీరాభిమాని. ఆయన చేతులమీదుగా రెండుసార్లు ఉత్తమ నటుడిగా ప్రశంసా పత్రాలు అందుకున్నాడు.

తండ్రికి రాజమండ్రిలో హోటలుంది. ఇద్దరన్నల తరువాత పుట్టినవాడు, చివరివాడు. ఆడింది ఆట, పాడింది పాట. అడపాదడపా సినిమాల్లో చిన్నా, చితకా వేషాలేస్తూ ఏనాటికైనా హర్‌నాథ్ అంతటి గొప్ప నటుడిని అవుతానని, ఎన్టీఆర్‌లా పౌరాణిక పాత్రలకు తానే అర్హుడని కొండంత నమ్మకం అతనికి.

అనుకోకుండా పద్మిని ఎదురు పడడంతో అడుగు ముందుకు పడక ఆగిపోయాడు. తన వేగానికి అడ్డు తగిలిన ఆ ఆజానుబాహుడివైపు చిరాగ్గా, అసహనంగా కళ్ళెత్తి చూసిన పద్మిని వైపే చూస్తున్న చూస్తున్న శేషగిరి చూపుల్తో చూపులు కలిసి తత్తరపడుతూ కళ్ళు వాల్చుకుంది.

ఆ కనురెప్పల కదలికతో అతని గుండెల్లో వేయి సితారలు ఒక్కసారిగా మోగినట్టు అయింది.

ఎంత అందంగా ఉంది ? ఈ పల్లెటూళ్ళో ఇంత అందమైన అమ్మాయా?

ఏ వాహినీ స్టూడియోలోనో షూటింగ్‌లో ఉండాల్సిన కథానాయిక ఇలా ఈ పల్లెటూరి రోడ్డుమీద నడవడమా?

ఈమె హీరోయిన్‌గా, తను హీరోగా సినిమాల్లో నటిస్తే ఆ సినిమా గొప్ప విజయం సాధించదూ.

ఇంతకాలం నుంచీ తనకి సినిమా అవకాశాలు రాకపోడానికి తన అందానికి తగిన కథానాయిక లేకనే. ఈమెని కథానాయికను చేస్తే తప్పకుండా తనకే సరైన జోడీ అవుతుంది.

మొదటిసారిగా ఒక యువకుడు, అందులోనూ ఇంతటి అందమైన యువకుడు తన కళ్ళల్లోంచి గుండెల్లోకి చూపుల బాకులు విసురుతుంటే ఆ బాకులు ఆమె నరనరంలో తీయగా గుచ్చుకుంటున్నట్టుగా అయి మైకం కమ్మినట్టు అయింది. అంతకు పూర్వం ఎరుగని మధురమైన పులకింతలు అణువణువునూ పరవశింపచేస్తుంటే సిగ్గుతో ఎర్రబడిన చెక్కిళ్ళను అరచేతుల్లో దాచుకుని తలవంచుకుని నిలబడిపోయింది.

"నీపేరు మందారమా?" అడిగాడతను.

ఆమె ఉలిక్కిపడింది. మృదంగం మీద శృతిబద్ధంగా కొడితే వినిపించే ఓ మధుర గంభీరనాదంలా వినిపించిందాతని స్వరం. కాదని చెప్పాలనిపించింది కానీ, గొంతుదాటి మాటలు రాలేదు. అతని చూపులు ఒంటినిండా పూలరెక్కలు విసురుతున్నటూ అనిపిస్తుంటే సిగ్గుతో బరువెక్కిన రెప్పలు ఎత్తలేక తలవంచుకుని నిలబడిపోయింది.

"శేషూ! ఏంట్రా అక్కడేం చేస్తున్నావ్? రా తరువాత మనదే మనమే ఆడాలి. ఇంకా మేకప్ వేసుకోవాలి" అంటూ ఓ యువకుడు రావడంతో తేరుకున్న శేషగిరి "ఆ...ఆ.. వస్తున్నానురా. 'మీరు ఆడిటోరియం ఎక్కడ' అని అడిగారు కదా.. రండి మాతో మేమక్కడికే వెళ్తున్నాం" అన్నాడు పద్మినితో.

అతని మాటలకి తెల్లబోయి చూసింది పద్మిని. తను అతడిని ఏమీ అడగందే అలా అంటున్నాడేంటి?

ఆమె తనవైపు చూడగానే మెత్తగా నవ్వి కళ్ళతో సైగచేశాడు.

పద్మిని తడబడుతూ చూపులు తిప్పేసుకుంది.

"రండి" అంటూ శేషగిరి ముందుకు అడుగేశాడు.

"ఎవర్రా ఆవిడ?" అడుగుతున్న స్నేహితుడికి "మన నాటకం చూడ్డానికి వస్తున్నారు. ఆడిటోరియం ఎక్కడ అని అడుగుతుంటే చెపుతున్నా. నువ్వు పిలిచావు" అన్నాడు.

అతను వెనక్కి తిరిగి రెండు అడుగులు వెనక్కి నడుస్తున్న పద్మినితో అన్నాడు. "మాతోరండి మేమక్కడికే వెళ్తున్నాం."

పద్మిని తడబడే అడుగులు వేస్తూ వాళ్ళని అనుసరించింది.

ఆడిటోరియం దగ్గరకు రాగనే శేషగిరి పద్మినిని చూస్తూ అన్నాడు. "ముందు వరసలో కూర్చోండి నాటకం ముందు కూర్చుని చూడాలి" అన్నాడు.

పద్మిని తల ఊపి పరుగులాంటి నడకతో లోపలికి నడిచింది. హాలంతా క్రిక్కిరిసి ఉంది జనంతో. ఊళ్ళో ఉన్న జనం అంతా అక్కడే ఉన్నారు. కుర్చీలు సరిపోక కొందరు నేలమీద కూర్చున్నారు. పిల్లలు, పెద్దవాళ్ళు, ఆడ, మగా అందరూ ఏవో తింటూ, మాట్లాడుకుంటూ కూర్చున్నారు. అప్పటిదాకా అయిన ప్రదర్శనలన్నీ చూసి అక్కడే సెటిల్ అయినట్టు అనిపిస్తున్నారంతా.

పద్మిని అడ్డువస్తున్న వాళ్ళని తప్పించుకుంటూ ముందుకు నడిచింది. ఆ జనంలో తల్లీ, తండ్రీ కనిపించలేదు.

వాళ్ళని వెతుకుతూ, జనాన్ని తప్పించుకుంటూ ముందు వరసకి వెళ్ళిందికానీ, ఎక్కడా కూర్చోడానికి చోటు కనిపించలేదు. ముందు నుంచి నాలుగో వరసలో కుర్చీల్లో కూర్చున్నారు దశరథరామయ్య, సీత.

బయలుదేరేటప్పుడే భార్యతో అన్నాడు దశరథరామయ్య.

"త్వరగా వెళ్తేనే ముందు వరసలో సీట్లు దొరుకుతాయి. లేకపోతే చివరికి కూర్చోవాలి. సినిమా చివరకు కూర్చుని చూడాలి, నాటకం ముందు వరసలో కూర్చుని చూడాలి. అప్పుడే మనకి వాళ్ళ సంభాషణగానీ, పద్యాలు గానీ పూర్తిగా వినిపిస్తాయి త్వరగా తెములు. "

"వచ్చేస్తున్నానండి.." అంటూ సీత వాయిల్ చీర మార్చుకుని పట్టుచీర కట్టుకుని ఆయనతో బయల్దేరుతూ "జాగ్రత్త నువ్వు, తమ్ముడూ అన్నాలు తినేసి త్వరగా పడుకోండి" అంటూ చెప్పింది పద్మినికి.

అది గుర్తొచ్చి భయం వేసింది పద్మినికి అమ్మా, నాన్న చూశారంటే తిడతారు. వాళ్ళకి కనిపించకుండా కూర్చోవాలి అనుకుంటూ చుట్టూ చూసింది. ఎవరో ఒకబ్బాయి వచ్చి పద్మినిని "నాతో రండి శేషు పిలుస్తున్నాడు" అన్నాడు.

"శేషెవరు? " ఆశ్చర్యంగా అడుగుతూ కళ్ళు తిప్పి స్టేజ్‌వైపు చూసింది పద్మిని.

"మా టీమ్‌వాడే రండి త్వరగా" అంటూ అతను వేగంగా నడుస్తుంటే అప్రయత్నంగానే అతడిని అనుసరించింది.

స్టేజ్ వెనక్కి తీసుకుని వెళ్ళాడు. అక్కడ ఇంతకు ముందు రోడ్డుమీద ఎదురై చూపులతోటే తన మనసులో అలజడి కలిగించిన కుర్రాడు ఎదురొచ్చి "అక్కడెక్కడా మీకు ప్లేస్ లేదు. రండి స్టేజ్ మీద ఇక్కడ ఈ స్టూల్ మీద కూర్చోండి. నాటకం బాగా కనిపిస్తుంది. అన్ని డైలాగ్స్ వినిపిస్తాయి. నా నటన చూశాక బాగా చేశానా లేదా చెప్పాలి" అంటూ తీసుకెళ్ళి కర్టెన్ చాటున కూర్చోమంటూ స్టూల్ చూపించాడు.

థాంక్స్ చెప్పి అక్కడ కూర్చుంది పద్మిని. "చాలా దగ్గరగా చూడచ్చు నాటకం ఇక్కడ కూర్చుంటే ఎంత లక్కీ నేను" అనుకుంది.

నాటక ప్రదర్శన మొదలవడానికి నలభై నిమిషాల సమయం ఉంది. వేదిక మీద కొందరు హడావుడిగా తిరుగుతూ కర్టెన్లు కట్టుకుంటూ రంగస్థలాలంకరణ చేస్తున్నారు.

శేషగిరి, మరి ఇద్దరు యువకులు ఎటో వెళ్ళిపోయారు కనిపించలేదు. మేకప్ పూర్తి అయిన కొందరు కళాకారులు అటూ, ఇటూ తిరుగుతూ వాళ్ళ పోర్షన్ తాలుకు డైలాగులు వల్లె వేస్తున్నారు.

కొందరు కాఫీలు తాగుతున్నారు. కొందరు స్టేజ్ మీద ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

పద్మినికి కొంచెం బెరుగ్గా అనిపించింది. తనకి తెలిసిన తన ఊరివాళ్ళు ఎవరూ లేరిక్కడ.. ఒక్కతీ ఎంతసేపు కూర్చోవాలి అనుకుంటూ కొంచెం ఒంగి కర్టెన్ చేత్తో జరిపి పట్టుకుని తొంగి చూసింది.

"అమ్మ దగ్గరకు వెళ్ళిపోతాను" అనుకుంటూ చటుక్కున కుర్చీలోంచి లేచి గబ, గబా తల్లి, తండ్రి కూర్చున్న దగ్గరకు పరిగెత్తింది.

హఠాత్తుగా కూతురు రావడంతో భార్యాభర్తలిద్దరూ కంగారు పడ్డారు. "ఎందుకొచ్చావు? " అడిగింది సీత.

"నాకు నాటకం చూడాలనిపించిందమ్మా! తమ్ముడు కూడా నాతో మాట్లాడకుండా డ్రాయింగ్ వేసుకుంటున్నాడు. నాకు తోచలేదు. అందుకే వచ్చాను" అంది గోముగా.

సీత భయంగా భర్తవైపు చూసింది.

ఏ కళనున్నాడో.. "రా ఇటు కూర్చో.. " అంటూ తను కొంచెం సర్దుకుని భార్యను కూడా సర్దుకోమని చెప్పి పద్మినికి చోటిచ్చాడు దశరథరామయ్య.

పద్మిని హమ్మయ్య అనుకుంటూ హుషారుగా కూర్చుంది.

ఇంతలో నాటకం కొన్ని క్షణాల్లో మొదలవబోతుందని ఎవరో వచ్చి మైకులో చెప్పసాగారు. అందరూ నిశ్శబ్ధంగా ఉండాలని కూడా కోరారు. మరికొన్ని క్షణాల్లో ఎవరో నలుగురైదుగురు కలిసి శుక్లాంబరధరం అంటూ గట్టిగా పాడసాగారు.

పద్మిని రెండు చేతుల్తో చెవులు మూసుకుంది.

"తప్పది. ఏంటాపని? " అంటూ కసురుతూ కూతురి చేతులు లాగేసింది సీత.

"అబ్బ ఏంటమ్మా? అలా పాడతారేంటి? " విసుగ్గా అంది పద్మిని.

"నోరుమూసుకుని చూడు" కసిరింది సీత.

తెర తీశారు.

కృష్ణుడి వేషంలో ఉన్న అతను చాలా అందంగా ఉన్నాడు.

ఆజానుబాహుం, అరవింద దళాయతాక్షం అన్నట్టు ఆజానుబాహుడు, అరవింద దళాయతాక్షుడు అయిన శేషగిరి..

వేదిక మీద నుంచే అతని కళ్ళు ముందు నుంచి నాలుగో వరసలో కూర్చుని విశాలమైన కళ్ళను మరింత విశాలం చేసి శ్రద్ధగా వేదికనే చూస్తున్న పద్మినిని పలకరిస్తూ పల్చగా నవ్వాయి.

ఆ నవ్వు చూడగానే పద్మినికి ఆ కృష్ణుడు తనని రోడ్డుమీద అటకాయించిన కుర్రాడే అని అర్ధమైంది.

"ఎంత బాగున్నాడో అచ్చు కృష్ణుడిలా" అని పైకే అనేసింది అప్రయత్నంగా.

"కృష్ణుడిగా ఎవరు వేసినా బాగానే ఉంటారు" అన్నాడు తండ్రి.. పద్మిని మౌనంగా ఉండిపోయింది.

కొన్ని క్షణాల తరువాత అడిగింది. "నాన్నా వీళ్ళంతా సినిమాల్లో వేస్తారా?"

"సినిమాల్లో వేషాలంటే మాటలా? అంత సులభంగా ఎలా వస్తాయి? ఎంతకాలం ఈ రంగస్థలం మీద కృషిచేస్తే వాళ్ళంతా సినీరంగంలో పైకొచ్చారో. అయినా సినిమాల్లో వేషాలు రావటం అంటే అదృష్టం ఉండాలి" అన్నాడు దశరధరామయ్య.

సినిమాల్లో హీరోయిన్‌గా వేస్తే బాగుండు అనుకుంటున్న పద్మిని ఆ మాటలకి నిరాశపడిపోయింది.

తన ఫ్రెండ్స్ అన్నట్టుగా తను సినిమా హీరోయిన్ అవుతుందా ఏనాటికైనా అనిపించింది.

తండ్రి అంటున్న రంగస్థలం మీద ఎంతో కాలం కృషిచేస్తే తప్ప సినీరంగంలో పైకి రాలేరన్నమాట కూడా ఆమె మస్తిష్కంలో స్థిరపడిపోయింది.

తల్లి చెవిలో నెమ్మదిగా గొణిగింది. "అమ్మా నేను కూడా నటించవచ్చునా? "

ఆవిడ నవ్వింది. ఆ క్షణంలో ఆ వెర్రిపిల్ల బుర్రకేదో తోచి మాట్లాడుతోంది అనుకుందేకానీ, నిజంగా తన కూతురి మదిలో సినిమా కథానాయికనవాలన్న కోరిక ఉన్నట్టు ఆవిడకి అర్ధం కాలేదు. అందుకే నవ్వుతూ అంది. "ముందు డ్యాన్స్ బాగా ప్రాక్టీస్ చెయ్యి ఎక్కడన్నా నాట్యప్రదర్శన ఉంటే చేద్దువుగాని. "

"నాట్యం చేయడం కాదు. నటించకూడదా? " మళ్ళీ అడిగింది పద్మిని.

"నటించాలంటే నాట్యం రావాలి. సంగీతం రావాలి. ఇప్పుడు చూస్తావుగా వాళ్ళంతా ఎంత బాగా పద్యాలు పాడతారో నువ్వూ అలా పాడగలగాలి. " అంది సీతాకుమారి.

"అంటే నాట్యం చేయగలిగితే నటన వస్తుందా? " అడిగాననుకుంది కానీ, ఆమె మనసులో మెదిలిన ఆ ప్రశ్న వెంటనే బైటకి రాలేదు.

అయితే తల్లి చెప్పినట్టు అటు సాంఘిక నాటకం చింతామణిలో కానీ, ఇటు రాయబారంలోకానీ, కళాకారులు అలవోకగా చెబుతున్న సుదీర్ఘమైన సంభాషణలు, స్వరం హెచ్చించి పాడుతున్న పద్యాలు వింటుంటే నేనిలా పాడగలనా? నేనిలా మాట్లాడగలనా అనుకుంది పద్మిని దిగులుగా.

బాగా పొద్దుపోయాక భుజం మీద నిద్రపోతున్న పద్మినిని లేపుతూ "ఒద్దన్నకొద్దీ వచ్చావు. నాకు తెలుసు నువ్వు నిద్రకాగలేవని. లే ఇంటికి వెళదాం" అంటూ కూతుర్ని లేపింది సీత.

బలవంతంగా కళ్ళు తెరిచిన పద్మినికి కాస్సేపు తానెక్కడ ఉందో అర్థం కాలేదు. మగతగా వాలిపోతున్న కళ్ళకి వేదిక మీద వాలిన తెర, అక్కడక్కడా వెలుగుతున్న విద్యుద్దీపాలు, పల్చబడి ఇంటి ముఖం పడుతున్న జనం కనిపించారు.

ఒక చేత్తో తల్లి భుజం, మరో చేత్తో తండ్రి భుజం పట్టుకుని బైటకి నడిచింది.

**జీవితాన్ని నదీ ప్రవాహంతో పోలుస్తారు.** నది ఎలా అయితే అనేక మలుపులు తిరిగి, తిరిగి సముద్రంలో కలుస్తుందో అలాగే మనిషి జీవితం కూడా ఎన్నో మలుపులు తిరిగి తను కోరుకున్న లక్ష్యాన్ని చేరాలని ఆశ, చేరుతుందన్న నమ్మకం ఇవే మనిషిని నూరేళ్ళు జీవింపచేసేవి. అయితే అందరికీ లక్ష్యాలుండవు. కొందరు జీవితం ఎలా నడిపిస్తే అలా నడిచిపోతుంటారు. కొందరు ఒక లక్ష్యాన్ని పెట్టుకుని ఆ దిశగా కృషిచేస్తూ విజయం సాధిస్తారు. కొందరికి లక్ష్యాలు అనేవి లేకున్నా కొన్ని ఆశలుంటాయి. ఆ ఆశలు తీరే మార్గం కోసం జీవితాంతం అన్వేషిస్తూనే ఉంటారు. ఏదెలా ఉన్నా జీవితం మాత్రం ఎప్పుడూ ఒకేలా సాగదు. ఇలా ప్రతి మనిషి జీవితంలోనూ మార్పు అనేది సహజం. జీవితం యాంత్రికంగా సాగిపోతుంటే అది జీవితం ఎలా అవుతుంది?

పద్మిని తండ్రి నాటకానికి రావద్దని చెప్పినా వినకుండా వెళ్ళింది కానీ, ఆయన ఆ పిల్లని ఏమీ అనలేదు. బాల్యచాపల్యం కింద పరిగణించి ఊరుకున్నాడు. ఒద్దన్నా వినకుండా నాటకం చూడడానికి వచ్చిందని ఆమెకి ఏ శిక్షా వేయలేదు. ఎలాంటి మందలింపు చేయలేదు. అలా చేసి ఉంటే పద్మిని జీవితం వేరే విధంగా మలుపు తిరిగేదేమో!

నాటకం చూసి వచ్చిన మర్నాడు బాగా ఆలస్యంగా లేచింది. తల్లి లేపగా, లేపగా లేచి బ్రష్ చేసుకుని, స్నానం చేసి, ఏకంగా అన్నం తినేసింది. అదంతా అయేసరికి పన్నెండున్నర దాటింది. ఇంక అక్కడినుంచి ఆ మధ్యాహ్నం ఆ పిల్లకేమీ తోచలేదు. వేసం కాలం ఎండ తీవ్రంగా లేకపోయినా ఎండగానే ఉంది. అందులోనూ మిట్ట మధ్యాహ్నం. ఆ సమయంలో ఎక్కడికైనా వెళ్ళి కాలక్షేపం చేసే అవకాశం కూడా లేదు. కొంచెం సేపు రేడియో వింది. కొంచెం సేపు ప్రవీణ్‌తో కలిసి క్యారమ్ ఆడింది. అయినా దేనిమీదా మనసు నిలవలేదు. ఏదో తెలియని భావన. ఏదో చేయాలనిపిస్తోంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు. కాస్సేపు తల్లి దగ్గర కూర్చుని ఆవిడ చదువుతున్న భాగవతం తీసుకుని చదవడానికి ప్రయత్నించింది. ఏకాగ్రత కుదరలేదు. ఆసక్తి కూడా కలగలేదు. నెమ్మదిగా గడిచిన సమయం మూడు దగ్గరకు వచ్చింది.

నెమ్మదిగా తల్లి పక్కన చేరి తోచడం లేదని స్నేహితురాలింటికి వెళతానని సణగడం మొదలుపెట్టింది. పద్మినికి ఆ ఊళ్ళో ఆమెతోపాటు స్కూల్లోనూ, డ్యాన్సు క్లాసులోనూ కూడా స్నేహితురాళ్ళు నలుగురే. పద్మినితో కలిపి ఈ ఐదుగురూ ఒకటే క్లాసు. అందరూ ఒకే గురువు దగ్గర నాట్యం నేర్చుకుంటున్నారు.

వీళ్ళంతా స్కూల్లో, డ్యాన్సు క్లాసులో తప్ప ఒకళ్ళనొకళ్ళు కలుసుకునే అవకాశం తక్కువ. ఏదన్నా వేడుకలుంటే తప్ప ఒకరింటికి ఒకరు వెళ్ళడం జరగదు. ఆడపిల్లలను స్నేహితురాళ్ళింటికి పంపించడం అంటే అదేదో కూడని పనిగా భావిస్తారు. అప్పటికింకా ఆడపిల్లని

అకారణంగా వీధుల్లో తిప్పడం అభ్యంతరకరంగా భావించే సమాజం అది. అందుకే పద్మినిని పంపడానికి సీత కూడా త్వరగా ఒప్పుకోలేకపోయింది. కానీ పద్మిని ఊరుకోలేదు. కాసేపు కూర్చుని వస్తానమ్మా అంటూ ప్రాధేయపడడంతో కూతురికి సెలవులు కారణంగా ఏమీ తోచట్లేదని అర్థం చేసుకున్న ఆ తల్లి మనసు మరీ కఠినంగా ఉండలేకపోయింది.

" సరేలే త్వరగా వచ్చేయ్" అంటూ అంగీకారం తెలిపింది.

పద్మిని ఆ మాటతో ఉప్పొంగిపోతూ తన స్నేహితురాలు, నలుగురిలోకి తన ఇంటికి కొంచెం దగ్గరగా ఉండే ఉష ఇంటికి బయలుదేరింది.

తెల్లటి పూలున్న వంగపండు రంగు సిల్కు పరికిణీ, తెల్లఓణీ, వంగపండురంగు జాకెట్టు, సగానికి అల్లి రిబ్బను కట్టి వదిలేసిన రెండు జడలు, మెడలో గుండెల మీద వేళ్ళాడుతున్న పెద్దలాకెట్‌తో ఉన్న గొలుసు చెవులకు జూకాలు అందానికి నిర్వచనంలా ఆ వీధిలో నడిచి వెళ్తుంటే చుట్టుపక్కల ఇళ్ళ పెరట్లోంచి వీధిలోకి తొంగిచూస్తున్న గులాబీలు, మందారాలు, పారిజాతాలు, మల్లెలు జాజులు, నందివర్ధనాలు అసూయగా చూశాయి. ఆమె వైపు మాకన్నా అందంగా ఉన్న ఈ సుమరాణి ఎవరా అన్నట్టు అదేమీ గమనించని పద్మిని మాత్రం ఆ ఊరంతటికీ నేనే మహారాణిని అన్నంత ఠీవిగా నడిచిపోతుండగా కనిపించాడు అతను. అతనే శేషగిరి.

హఠాత్తుగా తన దారికి అడ్డం తగిలి నిలువెత్తుగా నిలబడిన ఆ యువకుడిని చూసి తత్తరపడింది పద్మిని. ఆ తరువాత బిత్తరపోయింది. ఎటు వెళ్ళాలో తెలియక నడిచేదల్లా ఆగిపోయింది. కుడికాలు ముందుకేసి, ఎడంకాలు కొంచెం వెనకగా ఆపి ఒక జడ ముందుకు వేళ్ళాడుతోంటే కాటుక కళ్ళల్లో తత్తరపాటుతో, పల్చని గులాబీ రంగు లేత పెదవుల మీద అదురు చూస్తూ అతను మైమరచిపోయాడు.

ఆమె కళ్ళల్లోకి చూస్తూ " నిన్న నాటకం పూర్తిగా చూశావా? " నెమ్మదిగా అడిగాడు.

ఆ.. అతనలా అడగడంతో ఏం చెప్పాలో తెలియక తల అడ్డంగా ఒసారి, నిలువుగా ఓసారి ఊపి " ఆ... ఆ" అంది.

" బాగుందా? నేనెలా నటించాను? " అడిగాడు.

" బా..బాగా నటించారన్నారు మా నాన్నగారు. "

" మీకెలా అనిపించింది.?

" బా...బా..బాగుంది. కానీ నాకు నిద్రొచ్చింది. " అమాయకంగా అసలు విషయం చెప్పింది.

అతను నవ్వాడు తెరలు తెరలుగా, పొరలు పొరలుగా.

" అంటే సరిగా చూడలేదనమాట. ఇవాళ సాయంకాలం మళ్ళీ ఉంది మా ప్రదర్శన. మయసభ ఏకపాత్రాభినయం చేస్తున్నాను నేను దుర్యోధనుడిగా వస్తావా? " కాస్సేపు మీరు, కాస్సేపు నువ్వు అని సంబోధిస్తూ చనువుగా మాట్లాడుతున్న అతని మాటలకి ఏం సమాధానం చెప్పాలో తెలియని అయోమయావస్థలో ఉండిపోయిన ఆమెకి వెంటనే వెన్నులోంచి భయం పుట్టుకొచ్చింది. ఈ పధ్నాలుగేళ్ళ వయసులో ఎప్పుడూ పరాయి మగవాళ్ళతో ఇలా నిలబడి మాట్లాడడం ఎరుగని పద్మినికి తనలా మాట్లాడడం ఎవరన్నా చూసేస్తారని, ఆ విషయం తండ్రికి తెలిసిపోతుందని అర్థమైపోయి సమాధానం చెప్పకుండా అక్కడినుంచి కదలబోయింది.

" నీ పేరేంటి? " అతను ఆమె వెళ్ళడానికి అవకాశం ఇవ్వకుండా అడిగాడు.

అటూ, ఇటూ కొబ్బరి చెట్లు వాటినానుకుని ఉన్న ఒడ్డు అవతల నది. కొంచెం ఎడంగా అక్కడక్కడా కనిపిస్తున్న పెంకుటిళ్ళు ఆమెకి పరుగుపెట్టడానికి కూడా అవకాశం కలగలేదు.

అతను మళ్ళీ అడిగాడు. "నువ్వు చాలా బాగున్నావు నీ పేరు చెప్పవా? " ఆ అడిగిన తీరుకి ఎన్నడూ కలగని ఓ తీయని భావం నిలువెల్లా పాకినట్టు అయింది. "ప....పద్మిని" అంది కళ్ళు వాల్చుకుని

"చాలా బాగుంది నీపేరు. సినిమాస్టారు పద్మినిని చూశావా? "

లేదన్నట్టు చూసింది అతనివైపు.

"బహుశా ఆవిడ నీ వయసులో నీలాగే ఉండి ఉండాలి. "

మళ్ళీ అదే భావన కొబ్బరి చెట్టు మీంచి వీస్తున్న గాలి తేనెతుట్టెని కదిలించి పోయినట్టు.

"సాయంకాలం నాటకం చూడ్డానికి వస్తావా? "

ఆ మాట్లాడే తీరుకి అతని స్వరంలోని మైకానికి ముగ్ధురాలైపోయి తల ఊపింది వస్తానన్నట్టు.

"తప్పకుండా రావాలి. "

మరోసారి తల ఊపింది.

"అవునూ నువ్వేం చదువుతున్నావు? "

"టెన్త్ పరీక్షలు రాశాను. "

"నువ్వు నటించచ్చుగా. "

"నేనా? " భయంగా చూసింది.

"నిన్ను చూస్తుంటే సరోజాదేవి ఎందుకూ పనికిరాదనిపిస్తోంది. ఎంత బాగుంటావో తెలుసా నీకెవరూ చెప్పలేదా నువ్వు చాలా అందగత్తెవని. "

గుడ్లప్పగించి చూడసాగింది. అతని మాటలు బాగున్నాయి. పాటలంత తీయగా పులకింతలు కలగచేస్తూ కానీ, అక్కడ అలా అతనితో మాట్లడడం ఎవరన్నా చూస్తే ఆ విషయం తండ్రికి తెలిస్తే అంతర్గతంగా మనసులో బెదురు, భయం.

"నిజం చెప్తున్నాను. నువ్వు చాలా అందంగా ఉన్నావు. నీలాంటి వాళ్ళు సినిమాల్లో ఉండాలి. ఇలా ఈ పల్లెటూరి రోడ్డుమీద కాదు. నీకు సినిమాల్లో చేరాలని ఉంటే చెప్పు నేను నీకు అవకాశం ఇప్పిస్తాను. "

అప్పటికే పద్మిని ఇంటికి ఎదురుగా ఉండే ఇంట్లో ఉండే సుబ్బారావు తాత వస్తూ కొంచెం దూరంలో కనిపించడంతో "నాకేం తెలియదు" అంటూనే చెంగున పక్కకి గెంతి రివ్వున పరిగెత్తింది. అలా గెంతడంలో పడబోయి వెంటనే నిలదొక్కుకుని మళ్ళీ పరిగెత్తింది.

అతను చిరునవ్వుతో ఆమె వెళ్ళిన వైపే చూస్తూ నిలబడడం సుబ్బారావు తాత అతనితో మాట్లాడడం సగం దూరం పరిగెత్తి, వెనక్కి తిరిగి చూసిన పద్మిని గమనించింది.

ఆ తరువాత అదిరే గుండెలతో వణుకుతున్న కాళ్ళతో గబగబా నడిచి ఉష ఇల్లు చేరి గేటు తోసుకుని లోపలికి పరిగెత్తింది.

అప్పుడే బైట వరండాలోకి వచ్చిన ఉష పద్మినిని చూడగానే వికసించిన మొహంతో ఎదురొచ్చి, రొప్పుతున్న పద్మినిని చిత్రంగా చూస్తూ అడిగింది. "ఏమైంది? ఎందుకలా రొప్పుతున్నావు? "

ఆయాసంతో గుండెలు ఎగిసిపడుతుంటే చేత్తో సైగ చేస్తూ "మంచినీళ్ళు కావాలి" అంది పద్మిని.

"అలా కూర్చో. ఇప్పుడే తెస్తాను" అంటూ పద్మిని మొహంలోకి చూస్తూ ఉష.

"అవును" తలాడిస్తూ చెప్పింది.

"ఎందుకు? "

"ఆ అబ్బాయి ఎదురయాడు. "

"ఎవరా అబ్బాయి? "

"అదే నిన్న నాటకంలో కృష్ణుడిగా వేయలేదు. "

"నాకేం తెలుసు నేను నాటకం చూడ్డానికి రాలేదుగా. "

"నేనెళ్ళాలే ఆ అబ్బాయి వచ్చాడు. కృష్ణుడిగా వేశాడు. చాలా బాగా వేషం కట్టాడు. అచ్చు కృష్ణుడిలో ఉన్నాడు. శ్రీకృష్ణ తులాభారంలో ఎన్టీఆర్‌లాగా. "

"అయితే?"

"నాతో మాట్లాడాడు. "

"ఏమని? "

పద్మిని చెప్పలేకపోయింది. ఆ మాటలు గుర్తొచ్చి చెంపల్లోకి వెచ్చటి ఆవిరి వచ్చినట్టు అయింది. అప్పుడు మొదలైన సిగ్గు ఇప్పుడు కళ్ళనిండా పాకి కనురెప్పలు బరువెక్కాయి. ఆమె మొహంలో కదులుతున్న భావాలు గమనిస్తూ చిత్రంగా అడిగింది ఉష. "ఏమన్నాడేంటి అతను? "

"ఇవాళ్ళ కూడా నాటకానికి రమ్మన్నాడు. దుర్యోధనుడుగా వేస్తాట్ట. "

"అయితే వెళ్తావా? "

పద్మినికి ఉష అలా అడగడంతో దిగులు కమ్ముకొచ్చింది. "ఏమో! నాన్న ఒప్పుకుంటే .. " అంది.

"అవునూ.. దానికోసం అంతలా పరిగెత్తుకుని వచ్చావెందుకు? "

"అదా సుబ్బారావు తాత అతను నాతో మాట్లాడడం చూశాడు. భయం వేసి వచ్చేశాను. "

ఊపిరి పీల్చుకుని వదులుతూ అంది ఉష "మంచి పనిచేశావు. అయినా అలా ఎవరు పడితే వాళ్ళు పలకరించగానే మాట్లాడచ్చా. "

"మాట్లాడలేదు నేను విన్నానంతే. "

"అది కూడా చేయకూడదు. "

"అతనే ఎదురొచ్చి పలకరించాడు. "

"నువ్వెలా తెలుసు? "

"నిన్న నాటకానికి వెళ్ళాగా అప్పుడు చూశాడు. "

"కానీ చాలామంది వచ్చారుగా నాటకానికి నిన్నే ఎందుకు పలకరించాడు? "

"ఏమో..! " ఆ ప్రశ్నకి తెల్లమొహం వేసింది పద్మిని.

అవును తననే ఎందుకు పలకరించాడు. ఏమో తనని పలకరించినట్టే కనిపించిన వాళ్ళందరినీ పలకరించాడేమో.

"సరేలే ఇంకెప్పుడూ మాట్లాడమాక. రా గచ్చకాయలాడుకుందాం." ఉష లోపలికి వెళుతుంటే "హమ్మయ్య" అనుకుంటూ తనూ లేచి ఆమెని అనుసరించింది.

అయితే పద్మిని కన్నెమనసు ఆ పలకరింతనీ, పలకరింతలు కలగచేసిన పులకరింతలనీ మర్చిపోలేకపోయింది.

ఇంటికి వచ్చాక కూడా అతని గురించే ఆలోచించసాగింది. సాయంకాలం నాటకం చూడ్డానికి అమ్మా, నాన్న వెళితే తనూ వెళ్ళాలని ఎదురుచూడసాగింది. కానీ, ఆ రోజు వాళ్ళ నాటకం చూడడానికి వెళ్ళేలా అనిపించలేదు. తండ్రికి వేరే పనేదో ఉందని ఇంట్లోనే ఉండిపోయాడు. తనొక్కతీ వెళ్ళడానికి అవకాశమేలేదు.

పద్మినికి వెళ్ళాలనిపిస్తోంది అతను కళ్ళ ముందుకు వచ్చి "రావా? నాటకం చూడ్డానికి రావా? నేను దుర్యోధనుడిగా వేస్తున్నాను తెలుసా. రావూ" అని పదే పదే అడుగుతున్నట్టు అనిపించసాగింది. కాలుగాలిన పిల్లిలా ఇంట్లోకి, పెరట్లోకి తిరుగుతుంటే చూసిన సీత "ఏంటే నీకేమైంది ఇవాళ తిక్కగా ఉన్నావు. త్వరగా అన్నం తిని పడుకో" అంది.

"నిద్రరావడం లేదమ్మా. " అంది పద్మిని గోముగా.

"అయితే కాస్సేపు డ్యాన్సు ప్రాక్టీసు చేసుకోవచ్చుగా. ఏవన్నా మంగళహారతి పాటలు కాస్సేపు పాడుకోవచ్చుగా. "

"పో... ఎప్పుడూ డ్యాన్సు అంటావు. " విసుక్కుంది.

"డ్యాన్సు నేర్చుకుంటూ ప్రాక్టీస్ చేయకపోతే నీకెలా వస్తుంది. నాటకంలో నటిస్తానన్నావుగా నిన్న."

ఆ మాటతో పద్మిని కళ్ళు మెరిసాయి. మంచి అవకాశం అమ్మని అడగాలి ఇవాళ నాటకానికి వెళ్దాం అని అనుకుంటూ ఆవిడ దగ్గరగా వచ్చి అంది. "ఇవాళ కూడా నాటకం చూడ్డానికి వెడదామా? "

ఆవిడ కళ్ళు వెడల్పు చేసి భయం గొలుపుతున్న భావంతో చూస్తూ అంది. "నాన్నకి తెలిస్తే చంపేస్తారు. నోరుమూసుకుని పడుకో. "

"నాకు నిద్రరావడంలేదు. "

"ఏం? ఎందుకు రాదు? త్వరగా పడుకుని త్వరగా లేవాలి. అంతేగాని మొద్దులా పదయిందాకా పడుకున్నావు. "

విసుక్కుందావిడ.

"నేను నటన నేర్చుకుంటాను. " బుంగమూతితో అంది.

"ముందు నేర్చుకుంటున్న నాట్యం పూర్తిచెయ్యి"

" ఆ తర్వాత నాటకంలో కూడా చేయచ్చా.. అమ్మా?" అడిగింది.

"నాట్యం ఒక్కటే చాలదు. సంగీతం రావాలి. సంభాషణలు చక్కగా పలకాలి. అయినా ముందు భారతం, భాగవతం అని చదువుకో. కృష్ణుడు, రాముడు, దుర్యోధనుడు, హరిశ్చంద్రుడు, ద్రౌపది వీళ్ళంతా తెలియకుండా నువ్వేం నాటకాలేస్తావు. అన్నీ తెలుసుకోవాలి. నీకు తెలుసా! సురభి అనే నాటక సంస్థ ఉంది. అందులో పుట్టిన పాపాయిని 21 వ రోజునే చిన్ని కృష్ణుడిగా వేదిక మీద చూపిస్తారు. ఆ క్షణం నుంచీ ఆ శిశువు కూడా ఆ రంగస్థల కళాకారుడిగానే ఎదుగుతాడు. అమ్మాయి అయినా, అబ్బాయి అయినా అంతే. "

పద్మినికి తల్లి చెబుతున్న విషయాలు మనసులో అక్షరం, అక్షరం ఓ శిలగా మారి స్థిరపడిపోసాగాయి.

మనసు తనని తాను రంగస్థలం మీద ఆవిష్కరించుకోడానికి ప్రయత్నించసాగింది. అందంగా అలంకరించిన దుస్తుల్లో తనని తాను సత్యభామగా ఊహించుకుంటూంటే పక్కకే వచ్చి చిలిపిగా నవ్వి, సొగసుగా చెక్కిలి మీటాడు కృష్ణుడు. ఆమెకి తెలిసిన కృష్ణుడు. ఆమె చూసిన కృష్ణుడు.

అలా ఏవేవో ఊహల్లో తేలిపోతూ మంచం మీద వాలిన పద్మిని ఆ రాత్రి తానో పెద్ద కథానాయిక అయినట్టు, శేషగిరి కథానాయకుడు అయినట్టు కలలు కంటూనే నిద్రపోయింది.

మర్నాడు, ఆ మర్నాడు కూడా ఆమె ఇంట్లోనుంచి ఎటూ వెళ్ళలేకపోయింది. మనసు మాత్రం మరోసారి శేషగిరిని కలవాలని, అతని మాటలు వినాలని ఉవ్విళ్ళూరసాగింది. మరో స్నేహితురాలింటికి వెళితే అతను కనిపిస్తాడేమో అన్న ఆశ ఎక్కడో మెదిలినా అమ్మ ఎట్టి పరిస్థితుల్లోనూ పంపించదని తెలిసి అడిగే సాహసం చేయలేకపోయింది.

మూడు రోజుల తరవాత తండ్రి సీతకి చెబుతుంటే విని ఆమె మనసు బాధగా మూలిగింది.

పక్క ఊరి నుంచి వచ్చి మూడు రోజులపాటు నాటకాలాడిన శేషగిరి బృందం వెళ్ళిపోయారు.

అతడిని కలవలేకపోయానన్న బాధ, అతనికి నాటక చూడ్డానికి వస్తానని మాట ఇచ్చి వెళ్ళలేకపోయానన్న దిగులు ఆమెని కమ్మేసి ఒకరోజంతా అన్యమనస్కంగా గడిపింది.

అయితే మరోసారి తాను శేషగిరిని చూడాలన్నా, అతనితో మాట్లాడాలన్నా, అతని మాటలు వినాలన్నా ఒక్కటే మార్గం తను నటికావాలి. రంగస్థల నటికావాలి. అలా అయితే శేషగిరి ట్రూప్‌తో ఎప్పటికైనా తానూ నాటకాలాడచ్చు. ఆ తరవాత అతనిచ్చిన మాటప్రకారం తనని సినిమాల్లో కూడా చేర్పిస్తాడు. ఆ ఆలోచన రావడమే తడవుగా కొద్దిగంటల్లోనే అది ఇంతై, అంతై శాఖోపశాఖలుగా విస్తరించి ఆమె మనసంతా వ్యాపించింది.

ఆ క్షణం నుంచి నాట్యం మీద ఆమెకి తెలియకుండానే శ్రద్ధ పెట్టసాగింది. అంతేకాక తల్లిని మచ్చిక చేసుకుని నెమ్మదిగ్గా సంగీతం నేర్చుకోవాలన్న తన ఆశకూడా వ్యక్తం చేసింది.

"చదువు, నాట్యం, సంగీతం మూడింటిని ఎలా సమన్వయపరుచుకోగలవు. అన్నిటిమీదా ఏకాగ్రత పెట్టాలి పెట్టగలవా?" అడిగింది సీత.

"తప్పకుండా పెడతానమ్మా నేను సంగీతం కూడా నేర్చుకుంటాను. నేనెప్పటికైనా అంత గొప్పగా పద్యాలు పాడుతూ స్టేజీ మీద నటించాలి" అంది పద్మిని.

"నాన్నగారికి నువ్వు నటించడం ఇష్టం ఉండకపోవచ్చు పద్మా" అందావిడ.

"అదేంటమ్మా నాన్నకి రంగస్థల నాటకాలంటే ఇష్టం కదా. " విస్తుబోయి అడిగింది.

"నాటకాలు ఇష్టమైనంత మాత్రాన తన కూతుళ్ళను వేదికలెక్కించడం ఇష్టం ఉంటుందా? అయినా తాతగారు వాళ్ళు కూడా ఆడపిల్లలలా వేదికలెక్కి నటించడాన్ని ఇష్టపడరు. మన కుటుంబాల్లో ఆడవాళ్ళు మొహానికి రంగులు పూసుకోడం సంప్రదాయం కాదు. "

పద్మినికి ఆశ్చర్యం వేసింది. నాటకం చూసినంతసేపూ అందులో లీనమైపోయి తండ్రి తాదాత్మ్యం చెందుతూ, ఆహో, ఓహో అంటూ ఉండడం, కొన్ని సన్నివేశాల్లో రెండు చేతులూ కలిపి బలంగా, పెద్దగా శబ్దం చేస్తూ చప్పట్లు కొట్టడం, నవ్వొచ్చినపుడు నవ్వడం రక, రకాల హావభావాలను ప్రదర్శించడం చూసింది. తల్లి కూడా శ్రద్ధగా చూస్తుంది. చప్పట్లు కొడుతుంది. నవ్వుతుంది. మధ్య, మధ్య ఎంత బాగా చేసిందండి ఆ అమ్మాయి అంటూ కళాకారిణులను పొగుడుతుంటుంది. నాటకం అయిపోయాక వాళ్ళందరినీ చూడడానికి వేదిక దగ్గరకు కూడా వెళ్తుంటాడు తండ్రి. నాటకం అన్నా కళాకారులన్నా అభిమానం ఉన్న తండ్రి తన కూతురి చేత ఎందుకు వేషం వేయించడానికి ఇష్టపడడు. కారణం ఏంటి? ఆడవాళ్ళు వేదికలెక్క కూడదని అభిప్రాయం ఉంటే మరి వేదికలెక్కి నటిస్తున్న ఆడవాళ్ళని అభిమానిస్తాడు.

"ఏంటో ఈ పెద్దవాళ్ళు అర్థంకారు" అనుకుంది చిరాగ్గా. అయినా పద్మినికి నాటకాల పట్ల ఆసక్తి తగ్గలేదు సరికదా రోజు, రోజుకి పెరగసాగింది.

ఈలోగా టెన్త్‌క్లాస్ రిజల్ట్స్ వచ్చాయి.

పద్మిని సినిమా పిచ్చితో అటు నాట్యమూ సరిగా నేర్చుకోక, చదువుపట్ల శ్రద్ధ చూపించక టెన్త్ ఫెయిల్ అయింది. కూతురు టెన్త్ ఫెయిల్ కావడంతో దశరథరామయ్య మండిపడ్డాడు. అప్పుడు పరీక్షగా పద్మినివైపు చూశాడాయన. వదులుగా వేసుకున్న ఒక జడ, కనురెప్పల మీద, కళ్ళల్లో తీర్చిదిద్దుకున్న కాటుక, దోసగింజ ఆకారంలో బొట్టు, షిఫాన్ చీర, మెడలో పూసల గొలుసు, చెవులకి ఫ్యాన్సీ లోలకులు గోళ్ళకి రంగు, ఆయనకి కూతురు కొంచెం ఎక్కువగా తయారైనట్టు అనిపించింది. ఏనాడూ ఆ పిల్లని అంత గమనించిని ఆయనకి ఇవాళ పద్మినిని అలా చూడగానే అరికాలిమంట నెత్తికెక్కింది.

"ఏవిటే ఈ వేషం? అంటూ భార్యవైపు కోపంగా చూస్తూ అరిచాడు. దీనికిప్పటినుంచే ఆ పల్చటి చీరలేంటి? పరికిణీ, ఓణీలు వేసుకోకుండా చీరెందుకు కట్టుకుంది? డ్యాన్సు నేర్చుకున్నంత మాత్రాన రోజూ ఇంట్లో కూడా డ్యాన్సర్‌లా తయారవాలా? రెండు జడలు వేసుకోకుండా ఆ వాల్జడ ఏంటి? ఎవరు చెప్పారిలా తయారవమని నీ వయసెంతే. "

ఏనాడూ తండ్రినంత కోపంగా చూడని పద్మిని వణికిపోయింది.

సీత కూడా భర్త అకారణ కోపానికి నివ్వెరపోయింది.

"ఏదో సరదాపడిందని కట్టుకోనిచ్చానండి" అంది.

"సరదా పడిందని అదేదడిగినా సరే అంటావా? షోకులెక్కువై చదువు చట్టుబండలు చేసింది. పెద్ద పిల్లలిద్దరూ ఏనాడైనా ఏక్లాసులోనైనా తప్పారా? ఇది చూడు టెన్త్ తప్పింది. ఇంక పై చదువులకి ఎలా వెళ్తుంది? చదువు లేకపోతే దీనికి పెళ్ళెలా అవుతుంది? "

"ఏం అవసరంలేదు. నీకు శ్రద్ధ ఉంటే అసలు తప్పేదానివి కాదు. ఇంట్లో పడుండు" అంటూ విసవిసా బైటకి వెళ్ళిపోయాడు.

పద్మిని తల్లిని కౌగలించుకుని బావురుమంది.

ఆవిడ ఓదారుస్తూ "పోనీలే ఏడవకు నాన్న కోపంగా ఉన్నారు. కాస్త కోపం తగ్గాక నేను చెప్తాను. మళ్ళీ పరీక్షకు కట్టు. మార్కులొచ్చాక ఎందులో పోయిందో చూసి పోయిన సబ్జెక్టులు కట్టు" అంది.

పద్మిని తలూపింది.

నీరజ ఇంటర్ పాసైంది. ఆమె చదువు గొడవలో పడి నాట్య శిక్షణా తరగతులకి సరిగా వెళ్ళకపోడంతో గురువుగారు ఆమెని "నాట్యం మానేయమ్మా నీకు అచ్చిరాలేదు" అని చెప్పేశారు. ఆ మాటకోసమే ఎదురుచూస్తున్నదానిలా వెంటనే మానేసింది.

పద్మిని మాత్రం చదువు సంగతి ఎలా ఉన్నా క్రమం తప్పకుండా నాట్యం నేర్చుకోడానికి మాత్రం వెళ్తోంది.

మరో పదిహేను రోజులు గడిచాయి.

**పద్మిని డాన్సు** నేర్చుకుంటున్న గురువుగారి ఇల్లు పద్మిని ఇంటికి పది ఫర్లాంగుల దూరంలో ఉంటుంది. రోజూ ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా రిహార్సిల్స్‌కి వెళ్తోంది పద్మిని. అకస్మాత్తుగా డాన్సు పట్ల కలిగిన శ్రద్ధ అటు గురువుకి, ఇటు తల్లికి కూడా ఆశ్చర్యాన్ని కలగచేసింది. పోనీలే దీనికి చదువు వంటబట్టేలా లేదు కనీసం డ్యాన్సు నేర్చుకుంటే నలుగురు పిలలకి డాన్సు పాఠాలు చెప్పుకోవచ్చు అని అనుకుంది సీత.

పద్మిని చాలా తక్కువ వ్యవధిలోనే ఎంతో చక్కగా అడుగులు వేయడం, పాటకు తగినట్టు అభినయించడం చూసిన గురువుగారు ఆ ఏడాది మరో నెలరోజుల్లో వస్తోన్న కృష్ణాష్టమికి వేణుగోపాలస్వామి ఆలయంలో జరపబోతున్న ఉత్సవాల్లో ఆమెతో మరి నలుగురు

శిష్యురాళ్ళతో నృత్యప్రదర్శనకి ఏర్పాట్లు చేశారు. ఆ ప్రదర్శన కోసం రోజుకి మరో రెండు గంటలు సాధన చేయించడానికి వారానికి మూడురోజులు మధ్యాహ్నాలు కూడా రమ్మన్నారు సోమవారం, బుధవారం, శుక్రవారం.

ఆరోజు శుక్రవారం ఎక్స్ట్రా క్లాసులు అప్పటికే రెండు జరిగాయి. పద్మిని ప్రతి శుక్రవారం తలకి, ఒంటికి నూనె రాసుకుని, నలుగుపెట్టుకుని తలస్నానం చేస్తుంది. ఆ ఒక్కరోజే వదులుగా ఒక జడవేసుకోడానికి అనుమతి ఉంది ఇంట్లో. మామూలుగా రోజూ తలకి నూనె రాసుకుని రెండు జడలు వేసుకోవాలి. చివర్ల రిబ్బను కట్టుకోవాలి. పరికిణీ, ఓణీ మాత్రమే వేసుకోవాలి. పండగలప్పుడు తప్ప చీర కట్టుకోకూడదు.

ఆ రోజు కూడా అలాగే చేసింది. నిడుపాటి ఒత్తైన కురులు జారుగా, వదులుగా జడవేసుకుంది. చెంపలమీదకి జారుతూ చెవుల్ని కప్పేసినా చెవులకు వేళ్ళాడుతున్న జూకాలు మాత్రం ఆమె కదలికలకి అనుగుణంగా కదులుతూ నాట్యం చేస్తున్నాయి. నుదుట తిలకంతో ఓ దోసగింజ ఆకారం బొట్టు పెట్టుకుని, కళ్ళకి సన్నగా కాటుక దిద్దుకుని ఆ కాటుక రేఖల్ని కనుబొమల చివరిదాకా లాగింది. పచ్చని చెక్కిళ్ళ మీద అలల్లా కదులుతోన్న వెంట్రుకలతో ముగ్ధమనోహరంగా తయారైంది. గులాబీ రంగుకి, ఆకుపచ్చ అంచు ఉన్న పట్టుపరికిణీ, ఆకుపచ్చ ఓణీ, గులాబీ రంగు జాకెట్టు మెడలో గొలుసు దానికి ఉన్న నెమలి డాలరు గుండలమీద తైతక్కలాడుతోంది.

భోజనం చేసి, డాన్సు క్లాసుకి బయలుదేరింది. క్రమం తప్పకుండా డాన్సు ప్రాక్టీసు చేస్తున్నందుకు ఆమె ఒళ్ళు మరింత వన్నె తేలింది. నడుం దగ్గర అందమైన ఒంపు తిరిగింది. ఆమె వయ్యారంగా నడుస్తూ వెళ్తుంటే వెనక్కి తిరిగి చూడని వాళ్ళు లేరు. సన్నటి నడుం మీదుగా జారి పిరుదులను తాకుతున్న జడ ఆమె నడకకి లయబద్ధంగా కదులుతూ ఓ అద్భుతాన్ని ఆవిష్కరిస్తున్నట్టుంది. తల వంచుకుని నడుస్తోన్న పద్మిని కాళ్ళు ఠపీమని ఆగిపోయాయి. ఆమె కళ్ళకి ముందుగా పాదాలు, ఆ తరువాత బూడిదరంగు పాంటు తొడుక్కున్న రెండు కాళ్ళు కనిపించాయి. ఆమె తత్తరపాటుతో కళ్ళెత్తి చూసింది.

రెండు చేతులూ మెలివేసినట్టుగా పట్టుకుని నిలబడి చిలిపిగా నవ్వుతున్న రెండు కళ్ళు ఆమె కళ్ళతో కలిసాయి. ఆమె గుండె ఝల్లుమంది. అణువణువూ అప్రయత్నంగానే ఆనంద నాట్యం ప్రారంభించింది.

"బాగున్నావా? " శేషగిరి స్వరం ఉరిమిన మేఘం కిందరాలినట్టు.

సమాధానం చెప్పకుండా ముందుకు నడవడానికి ప్రయత్నించి విఫలమై నిస్సహాయంగా చూసింది.

"నన్ను గుర్తుపట్టలేదా? " అదే చిరునవ్వుతో అడిగాడు.

ఇప్పుడూ ఆమె గొంతు పెగిలి అక్షరమ్ముక్క బైటికి రాలేదు.

"నేను ఆ రోజు చూసినప్పటికీ, ఇప్పటికీ చాలా మారావు అదేంటి? నాలుగు నెలల్లోనే ఇంత అందం వచ్చేసింది. ఎంత అందంగా ఉన్నావో తెలుసా? "

ఒక్కో నరమే పైకి తీసి మోహనరాగం ఆలపిస్తున్నట్టు.

"నీ పేరు పద్మిని కదా.!? "

ఆమె తలాడించింది.

"పద్మినీ..! అబ్బా నిన్ను చూస్తుంటే పిచ్చెక్కిపోతోంది నాకు. ఈ పల్లెటూళ్ళో, ఈ మట్టిరోడ్డు మీద నడవాల్సిన అందమా ఇది? మెత్తటి కుషన్ సీట్లలో, ఏసి కారులో తిరగాల్సినదానివి. నాకేం బాలేదు పద్మినీ. నాతో వచ్చెయ్. నిన్ను పెద్ద హీరోయిన్ని చేస్తాను. నిజం చెబుతున్నాను. "

హీరోయిన్... ఆమె కళ్ళ ముందు మెరుపులు... హీరోయిన్.

"నీకోసమే వచ్చాను ఈ ఊరికి. నిన్ను చూడాలనిపించింది. రాత్రి కల్లోకి వచ్చావు. ఈ మట్టిరోడ్డు మీద ఇలాగే అప్సరసలు దారి తప్పి భూమ్మీద దిగినట్టుగా అనిపిస్తోంది. "

"పద్మా! " దూరం నుంచి పిలుపు వినిపించి ఉలిక్కిపడి చూసింది పద్మిని.

ఉష అవతల పక్క రోడ్డులో ఉన్న పూలకొట్టు దగ్గర నిలబడి పిలుస్తోంది.

పద్మిని ఇంక ఒక్క క్షణం కూడా ఆగలేదు. సుడిగాలిలా పరుగెత్తింది.

శేషగిరి చిన్నగా నవ్వుకుంటూ ముందుకు సాగిపోయాడు.

"ఎందుకలా నిలబడిపోయావు? ఎవరతను? " అడిగింది ఉష చిరుచెమటలు పట్టిన పద్మిని మొహంలోకి చూస్తూ.

పద్మిని వెంటనే మాట్లాడకుండా అతను నడిచివెళ్తున్నవైపు చూసింది.

ఉష పద్మిని చూస్తున్న వైపు చూపులు సారించి మళ్ళీ అడిగింది "మన ఊరు కాదట్టుందే?"

"అవును. శరభయ్య తాత ఇల్లెక్కడ అని అడిగాడు" అబద్ధం చెప్పింది పద్మిని.

"అలాగా! " ఉష మాములుగా అనేసి పూలకొట్టు అతనివైపు చూసి "శీనన్నా! ఐదు మూరల కనకాంబరాలివ్వు" అంది.

"ఐదు మూరలెందుకే?" ఆశ్చర్యంగా అడిగింది పద్మిని.

ఉష సమాధానం చెప్పకుండా పూలు కట్టిన పొట్లం అందుకుని డబ్బులిచ్చి "పద వెడదాం" అంది పద్మినితో.

"ఎక్కడికి? నేను డాన్సు క్లాసుకి వెళ్ళాలి. " ఆమెని అనుసరించి అడుగులు వేస్తూ అంది పద్మిని.

ఉష కొంచెం సిగ్గుపడుతూ అంది. "ఇవాళ డాన్సు క్లాసు మానెయ్. నా పెళ్ళిచూపులు. "

పద్మిని ఆశ్చర్యంగా చూసింది. "మరిప్పుడు చెప్తావేం? ఎలా మానను? మాష్టారు కోప్పడతారు. వచ్చేనెల మా ప్రోగ్రాం ఉందిగా. "

"అయితే మాన్లే. నేనే మా తమ్ముడితో కబురెడదామనుకున్నా. అనుకోకుండా నువ్వే కలిశావు. ప్లీజ్ పద్దూ! నాకసలే దడగా ఉంది రావూ. నాకు తోడుగా ఉండవూ.!?" జాలిగా అడుగుతున్న ఉష మొహం చూస్తుంటే రానని చెప్పాలనిపించలేదు పద్మినికి.

"సరేలే. ఇప్పుడే త్వరగా వెళ్ళి ప్రాక్టీస్‌కి రానని చెప్పి వస్తా. నువ్వింటికెళ్ళు నేనొచ్చేస్తా" అంది.

"నిజంగా వస్తావా? "

"నిజంగా వస్తా. నాకు మాత్రం నీ కాబోయే వరుడ్ని చూడాలని లేదా ఏం?"

"సరే అయితే త్వరగా రా."

ఉష మాట పూర్తికాకుండానే పద్మిని పరిగెత్తింది.

పద్మిని వెళ్తున్న వైపు చూస్తున్న ఉషకి హఠాత్తుగా ఓ సందేహం వచ్చింది. వచ్చిన పెళ్ళికొడుకు దీన్ని చూసి "ఈ పిల్లనే చేసుకుంటాన"ంటే. పద్మిని ఎంతైనా అందగత్తె. అందులో ఇవాళ శుక్రవారం తలంటుకుని ఎంత అందంగా ఉందో అనవసరంగా రమ్మన్నానా దీన్ని.

ఆలోచిస్తూనే ఉష ఇంటికి వెళ్ళిపోయింది.

"ఎక్కడికి వెళ్ళావే? వాళ్ళొచ్చే టైం అయింది. వెళ్ళు త్వరగా తయారవు" తల్లి విసుక్కుంటుంటే లోపలికి నడుస్తూ అంది ఉష

"అమ్మా! నేను గులాబీరంగు ఓణీవేసుకుంటాను. "

"ఓణీ ఏంటే పట్టుచీర కట్టుకో! పెళ్ళిచూపుల్లో ఎవరైనా ఓణీ వేసుకుంటారా?" కూతుర్ని మందలిస్తూ గదిలోంచి గులాబీరంగు పట్టుచీర తీసుకొచ్చింది ఆవిడ.

"చీర అయినా గులాబీ రంగేగా!? " అనుకుంటూ ఆ చీర అందుకుని పెరట్లోకి వెళ్ళిపోయింది ఉష.

పద్మిని క్లాసు కెళ్ళి గురువుగారి అనుమతి తీసుకుని రోడ్డుమీదకి వచ్చి ఉష ఇంటివైపు తిరిగింది.

"పద్మా... "ఉలిక్కిపడి చూసింది. శేషగిరి.

"నీకోసమే ఎదురుచూస్తున్నాను. ఆ అమ్మాయి ఎవరు? మనిద్దరిని డిస్టర్బ్ చేసింది. " ఆమె పక్కగా వచ్చి నడుస్తూ అడిగాడు.

పద్మిని కాళ్ళల్లో సన్నగా వణుకు మొదలైంది. ఇతనిలా తన పక్కన నడవడం ఎవరన్నా చూశారంటే కొంపలంటుకుంటాయి. కానీ, అతనలా దగ్గరగా నడుస్తుంటే వెచ్చని అతని ఊపిరి తగిలీ తగలకుండా అలాగాల్లో తేలి తన వంటిని తాకుతోంటే హాయిగా గిలిగింతగా ఉంది.

"నా స్నేహితురాలు" అంది గొంతు విప్పి.

"హమ్మయ్య ఒక్కమాట మాట్లాడావు. నీలాగే నీ గొంతు కూడా తీయగా, అందంగా ఉంది. "

"మీ పేరేంటి? " అడిగింది.

"నా పేరు శేషగిరి.. మర్చిపోయావా? ఆ రోజు చెప్పాను. "

అవునన్నట్టు తలాడించింది.

"నీతో చాలాసేపు మాట్లాడాలని ఉంది. అలా ఆంజనేయస్వామి ఆలయం వైపు వెళదాం వస్తావా? "

"ఇప్పుడా?" భయంగా చూసింది.

"ఏం?"

"ఇప్పుడు ఉష రమ్మంది. దానికి పెళ్ళిచూపులు. "

"నువ్వేం చేస్తావు? "

"తోడు"

"ఏమో వచ్చిన వాళ్ళు నిన్ను చూశాక నీ స్నేహితురాలిని చూడమని, నిన్నే చేసుకుంటానని చెప్పేస్తే ఏం చేస్తావు? "

"అలా అనరు. "

"నీకెలా తెలుసు అనరని. "

"అనరు అంతే. ఉష కోసం వస్తారు. దాన్నే చూస్తారు. "

"నువ్వు వాళ్ళకి కనపడవా? "

"ఊహూ. లోపలే కూర్చుంటాను. కిటికీలోంచి అబ్బాయిని చూస్తాను మా ఉషకి నప్పుతాడా లేదా అని. "

"ఓ అ.." అతను ఫక్కున నవ్వాడు. అమాయకంగా చెపుతున్న పద్మినివైపు చూస్తుంటే అమాంతం ఆమెని రెండు చేతుల్తో ఎత్తుకుని ఏ కొండల్లోకో, కోనల్లోకో పరిగెత్తాలనిపిస్తోంది.

"అయితే సాయంత్రం వస్తావా? "

"అమ్మో చీకటి పడితే నాన్నగారు కేకలేస్తారు. "

"మరెలా? " అసహనంగా అన్నాడు.

పద్మిని మాట్లాడలేదు.

"పోనీ రేపు కలుస్తావా? "

పద్మినికి కాదనాలనిపించలేదు. ఆమెక్కూడా అతనితో కాస్సేపు ఒంటరిగా కూర్చుని కబుర్లు చెప్పాలనిపిస్తోంది. తన అందాన్ని పొగుడుతుంటే ఆ పొగడ్తలు ఇంకాస్సేపు వినాలనిపిస్తోంది.

అతని వెచ్చని ఊపిరి కలిగిస్తోన్న గిలిగింతల అనుభూతిని మరింతసేపు ఆస్వాదించాలనిపిస్తోంది.

అతని వంటినుంచి వస్తోన్న గమ్మత్తైన పరిమళం ఆమెని పరవశింపచేస్తోంది.

అందుకే నెమ్మదిగా అంది. "రేపు డాన్సు క్లాసు అయిపోయాక వస్తాను. "

అతని కళ్ళు మెరిశాయి. "ఎప్పుడు, ఎన్ని గంటలకి ఐపోతుంది?"

"మూడు, మూడున్నరకి ఐపోతుంది. "

"నిజంగా వస్తావా? "

"ఊ ప్రామిస్. "

"ప్రామిస్.! "

"సరే రేపటివరకూ నీకోసం ఇక్కడే అంటే ఈ ఊళ్ళోనే ఉంటాను. రేపు కూడా తలంటి పోసుకో. నీ మొహం మీద అలా జుట్టు పడుతోంటే చాలా అందంగా ఉన్నావు. "

సిగ్గుతో అణువణువూ ముకుళిస్తోంటే చివ్వున పరిగెత్తింది.

ఉష పెళ్ళి చూపుల్లో పద్మిని ఆలోచనలన్నీ శేషగిరి చుట్టూనే తిరగసాగాయి. వచ్చిన పెళ్ళికొడుకులో కూడా ఆమెకి శేషగిరే కనిపించాడు. అతని ఎదురుగా తానూ ఉషలా అందంగా అలంకరించుకుని సిగ్గుల మొగ్గై అలా తలవంచుకుని కూర్చున్నట్టు శేషగిరి చిరునవ్వుతో సినిమాల్లో ఎన్.టి.ఆర్ లాగా చిటికెన వేలితో తన చుబుకం ఎత్తి సిగ్గా అంటూ తనని కౌగిట్లోకి తీసుకున్నట్టు ఆ తరువాత... రెండు చేతుల్లో మొహం దాచేసుకుంది పద్మిని.

ఆ రాత్రి కూడా ఆమెకి కలల్లో శేషగిరే కనిపించాడు. తెల్లవారడం కోసం ఎదురుచూస్తూ కళ్ళు మూసుకుంది.

మర్నాడు డాన్సు ప్రాక్టీస్ చేయలేకపోయింది పద్మిని. అడుగులు వేస్తున్నప్పుడల్లా శేషగిరి రెండు అరచేతులూ తన పాదాల కింద పెట్టినట్టు కందిపోతాయి నా చేతుల మీద ఆడు అంటున్నట్టు అనిపించింది. అభినయిస్తుంటే తన మొహాన్ని రెండు చేతుల్తో పట్టుకుని అతను పరవశిస్తూ కళ్ళల్లోకి చూస్తున్నట్టు అనిపించింది. అతని ఊహలు చేస్తున్న అల్లరికి ఆమె అడుగులు తడబడ్డాయి.

ఆమె హావభావాల్లో పారవశ్యం చూసిన మేస్తారు కోపోద్రిక్తులైయ్యారు. "ఏమైంది పద్మినీ నీకు. సాహిత్యం ఏది? నీ అభినయం ఏమిటి? " అంటూ హెచ్చరించడంతో ఉలిక్కిపడింది.

"ఏం జరిగింది ఇవాళ? అడిగాడాయన? "

బెదిరిపోతున్న కళ్ళతో అంది "తలనొప్పిగా ఉంది. "

"మరామాట ముందే చెప్పి ఏడవచ్చుగా. వెళ్ళు ఇంటికెళ్ళి మందో, మాకో తిని పడుకో రేపు శ్రద్ధగా చేయకపోతే నాట్యం మానేయ్" నిక్కచ్చిగా అన్నాడాయన.

పద్మినికి మాష్టారలా మందలించడంతో దుఃఖం పొంగివచ్చింది. మిగతా పిల్లల ముందు అవమానంగా కూడా అనిపించింది. కానీ, శేషగిరి చూపులు వెంటాడడంతో అతని చూపుల గారడీలో చిక్కుకున్న ఆమె మనసు ఆ క్షణంలో అతని దగ్గరకు వెళ్ళడానికే మొగ్గుచూపడంతో తల వంచుకుని బైటకి వచ్చేసింది.

అప్పటికే ఆమె కోసం ఎదురుచూస్తున్న శేషగిరి సందు మొదట్లోనే ఆమె దగ్గరకు గబ గబా వచ్చేసి అడిగాడు "ఆంజనేయస్వామి ఆలయానికి వెళదామా? "

భయంగా, బెదురుగా, కొంత ఇష్టంగా, మరికొంత యిష్టంగా తల ఊపింది.

"పద" అన్నాడు ఆమె పక్కన నడుస్తూ.

"మీరు ముందు వెళ్ళండి. నేను వెనకాల వస్తాను. ఎవరన్నా చూస్తారు" అంది.

ఆమె అలా భయపడడంలో తప్పేం లేదనిపించిందేమో అతనికి వెంటనే ఒప్పేసుకుని తను మాత్రం ఆమెకి కొంచెం దూరంగా నడవడం ప్రారంభించాడు.

పద్మిని కుటుంబం ఎంతోకాలంగా ఆ ఊళ్ళోనే ఉండడంతో ఊరివారందరికీ ఆ కుటుంబం తెలుసు. ఆ కుటుంబమే కాదు, చాలా కుటుంబాలు అందరికీ పరిచితమే. ఏ కుటుంబంలోంచి ఏ అమ్మాయి ఎటు వెళ్ళినా, ఎవరితో మాట్లాడినా, ఏం చేసినా ఊరందరికీ తెలియడంలో వింతేం లేదు. అది పట్నం కాదు ఎవరెలా పోతే మనకేం అనుకుని పట్టనట్టు వ్యవహరించడానికి. పద్మిని ఇంతకు ముందు ఆ అపరిచితుడైన కుర్రవాడితో మాట్లాడడం ఒకళ్ళిద్దరు చూసినా, ఆ క్షణానికి అడిగిన వాళ్ళకి అబద్ధం చెప్పి తప్పించుకుంది కానీ, ఇప్పుడు అతనితో కలిసి దేవాలయానికి వెళ్ళిందంటే జరగబోయేదేమిటో పద్మినికి తెలుసు. అలాగని ఊరు విధించిన నియమాలను ఉల్లంఘించి పరాయివ్యక్తితో కలిసి ఆ ఊరి వీధుల్లో నడవడానికి ఆమె అంతరాత్మ అంగీకరించలేదు. పోనీ అతనితో వెళ్ళడం తప్పని తెలిసినా ఆ తప్పు చేయకుండా ఆగలేదు. వయసు, మనసు వెళ్ళాలని తహ, తహలాడుతోంటే చిన్నప్పటినుంచీ జీర్ణం చేసుకున్న కొంత క్రమశిక్షణను వదులుకోడానికి ఆమెకి ఎక్కువ సమయం పట్టలేదు.

ఆంజనేయస్వామి ఆలయం ఊరికి కొంచెం ఎడంగా ఉంటుంది. నివాస స్థలాలను దాటుకుని, పొలాలమీదుగా ముందుకు నడిచి వెళితే కృష్ణానది పాయ ఒకటి ప్రవహిస్తూ ఉంటుంది. దాన్నానుకుని ఎత్తైన కొండలు. కొండమీద పంచముఖ ఆంజనేయస్వామి కోవెల. అది వెలసిన దేవుడు అంటారు. కానీ, చాలా పురాతనమైన ఆలయం. కొండ ఎక్కడానికి ఈ మధ్యే మెట్లదారి ఏర్పరిచారు. లేకపోతే ఎగుడు, దిగుడు బండరాళ్ళను దాటుకుంటూ పైకి ఎక్కాల్సి వచ్చేది. పైకి వెళ్ళగానే విశాలమైన ఆవరణ, ఈశాన్యంలో బావి, తూర్పు ముఖం చేసిన ఆంజనేయస్వామి విగ్రహం, ఎటు చూసినా పచ్చటి చెట్లు, ధ్వజస్థంభం దగ్గర తులసి కోట ఓ పక్క చిన్నగా ఉన్న గర్భగుడిలో సీతారామ లక్ష్మణుల విగ్రహాలు. మధ్యాహ్నం మూడు దాటుతోంది. ఎండగా ఉన్నా చెట్ల నీడలో చల్లగా ఉంది. అంతేకాక గాలి విపరీతంగా వీస్తూ హాయిగొల్పుతోంది.

అటు శేషగిరి, ఇటు పద్మిని కూడా దాదాపు ఒకేసారి పైకి ఎక్కారు.

గాలికి ఎగిరి మొహాన్ని కప్పేసున్న కురులు, కళ్ళు చిట్లించి ఆ ప్రాంగణాన్ని పరిశీలిస్తూ నిలబడిన ఆ ఒంపుసొంపుల సోయగం శేషగిరి చూపు మరల్చుకోలేకపోయాడు.

ఒక్కసారి పరిసరాలు కలయచూసి అక్కడెవరూ లేరని నిర్ధారించుకుని గట్టిగా శ్వాస తీసుకుని అతనివైపు చూసిన పద్మిని తదేకంగా తననే చూస్తున్న అతని చూపుల్లో తన చూపులు చిక్కుకుపోగా కాస్సేపలాగే చిత్తరువులా నిలబడిపోయింది.

"రా కూర్చుందాం" అంటూ పక్కనే ఉన్న రావిచెట్టు గట్టుమీదకి ఆహ్వానించాడు.

కొంచెం ఎడంగా అతని పక్కనే కూర్చుని తలవంచుకుని వేలికి ఓణీ కొస చుట్టుకోసాగింది.

"పద్మినీ!" పరవశంగా పిలిచాడు శేషగిరి.

నాగస్వరం విన్న నాగుపాములా చివుక్కున తలెత్తింది ఆ పిలుపులోని పారవశ్యానికి.

"ఎంత అందంగా ఉంటావో తెలుసా! నేనెంతో మంది అమ్మాయిలతో నటించాను. కానీ, ఒక్కళ్ళు కూడా అందంగా ఉండరు. ఏదో నటిస్తారు కానీ, నీలో ఒక కళాకారిణి కూడా ఉంది. ఇంత అందమైన కళాకారిణి ఇలా ఈ మారుమూల పల్లెటూళ్ళో అనామకంగా ఉండడం నేను భరించలేకపోతున్నాను. నాతో వచ్చేస్తావా నిన్ను హీరోయిన్‌ని చేస్తాను. "

భయంగా రెప్పలల్లార్చుతూ అడ్డంగా తల ఊపి "నాన్న చంపేస్తారు" అంది.

అతను నవ్వాడు. "మీ నాన్నేకాదు. ఎవరి నాన్న అయినా సినిమాలనగానే ముందు కర్రో, కత్తో పట్టుకునే వస్తారు. కానీ, రేపు నువ్వే పెద్ద హీరోయిన్ అయి లక్షలు, లక్షలు సంపాదిస్తుంటే అదే నాన్న నీకు బాడీగార్డులా వస్తాడు షూటింగ్స్‌కి. కనక మీ నాన్న గురించి ఆలోచించకు. "

"లేదు, లేదు నాకు భయం. నేను రాను" గబగబా అంది.

ఆమె అన్న తీరుకి, ఆమె కళ్ళల్లోని భయానికి కొంచెం తగ్గాడు శేషగిరి.

అతనికి కొంచెం భయం వేసింది. మరీ తను ఆమెని ఆదిలోనే భయపెడుతున్నాడు. మాటల్లో పెట్టి, సినిమా ప్రపంచంలోని వింతలు, విశేషాలు, ఆ మెరుపులు, తళుకులను వర్ణించి, ఆమె ఊహల్లో ఓ అందాల ప్రపంచం సృష్టించి అప్పుడు తననుకునేది సాధించాలి. ఈ పల్లెటూరి, అమాయకురాలిని నేరుగా సినిమాలంటూ భయపెడితే మొదటికే మోసం వస్తుంది. ఇలాకాదు. ఈమెని ప్రేమగా, అనురాగంగా తనవైపు తిప్పుకుని తరవాత సినిమా ఫీల్డ్‌లోకి మళ్ళించాలి. ఈమె ఒక్కసారి తన ప్రభంజనంలో పడిందంటే చాలు తన దశ తిరిగినట్టే.

శేషగిరి వెంటనే మాట మార్చి నవ్వుతూ అన్నాడు. "పోనీలే నీకు ఇష్టం లేకపోతే ఒద్దు. ఊరికే నీ అందం చూస్తుంటే నాకనిపించిన విషయం చెప్పాను. ఇంతకీ ఏం చదువుతున్నావు? "

పద్మిని కొంచెం ఇబ్బందిగా చెప్పింది. "టెన్త్ పోయింది మళ్ళీ కడుతున్నాను. "

"ఓ.. అయినా నీకు చదువెందుకు? అమ్మాయిలని ఈ మధ్య పెళ్ళికోసమే చదివిస్తున్నారు. నీ అందం చూస్తే చాలు రాజకుమారుడే దిగివస్తాడు. "

పద్మినికలా అతను పదే, పదే తన అందాన్ని పొగుడుతుంటే కొత్తగా, వింతగా, ఎంతో మధురంగా అనిపిస్తోంది. తను అందంగా ఉంటుందని తనకి తెలుసు. తల్లికూడా అంటూ ఉంటుంది. మధ్య, మధ్య దిష్టి తీస్తూ ఉంటుంది. తన స్నేహితురాళ్ళు కూడా అంటారు "నీకేమే సినిమాస్టారులా ఉంటావు" అని. కానీ, ఇప్పుడు ఈ యువకుడి నోటినుంచి వస్తున్న ప్రశంసలో ఏదో మత్తు, మరేదో మహత్తు వినిపిస్తోంది. అతని చూపులు గాలం వేస్తున్నట్టు ఆమె మనసుని లాగేసుకుంటున్నాయి. ఆ స్వరం చెవుల్లో శంఖం ఊదుతున్నట్టుగా వినిపిస్తోంది. మొత్తం మీద ఆ అపరిచిత యువకుడు, నటుడు అయిన శేషగిరికి పద్మిని మనసులో చోటు సంపాదించడానికి ఎక్కువ కష్టపడాల్సిన అవసరం కలగలేదు. వాళ్ళు గంట పైగా కూర్చున్నా ఆమెకి తిరిగి వస్తోంటే "అయ్యో అప్పుడే వెళ్ళిపోడమా" అనిపించింది. ఆగి, ఆగి వెనక్కి తిరిగి చూస్తూ వెళ్ళిపోతున్న ఆమెని చూస్తూ చెయి ఊపుతున్న శేషగిరి ఆమె కనుమరుగవగానే తన కుడిచేయి మీసాల మీదకి పోనిచ్చి విలాసంగా దువ్వుకున్నాడు.

**ఇంటికి వెళ్ళిన పద్మినికి** శేషగిరి మాటలు చెవుల్లో మారుమోగుతున్నాయి. అతని మాటల మైకంలో ఆమెకి తనేం చేస్తోందో, ఎందుకు చేస్తోందో అర్థంకాలేదు. కంచంలో చేయిపెట్టుకుని కెలుకుతూ పరధ్యానంగా కూర్చున్న కూతుర్ని వింతగా చూస్తూ అడిగింది సీత.

"ఏంటే ఆలోచిస్తున్నావు. తినవేం?" ఉలిక్కిపడింది పద్మిని.

"ఏం లేదమ్మా" అంటూ నాలుగు మెతుకులు కతికి చేయి కడుక్కోబోతుంటే

"అదేంటి అప్పుడే చేయి కడుక్కుంటున్నావు. ఏమైంది నీకివాళ?" ఆశ్చర్యంగా అడిగింది సీత.

"నాకు తినాలనిలేదమ్మా. ఆకలిగా లేదు నిద్రొస్తోంది" అంటూ అబద్ధం చెపుతున్నానన్న విషయం మొహంలో కనిపిస్తుందేమో అనే భయంతో గబగబా లోపలికి పారిపోయింది.

దీనికేదో అయిందివాళ అనుకుందేకానీ, సీత మనసులో కూతురు పరువంలో అడుగుపెట్టిందని, ఆమె మనసు ప్రేమవైపు పరుగులు తీస్తోందని గ్రహించలేకపోయింది.

పద్మినికి కళ్ళు మూసుకున్నా, తెరిచినా శేషగిరి రూపమే కనిపిస్తోంది. అతని స్వరం వినిపిస్తోంది.

నిజంగానే తను చాలా అందంగా ఉంటుందా? పద్మిని గభాల్న లేచి అద్దం ముందు నిలబడింది.

చాలాసార్లు అద్దంలో చూసుకున్నా కనిపించని అందాలేవో తనలో కొత్తగా కనిపిస్తున్నట్టు అనిపించింది. పొడుగాటి జడ వయ్యారంగా ముందుకు వేసుకుని కొద్దిగా ఒంగి అలవోకగా చూసుకుంది.

కళ్ళు కాస్సేపు పెద్దవిగా, కాస్సేపు చికిలించి చిన్నవిగా చేసి చూసుకుంది.

నవ్వుకుంటూ తనని తాను  చూసుకుంది. కాస్సేపు భయంగా చూసుకుంది. నవరసాల్లో తనని తాను ఊహించుకుంది. ఆమె కళ్ళు తన గుండెలమీదికి మళ్ళాయి. చెక్కిళ్ళు ఎర్రబడ్డాయి. రెండు చేతులూ గుండెలకి అడ్డుపెట్టుకుని చటుక్కున లైటార్పి వెళ్ళిమంచం మీద వాలింది.

తన పక్కనే పడుకున్నవాళ్ళెవరో తన నడుం చుట్టూ చేయేసినట్టు అనిపించి ఉలిక్కిపడింది. ఎవరూ లేరు. తను అంతకు ముందు లేస్తూ విసిరేసిన తలగడ. గుండెలు దడ, దడలాడాయి. కళ్ళు ఎక్కడన్నా శేషగిరి దాక్కున్నాడేమో అన్నట్టు గది నలుమూలలా వెతికాయి. ఎక్కడా అతను కనిపించకపోడంతో అమాంతం నీరసం ఆవహించింది.

ఎంత ప్రయత్నించినా ఆమెకి నిద్రపట్టలేదు. రాత్రంతా తాను పెద్ద హీరోయిన్ అయి, రక,రకాల పాత్రల్లో వెండితెరమీద నటిస్తున్నట్టుగా కలలొచ్చాయి. ఆ కలల్లో తన పక్కనే అంటిపెట్టుకుని శేషగిరి... నవ్వుతూ శేషగిరి.. నవ్విస్తూ శేషగిరి.

ఎప్పుడో తెల,తెలవారుతుండగా నిద్రపట్టింది.

ఎండ చురుక్కుమని తగులుతోంటే లేచింది.

బాగా పొద్దుపోయింది.

పద్మిని లేచి పెరట్లోకి వెళ్తోంటే అప్పుడే మొక్కలకి నీళ్ళు పెట్టివస్తోన్న సీత చిరాగ్గా అంది.

"ఏమొచ్చింది నీకివాళ ఇంత ఆలస్యంగా లేవడం. రాత్రి అప్పుడే నిద్రముంచుకొస్తోందని వెళ్ళావు పడుకోలేదా? "

తన దడ, తడబాటు తెలియనీకుండా

"అబ్బా! ఏంటమ్మా బాగా నిద్రొచ్చి పడుకున్నాను. " అంటూ అక్కడినుంచి వడివడిగా వెళ్ళిపోయింది.

స్నానం చేసి వచ్చి జడేసుకోబోతూ ఆగిపోయింది. తండ్రి పెట్టిన నిబంధన ప్రకారం ఈవేళ తను ఒక్క జడ వేసుకోకూడదు. కానీ, శేషగిరి ఒక్క జడే వేసుకోమన్నాడు. ఆ జడ తన వీపుమీద నాగుపాములా ఉందిట. "అమ్మో పామే!" భయంగా నవ్వుకుంది. రెండు జడలకి పాయలు తీయబోతూ తిరిగి ఆపేసి ఒక్కజడ వేసుకుంది.

తయారై వంటగదిలోకి వచ్చిన కూతుర్ని చూసి నొసలు చిట్లించింది సీత.

"రెండు జడలేసుకో పో" కసిరింది.

"నాకిష్టంలేదమ్మా" బుంగమూతి పెట్టింది పద్మిని.

"నోరుమూసుకుని వెళ్ళు రెండు జడలేసుకో నాన్నగారు చూశారంటే తాట తీస్తారు. "

"అబ్బబ్బ అన్నీకావాలి నాన్నకి. నా జడల సంగతి నాన్నకెందుకు? " విసుక్కుంది పద్మిని.

ఆవిడ విస్తుపోయి చూసింది. "ఏమన్నావు? "

పద్మిని సర్దుకుంటూ అంది. "నేను పెద్దదాన్ని అవడంలేదా ఏం? నాకు రెండు జడలేసుకోవాలంటే సిగ్గు. అందరూ నవ్వుతారు."

"ఎందుకు నవ్వుతారు? నువ్వింకా పెద్దదానివి కాలేదు. నోరుమూసుకుని వెళ్ళి జడేసుకురా." ఇంక ఏం మాట్లాడేది లేదన్నట్టు ఆవిడ తలతిప్పేసుకుంది.

ఒళ్ళుమండిపోయింది పద్మినికి. అన్నీ వీళ్ళిష్టమేనా? అనుకుంటూ పాదాలు నేలకేసి బలంగా తాకిస్తూ శబ్దం చేస్తూ వెళ్ళిపోయింది.

కూతురి వాలకం సీతకి అనుమానం రేకెత్తించింది. " ఈ పిల్లకేమైంది. ఏదో మార్పు కనిపిస్తోంది."

డ్యాన్సు నేర్చుకుంటుంటే పిచ్చివేషాలు ఎక్కువవుతాయా? అప్పుడే తను పెద్ద డ్యాన్సర్‌ని అయాననుకుంటుంది కాబోలు. అసలు ఏం నేర్చుకుంటోందో, ఎంతవరకూ నేర్చుకుందో ఒక్కసారి మాష్టారి దగ్గరకు వెళ్ళిరావాలి అనుకుంది కానీ, కూతురి మనసులోకి ఓ యువకుడు దూరి అల్లరి పెడుతున్నాడని, ఆమె ఆలోచనలను దారి తప్పిస్తున్నాడని ఆవిడ ఊహించలేకపోయింది.

శేషగిరి ఆ రోజు వెళ్ళిపోయిన వారానికి రెండుసార్లు తిరిగి పద్మినికోసం ఆ ఊరికి రావడం, వచ్చినపుడల్లా ఇద్దరూ కోవెలలో కలుసుకుని కబుర్లు చెప్పుకోడం జరిగిపోతోంది. అలా ఓ నెల గడిచింది.

ఓ రోజు ఇద్దరూ ఎప్పటిలాగా కోవెల్లో రావిచెట్టు కింద కూర్చున్నారు. విశాలమైన ఆ దేవాలయం ప్రాంగణంలో చాలా చెట్లు ఉన్నాయి. అవి మామూలు చెట్లుకాదు మహావృక్షాలు, రావి, వేప, కాక గర్భగుడికి వెనకవైపు కొంచెం దూరంలో ప్రహరీ అవతల నాలుగుమెట్లున్నాయి. ఆమె మెట్లు దిగి వెళితే పూర్తిగా ఎండిపోయి చెత్తా, చెదారంతో నిండిన కోనేరు కనిపిస్తుంది. దానికి కొంచెం ఎడంగా పెద్ద మర్రిచెట్టు. దాని ఊడలు బలంగా ఉండి బాగా కిందకి వేళ్ళాడుతూ ఉంటాయి. రెండు రోజుల క్రితం ఆ చెట్టు చూశాడు శేషగిరి. అక్కడ కూర్చుంటే పొరపాటున కూడా ఎవరికీ కనిపించే అవకాశం లేదు. అక్కడికి తీసుకుని వెళ్ళాలి పద్మినిని అనుకుంటూ ఆమె వైపు చూశాడు.

చలికాలం మొదలైందేమో బాగా చలిగా ఉంది.

ఆరింటికే కొంచెం చీకటి పడుతోంది. సన్నగాలి వెన్నులో జలదరింపు కలిగిస్తోంటే చలికి ఓణీ చెంగు భుజం చుట్టూ కప్పుకుంది పద్మిని.

"చలిగా ఉందా?" చటుక్కున ఆమె పక్కన కూర్చుని మొహం ఆమె మొహానికి బాగా దగ్గరగా తీసుకొచ్చి రహస్యంగా అడిగాడు. అతని ఒంటినుంచి వస్తున్న మత్తైన పరిమళం, నులివెచ్చని అతని శ్వాస ఆమెని కొత్త లోకంలోకి తీసుకుపోతున్నట్టు మైకంగా అనిపించింది తల వంచేసుకుంది.

"సిగ్గా..!!" అతను కుడిచేయి చూపుడు వేలితో అచ్చు సినిమాల్లో ఎన్.టి.ఆర్ లాగా ఆమె చుబుకం పట్టుకుని మొహం పైకెత్తాడు.

పారిజాతం పూలన్నీ జలజలా రాలినట్టు, ఆ పరిమళం తనని ఉక్కిరి, బిక్కిరి చేస్తున్నట్టు బరువుగా వాలిపోతున్న కనురెప్పలను కుడి అరచేత్తో మూసేసుకుంది.

"పద్మా.. నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను నాకు నువ్వు కావాలి. "

ఆమె అణువణువూ ఝల్లుమంది. పెళ్ళా! పెళ్ళా! శేషగిరితో పెళ్ళా!? ఇంత అందమైన శేషగిరితో పెళ్ళా!? ఇతనిలా ఎప్పుడూ తన సరసనే ఉంటాడా? ఈ పరిమళం, ఈ వెచ్చటి ఊపిరి ఎప్పుడూ తననిలా వివశురాల్ని చేస్తూనే ఉంటాయా? పద్మినికి తన చుట్టూ అప్సరసలంతా చేరి పూలజల్లులు కురిపిస్తూ నృత్యం చేస్తున్నట్టు అనిపించింది. ఆకాశంలోంచి గంధర్వులంతా పసిడి కలశాలతో అభిషేకిస్తున్నట్టు. ముక్కోటి దేవతలు అక్షింతలు చల్లుతున్నట్టు.

అంటూనే చటుక్కున తన కుడిచేయిచాచి ఆమె భుజం చుట్టూ వేసి దగ్గరగా లాక్కున్నాడు శేషగిరి.

పద్మినికి కళ్ళముందు ఇంద్రధనస్సులు వాలాయి. నక్షత్రాలన్ని తలమీద జలజలా రాలి అణువణువూ తడుముతున్నట్టు, ఒళ్ళంతా ఆవిర్లు వస్తున్నట్టు అయింది. అప్రయత్నంగా కళ్ళువాలిపోయాయి.

ఆమెలో వేగంగా కదుల్తున్న హావభావాలు గమనిస్తున్న శేషగిరి మరింతగా ఆమెని అదుముకుంటూ రహస్యంగా చెవిలో అన్నాడు

"నిన్ను నేను ప్రేమిస్తున్నాను. నన్ను నువ్వు ప్రేమిస్తున్నావా?"

పద్మిని ఏం మాట్లాడలేదు. ఆమెకి ఏం మాట్లాడాలో తట్టలేదు. అసలే మాటలే రాలేదు. గొంతు మూగబోయింది. పరవశంతో మెదడు పనిచేయడం మానేసింది. మైనం బొమ్మలో అతని చేతుల్లో కరిగిపోసాగింది.

అతను ఆమె చెక్కిళ్ళు, కళ్ళు ముద్దుపెట్టుకుంటూ అన్నాడు. "నీ కళ్ళు ఎంత బాగుంటాయో తెలుసా. అన్నిటికన్నా ఈ పెదాలు. ఈ పెదాలు అమృతాన్ని నింపుకున్నటు" అంటూనే పెదాలు అందుకున్నాడు.

అనుకోని ఆ చర్యకు పద్మినికి భయంతో ముచ్చెమటలు పోశాయి.

అతని చేతుల్నుంచి వదిలించుకోడానికి పెనుగులాడింది. అతను మరింతగా పట్టు బిగించడంతో రెండు చేతులూ బిగించి ఒక్క తోపు తోసి గట్టు దిగి పరిగెత్తింది.

"ఏయ్ పద్మినీ.. పద్మా.. అరే ఆగు.. " అంటూ వెనకే వస్తున్న శేషగిరి వైపు చూడకుండా రివ్వున పరిగెత్తుకుంటూ వెళ్ళి కొండ దిగి, రోడ్డు మీదకి వచ్చాక ఆయాసంతో కొన్ని క్షణాలు ఆగిపోయింది.

అలుపు తీర్చుకుని తిరిగి వేగంగా ముందుకు నడుస్తూ స్థంభించినట్టు ఆగిపోయింది. పక్క సందులోంచి సైకిల్ మీద తండ్రి.

ఆయన సూటిగా తన ఎదరు రోడ్డు చూస్తూ సైకిల్ నడిపిస్తున్నాడు.

నాన్న నన్ను చూడలేదు. హమ్మయ్య ఒక్కసారి ఊపిరి పీల్చుకుని, అటూ ఇటూ చూసి కుడివైపు సందులోకి తిరిగి పరుగు ప్రారంభించింది. అట్నించి వెళ్ళిపోతే ఇంటి పెరటివైపు గేటు వస్తుంది. పెరట్లోంచి గబగబా ఇంట్లోకి వెళ్ళిపోవచ్చు. నాన్న చూస్తే ఆలస్యం

అయిందని సంజాయిషీ అడుగుతాడు. తను అబద్ధం చెబితే నాన్నకి తెలిసిపోతుంది. అమ్మని ఎలాగైనా మభ్య పెట్టచ్చు కానీ నాన్నని మభ్య పెట్టడం చాలా కష్టం అనుకుంటూ పరుగుతో ఇల్లు చేరింది.

పెరటివైపు లోపలికి వస్తున్న కూతుర్ని ఆశ్చర్యంగా చూసింది సీత.

"ఇట్నించి వస్తున్నావేంటి అడిగింది."

"ఊరికే! నాతో పాటు రమ కూడా వచ్చింది. అది అటువైపు వెళ్ళింది నేనిటు వచ్చాను" అంది తేలిగ్గా.

రమ పద్మిని ఇంటికి వెనకవైపు సందులో ఉంటుంది. ఆ క్షణంలో ఆ అబద్ధం తనకి తట్టినందుకు మనసులో తనని తానే అభినందించుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది పద్మిని.

పద్మిని వాలకం చూస్తుంటే సీతకి కొంచెం అసాధారణంగా అనిపించింది. రోజూలా కాకుండా వేరుగా, కొత్త పద్మినిలా అనిపించింది. జుట్టురేగి ఉంది, మొహం కూడా అదోలా ఉంది.

అనుమానంగా ఏదో అడగబోతుండగా బైట సైకిల్ మోగడంతో ఆయన వచ్చారు అనుకుంటూ భర్తకు ఎదురు వెళ్ళింది సీత.

ఆ రాత్రి కూడా పద్మినికి శివరాత్రే అయింది.

ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా ఎప్పుడెప్పుడు మళ్ళీ శేషగిరిని కలుస్తానా అని నిరీక్షణతో గడిచింది. అతనందించిన తీయని అనుభూతుల కోసం, అనుభవాల కోసం ఆమె నరనరం తీయగా మూలిగింది. ఇంతకాలంగా తనెరుగని ఓ కొత్త ప్రపంచానికి ఆహ్వానం పలుకుతూ అతను తన కాళ్ళకింద గులాబీపూలు పరిచినట్లు, ఆ పూల మీద అడుగులు వేస్తూ అతనితోపాటు స్వర్గలోకానికి పయనిస్తున్నట్టు ఏవేవో ఊహలు... ఎన్నెన్నో కలలు!!.

తెల్లవారింది. ఆ రోజు వెళ్ళిపోయిన శేషగిరి తిరిగి నాలుగురోజులకే వచ్చాడు.

అతనికోసం ఎదురుచూడడంలోనే పద్మినికి ఆ నాలుగురోజులూ గడిచాయి.

అతను వస్తూనే ఆరాటంగా వెళ్ళింది. అతని చేతులు చాచగానే వాలిపోయింది.

"అక్కడ కూర్చుందామా?" మర్రిచెట్టు దగ్గరకు తీసుకుని వెళ్ళి అడిగాడు.

"అమ్మో అక్కడ దయ్యాలుంటాయి" అంది.

"నవ్వాడు. నాకు దయ్యాలంటే భయంలేదు. వాటికే నేనంటే భయం" అన్నాడు.

"ఊహూ ఒద్దొద్దు. ఇక్కడే కూర్చుందాం. చీకటిపడితే అక్కడ గుడ్లగూబలు వస్తాయి. కీచురాళ్ళొస్తాయి. "

ఆమె మొహం చూస్తే ఆ చెట్టు పట్ల ఆమెకున్న భయం స్పష్టంగా కనిపించింది.. ప్రస్తుతానికి ఆ విషయం వాయిదా వేశాడు.

శేషగిరి ఆ ఊరినుంచి కదలలేదు. పద్మిని డ్యాన్సు క్లాసు పేరుతో అతని దగ్గరకు వెళ్ళడం ఇద్దరూ ఆ పురాతన దేవాలయంలో ఎవరికీ కనిపించని చెట్ల మధ్య కూర్చుని కబుర్లు చెప్పుకోడం, ఆమెకి తెలియని ఎన్నెన్నో ఊహాలోకాల్లోకి తీసుకువెళుతూ ఆమె కళ్ళముందు అద్భుతమైన ప్రపంచాన్ని అతను సృష్టించడం, మధ్య, మధ్య అతని అల్లరి చేష్టలు, ఆమెలో తీయని పులకింతలు వీటి మధ్య మరో నెల గడిచింది.

ఆ రోజు యధాప్రకారం ఇద్దరూ అదే స్థలంలో కూర్చున్నారు.

ఇప్పుడు పద్మిని తండ్రి పెట్టిన ఆంక్షలు పట్టించుకోడంలేదు. శేషగిరికి ఎలా ఇష్టమైతే అలా తయారవుతోంది. అతని సమక్షంలో ఆమెకి వేరే లోకంకానీ, తల్లితండ్రులు కానీ, తమ్ముడు, అక్కలు కానీ ఎవరూ గుర్తురావడంలేదు. శేషగిరే ఆమె సర్వస్వంగా అయింది. అతని స్పర్శ కోసం, అతని తీయని ముద్దుల కోసం శరీరం తపిస్తోంది. మొదట్లో అతను దగ్గరకు లాక్కోగానే భయంతో పరుగులు

పెట్టేది. ఇప్పుడు తనంతటతానే అతనికి బాగా దగ్గరగా కూర్చోడం ఎప్పుడెప్పుడు అతను తనని మరింత దగ్గరగా తీసుకుంటాడో, ఎప్పుడెప్పుడు అతని వెచ్చని పెదవుల స్పర్శ తన చెంపల్ని తాకుతుందో అని తహతహలాడుతోంది.

శేషగిరికి ఆమెలో వచ్చిన మార్పులు అర్థమవుతున్నాయి. అతని లక్ష్యం నెరవేరే సమయం దగ్గరగా వచ్చిందని అతనికి తెలిసింది.

ఆ రోజు సడన్‌గా అన్నాడు "నిన్ను చూడకుండా క్షణం కూడా ఉండలేకపోతున్నాను పద్మినీ."

"నేను కూడా" అప్రయత్నంగానే అనేసింది పద్మిని.

"నిజంగానా.!?" ఆమెని దగ్గరగా లాక్కుని అడిగాడు.

"ఊ.." అతని గుండెల్లో ఒదిగిపోతూ తల ఊపింది.

"మనం పెళ్ళిచేసుకుందామా?"

"ఊ.."

"మీ అమ్మా, నాన్నా ఒప్పుకుంటారా?"

"తెలియదు."

"అడుగుతావా?"

"నాకు భయం."

"మరెలా?"

"నాకు తెలియదు. నాకు నువ్వు కావాలి శేషగిరీ."

"నాకు నువ్వు కావాలి." మరింతగా అదుముకున్నాడు.

ఆ తరువాత ఇద్దరి మధ్యా కాస్సేపు మాటలు సాగలేదు. ఇద్దరూ తెలియని మైకంలో పరిసరాలను మర్చిపోయారు.

అప్పుడు మోగిందో కంఠం.

"ఎవరది? ఎవరక్కడ?" మోటుగా, కర్ణకఠోరంగా.

ఇద్దరూ ఉలిక్కిపడ్డారు.

"ఎవరో వచ్చారు." భయంతో వణికిపోతూ అంది పద్మిని.

"అవును. అవును" వెతుక్కుంటున్నట్టుగా చుట్టూ చూస్తూ అన్నాడు.

"ఊళ్ళోవాళ్ళు చూశారంటే ఇంకేం లేదు.. ఎలా?" వణికింది ఆమె స్వరం.

అతను ఆమె వైపు చూశాడు. భయంతో మొహం పాలిపోయింది. అప్పటిదాకా మెరుపులు కురిపించిన కళ్ళు భయంతో ఎర్రగా అయాయి. అతని పెదాలమధ్య నలిగిన పెదాలు చిట్లి కొద్దిగా రక్తం వస్తోంది.

"ఇలా రా.." అంటూ ఆమె చేయిపట్టుకుని బర, బరా లాక్కెళ్ళి మర్రి చెట్టు వెనకాల ఎవరికీ కనిపించకుండా కూర్చోబెట్టి "ఇక్కడే ఉండు ఎవరొచ్చారో నేను చూసొస్తాను." అంటూ వడి, వడిగా వెళ్ళిపోయాడు.

ఓ పక్క ఎవరో వచ్చారన్న భయం, మరో పక్క దయ్యాల చెట్టు దగ్గర ఉన్నానన్న వణుకుతో ఆమెకి చెమటల్లు పట్టేసింది.

"దేవుడా నన్ను రక్షించు. నన్ను రక్షించు. నన్నెవరూ చూడొద్దు ప్లీజ్" దేవుడికి దణ్ణం పెట్టుకుంటూ, పదే పదే వేడుకుంటూ కళ్ళుమూసుకుని, ముడుచుకుని కూర్చుంది పద్మిని.

కొద్దిదూరంలో నుంచి మాటలు వినిపిస్తున్నాయి.

"ఎవరయ్యా.. నువ్వు ఇక్కడేం చేస్తున్నావు?"

పద్మిని గుర్తుపట్టింది. ఆ స్వరం ఆ ఊరి స్కూలు మాష్టారు చలపతిరావుగారిది. తను ఆయన దగ్గరే చదువుకుంది. ఆయనకి పద్మిని బాగా తెలుసు. చూశాడంటే కొంపలంటుకుపోతాయి. శేషగిరి దొరికిపోయాడు. ఏం చెబుతాడో చెవులు రిక్కించింది.

"రేపు దుర్యోధన ఏకపాత్రాభినయం ప్రదర్శన ఉంది మాష్టారూ. వల్లె వేస్తున్నాను."

"ఇక్కడా! పైగా ఈ సమయంలోనా?" ఆయన అనుమానంగా అడిగాడు.

"నా తోటి వేషగాళ్ళు వేరే నాటకం ప్రాక్టీస్ చేస్తున్నారు. అక్కడ నాకు ఏకాగ్రత కుదరక ఇక్కడ ప్రశాంతంగా ఉందని వచ్చాను".

"సరేలే ఇక బయలుదేరు. చీకటి పడుతోంది. పురుగూ, పుట్రా ఉంటాయి."

"వెళ్ళిపోతాను మాష్టారూ. ఇంక ఒక్కటే అంకం ఉంది. ఆ కాస్త చెప్పుకుని వెళ్ళిపోతాను. మీరు వెళ్ళండి."

"సరేలే" ఆయన చేతికర్ర టక్, టక్ అంటూ దూరమైంది.

పద్మిని ఊపిరి పీల్చుకుంది.

మరికొన్ని నిమిషాల్లో వచ్చాడు శేషగిరి.

"వెళ్ళిపోయారా మాష్టారు?" భయంగా అడిగింది.

"వెళ్ళారు." అతను చేయి అందించి ఆమెని లేవదీసి గట్టిగా కౌగిలించుకున్నాడు.

"వెళ్ళిపోదాం శేషగిరీ..." అస్పష్టంగా అంది.

"అప్పుడేనా? ఈ ఏకాంతం, ఈ వెన్నెల వెలుగు, ఈ చల్లగాలి.. అబ్బా నిన్నొదిలి పెట్టాలనిలేదు పద్మినీ.. నాతో వచ్చేయకూడదూ మనం ఎటన్నా వెళ్ళి పెళ్ళిచేసుకుందాం."

"అమ్మో.. "

"అమ్మో ఏంటి? నేను నీకు కావాలా వద్దా?"

"కా...వా..లి.."

"మరింకేం పెళ్ళి చేసుకుదాం. ఇప్పుడు మనం పెళ్ళిచేసుకుంటాం అంటే పెద్దవాళ్ళు ఎవరూ ఒప్పుకోరు. కాబట్టి మనమే వెళ్ళిపోదాం."

"ఎక్కడికి?"

"మద్రాసు."

"మద్రాసా? ఎందుకు? "

"ఎందుకేంటి? అక్కడే సినిమా వాళ్ళుండేది. షూటింగ్‌లుండేది, స్టూడియోలుండేదీను. మనం అక్కడికెళ్ళి పెళ్ళి చేసుకుని వేషాలకోసం ప్రయత్నిద్దాం. నీకు వెంటనే హీరోయిన్‌గా ఛాన్స్ వస్తుంది నాకు తెలుసు. ఇంత అందమైన నిన్ను ఎందుకు తీసుకోరు?"

"నిజంగానా.. " వెన్నెల వెలుగులో వింతగా మెరిశాయి ఆమె కళ్ళు.

"నీ మీద ఒట్టు."

ఆమె ఏం మాట్లాడలేదు. అతని స్పర్శలోని వెచ్చదనానికి, మాటల్లోని తీయదనానికి కరిగిపోతూ, అతనిలో కలిసిపోతూ మౌనంగా ఉండిపోయింది.

సరిగా రెండు రోజుల తరువాత ఊరు, ఊరు గుప్పుమంది.

దశరథరామయ్యగారి మూడో అమ్మాయి పద్మిని లేచిపోయింది.

ఇటీవల తరచుగా పక్క ఊరు నుంచి ఇక్కడకి ప్రదర్శనలకోసం వస్తున్న రంగస్థల నటుడు శేషగిరితో కలిసి లేచిపోయింది.

అందరూ కదిలి వచ్చారు ఆ ఇంటికి.

"ఎంత పని జరిగింది రామయ్యా! ఎంత గొప్పవంశం నీది. ఆ పిల్ల అమాయకంగా ఉంటూనే ఎంత పని చేసింది. అయినా సీతమ్మా. ఆడపిల్ల ఎప్పుడు ఎక్కడికి వెడుతోందో, ఏం చేస్తోందో ఎవరితో తిరుగుతోందో ఆ మాత్రం కనిపెట్టలేకపోయావా? అయినా ఇదేమంత పెద్ద ఊరని. ఇంతమంది ఊళ్ళో వాళ్ళు కళ్ళు గప్పి ఆ పిల్ల ఇంతకాలం నుంచీ ఎంత గ్రంధం నడిపింది.! "

"అసలు వాళ్ళిద్దరూ ఏనాడూ ఎవరికంటా పడకుండా ఎలా తప్పించుకున్నారు. రోజూ ఎక్కడ కలుసుకునే వాళ్ళు.?"

వందల ప్రశ్నలకి ఆ భార్యాభర్తల మొహాల్లో కత్తివాటుకి నెత్తురు చుక్కలేనట్టుగా పాలిపోయి ఉన్నాయి.

ఒంచిన తల ఎత్తుకుండా గుండెల్లో పగులుతున్న అగ్నిపర్వతాల తాలూకు సెగలతో గంభీరంగా కూర్చున్నాడు ఆయన.

కళ్ళు రెండు పగిలిన నీటి కుండలై కన్నీరు కారుస్తునే ఉంది సీత.

కూతురు ఈ మధ్య చెప్పిన మాట వినక్కుండా ఏదన్నా అంటే గట్టిగా అరవడం, తండ్రి మాటలు లక్ష్యపెట్టకుండా షోకులు చేసుకోడం అంతా వయసు ప్రభావం అనుకుంది. కూతురు చాపకింద నీరులా ఇంతపని చేస్తుందని, కన్నవాళ్ళను ఇంత దారుణంగా వంచించగలదని ఆవిడ ఏనాడూ ఊహించలేదు. ప్రేమ, పెళ్ళి, ప్రియుడు, ఇలాంటి ఆలోచనలు ఆ పిల్లకి వస్తాయని, ఉంటాయని ఆలోచనే తట్టలేదు. పెద్దపిల్లల్లాగే ఇది కూడా తల్లి, తండ్రులు చెప్పిన మాట విని మంచికుర్రాడికి భార్యగా, మంచి కుటుంబానికి కోడలిగా వెడుతుందని ఆశించింది. ఆశపడింది. పద్దెనిమిదేళ్ళు కూడా రాకుండానే దానికి ప్రేమ కావాల్సి వస్తుందని అనుకోలేను. కనీసం తల్లి, తండ్రులకి చూచాయగానైనా తన ప్రేమ కావాల్సి వస్తుదని అనుకోలేను. కనీసం తల్లి, తండ్రులకి చూచాయిగానైనా తన ప్రేమ సంగతి చెప్పి పెళ్ళికోసం అంగీకారం అడగలేదు. ఎంత రహస్యంగా సాగించింది వ్యవహారం. ఎంత అమాయకంగా నటించింది. ఆవిడకి ఆలోచిస్తున్న కొద్దీ మతిపోతోంది. అవమానంతో అణువణువూ దహించుకుపోతోంది.

"బాధపడకండమ్మా ఎక్కడికి వెడుతుంది? ఏం చేస్తుంది? నాలుగురోజులు పోయాక అదే వస్తుంది. కాళ్ళు విరగ్గొట్టి కూర్చోబెట్టండి ఇంట్లో."

అప్పుడే బైట రిక్షా ఆగడం కూతుళ్ళిద్దరూ దిగి, లోపలికి రావడం జరిగి ఆవిడ గుండె బద్దలైంది.

"అమ్మా! " అంటూ వచ్చిన ఇద్దర్నీ వాటేసుకుని వెక్కి, వెక్కి ఏడవడం ప్రారంభించింది.

తల్లినలా చూడగానే వాళ్ళక్కూడా దుఃఖం ఆగలేదు. వారిజ, నీరజలతోపాటు ప్రవీణ్ కూడా బిక్కమొహంతో ఓ మూల నిలబడి ఉన్నాడు. వాడి కళ్ళనుంచి కూడా కన్నీళ్ళు స్రవిస్తున్నాఇ.

"ఏడవకండమ్మా ఎందుకనవసరంగా బాధపడతారు. దాని ఖర్మ అలా వెళ్ళింది. బంగారంలాంటి పిల్ల ఏం తక్కువైందని దానికి రాజాలాంటివాడు దొరికేవాడు. " ఓదార్చాడు శరభయ్య.

"ఏంటో ఎలాంటి కుటుంబం ఇవాళ ఇంత అవమానం జరిగింది. ఎలా తట్టుకోగలరు? "

ఎవరో సానుభూతి చూపిస్తున్నారు.

అందరూ చూస్తుండగానే దశరథరామయ్య చటుక్కున లేచి పెరట్లోకి వెళ్ళి గబ, గబా బక్కెట్టు చన్నీళ్ళు బకెట్టు నెత్తి మీద గుమ్మరించుకున్నాడు. మొహాన్నుంచి కారుతున్న నీళ్ళు కుడిచేత్తో తుడుచుకుంటూ గట్టిగా అరిచాడు.

"ఈ క్షణం నుంచీ నాకు ఇద్దరే కూతుళ్ళు. ఒకే కొడుకు. ఎవరూ దానికోసం ఏడవద్దు. దానిమాట వినిపించొద్దు. ""

అందరూ మ్రాన్పడిపోయారు.

అక్కడ హఠాత్తుగా నిశ్శబ్దం ఆవరించింది.

వచ్చిన వాళ్ళు ఒక్కొక్కళ్ళే మెల్లగా జారుకోసాగారు.

తల్లికూతుళ్ళు బిక్కచచ్చి కూర్చున్నచోటే ప్రతిమల్లా ఉండిపోయారు.

"లేచి వంట ప్రయత్నాలు చేయి. అందరూ ఆకళ్ళతో ఉన్నారు" దశరథరామయ్య కంఠం ఖంగుమంది.

సీత కళ్ళునుంచి ఏకధారగా అశ్రువులు స్రవిస్తున్నాయి. గుండె ఎగిసిపడుతోంది దుఃఖంతో. చెంగు నోటికి అడ్డం పెట్టుకుంది.

పెద్ద కూతురు వారిజ లేచి నెమ్మదిగా తండ్రిని సమీపించింది.

"నాన్నా... " మెల్లిగా పిలిచింది.

ఆయన తీవ్రంగా చూశాడు.

"పోలీస్‌లకి ఫిర్యాదు చేద్దాం నాన్నా. చెల్లాయిని వెతికిద్దాం."

ఆయన అదోలా నవ్వాడు. "తప్పిపోతే వెతికిస్తాం. కావాలని పారిపోతే ఎక్కడ వెతకగలం చెప్పమ్మా."

"అదికాదు నాన్నా అతను చెల్లాయిని భ్రమపెట్టి ఉంటాడు."

"భ్రమల్లో బతకమని నేను నేర్పలేదు తల్లీ! నువ్వు బతికావా? "

"అదికాదు నాన్నా!"

ఆయన చేయి ఎత్తి మాట్లాడొద్దన్నట్టుగా సైగ చేశాడు. "ఈ విషయం ఇంతటితో ముగించండమ్మా. నాకు తెలుసు దాని షోకులు, నా మాటలను అది నిర్లక్ష్యం చేసిన తీరు నేను అనుకుంటూనే ఉన్నాను. కానీ, ఇంత త్వరగా అది నాకళ్ళు కప్పగలదని నేను అనుకోలేదు. సరే జరిగిందేదో జరిగింది మర్చిపొండి. అందరూ దాన్ని మర్చిపొండి."

ఆయన మరో మాటకి అవకాశం ఇవ్వకుండా లోపలికి వెళ్ళిపోయాడు.

అందరూ శిలాప్రతిమల్లా నిలబడిపోయారు.

**పద్మిని మోకాళ్ళలో తలదాచుకుని** వెక్కి, వెక్కి ఏడవసాగింది.

వసంతకి కూడా దుఃఖం ఆగలేదు. "ఏడవకక్కా, ఏడవకు ప్లీజ్" అంటూనే తానూ వెక్కి, వెక్కి ఏడవసాగింది.

పద్మిని ముందు తేరుకుని వసంత భుజం మీద చేయేసి "బాధపడకు వసంతా! నువ్వెందుకు బాధపడుతున్నావు? బాధపడకు ఇదంతా నా స్వయంకృతాపరాధం" అంది.

"అక్కా నువ్వు చాలా తప్పు చేసావు" బొంగురుపోయిన స్వరంతో అంది వసంత.

"అవును తప్పు చేసాను. దిద్దుకోలేని తప్పుచేశాను. ఒక దుర్మార్గుడు, నయవంచకుడు అయినవాడిని నమ్మాను. నా సర్వస్వం అర్పించాను. వాడు నన్ను తన స్వంత ఆస్తిలా వాడుకున్నాడు. నాకంటూ ఒక జీవితం లేకుండా చేశాడు. నా ఆలోచనలు, నా ఆశలు, నా

కోరికలు అన్నీ తానుగానే నన్నొక పనిముట్టుగా వాడుకున్నాడు. నన్నొక డబ్బులు ప్రింట్ చేసే మెషిన్‌లా వాడుకున్నాడు. చాలా రకాలుగా నన్ను వాడుకుని, వేధించి, పీడించి, హింసించి వదిలాడు. కాదు నేనే వాడిని వదిలేసాను."

"మీ ఇద్దరూ ఇంట్లోంచి వెళ్ళిపోయి ఎక్కడికి వెళ్ళారక్కా, ఎలా బతికారు?" జాలిగా అడిగింది వసంత.

పద్మిని నిట్టూర్చింది. కళ్ళు తుడుచుకుని చెప్పసాగింది.

"మేమిద్దరం కలిసి నేరుగా చెన్నై పారిపోయాం. అక్కడ చిన్న గది అద్దెకు తీసుకుని గుడిలో దండలు మార్చుకుని సంసార జీవితం ప్రారంభించాం. కొత్త మోజు.. నన్ను క్షణం వదిలేవాడు కాదు. పగలూ, రాత్రికీ తేడా తెలిసేదికాదు అనుక్షణం నేను అతని ఒడిలోనే. అలా కొంతకాలం గడిచింది. శేషగిరి జేబులో డబ్బులు, నావంటి మీద ఉన్న వంటిపేట గొలుసు కరిగిపోయాయి.

ఇంట్లో సరుకులు నిండుకున్నాక, ఆకలి కేకలు వేయడం ప్రారంభించాక శేషగిరికి తిరిగి తన వేషాలు, తన జీవితం గుర్తొచ్చింది. ఆ ఊళ్ళోనే డ్రామా కంపెనీలేమన్నా ఉన్నాయేమో వాకబు చేశాడు. అప్పుడే రంగస్థల కల క్షీణించడం మొదలైంది. అందులోనూ చెన్నైలో ఆ అవకాశమే కనిపించలేదు. అందులోనూ తనకు తెలిసిన కొన్ని ఊళ్ళల్లో తప్ప శేషగిరి నటుడుగా పెద్దగా పేరున్నవాడు కాదు. అతనిని ఎవరూ గుర్తించలేదు. అతని పర్సనాలిటీ, అతని ఉంగరాల జుట్టు నాకంటికి మన్మధుడిలా కనిపించినా అటు రంగస్థల సంస్థలకు కానీ, ఇటు సినిమా ఇండస్ట్రీకి కానీ, కనిపించలేదు.

అతని ప్రేమ మైకంలో నాకు ఆకలి దప్పులు లేకపోయినా, ఆ మైకం వదిలాక ఆకలీ తెలిసింది, దాహమూ తెలిసింది. రెండేసి రోజులు బ్రెడ్‌ముక్కలు తిని బతికాం. హాయిగా ఇంట్లో అమ్మ చేసి పెట్టిన కమ్మటి వంటలు తిని, కడుపులో చల్లకదలకుండా పడుకున్న నాకు అప్పుడే మా జీవితంలోని లోటు నెమ్మదిగా అర్ధం అవసాగింది.

"ఎలా బతుకుదాం శేషగిరీ" అడిగాను ఓ రోజు బేలగా.

అతనేం మాట్లాడలేదు. దాదాపు గంట ఆలోచించాక అన్నాడు. "నీకు సినిమాల్లో వేషాలేయడం ఇష్టమేగా."

"ఇష్టమే" అతను నన్ను పెద్ద హీరోయిన్‌ని చేస్తానని ఆశ పెట్టాకే కదా నేనతని ప్రలోభంలో పడ్డాను ఇష్టం లేదని ఎలా చెప్పగలను. సినిమాలు అనగానే నా కళ్ళముందు మిరుమిట్లు గొలిపే కాంతిపుంజాలు, అద్దాల మేడలూ, నా ఒంటినిండా నగలు కదిలాయి. బోలెడంత డబ్బు కూడా కదిలింది. నేను బాగా డబ్బు సంపాదిస్తే అమ్మా, నాన్న నన్ను మళ్ళీ తప్పకుండా ఆదరిస్తారనే ఆశ కూడా కలిగింది. ఆనందంగా తలుపాను.

అంతే –

ఆ క్షణం నుంచే నన్ను సినిమాల్లో ప్రవేశింపచేయడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. ఎలా పట్టాడో, ఏం చేశాడో నాకు తెలియదు కానీ, కొందరు సినిమా వాళ్ళతో పరిచయాలు చేసుకుని స్నేహం పెంచుకున్నాడు. చిన్న, చిన్న పనులు చేస్తూ పదీ, పాతికా సంపాదిస్తూ అక్కడ తనకో స్థానం సంపాదించుకున్నాడు.

మరి కొంతకాలం గడిచాక నన్ను తీసుకుని బయలుదేరి స్టూడియోల చుట్టూ తిరుగుతూ నాకు వేషాలకోసం ప్రయత్నించసాగాడు.

దాదాపు ఎనిమిదినెలల తరువాత అనుకుంటా నాకు ఒక సినిమాలో చిన్న పాత్ర దొరికింది. హీరోయిన్ ఇంట్లో పనిమనిషి పాత్ర. నేను చేయనన్నాను. "అందరికీ ప్రారంభంలో ఇలంటి పాత్రలే వస్తాయి. తరవాతే పెద్ద హీరోయిన్‌లు అయి సినీ సామ్రాజ్యాన్ని ఏలేశారు" అంటూ కొందరి పేర్లు చెప్పి నన్ను ఒప్పించాడు.

మొదటిరోజు షూటింగ్‌కి తీసుకుని వెళ్ళాడు. గళ్ళ గళ్ళ ముతకచీర, పాత జాకెట్టు, బిగించి వేసిన జడ, జడలో ముద్దబంతిపూవు, చేతులనిండా గాజులు, కాళ్ళకు వెండి కడియాలు. చాలా చిత్రమైన అలంకారం. నాకు అసలు ఆ మేకప్ నచ్చలేదు. ఆ మేకప్‌లో నన్ను నేను చూసుకోడానికి కూడా రోత కలిగింది. అయినా భరించాను. తప్పదు. అతను చాలా ప్రేమగా నచ్చచెప్పాడు. వెళ్ళాను. ఉదయం ఏడింటికి లొకేషన్‌కి వెళ్ళాం. అక్కడ నిర్మాతని, డైరెక్టర్‌ని పరిచయం చేశాడు శేషగిరి. నేనెప్పుడూ వాళ్ళపేర్లు విన్న గుర్తురాలేదు నాకు. కొత్త నిర్మాత, కొత్త డైరెక్టర్. ఆ సినిమాలో హీరో అంతగా పేరులేని హీరో, హీరోయిన్ కూడా కొత్త హీరోయిన్. నెమ్మదిగా శేషగిరి చెవిలో అన్నాను

"వీళ్ళేం సినిమా తీశారో అర్థం కావడంలేదు. "

"నోరుమూసుకో.." నెమ్మదిగా కసిరాడు.

నన్ను ఎగాదిగా, ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూశారు వాళ్ళు. ఆ చూపులు నాకు అసహ్యాన్నీ, రోతనీ కలిగించాయి.

"మా సినిమాలు చూశావా ఏమన్నా?" అడిగాడు నిర్మాత.

నేను చూడలేదన్నట్టుగా తలూపబోతుండగా తనే చెప్పాడు శేషగిరి. "చాలా చూశాం సార్. ఇద్దరం కలిసే చూసేవాళ్ళం."

నేను అవాక్కయ్యాను. చాలా చూశాం అంటున్నాడు ఏ ఒక్క సినిమా పేరడిగినా నాకు తెలియదు. దడగా అనిపించింది. అదృష్టవశాత్తూ వాళ్ళు ఆ ప్రశ్నలు వేయలేదు. బహుశా వాళ్ళకి తెలుసుకదా వాళ్ళు ఇండస్ట్రీకి కొత్త అని అందుకే ముందుకు పొడిగించకుండా "డైలాగులు చెప్పగలవా? అని అడిగారు.

చెప్తానన్నాను.

"ఏదీ ఈ డైలాగ్ చెప్పు." అంటూ నాకో కాగితం ఇచ్చారు.

"బాగా చెప్పు" నా పక్కనే నిలబడ్డ శేషగిరి రహస్యంగా అన్నాడు.

సరే అన్నట్టు తలాడించి కాగితం తీసుకుని చదివాను.

స్క్రీన్‌ప్లే మొత్తం నాలుగు కాగితాలున్నాయి. రెండు సీన్‌లున్నాయి. మొదటి సీన్ అని ఉన్న కాగితం వైపు దృష్టి పెట్టాను.

అందులో హీరోయిన్, నేను ఉన్న సీనుంది. సమయం ఉదయం పదిన్నర హీరోయిన్ మెత్తటి పాన్పుమీద, నైలాన్ దోమ తెర మధ్యలో ఆదమరచి నిద్రపోతుంటే నేను ఆవిడని సుకుమారంగా నిద్రలేపాలి.

"అమ్మా మాలినీదేవి.. బారెడు పొద్దెక్కింది ఇంక నిద్రలేవండమ్మా" అనాలి.

అందులో చెప్పలేకపోడానికి ఏం ఉంది నాకేం అర్థంకాలేదు. చెప్పాను.

"బానే చెప్పావే అయితే ఈ పాత్రనీకే ఇస్తాను" అంటూ, శేషగిరితో అన్నాడు. "ఏ పాత్ర, ఏంటి అని చూడకుండా వచ్చిన ప్రతిపాత్రా వేస్తుంటే త్వరలోనే పెద్ద హీరోయిన్ అయ్యే అవకాశం ఉంది."

శేషగిరి కళ్ళు తళుక్కున మెరిశాయి.

"తప్పకుండా సార్. వేస్తుంది. తనకి చాలా ఇంటరెస్ట్ సినిమాల్లో వేషాలేయడం అంటే చాలా, చాలా ఇష్టం మేము చైన్నై వచ్చిందే వేషాలకోసం" రెండు చేతులూ కట్టుకుని వినయంగా అంటోన్న శేషగిరివైపు ఆశ్చర్యంగా చూశాను. ఇంత వినయంగా ఉంటాడా శేషగిరి అనుకున్నాను. నాకు నన్ను ప్రేమించిన శేషగిరే తెలుసు. నన్ను శృంగార సామ్రాజ్యంలో ఓలలాడించే శేషగిరే తెలుసు. బుజ్జగించి, బతిమాలి అమ్మా, నాన్నకోసం బెంగపెట్టుకుని ఏడుస్తుంటే లాలించి అన్నం తినిపించే శేషగిరే తెలుసు. ఇలా చేతులు కట్టుకుని ఎవరికో సలాము చేసే శేషగిరి తెలియదు. వేదిక మీద దుర్యోధనుడుగానో, మైరావణుడిగానో గొంతెత్తి మధుర గంభీర స్వరంతో పద్యాలు పాడే శేషగిరి

తెలుసు. ఇలా ఇంత నెమ్మదిగా, అణకువుగా మాట్లాడే శేషగిరి అసలు తెలియదు. అందుకే ఆ సమయంలో, ఆ కొత్త వ్యక్తులతో అతను ప్రవర్తిచే విధానం నన్ను విస్మయపరిచింది.

ఇంటికి వస్తూనే అడిగాను. "వాళ్ళతో అంత అణకువుగా ఉన్నావు వాళ్ళంటే నీకు భయమా?"

గట్టిగా నవ్వాడు శేషగిరి. "అలా ఉండకపోతే మనకి వేషాలు వస్తాయా? ఒక్కసారి ఫీల్డ్‌లోకి అడుగుపెట్టాక చూడు నా తడాఖా"

అతని మాటలు ఆ క్షణంలో నవ్వొచ్చింది కానీ, తరువాత రోజులు గడుస్తుంటే, సినిమాల్లో నా స్థితి పనిమనిషిగానే కొంతకాలం కొనసాగుతుంటే తెలిసింది అతని విశ్వరూపం.

అప్పటికి దాదాపు నాలుగైదు సినిమాల్లో వేషాలేసాను. అన్నీ పనిమనిషి వేషాలే. ఒక్కసారి ఒక పాత్రలో కనిపిస్తే ప్రతి సినిమాలో అదే పాత్రకి పిలుస్తారని తరువాత తెలిసింది. ఫలనా పనిమనిషి పాత్ర ఉంది ఎవరికిద్దాం అని ఆలోచించే వాళ్ళకి ఫలానా పద్మిని అనే ఆర్టిస్టు ఉంది ఆమె ఇలాంటి పాత్రలకు బాగా సూట్ అవుతుంది అని సలహాలిస్తారుట. అలాగే ఒక సినిమాలో వదిన పాత్ర వేసిన ఆర్టిస్టు వదిన పాత్రలకే పరిమితం అయిపోతుంది. అలాగే చెల్లెలు, అలా నాది కూడా పనిమనిషి పాత్రలకు పెట్టిన పేరుగా అయింది. మొట్టమొదట ఆ పాత్రకు ఎందుకు ఒప్పుకున్నానో అని బాధపడ్డాను.

అదేమాట శేషగిరితో అన్నాను.

"సినిమాలో వేషాలంటూ ఇలాంటి పాత్రలకే పరిమితం చేశావేంటి శేషగిరీ" అని.

"నీ మొహానికి అంతకన్నా మంచిపాత్రలు ఎలా వస్తాయి?" వెటకారంగా అన్నాడు.

నాకు మతిపోయింది. "అదేంటి నాకేం తక్కువైంది హీరోయిన్స్ కన్నా నేనే అందంగా ఉన్నానని చాలామంది అన్నారు" అన్నాను అవమానంతో జేవురించిన మొహంతో.

"ఎందుకు అందం? పనికిరాని అందం ఎంత ఉంటే ఏం?" విసుగ్గా అన్నాడు.

అతని దగ్గరగా నడిచి అతని భుజాలు పట్టుకుని కుదుపుతూ అడిగాను "పనికిరాని అందం అంటే"?

సూటిగా నా మొహంలోకి చూస్తూ "పోయిన నెల్లో షూటింగ్ జరిగిన జానపద సినిమాలో పరిచారికగా నీకు పల్చటి ఓణీవేస్తే ఒద్దని గొడవచేశావా? లేదా?" అడిగాడు.

నిర్ఘాంతపోయాను. ఆ రోజు గుర్తొచ్చింది. అవును ఆ రోజు నడుం వరకూ పరికిణీ, పొట్టపైకి బిగుతుగా ఉండే జాకెట్టు, దానిపైన కనిపించీ, కనిపించకుండా పల్చని వల్లెవాటు వేశారు. నాకు అలా వేసుకోడం చాలా సిగ్గనిపించి నాకా డ్రస్ వద్దన్నాను. పూర్తిగా కప్పేసేలా ఓణీ కావాలని కొంచెం గట్టిగానే చెప్పాను. అది తప్పా? తన భార్య అందాలు పరాయివాళ్ళు చూడకూడదన్న నియమం ఉండాల్సినవాడు, తన భార్య గౌరవాన్ని కాపాడాల్సినవాడు అలా మాట్లాడుతుంటే నోటినుంచి నాకు మాటరాలేదు. అతనికేసి అలాగే చూడసాగాను.

మళ్ళీ అన్నాడు "సినిమాల్లో నటించేటప్పుడు నీతులు, గీతులు పనికిరావు. పతివ్రతలాగా మేకప్‌మాన్ ముట్టుకున్నాడు, డైరెక్టర్ ముట్టుకున్నాడు అంటూ మడికట్టుకుంటే నీకు జీవితాంతం ఇవే వేషాలుంటాయి అదీ ఒద్దంటే ఇంటికి వెళ్ళమంటారు."

"అంటే నా ఒంపుసొంపులు బహిర్గతం చేస్తే నాకు హీరోయిన్ వస్తుందా?" అడిగాను.

"అవును వస్తుంది. నిన్ను పరిచయం చేయడం వరకే నా బాధ్యత ఆ తరువాత నీ తెలివితేటలతో అల్లుకుపోయి ఎదగాలి. లక్షలు సంపాదిస్తావనుకున్నాను. ఐదువేలు, రెండువేలు, మూడువేలు తప్ప రూపాయిలేదు. అదిగో అదే మొహం బ్లాంక్‌గా మొహంలో ఒక్క

ఎక్స్‌ప్రెషన్ పలకదు. బిగపట్టుకుని నవ్వుతావు. ఎవరో మెడమీద కొట్టినట్టు అలా మెడ ఎక్కుపెట్టి నిలబడతావు. నీకసలు నటనంటేనే తెలియదు. అయినా నాది తప్పులే ఇంట్లో కూర్చుని వంటలు చేసుకునేదాన్ని సినిమాల్లోకి తీసుకురావడం నాది తప్పు.''

మ్రాన్పడిపోయాను. శేషగిరి ఎంతమాట అన్నాడు. నాకు ఏడుపొచ్చింది. ''నేను మంచి కుటుంబం నుంచి వచ్చాను శేషగిరీ! అలాంటి వేషాలు నాకిష్టంలేదు. నేను సినిమాల్లో నటించను నాకేదన్నా ఉద్యోగం చూపించు చేస్తాను'' అన్నాను.

''నీకెవరిస్తారు ఉద్యోగం నువ్వేమన్నా డిగ్రీ చదివావా? పదో తరగతి తప్పిన నీకు ఉద్యోగం కూడానా''

''అయితే నన్నేం చేయమంటావు?''

''అది నాతోలేచి వచ్చేముందు ఆలోచించుకోవాల్సింది.''

''నీదికాదు తప్పు. అవును నాదే తప్పు. నిన్ను హీరోయిన్‌ని చేసి లక్షలు సంపాదించాలనుకున్నాను. ఒక్క పాత్రకి ఐదువేలు తప్ప పైసా కూడా పెరగడంలేదు. ఇలా అయితే నా బతుకువెళ్ళినట్టే అనవసరంగా నా కంపెనీ వదులుకుని నీమీద ఆశతో వచ్చి ఇక్కడ చేరాను. నావల్లకాదింక వేరే మార్గం ఆలోచించాలి.'' అంటూ అక్కడి నుంచి వెళ్ళిపోతున్న శేషగిరివైపు వెర్రిదానిలా చూస్తూ ఉండిపోయాను.

అతని మాటల అర్ధం వారం తరువాత తెలిసింది.

ఎవరో ఒకమ్మాయి సినిమాల్లో చేరటానికి ఇంట్లో చెప్పకుండా పారిపోయి వస్తే ఆ పిల్లను స్టేషన్‌లో పట్టుకుని ఏదో హోటల్లో పెట్టి వారం రోజుల్లో సెకండ్ హీరోయిన్‌గా ఛాన్స్ ఇప్పించాడు. ఆ విషయం నాకు ఒక షూటింగ్‌లో తెలిసింది.

ఆరోజు మరో సినిమాలో మరో పనిమనిషిగా మేకప్ వేస్తున్న రాజేష్ మేకప్ వేస్తున్న నెపంతో నా గుండెలమీద చేయివేశాడు. నేను వెంటనే వెనక్కి జరిగాను.

''అదేంటి? మెడకి పౌడర్ రాయకపోతే మొహం మాత్రం, తెల్లగా, మెడ నల్లగా కనిపిస్తుంది అలా వెనక్కి వెళితే నేను మేకప్ ఎలా చేయను?'' అన్నాడు.

''మెడ ఇది'' అంటూ నా మెడ చూపించి ''కొంచెం ఆడవాళ్ళతో ప్రవర్తించే విధానం తెలుసుకో'' అన్నాను.

అతను వెటకారంగా నవ్వి అన్నాడు. ''నువ్విలా పతివ్రతలా ముడుచుకుపోతూ, బిగదీసుకుపోతూ నటిస్తుండబట్టే ఇలా పనిమనిషి పాత్రలకు మిగిలిపోయావు. మీ ఆయన కొత్తపిట్టను పట్టాడు. ఆమెని సెకండ్ హీరోయిన్‌ని చేశాడు అప్పుడే''

నాకు అతని మాటలు కాస్సేపు అర్ధం కాలేదు.

వారం రోజులుగా శేషగిరి ఇంటికి రావడంలేదు. ఊరెళుతున్నానని చెప్పి వెళ్ళాడు. ఆ రోజు ఉదయమే వచ్చి స్టూడియోకి వెళ్ళు కొత్త సినిమా షూటింగ్ ఉంది అన్నాడు నాతో.

''ఏ సినిమా? ఏ పాత్ర'' అన్నాను.

''ఇంకేపాత్ర. పనిమనిషే '' హేళనగా అంటూ వెళ్ళిపోతుంటే అడిగాను ''నువ్వెక్కడికి వెళుతున్నావు? నాకు వేరే పనుంది నీకు వెహికల్ వస్తుంది'' అందులో వెళ్ళు అంటూ తను వెళ్ళిపోయాడు.

శేషగిరిలో మార్పు వచ్చింది అది నాకు తెలుస్తోంది కానీ, ఆ మార్పుకి కారణం ఏంటో మాత్రం నాకు తెలియలేదు. నిట్టూర్చాను.

ఇంతలో ఒక అంబాసిడర్ కారులో నాలాంటి మరో నలుగురు జూనియర్ ఆర్టిస్టులను తీసుకుని వచ్చారు ప్రొడక్షన్ అసిస్టెంటు రాఘవ. వాళ్ళతో పాటు నేను కూడా ఇరుక్కుని కూర్చుని స్టూడియోకి వచ్చాను.

ఆ సాయంత్రం మామూలుగానే అడిగాను "ఎవరినో అమ్మాయిని హీరోయిన్‌గా పరిచయం చేశావటగా?"

"అయితే?" కసిరినట్టు అడిగాడు.

గుండెల్లో సుళ్ళు తిరుగుతున్న బాధ అణచుకుంటూ అన్నాను. "ఏమీలేదు. ఊరికే అడిగాను. ఆమె నా కన్నా అందంగా ఉంటుందా?"

"ఉండదు. నీకన్నా అందమైంది కాదు కానీ చురుకైనది. ఎవరూ ఏమీ చెప్పకుండానే అన్నీ తెలుసుకుని వాళ్ళకి అనుకూలంగా ఎలా ప్రవర్తించాలో తెలిసిన పిల్ల. అందుకే నేరుగా సెకండ్ హీరోయిన్‌గా సెలక్ట్ అయింది."

అనుకూలంగా అంటే! నాకర్థం కాలేదు. వాళ్ళకి ప్రతికూలంగా నేనేం చేశాను? నేను ఎవరితో నోరు విప్పి మాట్లాడనుకూడా మాట్లాడను. షాట్‌కి రమ్మనగానే వెళ్తాను. నా పాత్ర అయిపోగానే సైలెంట్ గా కూర్చుంటాను. అలాంటిది నన్ను ఎందుకిలా అంటున్నాడో అర్థం కాలేదు. అదే అన్నాను. "నేనేం చేశానని వెటకారంగా మాట్లాడుతున్నావు."

"ఏం చేయలేదు అందుకే చిరాకేస్తోంది" అన్నాడు.

అంతేకాదు మరోమాట మాట్లాడే అవకాశం ఇవ్వకుండా వెంటనే లేచి "నేను బైటకి వెళ్తున్నాను రాత్రికి రాను తలుపేసుకుని పడుకోహ్ అంటూ వెళ్ళిపోయాడు.

నేను నిశ్చేష్టురాలినైనాను. వారం రోజుల తరువాత ఇంటికి వచ్చాడు. మళ్ళీ ఒక రాత్రి కూడా ఉండకుండా బైటకి వెళ్ళిపోయాడు. నేనంటే అంతగా ఎందుకు విరక్తి కలిగిందో, నేను చేసిన తప్పేంటో అర్థంకాక ఏడుస్తూ పడుకున్నాను.

ఆ వెళ్ళిన వెళ్ళడం పదిరోజులకి వచ్చాడు ఇంటికి. అప్పటికి ఇంట్లో బియ్యం నిండుకున్నాయి. పప్పులు నిండుకున్నాయి. నా చేతిలో చిల్లిగవ్వలేదు. నాకు ఇవ్వాల్సిన పారితోషికం అందరూ శేషగిరికే ఇస్తారు. తనే ఇంట్లోకి ఏం కావాలో చూసి తెస్తాడు. తనే డబ్బు లెక్కలన్నీ చూసుకుంటాడు. నేనా విషయంలో ఎప్పుడు కలగచేసుకోలేదు. అంతా నువ్వే తీసుకుంటావేంటి అని అనలేదు. ఆ రోజు వస్తూనే ధుమ, ధుమలాడుతూ వచ్చాడు.

"నీకసలు బుద్ధుందా? ఎన్నిసార్లు చెప్పినా బుర్రకెక్కదా? నీకసలు బుర్ర ఉండాల్సిన స్థానంలో ఉందా? మోకాల్లోకి జారిందా?"

అతనలా బాకుల్లా మాటలతో గుచ్చుతుంటే కళ్ళప్పగించి చూస్తు ఉండిపోయాను.

"ఓ పక్క చెబుతూనే ఉన్నానా? ఎదగాలంటే ఏం చేయాలో.. మేకప్ మాన్ మెడకి పౌడర్ రాస్తుంటే అతన్నేమన్నావు?"

"నేనేం అనలేదు. అతను పౌడర్ రాసే వంకతో పిచ్చి వేషాలేసాడు" పిచ్చికోపంతో అరిచాను.

"నోర్ముయ్. బోడి నీతులు వల్లించకు. ముక్కూ, మొహం తెలియని నాతో ప్రేమాయణం నడిపించినప్పుడు, నాతో లేచిపోయి వచ్చినప్పుడే నీ నాటకాలు అర్థమైనాయి. ఇప్పుడు నీతులు వల్లిస్తుంటే నమ్మేవాళ్ళు ఎవరూ లేరు. ఆఖరిసారిగా చెబుతున్నాను విను. ఇంకోసారి ఎవరు ఎక్కడ చేయేసినా నోరెత్తావంటే నీ బతుకు నీది, నా బతుకు నాది. ఎవరు ఏం చేసినా మాట్లాడద్దు."

ఆ మాటతో నాకు పిచ్చెక్కినట్టు అయింది. "నా వంటిమీద ఎవరు చెయ్యివేసినా చెప్పుతో కొడతాను" అంటూ అరిచాను.

"ఏది కొట్టు. కొట్టవే. అంటూ నా చేయి విరిచిపట్టుకుని క్రూరంగా చూస్తూ అన్నాడు. నిన్ను పెళ్ళి చేసుకుని కాపురం పెట్టి, పిల్లల్ని కని జీవితాంతం నిన్ను ఊరికే పోషించడానికి తీసుకురాలేదు నిన్ను. నీ వయసుతో, నీ అందంతో డబ్బు సంపాదించాలని వచ్చాను. అది లేనప్పుడు నీకిక్కడ స్థానం లేదు. ఎక్కడికి వెళ్తావో వెళ్ళు. ఈ ఒక్క రాత్రి టైం ఇస్తున్నాను. మనసు మార్చుకుని మారావో నా దగ్గర నీకు స్థానం ఉంది లేదంటే నీ దారి నీది."

అంటూ వెళ్ళిపోయాడు. "

పద్మిని బిగ్గరగా ఏడవసాగింది. "అక్కా, అక్కా" వసంత ఆమెని పట్టుకుని ఏడవసాగింది.

"అంతే నాకక్కడ క్షణం కూడా ఉండబుద్ది కాలేదు. అతను పెట్లో దాచుకున్న నాలుగువేలు తీసుకుని, నా బట్టలు మూటకట్టుకుని అప్పటికప్పుడు బయలుదేరి రైల్వే స్టేషన్‌కి వెళ్ళాను.

నా మనసులో అమ్మా, నాన్న, అక్కలు, తమ్ముడు అందరూ మెదిలారు. నేను కోల్పోయిన భద్రతకల, గౌరవనీయమైన, ప్రేమమయమైన జీవితం మెదిలింది. నా అణువణువూ అక్కడికి తిరిగి వెళ్ళిపోడానికి తహ తహలాడింది. కనిపించిన రైలు ఎక్కాను. నా అదృష్టం బాగుండి ఆ రైలు తిరుపతి వెళ్ళే రైలు. ఫర్వాలేదు ఆంధ్రదేశానికి వెళ్ళగలను. అక్కడి నుంచి నా ఊరు వెళ్ళడం నాకు సులభం. అక్కడ ఎవరికి ఏ కష్టం చెప్పుకోవాలన్నా నాకు వాళ్ళ భాష రాదు. శేషగిరి తప్ప నా అనేవాళ్ళు నాకెవరూ లేరు. కానీ, ఆ క్షణం నుంచీ అతనూ నావాడు కాదు.

ఏడుస్తూనే తిరుపతి చేరాను.

రైల్వే స్టేషన్‌లో కూర్చుని ఏడుస్తున్నాను. ఎంతో ఆరాట పడ్డానేకానీ, నేను తిరిగి వెళితే నా ఊళ్ళో నాకు జరిగే పరాభవం, లభించే స్వాగతం నెమ్మదిగా అర్థమవుతుంటే దిక్కులేనిదాన్నయానని కుమిలి, కుమిలి ఏడుస్తుంటే అప్పుడే ఒక పదిమంది ఉన్న బృందం నేను కూర్చున్న చోటుకి వచ్చారు. వాళ్ళంతా తిరుపతిలో ఏదో పద్యనాటకం వేసి రాజమండ్రి వెళ్తున్నారు. ఏడుస్తున్న నన్ను చూసి వాళ్ళల్లో లేడీ ఆర్టిస్టులు నన్ను ఓదార్చి విషయం తెలుసుకున్నారు.

ఏదీ దాచకుండా చెప్పేసాను.

ఈ కథలు ఇలాగే ముగుస్తాయమ్మా అంది ఒకావిడ నిట్టూరుస్తూ.

తరవాత వాళ్ళ సంస్థ అధ్యక్షుడితో మాట్లాడి నన్ను వాళ్ళ బృందంలో చేర్చుకున్నారు. అలా వాళ్ళతోపాటు రాజమండ్రి వెళ్ళాను. "

పద్మిని మళ్ళీ బావురుమంది. వసంత వెక్కుతూనే ఉంది.

అప్పుడే అక్కడికి వచ్చిన యవనిక ఏడుస్తున్న వాళ్ళిద్దరినీ చూసి తెల్లబోయింది.

యవనికను చూడగానే పద్మిని తెప్పరిల్లి కూర్చున్న చోటునుంచి లేచింది.

"ఏమైందమ్మా? " దగ్గరగా వస్తున్న తల్లిని అడిగింది యవనిక.

"ఏం లేదు తల్లి. ఏంలేదు" చీర చెంగుతో కళ్ళు తుడుచుకుంది.

వసంత కూడా లేచి లోపలికి వెడుతూ అంది. "ఏం లేదులే యవనీ ఏదో గుర్తొచ్చింది మాకు. బాధనిపించింది అంతే. దా, దా అన్నాలు తిందాం. ఆకలిగా ఉంది. "

అయోమయంగా చూస్తున్న యవనిక భుజం మీద చెయ్యేసి లోపలికి నడిపిస్తూ అంది పద్మిని "పద యవనీ. బాగా పొద్దుపోయింది భోంచేద్దాం."

"నువ్వెప్పుడూ ఇంతగా ఏడవడం నేను చూడలేదమ్మా. ఎందుకు ఏడ్చావు? మన దగ్గర డబ్బులు లేవనేగా నువ్వేం బాధపడకమ్మా. నేనున్నాగా. నేను సంపాదిస్తాను. నేను మేకప్‌లో చాలా అందంగా ఉన్నానని అన్నారంతా. సినిమాల్లో చేరితే భవిష్యత్తు బాగుంటుంది అన్నారు. ఎవరో హిందీ సినిమా హీరోయిన్‌టకదా జయబాధురి. ఆమెలాగా ఉన్నానుట. ఆమె పెద్ద హీరోయిన్‌ట కదా. నేనూ అలా అవుతాను. హైదరాబాద్ వెళ్ళి సినిమాల్లో చేరతాను."

ముందుకు పడుతున్న అడుగులు ఆగిపోయి నిశ్చేష్టురాలై కూతురు మొహంలోకి చూసిన పద్మిని మొహం కత్తివాటుకి నెత్తురు చుక్కలేనట్టు పాలిపోడం గమనించిన వసంత చేతిలో ఉన్న అన్నం గిన్నె గట్టుమీద పెట్టి పరిగెత్తుకుంటూ వచ్చి పడిపోతున్న పద్మినిని పట్టుకుంది.

**చక్రవర్తి సిగిరెట్ వెలిగించాడు.** అప్పటికి అది పదిహేనో సిగిరెట్. సుమారు రెండు గంటలసేపట్నించీ అతనలా ఆ కమ్యూనిటీ హాల్లో రిహార్సల్స్ చేయించే ఖాళీస్థలంలో చేతులు విరిగిన కుర్చీమీద కూర్చుని సిగిరెట్ మీద సిగిరెట్ కాలుస్తూ ఆలోచిస్తున్నాడు.

అతనికి పద్మిని తననలా నిర్లక్ష్యం చేసి స్వయంగా అవకాశాల కోసం ప్రయత్నించడం, అవకాశాలు దక్కించుకోవడం కోసం శ్రమించడం, అందుకు శివరామ్, వసంత ఇతర కళాకారులు సహకరించడం సహించరానిదిగా ఉంది. ఆమెకి వేరే గతిలేదని ఎప్పటికైనా తన కాళ్ళ దగ్గరకు వస్తుందని ఆశించాడు. ఆ ఆశాభంగం అతనికి ఒక వేదనగా మారింది.

పద్మిని.. పద్మిని అంటే అతనికి మోజు. వ్యామోహం.. ఆమె మీద కలిగిన కోరిక తీరలేదు. అతని మాటల గారడీలో పడి ఎందరో అమ్మాయిలు మోసపోయారు. అతనికి దాసోహం అయి, చిన్నచిన్న పాత్రలకి పరిమితం అయి అందులో వాళ్ళకెలాంటి లాభం లేకపోవడంతో అతని సమాజం నుంచి వెళ్ళిపోయారు. కానీ, పద్మినికి తను ప్రారంభంలోనే కథానాయిక వేషాలిచ్చి ఎంతో ప్రోత్సహించినా ఆమె దక్కలేదు.

అతనికి తెలుసు తను అందగాడు కాదని. కానీ, తన దగ్గర తాయిలం ఉంది అదే తనదంటూ ఒక నాటక సమాజం. తానొక రచయిత. అదొక ఆకర్షణ. ఆ ఊళ్ళోనే కాక, మరికొన్ని ఊళ్ళలో కూడా అతనికి కొంత పరపతి ఉంది. ఒక నాటకం ఆడించాలంటే కావలసిన ఆర్థిక బలం అతని దగ్గర ఉంది. ఇవన్నీ అతనివైపు అమ్మాయిలు ఆకర్షింపబడడానికి దోహదం చేస్తున్నాయన్న అంతులేని విశ్వాసం మాత్రం ఉంది.

అయితే ఆ విశ్వాసం మీద చెప్పుతో కొట్టినట్టు తన దగ్గర ఉన్న తాయిలం ఆశించకుండా పద్మిని స్వతంత్రంగా తన కాళ్ళమీద తాను నిలబడడానికి, నిలదొక్కుకోడానికి ప్రయత్నించడం అతనికి మింగుడు పడడంలేదు.

ఇంతకన్నా అవమానం మరొకటి ఉందని అతనికి అనిపించడంలేదు.

పద్మినిని దక్కించుకోలేకపోతే తనంత చవట దద్దమ్మ ఎవరూ లేనట్టు. ఎలా? ఎలా ఆమెని తనవైపు తిప్పుకోవాలి.

వేషాలివ్వకపోతే కాళ్ళబేరానికి వస్తుందనుకుంటే కథ అడ్డం తిరిగింది.

ఆమెకి పౌరుషం.. ఆత్మాభిమానం ఎక్కువకానీ, ఆకలి వాటిని జయించాలి. అలా జరగలేదు ఆమెకి తోడు ఆ వసంత.

*మనిషి దెబ్బతిన్నప్పుడు ఒంటరిగా ఉంటే ఆ దెబ్బనుంచి కోలుకోడానికి చాలా సమయం పడుతుంది. అదే ఆత్మీయులెవరన్నా దగ్గర ఉండి వాళ్ళ ఆవేదన పంచుకున్నప్పుడు, ఆ దెబ్బ పెద్దగా బాధపెట్టదు. ఒంటరితనానికి, ఏదో ఒక తోడు ఉన్నదానికీ అదే తేడా.*

చక్రవర్తి చేసిన అవమానంతో, అతని దౌష్ట్యాన్ని, దౌర్జన్యాన్ని, భరించలేక అతనితో గొడవపడి వచ్చేసినా పద్మినికి ఓదార్పునిచ్చి ధైర్యాన్ని నూరిపోయడానికి అటు శివరామ్, ఇటు వసంత ఉండబట్టి ఆమె తగిలిన దెబ్బ వలన కుప్పకూలిపోకుండా, స్వతంత్రంగా తనని తాను పోరాటానికి ఆయత్తపరచుకుని ముందుకు సాగిపోగలుగుతోంది.

కానీ, చక్రవర్తి పూర్తిగా ఒంటరివాడు. ఇటీవల భార్యతో పూర్తిగా తెగతెంపులు అయిపోడంతో మరీ ఒంటరివాడయాడు. అతనికి అవకాశాలున్నా, ఆర్థికంగా ఏ బాధాలేకున్నా, పద్మిని అనే స్త్రీ అతని అహం మీద కొట్టిన దెబ్బనుంచి కోలుకోడానికి అతనికి శక్తినిచ్చే, ఊరటనిచ్చే ఆత్మీయతలేదు. అందుకు కారణం అతనే ఎవరినీ నమ్మని అతని తత్వం. ఎదుటివారిని హీనంగా చూసే అతని అహంకారం.

ఇప్పుడు ఆ అహంకారం పాశవికంగా మారుస్తోంది అతన్ని.

పద్మినికి వసంత తోడుగా ఉండడం, శివరామ్ ఆత్మీయత అందించడం అనేది ఏ మాత్రం అతను సహించలేకపోతున్నాడు.

వసంత... ముందు దాన్ని అక్కడ్నించి తప్పించాలి. ఆ తరువాత పద్మిని ఒంటరిగా ఏమీ చేయలేదు కాబట్టి తప్పకుండా తనని శరణు వేడుతుంది. మధ్యలో ఈ శివరామ్‌గాడొకడు వెధవ.. వీడిని కూడా తప్పిస్తే. ఎలా?

చక్రవర్తి వేళ్ళు చురుక్కుమనడంతో సిగిరెట్ పీక విసిరేసాడు.

అప్పుడే శివరామ్ అడుగుపెట్టాడు. శివరామ్ పద్మిని విషయంలో చక్రవర్తితో విభేదించినా అతని సమాజం నుంచి మాత్రం విడిపోలేదు. ప్రతిరోజూ సాయంత్రం అతని కాళ్ళు అప్రయత్నంగానే కమ్యూనిటీ హాలువైపు నడుస్తాయి. రిహార్సల్స్ ఉన్నా లేకపోయినా అక్కడ ప్రత్యక్షం అయి మిగతా ఆర్టిస్టులతో బాతాఖానీ వేసుకుని, ఓ కప్పు టీ తాగి, రెండు ఉల్లిపాయ బజ్జీలు తిని ఇంటికి వెళ్ళడం దినచర్యలో ఓ భాగం అయింది. అతనికే కాదు సహ ఆర్టిస్టులందరికీ అదొక అడ్డా.

శివరామ్‌ని చూస్తూనే చక్రవర్తి నొసలు ముడిపడింది. ఎలా వీడిని పద్మిని నుంచి దూరం చేయడం? అతని మెదడులో అప్పటికప్పుడు అనేక రకాల ఆలోచనలు తేనెటీగల్లా ముసురుకుని జుమ్మంటూ తిరగసాగాయి.

"గుడ్ ఈవినింగ్ సార్" అంటున్న తననే సీరియస్‌గా చూస్తున్న చక్రవర్తివైపు చిత్రంగా చూస్తూ అడిగాడు శివరామ్.

"ఏంటిసార్ అలా చూస్తున్నారు?"

చక్రవర్తి ఉలిక్కిపడి సర్దుకుంటూ "అబ్బే ఏం లేదు.. ఆ అన్నట్టు శివా.."

ఈసారి ఉలిక్కిపడడం శివరామ్ వంతు అయింది. ఇంత ప్రేమగా పిలుస్తున్నాడేంటి? ఎప్పుడూ అతని నోటి తన అంత ఆప్యాయంగా, అభిమానంగా పిలవబడలేదే అనుకుంటూ ప్రశ్నార్థకంగా చూశాడు.

మళ్ళీ అన్నాడు చక్రవర్తి "శివా! నిన్ను చూస్తుంటే నాకో ఆలోచన వచ్చిందోయ్"

"ఏంటిసార్ అది? " ఆసక్తిగా అడిగాడు.

"ఆ మధ్య నా స్నేహితుడు ఒకడు తను కొత్తగా తీయబోయే టి.వి సీరియల్ కోసం కొంతమంది ఆర్టిస్టులు కావాలన్నాడు. ఎవరున్నారు మన దగ్గర అంత గొప్పగా నటించేవాళ్ళు. కానీ, ఇప్పుడు నిన్ను చూస్తుంటే నువ్వు సపోర్టింగ్ క్యారెక్టర్స్‌కి బాగుంటావనిపిస్తోంది. నీకు ఇంట్రస్ట్ ఉందా?"

శివరామ్‌కి నోటి నుంచి మరో మాట రాలేదు. చక్రవర్తి తనికి సాయం చేయాలనుకుంటున్నాడా? టి.వి సీరియల్ కోసం ఆర్టిస్టులు కావాలంటే తనమీద అతని దృష్టి పడిందంటే అదృష్టం అనుకోవాలా? కాకతాళీయం అనుకోవాలా? నిజానికి చక్రవర్తి పరపతితో అతను తనకేకాదు తల్చుకుంటే పద్మినికి కూడా టీవిలో మంచి అవకాశాలు ఇప్పించగలడు. కానీ, తన బాగు తప్ప ఇతరులు బాగు కోరని ఈ స్వార్థపరుడు ఎవరికీ ఎలాంటి ప్రతిఫలం లేకుండా సాయం చేయడు. అలాంటిది ఇవాళ ఇతని కరుణాకటాక్ష వీక్షణం తనమీద ప్రసరించడం కొన్ని క్షణాలు శివరామ్ ఉక్కిరి, బిక్కిరి అయాడు.

చక్రవర్తి అతని మొహంలో భావాలు పరిశీలనగా చూస్తూ అన్నాడు. "ఏం.. నీకు ఇంట్రస్ట్‌లేదా?"

శివరామ్ తుళ్ళిపడ్డాడు. ఇంట్రస్ట్ లేకేం కానీ, తను అలా వెళ్ళిపోతే పద్మిని ఏమనుకుంటుంది? ఆమెకి కూడా ఏవన్నా అవకాశం చూపించచ్చుగా ఇతను. ఆ తల్లీ కూతుళ్ళను కూడా హైదరాబాదు తీసుకెళ్ళిపోవచ్చు. తను ఉంటాడు కాబట్టి పద్మినికి కొత్తచోట ఇబ్బందులేం ఉండవు.

"పోనీలే నీకు ఇంట్రస్ట్ లేకపోతే వదిలెయ్" చక్రవర్తి మాటకు ఆలోచనల నుంచి తెప్పరిల్లి అన్నాడు.

"అదేంటిసార్ ఇంట్రెస్ట్ లేక కానీ, ఎన్నడూ చూడని హైదరాబాదులో ఎక్కడికి వెళ్ళాలి? ఎక్కడ ఉండాలి? అని ఆలోచిస్తున్నాను"

"అదంతా వాడు చూసుకుంటాడు. వాడికి స్వంత స్టూడియో ఉంది, అంటే ఒక ఇండిపెండెంట్ ఇల్లు తీసుకున్నాడు. దాంట్లోనే ఎక్కువగా షూటింగ్స్ జరుగుతుంటాయి. అదే ఇల్లు అదే స్టూడియో. కాబట్టి నీకు ఎకామడేషన్ ప్రాబ్లమ్ ఉండదు. వెంటనే ఫ్యామిలీని తీసుకుని వెళ్ళకు. కొంతకాలం అయాక నువ్వు కొంచెం సెటిల్ అయాక ఫ్యామిలీని షిఫ్ట్ చేయచ్చు."

శివరామ్ మనసులో చిన్న ఆశ చిగురించింది.

ఎంతటివాళ్ళు కూడా తన ఉన్నతికి, తను ఎదగడానికి ఒక మార్గం కనిపించినపుడు ఆ మార్గంలో సాగిపోవాలనే అనుకుంటారు. అతనికి పద్మిని పట్ల స్నేహభావం ఉండచ్చుగాక, ఆమె పట్ల సానుభూతి కూడా ఉండచ్చు, ఏదన్నా సాయం చేయాలన్న కోరికా ఉండచ్చు కానీ, ఆమె కోసం తనకు లభించిన అవకాశం వదులుకునేంత విశాల హృదయం లేదు. అవసరం లేదు కూడా అనుకున్నాడు శివరామ్. అంతేకాక తనంటూ అక్కడ అడుగుపెడితే నెమ్మదిగా పద్మినిని లాగచ్చు అనే ఒక ఆశాభావం కూడా అతనిలో కలిగింది.

అందుకే తలాడిస్తూ అన్నాడు. "వెళ్తాను సార్. ఆయనతో మాట్లాడి ఎప్పుడు రమ్మంటారో చెప్పండి వెళ్తాను" అన్నాడు ఆనందంగా.

చక్రవర్తి పెదాల మీద సన్నటి చిరునవ్వు విసిరింది. ఆ నవ్వులో విరజిమ్మిన విషం ఎవరూ గమనించకుండా సిగరెట్ తీసి పెదాల మధ్య పట్టుకుని లైటర్‌తో వెలిగించుకున్నాడు.

పొగ రింగులు, రింగులుగా గాల్లోకి వదుల్తూ" ష్యూర్ బ్రదర్.. నిన్ను పంపించే పూచీనాది" అన్నాడు.

ఆ రోజు మిత్రులందరికీ టీ తన డబ్బుల్తో ఇప్పించాడు శివరామ్.

దేవుడి దయవల్ల తనకి ఒక్క సీరియల్‌లో కొంచెం ప్రాధాన్యం ఉన్న పాత్ర లభిస్తే చాలు అల్లుకుపోడానికి పెద్ద సమయం పట్టదు. కొద్దిగా అక్కడ స్థానం సంపాదించుకుంటే చాలు జీవితం సెటిల్ అయినట్టే. పిల్లలకి మంచి భవిష్యత్తు ఇవ్వచ్చు. రజనికి ఉన్న చిన్న, చిన్న కోరికలు తీర్చచ్చు. చేతినిండా డబ్బులేకపోయినా, హ్యాండ్‌ఫ్రీగా ఉంటే చాలు. బొత్తిగా జీవితం అంతా ప్రతిక్షణం లెక్కలేసుకుంటూ బతికే బతుకంటే చికాగ్గా ఉంది.

శివరామ్ ఆలోచనలు సాగిపోతున్నాయి. అలా ఆలోచిస్తూనే ఇల్లుచేరాడు.

రజని అప్పటికే సాయంత్రం వంట చేసేసి పరిశుభ్రంగా తయారై తులసికోట ముందు, దేవుడి ముందూ సంధ్యాదీపం వెలిగించి, చాపమీద కూర్చుని పిల్లల చేత హోం వర్కు చేయిస్తోంది.

శివరామ్ మనసు ఆహ్లాదంతో నిండింది.

నిజానికి ఏ మగాడైనా ఇంతకన్నా ఏం కోరుకోడు. కానీ, అందరికీ తన భార్యలాంటి అనుకూలవతి లభిస్తుందా? తను ఈ విషయంలో చాలా, చాలా అదృష్టవంతుడు. ఈ మధ్యే చక్రవర్తి భార్య అతనికి విడాకులిచ్చేసిందని విన్నాడు. మంచిపని చేసింది. అతనిలాంటి నీచుడికి ఆమెలాంటి ఉత్తమురాలు లభించడం ఆమె దురదృష్టం. పాపం ఎంత హింస భరించిందో. లేకపోతే అంత ధైర్యంగా విడాకులెలా ఇస్తుంది? పైగా ఆమె ఎక్కువగా చదువుకోలేదు కూడా ఏ ధైర్యంతో విడాకులు తీసుకుంది? అంతే మనసు విరిగిపోతే మొండిధైర్యం ఆవహిస్తుంది మనిషిని. ఆమె కూడా అంతే పాపం.. ఎలా బతుకుతుందో.. నిట్టూర్చాడు శివరామ్.

అతని చెప్పుల చప్పుడు విని తలెత్తి చూసింది రజని.

చిరునవ్వుతో అంది "వచ్చారా? అదే చూస్తున్నాను ఇంకా రాలేదేంటా అని ఏమన్నా రిహార్సల్స్ ఉందా?" పిల్లల పక్కనుంచి లేచి వచ్చి అతని చేతిలో టిఫిను బాక్సు అందుకుంటూ అడిగింది.

"లేదు రజనీ! కాకపోతే ఒక శుభవార్త ఉంది కాళ్ళు చేతులూ కడుక్కొచ్చి చెప్తాను" అంటూ పెరటివైపు వెళ్ళిపోయాడు.

అతను కాళ్ళు, చేతులూ కడుక్కుని వచ్చేలోపల వేడి కాఫీ తీసుకొచ్చింది రజని.

అతని బట్టలు మార్చుకుని వచ్చి పిల్లల పక్కన చాపమీద చతికిల పడుతూ "కాఫీగ్లాసు ఇలా ఇవ్వు" అన్నాడు భార్యతో.

రజని అతని చేతికి కాఫీగ్లాసు అందించి తనూ అతని పక్కనే కూర్చుని ఆసక్తిగా అతను చెప్పబోయే శుభవార్త కోసం అతని మొహంలోకి చూసింది.

శివరామ్ పిల్లల వైపు తిరిగి "ఏరా అబ్బాయిలూ మనం హైదరాబాదు వెడదామా? వస్తారా?" అన్నాడు.

ఇద్దరూ ఉత్సాహంగా తలూపుతూ "అక్కడ బస్సు మీద బస్సు ఉంటుందిట కదా నాన్నా" అన్నారు.

శివరామ్ నవ్వి ఇద్దరి చెంపలు నిమురుతూ అన్నాడు. చాలా వింతలుంటాయి.

"ఏంటండి హైదరాబాదు ఏంటి?" నవ్వుతూ అడిగింది రజని.

కాఫీ సిప్ చేస్తూ అన్నాడు. "నాకు టీ.వి సీరియల్స్‌లో నటించే అవకాశం రాబోతోంది రజనీ. చక్రవర్తిగారి స్నేహితుడు ఏదో కొత్త సీరియల్ తీయబోతున్నాట్ట అందులో కొత్తవాళ్ళకి అవకాశం ఇవ్వాలనుకుంటున్నాను ఎవరినైనా పంపించు అన్నాట్ట. ఆయన నన్ను అడిగారు నీకు ఆసక్తి ఉందా! వెళ్తావా? అని."

అలాగా! రజని కళ్ళల్లో చిన్న వెలుగు కనిపించింది.

శివరామ్ హృదయం ద్రవించింది. పిచ్చిపిల్ల ఏనాడూ తన పేదరికాన్ని వేలెత్తి చూపించలేదు. ఏనాడూ తన పేదరికం చూసి బాధపడినట్టు కనిపించలేదు. ఎప్పుడూ చెదరని చిరునవ్వుతో ఈ రెండు గదుల ఇంటి గుమ్మానికి శాంతి, సుఖం అనే తోరణాలు కట్టి నిత్యకల్యాణం పచ్చ తోరణంలా ఉంచుతుంది. ఎలా ఇచ్చాడో ఈమెకింత సహనాన్ని ఆ దేవుడు?

ఆమె కుడిచేయి తన చేతిలోకి తీసుకుని "నీ కోసం, పిల్లల కోసం నేను సరే అన్నాను రజనీ. కొంతకాలం కొత్తగా, వింతగా ఉండచ్చు. తరువాత అదే అలవాటైపోతుంది. కొంచెం నిలదొక్కుకున్నానంటే మన జీవితాలు హాయిగా వెళ్ళిపోతాయి" అన్నాడు.

రజని కళ్ళతో నవ్వింది "అంతకన్నా ఏం కావాలండి? ముందు ఒక నటుడిగా రాణించాలన్న మీ కోరిక తీరుతుంది."

పిల్లలు కూడా అంతే ఉత్సాహంగా అన్నారు "అవును నాన్నా మా నాన్న టీ.విలో కనిపిస్తాడని మేము మా స్కూల్లో అందరికీ చెప్పుకోవచ్చు."

వాళ్ళ కళ్ళల్లో రాలిపడుతున్న నక్షత్రకాంతిని చూస్తూ ముగ్ధుడైపోయాడు శివరామ్.

అతనికి మళ్ళీ పద్మిని గుర్తొచ్చింది. కొంచెం మొహం మ్లానమైంది.

"కానీ, పాపం పద్మినికి కూడా అతను సాయం చేస్తే బాగుండేది రజనీ" అన్నాడు.

రజని నిట్టూరుస్తూ అంది. "పోనీలెండి అతను సాయం చేసి ఆ వంకతో ఆవిడని హింసించేకన్నా ఆవిడ మానాన ఆవిడ్ని వదిలేస్తే చాలు ఆవిడ తిప్పలేవో ఆవిడ పడుతుంది."

"నేనూ అదే అనుకున్నాను. కాకపోతే తనకి నేనొక్కడినే ఆత్మీయుడిని. నేనూ దూరం అయితే వంటరిదైపోతుంది అని బాధగా ఉంది."

"నేనున్నాగా అవసరం అయితే నేను సాయం చేయనా ఏంటి? మీరదేం ఆలోచించకండి. ఒకళ్ళకోసం ఒకళ్ళ జీవితం ఆగిపోదు. ఇదొక నదీ ప్రవాహం ఎదురైన వాటిని ఒరుసుకుంటూ ప్రవహించడమే దీని లక్షణం."

రజని వైపు ఆశ్చర్యంగా, సంభ్రమంగా చూశాడు. నా భార్య రజనీనే ఇలా మాట్లాడేది? ఈమెలో కూడా మరో వ్యక్తి ఉన్నారా? అంతేనా ప్రతి మనిషిలో అంతర్గత రూపం, బాహ్యరూపం అని రెండు పరస్పర విరుద్ధభావాలు ఉంటాయా? ఒకటి స్వార్ధంగా, మరొకటి నిస్వార్ధంగా కాకపోయినా కొంత ఇతరుల పట్ల సానుభూతిగా, సానుకూలంగా ఆలోచించగల సహృదయత.

"ఏంటండి అలా చూస్తున్నారు?" నవ్వుతూ అడిగింది రజని.

"ఏం లేదు రజనీ.. నేను చాలాసార్లు పద్మినికి చెప్పాను. తనకి ఎప్పుడు ఏ సాయంకావాలన్నా నేనున్నానని కానీ, ఇలా నా స్వార్ధం చూసుకుని నేను వెళ్ళిపోడం తప్పు కాదంటావా?"

"కాదండి ఎంత మాత్రం కాదు. మీకు వీలైతే మీరు వెళ్ళాక ఆమెకి అన్ని విధాలా గౌరవంగా, అనుకూలంగా ఉంటుంది అనుకుంటే ఆమెని కూడా పిలిపించుకోవచ్చుకదా!"

సంభ్రమంగా చూశాడు. అంతేనా?

నవ్వింది రజని. మీకన్నీ ఏవో ఆలోచనలు. సర్లెండి మీరు కాస్సేపు విశ్రాంతి తీసుకోండి పిల్లల హోం వర్కు పూర్తికాగానే అందరం భోంచేద్దాం అంటూ పిల్లల పుస్తకాలు చేతిలోకి తీసుకుంది రజని.

శివరామ్ లేచి, టేబుల్ మీద ఉన్న ట్రాన్సిస్టర్ తీసుకుని వరండాలోకి వెళ్ళిపోయాడు.

చక్రవర్తి చాలా జాగ్రత్తగా వేస్తున్న ప్రణాళికలో ఒకటి విజయవంతం అయింది.

రెండవది వసంతని కూడా పద్మిని దగ్గర్నించి దూరం చేయాలి. ఇది చాలా కష్టమైన పని అలా అని వదిలేయడం తన చేతకాని తనం కింద పరిగణించాల్సి వస్తుంది. ఇప్పటికే పొందిన ఓటమితో అణువణువూ దహించుకుపోతోంది. ఓ ఓటమిని విజయంగా మార్చుకోవాలంటే ఒకటేదారి. కర్ణుడిని నిస్సహాయుడిని చేసి పాండవులు అతని మీద విజయం సాధించినట్టు పద్మినికి అండగా ఉన్న ఈ ఇద్దర్నీ దూరం చేస్తే ఆమెలో ఆత్మవిశ్వాసం సన్నగిల్లిపోయే అవకాశం ఉంది. ఒకసారి ఆత్మవిశ్వాసం సన్నగిల్లిందంటే ఆమె నిస్సహాయురాలైనట్టే. ఆమె మీద తను గెలుపొందడం సులువు.

లేకపోతే ఎంత ధైర్యం. కూతురు చదువుకుంటున్న స్కూల్లో అంత పెద్ద కార్యక్రమంలో తన ఆధిపత్యం చూపించాలనుకుంటుందా? ఈ ఊళ్ళో తనకున్న పరపతి తెలియక పులితో తలపడడానికి సిద్ధం అయింది. అందుకే ఆమె మొదటి ప్రయత్నంలోనే ఆమెకి నిరాశ కలిగేలా చేయగలిగాడు. కూతురు చేత వేషం కూడా వేయించింది. పిల్ల బానే ఉంది.

ఎవరో ఛెళ్ళున చరిచి ఆపేసినట్టు అతని ఆలోచనలు అక్కడ ఆగిపోయాయి.

అతని కళ్ళముందు శకుంతల ప్రియసఖి ప్రియంవద పాత్రలో ముద్దుగా, ముగ్ధగా కనిపించిన యవనిక మెదిలింది.

ఆ పిల్ల వయసు ఎంత ఉండి ఉండచ్చు. ఆలోచనలో పడ్డాడు. పదమూడు, పధ్నాలుగు.

ఒక్క రెండేళ్ళు ఆగితే ఆ పిల్ల చక్కగా ఎదిగి ఒక కధానాయికగా రాణించడానికి కావలసిన అన్ని లక్షణాలను పొందుపరచుకుంటుంది. అప్పుడు .. అప్పుడు ఆ పిల్లతో తనే ఒక సీరియల్ తీయాలి. టీ.వి సీరియల్ తన కథతో తీయాలన్న కోరిక తీరాలంటే తను ఇంకా సంపాదించాలి. కనీసం పైలట్ ఎపిసోడ్ తీయాలన్నా ఐదారు లక్షలు ఉండాలి.

ఐదారు లక్షలు.. తన నాటక సమాజాన్ని నమ్ముకుని బతికితే తన సంపాదన లక్షలకి చేరే అవకాశం ఉందా? నాటకాల ద్వారా డబ్బు సంపాదించిన వాళ్ళని తనింతవరకు చూడలేదు. నాటకం కోసం ఆస్తులు అమ్ముకున్న వాళ్ళు తెలుసు.

చక్రవర్తి ఆలోచనలు పరి, పరివిధాల సాగుతున్నాయి.

ఐడిల్ బ్రెయిన్ డెవిల్స్ వర్క్‌షాప్ అనే ఆంగ్లనానుడి ఇప్పుడు చక్రవర్తి విషయంలో అక్షరాలా వాస్తవరూపం దాలుస్తోంది.

ఇటీవలి కాలంలో అతను నాటకాలేం వేయించలేదు.

అందుకు కారణం భార్య అతనితో పోట్లాడి వెళ్ళిపోడంకాక, వెళ్ళేముందు నెలరోజుల్లో నీ బుద్ధి మారి నన్ను గౌరవంగా తీసుకొస్తే ఈ ఇంటికి వస్తాను లేదంటే ఇంతటితో మనిద్దరికీ చెల్లు అంటూ ఆల్టిమేటమ్ ఇచ్చి వెళ్ళిపోయింది.

ముందు కోపంతో రగిలిపోయాడు. తరువాత పోతే పోయిందిలే ఇదేనా నాకు నేను తల్చుకుంటే వందమంది ఆడవాళ్ళు క్యూలో నిలబడతారు అనుకున్నాడు. అదే నిర్లక్ష్యంతో ఆమెని తిరిగి తీసుకువచ్చే ప్రయత్నం చేయకుండానే గడిపేశాడు. ఆమె అన్నంత పనీ చేసింది విడాకులకి నోటీస్ పంపించింది. పౌరుషంతో సంతకం చేశాడు. విడాకులు అయిపోయి రెండునెల్లవుతోంది. ఇప్పుడు పూర్తిగా అతను ఒంటరి. ఎంత నిర్లక్ష్యంగా ఉన్నా అదికూడా ఒక అవమానంగా అతని మనసుని తొలుస్తూనే ఉంది. హఠాత్తుగా తనకి సంఘంలో గౌరవం తగ్గిపోయిన కలుగుతోంది. అయితే దాన్ని జయించే ప్రయత్నంలో అతను తనని తాను అవసరానికి మించి గొప్పవాడిగా భావించుకుంటూ తప్పులు చేస్తూ పోతున్నాడు. అతని దృష్టిలో తను చేసేది రైటు అనిపించినా చూసేవాళ్ళకి మాత్రం ఇతను శాడిస్టా, మెంటలా అనే అనుమానానికి తావిస్తోంది.

ఇప్పుడు భార్యని ఎలాగా తిరిగి తెచ్చుకోలేడు. తెచ్చుకోవాలనుకున్నా ఆమె రాదని తేలిపోయింది. కాకపోతే అతని ఆశ, ఆశయం ఇప్పుడు పద్మిని.. పద్మిని పూట గడవని పరిస్థితిలో ఆర్థికంగా చాలా నిస్సహాయ పరిస్థితిలో ఉంది ఆమెకి నటన తప్ప మరో విద్యరాదు. ఒక రంగస్థల నటిగా పేరు పొందాక ఆమె మరో పని ఏదీ చేయలేదు కూడా. కూతుర్ని చదివించుకోవాలి. ఆ పిల్లని పోషించాలి తనని తాను పోషించుకోవాలి. అందుకోసం ఆమె ఒక విధమైన పోరాటం చేస్తోంది. ఆ పోరాటంలో ఆమె ఎంత విజయం కోసం శ్రమించినా, తను ఎంచుకున్న రంగంలో ఒంటరిగా ఆమె ఏదీ సాధించలేదన్నది అతని విశ్వాసం. ఆమెకి తోడుగా ఉంటూ మానసిక, శారీరక స్థైర్యం, ధైర్యం కలిగించే సమర్థుడైన వ్యక్తి అండ చాలా అవసరం అని అతని ఆలోచన. ఆ అండగా శివరామ్ కొంతవరకూ ఉన్నా, అతను ఆమెకి మానసిక ధైర్యం ఇవ్వగలడేకానీ, అటు ఆర్థికంగా గానీ, అవకాశాలు ఇప్పించే దిశగా కానీ ఎలాంటి సాయం చేయలేడు. ఆ సంగతి చక్రవర్తికి తెలుసు. ఇకపోతే వసంత వసంతదీ, పద్మినిదీ అక్కాచెల్లెళ్ళ బంధమంత గాఢమైనది. పద్మిని కడుపునిండా తింటే వసంత తింటుంది, పద్మిని పస్తు పడుకుంటే వసంత పస్తు పడుకుంటుంది. పద్మిని ఏడిస్తే వస్తంత ఏడుస్తుంది కానీ, ఓదార్చలేదు.

వేదనతో తల్లడిల్లే మనిషికి ఓదార్పు ఎంతో అవసరం. ఈ చిన్న ప్రాథమిక విషయం చక్రవర్తికి తెలుసు కానీ, ఆ ఓదార్పుకి అతను విలువ కడతాడు ఆ విలువ పేరే పద్మిని పొందు. తను ఆమె దుఃఖాన్ని, ఆమె దరిద్రాన్ని, ఆమె అవసరాన్ని తీర్చగలడు. ఆమెకి అండగా ఉండగలడు కాకపోతే అందుకు ఆమె అతని అవసరాలు, అతని కోరికలు తీర్చాలి. ఆమె మీద అతనికున్న మోహాన్ని ఆమె అర్థం చేసుకుని అతనికి సహకరించాలి. అందుకోసమే అతని తపన, అతని ఆరాటం, అతని ప్రయత్నం.

చక్రవర్తి సిగరెట్ ఆఖరి దమ్ములాగి కిందపడేసి కూర్చున్న దగ్గర్నించి లేచాడు.

అప్పుడే అక్కడికి వచ్చిన నలుగురు ఆర్టిస్టులు ప్రహరీగోడ వెనకాల ఉన్న టీ బండి దగ్గర టీలు తాగుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు. చక్రవర్తి నిలబడ్డ చోటునుంచే వాళ్ళందరినీ పరీక్షగా చూశాడు. వీళ్ళల్లో ఎవరూ ఆర్థికంగా బలంగా ఉన్నవారుకాదు. వీళ్ళంతా ఎలా ఇంత ఆనందంగా ఉండగలుగుతున్నారు? ఎలా? తనకి ఆ ఆనందం ఎందుకు లభించడంలేదు? అతని మనసులో చిన్నగా సూది గుచ్చినట్టుగా ఓ సందేహం మొదలైంది.

గుమ్మం దాటి వీధిలోకి వచ్చాడు.

టీ తాగుతున్న ఆర్టిస్టులు అతన్ని చూసి ''టీ తాగుతారా సార్!'' అని అడిగారు.

ఒద్దన్నట్టుగా తలూపి, ప్యాంట్ జేబులో రెండు చేతులూ పెట్టుకుని బండి అక్కడే వదిలేసి నెమ్మదిగా నడక మొదలుపెట్టాడు.

ఎటువైపు నడవాలో, ఎక్కడికి వెళ్ళాలో తెలియని అగమ్యగోచరమైన నడక అది.

ఆ నడకలో దర్పం లేదు. ఆ నడకలో నీరసం లేదు నిరాసక్తత లేదు. నిర్లక్ష్యం లేదు. ఏం ఉందో ఎందుకు నడుస్తున్నాడో అతనికే తెలియనట్టుగా ఆలోచనలతో బరువుగా ఉన్న తలవంచుకుని, నెమ్మదిగా నడవసాగాడు.

కొద్ది దూరం నడిచాక అతనికి సడన్‌గా అనిపించింది. పద్మిని ఇల్లు ఇటు కాదు.

చివ్వున వెనక్కి తిరిగి ఎడం వైపు రోడ్డు మీదకి నడిచాడు.

అక్కడి నుంచి పద్మిని ఇంటికి నెమ్మదిగా నడిస్తే పావుగంట, వేగంగా నడిస్తే పదినిమిషాలు. అతను నెమ్మదిగా నడుస్తూ ఆమె ఎక్కడన్నా కనిపిస్తుందేమోనన్నట్టుగా కనిపించిన ప్రతి స్త్రీవైపు చూస్తూ ముందుకు సాగాడు.

వెదకబోయిన తీగ కాలికి తగిలింది. అతనికి కొంచెం ముందు చేతిలో కూరగాయల సంచితో వసంత తలవంచుకుని వడి, వడిగా నడుస్తూ వెళ్తోంది.

ఉత్సాహంగా పిలిచాడు. "వసంతా! "

చివ్వున వెనక్కి తిరిగింది వసంత. గబ, గబా అడుగులు వేస్తూ తనకి సమీపంగా వచ్చిన వ్యక్తిని చూస్తూనే కళ్ళు పెద్దవిచేసి విస్మయంగా నిలబడిపోయింది.

చూడకూడని వ్యక్తిని చూసినట్టు చూస్తూ ఉండిపోయింది వసంత చక్రధరాన్ని.

"ఏంటి వసంతా! అంతగా ఆశ్చర్యపోతున్నావు నన్ను గుర్తుపట్టలేదా?"

"ఆ, ఆ గుర్తుపట్టకేం గుర్తుపట్టాను" ఖంగారుగా అంది.

"లేదులే నన్ను మర్చిపోయావు. నువ్వు మీ అక్క ఇద్దరూ నన్ను మర్చిపోయారు. మీ ఇద్దరికీ ఎంత సాయం చేసాను, ఎన్ని అవకాశాలు కల్పించాను అవన్నీ మర్చిపోయారు. పోనీలే ఇంతకీ ఎలా ఉన్నారు? మీ అక్క బాగుందా? ఏదో సంస్థ పెట్టుకున్నారుగా ఎలా నడుస్తోందేంటి?"

వసంతకి అతని మాటలు వింటోంటే ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్టుగా అనిపించింది. ఇతనింత ప్రేమగా పలకరిస్తున్నాడంటే ఏదో ఉపద్రవం ముంచుకొస్తుందేమో అనిపిస్తుంది. ఏం చెప్పాలో తెలియక మౌనంగా ఉండిపోయింది.

"చెప్పడం ఇష్టంలేకపోతే ఒద్దులే. మీరు తెంచుకున్నా నేను తెంచుకోలేకపోతున్నా రెండేళ్ళ అనుబంధం. అందరం కలిసి ఎన్ని ప్రదర్శనలిచ్చాం. ఎన్ని ఊళ్ళు తిరిగాం. ఎంత సరదాగా గడిపాం ఎలా మర్చిపోగలిగారు మీరు? నేనసలు క్షణం కూడా మర్చిపోలేకపోతున్నాను. చేసిన సహాయం మర్చిపోయినా బంధాలు, కొన్ని జ్ఞాపకాలు మర్చిపోకూడదు వసంతా! అలా మర్చిపోతే మనకీ, పశువులకీ తేడా ఏముంది. సరేలే నా సోదికేం గానీ, వచ్చేనెల గుడివాడలో పరిషత్తులు జరుగుతున్నాయి. మన నాటకం ఒకటి ఉంది మంచి సాంఘిక నాటకం. రెండున్నర గంటలు. రెండు స్త్రీపాత్రలున్నాయి ఒకటి హీరోయిన్, మరొకటి తల్లి పాత్ర. మీ ఇద్దరికీ ఆసక్తి ఉంటే చెప్పండి మళ్ళీ మన ప్రదర్శనలు ప్రారంభిద్దాం. జరిగిందంతా మర్చిపొమ్మని చెప్పు మీ అక్కకి. మంచి మనసుతో నేను ఆహ్వానిస్తున్నాను. నా మీద నమ్మకం, గౌరవం ఉంటే రండి లేకపోతే లేదు మీ ఇష్టం. ఏ సంగతీ రేపు నాకు చెబితే నేనూ నా ఏర్పాట్లు చేసుకోవాలిగా."

అతను చెపుతున్న మాటలు వింటూ అతని మొహంలోకి చూసింది వసంత. చాలా నిజాయితీగా ఉన్నట్టు అనిపించింది. పాపం నిజంగానే మారాడేమో!!? మారక ఏం చేస్తాడు. అక్కలాంటి నటి దొరకొద్దూ. రంగస్థల కళాకారులకి ముఖ్యంగా మహిళా కళాకారులకి అందం ఉంటే నటన ఉండదు. నటన ఉంటే అందం ఉండదు. కానీ అక్కకి రెండూ ఉన్నాయి. అలాంటి నటి దొరకడం అంటే మాటలు కాదు. బహుశా అక్క అతని నుంచి వచ్చేసిన దగ్గర్నించీ ఇతని నాటకాలేవీ బహుమతులు పొంది ఉండవు.

"ఏంటి ఆలోచిస్తున్నావు వసంతా?" అతని మాటలకి ఉలిక్కిపడి బలవంతంగా నవ్వుతూ" ఏంలేదు అక్కకి చెప్తాను మీరు చెప్పిన విషయం. తప్పకుండా వేయమని కూడా చెప్తాను" అంది. అలా అన్నాక తనలో తనే ఆశ్చర్యపోయింది. తను సిఫారసు చేస్తే ఆవిడ ఒప్పుకుంటుందనేనా అంత నమ్మకంగా అతనికి మాట ఇచ్చింది. ఏంటో అప్రయత్నంగా అలా వచ్చేసింది నోటినుంచి. ఇప్పుడెలా? అక్క ఒప్పుకోకపోతే.

"గుడ్! నువ్వు కష్టసుఖాలు తెలిసిన అమ్మాయివి కాబట్టి ఈ మాటన్నా అన్నావు చాలు. తప్పకుండా రండి. నా సంస్థ మీకోసం ఎప్పుడూ ఆహ్వానం పలుకుతూనే ఉంటుంది. మరి నే వస్తాను. అన్నట్టు శివకి ఏదో టీ.వి సీరియల్‌లో అవకాశం వచ్చిందట కదా? హైదరాబాదు వెళ్ళాట్ట. మీకు తెలుసా?" అడిగాడు.

వసంత నివ్వెరపోయింది. టీ.వి సీరియల్‌లో అవకాశం వచ్చిందా? శివకా? హైదరాబాద్ వెళ్ళాడా? ఇంటికి వచ్చి నాలుగురోజులైంది. మాటవరసకి కూడా చెప్పినట్టు లేదే!? అక్కకేమన్నా చెప్పి ఉంటాడా? ఆలోచిస్తూ ఉండిపోయిన వసంత మొహంలో కలుగుతున్న భావాలు గమనిస్తూ అన్నాడు. "ఏంటి మీకు చెప్పలేదా? మీకు బాగా సన్నిహితుడుకదా! మీకు చెప్పలేదా? మీకు బాగా సన్నిహితుడుకదా! మీకు చెప్పకపోడం ఏంటి? విచిత్రంగా ఉందే "

తడబడుతూ అంది వసంత "బహుశా అక్కకి చెప్పి ఉంటాడు. అక్క నాకు చెప్పడం మర్చిపోయిందేమో. పోనివ్వండి మంచిదేగా అతనైనా సెటిల్ అయితే అంతకన్నా ఏం కావాలి?"

"అయినా మీతో ఒక్క మాట చెప్పకపోవడం ఏంటి? తనకొచ్చిన అవకాశం మీరేమన్నా ఎత్తుకుపోతారా? అంత సన్నిహితంగా ఉంటూ, ఆత్మీయుడిలా అన్ని విషయాలు పంచుకుంటూ మీకు చెప్పకపోవడం బాగాలేదు. వెళ్ళినవాడు వెళ్ళి మీకోసం కూడా ఏమన్నా ప్రయత్నాలు చేసి సాయం చేస్తే బాగుండు. స్నేహితులన్నాక ఒకళ్ళకొకళ్ళు సాయం చేసుకోవాలి. సరేలే వస్తాను రేపు సాయంత్రం లోపల ఏ విషయం చెపుతావుగా" అడిగాడు.

విషబీజం వేశాడు. అతని పని అయిపోయింది. ఇంక అంతకన్నా ఎక్కువసేపు అక్కడ ఉండడం భావ్యం కాదు అనిపించింది అతనికే. అందుకే వెళ్ళిపోడానికి ఉద్యుక్తుడయాడు.

"అలాగే చెప్తాను సార్" అంది వసంత.

"మంచిదమ్మా వెళ్ళొస్తాను" అంటూ గిరుక్కున వెనక్కి తిరిగి వడి, వడిగా నడుచుకుంటూ వెళ్ళిపోతున్న అతనివైపు అయోమయంగా చూస్తూ ఉండిపోయింది వసంత.

ఇతను ఖచ్చితంగా మారాడు. లేకపోతే ఇంతకు ముందు ఎప్పుడన్నా ఇంత ఆప్యాయంగా అమ్మా అని అన్నాడా? ఇవాళ వెళ్ళొస్తానమ్మా అన్నాడంటే చాలా పెద్దమనిషి తరహాగా అయాడు. అవునులే వయసు పెరగడంలేదూ! ఆ మాత్రం హుందాతనం నేర్చుకోకపోతే ఎలా?

వసంత ఆలోచనలు ఆపి, మార్కెట్లో కూరగాయలు కొనుక్కుని ఇంటివైపు నడిచింది.

చక్రధరం ఇలా కలిసాడని, ఈవిధంగా మాట్లాడాడని చెబితే పద్మిని ఏమంటుందో ఆమె అతడిని త్వరగా నమ్మదు. అంతా నాటకం అని కొట్టిపారేయచ్చు. అతనేంటి మనకి అవకాశం ఇచ్చేది? నువ్వు నమ్మావా? అని తననే కోప్పడచ్చు. కానీ, తనకి మాత్రం ఎందుకో అతన్ని నమ్మచ్చు అనిపిస్తోంది. ఆమెని ఎలా ఒప్పించడం? ఎలా నచ్చచెప్పడం? జరిగిందేదో జరిగింది అతను మారాడు ఇప్పుడు అతనిచ్చిన అవకాశం ఉపయోగించుకుని, మళ్ళీ ఎప్పటిలా అతనితో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకుంటే ఏదన్నా సాయం చేస్తాడు. ఇలా ఒంటరి పోరాటం ఎంతకాలం చేయగలం? ఈ సంఘంలో ఆడవాళ్ళని ప్రతి విషయంలో అధైర్యపరచి, వెనక్కి ఇలాగే వాళ్ళేకానీ, ప్రోత్సహించి ముందుకు నడిపించేవాళ్ళు ఎవరున్నారు? అందుకేగా సంస్థ పెట్టి ఇన్నాళ్ళు అయినా ఇంకా ఆ సంస్థ తరపున ఒక్క కార్యక్రమం కూడా చేయలేదు. మరి పద్మిని ధైర్యం ఏంటో!?

వసంత ఇంటికి చేరేసరికి పద్మిని తన పాత పట్టుచీర చింపి ఏదో కుడుతోంది.

"ఏంటక్కా ఏం కుడుతున్నావు?" చెప్పులు విప్పి లోపలికి వస్తూ అడిగింది వసంత.

"యవనికని బొత్తిగా బైటకి ఎక్కడికన్నా తీసుకెళ్ళాలంటే సరైన బట్టలు లేవు వసంతా! ఈ చీర నేను ఎక్కువగా కట్టుకోవడంలేదు అందుకని దానికి పరికిణీ కుడదామని ప్రయత్నిస్తున్నాను" అంది సూదిలో దారం ఎక్కిస్తూ.

"చేతి కుట్టుతో పరికిణీ నిలుస్తుందాక్కా నీ చాదస్తం కానీ, మిషన్‌కి ఇస్తే సరిపోతుందిగా."అంటున్న వసంతవైపు చూసి నవ్వి "కుట్టు ఖర్చులు మన దగ్గర ఉన్నాయా వసంతా? బాగా దగ్గరకి కుడతాలే ఇంతకీ కూరగాయలేం తెచ్చావు" అడిగింది వసంత.

"టమాటో, చిక్కుడుకాయలు తెచ్చాను. బంగాళాదుంపలు యవనికి ఇష్టమని తెచ్చాను. ఈ పూట ఏం చేయమంటావు?" అడిగింది వసంత.

"నీ ఇష్టం. నువ్వేది పెడితే అది తింటాను" నవ్వింది పద్మిని.

వసంత ఆమె పక్కకి వచ్చి కూర్చుని చెప్పింది "నీకో విషయం తెలుసా? ఇవాళ నాకు మార్కెట్‌కి వెళుతుంటే చక్రధరంగారు కనిపించారు."

పద్మిని కుట్టడం ఆపి వసంత మొహంలోకి ఆశ్చర్యంగా చూసింది. "అలాగా? పలకరించారా?" అడిగింది.

"పలకరించడం కాదు చాలాసేపు మాట్లాడారు కూడా. ఆయన చాలా మారిపోయినట్టున్నారక్కా. మనం ఆయన సంస్థనుంచి వెళ్ళిపోడం వలన చాలా బాధపడుతున్నట్టు అనిపించింది. మీకు లేకపోయినా నేను అస్తమానం మిమ్మల్ని తల్చుకుంటూనే ఉంటాను అన్నారు. వచ్చేనెల గుడివాడలో పరిషత్తులున్నాయట అందులో ఒక సాంఘిక నాటకం వేస్తున్నారట. మనకి అవకాశం ఇస్తానన్నారు. అవకాశం అంటే చిన్న పాత్రకాదు. మెయిన్ పాత్రలే మనకిస్తానన్నారు."

పద్మిని మౌనంగా వినసాగింది వసంత చెప్పేది.

"మనకి అంగీకారం అవునో కాదో రేపు సాయంకాలానికి చెప్పమన్నారు. ఒకవేళ మనకిష్టం లేకపోతే వేరేవాళ్ళని వెతుక్కోవాలిగా! అది ఆయన బాధ" చెప్పడం ముగించి పద్మిని. ఏమంటుందో అని జాగ్రత్తగా వినడం కోసం మౌనంగా కూర్చుంది వసంత.

పద్మిని సన్నగా నిట్టూర్చి అంది. "అయన మారడం అనేది నేతి బీరకాయలో నెయ్యిని ఆశించడంలాంటిది వసంతా! ఏదో కొత్త స్కీము వేస్తున్నాడని నాకనిపిస్తుంది. మనం అతన్ని నమ్మి వెళ్ళామంటే అశాంతిని కొనుక్కున్నట్టే అనిపిస్తుంది నాకు."

పద్మిని అలా నిరాశపడడం, తనని కూడా నిరాశపర్చడం వసంతకి నచ్చలేదు.

ఎంతకాలం ఇలా దరిద్రం అనుభవిస్తూ బతకాలనుకుంటోంది ఈమె? అని చిన్న చికాకు కూడా కలిగింది. ఆ చికాకు మనసులోనే అణచుకుని అంది. "అదికాదక్కా ఆయన చెడ్డతనంతో మనకేం సంబంధం చెప్పు. ఆయన తప్ప ఈ ఊళ్ళో మనకి ఎవరూ అవకాశాలు ఇచ్చేవాళ్ళు లేరు. బైట ఊళ్ళవాళ్ళు ఆయన్ని కాదని మనల్ని పిలవరు. మనం సంస్థ పెట్టుకుని ఏడాది కావస్తోంది. ఏం సాధించాం ఇప్పటివరకూ? ఏం చేయలేకపోయాం. మనకి ఎవరూ కూడా పెద్ద మనసుతో వచ్చి సాయం చేయరక్కా. మనమే జాగ్రత్తగా ఉంటూ మన అవసరం గడుపుకోవాలి. వాళ్ళకి స్త్రీ పాత్రలకి మహిళా కళాకారులు కావాలి. మనకి ప్రదర్శనలు తరచూ ఇస్తూ, నాలుగు డబ్బులు మన చేతుల్లో పెట్టే సంస్థలు కావాలి. ఎంతకాలం ఇలా డబ్బుకి కట, కటలాడుతూ బతుకుతాము? యవనికకి మంచి జీవితం ఇవ్వాలక్కా. అలా ఇవ్వాలంటే మన దగ్గర డబ్బులుండాలి. మనం సంపాదించాలి. ఆలోచించు.. రేపు సాయంత్రందాకా టైం ఉంది" అంటూ వసంత అక్కడినుంచి లేచి వెళ్ళిపోయింది వంట చేయడానికి.

పద్మినికి కళ్ళు బైర్లు కమ్మినట్టు అయింది. వసంత ఇంతగా ఎప్పుడూ మాట్లాడలేదు. ఇలా ఎప్పుడూ తన మాటకి ఎదురు చెప్పి తనకి నచ్చ చెప్పే ధైర్యం చేయలేదు ఇవాళ ఇలా చెప్పిందంటే కారణం ఏడాదిగా అనుభవిస్తున్న ఆర్థిక సమస్యలతో విసిగిపోయిందా? లేక అవకాశాలు లేకపోడంతో వచ్చిన అవకాశం వినియోగించుకోవాలనుకుంటోందా? ఒకవేళ తను గట్టిగా ఒద్దు అని అంటే ఆమె ఎదిరించి వెళ్ళిపోతుందా? తన మాటని గౌరవించి అనుకూలంగా మసులుకుంటుందా?

పద్మిని ఆలోచనల్లో ఉండగానే వసంత అంది "ఇంకో విషయం చెప్పాలి నీకు. శివకి టీ.వి సీరియల్స్‌లో అవకాశం వచ్చి హైదరాబాదు వెళ్ళాట్ట నీకు తెలుసా! చెప్పాడా?"

మరో షాక్ పద్మినికి. శివకి టీ.వి సీరియల్‌లో అవకాశం వచ్చిందా? చెప్పకుండా వెళ్ళిపోయాడా? ఎలా సాధ్యం? ఎవరిప్పించారు? తనకి తెలియకుండా అతను ప్రయత్నాలెప్పుడు చేశాడు? ఎలా చేశాడు? మాటవరసకి కూడా తనతో సంప్రదించకపోడానికి కారణం ఏమై ఉంటుంది? తను అవకాశాలు ఇప్పించమని అడుగుతుందని భయపడ్డాడా? అలా చేయడే శివ. తనే అన్నాడు "టీ.వి సీరియల్స్‌లో అవకాశాలు చూసుకుందాం పద్మినీ! లాభం లేదు. రంగస్థలాన్ని నమ్ముకుంటే మనం తిండిలేకుండా చచ్చినా ఎవరూ పట్టించుకోరు" అని. అలాంటి శివ తనకి అవకాశం లభించగానే ఈ పద్మినిని మర్చిపోయాడా?

ఆమెకి నమ్మబుద్ధికాలేదు. "ఎవరు చెప్పారు నీకు? అతనేనా?" అడిగింది. అతనేనా అనడంలో చక్రధరాన్ని ఉద్దేశించి అని వసంతకి తెలుసు.

"అవును" అంది.

"అబద్ధం వసంతా! శివ అలా ఎన్నడూ చేయడు. కనీసం నాకు వెళ్తున్నానని అయినా చెప్తాడు."

"ఏమో నాకు ఆయన చెప్పారు నీకు నేను చెప్పాను. అయినా శివ మనింటికి వచ్చి నాలుగురోజులైంది నీకు గుర్తుందా?"

"అవును. దానికేం! అప్పుడప్పుడు ఇలా నాలుగేసి రోజులు, వారం రోజులు కూడా రాకుండానే ఉంటాడుగా."

"ఏమో అక్కా ఎక్కడికెళ్ళి ఉంటాడు?"

పద్మిని ఆలోచిస్తూ అంది "సాయంకాలం ఓసారి వాళ్ళింటికి మనమే వెడదాం."

అలాగే. అది నిజమైతే ఈమె తప్పకుండా చక్రధరం ఇచ్చిన అవకాశం ఒప్పుకుంటుంది. ఎంతో ఆత్మీయుడని నమ్మిన శివే మోసం చేయగా లేనిది చక్రధరం చేస్తే ఏంటి అనుకోవచ్చు. అనుకుంది వసంత.

ఈలోగా వసంత వంట పూర్తికావడంతో "లేచిరా అక్కా! భోంచేద్దాం" అంది ప్లేట్లు పెడుతూ.

పద్మిని లేచి చేతులు కడుక్కుని వచ్చింది.

వేడి వేడి అన్నం, టమాటా పప్పు, కందిపొడి, పెరుగు ప్లేట్ల ముందు చిన్న, చిన్న గిన్నెల్లో చూసి అంది వసంతతో "నువ్వున్నావు కాబట్టి నేను గుప్పెడు మెతుకులు తినగలుగుతున్నాను వసంతా. నువ్వే లేకపోతే!?"

వసంత కళ్ళు చెమ్మగిల్లాయి ఆ మాటలకి.

"అదేం మాట అక్కా! నేను వంట మాత్రమే చేస్తాను. సంపాదిస్తున్నది నువ్వేగా. ట్యూషన్లు చెపుతున్నావు. పిల్లలకి పద్యాలు నేర్పిస్తున్నావు. మధ్య మధ్య ఎవరు ఏ వేషం ఇచ్చినా చేస్తున్నావు. కష్టం నీది" అంది.

"కష్టంకాదు వసంతా! నా బాధ్యత" అంది పద్మిని కంచం ముందుకు లాక్కుంటూ.

ఇద్దరూ కడుపు నిండా అన్నాలు తిన్నారు.

సాయంత్రం యవనిక ఇంటికి వచ్చాక త్వరగా భోజనం పెట్టేసి "పద అలా శివమావయ్య ఇంటిదాకా వెళ్ళొద్దాం" అంది పద్మిని యవనికతో.

"ఎందుకమ్మా? ఇప్పుడు నేను చదువుకోవాలి" అంది యవనిక.

"అరగంట వెళ్ళొద్దాం రాగానే చదువుకుందువుగాని" అంది వసంత.

వాళ్ళిద్దరూ బయలుదేరడంతో యవనికకు కూడా బయలుదేరక తప్పలేదు.

ముగ్గురూ నడుచుకుంటూ శివ ఇంటివైపు బయలుదేరారు. దారిలో రెండు మూరలు కనకాంబరాలమాల, పచ్చిమిరపకాయ బజ్జీలు కొంది పద్మిని.

వీళ్ళు వెళ్ళేసరికి రజని వాకిలి ముందున్న మొక్కలకి నీళ్ళు పెడుతోంది.

పద్మినిని, వసంతని చూడగానే నవ్వుతూ వాళ్ళవైపు వచ్చింది. పద్మిని చేయందుకుని "ఎలా ఉన్నారు?" అడిగింది.

"బాగున్నాను రజనీ! మీరంతా ఎలా ఉన్నారు?" నవ్వుతూ అడిగింది పద్మిని. వసంత మాత్రం రజని తలమీంచి ఇంట్లోకి చూడడానికి ప్రయత్నించింది. ఆమె కళ్ళు శివకోసం వెతికాయి.

బాగున్నాం రండి లోపలికి వెడదాం అంటూ ట్యూబు అడ్డంగా ఉంటే పక్కకి జరిపింది.

"మొక్కలకి నీళ్ళు నేను పెట్టనా అత్తా?" అడిగింది యవనిక.

"పెట్టమ్మా! వెనకాల అయిపోయింది. ఈ పక్క మొక్కలకి పెడితే చాలు" అంటూ ఏ మొక్కలకి నీళ్ళు పెట్టాలో చూపించి రండి అంటూ వసంతనీ, పద్మినినీ తీసుకుని లోపలకి నడిచింది రజని.

తను తెచ్చిన పూలు నాలుగు ముక్కలుగా చేయమని రజని చేతికిచ్చి తనే లోపలికెళ్ళి ఒక ప్లేటు తీసుకుని బజ్జీలు పెట్టింది.

రజని పూలు తెచ్చాక అందరూ చాప మీద కూర్చున్నారు.

"శివ ఇంకా ఆఫీసునుంచి రాలేదా రజనీ?" అడిగింది పద్మిని.

"ఆయన హైదరాబాదు వెళ్ళారు. చక్రధరంగారు ఏదో టీ.వి సీరియల్‌లో ఈయనకి సూటబుల్ పాత్ర ఉందని పంపించారు."

పద్మిని, వసంత ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. "చక్రధరంగారు పంపించారా?" అడిగింది పద్మిని.

"అవునండి. ప్రత్యేకంగా పిలిచి మరీ చెప్పారట. ఈయన ఎదురుగానే హైదరాబాదుకి ఫోన్ చేసి వాళ్ళతో మాట్లాడి శివ అనే అతన్ని పంపిస్తున్నాను అని కూడా చెప్పారట."

రజని చెప్పేది వింటుంటే ఇద్దరికీ నోటమాటరాలేదు అయినా తనతో ఒక్కమాట చెప్పచ్చుగా అనిపించింది పద్మినికి.

"అలాగా !నాకేం చెప్పలేదే? నాలుగురోజుల క్రితం కూడా వచ్చాడు" అంది.

"అయ్యో రామా! ఆయన ఆ ముక్క చెప్పాక అసలు ఆగలేదు. ఈయన్ని ఆదరబాదర పెట్టి పంపించారు. 'త్వరగా వెళ్ళు. మళ్ళీ ఆ అవకాశం పోతుంది. అక్కడ చాలా కాంపిటీషన్ ఉంది. ' అంటూ హడావుడి చేశారు. ఈయన అంటూనే ఉన్నారు 'పద్మినికి చెప్పలేదు. తనేమన్నా అనుకుంటుందేమో! ' అని నేనే అన్నాను 'నేను చెప్తాలెండి. మీరు వెళ్ళండి' అని. సారీ నాకు పిల్లలతో అసలు కుదరలేదు రేపు వచ్చి చెప్పాలనుకున్నాను అని" మాట్లాడుతూనే టీ పెట్టుకుని తీసుకొచ్చింది.

"అలాగా! పోనీలే ఆ కాస్త వచ్చిన అవకాశం పోతే కష్టమేగా. మరి ఆఫీస్‌కి లీవుపెట్టడా ఏంటి?" అడిగింది వసంత టీ కప్పు అందుకుంటూ.

"పదిరోజులు జీతం నష్టం మీద లీవ్ పెట్టారు. ఆ సలహా కూడా చక్రధరంగారే ఇచ్చారు. పదిరోజులు షూటింగ్ ఉంటే రోజుకి పదిహేనువందలు వస్తుంది. ఈ మూడువేలు నీకేం లెక్క అని. ఏదో ధైర్యం చేసి వెళ్ళారు. అవకాశం వచ్చినపుడు మీనమేషాలు లెక్కపెడుతూ కూర్చుంటే మనం ముందుకుపోలేం వసంతా. కొంచెం చొరవచేయాలి."

వసంత పద్మిని మొహం వైపు ఓరగా చూసింది.

పద్మిని తలవంచుకుని టీ తాగుతోంది.

"పిల్లలేరి రజనీ?" అడిగింది ఖాళీకప్పు కిందపెట్టి.

"ట్యూషన్‌కి వెళ్ళారు పద్మినీ. నేను ఇంట్లోనే చెప్పచ్చు కానీ అసలు నా మాట వినరు. పైగా వాళ్ళకి ఆ లెక్కలవీ నేను చెప్పలేను. తెలుగు, ఇంగ్లీషు నేర్పగలను అంతే."

"అవునులే! మన చదువులకు మాములు చదువులేగా! " నిట్టూర్చింది పద్మిని.

యవనిక మొక్కలకి నీళ్ళు పోసి రెండు చేతుల్లో గులాబీపూలు తెంపుకుని వచ్చింది. "అయ్యో ఎందుకు తెంపావే?" అంది పద్మిని.

"ఎంత ముద్దొస్తున్నాయో చూడమ్మా!? " మురిసిపోతూ అంది యవని.

"అయినా పాపం అత్తయ్య కష్టపడి పెంచుకుని అందంకోసం అలాగే వదిలేస్తే నువ్వు తెంపచ్చా?"

"పోనీలే పద్మినీ. ఆడపిల్లలకి పూవుల్ని చూస్తే తెంపాలనే అనిపిస్తుంది. అందులోనూ గులాబీలు ఇలా ఇవ్వు. చక్కగా అన్ని దారంతో కట్టి ఇస్తాను. పెట్టుకుందువుగాని" అంటూ యవనిక చేతుల్లో పూలు తీసుకుంది రజని.

"ఇదిగో బజ్జీలు తిను!" అంటూ వసంత వాళ్ళు తిని యవనిక కోసం తీసి పెట్టిన బజ్జీలు ఇచ్చింది.

రజని లేచి వెళ్ళి దారం తీసుకొచ్చి, ఆ గులాబీలను చక్కగా మాలగా గుచ్చి యవనికకి ఇచ్చింది.

మరికాసేపు కూర్చుని కబుర్లు చెప్పుకుని రజనీని పిల్లల్ని తీసుకుని ఇంటికి రమ్మని ఆహ్వానించి బయలుదేరారు పద్మిని, వసంతా, యవనికా. రజని గుమ్మంలో నుంచుని చేయి ఊపింది.

దారిలో ఎవరూ ఏమీ మాట్లాడుకోలేదు పద్మిని, వసంతా ఆలోచిస్తూ నడవసాగారు.

ఇంటికి వెళ్ళిన పద్మిని తీవ్రంగా ఆలోచించసాగింది.

వసంతకి శివ నేరం చేసినట్టు ఎందుకు చెప్పినట్టు చక్రధరం. తనంతట తనే అవకాశం ఇచ్చినవాడు ఆ మాట చెప్పకుండా శివే అలా వెళ్ళినట్లు చెప్పాడు. రజని చెప్పినదాన్ని బట్టి శివ కరెక్టే అనిపిస్తోంది. రజని కూడా కరెక్టే అనిపిస్తోంది. ఏం జరిగింది? ఎలా వచ్చింది శివకి అవకాశం? ఇక్కడ ఈ మారుమూల పొన్నూరులో ఉన్న శివకి హైదరాబాదులో టీ.వి సీరియల్‌లో నటించే అవకాశం రావడం తమాషాకాదు. శివ అందగాడు కాదు, పెద్ద నటుడూ కాదు కేవలం ఔత్సాహికుడు. చిన్న, చిన్న పాత్రలు వేస్తూ వందో,

రెండొందలో వస్తుంటే తన జీతానికి మరికొంత ఆదాయం అని తృప్తిపడుతున్నవాడు. అతనికి పెద్ద, పెద్ద ఆశలు లేవు. గొప్ప నటుడిని అవాలన్న కోరికాలేదు తనకి తెలిసి. ఏమో అవకాశం వచ్చింది కాబట్టి ఉపయోగించుకోవాలనుకున్నాడా? అయినా ఒక్కమాట, ఒక్కమాట 'ఇలా ఉంది. వెళితే వెళ్తానేమో! ' పద్మినీ అని చూచాయగా చెప్పినా బాగుండేది.

ఉన్న ఒకేఒక్క ఆత్మీయుడు తనని నిర్లక్ష్యం చేసాడన్న ఊహ కొంచెం కష్టంగానే ఉంది పద్మినికి.

జీవితం అంటే ఇంతేనా? ఏ బంధాలూ జీవితం అంచుదాకా తోడురావా? తోబుట్టువులు లేని తను శివే తన తోబుట్టువు అనుకుంది. ఎందుకిలా చేశాడు?

అప్రయత్నంగానే పద్మిని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

వసంత ఆమె పక్కకి వచ్చి కూర్చుని అంది బాధపడుతున్నావా "అక్కా. రజని అన్నట్టు మనం మీన మేషాలు లెక్కపెడుతుంటూ కూర్చుంటే జీవితంలో ఎప్పుడూ ముందుకు పోలేమేమో. అంది వచ్చిన అవకాశం ఉపయోగించుకుంటూ ధైర్యంగా సాగిపోతేనే మనకి విజయం వరిస్తుంది. ఎంతకాలం ఇలా బతుకుతాము? నా మాట వినక్కా చక్రధరంగారిచ్చిన అవకాశం కాదనకు. "

వసంత స్వరంలో వినిపిస్తున్న అభ్యర్ధన వింటుంటే పద్మినికి ఎలాగో అనిపించింది. తన మూర్ఖత్వం, తన చాదస్తం, తన భయం ఈమెని కూడా ఎదగకుండా తొక్కేస్తున్నాయా? తను తప్పు చేస్తోందా? వసంత అయినా కనీసం ఎదగాలి. మంచి అవకాశాలు పొందుతూ ఆర్ధికంగా నిలదొక్కుకుని హాయిగా బతకాలి. ఏమో ఆమె ఆదృష్టం బాగుండే శివకి వచ్చినట్టు ఈమెకి సంపాదించి దోసిట్లో పోసేవాళ్ళెవరున్నారు.

దీర్ఘంగా నిట్టూరుస్తూ వసంత చెయ్యి తన చేతిలోకి తీసుకుని ఆమె మొహంలోకి ప్రశాంతంగా నవ్వి అంది "రేపే వెళ్ళి ఆయనకి చెప్పు మనం నటిస్తామని. "

వసంత కళ్ళు మెరిశాయి. "నిజంగానా?" అంది.

"నిజంగానే వసంతా! వెళ్దాం నటిద్దాం. అంతేకాదు ఇకనుంచీ ఏ సంస్థ వారు పిలిచినా ఏ ఊరు అయినా వెడదాం. వీలైతే ఒక్కసారి మనం కూడా హైదరాబాదు వెళ్ళి ప్రయత్నాలు చేసుకుందాం."

"హైదరాబాదా? ఎక్కడుంటాం వెళ్ళి? అసలు మనకేం తెలుసని? ఎలా వెళ్తాం?" విస్మయంగా అడిగింది వసంత.

"ధైర్యే సాహసే లక్ష్మి! అంత పెద్ద ఊరులో మనం ఉండడానికి చోటుండదా ఏం? ఎవరో మన ఆర్టిస్టులు ఉంటారుగా! వాళ్ళ దగ్గర నాలుగు రోజులు ఆశ్రయం దొరకదా ఏం? చూద్దాంలే యవనిక పరీక్షలైపోయి సెలవులు వచ్చాక వెడదాం."

వసంతకి చాలా ఆనందంగా అనిపించింది పద్మిని ఒప్పుకోడంతో.

ఒక సందర్భంలో ఆమె ఒప్పుకోకపోయినా తను చక్రధరం ఇచ్చిన అవకాశం ఉపయోగించుకోవాలనే అనుకుంది. పద్మినిని పందిరిగా చేసుకుని పైకి పాకడానికి ప్రయత్నిస్తున్నా కొద్దీ కిందకే జారుతోంది. పందిరి బలంగా ఉంటేనే కదా తీగ నిలబడేది.

మర్నాడు వసంత సాయంత్రం ఎప్పుడవుతుందా అని ఎదురుచూస్తూ గడిపేసింది. ఆలస్యం అయినకొద్దీ అతను వేరే వాళ్ళని తీసుకుంటే? భయం వేసింది వసంతకి. వసంత ఇప్పుడు పేదరికం అనుభవించి, అనుభవించి విసిగిపోయింది. ప్రతిపూటా వెతుక్కుంటూ బతకడంతో నలిగిపోయింది. ఆమెకిప్పుడు తను కూడా సంపాదించాలన్న కోరిక పుట్టింది. నిజానికి ఆ కోరిక పుట్టి చాలాకాలమైనా తీర్చుకునే మార్గం దొరక్క మనసులోనే అణగదొక్కి ఉంచింది. పద్మినిని కాదని వెళ్ళలేదు వెళితే భద్రం భయం, వెళ్ళకపోతే ఆమె సిద్ధాంతలతో జీవితం ఒడిదుడుకులతో సాగిపోతుండడం నచ్చడంలేదు. ఎటూ వెళ్ళలేక, ఒంటరిగా ఏమీ చేయలేక నిస్సహాయంగా ఉన్న

వసంత ఇప్పుడు చక్రధరం తనతోటే నేరుగా మాట్లాడి తనకే అవకాశాలు ఉన్నాయి ఉపయోగించుకోండి అని చెప్పడంతో ఎక్కడలేని ధైర్యం వచ్చినట్టు అయింది.

సాయంత్రం ఐదు అవుతుండగా "అక్కా! నేను వెళ్ళిరానా?" అంటూ పద్మిని దగ్గర అనుమతి తీసుకుని కమ్యూనిటీ హాలు వైపు బయలుదేరింది.

ఆమె వెళ్ళేసరికి గేటు దగ్గరికే ముక్కుపటాలను అదరగొడుతూ అతని సిగరెట్ వాసన రావడంతో ముక్కుకి చెంగు అడ్డుపెట్టుకుని లోపలికి నడిచింది.

ఆమెని ఇబ్బంది పడడం చూసి "అయ్యో సిగరెట్ వాసన నీకు పడదేమో పారేస్తాలే" అంటూ వెనక్కి తిరిగి కిటికీలోంచి బైటకి విసిరేసాడు. తిరిగి ఆమె వైపు చూసి చిరునవ్వుతో అడిగాడు. "ఏమంది మీ అక్క.. చెప్పావా?

"అక్క ఒప్పుకుంది. తప్పకుండా చేద్దాం" అంది.

అతని పెదాలమీద చిరునవ్వు విరిసింది. "ఒప్పుకోక ఏం చేస్తుంది? తిండికి వెతుక్కునే పరిస్థితి వస్తే అదే ఒప్పుకుంటుంది" అనుకున్నాడు మనసులో.

"అలాగా! చాలా సంతోషం వసంతా! ఇప్పటికైనా నన్ను అర్థం చేసుకున్నారు మీరు. ఏంటో మీ ఇద్దరూ నా ఆత్మీయుల్లా అనిపిస్తారు. మీరు రాకపోతే ఏదోకోల్పోయినట్టు చాలా బాధగా అనిపిస్తుండేది. మనది ఒక కుటుంబం వసంతా. ఈ కుటుంబంలో ఎవరు లేకపోయినా ఏదో వెలితి. " అతని స్వరంలో వినిపిస్తున్న బాధ వసంతకి ఎలాగో అనిపించింది. పాపం ఇతను మంచివాడే మేమే అపార్ధం చేసుకున్నాం అనుకుంది.

"ఆ సరే! రిహార్సల్స్ త్వరలో మొదలుపెడదాం. అన్నట్టు ఇకనుంచీ మీరు రిహార్సల్స్‌కి ఇక్కడికి రానవసరంలేదు. చుట్టుపక్కలా చాలా అసహ్యంగా ఉంది. మొత్తం గోడలవీ నానిపోయి ఉన్నాయి. దోమలు, చాలా ఛండాలంగా ఉంది. అందుకే మా ఇంట్లోనే మేడమీద ఒక పెద్ద గది వేయించాను. అక్కడ రిహార్సల్స్ చేద్దాం."

"హమ్మయ్య!" అనుకుంది వసంత. నిజంగానే అతనన్నట్టు ఇక్కడ అడుగుపెట్టాలన్నా రోతగా ఉంది. ఒక్క గదిలో ఉన్నా, గది పెరడూ, వాకిలీ ఎంతో పరిశుభ్రంగా ఉంచుతుంది పద్మిని. వాకిలి ముందు ముగ్గులేకుండా ఎప్పుడూ ఉండదు. అలాంటి చోట ఉంటూ ఇక్కడ గంటలు, గంటలు రిహార్సల్స్ పేరుతో గడపడం నరకమే. ఇప్పుడు అతనింట్లో రిహార్సల్స్ అనగానే ప్రాణం లేచొచ్చినట్టు అనిపించింది.

"టీ తాగుతావా? వసంతా! " అడిగాడు ఆప్యాయంగా.

"ఒద్దండి ఇంట్లో తాగి వచ్చాను" అంది.

"ఎలా గడుస్తోంది మీకు పాపం?" జాలిగా అడిగాడు.

"అక్క కొందరు పిల్లలకి ట్యూషన్లు చెపుతోంది. "

"ట్యూషన్లా? తను చెప్పగలదా? " అడిగాడు.

"తెలుగు పాఠాలు చెబుతోంది. "

"ఓ అలాగా! ఎంత వస్తుందేంటి? "

"ఫర్వాలేదండి.. ఏదో మాకు తిండికి సరిపోతోంది."



కౌముది

"ఏంటో! మీ అక్కకి పంతం ఎక్కువ. పరిస్థితులు అర్థం చేసుకోదు. ఆవేశం ఎక్కువ. సరేలే ఇప్పటికైనా మారింది అంతే చాలు. ఆ అన్నట్టు" అంటూ జేబులోంచి పర్స్ తీసి రెండొందలు తీసి ఇస్తూ " ఖర్చులకి ఉంచండి అడ్వాన్స్‌గా. " అన్నాడు.

వసంత తీసుకోవాలా వద్దా అన్నట్టు చూస్తూ "ఇది అడ్వాన్సా సార్?" అంది.

"అవును అడ్వాన్సే. ఊరికే ఎందుకిస్తాను?" అన్నాడు ఆమె చెయ్యి అందుకుని చేతిలో పెడుతూ.

వసంత అవి తీసి రుమాలులో కట్టి దాచింది.

లేచి నిలబడి "వస్తానండీ!" అంది.

"సరే నేను చెప్తాలే! మూడు రోజుల్లో పెట్టుకుందాం. రాజుతో కబురు చేస్తాను" అన్నాడు.

"అలాగే! " అంది వసంత.

తరువాత అతని దగ్గర సెలవు తీసుకుని బయలుదేరింది.

చక్రధరం ఆమె వెళ్తున్న వైపు చూస్తూ జేబులోంచి సిగరెట్ పెట్టె తీసి అందులోంచి ఒక సిగరెట్ తీసి నోట్లో పెట్టుకుని పెట్టె జేబులో పెట్టుకున్నాడు. లైటర్‌తో వెలిగించుకుంటూ "ఈ చక్రధరంలో కొత్త రూపాన్ని చూస్తారు.. మీరింక" అనుకున్నాడు.

**వసంత వెలిగిపోతున్న మొహంతో వచ్చి** తన చేతిలో రెండు వందలు పెట్టడంతో ఆశ్చర్యంగా చూసింది పద్మిని.

"ఎక్కడివి వసంతా ఈ డబ్బులు? " అడిగింది.

"అక్కా! నువ్వు చక్రధరంగారిని అపార్థం చేసుకున్నావు. ఎంత మంచివారో తెలుసా ఆయన.. నువ్వు పలకడంలేదని చాలా బాధపడ్డారు. అయినా అవన్నీ మనసులో పెట్టుకోకుండా నాకు అడ్వాన్స్‌గా ఈ డబ్బులిచ్చారు. " ఉత్సాహంగా చెబుతున్న వసంత వైపు వెర్రిదాన్ని చూసినట్టు చూసి తిరిగి ఆ డబ్బు ఆమె చేతిలో పెట్టి అంది పద్మిని.

"ఆయన ఇన్నేళ్ళలో ఎప్పుడూ ఇవ్వడం నేనెరగను. మరి ఇవాళెందుకు ఇవ్వాలనిపించిందో నా కర్థం కావడంలేదు వసంతా. "

ఆ మాటలు వసంత ఉత్సాహం మీద నీళ్ళు చల్లినట్టు అయింది. మొహం మాడ్చుకుని అంది

"నీకు అనుమానాలు చాలా ఎక్కువ. అందుకే ఆ శివరాంని తప్ప ఎవర్ని నమ్మవు. నమ్మినందుకు ఏం ఉద్ధరించాడు? తనకి టీవి సీరియల్స్‌లో అవకాశాలు వచ్చాయని చెప్పి వెళ్ళాడా? ఒక్క ముక్క చెప్పలేదు. మన శ్రేయోభిలాషి, మన మంచి కోరుకునే వ్యక్తి చక్రధరం గారు, మనం ఎంత కాదనుకున్నా సాయం చేయాలని, మనల్ని ఆదుకోవాలని చూస్తున్నారు. అలాంటి వ్యక్తితో ఎందుకక్కా మనకి ఈ పంతాలు, పట్టింపులు? తెల్లారి లేచిన దగ్గర్నించీ తిండికి వెతుక్కునే మనకి ఆత్మాభిమానాలు, గోంగూరా దేనికిట? వెనకటికెవరో పిలిచి పిల్లనిస్తానంటే ఏదో అన్నారట. అలా ఉంది నీ వరస. ఆయన పిలిచి వేషాలిస్తూ, పైగా అడ్వాన్స్ కూడా ఇస్తే అందులో అనుమానించడానికి ఏం ఉందని? నేనింక ఈ ఉపవాసాలు, ఈ బాధలు పడలేనక్కా! నీకు నచ్చి నువ్వు కూడా నటిస్తే నటించు. లేదంటే నేను ఒక్కదాన్నే ఆయన సమాజంలో నాటకాలు వేస్తాను. నేనింక ఈ త్యాగాలు కూడా చేయలేను నన్ను క్షమించు" అంటూ అక్కడినుంచి వడి, వడిగా పెరట్లోకి వెళ్ళిపోయింది వసంత.

పద్మిని ఆమె మాటలకి నిర్ఘాంతపోయింది.

వసంత ఎదురు తిరుగుతోంది. ఇదంతా చక్రధరం ప్రభావం. అతను వసంతని ఆయుధంగా చేసుకుని తన మీద పగ తీర్చుకోడానికి ప్రయత్నిస్తున్నాడని తనకి తెలుసు. అయినా వసంతకోసం అతని నాటకాల్లో నటించడానికి ఒప్పుకుంది. అతనితో పనిచేయడం అంటే కత్తిమీద సాము. అయినా తన జీవితానుభవంలో ఎవరితో ఎలా మసులుకోవాలో బాగా నేర్చుకుంది. ఆవేశమో, ఆవేదనో అతన్ని విడిపోయి వచ్చింది. మళ్ళీ వెళ్ళాలని ఏనాడూ అనుకోలేదు.

ఇవాళ మళ్ళీ అతని ముంగిట్లో అడుగుపెట్టాలంటే ఎంత నరకయాతన పడుతోందో తనకి తెలుసు. వసంతకి తెలిసింది ఒకటే – ఈ ఆర్థికబాధల్నించి విముక్తి లభించాలంటే అది చక్రధరం సంస్థలో పనిచేయడంతో మాత్రమే సాధ్యం. పద్మిని స్థాపించిన మహిళా రంగస్థల వేదిక ఎంతవరకు న్యాయం అనేది ఎవరూ అర్థం చేసుకోరు. చక్రధరం చిన్న, చిన్న మొక్కలు ఎదగడానికి అడ్డుపడ్డే ఓ పెద్ద వృక్షం.. ఆ వృక్షం విస్తరించిన మేరా ఏ మొక్కా ఎదగదు.

పద్మినికి వసంత రేపిన దుమారంతో పిచ్చిపడుతున్నట్టుగా అనిపించింది. చక్రధరం వసంతని ఇంతగా ప్రభావితం చేస్తాడని ఎన్నడూ అనుకోలేదు. అతను ప్రభావితం చేసేంతగా ఈమె అతని సమక్షంలో సమయం ఎప్పుడు గడుపుతోంది? కలుసుకుని మాట్లాడుకున్న కొద్ది నిమిషాలకే ఇంతగా ఆమెని తనవైపు తిప్పుకోగలిగాడా? లేక ఆర్థిక బాధలు తట్టుకోలేక, చిన్న చిన్న కోరికలు కూడా తీర్చుకోలేక జీవితంతో పోరాడుతున్న వసంత ఇంక సహనం కోల్పోతోందా? అతను చూపించే మార్గంలో నడిస్తే జీవితం సాఫీగా ఉంటుందని భావిస్తోందా?

తను అతని సమాజంలో మళ్ళీ మామూలుగా నాటకాలు వేయడానికి అంగీకరించిందంటే తను తెలివితక్కువగానో ఏదో ఆశతోటో, అతన్ని నమ్మోకాదు.. వసంతలో విసుగు, అసహనం ఎక్కువైపోతున్నాయని గ్రహించింది. ఎంతకాలం తనతో పాటు ఆమె పస్తులుంటుందన్న సానుభూతితో కేవలం ఆమె కోసమే ఒప్పుకుంది. ఎందుకు వసంత ఎదురు తిరుగుతోంది? ఎందుకు? వసంతని ఎప్పుడూ తను పరాయిగా భావించలేదు. స్వంత చెల్లెల్లాగే చూసుకుంది.

పద్మినికి దుఃఖంతో గుండె బరువెక్కింది. చెక్కిళ్ళ మీద కారుతున్న కన్నీళ్ళు తుడుచుకుంటూ అనుకుంది.

నిజమే ఎంతకాలం భరించగలదు. తనలాంటి చేతగాని వాళ్ళ పంచెన పడి ఉంటే తనూ ఎదగదు ఆమెనీ ఎదగనివ్వదు. వసంత ఎదగాలి. తను ఎంచుకున్న ఈ రంగంలో ఉన్నతిని పొందాలి మంచి, మంచి వేషాలు పొంది మంచి నటిగా గుర్తింపబడాలి. ఆమెకి కూడా టి.వీ సీరియల్స్‌లో నటించే అవకాశాలు రావాలి. అవును వసంత బాగుండాలి. వసంత ఎదగాలంటే తన నీడ ఆమె ఎదుగుదలకి అడ్డం కాకూడదు. అలాగని ఆమెకి ఏదన్నా నష్టం జరిగినా, కష్టం కలిగినా తను భరించలేదు. అందుకే ఆమెని కాపాడడం కోసం అయినా తను చక్రధరంతో గొడవపడకుండా సామరస్యంగా ఉంటూనే తన గమ్యం తను వెతుక్కోవాలి తప్పదు.

పద్మిని వసంత కోసం చూసింది.. పెరట్లో జామచెట్టు కింద కూర్చుని ఇసకలో గీతలు గీస్తోంది.

పద్మిని ఆమె దగ్గరగా నడిచి మృదువుగా పిలిచింది ''వసంతా.!''

కళ్ళెత్తి చూసింది వసంత.

పద్మిని చేతులు చాచింది దగ్గరకు రమ్మన్నట్టు.

ఆమె అలా చేతులు చాచగానే వసంతకి ఏడుపొచ్చింది గభాల్న లేచి ఆమె చేతుల్లో వాలిపోయి, ఆమె భుజం మీద తలపెట్టుకుని ఏడుస్తూ అంది ''నేనింక ఈ ఆకలిని భరించలేనక్కా. నాకూ నలభైఏళ్ళు వచ్చేసాయి. ఎంతకాలం ఇలా చినిగిన చీరలు కట్టుకుని బతకను. ఎంతకాలం పచ్చడితో అన్నం తినగలను. ఎంతకాలం ఇడ్లీ, దోశ, గారెలు మానేసి మరమరాలతో బతకను. నావల్లకాదక్కా. నాకు

కోరికలున్నాయి. మంచి చీరలు కట్టుకోవాలని, మెడలో కనీసం ఒంటిపేట బంగారు గొలుసు వేసుకోవాలని, రంగు, రంగుల గాజులు తొడుక్కుని ఫ్యాషన్‌గా ఉండాలని కానీ, ఇంకా పదేళ్ళు పోతే ఉండగలమా చెప్పు. "

ఆ మాటలు కొరడాతో కొట్టినట్టుగా తగిలాయి పద్మినికి.

"ఇన్నేళ్ళనుంచీ నీతో ఉంటున్నాను నువ్వు నాకేం చేసావు? " అని నిలదీస్తున్నట్టుగా అనిపించింది. "ఏదో ఉద్ధరిస్తావనుకున్నాను నీకే బతకడం చేతకావడంలేదు నన్నేం బతికిస్తావు? " అని హేళన చేస్తున్నట్టుగా అనిపించింది.

వణికే స్వరంతో అంది "అయామ్ సారీ వసంతా. నన్ను క్షమించు. నిజమే నీకు నేనేమీ చేయలేకపోయాను. చేతకానిదాన్ని. నాతోపాటు నిన్ను కూడా పస్తులుంచే హక్కు నాకులేదు. తప్పకుండా చక్రధరంగారి సంస్థలో పనిచేద్దాం. తీసుకో అడ్వాన్స్ తీసుకో నా మాటలు పట్టించుకోకు. "

ఆ మాటలు వసంతకి బాధగానే అనిపించినా ఈ మాత్రం తను గట్టిగా ఉండకపోతే పద్మిని అలా భీష్మించుకు కూర్చుంటుందని ఏం మాట్లాడలేదు. మౌనంగా ఉండిపోయింది.

పద్మిని కళ్ళు తుడుచుకుంటూ అంది. "పద భోంచేద్దాం.. బాగా పొద్దుపోయింది. "

"అలాగే.. "

వసంత, పద్మిని లోపలికి నడుస్తుండగా యవనిక అప్పుడే స్కూల్ నుంచి వచ్చింది.

"అప్పుడే వచ్చావేంటే? " అడిగింది పద్మిని.

"అప్పుడే ఏంటమ్మా.. స్కూలు అయిపోయాకే వచ్చాను. నాలుగవుతోంది."

ఆ మాటకి ఆశ్చర్యంగా ఒకరినొకరు చూసుకున్నారు వసంతా, పద్మిని. నాలుగవుతున్నా ఇద్దరిలో ఎవరికీ ఆకలి అనిపించలేదంటే ఎవరి మనసులో వారు, వారి ఆలోచనలతో బాధపడుతూ ఉండిపోయారు.

"సరేలే కాళ్ళూ, చేతులు కడుక్కురా.. మాతోపాటు నువ్వు కూడా కాస్త అన్నం తిందువుగాని" అంది.

"నాకు అన్నం వద్దు. ఇంకేదన్నా పెట్టు తింటానికి" మొండిగా అంది యవనిక.

పద్మిని వసంత వైపు చూసింది.

"సరేలే మేము అన్నాలు తిన్నాక నీకు జిలేబీ కొనిపెడతాలే" అంది వసంత.

"ఏం మీరెందుకు ఇంకా తినలేదు? " ఆశ్చర్యంగా చూసింది యవనిక.

"ఏదో పని చేసుకుంటున్నాంలే" అంటూ మాట దాటేసింది పద్మిని.

మూడురోజుల తరువాత చక్రధరం నుంచి పిలుపు వచ్చింది, ఇద్దర్నీ రమ్మని, సాయంత్రం రిహార్సల్స్ ఉందని.

పద్మిని గుండె గుభేలుమంది. ఒప్పుకుందేకానీ, అతని ఎదురుపడాలంటేనే భయంగా ఉంది. తనని తప్పకుండా అవమానిస్తాడు. "నన్ను కాదని గొప్పగా సంస్థ పెట్టావు.. ఏమైంది? " అని హేళన చేస్తాడు. "నేనేగతి నీకు.." అని చులకనగా చూస్తాడు. తప్పకుండా అలాగే ప్రవర్తిస్తాడు. ఎలా అతనితో మాట్లాడడం? ఎలా అతనికి ఎదురుపడడం? ఒకసారి కాదని వచ్చాక మళ్ళీ, అంత పంచ చేరడం అంటే ఆత్మాభిమానం చంపుకోవడమే. ఇంతకన్నా ఆత్మహత్య చేసుకుని చచ్చిపోతే గౌరవంగా ఉంటుందేమో. వెళ్ళలేను నేను. అనుకుంది కానీ, తనకున్న వాటిలోనే మంచి చీర కట్టుకుని రెడీ అయి "వెళ్దామా అక్కా.." అంటూ వచ్చిన వసంతని చూసాక తప్పనిసరిగా వెళ్ళాలని అర్థమైపోయింది.

బలవంతంగా అడుగు బైట పెట్టింది.

ఇద్దరూ నడుస్తున్నా పద్మిని ఆలోచనల బరువుతో అడుగులు నెమ్మదిగా వేయసాగింది. వసంత ఉత్సాహంగా ముందు కెళ్ళిపోతోంది.

రోడ్లు రద్దీగా ఉన్నాయి. కార్లు, ఆటోలు, స్కూటర్లు ఇదివరకు కన్నా బాగా ఎక్కువైనాయి. జనంకూడా ఎక్కువైనట్టు అనిపిస్తోంది.

రోడ్డు దాటాల్సి రావడంతో వసంత ఆగి వెనక్కి తిరిగి చూసింది. తనకి పది అడుగుల దూరంలో నడిచి వస్తోంది పద్మిని. ఆమె దగ్గరవుతుండగా ఒక మోటార్ సైకిల్ దూకుడుగా వచ్చి ఇద్దరికీ మధ్యలో ఆగింది. కొంచెంలో ఆ బండి తగిలి పద్మిని పడిపోయేది. నిలదొక్కుకుంటూ కోపంగా చూడబోయిన పద్మిని ఒక్కసారిగా ఆశ్చర్యపోయింది.

ఎప్పుడూ అతి సాధారణమైన పైజమా, లాల్చీలో నడుస్తూ వచ్చే శివరామ్, ఖరీదైన ప్యాంటు షర్టులో, మోటార్ సైకిల్ మీద రావడంతో ఆమెకి కళ్ళుబైర్లు కమ్మినట్టు అయింది. నగర జీవనం రుచి చూసిన మత్తులో కొత్తగా, వింతగా ఉన్నాడు.

"హలో పద్మినీ.. ఏంటి ఎక్కడికి వెళ్తున్నావు? వసంత కూడా వస్తోంది ఎక్కడికేంటి? " వసంతవైపు చూస్తూ అడిగాడు.

పద్మిని సమాధానం చెప్పకుండా అతనివైపు చూసింది. ఒక కాలు కిందపెట్టి బండి మీదనుంచి దిగకుండానే షోగ్గా నిలబడి, కొత్తరకంగా మాట్లాడుతున్నాడు.

"మా సంగతి సరే నువ్వెక్కడికి వెళ్ళావు చెప్పా, చేయకుండా. ఈ వేషం ఏంటి? " అడిగింది.

శివరావ్ నవ్వాడు "నీకు తెలియదా నేనెక్కడికి వెళ్ళానో! సరేలే మీరిద్దరూ ఇంటికి వెళ్ళండి. నేను వెనకాల వస్తాను. నాకు తెలుసు మీరిద్దరూ ఇప్పుడు రిహార్సల్స్‌కి చక్రధరంగారింటికి బయలుదేరారని."

వింతగా చూసింది పద్మిని "అలాంటప్పుడు ఎక్కడికి అని ఎందుకు అడిగావు.?"

"చెప్తాగా మీరిద్దరూ రిహార్సల్స్‌కి వెళ్ళనవసరం లేదు. ఇంటికి వెళ్ళండి."

వసంత, పద్మిని ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

అతన్ని ఏమి ప్రశ్నించకుండా ఇద్దరూ వెనక్కి తిరిగారు.

వాళ్ళు కొంచెం ముందుకు వెళ్ళాక బండి స్టార్ట్ చేశాడు శివరామ్.

ఇంటికి వెళ్ళి తాళం తీసేసరికి వెనకాలే ఉన్నాడు శివరామ్. "రా లోపలికి" అంటూ ఇద్దరూ లోపలికి దారితీశారు.

స్టూలు జరుపుకుని కూర్చుంటూ అడిగాడు "యువని ఎలా ఉంది? "

"అందరం బాగానే ఉన్నాం కానీ నీ సంగతి చెప్పు. ఎప్పుడొచ్చావు. హైదరాబాదునుంచి? ఎన్ని సీరియల్స్‌లో వేశావు బాగానే సంపాదించినట్టున్నావు. "

నవ్వాడు "నేను హైదరాబాదు వెళ్ళిన మాట నిజం. అందుకు కారకుడు చక్రధరంగారన్నది నిజం. నేను సీరియల్స్‌లో నటించాను. కానీ, అది మాత్రం చక్రధరం పరపతిద్వారా కాదు. నా స్వశక్తితో వేషాలు సంపాదించుకున్నాను. "

విప్పారిన నేత్రాలతో ఆశ్చర్యంగా చూస్తూ వింటున్న పద్మిని, వసంతని చూస్తూ అన్నాడు శివ.

"చక్రధరంగారు చాలా పెద్ద ప్లాన్ వేశారు పద్మిని.. ఆయన భార్య వెళ్ళిపోడంతో ఒంటరివాడైనాడు, దాంతో అతనిలో శాడిజం ఇంకా పెరిగింది. నీకు ఆప్తులైన నన్ను, వసంతని నెమ్మదిగా తప్పించి దూరం పంపించి నిన్ను ఒంటరిదాన్ని చేసి ఎలాగైనా పెళ్ళిచేసుకోవాలని అతని ప్లాన్. ఇది తెలియక అతను టీ.వి సీరియల్‌లో అవకాశం ఉందని చెప్పగానే పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయాను. తీరా ఆ మహానగరానికి వెళ్ళాక తెలిసింది అతని ప్లాన్‌లో భాగంగా నన్ను హైదరాబాదు పంపించాడని. అక్కడ నాకు ఉండడానికి

చోటులేదు, ఎవరూ తెలిసినవాళ్ళు, బంధువులు లేరు. ఎటువెళ్ళాలో, ఏం చేయాలో తెలియని అయోమయస్థితి. నన్ను పికప్ చేసుకోడానికి ఎవరో వస్తారని నన్ను వాళ్ళతో తీసుకుని వెళ్ళి ఆశ్రయం ఇస్తారని చెప్పాడాయన. నమ్మాను కానీ, రైలు దిగి స్టేషన్‌లో దాదాపు గంటసేపు ఎదురుచూసాను. ఎంత టెన్షన్ పడ్డానో నాకే తెలియదు. ఆ దేవుడు దయతల్చినట్టు నాతో పాటు ప్రయాణం చేసిన ఒక కుర్రాడు కూడా నాలాగా సినిమాల్లో వేషాలకోసం హైదరాబాదు వచ్చాడు. మా ఇద్దరికీ స్నేహం కుదిరింది రైల్లో. అతనికీ నాకులాగే అంతా కొత్త, మనుషులు కొత్త, భాష కొత్త, పరిసరాలు కొత్త, వాతావరణం కొత్త. ధైర్యం కూడదీసుకుని ఇద్దరం కలిసి స్టేషన్ బైటకొచ్చి వాళ్ళనీ, వీళ్ళనీ వాకబు చేస్తూ నాంపల్లి అనే చోట ఒక లాడ్జిలో రూమ్ తీసుకున్నా, అక్కడినుంచి టీ.వి స్టూడియోలు తిరగని చోటు లేదు. అలా పదిహేను రోజులు గడిచాక మా ఇద్దరికీ చిన్న వేషం దొరికింది ఒక మెగా సీరియల్‌లో. "

"మెగా సీరియల్ అంటే? " వసంత అడిగింది కుతూహలంగా.

"అంటే మనం పుట్టినప్పుడు మొదలై చచ్చిందాకా సాగే సీరియల్ అని అర్ధం."

"అదేంటి? " అతని మాటలు అర్ధంకాక పద్మినివైపు చూసింది.

"అదంతేలే తరువాత చెపుతాను" అంటూ తిరిగి చెప్పడం ప్రారంభించాడు. "మా ఇద్దరి పాత్ర రెండు ఎపిసోడ్‌లలో వస్తుంది. ఒక ఎపిసోడ్‌కి ఐదు వందల చొప్పున ఇచ్చారు వెయ్యిరూపాయలు. మనం మూడు నాటకాలాడితే వచ్చే డబ్బు. నాకు ఉత్సాహం పెరిగింది. ఇందులో నేనెలాగైనా సెటిల్ అయిపోవాలని నిర్ణయించుకున్నాను. ఇంక మా ఇద్దరి మకాం స్టూడియోల్లోనే అయింది. ఆ పనీ, ఈ పనీ చేస్తూ వాళ్ళనీ, వీళ్ళనీ మంచి చేసుకుంటూ నెమ్మదిగా వేషాలు సంపాదిచుకున్నాం ఆ దేవుడి దయవల్ల, ఈ చక్రధరం దయవల్ల కూడా నేనిప్పుడు బాగా సెటిల్ అయ్యాను పద్మినీ. రజనీని, పిల్లల్ని తీసుకుని హైదరాబాద్ వెళ్ళిపోతున్నాను. నామీద నమ్మకం ఉంటే మీరిద్దరూ నాతోపాటు రండి. కొంతకాలం మాతో ఉండి ప్రయత్నాలు చేద్దాం. తప్పకుండా ఏదో ఒక పాత్ర లభిస్తుంది. కొంత సహనంగా ఎదురుచూడాలి అంతే. మీరు ఆడవాళ్ళు కాబట్టి మాలాగా అలా స్టూడియోల చుట్టూ తిరగలేరు.. నాకు తెలుసు. మీకా ఇబ్బంది లేకుండా నేనే మీకోసం ప్రయత్నాలు చేస్తుంటాను. రోజూ ఏదో ఒక కొత్త సీరియల్ ప్లాన్ చేస్తూనే ఉంటారు. మీ ఇద్దరికీ కూడా తప్పకుండా వేషాలు దొరుకుతాయని నా నమ్మకం."

శివరామ్ చెప్పడం ముగించాడు.

పద్మిని నిశ్చలంగా కూర్చుని ఎటో చూస్తోంది. వసంత పద్మిని స్పందన కోసం ఉద్విగ్నంగా చూసింది. "ఏం మాట్లడదేం ఈమె ఇందులో కూడా ఆలోచించడానికి ఏం ఉంది? ఇక్కడ కూడా అనుమానాలా? " విసుగ్గా అనుకుంది. ఆమెకైతే వెంటనే పెట్టే బేడా సర్దేసుకోవాలనిపిస్తోంది. నెలకి ఓ పది ఎపిసోడ్‌లు వచ్చినా ఈ జీవితాలు బాగుపడతాయి కదా ఎందుకింకా ఆలోచిస్తుంది ఈవిడ అన్నట్టు చూడసాగింది.

"మాట్లాడవేం పద్మినీ?" అడిగాడు శివరామ్.

దీర్ఘంగా శ్వాస తీసుకుని తల ఊపుతూ అంది "బాగానే ఉంది శివా నువ్వు చెప్పింది. కానీ, యవనిక చదువు మధ్యలో ఆపి ఎక్కడికి వెళ్తాం?"

"ఆ ఇక్కడి చదువేం చదువు పద్మినీ. అక్కడ మంచి స్కూల్స్ ఉన్నాయి. చక్కగా పట్నంలో చదువుకుని మంచి ఉద్యోగం సంపాదించుకుంటుంది. ఈ పల్లెటూళ్ళో ఏముంది మనకేం ఇక్కడ బంధువులా? ఏమన్నానా? " తేలిగ్గా అన్నాడు శివ.

వసంత వైపు చూసి అడిగాడు. "నీకేం చెప్పాడు చక్రధరం?"

"ఏం లేదు మీ అక్క నన్ను అపార్థం చేసుకుంది నేను మీ శ్రేయోభిలాషిని. మళ్ళీ మీరు నా సమాజం ద్వారా నాటకాలాడండి అంటూ రెండొందలు అడ్వాన్స్ కూడా ఇచ్చారు" కళ్ళు తిప్పుతూ చెప్పింది వసంత.

"దొంగవెధవ. నిన్ను డబ్బాశతో తిప్పుకుని పద్మిని మీద కక్షసాధించాలని ఆయన ప్లాన్. నాకిదంతా రాజు చెప్పాడు. అన్నట్టు చెప్పడం మర్చిపోయా వాడుకూడా వచ్చాడు హైదరాబాదు నాతోటే ఉంటున్నాడు. "

పద్మిని కళ్ళెత్తి "అవునా? " అన్నట్టు చూసింది.

వసంత పద్మిని దగ్గరగా జరిగి ఆశగా అంది "ఏమంటావక్కా? శివ ఎంతో నమ్మకంగా చెబుతున్నాడు. మనం కూడా వెళ్ళిపోదామక్కా ప్లీజ్! కనీసం ఇదన్నా ఒప్పుకో. "

పద్మిని ఆమె వైపు చూసి ప్రేమగా నవ్వింది. "వెడదాం వసంతా! ఈ విషయంలో సందేహించడానికి ఏమీ లేదు ఒక యవని చదువు తప్ప. అది కూడా శివ ఇబ్బందిలేకుండా సాగుతుందని అంటున్నాడు కాబట్టి వెడదాం అంది. "

వసంత కళ్ళు మెరిశాయి.

శివ ఆమె ఒప్పుకున్నందుకు ఆనందపడుతూ అన్నాడు. "అయితే ఇవాళ సామాను సర్దేయండి. రేపురాత్రి బస్సులో వెళ్ళిపోదాం. ఈ మంచం ఎలాగూ పాడైపోయింది, ఆ బీరువా కూడా అంతా రంగు వెలిసి పెచ్చులూడింది. ఈ రెండు ఇక్కడే వదిలేసి మిగతా సామాను ప్యాక్ చేసుకుంటే బస్సులో పెట్టేసుకోవచ్చు. "

వసంత ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బు అవుతూ "అయితే నేను సర్దేస్తాను సామానంతా. మరి చక్రధరం గారికి చెప్పొద్దా.!? "

"ఇంకా నయం!" కంగారుగా అన్నాడు శివ.

"వెర్రిదానిలా వెళ్ళి ఆయనకు మేమిలా హైదరాబాదు వెళ్తున్నాం అని చెప్తావా ఏం? అలాంటి పని చేయకు. ఆ దరిద్రుడు మిమ్మల్ని బస్‌స్టాండ్ దాకా కూడా రానివ్వడు. సైలెంట్‌గా వెళ్ళిపోదాం. ఎవరికీ ఏమీ చెప్పద్దు సరేనా? "

పద్మిని అంది "అవును శివా! నువ్వు చెప్పింది అక్షరాలా సత్యం. ఆయనకి ఈ విషయం గానీ తెలిసిందంటే కల్లు తాగిన కోతి అవుతాడు. తర తరాలు తిడతాడు. అసలు ఆయనకి చెప్పొద్దు. వసంతా ఆయనకి ఎలాంటి అనుమానం వచ్చి ఇంటికి నేరుగా వచ్చేయకుండా నువ్వెళ్ళి నేను కాలుజారిపడ్డానని, వారం దాకా రాలేనని చెప్పు వారం తరువాత రిహార్సల్స్ పెట్టుకుంటే వస్తానని చెప్పు. "

"అవును చెప్పాలి. లేకపోతే నేరుగా ఇంటికే వచ్చేయగలడు. పైగా డబ్బులు కూడా ఇచ్చాడు" అంది వసంత.

"వెళ్ళిరా! పొరపాటున కూడా నోరు జారకు ఎవరికీ చెప్పకు. " హెచ్చరించాడు శివ.

"చెప్పనులే శివా. ముందు వెళ్ళి ఆయనకి చెప్పేసి వస్తాను" అంటూ బయలుదేరి వెళ్ళిపోయింది వసంత.

ఆమె వెళ్ళిన వైపు చూసి నిట్టూరుస్తూ అంది పద్మిని.

"వసంత ఎదురు తిరుగుతోంది శివా.! తనూ ఈ దారిద్ర్యం విసిగిపోయింది. తనని తప్పుపట్టలేను. మనిషి అయిన ప్రతివాళ్ళకీ సుఖంగా బతకాలని ఉంటుంది. కానీ ఈ అమాయకురాలు ఈ రంగంలో ఎలా బతుకుతుందో అని భయం. మాట్లాడడం రాదు, అందర్నీ నమ్మేస్తుంది. ఇంకా తనూ చిన్నది కాబట్టి నాకు భయం. శివా! ఎవరన్నా రెండో పెళ్ళి వాళ్ళుంటే చూడు.. వసంతకి పెళ్ళి చేద్దాం. నేనూ ఎంతోకాలం తనని నా దగ్గర ఉంచుకోలేను. తనకీ నా పంచన ఉండడం అంతగా ఇష్టం కూడా ఉండదు. ఎవరికైనా తన అనే ఇల్లూ, వాకిలీ కావాలని ఉంటుంది కదా. "

శివ ఆమె వైపు అభినందనగా చూశాడు. "నీ ఆలోచన చాలాబాగుంది పద్మినీ!. తప్పకుండా చూద్దాం."

పద్మిని లేచి వెళ్ళి టీ తీసుకొచ్చింది. శివ టీ తాగి బయలుదేరి వెళుతూ "రెడీగా ఉండండి రేపు రాత్రి ప్రయాణానికి" అని చెప్పి వెళ్ళిపోయాడు.

పద్మిని ఆలోచిస్తూ అలా మంచం మీద పడుకుండిపోయింది.

శివ అరచేతిలో స్వర్గం చూపించడం లేదు. వాస్తవాలు చెప్పాడు. ప్రయత్నం చెయ్యాలి అంటున్నాడు. అవును ప్రయత్నం చేయకుండా ఏం లభిస్తుంది.

ఇక్కడ కూర్చుని అలా జరిగితే బాగుండు ఇది చేస్తే బాగుండు అనుకుంటూ గాలిలో మేఘాలు సృష్టిస్తూ ఉంటే ఏమీ జరగడంలేదు. ధైర్యే సాహసే లక్ష్మి అన్నారు పెద్దలు. సాహసం చేయాలి. కృషి, పట్టుదల, ధైర్యం ఉంటే ఆ మహాలక్ష్మి తనంతట తనే వలచివస్తుంది అంటారు పెద్దలు. అవును కృషిచేయాలి. నాలుగు డబ్బులు సంపాదించుకున్నాక తన సంస్థ గురించి ఆలోచించాలి. అక్కడైతే ఇంకా చాలామంది కళాకారులు పరిచయం అవుతారు. వాళ్ళతో కలిసి ఉంటే తప్పకుండా తన సంస్థని బాగా ముందుకు తీసుకెళ్ళచ్చు. యవనిక ఇంకా స్కూలు చదువే కాబట్టి తప్పకుండా అక్కడే ఏదో ఒక మోస్తరు మంచి స్కూల్లో చేర్పించవచ్చు.

ఏది ఏమైనా తను వసంత కోసం ఆత్మాభిమానం చంపుకుని చక్రధరం సంస్థలో పనిచేయడానికి వెళుతుండగా శివ కనిపించడం, ఈ విషయం చెప్పడం ఆ దేవుడు చేసిన మేలు.. తన మనసు గ్రహించి ఆ భగవంతుడు శివ రూపంలో వచ్చి ఉంటాడు.

శివ చెప్పినట్లు వెళ్ళిపోవడం చాలా మంచిది.

పద్మిని లేచి సామాను సర్దడానికి ఉపక్రమిస్తూ అలారం టైం పీసులో టైం చూసింది.

వసంత చక్రధరం దగ్గరకు వెళ్ళి గంట దాటింది ఇంకారాలేదేంటి?

ఎక్కడికి వెళ్ళినట్లు?

కొంచెం ఎందుకో కంగారుగా అనిపించింది.

గుమ్మం బైటకి వచ్చి నిలబడి వీధి చివరివరకూ చూడసాగింది.

ఇంతసేపు పట్టదే వారం దాకా రాము.. అని చెప్పి రావడానికి గంటన్నరసేపా ఇక్కడినుంచి ఎంతో దూరం కూడా లేదు అతని ఇల్లు. ఇంట్లో ఒక్కడే ఉన్నాడు ఈమె వెళ్ళింది అఘాయిత్యం ఏం చేయలేదు కదా? భయంతో కంపించింది పద్మిని.

ఆమె మనసంతా ఆందోళనతో నిండిపోయింది.

వసంతకి ఏ విధమైన తెలివితేటలు, చాకచక్యము, ధైర్యము ఏమీ లేవు. లౌక్యం అసలే తెలియదు. అక్కడ ఏం జరిగిందో, ఈమె ఏం చెప్పిందో అతనేం అన్నాడో, పర్యవసానం ఏంటో అయ్యో ఇంతకాలం నుంచీ ఒక సెల్‌ఫోన్ కూడా కొనుక్కోలేదు. పదిహేనువందలు పెడితే వచ్చేది. ఎందుకులెమ్మని కొనలేదు ఇలాంటప్పుడు ఫోన్ ఉంటే ఎంత లాభం.

వెధవ బతుకు కనీసావసరాలు కూడా తీర్చుకోలేని బతుకు. వసంతకి విసుగొచ్చిందంటే రాదూ మరి. ఇంకా నయం ఈ పిల్ల కాబట్టి ఇలా బతుకీడ్చుకొచ్చింది. అదే ఇంకోరు అయితే తనని తన మానాన వదిలి వాళ్ళ దారి వాళ్ళు వెతుక్కునేవాళ్ళు. ఇంతకాలం నుంచీ తనని నమ్మి తనతో బతికిన వసంతకి మంచి జీవితాన్ని ఇవ్వాల్సిన బాధ్యత తనకుంది. అవును వసంతకి మంచి సంబంధం చూసి పెళ్ళి చెయ్యాలి. నలభై ఏళ్ళకే ఆమె అన్ని కోరికలు చంపుకుంటూ బతకాల్సిన అవసరం ఏముంది? అందరూ చక్రధరాలే కాదు ఈ సమాజంలో మంచివాళ్ళు, విశాల హృదయులు ఎంతోమంది ఉండి ఉంటారు. ఈ చిన్న ఊళ్ళో ఎవరూ లేకపోవచ్చు. హైదరాబాదు వెళితే తప్పకుండా ఎవరో ఒకళ్ళు లభిస్తారు. అవును వెళ్ళాలి. ఏవిధంగా చూసినా శివ చెప్పిన మార్గం కరెక్ట్ అనిపిస్తోంది.

దూరం నుంచి వడి, వడిగా వస్తున్న వసంతని చూసిన పద్మిని మనసు కుంటుపడింది.

"ఏం జరిగింది వసంతా ఇంతసేపైందేం?" వసంత మొహంలోకి చూసిన పద్మిని అదిరిపడింది.

ఆమె చేయిపట్టి గభాల్న లోపలికి లాగి గాభరాగా అడిగింది "ఏం జరిగింది చెంపమీద ఆ గాట్లేంటి? "

వసంత పద్మినిని గట్టిగా కావలించేసుకుని భోరుమంది.

పద్మిని గుండెల్లో రాయి పడినట్టు అయింది. అయిపోయింది అనుకున్నంతా అయింది. ఆ దుర్మార్గుడు వసంతని చెల్లి, చెల్లి అంటూ చేయిపట్టుకుని అఘాయిత్యం చేసాడు. దుర్మార్గుడు ఆవేశంతో వణికిపోతూ అరిచింది. "ఏం చేసాడు చెప్పు. "

వసంత మధ్య, మధ్య వెక్కిళ్ళతో చెప్పింది.

"నన్ను బలవంతం చేయబోయాడక్కా.. ఎంత బతిమాలినా వినలేదు. నేను వెళ్ళేసరికి బాగా తాగి ఉన్నాడు పగలేకదా మామూలుగానే ఉంటాడనుకున్నాను చెల్లి, చెల్లి అంటుంటే నిజం అనుకున్నాను. " అంటూ మళ్ళీ బావురుమంది.

పద్మిని పళ్ళబిగువున అడిగింది "ఏం జరగలేదు కదా.!? "

"లేదక్కా! చిన్న స్టూల్ కనిపిస్తే వాడి నెత్తిన పడేసి పరిగెత్తుకుని వచ్చేసా. "

భగవాన్. పద్మిని శ్వాస తీసుకుంది.

"సారీ అక్కా! నువ్వు చెబుతుంటే నేనే వినకుండా వాడిని నమ్మాను. ఇంకెప్పుడూ నీ మాట కాదనను. హైదరాబాదు కూడా నువ్వు వెడదామంటేనే వెడదాం లేకపోతే ఒద్దు. "

ఆమె జుట్టు నిమురుతూ అంది పద్మిని. "వెడదాం. అదొక్కటే మన ముందున్న దారి. అక్కడికే వెడదాం. సామాను సర్దు. "

"నిజంగానా!? " కన్నీళ్ళ మధ్య ఆశగా అడిగింది వసంత.

"నిజంగానే నూటికి నూరుశాతం.!" గంభీరంగా అంది పద్మిని.

**ఎన్నో సంవత్సరాలుగా** ఆ ఊళ్ళో నివసించి ఎన్నో అనుభవాలను, అనుభూతులను, స్నేహితులను, ఆత్మీయులను, చక్రధరంలాంటి అసూయాపరులను అక్కడే వదిలేసి, కూతురుతో, నెచ్చెలి వసంతతో మొదటిసారిగా హైదరాబాదులాంటి మహానగరానికి ప్రయాణం అయింది పద్మిని.

వెళ్తున్నట్టుగానీ, వెళ్ళాలా వద్దా అనిగానీ ఎవరినీ అడగలేదు. చక్రధరానికి అసలే చెప్పలేదు. కానీ యవనిక స్కూల్లో టి.సి తీసుకుందని పద్మిని హైదరాబాదు మకాం మారుస్తోందని చక్రధరానికి తెలిసిపోయింది. ఏ ఇంటి పెరట్లో ఏ చెట్టుంది, ఆ చెట్టు మీద ఏరోజు ఎన్ని కాకులు వాలాయి అనే విషయాలు కూడా ఎవరూ చెప్పకుండానే తెలిసిపోయే ఆ చిన్న ఊళ్ళో, పద్మిని హైదరాబాదు వెళ్తోందని ఆమెని ఎరిగిన అందరితోపాటు చక్రధరానికి కూడా తెలిసిపోయింది.

బెల్లం ఎరగా వేసి, చీమలాంటి వసంతని చెరపట్టాలనుకున్న చక్రధరం ప్రణాళిక ఆదిలోనే భగ్నం కావడంతో కుతకుత ఉడికిపోయిన అతను ఇప్పుడు వాళ్ళు ముగ్గురూ కలిసి పూర్తిగా ఆ ఊరు వదిలేస్తున్నారన్న వార్తతో అగ్గిమీద గుగ్గిలం అయాడు. ఆపలేని అశక్తత, వాళ్ళనేమీ అనలేని నిస్సహాయతతో తనలో తనే రాజుకోసాగాడు. తన పథకం బెడిసికొట్టడం కాక ఇద్దరికిద్దరూ తన చేతికి చిక్కకుండానే తప్పించుకోవడం, ఏ అవకాశాలు లేకుండా చేసినా తిండికి కటకటలాడే పరిస్థితి వచ్చినా ఏ మాత్రం చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో ఎలాంటి పరిస్థితిలో కూడా తనకి దాసోహం అనని పద్మిని వ్యక్తిత్వం అతనికి మింగుడు పడలేదు.

ఏనాడూ ఎక్కడికీ వెళ్ళని పద్మిని ఏ ధైర్యంతో మహానగరానికి పయనం అయిందో ఆ ధైర్యం ఎక్కడినుంచి వచ్చిందో అతనికి ఏ మాత్రం అర్థం కావడంలేదు. శివరామ్‌ని పంపించేశాక అతను ఎక్కడికి వెళ్ళాడు? ఏం చేస్తున్నాడు? ఎలా ఉన్నాడు? అనే విషయాలేవీ చక్రధరం తెలుసుకోలేదు. తెలుసుకునే ప్రయత్నాలు కూడా చేయలేదు. పద్మినికి అండగా ఉన్న శివరామ్‌ని తప్పించడమే అతని ధ్యేయం అది నెరవేరింది చాలనుకున్నాడు. అయితే, తన ఆలోచన తనకే ఎదురు తిరిగి తనని కబళించడానికి వచ్చింది.

శివరామ్ స్వయంకృషితో ఎదిగాడని, అతి కొద్దికాలంలోనే టీ.వీ సీరియల్స్‌లో అవకాశాలు పొంది బాగా సంపాదిస్తున్నాడని, ఆరునెలలకే బండి కొనుక్కుని వేషం కూడా మార్చేసేంతగా మారాడంటే శివరామ్ తెలివైనవాడు. ఇప్పుడు భార్యా, పిల్లల్ని తనతో తీసుకెళ్ళిపోవడానికి వచ్చాడని తెలిసింది. అంటే శాశ్వతంగా శివరామ్ అండ పద్మిని కోల్పోయినట్టే అని సంతోషించేలోపలే మరో దెబ్బ పడింది అతని అహం మీద. శివరామ్ తనతోపాటు పద్మిని కుటుంబాన్ని కూడా హైదరాబాదుకి తీసుకుని వెళ్తున్నాడని తెలిసింది. అగ్నికి ఆజ్యం తోడైంది. ఆ అగ్ని ప్రళయాగ్ని అయింది. అతను ఎదగడానికి సహకరించినందుకు తనకి కృతజ్ఞతలు తెలపడానికి వస్తాడని ఎదురు చూసిన చక్రధరానికి శివరామ్ రాకపోగా కొందరితో చక్రధరాన్ని శాపనార్థాలు పెట్టాడన్న విషయం కూడా తెలిసింది. అంతటికీ కారణం పద్మిని అని కాసేపూ, వసంత అని కాసేపూ తిట్టుకున్నా చివరికి తన మీద తనకే చిరాకు కలిగింది. కోపమూ వచ్చింది.

కక్కుర్తిపడి వసంత మీద చేయి వేయడంతో తన ప్లాన్ అంతా పాడైపోయింది. ఇంత కష్టపడి వేసిన పథకం అంతా పద్మినిని సాధించడానికి. కానీ, ఒళ్ళు మరిచి, కళ్ళు మూసుకుపోయి, వసంత మీద చేయి వేయడంతో అమాయకంగా తనని నమ్మిన వసంత ఇప్పుడు తనంటే భయంతోపాటు అసహ్యాన్ని కూడా పెంచుకుని ఉంటుంది. ఎలా వాళ్ళని సాధించడం? పద్మిని తన దగ్గర ఉంటే అనేకరకాల లాభాలున్నాయి. ఎంతగా ప్రయత్నించినా దక్కని పద్మినిని శాశ్వతంగా తనదాన్ని చేసుకోవచ్చు, తన నాటకాల్లో నటించడానికి శాశ్వతంగా ఓ మంచి కళాకారిణి లభిస్తుంది, తనకి భార్యలేని లోటు తీరుతుంది. కానీ ఇప్పుడెలా? ఏవీ తీరవు.

ఇంక పద్మినిని సాధించే మార్గాలన్నీ మూసుకుపోయాయి. తను తవ్వుకున్న గోతిలో తనే పడ్డాడు.

చక్రధరం తలపగిలిపోతుంటే సిగరెట్ వెలిగించాడు. వసంతకి సారీ చెపితే.. ఊహూ నమ్మరు. పద్మినినే కాళ్ళు పట్టుకుంటే ఛ, ఛ ఇంత బతుకూ బతికి ఒక ఆడదాని కాళ్ళు తను పట్టుకోడమా? వాళ్ళే తన కాళ్ళు పట్టుకునేలా చేయాలి అదీ మగతనమంటే. చక్రధరం ఆలోచనలు ఝుంఝూమారుతంలా చెలరేగసాగాయి.

శివరామ్ ఇంట్లో చాలాసేపటినుంచీ భార్యాభర్తలు మధ్య హైదరాబాదు మకాం మార్చడం పట్ల చర్చ జరుగుతోంది. రజని చాలా చిరాగ్గా ఉంది. "మీరు నాలుగు డబ్బులు సంపాదిస్తున్నారు కదా అని మమ్మల్ని కూడా రమ్మంటే ఆ మహానగరంలో మీ సంపాదన నలుగురికి ఎలా సరిపోతుంది? ఇక్కడైతే మనం కట్టే అద్దె నెలకి పన్నెండు వందలు. కూరలు, పళ్ళు, పిల్లల స్కూలు ఫీజులు, బట్టలు, పుస్తకాలు అన్నీ కలిపినా మనకి నెలకి పది, పదకొండు వేలకన్నా ఎక్కువ ఖర్చు తేలడం లేదు. అక్కడికెళ్ళి మీకు నెలకి ఖచ్చితంగా ఇంత వస్తుంది అని తెలియకుండా ఎలా బతుకుతాం. అద్దెలే వేలల్లో ఉంటాయట కదా. పైగా పిల్లల స్కూళ్ళకి, మీరు వెళ్ళే స్టూడియోకి, మన మకాంకి చాలా దూరం ఉంటే బస్సులనీ, రిక్షాలనీ బోలెడవుతుంది. మేమిక్కడే ఉంటాం మీరు వెళ్ళండి."

"అదెలా రజనీ..? పిల్లలు, నువ్వు ఇక్కడుంటే నాకెలా తోస్తుంది. ఏ ఫర్వాలేదు నేను బాగానే సంపాదిస్తున్నాను. మనం హాయిగా బతకచ్చు నా మాట విను ఇక్కడినుంచి వెళ్ళిపోదాం. ఏం ఉందిక్కడ మనకి ఆస్తులా? పాస్తులా? చుట్టాలు మాత్రం ఎవరున్నారు? "

"ఏమోనండి అసలా టీ.వీలు సినిమాలు ఆ వాతావరణమే బాగుండదంటున్నారు. ఆరోజు కూడా వద్దంటే ఆయన వెళ్ళమన్నాడని వెళ్ళారు. ఇప్పుడు పూర్తిగా మకామే మార్చేద్దామంటున్నారు. నాకేం అర్థం కావడంలేదు. పిల్లల భవిష్యత్తు ఎలా ఉంటుందో ఏంటో.? "

"దివ్యంగా ఉంటుంది. ఇక్కడికన్నా అక్కడ మంచి, మంచి స్కూల్స్ ఉన్నాయి. నీక్కూడా ఏదో ఒక ఉద్యోగం కూడా దొరికే అవకాశం ఉంది. నా మాట విని సామాను సర్దు" మెల్లగా నచ్చచెబుతు మొత్తానికి అయిష్టంగా అయినా సామాను సర్దడానికి ఉపక్రమించేలా చేశాడు శివరామ్.

ఉన్న కొద్దిపాటి సామాను మూటకట్టుకుని, చిన్న, చిన్న సూట్‌కేసుల్లో బట్టలు సర్దుకుని, ఇంటివాళ్ళకి చెల్లించాల్సిన బకాయిలు చెల్లించి "హైదరాబాదు వెళ్తున్నాం" అని చెప్పింది పద్మిని.

"అయ్యో అంతదూరం ఎందుకే! ఇక్కడేం తక్కువైంది మీకు?" అంది ఇల్లుగలావిడ.

"ఏం తక్కువైందో ఈవిడికి చెబితే మాత్రం ఏం అర్థం అవుతుందిలే" అనుకుంది పద్మిని.

చిరునవ్వుతో అంది "నాకు అక్కడ మంచి ఉద్యోగం దొరికింది పిన్నిగారూ. యవనికకు కూడా మంచి స్కూల్లో సీటు దొరికింది" అంది.

"అలాగా! సర్లె వెళ్ళిరండి. అక్కడ అంతా దొంగవెధవలుంటారుట. జాగ్రత్త! " అంటూ అంపకాలు పెట్టిందావిడ.

సాయంత్రానికి శివరామ్ దంపతులతోపాటు పద్మిని, యవనిక, వసంత విజయవాడ రైల్వే స్టేషన్‌లో నిలబడ్డారు.

యవనిక శివరామ్ పిల్లలతో కబుర్లు చెపుతూ సూట్ కేసుల మీద కూర్చుంది. ఆ పిల్ల మొహంలో పల్లెటూరు వదిలేసి నగరానికి వెళ్తున్నామన్న ఆనందం వెల్లివిరుస్తోంది. వసంత రజనీ కబుర్లు చెప్పుకుంటున్నారు. వసంత చాలా సంతోషంగా ఉన్నట్టూ ఆమె మొహంలో మెరుస్తున్న వెలుగులే తెలియచేస్తున్నాయి కానీ, రజని మొహంలో మాత్రం ఆశించినంత ఆనందం కనిపించడంలేదు. ఎందుకో తెలియదు కానీ, ముభావంగా నిర్లిప్తంగా ఉంది.

పద్మిని ఒక్కతే దీర్ఘాలోచనలో ఉంది. సాహసం చేసి వెళ్తోంది అక్కడ ఎన్ని తిప్పలు పడాలో, ఎన్ని అవమానాలు సహించాలో. చిన్న చిన్న ఊళ్ళలోనే ఎంతో పోటీ ఉంటుంది. అలాంటిది అక్కడ కొన్ని లక్షలమంది కళాకారులుంటారు వాళ్ళల్లో తనకి పోటీ ఉండదా? ఉంటుంది. ఈ వయసులో తనకి అవకాశాలు ఎలాంటివి వస్తాయి. దగ్గర, దగ్గరగా యాభైకి చేరువ అవుతోంది. ఇంకా చక్రధరంలాంటి వాళ్ళ వేధింపులు ఎదుర్కొంటూనే ఉంది. అక్కడ చక్రధరంలాంటి వాళ్ళు ఎవరూ లేకపోతే బాగుండు. ఎలాంటి పాత్ర ఇచ్చినా చేయచ్చు. శివ అన్నట్టు తనకి కావాల్సింది డబ్బు. యవనికని చదివించాలి. దానికి మంచి భవిష్యత్తునివ్వాలి. తననే నమ్ముకుని, కష్టసుఖాల్లో తన వెంటే ఉంటోన్న వసంత ఆర్థికంగా నిలదొక్కుకునేలా చూడాలి. ఆమె కోరుకున్నట్టు మంచి బట్టలు, మంచి తిండి, తలదాచుకోడానికి చిన్న ఇల్లు.. ఇవి ప్రాథమికావసరాలు. ఇవన్నా తీర్చుకోలేని బతుకు ఒక బతుకేనా? ఎందుకు తను ఇంతకాలం ఏమీ సాధించలేకపోయింది. ఎప్పుడూ ఎవరో ఒకళ్ళు సాయం చేయాలి అనుకుంటూ ఆపన్నహస్తం కోసం ఎదురుచూడడమే కానీ ఏనాడన్నా స్వంతంగా ఇది చేయాలి అనుకుంటూ అందుకోసం కృషి చేసిందా, కృషి పట్టుదల ఉంటే సాధ్యం కానిదేదైనా ఉంటుందా ఈ జీవితంలో. తనిలా ఉందంటే అందుకు కారణం కృషిలో లోపమే. ఇలా ఉండకూడదు. ఇకనుంచి ఎవరి సహాయం లేకుండా ఎదగడానికి ఏం చేయాలో ఆ దిశగా ఆలోచించాలి. ఆ దిశగా కృషిచేయాలి. అందుకు ముందు ఆత్మవిశ్వాసం కావాలి. ధైర్యం కావాలి. అవును ఇంతకాలం తను ఒక పరాధీనగా బతికింది. ప్రతిదానికీ వందల విధాలుగా ఆలోచించడం నిరాశపడడం, ఏదో తనకి ప్రతికూలంగా జరుగుతుందని ఊహించడం అలా ఉండకూడదు ఇకనుంచీ.

"పద్మినీ! ఏంటి ఆలోచిస్తున్నావు? రైలొచ్చింది" అని శివరామ్ హెచ్చరించడంతో ఆలోచనల్లోంచి తెప్పరిల్లి సామానుతో సహా జాగ్రత్తగా రైలు ఎక్కింది. శివరామ్ కుటుంబం నలుగురు, పద్మిని, వసంత, యవనిక ఏడుగురికీ పక్కపక్కనే సీట్లు దొరికాయి. ఎంచేతో పెట్టెలు కొంచెం ఖాళీగానే ఉన్నాయి రద్దీ ఎక్కువగా లేదు.

"నాకు విండో సీటు కావాలి, నాకు విండో సీటు కావాలి" అంటూ పిల్లలు ముగ్గురూ అల్లరి చేస్తూ విండో సీట్ల వైపు పరుగెత్తారు. వాళ్ళని చిరునవ్వుతో చూస్తూ కూర్చుంది పద్మిని. యవనికకి ఈ రైలు ప్రయాణం ఉద్వేగంగానూ, సంతోషంగానూ ఉంది. కూతురు మొహంలో వెల్లివిరుస్తున్న ఆ ఆనందం చూస్తుంటే పద్మినికి "ఈ ఆనందం ఎప్పటికీ నా బిడ్డ కళ్ళల్లో నేను చూడాలి తండ్రి.. ఇలాంటి ఆనందకరమైన సందర్భాలు నేనెన్నో అందించాలి నా బిడ్డకి" అనిపించింది.

రైల్లోకి అమ్మవచ్చిన పల్లీలు, చిప్స్, చిక్కీలు, కాఫీలు అన్నీ కొన్నాడు శివ. అన్నిటికీ తనే డబ్బులిచ్చాడు. పద్మిని నొచ్చుకుంది. "ఎందుకు శివా! మాకొద్దులే" అంటూ కాఫీ నిరాకరించినా శివ వినలేదు. "ఫర్వాలేదు పద్మినీ తీసుకో" అంటూ బలవంతం చేసాడు.

రజని ముఖకవళికలు కొంచెం అనుమానాన్ని, భయాన్నీ కూడా కలగచేసాయి పద్మినికి. బయలుదేరిన దగ్గర్నించీ చూస్తూనే ఉంది ఎంచేతో ఆమె మొహంలో కొంత అసహనం, చిరాకు కనిపిస్తున్నాయి. ఈమెకి ఉన్న ఊరు నుంచి హైదరాబాదు వెళ్ళడం ఇష్టంలేదా, లేక శివ తననీ, వీళ్ళందరినీ తీసుకువెళ్ళడం ఇష్టంలేదా? నెమ్మదిగా ఆమెతో మాట్లాడి విషయం తెలుసుకుంటే బాగుండేమో అనిపించింది. సమయం కోసం ఎదురు చూస్తూ కూర్చుంది పద్మిని.

వేసవికాలం మొదలైందేమో ఎండ మాడ్చి, మాడ్చి అప్పుడే కొంచెం చల్లబడుతోంది. సూర్యుడు పశ్చిమానికి క్రుంగిపోతున్నాడు. పచ్చని పచ్చిక మీద నారింజ రంగు కిరణాలు పడి శోభాయమానంగా ఉంది. రైలు చేస్తున్న శబ్దంలో పిల్లల మాటలు కలిసిపోతున్నాయి.

"రాత్రి పదిన్నరకల్లా మనం దిగిపోతాం. సికింద్రాబాద్ స్టేషన్ నుంచి ఆటో మాట్లాడుకుని మనం కృష్ణానగర్ వెళ్ళిపోదాం. నాకు రేపు ఉదయం షూటింగ్ ఉంది. మీరంతా రేపు భోజనాలు చేసి విశ్రాంతి తీసుకోండి. నేను వచ్చేసరికి బాగా పొద్దుపోవచ్చు" అన్నాడు శివరామ్.

"నీ రూము సరిపోదేమో!" శివరామ్ మొహమాటంగా అంది పద్మిని.

"అన్నీ సరిపెట్టుకోడమే పద్మినీ. ఏదీ సరిపోదీ పట్నంలో. " నవ్వాడు శివరాం. "అయినా రెండు రోజుల్లో మా మకాంకి దగ్గర్లోనే ఒక గది చూస్తాను. మీరక్కడికి మారిపోదురుగాని. ఆ తరువాత మన ప్రయత్నాలు ప్రారంభిద్దాం. నువ్వేం దిగులుపెట్టుకోకు. అంతా సవ్యంగా జరుగుతుంది" అన్నాడు అభయం ఇస్తున్నట్టుగా.

రజని నెమ్మదిగా అంది "నీకు రాకపోయినా యవనికకి అవకాశాలు బాగా వస్తాయిలే పద్మినీ."

పద్మిని కలవరంగా చూసింది. "అలా అనకు రజనీ! యవనిక మొహానికి రంగు వేసుకోడం కూడా నాకిష్టంలేదు. నటించడం అనే ఆలోచనకి ఆస్కారం లేదు. "

"ఈ రోజుల్లో అందరూ యువకళాకారులే కావాలంటున్నారుట. ఈయన చెప్పారు" అంది రజని.

పద్మిని శివరామ్ వైపు చూసింది అవునా అన్నట్టు.

"హీరో, హీరోయిన్స్‌గా చిన్నవాళ్ళనే తీసుకుంటున్నారు. అమ్మ, అత్త, వదిన పాత్రలకు పద్మిని చాలా బాగా సూట్ అవుతుందిలే రజనీ! భయపెట్టకు అనవసరంగా" అన్నాడు శివ భార్యని మందలిస్తూ.

వసంత రజనివైపు చూసి అడిగింది "ఏంటి రజనీ నీకు మేము హైదరాబాద్ రావడం ఇష్టంలేదా? "

అందరూ తెల్లబోయి చూశారు. రజని మొహం నల్లబడింది. "ఇది మరీ బాగుంది హైదరాబాద్ ఏమన్నా నా ముత్తాత ఊరా? నా ఇష్టం ఏంటి? తీసుకెళ్ళేది ఆయన. వెళ్ళేది మూరు మధ్యన నా ఇష్టాఇష్టాలతో పనేంటి? "

ఆ జవాబుకి పద్మినికి షాక్ కొట్టినట్టే అయింది రజని నోటినుంచి ఇలాంటి వెటకారపు మాటలు ఏనాడూ ఆశించలేదు. శివతో పాటుగా రజని కూడా తనకెంతో ఆత్మీయురాలు. అలాంటిది ఇప్పుడు ఇలా మాట్లాడుతుంటే తను అడుగుపెట్టబోతున్న కొత్త జీవితంలోకి తనకన్నా ముందే ప్రతికూలపవనాలు ప్రవేశిస్తున్నాయా? ఇకముందు నుంచీ రజని నుంచి తనకి ఎలాంటి సహాయ సహకారాలు, ఆదరాభిమానాలు లభించవా? కొత్త ఊళ్ళో, కొత్త మనుషుల మధ్యకి వెళుతున్న తనకి తనతో పాటు పయనిస్తున్న ఈ స్నేహితురాలు తనని మధ్యలోనే వదిలేస్తుందా?

"ఏంటా మాటలు రజనీ? ఏమైంది నీకు? " మందలింపుగా అన్నాడు శివరామ్.

"నేనేం అన్నాను" మొహం చిట్లించింది.

పద్మిని శివని వారిస్తూ అంది "ఏదోలే శివా.. ఆడవాళ్ళ మాటల్లో నువ్వు తల దూర్చకు."

శివరామ్ ఏం మాట్లాడలేదు.

వాతావరణం హఠాత్తుగా సీరియస్ అవడంతో వసంత బిక్కమొహం వేసుకుని కూర్చుంది.

అందరూ మౌనంగా కూర్చున్నారు. పిల్లలు ముగ్గురూ నిద్రకి జోగసాగరు.

పదిదాటింది. మరో అరగంటలో రైలు సికింద్రాబాద్ స్టేషన్ చేరింది పిల్లల్ని లేపి జాగ్రత్తగా సామాను దింపుకుని, దింపిన సామాను లెక్కపెట్టుకుని అందరూ తలా రెండు పెట్టెలు, బ్యాగులు పట్టుకుని బయలుదేరారు. ప్లాట్‌ఫాం దాటి బైటికి వచ్చాక రెండు ఆటోలు మాట్లాడాడు శివ. ఒకదాంట్లో పద్మిని, వసంత, యవనిక, మరో దాంట్లో శివరామ్ కుటుంబం కూర్చున్నారు.

"చూడు బాబూ! మా ఆటోని ఫాలో అవాలి. అటూ ఇటూ వెళ్ళకు" ఖచ్చితంగా చెప్పాడు ఆటోవాలాకి.

"ఠీక్ హై సాబ్ " అంటూ బర్రున స్టార్ట్ చేశాడు డ్రైవర్.

మొదటిసారిగా సువిశాల నగరం హైదరాబాద్, సికింద్రాబాద్‌లకి వచ్చి, ఇరుకైన ఆటోలో కూర్చున్న ఆ ముగ్గురికీ అంతా కొత్తగా, వింతగా ఒక విధమైన ఆందోళనగా అనిపించింది.

"ఆ రజని ఏంటక్కా.. ఉన్నట్టుండి అలా మారింది?" అంది వసంత ఉండబట్టలేక.

"ష్..! " అన్నట్టు నోటి మీద వేలుంచుకుని యవనిక ఎదురుగా మాట్లాడద్దన్నట్టూ సైగ చేసింది పద్మిని.

మధ్య, మధ్య వెనకాల వస్తున్న ఆటో సరిగానే వస్తోందా అని ఆటో ఆపించి చూసుకుంటూ బయలుదేరదీశాడు శివ.. అతను తీసుకుంటున్న శ్రద్ధకి పద్మినికి అతని పట్ల అభిమానంతో నిండిపోయింది మనసు.

రజని ఆడపిల్ల. ఉన్న ఊళ్ళో ఏదో సాయం చేశాడంటే మానవత్వంతోటో, స్నేహానుబంధంతోటో చేశాడని సమాధానపడి ఉండొచ్చు. ఇప్పుడు అతని కుటుంబాన్నే కాక ముగ్గురు ఆడవాళ్ళని కూడా తన వెంట తీసుకుని వస్తుంటే ఆమెకి కోపం రావడంలో అర్థం ఉంది. అది చాలా సహజం. ఏమవుతుంది ఈ పద్మిని, ఏమవుతుంది ఈ వసంత శివకి. ఏమీకారు తోటి కళాకారులు. అంతమాత్రాన ఇంతగా వాళ్ళకి తోడ్పడాలని ఎక్కడా రాసిలేదు. ఇంతకాలం అతను చేసిందే చాలా ఎక్కువ. అతనిచ్చిన మనోబలం, అతనిచ్చిన నైతికబలం నిజంగా అపూర్వం.

ఇవాళ తన సుఖం, తన అభివృద్ధి చూసుకోకుండా ఎందుకు వెంట పెట్టుకుని ఇంత దూరం తీసుకొచ్చాడు.

రజని స్థానంలో తనున్నా ఆమెలాగే స్పందించేది. రజని తప్పేం లేదు అనుకుంది పద్మిని.

ఆటో చాలా దూరం ప్రయాణించి కృష్ణానగర్‌కి వచ్చింది. బాగా సన్నటి సందులో వరసగా ఉన్న ఇళ్ళల్లో మధ్యలో ఉన్న ఇంటిముందు ఆగింది.

వెనకాలే శివవాళ్ళు ఎక్కిన ఆటో కూడా ఆగింది.

శివ రెండు ఆటోలకీ డబ్బులిచ్చాడు. చాలా తక్కువ స్థలంలో కట్టిన రెండు అంతస్తుల బిల్డింగ్ కాంపౌండ్‌వాల్, గేటూ ఏమీ లేవు. ఆకుపచ్చ తలుపు ఉంది. దానికి తాళం ఉంది. శివ జేబులోంచి తాళం చేతులు తీసి తాళం తీసాడు. తను లోపలికి వెళ్ళి స్విచ్ వేసాడు లైటు వెలుగులో గది విశాలంగా కనిపించింది. నెమ్మదిగా అందరూ అందించిన సామాను లోపలికి చేర్చాడు. ఒకొక్కళ్ళే లోపలికి ప్రవేశించారు. అదికాక చిన్న వంటగది, దానికి ఆనుకుని ఉన్న తలుపు తీసుకుని వెళితే చిన్న పెరడు, పెరట్లో బాత్‌రూమ్, టాయిలెట్. ఎడం పక్క మెట్లు అవి ఎక్కి పైకి వెళితే ఇంటివాళ్ళు ఉంటారుట.

మొత్తానికి ఇద్దరు చిన్నపిల్లలతో సహా మరో ఐదుగురు కొంచెం ఇబ్బందిపడుతూ ఉండచ్చునన్నట్టే ఉంది.

"నేను వెళ్ళి ఈ వీధి చివర హోటల్ నుంచి భోజనం పట్టుకొస్తాను. అందరూ కాళ్ళూ చేతులు కడుక్కుని కూర్చోండి. పెట్టెలు తెరిచి ప్లేట్లు బైటకి తీయండి" అంటూ శివ బైటకి వెళ్ళిపోయాడు.

ఎక్కడా వీధి దీపాలు లేకపోవడంతో అంతా చీకటిగా ఉంది. వీధికి రెండుపక్కలా వరసగా ఉన్నాయి ఇళ్ళు. ఆ ఇళ్ళు, ఆ వీధి చూస్తుంటే అక్కడ అందరూ ఆర్థికంగా బాగా దిగువ స్థాయిలో ఉన్నవాళ్ళే ఉంటారు కాబోలనిపిస్తోంది.

పద్మిని శివ వెళ్ళిన వైపు చూసి నిట్టూర్చి వెనక్కి తిరిగేసరికి వసంత చెక్కపెట్టెలోంచి స్టీలు కంచాలు తీస్తోంది. రజని కూడా అట్టపెట్టెలోంచి సామాను బైటకి తీస్తోంది.

"యవనీ తమ్ముళ్ళిద్దరికీ మొహాలు కడిగి నువ్వు కూడా కడుక్కురా" అంది పద్మిని.

యవనిక పిల్లల్ని తీసుకుని పెరట్లోకి వెళ్ళింది.

వసంత పంపు స్టవ్ బైటికి తీసి రజని చేతికిస్తూ అంది "రేపు ఈ స్టవ్ మీద మనం వంట చేసుకోవచ్చు. బైట కొనుక్కోనవసరంలేదు. "

రజని అది చూసి అంది "నా దగ్గర కూడా ఇలాంటి స్టవ్ ఉంది వసంతా రెండు స్టవ్‌లతో వంట త్వరగా చేసుకోవచ్చు హాయిగా. "

రజని మాటల్లో వినిపించిన సౌమ్యత పద్మిని మనసుని కొంత ఆహ్లాదపరిచింది.

ఆ తరువాత ముగ్గురూ ఆ కబురూ, ఈ కబురూ చెప్పుకుంటూ ఉండగానే శివ చపాతీలు కూర తెచ్చాడు దగ్గర్లో ఉన్న కర్రీపాయింట్‌నుంచి.

అందరూ తినేసాక తెచ్చుకున్న జంపకానాలు పరచుకుని వరసగా పడుకున్నారు.

తెల్లవారు ఝామున లేచిన శివ ఆరున్నరకల్లా బైటికి వెళ్ళిపోవడం నిద్రమత్తులోనే చూసింది వసంత. అప్పటికి రజని లేచి అతనికి కావలసిన డ్రెస్, టవల్, సబ్బు అందించడం కాఫీకి పాలు లేవంటే అతను "బైట తాగుతాలే. మీరు తెల్లారాక పక్కనే దొరుకుతాయి పాలు.. తెచ్చుకోండి" అని చెప్పి వెళ్ళడం వినిపిస్తుంటే మళ్ళీ మగతగా కళ్ళు మూసుకుంది.

కాలం చిత్రంగా వెళ్తూంటుంది. ఒకోసారి ప్రశాంతంగా, మరోసారి గందరగోళంగా. గందరగోళానికి కారణం ఏంటో ఎవరూ చెప్పలేరు. ప్రశాంతంగా వెళ్తుందంటే అందరి మనసులూ ప్రశాంతంగా మంచిగా ఉన్నాయని అర్థం. అవే మనసుల్లో చెప్పుకోలేని, చెప్పలేని మార్పులొస్తే, ఆ మార్పులు ఎలాంటివి అని అర్థం కాకపోతేనే గందరగోళం అనేది ఏర్పడుతుంది.

రెండు రోజుల తరువాత శివ ఇంటికి మరో నాలుగిళ్ళ అవతల ఒక వంటగది, మరో చిన్నపడకగది ఉన్న పోర్షన్ చూశాడు. అద్దె నెలకి పదిహేనువందలు. నెల తిరిగేసరికి కనీసం ఐదువేలన్నా సంపాదించగలిగితే అద్దె చెల్లించి అన్నం తినచ్చు అనుకుంది పద్మిని.

ఆమె భావాలు గమనించినవాడిలా అన్నాడు శివ. "నువ్వేం దిగులుపడకు. సరిగ్గ వారం రోజుల్లో నీకూ, వసంతకీ కూడా వేషం ఇప్పించే బాధ్యత నాది సరేనా? ఎలాగూ యవనిక స్కూల్ సెలవే కాబట్టి మరో రెండు నెలలదాకా దాని ఫీజులు, పుస్తకాల గురించి ఆలోచించనక్కర్లేదు. ఈలోగా తప్పకుండా పరిస్థితి మెరుగుపడుతుంది. "

పద్మిని నవ్వింది. "థాంక్స్ శివా.. " అంది.

రజని ఏమనుకుందో "పెద్ద దూరం ఏంలేదుగా పద్మినీ! ఏం కావాలన్నా మేము పక్కనే ఉన్నాం. కాబట్టి సమస్యలేదు. ఏమంటావు? "

"నిజమే రజనీ చేయికందేంత దూరంలో మీరున్నారు. నాకేం కావాలింతకన్నా" అంది.

వసంతకూడా అదే అంది. "మనకి వేషాలు దొరక్కపోయినా పర్లేదు. నేను చుట్టుపక్కల వాళ్ళతో స్నేహం కలిపేసి వంటలు చేసిపెడతాలే అక్కా. "

"చాల్లే ఇక్కడ కూడా వంటలక్క ఉద్యోగం చేయడం దేనికి? చాలు నువ్వు చేసింది. "

"ఇంక నేను చూసుకుంటాను మన ముగ్గురి సంగతి. నీకే అవకాశం వచ్చినా ఆ డబ్బులు నీకోసం వాడుకో, దాచుకో సరేనా? " ఆప్యాయంగా అంది పద్మిని.

వసంత కృతజ్ఞతగా చూసింది.

ఆ ఇంట్లో మొత్తం నాలుగు పోర్షన్లు అద్దెలకి. ఒక పోర్షన్ ఇంటివాళ్ళది. దాదాపు అన్ని పోర్షన్లలోనూ అద్దెకున్నది జూనియర్ ఆర్టిస్టులే. ఎవరూ ఎవరికీ కనిపించరు. ఎందుకంటే అందరూ కూడా ఉదయం లేస్తూనే స్టూడియోలకి వెళ్ళిపోతారు. తిరిగి వాళ్ళు ఎప్పుడు వస్తారో ఎవరికీ తెలియదు.

అక్కడ ఉన్న అందరూ పొట్ట చేతపట్టుకుని పరాయి ఊళ్ళనుంచి సినిమాల్లోనూ, టీ.వీ సీరియల్స్‌లోనూ వేషాలకోసం వచ్చినవాళ్ళే. అమ్మాయిలే ఎక్కువగా ఉన్నారు. ఆ ఇల్లు ప్రత్యేకంగా జూనియర్ ఆర్టిస్టులకోసమే కట్టించి, వాళ్ళకే అద్దెకిస్తుంటుంది ఇల్లుగలావిడ. ఆవిడ ఒక్కతే ఉంటుంది. ఇల్లు అద్దెకివ్వడమే కాక వాళ్ళల్లో ఎవరికైనా ఎప్పుడైనా అవసరం అయితే వంటచేసి ఇచ్చి దానికి చార్జి చేస్తుంది. సౌకర్యంగా ఉండడం కాక, ఎటువంటి ఇతర ఇబ్బందులు లేని ఆ ఇంట్లో ఎవరు ఖాళీ చేసినా మరొకరు వెంటనే చేరిపోతుంటారు. అలా ఖాళీ చేసి వెళ్ళిపోయిన వత్సల అనే ఆర్టిస్టు పోర్షన్ ఇప్పుడు పద్మినికి ఇచ్చింది ఆవిడ. పేరు సుగుణమ్మ.

పద్మిని, వసంత, యవనికలను చూసిన ఆవిడ అందరూ ఒంటరిగా వస్తే ఈవిడ ముగ్గురుతో వచ్చిందేమిటి? వీళ్ళంతా ఏమవుతారు ఈమెకి అనుకుంది.

ఆ ఇంట్లోకి చేరి సామాను సర్దుకుని కొంచెం సెటిల్ అవడానికి రెండు రోజులు పట్టింది పద్మినికి. రెండోరోజు మధ్యాహ్నం వసారాలో నిలబడి ఎదురుగా ఉన్న ఇళ్ళవైపు, అటూ, ఇటూ తిరుగుతున్న జనం వైపు చూస్తున్న పద్మినిని పలకరించింది సుగుణమ్మ.

"నీకు వాళ్ళిద్దరూ ఏమవుతారు? "

"నాచెల్లెలు, కూతురు" చెప్పింది పద్మిని.

"మీ ఆయనేం చేస్తాడు? ఎక్కడున్నాడు?"

పద్మినికి ఏం చెప్పాలో తోచలేదు. ఆయన ఉన్నాడని ఏదో చేస్తున్నాడని అబద్ధం చెబితే చాలదు. మళ్ళీ నాలుగురోజుల తరువాత ఉన్నాడన్నావు ఎక్కడా కనబడడేం అని అడిగితే మరో ప్రశ్నకి అబద్ధం చెప్పాలి. అందుకే అంది "ఆయనలేరు. మేము ముగ్గురమే ఉంటాం. నాటకాల్లో వేషాలేసి బతికేవాళ్ళం ఇప్పుడు నాటకాలు లేక టీ.వీలో వేషాలకోసం వచ్చాం."

ఆవిడ ఆశ్చర్యంగా అడిగింది. "నాటకాలు లేవూ ఇప్పుడు? "

"లేవంటే.. వేసేవాళ్ళు వేస్తున్నారు. మాకు అవకాశాలు లేవు. "

"అట్టాగా మనిషివి బాగానే ఉన్నవు. మంచి వేషం దొరకొచ్చులే. అవతల ఆ చివరగదిలో ఉంటుందే శోభ నీ వయసుదే బానే వేస్తోంది అమ్మ వేషాలు. పాపం మొగుడొదిలేసాడు దాన్ని. "

పద్మినికి  ఎలాగో అనిపించింది ఆవిడ మాటలు వింటోంటే.

"దానికీ ఓ కూతురుంది. హాస్టల్లో ఉంచి చదివిస్తోంది పాపం చూసేవాళ్ళెవరూ లేక. పొద్దున వెళ్తుంది షూటింగ్ అని రాత్రి ఎప్పుడొస్తుందో ఏంటో నేను పడుకుంటాను చూడను.

ఆ చివర పంపు పక్కన ఉందే గది.. అందులో రాగిణి ఉంటోంది. దాన్ని ఎవడో ప్రేమించి సినిమాల్లో హీరోయిన్ వేషాలిప్పిస్తానని కాపురం పెట్టాడు. ఏడాది దాటాక కనిపించకుండా పోయాడు. పిల్లల్లేరు. గుడ్డిలో మెల్ల ఏవో తిప్పలు పడుతోంది చిన్నదే ముప్పై ఏళ్ళుంటాయి.

ఈ పక్కన పోర్షన్‌లో షీలా అని ఉంది. పాపం దాని కథ వింటే దుఃఖం వస్తుంది. చిన్నప్పుడే తల్లీ, తండ్రి పోయారుట. అక్కా, బావల దగ్గర పెరిగింది. ఆ బావ దీనికి పదహారేళ్ళు వచ్చిన దగ్గర్నించీ దీనిమీద కన్నేసి పాడుచేశాట్ట. అక్క దీన్నే తప్పు పట్టి ఇంట్లోంచి వెళ్ళగొడితే ఇక్కడికి వచ్చి పడింది. చదువు చెప్పించలేదు వాళ్ళు. పేరు రాసుకోవడం కూడా రాదు. పనిమనిషి వేషాలు వేస్తూ కాలం గడిపేస్తోంది. "

పద్మినికి కడుపులో దేవినట్టుగా అనిపించసాగింది ఒక్కొక్కళ్ళ కథ వింటోంటే, ఆడవాళ్ళకేనా ఇలాంటి కష్టాలు. మగవాళ్ళు ఎంత నిర్భయంగా, ఆనందంగా ఉంటారు. వాళ్ళకేం కష్టాలు రాయలేదా విధాత.

"నీకేదన్నా సాయం కావాలంటే నన్ను అడుగు తల్లీ! ఆడవాళ్ళు పాపం.. ఏంటో మగదిక్కు లేకుండా ఎట్టా బతుకుతారో" అంటూ ఆవిడ లోపలికి వెళ్ళిపోయింది.

పద్మిని లోపలికి వెళ్ళిపోయింది. వసంత, యవనిక వైకుంఠపాళీ ఆడుకుంటున్నారు. పద్మిని లోపలికి రాగానే అడిగింది వసంత "ఆరాలు మొదలయాయా అక్కా? "

"ఏదోలే పెద్దావిడ. మంచిదే ప్రాబ్లం లేదు" అంది పద్మిని.

"అలాగే అనిపిస్తోంది" అంది వసంత.

"కాసేపు పడుకుంటాను వసంతా! " అంటూ చాప పరవబోతున్న పద్మినికి వినిపించింది బైట నుంచి పిలుపు "పద్మినిగారూ" అంటూ.

ముగ్గురూ ఒక్కసారిగా తలలు తిప్పి గుమ్మం వైపు చూశారు.

నలభై ఏళ్ళ వ్యక్తి నల్లగా లావుగా ఉన్నాడు.

"ఎవరు కావాలి? " అడిగింది పద్మిని.

"శివగారు పంపారండి.. మిమ్మల్ని, మీ చెల్లెలుగారిని స్టూడియోకి తీసుకురమ్మన్నారు. మేకప్ టెస్టుంది. "

వసంత చివ్వున కూర్చున్నచోటునుంచి లేచింది.

పద్మిని యవనిక వైపు చూసింది. ఈ పిల్లని ఒక్కదాన్ని వదిలి ఎక్కడికి వెళ్ళాలి? ఎలా వెళ్ళాలి?

వసంత ఆమె చూపులు గమనించిన దానిలా "రజని దగ్గర వదిలేసి వెళదాంలేక్కా" అంది నెమ్మదిగా.

"బైట కారుందండి మీరు త్వరగా వస్తే తీసుకువెళ్తాను" అన్నాడు అతను.

పద్మిని ఇంక ఆలోచించలేదు. "సరే వస్తున్నాం. మీరు కారులో కూర్చోండి. ఐదు నిమిషాల్లో వస్తాం" అంది.

అతను వెళ్ళిపోయాడు.

పద్మిని చీర మార్చుకుని తల దువ్వుకుంది. వసంత కూడా చీరమార్చుకుని మొహం కడుక్కుని పౌడర్ రాసుకుని బొట్టుపెట్టుకుంది. యవనిక వైకుంఠపాళీ గవ్వలు తీసుకుని బయలుదేరింది రజని అత్తతో ఆడుకుంటా అంటూ.

మరో పదినిమిషాల్లో యవనికను రజని దగ్గర వదిలేసి, పద్మినీ, వసంతా ఆ వ్యక్తితో కారులో బయలుదేరుతూ అనుకున్నారు. కాలం ఏం చేస్తుందో?

**కారు షూటింగ్** జరుగుతున్న స్టూడియో ముందు ఆగడంతో వసంత భయంగా పద్మిని చేయిపట్టుకుంది. ఎప్పుడూ అలాంటి స్టూడియో చూడడంగానీ, వెళ్ళడంకానీ జరక్కపోడంతో ఆ పెద్ద గేట్లోకి వెళ్ళగానే వసంత ఆపాదమస్తకం కంపించసాగింది.

ఎటువెళ్ళాలో, ఎక్కడ నిలబడాలో ఎటు నడవాలో ఏమీ అర్ధంకాక ఇద్దరూ కారు దిగి నిలబడిపోయారు. " లోపలికెళ్ళండి" అంటూ ఎదురుగా ఉన్న ద్వారం చూపించి కారు తీసుకుని వెళ్ళిపోయాడు వాళ్ళని తీసుకొచ్చినతను.

బిత్తరచూపులు చూస్తూ నిలబడిపోయిన వాళ్ళ దగ్గరకి గబ, గబా వచ్చాడు శివ.

అతన్ని చూడగానే ఊపిరి పీల్చుకుంది పద్మిని.

" రండి లోపలికి వెడదాం" అంటూ అతను ఎదురుగా దృఢంగా ఉన్న ద్వారంలోంచి లోపలికి నడిచాడు. విశాలమైన హాలు, హాల్లో ఓ పక్కపైకి వెళ్ళడానికి మెట్లు, మరో పక్క సోఫాలు, టీవి, పూలకుండీలు చాలా ఆడంబరంగా ఉన్న ఆ హాల్లోకి వెళ్ళగానే చెమట పడుతున్నట్టుగా అనిపించింది ఇద్దరికీ.

భయం, భయంగా చుస్తూ నడుస్తున్న వాళ్ళ వాలకం గమనించిన శివ నెమ్మదిగా అన్నాడు. " భయపడకండి భయపడితే తాటాకులు కడతారిక్కడ."

పద్మిని తనని తాను నిగ్రహించుకుంటూ వసంతవైపు చూసింది.

" ఇంత పెద్ద ఇల్లు.. ఇక్కడ అడుగుపెట్టాలంటేనే ఎలాగో ఉందక్కా! " అంది వసంత నెమ్మదిగా.

ఇదే స్టూడియో అన్నాడు శివ.

అతనలా అంటుండగా ఇద్దరు వ్యక్తులు అటుగా వచ్చి శివని చూసి " ఎక్కడికెళ్ళావయ్యా? నీ క్యారెక్టర్ ఉంది పద" అన్నారు.

అప్పటికే శివ మేకప్‌లో ఉన్నాడు. పెద్ద మీసాలు, తలకి విగ్గుతో తమాషాగా ఉన్నా శివ శివలానే ఉన్నాడు.

" సార్ వీళ్ళిద్దరూ మా సిస్టర్స్. మేకప్ టెస్టుకి తీసుకురమ్మన్నారు మూర్తిగారు" అన్నాడు పద్మినిని, వసంతనీ చూపిస్తూ.

వాళ్ళవైపు ఓసారి చూసి " సరేలే కూర్చోమను పిలుస్తారు" అంటూ వాళ్ళు అక్కడినుంచి వెళ్ళిపోయారు.

శివ వాళ్ళిద్దరినీ ఓ పక్కగా ఉన్న సోఫాల దగ్గరకు తీసుకెళ్ళి " మీరిక్కడ కూర్చోండి. ఇప్పుడు నా షాట్ ఉంది, " అంటూ గబ, గబా వెళ్ళిపోయాడు.

వాళ్ళిద్దరూ బిక్కుబిక్కుమంటూ సోఫాలో ముడుకుపోతూ కూర్చున్నారు. మరో సోఫాలో యువతీ, యువకులు కూర్చుని టీ.వి చూస్తూ ఎవరికీ వినిపించకుండా ఏదో మాట్లాడుకుంటూ నవ్వుకుంటున్నారు.

ఆ అమ్మాయి నలుపు చుడీదార్ వేసుకుంది. బాగా మేకప్‌లో ఉంది. మెరూన్ రంగు లిప్‌స్టిక్ దట్టంగా వేసుకుంది. జుట్టు పూర్తిగా వదిలేసింది. అతను జీన్స్‌ప్యాంట్, టీషర్ట్‌లో ఉన్నాడు. ఇద్దరూ బాగా సన్నగా, పొడుగ్గా ఉన్నారు. వాళ్ళిద్దరూ కూడా ఏ మాత్రం అందంగా లేకపోవడం గమనించిన పద్మిని అనుకుంది వీళ్ళు కూడా కళాకారులేనా?

లోపలికి వెళ్ళిన శివ ఎవరితోటో పద్మినికీ, వసంతకి టీ మంచినీళ్ళు పంపించాడు.

అప్పటికే టెన్షన్‌తో గొంతు పిడచకట్టుకుపోవడంతో ఇద్దరూ మౌనంగా అందుకున్నారు.

వాళ్ళు టీ తాగి అక్కడే కూర్చుని టి.విలో వస్తున్న కార్యక్రమం చూడసాగారు. ఏదో సీరియల్ వస్తోంది మొదటిసారిగా టి.వి సీరియల్ చూస్తుంటే వసంతకి చాలా ఆసక్తిగా అనిపించింది కానీ, పద్మినికి మాత్రం అందులోని నటుల నటన చూస్తుంటే చిరాకేసింది. వీళ్ళంతా నటులు ఎలా అయారు, ఎవరికీ నటనే తెలియడంలేదు అనుకుంది. కాసేపు చూసినతరువాత ఇద్దరికీ విసుగనిపించింది.

" ఇలాంటి సీరియల్సే మనం కూడా చేయాలాక్కా? " అడిగింది వసంత రహస్యంగా.

" డబ్బు కావాలంటే చేయాలిగా" నిర్లిప్తంగా అంది పద్మిని.

" అంత మేకప్ మనం డ్రామాకి కూడా వేసుకోం కదక్కా" అంది మళ్ళీ వసంత.

వాళ్ళిద్దరూ రహస్యంగా మాట్లాడుకుంటుంటే ఎదురు సోఫాలో కూర్చున్న యువతీయువకులు వాళ్ళవైపు చిత్రంగా చూడసాగారు.

" ష్..ఇక్కడేం మాట్లాడకు ఇంటికి వెళ్ళాక మాట్లాడుకుందాం" అంది పద్మిని.

సుమారు రెండుగంటల తరువాత శివ వచ్చాడు.

చెమటతో మేకప్ అంతా చెదిరి అసహ్యంగా తయారైన మొహం కాటన్‌తో తుడుచుకుంటూ వచ్చాడు.

" మీ ఇద్దరికీ బోర్ కొడుతోందేమో కదా. తప్పదు ఈ ఫీల్డ్‌లోకి వచ్చాక ఇలా వెయిట్ చేయక తప్పదు. రండి మేకప్ రూములోకి వెడదాం" అన్నాడు.

" నీ షూటింగ్ అయిపోయిందా? " అడిగింది వసంత లేస్తూ.

" అప్పుడేనా? ఇది బ్రేక్ టైము. పదండి మిమ్మల్ని మేకప్ మ్యాన్‌కి అప్పచెప్పి నేను మళ్ళీ వెళ్ళాలి" అన్నాడు.

పద్మిని కూడా లేచి అతన్ని అనుసరిస్తూ అడిగింది. " ఏదన్నా ప్రత్యేకమైన పాత్రకోసం మేకప్ టెస్టా లేక జనరల్‌గానా? "

" లేదు, లేదు నీకు మాత్రం ఒక అత్తగారి పాత్రకోసం చేస్తున్నారు. తనకి వేరే ఏదో క్యారెక్టర్ సరిగా తెలియదు నాకు. వాళ్ళే చెప్తారులే. మేకప్ తరువాత కెమెరా టెస్ట్ కూడా ఉంటుంది. "

" అమ్మో! కెమెరానే! " గుండెలమీద చేయేసుకుంది వసంత.

" మరి కెమెరా లేకుండా టి.వి సీరియల్స్‌లో ఎలా చేయగలవు వసంతా!? " నవ్వాడు శివ.

" ఏమో శివా! ఆరాటం వేరు, సరిగా ఆచరణకి వచ్చేసరికి భయం సహజం కదా! తనకేకాదు నాకూ కొంచెం దడగానే ఉంది" అంది పద్మిని ఒక్కసారి కొన్నేళ్ళ వెనక్కి వెళ్ళి సినిమాల్లో చేసిన చిన్న, చిన్న పాత్రలు గుర్తుకు తెచ్చుకుంటూ.

" ప్రారంభంలో అలాగే ఉంటుంది. తరువాత అదే అలవాటవుతుంది" అంటూ ఒక గదిముందు ఆగి తలుపు తోసి లోపలికి నడిచాడు అతన్ని అనుసరించారు ఇద్దరూ.

అక్కడ మేకప్ బోయ్ ఎవరికో ఒక ఆర్టిస్టుకి మేకప్ చేస్తున్నాడు.

" శీనూ వీళ్ళిద్దరూ కొత్త ఆర్టిస్టులు మూర్తిగారు వీళ్ళకి మేకప్ చేయమన్నారు. ఈవిడ మేఘం మెరుపు సీరియల్‌లో రజని అత్తగారి పాత్రకు సరిపోతుందో లేదో చూడాలి. ఈమెకి జనరల్‌గా" అన్నాడు శివ.

" కూర్చోండి" అన్నాడు శీను వాళ్ళవైపు చూసి.

ఎత్తుగా ఉన్న కుర్చీ చూపించాడు.

పద్మిని శివ వైపు చూసింది.

శివ ఫర్వాలేదు అన్నట్టుగా సైగ చేసాడు.

పద్మిని డ్రెసింగ్ టేబుల్ ముందు ఉన్న ఎత్తు కుర్చీలో కూర్చుంటే వసంత అక్కడే ఓ పక్కగా వేసి ఉన్న మరో కుర్చీలో కూర్చుంది.

" నేను వెళ్తున్నాను షాట్ రెడీ అయి ఉండచ్చు. శీను మన ఫ్రెండే పద్మినీ భయమేం లేదు. అంతా అతను చూసుకుంటాడు" అన్నాడు తను బైటికి వెళ్ళిపోతూ శివ.

" భయమెందుకు మేడమ్! మనందరిదీ ఒక ఫ్యామిలీ" అన్నాడు శీను.

ఇరవై రెండు, ఇరవై మూడేళ్ళుంటాయి అతనికి. ఛామనచాయగా ఉన్నా ఆకర్షణీయమైన కళ్ళతో ముచ్చటగా అనిపించాడు.

వసంత డ్రెసింగ్ టేబుల్ మీద ఉన్న రక, రకాల మేకప్ సామాగ్రి వింతగా చూస్తూ కూర్చుంది. డ్రామా మేకప్‌కి కెమెరా మేకప్‌కి చాలా తేడా ఉంటుంది కాబోలు అనుకోసాగింది.

తను చేస్తున్న మేకప్ పూర్తిచేసి " మీరు రండి మేడమ్" అన్నాడు శీను పద్మినితో.

అప్పటివరకూ కూర్చున్న ఆర్టిస్టు వెళ్ళిపోడంతో ఆ కుర్చీలో కూర్చుంది పద్మిని.

జడపైకి తీసి క్లిప్పు పెట్టుకోండి అంటూ పెద్ద క్లిప్పు తీసిచ్చాడు. జుట్టు మొత్తం గట్టిగా పట్టుకుని పైకి తీసి నడినెత్తిన క్లిప్పుతో బిగించింది పద్మిని. అతను స్పాంజ్ నీళ్ళతో తడిపి మొహం అంతా తుడిచాడు.

అతను ఒక్కో వస్తువు తీస్తూ, దానిపేర్లు చెబుతూ, సరదాగా మాట్లాడుతూ మేకప్ చేస్తుంటే కొత్త, బెరుకు అన్నీ పోయి వసంత కూడా అతనితో మధ్య, మధ్య మాటలు కలుపుతూ అతను మేకప్ చేస్తున్న విధానం చూస్తూ కూర్చుంది. ఈ లోపల ఆ గదిలోకి మరికొంత మంది వస్తూ, పోతూ ఉండడం, వాళ్ళందరినీ కూడా శీను పద్మినికీ, వసంతకీ పరిచయం చేయడం అందరూ సరదాగా మాట్లాడడంతో పూర్తిగా భయంపోయింది ఇద్దరికీ.

అందరూ ప్రొడక్షన్ టీమ్‌వాళ్ళని చెప్పాడు. అందరూ చిన్నవాళ్ళే యువకులే కావడం చిత్రంగా అనిపించింది వసంతకి.

మేకప్ టెస్ట్ జరిగింది. పద్మినికి మేకప్ చేసాక అక్కడున్న నలుగురు వాళ్ళల్లో వాళ్ళే గుసగుసగా మాట్లాడుకోడం గమనించింది వాళ్ళేం మాట్లాడుకుంటున్నారో వినిపించకపోయినా అదేదో పద్మిని ప్రశంసలా పసిగట్టింది వసంత. ఒక్క క్షణం అసూయలాంటిది కలిగింది. ఎక్కడికెళ్ళినా పద్మినికే ఎక్కువమార్కులు పడతాయి.

ఆ తరువాత వసంతకి కూడా మేకప్ చేశాడతను.

మేకప్ అయిపోయేసరికి లంచ్ టైం అవడంతో అందరూ భోజనాల హాలువైపు వెళ్ళారు.. వీళ్ళని కూడా రమ్మనడంతో అప్పటికే ఆకలి వేస్తుండడంతో పద్మినీ, వసంతా వాళ్ళతో బయలుదేరారు.

దాదాపు మూడున్నర అవుతుండగా పద్మిని కెమెరా ముందుకు వెళ్ళింది.

నాలుగు డైలాగులు ఇచ్చి చెప్పమన్నారు.

అనసూయమ్మ అనే ఓ అత్తగారు తనకి ఏ మాత్రం ఇష్టంలేకుండా పెళ్ళిచేసుకున్న కొడుకు తన భార్యని నేరుగా ఇంటికి తీసుకురావడంతో ఆ కోడలిని ఇంట్లోకి రానివ్వకుండా అడ్డుపడి నానామాటలు అనే సీనులోవి.

ముందు లోపలికి అడుగుపెడుతున్న ఆ కోడలిని కళ్ళల్లో నిప్పులు కురిపిస్తూ ఆగు అని అరవడం.

పద్మిని " ఆగు" అనగానే కట్ అనేసి, అలాకాదు ఇలా అంటూ మరో విధంగా చెప్పించాడు. అది కూడా సరిగా రాక మరోసారి, మరోసారి " ఆగు" అనే ఆ ఒక్కపదాన్ని అరడజను సార్లు చెప్పిస్తుంటే వసంతకి చిరాకేసింది. నిజానికి పద్మినికి ఆ ఒక్కడైలాగ్ చెప్పడం పెద్దవిషయంకాదు. బాగానే చెప్తోంది కూడా కానీ, ఆ డైరెక్టర్‌కి నచ్చడం లేదు. పైగా " డ్రామా డైలాగ్‌కీ, టి.విలో చెప్పే డైలాగ్‌కీ చాలా తేడా ఉంటుందండి మీరు డ్రామాలోలాగా చెప్పకూడదు" అంటూ విసిగించేసాడు. పద్మిని ఓపిగ్గా అతను చెప్పినట్టు చెప్పింది. చివరికి ఓకె అని మరో డైలాగ్ చెప్పించాడు.

అది మాత్రం రెండోసారికి ఓకే అయింది.

వసంతకి కెమెరా టెస్టు జరగలేదు. ఆమెకి చాలా బాధనిపించింది.

పద్మినిని సెలక్ట్ చేసి మర్నాడు రమ్మన్నారు. వసంతకి ఏడుపొచ్చింది. ఇక్కడికి వచ్చాక కూడా తను వేషాల్లేక పద్మినిమీదే ఆధారపడి బతకాలా? మళ్ళీ ఇక్కడ కూడా ఆ తల్లీ కూతుళ్ళకి వండిపెడుతూ ఇలాగే బతకాలా అనిపించి కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

" మీకు ఒక పక్కింటావిడ క్యారెక్టర్ ఉంది చిన్నదే నాలుగైదు ఎపిసోడ్స్‌లో వస్తారు. మీకు ఓకెనా? " అడిగాడు డైరెక్టర్.

వసంతకి ముందు అర్ధంకాలేదు తననే అడుగుతున్నాడని గ్రహించాక ఆమె మొహం సంతోషంతో వెలిగిపోయింది.

" చాలా చిన్నది కానీ, నాలుగైదు ఎపిసోడ్స్‌లో వస్తుంది. "

" థాంక్స్ సార్" అంది మరింక వివరాలు అడక్కుండానే.

ఆవిధంగా పద్మిని, వసంతా తెలుగు టి.వి సీరియల్స్‌లో నటించేందుకు శివ చేసిన సాయం, అతని ప్రయత్నం సఫలం అయింది.

ఇంటికి వెళ్తూనే ఆ విషయం రజనికి, యవనికకీ చెప్పి తమ సంతోషం పంచుకున్నారిద్దరూ.

" ఎంతిస్తారు? " అడిగింది రజని కుతూహలంగా.

" మాకు తెలియదు రజనీ ఆ విషయం శివ చెప్పాలి" అంది పద్మిని.

" పోనీలే ఎంతోకొంత ముందు అడుగుపెట్టడం అంటూ జరిగితే అవే వస్తాయి. అవకాశాలు మిమ్మల్ని వెతుక్కుంటూ. అసలు యవనికని కూడా తీసుకెళ్ళి ఉంటే కళ్ళకద్దుకుని తనని ఏకంగా హీరోయిన్‌గా" అంది రజని.

పద్మిని కలవరంగా చూస్తూ అంది " పొరపాటున కూడా ఇంకెప్పుడూ ఆ మాట అనకు రజనీ, నీకు పుణ్యం ఉంటుంది. యవని బాగా చదువుకోవాలి. మంచి ఉద్యోగం చెయ్యాలి. హాయిగా బతకాలి నాలా కాకూడదు" అంది వణికే స్వరంతో.

కాసేపు అక్కడ నిశ్శబ్దం ఆవరించింది.

యవనిక తల్లివైపు అసహనంగా చూసింది.

ఆమెకి నిజంగానే టి.వి సీరియల్స్‌లో చేయాలని ఉబలాటంగా ఉంది. ఆ రోజు స్కూల్లో తను వేసిన ప్రియంవద పాత్ర చూసి స్కూల్లో అందరూ ఎంతో మెచ్చుకున్నారు. " సినిమాల్లో చేరు యవనీ" అని అందరూ ఎంతో ప్రోత్సహించారు. " ఏమవుతుంది చేరితే అమ్మదో పిచ్చి. ఏడాది మొత్తం ఉద్యోగం చేసి సంపాదిస్తే వచ్చేదానికన్నా ఒక్క సినిమాలోనో సీరియల్‌లోనో వేస్తే వస్తుందట" అనుకుంది.

కాసేపు కూర్చుని రజని ఇచ్చిన టీ తాగి ముగ్గురూ ఇంటికి వెళ్ళిపోయారు.

మర్నాడు మళ్ళీ యవనికను రజని దగ్గర వదిలి పద్మినీ, వసంతా స్టూడియోకి వెళ్ళారు.

ఆవిధంగా మొదలైన వాళ్ళ సీరియల్ పర్వం దినాభివృద్ధి చెందింది. పద్మినికి కొంచెం ప్రాధాన్యత ఉన్న పాత్రలు వచ్చాయి. వసంతకి కూడా ఫర్వాలేదు. యవనికని మంచి స్కూల్లో వేసింది పద్మిని.

కాలం మెత్తగా, ప్రశాంతంగా సాగిపోతోంది.

ఇదివరకటి ఆర్థికబాధలు ఇప్పుడు లేవు ఆ ముగ్గురికీ. కొంచెం మంచి అపార్ట్‌మెంట్‌లోకి మారిపోయారు, అటు శివ కుటుంబం, ఇటు పద్మిని వాళ్ళుకూడా. కాకపోతే రజని ఈసారి వాళ్ళకి కొంచెం దూరంగా పోదాం అనడంతో శివ మధురానగర్‌లో చూసుకున్నాడు ఇల్లు. పద్మిని యూసఫ్ గూడాలో చూసుకుంది. యవనికకి స్కూలు దగ్గర అయింది కొంచెం. ఇప్పుడు అందరూ మంచి తిండి తినగలుగుతున్నారు. మంచి బట్టలు కట్టుకోగలుతున్నారు, మంచాలు, టి.విగ్యాస్ స్టవ్, కొంచెం సామాను, కుర్చీలు కొనుక్కున్నారు. కానీ, చిక్కల్లా దాదాపు ప్రతిరోజూ షూటింగ్ ఉంటోంది. ఏమాత్రం విశ్రాంతి లభించడంలేదు. ఒక్కోసారి ఏవో ఇబ్బందులతో క్యాన్సిల్ అయి మళ్ళీ మర్నాడు అదే సీను అలా చేసిందే చేసి విసుగొచ్చేయసాగింది వసంతకి.

కానీ, సహనమే మనిషిని ముందుకు నడిపిస్తుందని పద్మిని హెచ్చరించడంతో వసంత తన చికాకుని మనసులోనే అణిచేసుకుని మామూలుగా గడిపేయసాగింది.

వాళ్ళు నటించిన సీన్సు టి.విలో చూసుకున్న మెదటిరోజు ఎంతో ఎగ్జయింటింగ్‌గా అనిపించింది ఇద్దరికీ. కానీ, నాటకానికీ, సీరియల్‌గా ఉన్న తేడా, జీవంలేని పాత్రలు వేయాల్సిన పరిస్థితి రావడం ఎందుకో మనసు చంపుకుని చేస్తున్నట్టే అనిపించింది పద్మినికి. తన జీవితంలో తను నటించిన ఒక్కో నాటకంలోని ఒక్కో పాత్ర గుర్తొస్తే ఆ పాత్రల్లో తను ఎంతగా లీనమైపోయేదో, నటన అయిపోయాక కూడా ఆ మూడ్‌లోంచి బైటికి రావడానికి ఎంత సమయం పట్టేదో తల్చుకుంటే గుండెని కోస్తూ ఓ విషాదరేఖ అలా పాకుతూ వెళ్ళిపోతుంది. తను వేస్తున్న అత్తగారి పాత్ర అంటేనే రోతగా అనిపించింది. ఏ మాత్రం కూడా సహజత్వానికి దగ్గరగా లేని పాత్ర ఏమాత్రం జీవంలేని పాత్రం. ఏంటీ ఈ ఖర్మ అనిపిస్తుండేది. నటన ఒకసారి. డబ్బింగ్ ఒకసారి. ముందు వేరేవాళ్ళతో డబ్బింగ్ చెప్పిస్తానన్నారు వాళ్ళు. పద్మిని ససేమిరా అని బతిమాలింది. " లేదండీ నేనే చెప్పుకుంటాను" అంది.

అదికూడా వాయిస్ టెస్ట్ అంటూ చేసి, ఎలాగొలా ఒప్పుకున్నారు.

యవనిక టెన్త్ పాసైంది. జూనియర్ కాలేజీలో ఇంటర్‌లో చేర్పించింది పద్మిని. బాగా చదువుకో పిచ్చి వేషాలు వేయద్దు అంటూ కూతుర్ని హెచ్చరించింది మొదటిరోజు కాలేజీకి వెళ్తుంటే. ఇప్పుడు యవనిక తల్లి, వసంత షూటింగ్ అంటూ వెళ్ళిపోయినా ఒకతే ఫ్లాట్‌లో ఉండగలుగుతోంది. పక్క ఫ్లాట్‌లో తన వయసే ఉన్న హరితతో పరిచయం అయింది. అతి కొద్ది సమయంలోనే ఇద్దరూ మంచి స్నేహితాళ్ళు అయారు. కాకపోతే ఆమె ఇంటర్ సెకండ్ ఇయర్. యవనిక ఫస్టియర్.

మధ్య, మధ్య శివ వస్తూ, పోతూ క్షేమసమాచారాలు తెలుసుకుంటున్నాడు.

పద్మినికి మరో సీరియల్‌లో అవకాశం వచ్చింది. అలాంటిదే మరో అత్తగారి పాత్ర చేయనని చెప్పాలనుకుంది. ఇంక తను ఈ పాత్రలకే పరిమితం అయిపోతానని భయంవేసింది ఆమెకి. కానీ, శివ నచ్చచెప్పడంతో ఒప్పుకుంది.

వసంతకి మొదటి అవకాశం అయాక కొంత గ్యాప్ వచ్చింది. అయినా పద్మినితో షూటింగ్స్‌కి వెడుతూనే ఉంది తన ప్రయత్నాలు తను చేస్తూనే ఉంది.

అనుకోకుండా కొన్నిరోజులు షూటింగ్ ఆగిపోవడంతో వాళ్ళకి కాస్త విరామం లభించినట్టు అయింది.

చాలాకాలం తరువాత ఇంట్లో ఉండి విశ్రాంతి తీసుకున్నారు.

యవనికకు కూడా వేసంకాలం సెలవులిచ్చారు.

ముగ్గురూ ఇంట్లో ఉండే అవకాశం ఏడాది తరువాత లభించింది.

యవనిక స్నేహితురాలు హరిత వచ్చింది.

" ఆంటీ మీఇద్దరూ ఇంట్లో ఉన్నప్పుడు అమ్మ మీ ఇంటికి వస్తానంది. అమ్మని రమ్మని చెప్పనా? " ఉత్సాహంగా అడిగింది హరిత పద్మినిని.

" రమ్మనమ్మా" అంది ఆప్యాయంగా పద్మిని.

" ఇప్పుడే వస్తాను" అంటూ హరిత తుర్రుమంది.

తన ఊళ్ళోలా వేషాలేసేవాళ్ళు అంటూ తామిద్దరినీ అక్కడ చులకనగా చూసేవాళ్ళు లేకపోవడం గమనించింది పద్మిని. అడపా, దడపా తను బైటికి వెళ్తుంటేనో, వస్తుంటేనో లిఫ్ట్‌లో ఎవరన్నా ఎదురైనా పలకరింపుగా నవ్వి ఏదో ఒకటి మాట్లాడడం ఆమెకి ఆనందంగా అనిపించింది ఇప్పుడు హరిత తల్లి వస్తాననడం మరింత సంతోషాన్నిచ్చింది.

కొన్ని నిమిషాలకే హరితతోపాటు ఆమె తల్లి కవిత, ఆవిడ ఆడపడుచు మీనాక్షి కూడా వచ్చారు.

వస్తునే " మీ నటన చాలా బాగుందండి" అంటూ పద్మినిని అభినందించారు.

వసంతకి మనసు చివుక్కుమంది. పద్మిని పాత్ర ఎంతో ప్రాధాన్యం ఉన్న పాత్ర అదృష్టవంతురాలు మొదటి అవకాశమే మంచి గుర్తింపు ఉన్న పాత్రతో లభించింది.

వాళ్ళు సీరియల్ గురించి గడ, గడా మాట్లాడుతుంటే వసంత లోపలికి వెళ్ళి టీ చేసి తీసుకొచ్చింది.

అప్పుడు వసంతని గమనించినవాళ్ళు " అరె మీరు కూడా ఆ సీరియల్‌లో ఉన్నారుకదూ.. పక్కింటావిడగా. "

వసంతకి కొంచెం సంతోషం వేసింది హమ్మయ్య నాకూ గుర్తింపు ఉందన్నమాట అనుకుంది.

హరితా, యవనికా యవనిక గదిలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

కవిత పద్మినిని అడిగింది " మీ అమ్మాయి చేత కూడా యాక్ట్ చేయిస్తారా?"

" లేదు" ఖచ్చితంగా చెప్పింది పద్మిని " తనని బాగా చదివిస్తాను. "

"మీరిద్దరూ స్వంత అక్కాచెల్లెళ్ళా?"

"కాదు" చిరునవ్వుతో అంది పద్మిని.

"మరి? "

"ఇద్దరం కలిసి నాటకాలాడేవాళ్ళం."

"అలాగా ఏమీ అనుకోకండి మీ హజ్బెండ్?" సందేహంగా ఆగిపోయింది మీనాక్షి.

పద్మిని మొహం నల్లబడింది. అది ఒక్క నిమిషం మాత్రమే. వెంటనే నవ్వి "లేరండీ ఆయన పోయారు" అంది.

"అరరే.. సారీ! " నొచ్చుకుంది కవిత.

మీనాక్షి వసంత వైపు చూసింది. వసంత గాభరాపడింది. ఏదో పనున్నట్టు ఖాళీ అయిన టీ కప్పులు తీసుకుని వంటగదిలోకి వెళ్ళి కాసేపు అవి కడుగుతూ కాలక్షేపం చేసి వచ్చింది ఈలోగా టాపిక్ మారుతుందన్న ఆశతో.

మరికాసేపు ఇద్దరూ టి.వి సీరియల్స్ గురించి మాట్లాడి వెళ్ళిపోయారు.

బతుకుజీవుడా అనుకుంది వసంత.

"ఇక్కడ ఎవరూ ఎవర్నీ పట్టించుకోరు అనుకున్నాం. ఇక్కడ కూడా మనకి ప్రశ్నలు మొదలైనాయి" అన్న వసంతతో "ఎక్కడైనా మనుషులు వాళ్ళే మనస్తత్వాలు అవే ఉంటాయి వసంతా" అని నవ్వింది పద్మిని.

"అమ్మా సినిమాకి వెడదామా!? " అంటూ వచ్చింది యవనిక.

"సినిమాకా! " సాలోచనగా చూసిన పద్మిని "సరే వెడదాం" అంది.

వసంత హుషారుగా అంది "అయితే రాత్రికి వంట చేసి పెట్టుకుని వెడదాం అక్కా. "

"అలాగే చేద్దాం" అంటూ లేచింది పద్మిని. ఆ తరువాత ఇద్దరూ కలిసి వంట చేసి పెట్టుకుని, సినిమాకి బయలుదేరారు.

**మరికొంతకాలం గడిచింది.** యవనిక ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు అయిపోయాయి. వేసవి సెలవలు. సెలవులకి స్నేహితురాలు ఊరికి వెళ్ళడంతో యవనికకు తోచడంలేదు.

పద్మిని, వసంతా షూటింగ్‌కి వెళ్తుంటే నేనూ వస్తాను అంది ఓ రోజు. ఆ ఛాయలకు కూడా యవనిక రావడం ఇష్టంలేని పద్మిని వద్దంది.

"నాకు బోర్‌గా ఉంది" ఇంట్లో ఏడుపు మొహం పెట్టింది యవనిక.

"రజని అత్త దగ్గరకు వెళ్ళు" అంది పద్మిని.

షూటింగ్‌కి తీసుకెళ్ళడానికి కారొచ్చింది. పద్మినిని, వసంతని పికప్ చేసుకుని మధురానగర్ వైపు వెళ్తున్నారని తెలిసి దారేకదా అని రజని ఇంటిముందు యవనికను దింపమని రిక్వెస్ట్ చేసింది ప్రొడక్షన్ అసిస్టెంట్‌ని.

అంత ఉదయాన్నే వెళ్ళడం ఇష్టంలేని యవనిక తను తరువాత బస్సులో వెళ్తానంది. యవనిక ఇప్పుడు నగర జీవితానికి బాగా అలవాటు పడడంతో కొన్ని చోట్లకు బస్సులో వెళ్ళిరావడం తెలుసుకుంది. కానీ తల్లికారులో రమ్మనడంతో తప్పనిసరై వెళ్ళింది. తనకి ఎప్పుడు విసుగు అనిపిస్తే అప్పుడే ఇంటికి వచ్చేయచ్చు అనుకుంది.

రజని యవనికను చూడగానే సంతోషంగా ఆహ్వానించింది.

పిల్లలిద్దరూ కూడా ఇంట్లోనే ఉండడంతో ఇల్లు సందడిగా ఉంది.

"నువ్వు కూడా అమ్మతో షూటింగ్ వెళ్ళకపోయావా సరదగా?" అంది రజని యవనికకు బౌల్‌లో గులాబ్‌జామ్ పెట్టిచ్చి.

"ఒద్దంది. అమ్మకి నేను షూటింగ్ వైపు వెళ్ళడం అసలు ఇష్టంలేదు" అంది యవనిక.

రజని నవ్వింది.

"ఎందుకత్తా నవ్వుతున్నావు" అడిగింది యవనిక.

"ఏం లేదు మీ అమ్మకి భయం? తనకి రావాల్సిన అవకాశాలు నీకు వచ్చేస్తాయని."

ఆశ్చర్యంగా చూసింది యవనిక. అలా ఉంటుందా అమ్మకి? అయినా వస్తే, గిస్తే తనకి హీరోయిన్‌గానో చెల్లెలిగానో వస్తాయి. అమ్మకి తను ఏవిధంగా కాంపిటీషన్?

రజని యవనిక భావాలు గమనిస్తూ అంది. "ఎందుకంటే నువ్విప్పుడు చాలా అందంగా అచ్చు సినిమాస్టారులా ఉన్నావు. నిన్ను చూడగానే తప్పకుండా నీకు వేషాలు వచ్చేస్తాయి. నీకో సంగతి తెలుసా! మీ మావయ్యని ఎవరో అడిగారట కూడా నిన్ను ఒప్పించమని మీ అమ్మ ఒప్పుకోదని చెప్పారు ఈయన. అయినా ఏమవుతుంది యవనీ.. తను వేషాలేస్తే తప్పులేదుగానీ నువ్వేస్తే ఏం?"

"నా చదువు పాడవుతుందని అమ్మ భయం అత్తా" అంది రజని మాటలకి ఆలోచిస్తూనే.

"ఆ సింగినాదం. ఎంతమంది అమ్మాయిలు యాంకరింగ్ చేస్తూ చదువుకోవడంలేదు. పోనీ వేషాలు ఇష్టంలేకపోతే యాంకరింగ్ చేయించవచ్చుగా నీచేత. అనకూడదు కానీ మీ అమ్మకి ఇంకా ఈ వయసులో కూడా తనకెవరన్నా కథానాయిక వేషం వేషం ఇస్తారేమో అనే ఆశ బాగా ఉంది."

యవనిక రజని మాటలకి ఆలోచనలో పడింది. అత్త చెప్పేది నిజమేనా? అమ్మకి తను పైకి వస్తుందేమో అనే భయమా? మీడియావైపు వెళ్ళిపోతే చదువు పాడవుతుందని భయమా? అలా అయితే ఈ రెండు నెలలు ఖాళీనేగా యాంకరింగ్ చేయచ్చుగా. అవును చేయచ్చుగా. రజని నాటిన ఆశల విత్తనం చిన్నగా మొలకెత్తసాగింది.

"నాకు యాంకరింగ్‌కి అవకాశం వస్తుందంటావా అత్తా?" అడిగింది.

"ఎందుకు రాదమ్మా. మహరాజులా వస్తుంది. మీ మావయ్యకి చెప్తాలే సాయంకాలం."

యవనిక కళ్ళు మెరిసాయి. "అమ్మ ఒప్పుకుంటుందో లేదో!?" అంది దిగులుగా.

"ఒప్పుకోక ఏం చేస్తుంది? అయినా నాకు తెలీకడుగుతాను. తనేం నిన్ను మెడిసన్ చదివిస్తుందా? ఇంజనీరుని చేస్తుందా? డిగ్రీనేగా! ఈ మాత్రానికి నీ భవిష్యత్తుకి అడ్డం పడడం దేనికి?"

రజనికి ఈ మధ్య పద్మిని పట్ల అకారణంగా ద్వేషం కలుగుతోంది. తన భర్త అంతగా ఆ అక్కా చెల్లెళ్ళ విషయంలో శ్రద్ధ చూపించి టీ.విలో వేషాలకోసం ఇక్కడిదాకా పిలిపించడం చికాగ్గా ఉంది. అంతేకాక, షూటింగ్ పేరుతో శివ ఆ అక్కా చెల్లెళ్ళతో ఎక్కువ సమయం గడపడం, రాత్రెప్పుడో ఇంటికి వచ్చి పడుకుని మళ్ళీ ఉదయాన్నే లేచివెళ్ళిపోడం తను ఇంటికి, పిల్లల్ని చూసుకోడానికి పరిమితమై పోవడం.. ఆమెలో అసంతృప్తికి, అసూయకి కారణం అవుతోంది. అప్పుడప్పుడు శివతో ఈ విషయమై గొడవలు కూడా పడుతోంది. ఎలాగైనా వాళ్ళని శివకి దూరం చేయాలనిపిస్తోంది. యవనికను రంగంలోకి దింపితే పద్మినికి అవకాశాలు తగ్గుతాయని, ఆమె ఇల్లుకదలకుండా కూర్చుంటుందని అమాయకపు ఆలోచన రజనిలో కలిగి చాలా రోజులైంది. ఇప్పుడు తన ఆలోచన యవనికి మెదడులోకి ఎక్కిస్తే మిగతా విషయాలు ఆ పిల్ల చూసుకుంటుందని రజని భావించింది.

అందుకే సాయంత్రందాకా యవనికకు ఆ విషయాలే చెబుతూ సాధ్యమైనంత బలంగానే ఆ పిల్ల మనసులో యాంకరింగ్ చేయాలన్న కోరికకు బీజం వేసింది. "నువ్వు పెద్దదానివవుతున్నావు. వయసు పెరుగుతున్నా కొద్దీ నీలో అందంకూడా పెరుగుతుంది. నువ్వే ఫీల్డ్‌లోకి వెళితే హీరోయిన్ గానే వెళ్తావు. మీ అమ్మలా కాదు. వసంత చూడు ఎప్పుడూ పనిమనిషి పాత్రలు తప్ప మరో పాత్రలు రావు దానికి. మీ అమ్మ ఎవరూ దిక్కులేక రంగస్థలం మీద కథానాయికగా వేసిందికానీ, టీ.వీలో ఈవిడ హీరోయిన్‌గా ఏం బాగుంటుంది

అందుకే అత్తగారు, వదినగారులాంటి పాత్రలిస్తున్నారు. అవైనా ఎన్ని రోజులుంటాయి. ఏదో ఒకనాడు వీళ్ళకి పాత్రలు రావడం తగ్గిపోతుంది అప్పుడు మీ పరిస్థితి మళ్ళీ మొదటికి వస్తుంది. హాయిగా నువ్వు వెళ్ళావనుకో ఇంకో పదిహేనేళ్ళు నువ్వు హీరోయిన్ పాత్రలే వేస్తావు. ఏమో అదృష్టం బాగుంటే నువ్వు సినిమాల్లోకి వెళ్ళిపోయి వెలిగిపోవచ్చు. మీ అమ్మ ఎందుకు నిన్ను రానివ్వడంలేదో నాకర్థం కావడంలేదు. అంతగా ఒప్పుకోకపోతే నిన్ను ఇంజనీరింగ్ గానీ, మెడిసన్‌కానీ చదివించమను. డిగ్రీలకి ఏం ఉద్యోగాలొస్తాయి." అంటూ నూరిపోసింది.

యవనిక పైన ఆమె మాటలు బాగానే పనిచేయడం ప్రారంభించాయి. సాయంత్రం ఆరింటికి "వెళ్తానత్తా" అని చెప్పి ఆటోలో ఇంటికి వచ్చింది.

వస్తూనే అద్దంలో తనని తాను చూసుకుంది.

బొద్దుగా ఉండే యవనిక ఇప్పుడు కొంచెం పొడుగు అయి, సన్నగా, నాజూగ్గా అనిపిస్తోంది. కాలేజీలో తోటి పిల్లలని చూసి హెయిర్ స్టైల్ నేర్చుకుంది. స్కర్ట్, పరికిణీలు మానేసి చుడీదార్ వేసుకుంటోంది. మొహానికి కొన్ని రకాల క్రీములు, రకరకాల బొట్లు, పౌడర్ వగైరా కొనుక్కుంది.

పద్మిని, వసంత షూటింగ్ కోసం ఒక సీనియర్ నటితో కలిసి చార్మినార్ వెళ్ళి కొన్ని ఆర్టిఫిషియల్ గాజులు, నెక్లెస్‌లు, చెవులకి జూకాలు కొనుక్కుంటూ యవనికకి కూడా కొంచెం నాజూగ్గా ఉండే ఆభరణాలు కొన్నారు. అవి వేసుకుని చూసుకుంది. ఆమె కళ్ళకి ఎంతో అందంగా కనిపించింది తన ప్రతిబింబం.

అత్త అన్నది నిజం తను మీడియాలో అడుగుపెట్టిందంటే తప్పకుండా బోలెడన్ని అవకాశాలు వస్తాయి. బోలెడంత డబ్బు వస్తుంది. అమ్మకిచ్చే రెమ్యూనరేషన్ ఏం సరిపోతుంది. తనకైతే బోలెడు డబ్బిస్తారు హీరోయిన్ పాత్రలిచ్చి. నిజమే కదా! డిగ్రీ చదువుకి ఏం ఉద్యోగాలొస్తాయి? మహా అంటే పదివేలో, పదిహేనువేలో వస్తాయేమో. అవును అమ్మ రాగానే ఇవాళ ఎలాగైనా గొడవ చేసి అయినా ఒప్పించాలి. లేదంటే ఇంజనీరింగ్ చదివించమనాలి.

దృఢంగా నిశ్చయించుకుంది. రాత్రి పద్మిని, వసంత వచ్చేసరికి నిద్రపోవడంతో మర్నాడు తనని తాను మానసికంగా సిద్ధం చేసుకుంది. అవసరం అయితే తల్లితో దెబ్బలాడి అయినా యాంకరింగ్ చేయాలని.

రజని మాటలు ఆ పిల్ల మీద బలంగా పనిచేయడం ప్రారంభం అయాయి. ఆ ప్రభావంతో తల్లిపట్ల తెలియని విముఖత కలుగసాగింది.

ఇంతకు ముందు ఒకసారి ఈ విషయంలో తనకి, తల్లికి జరిగిన వాగ్యుద్ధం గుర్తొచ్చింది యవనికకి.

కాలేజీకి వెళ్ళడానికి బస్సు పాసు కొనిచ్చింది పద్మిని. చాలా తక్కువ ఖరీదులో రోడ్డు పక్కన అమ్మే హ్యాండ్‌బాగ్‌లు కొనిచ్చింది. బట్టలు కూడా ఎక్కువ ఖరీదైనవి కాకపోవడం కూడా ఆమె అసంతృప్తికి కారణం అయింది. పైగా చేతిలో పదిరూపాయలు కూడా ఉండనివ్వని తల్లి పిసినారి తనం చూస్తుంటే ఒళ్ళు మండిపోతోంది యవనికకు.

ఓ రోజు గట్టిగా అనేసింది. "నా తోటి పిల్లలు వందలు, వందులు బ్యాగుల్లో పెట్టుకుని తెచ్చుకుంటుంటుంటే నా దగ్గర రూపాయి కూడా లేకపోవడం నాకు చాలా నామోషీగా ఉందమ్మా. నాకు యాభైరూపాయలివ్వడానికేం.?"

పద్మిని విస్తుబోయింది. "యాభైరూపాయలా? రోజువారీ ఖర్చు నీకు యాభై రూపాయలు ఇచ్చేంత డబ్బు నా దగ్గర ఉందా యవనీ ఎలా అడుగుతున్నావు? యాభై రూపాయలతో మనకి రెండు పూట్లా కూరలు వస్తాయి. అయినా నీకేం ఖర్చుటుంది? టిఫిను బాక్స్ ఇస్తున్నాను. బస్‌పాస్ కొనిచ్చాను. ఇంకా ఏం కావాలి?" అంది సీరియస్‌గా పద్మిని.

"చాలా అసహ్యంగా ఉంది. అందరూ బండి మీద వస్తుంటే నేను బస్‌పాస్ పెట్టుకుని బస్సులో తిరగడం మనకా శక్తి లేకపోవచ్చు కానీ, కనీసం అందరితోపాటు నేనూ క్యాంటిన్‌లో ఏమన్నా తినాలంటే కూడా నా దగ్గర పదిరూపాయలు ఉండద్దా?" గయ్‌మంది యవనిక.

"పదిరూపాయలు కాదు నువ్వు అడిగింది యాభై.." అంది పద్మిని.

"అవును అడిగాను.. నేనేం చిన్నపిల్లనా పదిరూపాయలు తీసుకుని వెళ్ళడానికి పోనీ నీకంత చేతకాకపోతే నాక్కూడా ఏదన్నా వేషం ఇప్పించు నా పాకెట్‌మనీ నేను సంపాదించుకుంటాను" అంది యవనిక.

"నోర్మూయ్ ఆ మాట ఎత్తదని చాలా సార్లు చెప్పాను.."

"ఎందుకు? ఎందుకు ఎత్తద్దు.. నేను టి.విలో యాక్ట్ చేయద్దు. నేను ఇంజనీరింగ్ చదవద్దు. డిగ్రీ చదివితే ఏం ఉద్యోగం వస్తుంది? నెలకి పదివేలు కూడా రావు నేనిలాగా జీవితాంతం దరిద్రంగా బతకాలా?" అరిచింది యవనిక.

పద్మిని నిశ్చేష్టురాలైపోయింది. ఏమంటోంది యవనిక. తనకి ఎదురు తిరగడం నేర్చుకుంటోందా? అన్నట్టుగా చూస్తూ గట్టిగా వార్నింగ్ ఇచ్చింది ఇవాళ వింటే విన్నాను మరోసారి ఇలాంటి చర్చ రానివ్వకు.

అది గుర్తువచ్చి నిరాశగా అనిపించింది యవనికకి. అమ్మ ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోదు. అప్పుడేం చేయాలి?

చూద్దాం ఒప్పుకోకపోతే అప్పుడు చూద్దాం ఏం చేయాలో అత్తని అడుగుతా ఏం చేయాలో తనే చెప్తుంది అనుకుంది.

ఆ రోజు షూటింగ్ లేకపోవడంతో అక్కాచెల్లెళ్ళిద్దరూ బాగా ఆలస్యంగా లేచారు. ఈలోగా యవనిక నిద్రలేచి ఉప్మా చేసేసింది.

తల్లి, వసంత లేచాక ముగ్గురూ టిఫిన్ తినేటప్పుడు ప్రారంభించింది.

"నాకు బోర్‌గా ఉంది ఇంట్లో ఉండి, ఉండి. రెణ్ణెల్లు కాలేజీకి సెలవులు" అంది ఉపోద్ఘాతంగా.

పద్మిని తల పంకిస్తూ అంది "నేనూ అదే అనుకుంటున్నాను. ఇంట్లో ఏం చేస్తావు? దగ్గర్లో టైలరింగ్ సెంటర్ ఉంది చేర్పిస్తాను అందులో చేరు, ఓ గంట కంప్యూటర్ క్లాసులో చేరు కాలక్షేపం అయిపోతుంది."

"టైలరింగా?" వినకూడని మాట విన్నట్టు మొహం పెట్టింది యవనికి.

"ఏం? ఇప్పుడు టైలరింగ్ అంటే మామూలు వర్క్ అనుకుంటున్నావా? బోలెడు సంపాదించుకోవచ్చు. కనీసం నీ బట్టలు నువ్వు కుట్టుకోవచ్చు" అంది పద్మిని.

"అందుకేనా నన్ను చదివిస్తున్నావు? ఆఖరికి నా చేత టైలరింగ్ చేయించాలనా?" మండిపడింది యవనిక.

ఆ పిల్ల మాటల్లోని తీవ్రతకి వసంతా, పద్మిని కూడా నివ్వెరపోయి చూశారు.

"చచ్చినా చేరను. ఎంసెట్ కోచింగ్‌కి వెళతాను."

"దేనికి? ఎంసెట్ కోచింగ్ నేను నిన్నేం ఇంజనీరింగ్ చదివించబోడంలేదు. నాకంతశక్తిలేదు" అంది పద్మిని.

"మరి ఏం చదివించాలనుకుంటున్నావు?"

"డిగ్రీ చేయిస్తాను. కంప్యూటర్ నేర్పిస్తాను. కావాలంటే ఇంకేదైనా చిన్న, చిన్న కోర్సులు ఏవన్నా ఉంటే చేర్పిస్తాను. అంతేకానీ, లక్షలు, లక్షలు ఖర్చు పెట్టి నిన్ను ఇంజనీరిగ్ చేయించే శక్తినాకెక్కడిది యవనీ..?"

"డిగ్రీ చదువుకి ఏం ఉద్యోగాలు వస్తాయో తెలుసా.. క్లర్క్ పోస్టులు.."

పద్మిని యవనిక మొహంలోకి చిత్రంగా చూస్తూ అంది. "క్లర్క్ నుంచి ఆఫీసర్ దాకా ఎదగచ్చు"

"ఆ ఎదగచ్చు చచ్చేలోగా" కసిగా అంది యవనిక.

"అంటే నువ్వేం చేయాలనుకుంటున్నావు?"

"యాంకరింగ్" ఠకీమని చెప్పింది.

వసంత, పద్మిని కూడా హతాశులై చూశారు. "యాం..క..రింగా" ఒక్కో పదమే ఒత్తిపలుకుతూ అంది పద్మిని.

"అవునమ్మా ఈ రెండు నెలల హోలీడేస్‌లో సరదాగా చేస్తాను. కాసిని డబ్బులు వస్తాయి. నాకు కాలక్షేపం అవుతుంది కూడాను" హఠాత్తుగా స్వరం మృదువుగా మార్చి అంది యవనిక.

"ఒద్దు. ఆ విషయాలు ఆలోచించవద్దు. నిన్ను మీడియావైపు కానీ, రంగస్థలం వైపు కానీ పంపడం నాకేమాత్రం ఇష్టం లేదు యవనీ. కావాలంటే పోస్ట్ గ్రాడ్యుయేషన్ కూడా చేయిస్తాను కానీ, నా మాట విని ఈ ఆలోచనలు మానెయ్."

"ఎందుకు? ఇంతమంది అమ్మాయిలు చేయగా లేనిది నేను చేస్తే ఏం?" రోషంగా అడిగింది.

"ఆ ప్రశ్నకి నేను సమాధానం చెప్పలేను. నాకిష్టంలేదు అంతే." పద్మిని ప్లేటు సింక్‌లో పడేసి బెడ్‌రూములోకి వెళ్ళిపోయింది.

"చూశావా? ఎలా వెళ్ళిపోయిందో ఈవిడకి నేను బాగుపడడం ఇష్టంలేదు" ఏడుపు గొంతుని నొక్కేస్తుంటే అంది యవనిక వసంతతో ఫిర్యాదుగా.

"అమ్మకిష్టం లేని పని ఎందుకు యవనీ? చదివిస్తానంటోందిగా చదువుకో. మాకెలాగా చదువులేదు నువ్వన్నా హాయిగా చదువుకో" అనునయంగా అంది వసంత.

"ఆ చదువు. బోడి డిగ్రీ కూడా చదువేనా?"

"ఇంకా పైకి చదివిస్తా అంటోందిగా! ఎంచక్కా చదువుకుని టీచర్‌గా ఉద్యోగం చూసుకుంటే హాయిగా ఉంటుంది, తేలికైన ఉద్యోగం బోలెడంత టైం ఉంటుంది. సెలవలుంటాయి. నెలతిరిగేసరికి ఎంతో కొంత జీతం వస్తుంది. మాకు చూడు రాత్రి పగలు కష్టపడితే ఏం వస్తోంది. తిండికీ, బట్టకీ గౌరవంగా బతకడానికి సరిపోతోంది.

అమ్మ షూటింగ్‌కి కట్టుకునే చీరలు చూసావా? ఎంత నాసిరకం చీరలు కట్టుకుందో మొన్న ఎవరో అనుకుంటున్నారు కూడా స్టూడియోలో పిచ్చి చీరలు కడుతుందని."

"అవన్నీ నా కనవసరం. మీకులా నాకు తక్కువ డబ్బులివ్వరు. యాంకరింగ్‌కి రోజుకి ఐదువేలిస్తారుట. రెండునెలలు చేసానంటే బోలెడు డబ్బు.

"రోజూ నీకు ప్రోగ్రాం ఉండాలిగా. వారనికో రోజు ఉంటుందేమో ఉంటే."

"ఏం కాదు నువ్వు టీ.వి చూడు తెలుస్తుంది. మీకు షూటింగ్ తప్ప వేరే ఏం ప్రోగ్రామ్‌లు వస్తున్నాయో ఎలా తెలుస్తుంది?"

వసంత మాట్లాడలేదు. ఈ పిల్ల మనసులో పురుగులా తొలుస్తోంది యాంకరింగ్ చేయాలన్న కోరిక ఇప్పుడు ఎవరేం చెప్పినా వినదు అనుకుని మౌనంగా ఉండిపోయింది.

యవనిక పద్మిని ఉన్న గది దగ్గరకు వెళ్ళి గుమ్మంలో నుంచుని గట్టిగా అంది. "అమ్మా రేపటిలోగా నన్ను ఎం.సెట్ కోచింగ్‌కి పంపిస్తావో, యాంకరింగ్‌కి పంపిస్తావో డిసైడ్ చేయి. లేకపోతే నేను నీతో మాట్లాడను" అంటూనే వీధి తలుపు తీసుకుని బాల్కనీలోకి వెళ్ళిపోయింది.

పద్మినికి తల గిర్రున తిరుగుతున్నట్టు అయింది.

ఎందుకిలా ప్రవర్తిస్తోంది యవనిక. ఎవరన్నా నూరిపోస్తున్నారా? తనకి వచ్చిన ఆలోచననేనా? ఎవరు నూరిపోస్తారు? ఒకవేళ రజని.. అవును రజని నూరిపోస్తోందేమో.

రజనికి తెలుసు తను యవనికను ఈ రంగంలోకి పంపడానికి విముఖంగా ఉందని. అయినా అలా చెప్పడంలో ఆమె ఉద్దేశం ఏమై ఉంటుంది?

యవనికది ఉడుకు రక్తం. తనేదంటే అదే కరెక్ట్ అనుకునే వయసు. కొంచెం వివేకంతో ఆలోచించే వయసు ఆ పిల్లకు రాలేదు. ఈ సమస్యని తను చాలా జాగ్రత్తగా పరిష్కరించాలి. తను ఏమాత్రం నోరుజారి ఏవన్నా అన్నా యవనిక చెప్పకుండా వెళ్ళిపోయి యాంకరింగ్‌కి ప్రయత్నాలు చేసుకోవచ్చు. అదే జరిగితే అక్కడ యవనిక పరిస్థితి ఎలా ఉంటుందో తనకి తెలుసు. పద్మిని నిలువెల్లా వణికిపోయింది.

ఈలోగా ఫోన్ మోగడంతో వసంత ఫోన్ తీసుకుని మాట్లాడుతూ "ఏంటి? అవునా ఒక్క నిమిషం ఉండు అక్కకి ఇస్తున్నాను" అంటూ గాభరాగా ఫోన్ పద్మిని చేతికిచ్చింది. "ఏమైంది? " అని అడుగుతూనే ఫోన్ అందుకుని "హలో" అన్న పద్మిని అవతలి నుంచి సీత ఏడుస్తున్న స్వరం విని ఖంగారుగా అడిగింది "ఏమైంది సీతా?"

సీత చెప్పింది విన్న పద్మిని చేతిలో ఫోన్ జారిపోయింది. నిశ్చేష్టురాలైన కూర్చుండిపోయింది.

వసంత పద్మిని దగ్గరగా వచ్చి ఆమె చేయి పట్టుకుని "అక్కా! " అంది వణుకుతున్న స్వరంతో.

"వసంతా.. ఘోరం జరిగింది. " అంది పద్మిని జీవంలేని చూపులతో.

అప్పుడే లోపలికి వచ్చిన యవనిక వాళ్ళిద్దరి వాలకం చూసి "ఏమైందమ్మా?" అంది.

పద్మిని యవనిక వైపు చూసి ఒక్కసారిగా బావురుమంది.

"ఏమైందమ్మా? " తల్లి హఠాత్తుగా అలా ఏడుస్తుండడంతో గాభరాగా దగ్గరకు వచ్చి భుజం మీద చేయేసింది యవనిక.

పద్మిని ఏడుస్తూనే "అర్జంటుగా ఆటో పిలువమ్మా! మనం మధురానగర్ వెళ్ళాలి" అంది.

"ఎందుకు? " అడిగింది యవనిక.

"చెప్తాను. ఆటో తీసుకురా."

యవనిక గబ,గబా బైటకి వెళ్ళిపోయింది.

సీత ఒక జూనియర్ ఆర్టిస్టు. ఆమె కాక దాదాపు పాతికమంది జూనియర్ ఆర్టిస్టులున్నారు. వాళ్ళందరినీ కథాపరంగా అవసరం అయినప్పుడు తీసుకొస్తాడు జూనియర్ ఆర్టిస్టుల ఇన్‌ఛార్జి రాములు.

ఒక చిన్న సీనుకోసం ఉదయం ఎనిమిదింటికి వచ్చి మేకప్ వేసుకుని రాత్రిదాకా వాళ్ళ పాత్రకోసం ఎదురు తెన్నులు చూస్తూ ఉంటారు. ఆ తరువాత పదినిమిషాలు సీనులో శవంగానో, పేరంటంలో ముత్తైదువులాగానో, పెళ్ళిళ్ళలో అతిధులుగానో అలా కనిపించి మాయమైపోతుంటారు. వాళ్ళకి చేతిలో పాతికో, పరకో పెడతారు. వీళ్ళంతా ఎక్కడెక్కడినుంచో టీ.వి మీదో, సినిమాల మీదో మోజుతో ఇంట్లో వాళ్ళకి చెప్పకుండా పారిపోయి వచ్చినవాళ్ళే. కొందరు అనేక విధాలుగా మోసపోయి పిల్లల తల్లులై పిల్లల భారం కూడా మోయడానికి నానా అవస్థాపడుతుంటారు. అలాంటి వాళ్ళల్లో రాధ ఒకతి.

భీమవరంలో పుట్టిపెరిగిన రాధ చిన్నప్పటి నుంచీ వాళ్ళ ఊళ్ళో అందగత్తెగా పేరుపొందింది. ఆ అహంతో చదువు పక్కన పెట్టి సినిమాలో చేరాలని, తనకి తప్పకుండా హీరోయిన్‌గా అవకాశాలు వస్తాయని ఆశతో ఇల్లు వదిలి హైదరాబాద్ చేరింది. రైల్లోనే పరిచయం అయిన శ్రీనివాస్ అనే కుర్రాడు ఆమెకి మాయమాటలు చెప్పి హైదరాబాదులో తన రూముకి తీసుకొచ్చి కొంతకాలం ఆమెతో కాపురం చేసి పారిపోయాడు. ఆ తరువాత వాళ్ళ కాళ్ళు, వీళ్ళ కాళ్ళు పట్టుకుని జూనియర్ ఆర్టిస్టుగా జీవితం ప్రారంభించింది.

ఆ తరువాత మరొకతను పరిచయం అయ్యాడు. గుడికి తీసుకెళ్ళి పసుపుకొమ్ము మెడలో కట్టి "నువ్వు నా భార్యవి" అని కొన్నాళ్ళు కాపురం చేసి పిల్లాడు పుట్టాక పారిపోయాడు.

రాధ ఆ దిగుళ్ళతో బాగా చిక్కిపోయింది. నిన్నటి షూటింగ్‌లో చిన్న పాత్ర వేసింది. ఉదయం ఆమె ఆత్మహత్య చేసుకుంది. ఆ విషయం సీత ఫోన్ చేసి చెప్పింది.

ఆ వార్తతో పద్మిని మనసు చెదిరిపోయింది.

వణుకుతున్న కాళ్ళతో యవనిక వసంత చెరో భుజం పట్టుకుని నడిపిస్తుంటే వచ్చి ఆటో ఎక్కింది.

యవనిక, వసంత చెరో పక్క కూర్చున్నారు పద్మినికి. ఆటో మధురానగర్ వైపు వెళ్ళింది.

వీళ్ళు వెళ్ళేసరికి అక్కడంతా జనం. పోలీసులు కొందరు అసిస్టెంట్ డైరెక్టర్లు, మరికొందరు షూటింగ్ టీమ్‌వాళ్ళు, మిగతా జూనియర్ ఆర్టిస్టులతో నిండిపోయి ఉంది.

అందర్నీ తోసుకుని ముందుకు వెళ్ళిన పద్మినిని సీత వచ్చి గభాల్న వాటేసుకుని బావురుమంది.

పోలీసులు అందర్నీ చెదరగొడుతూ శవాన్ని పోస్ట్‌మార్టమ్ కోసం అంబులెన్స్‌లో ఎక్కిస్తున్నారు.

రెండేళ్ళ రాధ కొడుకు ఏడుస్తున్నాడు. వాడిని ఒక ఆర్టిస్టు ఎత్తుకుని జోకొడుతోంది.

శివ కూడా అక్కడే ఉన్నాడు.

పద్మిని దగ్గరకు వచ్చాడు.

"ఎలా? ఎలా చనిపోయింది? ఎందుకు? " అదిరేపెదాలతో అడిగింది పద్మిని.

"ఏమో పద్మినీ. నిన్న బాగానే ఉంది. ఇంతలోకే ఏమైందో తెలియడంలేదు. కనీసం పసివాడ్ని చూసి అయినా ధైర్యం తెచ్చుకోవాలిగానీ ఇలా ఆత్మహత్య చేసుకోడం ఏంటి? పిరికితనం కాకపోతే. ఏదన్నా కావాలంటే సాయం చేయడానికి మనం ఇంతమందిమి ఉన్నాం. ఒక్కమాట చెప్పచ్చుగా" బాధగా అన్నాడు శివ.

"అవును ఒక్కమాట చెప్పచ్చుగా. నిన్నంతా కలిసే ఉన్నాం. మనసులో అంత బాధ ఉంటే పంచుకోవచ్చుగా. ఎందుకిలాంటి పనిచేసావు రాధా? " కన్నీళ్ళ మధ్య అనుకుంది పద్మిని.

యవనికకు కూడా బాగా దుఃఖం వచ్చింది.

వసంత ముందుకు వెళ్ళి ఆర్టిస్టు చేతిలోంచి బాబుని తీసుకుని అటూ, ఇటూ తిప్పుతూ ఊరుకోబెట్టడానికి ప్రయత్నించసాగింది.

పోలీస్ వ్యాన్ కదిలింది.

అందరూ తలా, ఒకమాట అంటూ రాధ పిరికితనాన్ని విమర్శిస్తున్నారు.

బాబుని ఏం చేయాలో ఎవరికీ అర్థం కాలేదు. ఎవరో తీసుకొచ్చి పాలుపట్టించారు.

అందరూ అక్కడే దిక్కుతోచని వాళ్ళలా నిస్సహాయంగా కూర్చుండిపోయారు.

**రాధ మరణం పద్మినికి** తీవ్రమైన మనస్తాపాన్ని, భయాన్ని కలిగించింది. రాధలాగా ఎందరో యువతులు మీడియా అనే దీపం చుట్టూ తిరుగుతూ పురుగుల్లా మాడిపోతున్నారు. ఇదొక వలయం.. ఇందులోకి ప్రవేశించడం చాలా కష్టం. ఒకవేళ ప్రవేశించడం అంటూ జరిగితే అటు ఎత్తుకి ఎదగడమో, లేక పల్లానికి పడిపోడమో జరుగుతుంది. ఒకప్పుడు వెండితెర జిలుగుల్లో ఇలాగే ఎందరో మాడి

మసైపోయిన సందర్భాలు, సంఘటనలు వార్తల్లోనూ, కథల్లోనూ చదివినా ఆ ప్రలోభంలో పడేవాళ్ళని మాత్రం ఆపలేకపోయారు.. ఇప్పుడు బుల్లితెర కూడా వచ్చి చేరింది. మనిషిని మానసికంగా, శారీరకంగా నిర్వీర్యుడిని చేసే అంతులేని ఛానెల్స్ ఆడపిల్లల జీవితాలకు బలిపీఠాలు.

కొంచెం అందంగా ఉన్నామన్న నమ్మకం కలగగానే మీడియావైపు ఆకర్షితులు అవడం, అవకాశాలు వస్తాయని పరుగులు పెట్టడం ఎంత అవివేకం. పదిమందిలో అందంగా ఉండడం కాదు వేయి మందిలో అందంగా కనిపించిన వాళ్ళు మాత్రమే అత్యంత భయంకరమైన ఈ పోటీని తట్టుకుని నిలబడి సాధించగల నేర్పు, ఓర్పు ఉండాలి. అన్నిటికీ మించి అదృష్టం ఉండాలి. ఈ వాస్తవం గ్రహించగలిగితే రాధలాంటి వాళ్ళ జీవితాలు బాగుపడతాయి.

ఆ రోజు తను కూడా తన అందం చూసుకునేగా,, తన అందాన్ని అతను పదే, పదే పొగిడి మైకంలో పడేసినందుకేగా మహానటి సావిత్రిలాగానో, ఏ మధుబాల లాగానో, మార్లిన్‌మన్రోలాగానే గొప్పనటి అవుతానన్నుకుని గుడ్డిగా నమ్మి కంటికి రెప్పలా చూసుకునే తల్లి, తండ్రుల్ని వదిలి వచ్చింది. నిజానికి ఈ మహానటీమణులు జీవితాలు కూడా విషాదాంతమే అయాయి. ఎందుకయాయి? కారణం ఏంటి? ఎవరు వాళ్ళ అకాల మరణానికి కారణం? మగవాడి స్వార్థమా? ఆడవాళ్ళ దురాశా?

అందుకే ఆడపిల్లలు చదువుకోవాలి. ఉద్యోగాలు చేయాలి. నలుగురిలో తిరగాలి. సమాజాన్ని అర్థం చేసుకుని, ఆకళింపు చేసుకుని, ఏది మంచి, ఏది చెడు అనే విషయాలను అవగాహన చేసుకోవాలి. అవును చదువుకోవాలి. తనెలాగూ ఇంక చదువుకునే అవకాశం లేదు కనీసం యవనికను బాగా చదివించాలి. అవును చదివించాలి.

"అక్కా" వసంత పిలుపుతో పద్మిని ఉలిక్కిపడింది.

"చెప్పు వసంతా" నిట్టూరుస్తూ అంది.

"రాధ చావుకి కారణం ఎవరో తెలుసా?"

"ఎవరు?" అనుమానంగా చూసింది పద్మిని.

"మన 'అత్తాకోడలు' సీరియల్ అసిస్టెంట్ డిరెక్టర్ కిశోర్ అట."

"ఏంటి? " పద్మిని అదిరిపడింది. "కిశోరా?"

"అవునక్కా! రోజూ షూటింగ్ అవగానే రాధని ఇంటిదగ్గర డ్రాప్ చేయడానికి రావడంతో లైంగికంగా వేధించాడంట. తనకిష్టంలేదని, ఇప్పటికే జీవితంలో చాలా నష్టపోయానని, తనని వదిలేయమని ఎంతో బతిమాలేదట. కానీ, చనిపోడానికి ముందురోజు రాత్రి తనకి లొంగకపోతే రాధ బతుకు నాశనం చేస్తానని, మీడియాలో కాలుపెట్టకుండా చేస్తానని బెదిరించి వెళ్ళాట్ట. అందుకే భయపడి ఉరేసుకుని చచ్చిపోయింది."

"చెప్పకు. " పద్మిని రెండు చెవులూ మూసుకుంది వినలేనిదానిలా.

భగవంతుడా ఏంటి ఆడపిల్లల బతుకు? ఎందుకిలా కష్టాలన్నీ మాకే రాశావు. నువ్వంటూ ఉంటే, నీ ఉనికి నిజమైతే రాధని కాపాడలేకపోయావెందుకు?

"రాధ కొడుకుని అనాధ శరణాలయంలో చేర్పిస్తుంటే వనజక్క పెంచుకుంటానని తీసుకుందిట."

వనజ అంటే జూనియర్ ఆర్టిస్టుల్లో చాలా సీనియర్. జూనియర్ ఆర్టిస్టు అంటే ఎక్స్ట్రా క్యారెక్టర్స్‌కి పనికివచ్చే చిన్న, చిన్న పాత్రలు చేయదగ్గవాళ్ళు. కానీ, వాళ్ళల్లో ఎంతోకాలంగా కేవలం పేరంటాలు పాత్రకో, పక్కింటి పిన్నిగారి పాత్రకో, లేక పబ్లిక్ టాప్ దగ్గర గాసిప్స్ మాట్లాడే అమ్మలక్క పాత్రలో ఎన్నో ఏళ్ళనుంచీ వేసేవాళ్ళున్నారు. వాళ్ళంతా ఎంతో సీనియర్స్ అయినా వాళ్ళనింకా జూనియర్

ఆర్టిస్టులనే అంటారు. అలాంటిదే వనజ. దగ్గర, దగ్గర అరవై ఏళ్ళు వయసుండే వనజ చాలామంచిది. కష్టసుఖాలు తెలిసిన స్త్రీ. ఆ పసివాడు ఆమె చేతిలో పడ్డాడంటే వాడి భవిష్యత్‌కి తిరుగులేదనమాట అనుకుంది పద్మిని.

"చాలా విషాదం కదక్కా తన కథ" అంది వసంత.

తలాడిస్తూ అంది పద్మిని. "కళాకారుణిల జీవితాలు ఎన్నో విషాదంగానే ముగిసిపోతున్నాయి వసంతా."

"అవునక్కా! జీవితం అంటే భయం కలుగుతోంది. "

ఆమె స్వరంలో వినిపించిన సన్నటి కంపన పద్మినిలో ఆందోళన కలిగించింది. "నువ్వేం ఆలోచించకు వసంతా! మనమేం చేయగలం అంది."

"నేనేం ఆలోచించడం లేదక్కా" అంది వసంత.

కొంతసేపు ఎవరి ఆలోచనల్లో వారుండిపోయారు.

వసంత నెమ్మదిగా పద్మిని పక్కకి చేరి, ఆమె భుజం మీద చెయ్యేసి నెమ్మదిగా అంది. "అక్కా నీకో విషయం చెప్పాలనుకుంటూనే నేను చెప్పలేకపోయాను."

"ఏ విషయం?" పద్మిని నొసలు చిట్లించింది.

వసంత తల వంచుకుని అరచేతిలో గీతలు చూసుకుంటూ అంది. "మరి, మన సీరియల్‌లో నీకు బావగారిగా నటిస్తున్నాడే సంతోష్"

"ఆ, సంతోష్. చెప్పు ఏమైంది? నిన్నేమన్నా అన్నాడా?" ఉద్వేగంగా అడిగింది పద్మిని.

"ఏమనలేదు కానీ,"

"చెప్పు వసంతా నాన్చకు నాకసలే టెన్షన్‌గా ఉంది. జాగ్రత్తగా ఉండాలి వసంతా మనం ముళ్ళకంపమీద నడుస్తున్నాం."

"అదికాదక్కా సంతోష్ నన్ను పెళ్ళిచేసుకుంటానన్నాడు."

పద్మిని నిశ్చేష్టురాలై చూసింది. సంతోష్ వసంతని పెళ్ళిచేసుకుంటానన్నాడా? ఆ పిల్లాడికి ఉంటే ముప్పై రెండో, ముప్పై మూడో వయసు ఉండచ్చు. వసంత నలభైకి చేరవవుతోంది. ఆమెకన్నా చిన్నవాడు.. ఎలా అన్నాడు? అన్నంత మాత్రాన పెళ్ళిచేసుకుంటాడని నమ్ముతోందా? పొట్టిగా, లావుగా, నల్లగా ఉండే సంతోష్ వసంత మీద ఎందుకు ఆసక్తి చూపిస్తున్నాడు. వసంతకి పెళ్ళిచేసుకోవాలని ఉందా? మనసులో ఉన్న కోరిక సంతోష్ పెళ్ళిప్రస్తావన తేవడంతో గుర్రంలా పరుగులు తీస్తోందా? వసంత చూడ్డానికి బాగానే ఉంటుంది. సంతోష్ లాంటి వ్యక్తికన్నా ఇంకా కొంచెం అందమైనవాడు చేసుకోవచ్చు. ఇంతకాలం ఆమెతో ఎవరూ ఇలా మాట్లాడి ఉండకపోయి ఉండచ్చు. అందుకేనా పిచ్చిపిల్ల ఆశపడుతోంది. వసంతకి పెళ్ళి చేయాలన్నమాట కానీ సంతోష్‌తో కాదు.

మొదటిసారిగా పద్మిని వసంత పెళ్ళిగురించి ఆలోచన రావడంతో ఆమెలో ఓ పశ్చాత్తాపం కలగసాగింది. వసంతకి పెళ్ళా! అవును తప్పేముంది. పాపం ఆమెకేం పెద్ద వయసుందని. అసలు ఎప్పుడో ఈ విషయంలో తను శ్రద్ధ వహించి ఉండాల్సింది. వసంతకి పెళ్ళిచేయాలన్న ఆలోచన ఎందుకు రాలేదు తనకి. శివతో చెప్పి ఉన్నా ఎప్పుడో మంచి కుర్రవాడిని చూసి ఉండేవాడు. తనకున్నంతలో నిరాడంబరంగా ఏ గుళ్ళోనో పెళ్ళి చేసేది. ఎంతపని జరిగింది. పాపం వసంత... పద్మిని వసంతవైపు సానుభూతిగా చూసింది.

"నీకు, నీకు పెళ్ళిచేసుకోవాలని ఉందా వసంతా? " అడిగింది ఆప్యాయంగా.

వసంత కొన్ని నిమిషాల మౌనం తరువాత అంది. " అవునక్కా! ఎంతకాలం ఇలా ఎదుగూ, బొదుగూ లేకుండా బతకడం కోసం పరుగులు పెడుతూ ఉండాలి. ఆయాసం తప్ప ఏమీ మిగలడం లేదు. ఎవరో ఒకళ్ళు నన్ను పెళ్ళి చేసుకుంటానంటే బాగుండని

ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నా. కానీ, కోరిక తీర్చమని అడిగినవాళ్ళేకానీ, నా కోరికలు తీర్చి, నాకో జీవితం ఇస్తానన్నవాళ్ళెవరూ తటస్థపడలేదు. ఇప్పుడు సంతోష్ చేసుకుంటానంటున్నాడు. అతనికి పెళ్ళి అయింది. కానీ, అతని వృత్తి నచ్చని భార్య అతన్ని వదిలి వెళ్ళిపోయిందిట. విడాకులు తీసుకుని మళ్ళీ పెళ్ళిచేసుకుందిట. అతనూ ఒంటరివాడు తోడుకావాలనుకుంటున్నాడు. ఈ రంగంలో చాలా ఏళ్ళుగా స్థిరపడి ఉన్నాడు. నెలకి ఎంతలేదన్నా కనీసం ముప్పైవేలు సంపాదిస్తాట్ట. చిన్న ఇల్లు స్వంతదే ఉందిట. నేను ఒప్పుకుంటే పెళ్ళిచేసుకుంటానన్నాడు. నాకు చేసుకోవాలని ఉంది. నాకింక పోరాడే ఓపికలేదు. రాధలాగానో, ఇంకో సుధలాగానో నేను అలసిపోయి ఆత్మహత్య చేసుకుని పరిస్థితి రాకూడదు అందుకే సంతోష్ని చేసుకోవాలనుకుంటున్నాను.''

స్థిరంగా, గంభీరంగా తన నిర్ణయాన్ని తెలియచేసి వసంతవైపు గుడ్లప్పగించి చూడసాగింది పద్మిని. వసంత ఎదిగింది. వసంతకి నోరుంది. వసంతకి మనసుంది. వసంతకి స్వంత అభిప్రాయం ఉంది. వసంతకి తనదంటూ ఒక జీవితం ఉంది. ఇంతకాలం ఈ పద్మినిని ఆలంబనగా చేసుకుని బతికిన వసంత ఇప్పుడు తన బతుకు తను బతకాలనుకుంటోంది. తనదారిన తను వెళ్ళిపోవాలనుకుంటోంది. పద్మినికి హఠాత్తుగా ఏడుపొచ్చింది. వసంత వెళ్ళిపోతుంది. యవనికా వెళ్ళిపోతుంది. ఇంక తనకెవరు? తను ఒంటరి. ఒంటరితనంని మించిన శాపం ఉందా? ఒంటరితనంని మించిన శిక్ష ఉందా? అవును శిక్షే. ఇంతకాలం ఎలాంటి రక్తసంబంధం లేని ఈ వసంతని తన గుప్పిట్లో ఉంచుకుని ఆమెకంటూ జీవితం లేకుండా చేసిన తనకి ఈ శిక్ష పడాల్సిందే

పద్మిని రెండు చేతుల్లో మొహం దాచుకుని వెక్కి, వెక్కి ఏడవడంతో వసంత తెల్లబోయింది. ఎందుకేడుస్తోంది. తను పెళ్ళిచేసుకుంటానంటే సంతోషించాల్సింది పోయి ఏడవడం ఎందుకు? అక్కకి తను పెళ్ళి చేసుకోడం ఇష్టంలేదా? అలా అయితే అది అన్యాయమేకదా. ఎప్పుడూ ఈ వసంత ఆవిడకి సేవకురాలిలా బతకాలా? మనసులో ఇంత కుళ్ళు, కల్మషం దాచుకుని ఇంతకాలం తనని ఆదరిస్తున్నట్టు నటించిందనమాట. ఎట్టి పరిస్థితుల్లో కూడా తన అభిప్రాయం మారదు. తను పెళ్ళిచేసుకోవాలి అంతే. ధ్రుఢంగా నిశ్చయించుకుంది వసంత.

ఆమెకి తెలుసు సంతోష్ అందగాడు కాదని, అంతకన్నా ఎక్కువగా తెలుసు అతను మంచివాడని. అందుకే వసంత అతన్ని ఇష్టపడింది. అతనితో బతకాలని నిశ్చయించుకుది. ఆమెకి చాలాకాలంగా ఉంది మనసులో తనింక జీవితాంతం ఈ పద్మిని మీదే ఆధారపడి బతకాలా అని. పద్మిని సంకెళ్ళనుంచి ఎలా తప్పించుకోవాలో, ఎప్పుడు తప్పించుకోవాలో ఇంతకాలం తెలియలేదు ఇప్పుడు తెలుస్తోంది. ఇప్పుడు తనకోదారి కనిపించింది. తన కళ్ళముందు ఉన్న ఆ దారిలో నడిచి వెళ్ళితే తనకో గమ్యం అంటూ ఏర్పడుతుంది.

వసంత విసురుగా అక్కడి నుంచి లేచి బాల్కనీలోకి వెళ్ళి నిలబడింది.

అమెకి అప్పటికప్పుడే సంతోష్ దగ్గరకు వెళ్ళిపోవాలని బలంగా అనిపించసాగింది.

మరికాసేపు పద్మిని ఏడుపు కొనసాగి ఉంటే వసంత నిజంగానే అప్పటికప్పుడు పెట్టే, బేడా సర్దుకుని వెళ్ళిపోయి ఉండేది కానీ, ఎంత అకస్మాత్తుగా ఏడుపు ప్రారంభించిందో అంత అకస్మాత్తుగా ఏడుపు ఆగిపోవడం, పద్మిని కళ్ళు తుడుచుకుని వసంత దగ్గరకి రావడం జరిగింది.

వసంత భుజం చెయ్యివేసి మృదువుగా అంది పద్మిని. ''సారీ వసంతా! ఏమనుకోకు. ఇంతకాలం కలిసి ఉన్న మనం ఇప్పుడు విడిపోతున్నాం అనే ఊహ కూడా నేను భరించలేకపోయాను. ఫర్వాలేదు. ఈ ప్రపంచంలో ఎవరికెవరు? నీ పెళ్ళికి నేను మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాను. నేను నీకో పెద్దదిక్కునని, నీ శ్రేయస్సు కోరేదాన్నని నీకు నమ్మకం ఉంటే అతన్ని ఒకసారి మనింటికి తీసుకురా నేనోసారి మాట్లాడి నిర్ణయిస్తాను.''

వసంత నమ్మలేనట్టుగా కళ్ళు విప్పార్చుకుని చూసింది పద్మినివైపు.

"అలా చూస్తున్నావేంటి? నేను మాట్లాడకూడదా? " చిరునవ్వుతో అడిగింది పద్మిని. అప్పటిదాకా బాగా ఏడ్చి ఉండడం వలన కళ్ళు మంకెన పూవుల్లా అయాయి. చెక్కిళ్ళు ఎర్రగా కమిలి మందారపులను గుర్తుకు తెస్తున్నాయి. తడిసిన ముంగురులు నుదుటి మీద రింగులుగా అతుక్కున్నాయి. అక్కడక్కడా నెరుస్తున్న జుట్టు, పెదాలకు రెండువైపులా సాగిన చర్మం పద్మిని వయసుని స్ఫుటంగా కనిపించేలా చేస్తున్నాయి.

"ఎందుకు మాట్లాడకూడదక్కా" నవ్వింది వసంత. "కానీ, ఏం మాట్లాడతావో తెలుసుకోవాలనుకుంటున్నాను."

"మా వసంతని పెళ్ళి చేసుకోవాలంటే నీకు కావాల్సిన కట్నకానుకలు ఏంటబ్బాయ్ అని అడుగుతాను సరేనా!? " చిలిపిగా అంది పద్మిని."

వసంత చెక్కిళ్ళమీదకి సిగ్గుతెరల్ని దింపి, సూర్యుడు పశ్చిమానికి అస్తమిస్తున్నాడు. ఆకాశం మొత్తం లేత నారింజరంగు పెయింట్ ఒలికిన కాన్వాస్‌లా ఉంది.

"ఎప్పుడు తీసుకొస్తావు? " అడిగింది పద్మిని.

"రేపే" వసంత స్వరంలో ఎన్నడూ వినని తీయని పరవశం.

పద్మిని నవ్వి ఆమె భుజం తట్టి తప్పకుండా తీసుకురా అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

అన్నట్టుగానే మర్నాడు సాయంకాలానికి సంతోష్‌ని తీసుకుని వచ్చింది వసంత.

పద్మినిని చూసి నమస్కరించి అన్నాడు "వసంత అంటే నాకు ఇష్టమే మేడమ్. నాకూ వసంతకీ ఉంటే, గింటే మూడేళ్ళ తేడా.. ఫర్వాలేదు ఈ రోజుల్లో అలాంటివేం పట్టించుకోడం లేదు. ఒకప్పుడు అమ్మాయి వయసు అబ్బాయి వయసుకన్నా తక్కువ ఉండాలి అనేవాళ్ళు. ఇప్పుడు చాలామంది పెద్ద, పెద్ద వాళ్ళు కూడా తనకన్నా చిన్నవాడైన వాడిని పెళ్ళి చేసుకుంటున్నారు. మీకేం అనుమానాలున్నా అడగచ్చు మేడమ్" అన్నాడు.

అతని స్వరంలో వినిపిస్తున్న నిజాయితీ, కళ్ళల్లో ఉన్న స్వచ్ఛత చూసాక వసంత నిర్ణయాన్ని హర్షించి, ఆమోదించలేకుండా ఉండలేకపోయింది పద్మిని.

"పెళ్ళి తరువాత తనకెలాంటి సమస్యలుండకుండా ఉంటే చాలు. ఇప్పటిదాకా చాలా కష్టాలు పడింది పిచ్చిపిల్ల. అమాయకురాలు తనని అర్థం చేసుకుని జీవితాన్ని ఇస్తున్నారు. ఎప్పటికీ ఇలాగే ఉండాలని కోరుకుంటున్నాను" అంది పద్మిని.

"తప్పకుండా మేడమ్. ఈ ఫీల్డులో అందరూ దుర్మార్గులే ఉండరని నిరూపిస్తాను సరేనా!?" నవ్వాడు సంతోష్. నల్లని అతని మొహంలో తెల్లని పలువరుస తళుక్కుమంది.

రెండు రోజుల తరువాత పద్మిని శివని కలిసి వసంత నిర్ణయాన్ని తెలియచేసింది.

"అరే సంతోషా! నాకు బాగా తెలుసు పద్మినీ. చాలా మంచివాడు. అతనితో జీవితం ముడిపడుతోందంటే వసంత దశ తిరిగిందనే అనుకోవాలి. ఇంక తన కష్టాలన్నీ గట్టెక్కినట్టే" అన్నాడు ఆనందంతో.

శివ సాయంతో సంతోష్‌ని, వసంతని తీసుకుని వెళ్ళి రిజిస్ట్రార్ ఆఫీసులో నమోదు చేయించింది పద్మిని.

ఈలోగా వెంకటేశ్వర స్వామి ఆలయానికి తీసుకెళ్ళి దండలు మార్పించింది. గుడిలో పూజారితో నాలుగు మంత్రాలు చదివించి అక్షింతలు వేయించింది.

నెల తరువాత వసంతా, సంతోష్‌ల పెళ్ళి లీగలైజ్ అయింది.

టీంలో కొందరు కళాకారులను, టెక్నీషియన్స్‌ని పిలిచి చిన్న పార్టీ ఇచ్చాడు సంతోష్.

ఆరోజే వసంత శాశ్వతంగా తన సామానుతో సంతోష్ ఇంటికి వెళ్ళేరోజు.

యవనికకి వసంత పెళ్ళి చేసుకోడం విచిత్రంగా అనిపించింది. వసంత పిన్ని పెద్దది కదా. ఈ వయసులో కూడా పెళ్ళిళ్ళు చేసుకుంటారా అనుకోసాగింది. కానీ, పైకి మాత్రం ఆనందంగా కనిపిస్తూ వసంతని విడవకుండా కబుర్లు చెబుతూ ఆమె బట్టలు, సామాను సర్దుకోడానికి సాయం చేయసాగింది.

పద్మిని వసంత కొత్త సంసారానికి కావలసిన కొన్ని కుర్చీలు, టీపాయ్ కొనిచ్చింది. "కాపురానికి వెళ్ళాక ఇంట్లో ఏం ఉన్నాయి, ఏం లేవు చూసి చెప్పు. ఇంకేదన్నా కావాలంటే కొందాం" అంది పద్మిని వసంతతో.

వసంతకి మొదటిసారిగా పద్మినిని వదిలి వెళ్తున్నందుకు ఏడుపొచ్చింది. ఆరోజు తను శుభవార్త చెప్పిన రోజు పద్మిని ఎందుకంతలా ఏడ్చిందో ఇప్పుడు దుఃఖం ఎగదన్నుతుంటే కానీ అర్థంకాలేదామెకి.

"నిన్ను వదిలి వెళ్తున్నందుకు నన్ను క్షమించక్కా" అంది గద్గద స్వరంతో.

"అవేం మాటలు వసంతా. నీ జీవితం నా కోసం మోడులా గడుపుతావా? అలా గడపమనడం నా స్వార్థంకదూ. ఇంతకాలానికి నువ్వు ఒక ఇంటిదానివైనావు. అప్పుడప్పుడూ వస్తుండు వసంతా! అక్కడికి వెళ్ళగానే నన్ను మర్చిపోవుగా." దుఃఖం అడ్డుపడడంతో ఆపేసింది పద్మిని.

"ఎంతమాటన్నావక్కా. దిక్కుతోచని స్థితిలో రోడ్డున పడిన నన్ను ఆదుకుని, ఇంతకాలం ఆశ్రయం ఇచ్చావు. నా కష్టాలు, నీ కష్టాలుగా భావించావు. పెద్ద దిక్కువ నేను దారితప్పకుండా అనుక్షణం నన్ను కాపాడావు. నీ ఋణం తీర్చుకోలేనక్కా.. ఎప్పటికీ తీర్చుకోలేను. "

"పిన్నీ నేను ఎప్పుడన్నా మీ ఇంటికి రావచ్చా!?" బిక్కమొహంతో అడిగింది యవనిక.

"ఎప్పుడన్నా కాదు. మా దగ్గరే ఉండు. నీ పెళ్ళికూడా మేమే చేస్తాం. సరేనా?" యవనిక చుబుకం పట్టుకుని నవ్వుతూ చూసింది వసంత."

"థాంక్యూ పిన్నీ." నవ్వింది యవనిక. పద్మిని వసంత దంపతులకి మంచి ఖరీదైన బట్టలు పెట్టింది. ఇద్దరూ వంగి కాళ్ళకు నమస్కరిస్తుంటే తన హోదా పెరిగిపోయినట్టు అనిపించింది పద్మినికి.

"జాగ్రత్త సంతోష్. ఎవరూ మీ గురించి ఎలాంటి వెటకారాలు, అవాకులు, చవాకులు మాట్లాడకుండా గౌరవంగా, అన్యోన్యంగా ఉండండి. మీకేం కావాలన్నా నేనున్నానని మాత్రం మర్చిపోకండి."

"మీరే ఉన్నారు. ఇంతకాలం వసంతకొక్కదానికే ఉన్నారు. ఇప్పుడు నాకూ మీరున్నారన్న భావన నాకెంత ఆనందాన్ని, తృప్తినీ ఇస్తోందో మీరు అర్థం చేసుకుంటే చాలు. వసంతని నేను కంటికి రెప్పలా చూసుకుంటాను. కాకపోతే తను ఇక ముందు నటించే అవసరం మాత్రం లేదని చెప్పాను."

"చాలా మంచి మాట చెప్పావు. తనకేం పెద్ద గొప్ప క్యారెక్టర్‌ల్లు ఇవ్వడంలేదు. వదులుకుంటే ఎలా గడుస్తుంది అనిపించే సంపాదనా లేదు. ఇల్లుని, నిన్ను చూసుకుంటే చాలు. నువ్వు తనని చూసుకో."

వసంత నవ్వింది. "పెళ్ళికి ముందే తను ఈ మాట చెప్పాడక్కా. ఒకవిధంగా చెప్పాలంటే ఆ మాట చెప్పాడనే నేను ఈ పెళ్ళికి ఒప్పుకున్నాను."

"పోనీలే ఎలా ఒప్పుకుంటే ఏం? పెళ్ళి జరిగింది. సరే బయలుదేరండి మరి. మళ్ళీ వర్షం వస్తుంది" హెచ్చరించింది పద్మిని.

"వెళ్ళొస్తాం" అంటూ ఇద్దరూ గుమ్మం దాటి మెట్లదాకా వెళ్ళి వెనక్కి తిరిగి చెయ్యి ఊపారు. నీళ్ళు నిండిన పద్మిని కళ్ళకి మెట్లుదిగుతున్న ఆ జంట మసకగా మారి, నెమ్మదిగా అదృశ్యం అయిపోయారు.

అక్కడనుంచి గబ, గబా వెళ్ళి బాల్కనీలో నిలబడింది. అక్కడినుంచి చూస్తే బైట నడిచేవాళ్ళు కనిపిస్తారు.

యవనిక మాత్రం వంటగదిలో పెట్టిన స్వీట్స్ ప్లేటులో తెచ్చుకుని టివి ముందు సెటిల్ అయింది.

**పద్మినికి ఇల్లంతా** శూన్యంగా తోచసాగింది. వసంత పెళ్ళిచేసుకుని భర్తతో వెళ్ళిపోడంతో తాను పూర్తిగా అనాథగా మిగిలిపోయినట్టు అనిపించసాగింది. యవనిక ఉన్నా తనకలా ఎందుకనిపిస్తోందో ఆమెకే అర్థం కావడంలేదు. ఒంటరిగా ఏమీ చేయాలని అనిపించడంలేదు.. ఎక్కడికీ వెళ్ళాలని కూడా అనిపించడంలేదు. వంటగదిలోకి వెళ్ళినా కిచెన్ ప్లాట్‌ఫామ్ దగ్గర వసంత కూరలు కట్‌చేస్తూనో, బాల్కనీలో కుండీల్లో మొక్కలు సవరిస్తూనో, ఆరిన బట్టలు మడతలు పెడుతూనో ఎక్కడోక్కడ, ఏదో విధంగా వసంత కనిపిస్తూనే ఉంది. తన జీవితంలో ఈ వసంత అనబడే స్త్రీ ఎందుకింతగా ముడివేసుకుపోయిందో, ఆమెకీ తనకీ ఉన్న అనుబంధం ఏంటో కూడా పద్మినికి అర్థం కావడంలేదు.

వసంత వెళ్ళిపోయిన మర్నాడు ఫోన్ చేసింది. "ఇల్లు చిన్నదే అయినా పొందిగ్గా ఉంది, చుట్టుపక్కల వాళ్ళంతా మంచివాళ్ళు, స్నేహంగానే ఉండేలా అనిపిస్తున్నారు నేనిక్కడ సుఖంగా ఉంటానన్న నమ్మకం నాకు కలుగుతోంది నువ్వు, యవనిక వస్తూ ఉండాలక్కా! " అంది.

వసంత సుఖంగా ఉండడమే తనకి కావాలి. తనని ఇంతకాలం నమ్ముకుని, కష్టసుఖాల్లో వెంట ఉన్న వసంత, పచ్చడే పెట్టినా, పరమాన్నంగా భావించి తనతోపాటే తిని బతికిన వసంత ఇన్నాళ్ళకి ఒక ఇంటిదైంది. ఆమెని అర్థం చేసుకున్నవాడు, ప్రేమగా చూసుకునేవాడు భర్తగా లభించాడు.

కానీ, ఎంచేతో ఆమె వెలితిని తను భరించలేకపోతోంది. వసంతకి ఎంత స్వార్థం అనిపించసాగింది మధ్య, మధ్య. అంతలోనే తన ఆలోచనకి తనే ఉలిక్కిపడి సర్దుకోడానికి ప్రయత్నిస్తోంది కానీ, ఏమూలో వసంత తననిలా ఈ వయసులో ఒంటరిగా వదిలి వెళ్ళడం ఆమె స్వార్థంగా, ఆమెలో అంతర్గతంగా దాగి ఉన్న పైశాచిక మనస్తత్వానికి పరాకాష్టగా అనిపించసాగింది.

వారంరోజుల తరువాత వసంత, సంతోష్ వచ్చారు.

వాళ్ళని చూస్తూనే యవనిక చాలా సంతోషించింది. వసంత తీసుకొచ్చిన స్వీట్స్, పళ్ళు హక్కుగా, ఆనందంగా స్వీకరించింది. కానీ, పద్మినికెందుకో వసంత తనకి స్వీట్సు, పళ్ళు తీసుకుని రావడం అవమానంగా అనిపించింది.

"ఎలా ఉన్నావక్కా?" వస్తూనే ఆలింగనం చేసుకుంది వసంత.

పద్మిని బలవంతంగా నవ్వి "నువ్వెలా ఉన్నావు వసంతా?" అంది.

"నేను బాగున్నాను.. నన్ను చూస్తే నీకే తెలుస్తుంది ఎంత ఆనందంగా ఉన్నానో!" మెరిసే కళ్ళతో చెప్పింది వసంత.

పద్మిని చూపులు వసంత వైపు పదునుగా తిరిగాయి.

నిజంగానే తానింతకు ముందు ఎన్నడూ చూడనంత అందంగా, నేవళంగా ఉంది. ఆకుపచ్చ, నీలం కలిసిన షిఫాన్ చీర కట్టుకుంది, ఆకుపచ్చ జాకెట్ వేసుకుంది. మెడలో సూత్రం గొలుసు, ఆకుపచ్చ పూసలు రెండు వరసలుగా మెడని చుట్టుకుని కొంచెం కిందికి చేరగా దానికున్న ముత్యాలు, పచ్చలు పొదిగిన లాకెట్ తనని చూసి ఫక్కుమని నవ్వినట్టు అనిపించింది పద్మినికి. ఎంత బాగుంది

వసంత. ఎన్నడూ చూడని కొత్త అందాలు, వింత మెరుపులు! నలభై దాటిన వసంతకి మెడలో పసుపుతాడు పడగానే ఇంత అందం ఎలా వచ్చింది? ఇంత అందంగా మునుపే కనిపించి ఉంటే ఈమెకి కూడా కథానాయక పాత్రలే వచ్చేవేమో. వసంత కళ్ళల్లోకి చూసింది పద్మిని. నవ్వుతున్నాయి ఆ కళ్ళు మెరుపులు మెరిపిస్తూ, సంతృప్తిగా, ఆనందంగా నవ్వుతున్నాయి. ఆ నవ్వు చూస్తుంటే అర్థమైంది పద్మినికి అదంతా అందంకాదని, ఆమె జీవితంలో వచ్చిన కొత్త మార్పు తెచ్చిన కళ, కాంతి అని.

" ఏంటక్కా అలా చూస్తున్నావు? " నవ్వుతూ అడిగింది వసంత.

" ఏంలేదు మా వసంత ఇంత అందంగా ఎలా తయారైంది అని ఆలోచిస్తున్నాను" నవ్వింది పద్మిని.

" జీవితంలో తృప్తి, ఆనందం, చీకూ, చింతాలేని ప్రశాంతత వీటిని మించి ఏంకావాలి? నేను ఇంతకాలంగా కోరుకున్నవన్నీ నాకు లభించాయి. అదే నాలో ఇంత కాంతిని నింపిదక్కా" నిజాయితీగా అంది వసంత.

పద్మిని తలాడిస్తూ "అవును నువ్వన్నది నిజం. ఆ, పద, టీ పెడదాం యవని, సంతోష్ మాట్లాడుకుంటూ ఉంటారు" అంది వంటగది వైపు దారి తీస్తూ.

ఇద్దరూ వంటగదిలోకి వెళ్ళిన తరవాత వసంత పద్మినికి చాలా కబుర్లు చెప్పింది. అందులో సంతోష్ తననెంత అపురూపంగా చూసుకుంటున్నాడో ఆ వివరాలు చాలా ఉన్నాయి. అవన్నీ పద్మినికి వినాలనిపించలేదు.

పద్మిని భావాలు గమనించిందో లేక తను చెప్పాలనుకున్నవన్నీ చెప్పేసి ఏమీ మిగలక మాట తిప్పిందో కానీ, వసంత అడిగింది "మళ్ళీ నీకు ఏమన్నా అవకాశాలు వచ్చాయా? ఏవన్నా షూటింగ్స్ అయాయా?"

పద్మిని నిరాసక్తంగా అంది "రాలేదు, అయినా నేను ప్రయత్నించలేదు. ఎవరికీ ఫోనూ చేయలేదు వసంతా! కొంతకాలం నేను చేయదల్చుకోలేదు. ఓపిక లేదు నాకు."

వసంత చిత్రంగా చూసింది "అదేంటక్కా నువ్విప్పుడు వేషాలు మానేస్తే యవనిక చదువు, పెళ్ళి బోలెడు ఖర్చు.. ఎవరు చేస్తారవి?"

పద్మిని నవ్వింది "మానలేదు వసంతా. కొన్ని రోజులు గ్యాప్ తీసుకుంటున్నా. చేసి,చేసి ఆ యాంత్రికమైన రోల్స్ చేయాలనిపించడంలేదు. ఒక నాటకం వేసినప్పుడు కలిగిన సంతృప్తి నాకీ సీరియల్‌లో వచ్చే వేషాలువల్ల కలగడంలేదు. వారం, పది అవసరాన్ని బట్టి, స్క్రిప్ట్‌ని బట్టి నెలరోజులు కూడా మనం రిహార్సల్స్ చేసేవాళ్ళం. ఆ తరువాత ప్రోగ్రామ్ ఉండేది. గంటన్నర నాటకం పూర్తయాక జనాల అభినందనలు పరంపరలో తడిసిపోయేవాళ్ళం. వాళ్ళ చప్పట్ల హోరులో కొట్టుకుపోయేవాళ్ళం కానీ, ఇందులో నాకెలాంటి ఆనందం కనిపించడంలేదు. మొక్కుబడిగా ఏదో చేసి వాళ్ళిచ్చిన డబ్బులు తెచ్చుకుంటుంటే నాకే తెలియని గిల్టీఫీలింగ్. కేవలం డబ్బుకోసమే ఆత్మని తాకట్టు పెట్టి ఒక యంత్రంలా వాళ్ళిచ్చిన డైలాగులు అప్పచెప్పేసి వస్తున్నాం అనిపిస్తోంది. మన అనుభవం, మనం నేర్చుకున్న కళ అంతా వృధా. నటనంటే తెలియని వాళ్ళ పర్యవేక్షణలో నటించడం అంటే నన్ను నేను చంపుకున్నట్టుగా అనిపిస్తోంది. ఉదయం ఆరున్నర, ఏడింటికి వెళ్ళి మొహానికి రంగులేసుకుని కూర్చుంటే సరిగా షూటింగ్ సమయానికి మొహమంతా జిడ్డుతో మన మొహం మనకే అసహ్యం పుట్టేలా తయారవుతుంది. ఇంత కష్టపడిన తరవాత ఎటునుంచి కూడా ఎలాంటి అభినందనగానీ, పొగడ్తకానీ మనకి లభించదు. ఏవిటో చాలా యాంత్రికంగా, అయిష్టంగా చేస్తున్న ఉద్యోగంలా ఉందికానీ, ఒక కళాకారిణిగా బతుకుతున్నట్టులేదు నాకు."

వసంతకి కూడా పద్మిని మాటలు వాస్తవంగానే అనిపించాయి. ఆమె అంటున్న దానిలో తప్పేం లేదు తనకీ అలాగే అనిపించింది. అందుకే తను కళాకారిణి పాత్ర నుంచి ఒక గృహిణి పాత్రలోకి దిగింది. ఇందులో తనకెంతో సుఖంగా, ఆనందంగా, తృప్తిగా ఉంది. పద్మినికి కూడా ఇలాంటి జీవితాన్ని ఇచ్చే వాళ్ళెవరన్నా లభిస్తే ఎంత బాగుండు అనుకుంది.

ఆలోచిస్తూ నిలబడిన వసంతవైపు ఆత్మీయంగా చూస్తూ " పద వసంతా. టీ తాగుదాం" అంది పద్మిని టీ కప్పులు, మిక్స్చర్ ప్లేట్లు ట్రేలో పెడుతూ.

వసంత ఆలోచనల నుంచి తేరుకుని నెమ్మదిగా నవ్వి " ఇలా ఇవ్వక్కా" అంటూ పద్మిని చేతిలోంచి టీ కప్పులు, మిక్స్చర్ ప్లేటు ఉన్న ట్రే అందుకుని హాల్లోకి నడిచింది.

సంతోష్ కూర్చున్న కుర్చీకి దగ్గరగా స్టూలు జరిపి దానిమీద ట్రే పెట్టి అతని చేతికి టీ కప్పు అందించింది వసంత. పద్మిని, వసంత కూడా కుర్చీలు జరుపుకుని యవనిక పక్కన కూర్చున్నారు.

సంతోష్ పద్మినితో ఎంతో మర్యాదగా మాట్లాడాడు. " మీరూ వస్తూ ఉండండి మేడమ్ మా ఇంటికి. వసంత ఇల్లు అనుకోవద్దు అది మీ ఇల్లే అనుకోండి. మా ఇంటికి మీరే పెద్ద దిక్కుగా మేము భావిస్తున్నాం. మీరనుమతిస్తే యవనికకి వేసవి సెలవులేగా మాతో తీసుకెళ్తాం" అన్నాడు.

పద్మిని ఉలికిపడింది. " ఒద్దు.. వయసులో ఉన్న పిల్లని కొత్త జంట దగ్గరకు పంపటమా? ఊహు" అలా అని ఖచ్చితంగా ఆ మాట చెప్పలేక నెమ్మదిగా అంది " నేను ఒక్కదాన్నేగా సంతోష్. ఇప్పటికే వసంతని చాలా మిస్ అవుతున్నాను, ఇప్పుడు యవని కూడా అక్కడికి వస్తే ఒంటరిగా అయిపోతాను. తరవాత ఇద్దరం కలిసి వస్తాంలే" అంటూ నచ్చచెప్పింది.

మరి కాసేపు కూర్చుని డిన్నర్‌కి ఉండమన్నా " లేదులే వెళ్ళాలి" అంటూ వెళ్ళిపోయారిద్దరూ.

వాళ్ళు వెళ్ళిన వైపు చూస్తూ నిట్టూర్చింది పద్మిని.

"బాబాయి పిన్ని ముందు ఏమీ బాగోలేడు కదమ్మా" అంది యవనిక.

పద్మిని నవ్వి "నీకు నచ్చకపోతే ఏం, పిన్నికి నచ్చాడు కదా! " అంది.

యవనిక మరేం మాట్లాడలేదు.

మరికొంతకాలం గడిచింది. పద్మిని అంది వచ్చిన అవకాశాలు ఉపయోగించుకుంటూ యవనిక చదువు కొనసాగిస్తోంది. వసంత అడపా, దడపా వచ్చి వెళుతోంది. సంతోష్ అప్పుడప్పుడు షూటింగ్ స్పాట్‌లో కలుస్తున్నాడు.

యవనిక డిగ్రీ సెకండ్ ఇయర్‌లోకి వచ్చింది. పిల్ల మరికాస్త పొడుగైంది. సన్నగా, పొడుగ్గా పట్నవాసపు నాగరికత అలవర్చుకున్న నాజూకుదనంతో హిందీ సినిమా హీరోయిన్‌లా అయిన యవనికను చూస్తుంటే పద్మిని గుండె దడ, దడలాడసాగింది. ఇంత అందంగా తయారవుతున్న ఈ పిల్లని ఇండస్ట్రీ వాళ్ళు చూశారంటే ఖచ్చితంగా ఎరవేస్తారు. ఆ ఎరకి తేలిగ్గా పడిపోయే వయసు యవనికది. దానికితోడు నటన మీద ఆ పిల్లకి చాలా ఆకర్షణ ఉంది. తను ఏ మాత్రం కనుసైగచేసినా వెళ్ళిపోడానికి సిద్ధంగా ఉంది. డిగ్రీ పూర్తవగానే యవనికకి పెళ్ళిచేసేయడం మంచిదేమో?

అలా అనుకున్న వెంటనే పద్మిని శివకి ఫోన్ చేసింది. చాలాసార్లు రింగ్ అయినా శివ ఫోన్ ఎత్తలేదు. సరేలే మిస్డ్‌కాల్ చూసుకుని చేస్తాడు లెమ్మని ఊరుకుంది పద్మిని. కానీ ఆ రోజంతా శివ ఫోన్ చేయలేదు. ఈమధ్య ఎవరి గొడవ వాళ్ళదిగా ఉంటున్నారు. శివకి అవకాశాలు బాగా తగ్గిపోయాయని సినిమాల్లో వేషాల కోసం ప్రయత్నాలు చేస్తున్నాడని తెలిసింది. ఆ విషయం కూడా శివ చెప్పలేదు ఇద్దరినీ ఎరిగున్న వాళ్ళెవరో ఇండస్ట్రీలో చెప్పారు. చాలారోజులైంది కలిసి వసంత. పెళ్ళి అయాక ఒక్కసారేమో కలిశారు. ఇదివరకులా

తరచూ కలుసుకోవడం, కష్టసుఖాలు మాట్లాడుకోడం జరగడంలేదు. ఎంచేతనో శివ తనతో ఇదవరకటిలా చనువుగా, ఆప్యాయంగా ఉండడంలేదు. కారణం ఏంటో? తనకి అవకాశాలు ఎక్కువ వస్తున్నాయన్న అసూయా? లేక రజని ఏమన్నా అడ్డుపెడుతోందా? లేక బతుకు తెరువుకోసం పాట్లు పడడంలో బిజీగా ఉన్నాడా? శివ పిల్లలిద్దరూ హైస్కూల్‌కి వచ్చారు. ఈ సమయంలో అతనికి అవకాశాలు తగ్గిపోవడం నిజంగా బాధాకరమే. అవసరానికి ఆదుకుని ఎడ్యుకేషన్‌లోన్ అనీ, మరో లోన్ అనీ ఇవ్వడానికి పేరుకి ఇండస్ట్రీ అయినా కళాకారులను ఉద్యోగులుగా భావించదే ఈ రంగం. ఇండస్ట్రీ అన్నప్పుడు ఏదో ఒక యాక్ట్ ఉండాలిగా.

పద్మిని ఆలోచనలు పరి, పరివిధాల సాగిపోతున్నాయి. శివ కాల్ కోసం మరో రెండు రోజులు ఎదురు చూసింది. అతని నుంచి ఎలాంటి రెస్పాన్స్ లేకపోవడంతో పద్మిని మనసులో చిన్న కలవరం రేగింది. ఎందుకు శివ ఫోన్ చేయలేదు తన మిస్డ్‌కాల్ చూడలేదా? చూసి కూడా చేయకుండా ఎలా ఉన్నాడు? ఊళ్ళో ఉన్నాడా? ఎక్కడకి వెళతాడు? సినిమాల్లో ఏదన్నా అవకాశం లభించి షూటింగ్ నిమిత్తం ఏ ఊరైనా వెళ్ళుంటాడు. సినిమాలంటే అంతేగా ఔట్ డోర్ షూటింగ్స్ ఎక్కువగా ఉంటాయి. వెళితే మాత్రం తన కాల్ అక్కడికి వెళ్ళదా ఏం? పగలంతా బిజీగా ఉన్నా రాత్రి అయినా చూసి ఉంటాడుగా ఎందుకు చేసి ఉండడు.

పద్మిని వసంతకి ఫోన్ చేసింది.

వసంత వెంటనే ఎత్తింది "చెప్పక్కా! ఎలా ఉన్నావు? " అడిగింది.

"నేను బాగున్నాను వసంతా.. నువ్వెలా ఉన్నావు? " అడిగింది పద్మిని.

"నాకేం హాయిగా ఉన్నాను. తినడం.. పడుకోడం" గల, గలా నవ్వింది వసంత.

పద్మిని కూడా సన్నగా శబ్దం చేస్తూ నవ్వి అంది "శివ సంగతేమన్నా తెలుసా నీకు? "

"శివా? ఏ శివ? మన శివేనా? " అడిగింది వసంత.

"మన శివ సంగతే చెబుతున్నా, నేను తనకి ఫోన్ చేసి నాలుగు రోజులైంది. తన దగ్గర్నించి సమాధానం లేదు, నెంబర్ చూసుకుని చేస్తాడనుకున్నా కానీ, చేయలేదు సంతోష్ కేమన్నా తెలుసేమో అడుగుదామని చేసాను. "

"తెలియదక్కా. మా మధ్య శివ ప్రస్తావనే రాలేదు. అయినా సాయంత్రం తను వచ్చాక కనుక్కుంటాలే. అయినా ఏంటి ఏదో ఆందోళనగా అనిపిస్తున్నావు. ఏంటి విశేషం?"

పద్మిని నిట్టూర్చింది "ఏం లేదు వసంతా. శివతో మాటాడాలని చేసాను. తను ఫోన్ తీయకపోగా, కనీసం కాల్ చేయలేదని కొంచెం ఆలోచిస్తున్నా. "

"శివతో అంత ముఖ్యమైన పనేంటో నేను తెలుసుకోవచ్చా అక్కా! "

పద్మిని నవ్వింది. "తప్పకుండా. ఏం లేదు వసంతా! యవనిక డిగ్రీ అయిపోవచ్చింది. ఇంక దానికి సంబంధాలు చూసి పెళ్ళి చేసేస్తే నాకు భుజాల మీద బరువు తగ్గుతుందికదా అని ఆలోచిస్తున్నా. శివకి తెలిసిన వాళ్ళెవరన్నా ఉంటే మంచి సంబంధం చూస్తాడని అడగాలనుకున్నాను. "

వసంతకి పద్మిని యవనిక పెళ్ళి విషయంలో శివ సాయం అడగడం ఏంటో అర్థం కాలేదు. శివని అడిగితే ఇండస్ట్రీ వాళ్ళనే చూస్తాడు. యవనిక చదువుకుంది. ఆమెకన్నా కొంచెం ఎక్కువ చదువుకున్నవాడిని, మంచి ఉద్యోగం చేస్తున్నవాడిని చూడాలి. అది శివ చేయగలడా? శివేకాదు సంతోష్ కూడా చేయలేడు. ఎవరి రంగంలో వాళ్ళకి ఏదన్నా పరపతి ఉంటుంది కానీ, వేరే రంగంలో ఎలా ఉంటుంది?

నెమ్మదిగా అంది. "శివకి కానీ, సంతోష్‌కి కానీ తెలిసినవాళ్ళంటూ ఉంటే ఇండస్ట్రీ వాళ్ళేకదక్కా. యవనికకి మంచి కుర్రవాడిని, చదువు, మంచి ఉద్యోగం ఉన్నవాడిని కదా చూడాలనుకున్నాం."

వసంత మాటలకి సాలోచనగా అంది పద్మిని "అవుననుకో కానీ, మనకి ఈ విషయంలో సాయం చేయడానికి ఎవరున్నారు? "

"ఎవరూ చేయక్కర్లేదు. బోలెడన్ని మ్యారేజ్ బ్యూరోలున్నాయి ఎక్కడొక దగ్గర రిజిస్టర్ చేయించు సంబంధాలు వాళ్ళే పంపిస్తారు. అయినా అప్పుడే పెళ్ళంటున్నావేంటి? పి.జి కూడా చదివిస్తా అన్నావుగా. "

వసంత మాటలకి క్షణం మౌనంగా ఉండి అంది పద్మిని "అనుకున్నా కానీ, అది నా కళ్ళముందు తిరుగుతుంటే నాకు చాలా భయంగా ఉంది వసంతా. పిల్ల బాగా ఎదిగింది. ఇలా ఒంటరిగా ఎక్కువకాలం ఉంచితే ఎవరైనా దాని మనసు మార్చి మన రంగంలోకి తీసుకొస్తారేమో అని భయం వేస్తోంది. అందుకే పెళ్ళి చేయాలనుకుంటున్నాను. "

వసంత నవ్వింది " ఎందుకక్కా అంత భయం? కాలం మారిందక్కా.. ఇదివరకులా సినిమాల్లో, టీవిలో నటించడానికి యాంకరింగ్ చేయడానికి ఇంకా ఏవో చేయడానికి ఎవరూ భయపడడంలేదు. మంచి, మంచి అమ్మాయిలు ఎంతో చదువుకున్న అమ్మాయిలు కూడా వచ్చేస్తున్నారు. ఉద్యోగాల్లో నెలంతా చేస్తే వచ్చే జీతానికి రెట్టింపు ఆదాయం వారం రోజులు చెపితే వస్తోంది. ఇది కూడా ఉద్యోగమే. యవనికకి ఇదే సరైన వయసు. ఇప్పుడు తను నిజంగా ఈ రంగంలో అడుగుపెట్టిందంటే కాసుల వర్షం కురుస్తుంది కాకపోతే కొంచెం తను రిజర్వ్‌డ్‌గా, జాగ్రత్తగా ఉండాలి అంతే. "

పద్మినికి వసంత మాటలకి కోపం వచ్చింది. యవనికని ఈ రంగంలోకి రాకుండా చేయడానికి తను నానా అవస్థా పడుతుంటే ఇదంతా మామూలే అక్కా అంటూ పెద్ద తెలిసినదానిలా మాట్లాడుతోంది అనుకుంది. పైకి శాంతంగా అంది " ఎట్టి పరిస్థితుల్లో నేను ఒప్పుకోను యవనికకి పెళ్ళి చేసేస్తాను" అంటూ ఫోన్ కట్ చేసింది.

ఆ తరువాత కూడా వసంత మాటలు చెవుల్లో గింగురుమంటుంటే అదే ఆలోచిస్తూ కూర్చుంది.

పద్మిని ఆలోచనల్లో ఉండగానే సాయంత్రం అయింది. మసక చీకట్లు కమ్ముకుంటుంటే లైటు వేయాలని లేచి టైం చూసింది ఆరున్నర అయింది. యవనిక ఇంక రాలేదేంటి? ఈ పాటికి వచ్చేయాలి. లైటు వేసి దేవుడి పటం వైపు చూసి నమస్కరించి బాల్కనీలోకి వచ్చి నిలబడింది. యవనిక కోసం ఎదురుచూస్తూ.

కింద వారం, వారం పెట్టే కూరగాయల మార్కెట్ పెట్టారు. దాదాపు కిలోమీటరు దూరం దాకా కూరలు, పళ్ళు, అమ్మకానికి పెడితే అపార్ట్‌మెంట్‌వాళ్ళు, చుట్టుపక్కల ఇళ్ళవాళ్ళు అంతా వెళ్ళికొనుక్కుంటారు. దళారీలు లేకుండా నేరుగా రైతులే పండించిన వన్నీ తీసుకొచ్చి సరసమైన ధరలకు అమ్ముతారు.

ఇంట్లో కూరగాయలేం లేవని గుర్తొచ్చింది పద్మినికి. లోపలికి వెళ్ళి పర్స్, బుట్ట తీసుకుని తలుపు తాళం వేసి బైటికొచ్చి లిఫ్ట్ వైపు నడిచింది. అప్పటికే లిఫ్ట్‌లో ఉన్న ఆడవాళ్ళు పద్మిని చూసి పలకరింపుగా నవ్వారు.

" ఈ మధ్య మీరు కనిపించడం లేదండి సీరియల్‌లో" అన్నదొకావిడ పద్మినితో.

బలవంతంగా నవ్వి అంది పద్మిని " నా పాత్ర అయిపోయిందండి."

" అవునా. అలా ఎలా? " ఆశ్చర్యంగా చూసింది.

నవ్వొచ్చింది పద్మినికి. " అంతేనండి. మూడువారాల క్రితం నా పాత్రని తీర్థయాత్రకి పంపించారు కదా. "

" అవును కానీ, యాత్రల నుంచీ తిరిగి రావాలిగా.!? "

" వాళ్ళిష్టం ప్రొడ్యూసర్, డైరెక్టర్ తల్చుకుంటే రప్పిస్తారు. లేదంటే ఎక్కడోక్కడ చనిపోయిందని ఏదో ఒక పాత్రద్వారా చెప్పిస్తారు" అంది పద్మిని.

" చనిపోయిన పాత్రల్ని మళ్ళీ ప్లాస్టిక్ సర్జరీ చేసి తీసుకొస్తారుగా" నవ్వింది మరొకావిడ.

" అప్పుడు నేనుండనుగా! నా ప్లేసులో మరో ఆర్టిస్టు" అని నవ్వింది పద్మిని.

ఇంకా వాళ్ళేదో చర్చిస్తున్నా ఆమె వాళ్ళ మాటలు వినలేదు గబ, గబా లిఫ్టులోంచి బైటకి నడిచి కూరగాయల వైపు నడిచింది.

ఏవో కొంటోంది గానీ, ఆమె కళ్ళు మాటి, మాటికీ యవనిక కోసం చూడసాగాయి. బాగా చీకటి పడిపోయింది. ఇంకా రాలేదు ఎక్కడికి వెళ్ళి ఉంటుంది ఈ పిల్ల?

ఈ మధ్య రజని ఇంటికి కూడా వెళ్ళడం లేదు. వసంత ఇంటికేమన్నా వెళ్ళిందా? ఒకటి, రెండుసార్లు వెళ్ళింది కానీ, అది కేవలం ఆదివారాలు మాత్రమే.

పద్మిని కావాల్సిన కూరలు కొనుక్కుని, డబ్బులిచ్చేసి గబ, గబా ఫ్లాట్‌కి వెళ్ళింది.

బుట్ట డైనింగ్ టేబుల్ మీద పడేసి మొబైల్ తీసుకుని వసంతకి ఫోన్ చేసింది.

అంతకు ముందే మాట్లాడిన పద్మిని మళ్ళీ ఫోన్ చేయడంతో ఆశ్చర్యంగా అడిగింది వసంత "ఏంటక్కా ఏమైంది? "

"యవనిక మీ ఇంటికేమన్నా వచ్చిందా? "

"యవనికా? లేదే అదేంటి ఇంకా ఇంటికి రాలేదా? "

"లేదు. అదే చూస్తున్నాను. " అంటూ గడియారం వైపు చూస్తూ అంది "ఏడున్నర దాటింది నాకేంటో భయంగా ఉంది వసంతా. ఎప్పుడూ ఇలా లేట్‌గా రాలేదు. ఐదున్నరకల్లా ఇంట్లో ఉంటుంది. "

"కంగారుపడకక్కా. వస్తుంది ఎక్కడికి వెళ్తుంది? బస్సులు దొరకడం ఆలస్యం అయిందేమో! ట్రాఫిక్ కూడా బాగా ఉంటోందన్నాడు సంతోష్ "

"సంతోష్ ఇంట్లో ఉన్నాడా?" అడిగింది పద్మిని.

"లేదక్కా.. ఇంకా రాలేదు. "

"రాలేదా? సరేలే.. మళ్ళీ చేస్తాను" అంటూ ఫోన్ కట్ చేసి అన్యమనస్కంగా అటూ, ఇటూ తిరుగుతూ, బాల్కనీలోంచి రోడ్డువైపు చూస్తూ ఎనిమిదింటిదాకా గడిపింది.

యవనిక రాలేదు.

పద్మిని మొబైల్ తీసుకుని శివకి మళ్ళీ ఫోన్ చేసింది. చాలా రింగులైన ఫోన్ తియ్యలేదు శివ.

పద్మిని ఫోన్ కట్ చేసి తాళం తీసుకుని, చెప్పులేసుకుని బయలుదేరింది.

లిఫ్టులో కిందికి వచ్చాక కొంచెం సేపు ఆలోచించింది. తను వెళ్ళగానే యవనిక వస్తే తాళం చూసి ఎటు వెళ్తుందో. తాళం చేతులు పక్క ఫ్లాట్‌లో ఇచ్చేస్తే వాళ్ళు తొమ్మిదింటికే పడుకుంటారు లైట్లన్నీ ఆర్పేసి. యవనిక ఇంకా రాలేదు. ఎనిమిదిన్నర కావస్తోంది ఎప్పుడొస్తుందో పద్మిని ఆలోచిస్తూ అలాగే నిలబడిపోయింది. కొన్ని నిమిషాల తరవాత స్థిర నిశ్చయంతో రోడ్డుమీదకి నడిచి ఖాళీగా వస్తున్న ఆటో ఆపి ఎక్కింది.

పద్మిని శివ ఇంటికి చేరేసరికి తొమ్మిది దాటింది.

ఆటో దిగి అతనిని కొంచెం సేపు వెయిట్ చేయమని చెప్పి అతని ఇంటి వైపు నడిచింది.

తలుపు వేసి ఉంది. లోపల మనుషులున్నట్టు టి.వి మోగుతోంది లైట్లు వెలుగుతున్నాయి.

హమ్మయ్య శివ ఉన్నాడు అనుకుంటూ కాలింగ్ బెల్ నొక్కింది.

కొన్ని క్షణాల తరువాత పదహారేళ్ళ అమ్మాయి వచ్చి తలుపు కొద్దిగా తీసి "ఎవరు కావాలండీ అంది? "

పద్మిని ఆమె వైపు తెల్లబోతూ చూస్తూ అంది "శివ, రజని. "

ఆ అమ్మాయి పద్మినికి సమాధానం చెప్పకుండా "అమ్మా" అంటూ పిలుస్తూ లోపలికి వెళ్ళింది.

కొన్ని క్షణాల తరువాత నలభై ఏళ్ళ స్త్రీ వచ్చింది. "ఎవరు కావాలి? " అడిగింది దర్పంగా

పద్మిని తడారిపోతున్న గొంతు సరిచేసుకుంటూ అడిగింది "ఇక్కడ శివ, రజని" అని ఉండాలి.

"లేరు వాళ్ళు ఇక్కడినుంచి వెళ్ళిపోయారు. వాళ్ళ ఊరికి వెళ్తున్నామని చెప్పారు.. నెలదాటింది. "

"నెల దాటిందా? " నిశ్చేష్టురాలైనట్టు నిలబడిన పద్మిని మొహం మీద తలుపేసిందావిడ.

శివ వాళ్ళ ఊరు వెళ్ళాడా? నెల దాటిందా? కనీసం తనకి ఫోన్ అన్నా చేసి చెప్పచ్చుగా ఎందుకు చెప్పలేదు? ఎందుకు వెళ్ళి ఉంటాడు? ఏం జరిగింది? అతనికి అవకాశాలు రాలేదా? తన నట జీవితం ముగిసిపోయిందా? ఎందుకు వెళ్ళాడు? ఆ ఊళ్ళో ఎవరున్నారని, ఏం ఉందని? అన్నిటితో తెగతెంపులు చేసుకుని వచ్చాడుగా ఎందుకు వెళ్ళాడు?

పద్మినికి కాళ్ళూ చేతులు ఆడనట్టు అయింది. ఒక్కసారిగా నిస్సత్తువ ఆవరించింది. కళ్ళు నీటితో నిండాయి. యవనిక ఇంటికి రాలేదు. శివ తనకి చెప్పకుండా వెళ్ళిపోయాడు. ఈ రెండు విషయాలు ఆమెని నిలువెల్లా వణికేలా చేసాయి.

తూలిపోతూ వచ్చి ఆటోలో కూర్చుని అపార్ట్ మెంట్ దగ్గరికి పోనిమ్మంది.

ఫ్లాట్‌కి వచ్చి మంచం మీద వాలిపోయిన పద్మిని భోరుమంది. యవనిక ఎక్కడికి వెళ్ళింది? అయ్యో ఆ పిల్ల ఎన్నోసార్లు తనకో సెల్ కొనివ్వమని అడిగితే చదువుకునే నీకు సెల్ ఎందుకు అంటూ తను కొనివ్వలేదు. ఎంతపని చేసింది. సెల్ ఉండి ఉంటే ఎక్కడికి వెళ్ళిందో తెలిసేదిగా. ఒకవేళ అర్జంటుగా ఏదన్నా పని ఉన్నా, లేక ఫ్రెండ్ ఇంటికి వెళ్ళినా ఫోన్ చేసి చెప్పేది. ఇప్పుడెలా? తనకి ఏ మార్గం కనిపించడంలేదు కాలేజీకి వెళ్ళి అడిగితే ఎవరుంటారక్కడ ఈ టైంలో. పద్మిని గుండె దడ దడలాడసాగింది. ఒళ్ళంతా చెమట పట్టింది.

ఇంతలో ఫోన్ మోగింది. చటుక్కున అందుకుంది.

వసంత. "అక్కా యవనిక వచ్చిందా? " అడిగింది.

నీరసంతో భయంతో కృంగిపోతూ చెప్పిందిలే..

"అక్కా ఏమైంది? నువ్వేంటి అలా ఉన్నావు? అక్కా.. " వసంత ఆందోళనగా పిలుస్తుండగానే పద్మిని వెక్కిళ్ళు వినిపించసాగాయి.

"అరరె సంతోష్ అక్క ఏడుస్తోంది.. " వసంత గొంతు ఖంగారుగా వినిపించడం ఫోన్ డిస్కనెక్ట్ అవడం ఒక్కసారే జరిగాయి.

సరిగా అరగంటలో వసంత, సంతోష్‌లు మోటార్ సైకిల్ అపార్ట్‌మెంట్ ముందు ఆగడం, వసంత మెరుపులా చక, చకా మెట్లెక్కి పద్మిని ఫ్లాట్ వైపు రావడం జరిగింది. సంతోష్ బండి పార్క్ చేసి లిఫ్ట్ వైపు నడిచాడు.

వసంతని చూడగానే పద్మిని ఆమెని వాటేసుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది.

"యవనిక ఎక్కడికెళ్ళిందో నాకు భయంగా ఉంది వసంతా. చాలా భయంగా ఉంది. "

"భయపడకక్కా ఎక్కడికీ వెళ్ళదు. సంతోష్ వాళ్ళ కాలేజీకి వెళ్తాడు. ఇంకా తన ఫ్రెండ్స్ పేర్లు ఏమన్నా తెలిస్తే చెప్పు. ఎంక్వైరీ చేస్తాడు. భయం దేనికి? అదేం చిన్నపిల్లకాదు. హైదరాబాదుకి కొత్తగా రాలేదు. వస్తుంది చదువుకోడానికి ఎక్కడికన్నా వెళ్ళి ఉంటుంది.

పరీక్షలు దగ్గరికొస్తున్నాయిగా" పద్మినిని ఓదారుస్తూ సంతోష్ రావడంతో అంది. "నువ్వు అర్జెంటుగా వెళ్ళు సంతోష్. నీకు శివ ఇల్లు తెలుసుగా అక్కడికేమన్నా వెళ్ళిందేమో చూడు. "

వసంత మాటలు పూర్తికాకుండానే అంది పద్మిని "లేదు. నేను వెళ్ళొచ్చాను శివలేడు. మొత్తం కుటుంబంతో సహా వాళ్ళు ఊరు వెళ్ళారట్ట. "

"ఏంటి శివ ఊరెళ్ళాడా? ఎప్పుడు? ఎందుకు? " విభ్రాంతిగా అడిగింది వసంత.

"తెలియదు. అదంతా మనకనవసరం. నాకిప్పుడు కావాల్సింది నా బిడ్డ యవనిక. "

వసంత సంతోష్‌తో అంది "వాళ్ళ కాలేజీకి వెళ్ళొస్తావా? "

"ఇప్పుడెవరుంటారు కాలేజీలో.!"

"మరెలా? "

"అదే ఆలోచిస్తున్నాను. "

అప్పుడే లోపలికి అడుగుపెట్టింది యవనిక.

ముగ్గురూ అలికిడికి తలెత్తి చూసారు.

యవనికను చూస్తూనే ముగ్గురూ అదిరిపడ్డారు.

**పద్మిని నిలువెల్లా** కోపంతో ఊగిపోయింది.

యవనిక పూర్తిగా మేకప్‌లో ఉంది. ఆమె వేసుకున్న డ్రెస్ చాలా ఖరీదైనది, యాంకరింగ్ కోసం ప్రత్యేకంగా డిజైన్ చేసినది. పద్మినికి ఆమెని చూస్తూనే విషయం అర్థమైపోయింది.

యవనిక షూటింగ్ నుంచి వస్తోంది.

దాదాపు నలభై ఏళ్ళ నటనారంగంలో పండిపోయిన పద్మినికి యవనిక వాలకం, ఆమె రూపం, వేషధారణ ఏ సందర్భంలోవో అర్థమవడానికి ఎక్కువ సమయం పట్టలేదు.

శివంగిలా ఊగిపోతూ వచ్చి కూతురు చేయపట్టి బలంగా లాగి చెంపమీద కొట్టింది.

చింత నిప్పుల్లాంటి కళ్ళతో చూస్తూ " ఎక్కడినుంచి వస్తున్నావు? " అడిగింది.

బెదురుతున్న కళ్ళతో తల్లివైపు, వసంత వైపు, సంతోష్ వైపు చూసిన యవనిక తల్లి బలమైన చేయినుంచి విసురుగా విదిలించుకుని సంతోష్ పక్కకి వచ్చి నిబ్బరంగా ఒక విధమైన తెగింపుతో అంది " షూటింగ్ నుంచి".

పద్మిని ఆగలేదు మెరుపులా కూతురి దగ్గరకు వచ్చి ఆ చెంపా, ఈ చెంపా ఎడాపెడా వాయించసాగింది.

కొద్దిసేపు ఏం జరుగుతోందో అర్థంకాక నివ్వెరబోయి నిలబడిపోయిన వసంత, సంతోష్ గభాల్న తేరుకుని చెరో చేత్తో పద్మినిని పక్కకి లాగారు.

" ఏంటక్కా ఏంటి నీ ఆవేశం? ఎదిగిన ఆడపిల్లను కొట్టడం తప్పుకదూ" అంది.

" కొట్టడంకాదు, అడ్డంగా నరికేయి దీన్ని. " రొప్పుతూ అంది పద్మిని.

" ఎందుకు? ఎందుకు నరుకుతావు? నేనేం తప్పు చేసానని? " కన్నీళ్ళు చెంపలమీద స్రవిస్తుంటే ఉక్రోషంగా అడిగింది యవనిక.

" ఎందుకా? నీకు చిన్నప్పటి నుంచీ చెబుతున్నాను. ఈమేకప్పులు, ఈ రంగుల ప్రపంచం వైపు దృష్టి పెట్టద్దు చదువుకో అని ఎవరే నీకు షూటింగ్ సంగతి చెప్పిందెవరు? నిన్నీ రంగానికి పరిచయం చేసిందెవరు? ఎందుకు వెళ్ళావు స్టూడియోకి, ఎప్పుడు వెళ్ళావు? ఎన్నాళ్ళ నుంచి తిరుగుతున్నావు స్టూడియో చుట్టూ? "

" నేనేం స్టూడియో చుట్టూ తిరగలేదు. నా చుట్టూనే వాళ్ళు తిరిగారు. నన్ను ప్రోగ్రామ్ చేయమని ఎప్పటినుంచో అడిగారు. నీకిష్టం లేదని ఇంతకాలం నేను ఒప్పుకోలేదు. కానీ, నాకిష్టమైన పని నేనెందుకు మానుకోవాలి? అందుకే ఒప్పుకున్నాను. చేసాను. నీకేం తెలుసు ఎంత బాగా చేసానో, నేనెంత అందంగా ఉన్నానో, ఒక్కసారి స్క్రీన్ మీద చూడు తెలుస్తుంది" కోపంగా అరిచింది యవనిక.

" నోర్ముయ్.. " పద్మిని మళ్ళీ యవనిక మీదికి వెళ్ళబోతుంటే వసంత ఆమెని బలవంతంగా లోపలికి లాక్కెళ్ళి తలుపు గడియవేసింది.

సంతోష్ యవనికతో అన్నాడు " వెళ్ళు,, వెళ్ళి మొహం కడుక్కునిరా. బట్టలు కూడా మార్చుకో. అయినా షూటింగ్‌కి వెళ్ళేముందు అమ్మతో ఒక్కసారి చెప్పాలికదా యవనీ. నువ్వు ఇంకా ఇంటికి రాలేదని అమ్మ ఎంత కంగారు పడిందో తెలుసా! "

" ఆ, తెలిస్తే ఈవిడ నన్ను చేయినిస్తుందా? ఒద్దు, ఒద్దు అని నా ప్రాణం తీస్తోంది. అరె. ఏం తప్పని లోకంలో ఇంత మంది యాంకరింగ్ చేస్తున్నారు. ఎందరో సీరియల్స్‌లో నటిస్తున్నారు. వాళ్ళెవరికీ లేని రిస్ట్రిక్షన్స్ నాకెందుకు బాబాయ్? ఎప్పటినుంచి రిక్వెస్టు చేస్తున్నానో తెలుసా.. ఒప్పుకోదు. ఆ ప్రస్తావనే తేవద్దంటుంది. "

" అమ్మ కిష్టంలేదు యవనీ."

" అదే ఎందుకు అని అడుగుతున్నాను. తను చేయచ్చు, పిన్ని చేయచ్చు, శివ మామయ్య చేయచ్చు, నువ్వు చేయచ్చు. నేనెందుకు చేయకూడదు? "

సంతోష్ నిస్సహాయంగా చూసాడు.

ఏం చెప్పగలడు ఈ ప్రశ్నకి నిజంగానే తన దగ్గర సమాధానం లేదు.

పద్మిని పడిన కష్టాలు, ఎదుర్కొన్న సమస్యలు వసంత చెప్పింది. ఆమెని తను అర్థం చేసుకోగలడు. కానీ, ఇప్పుడిప్పుడే జీవితాన్ని చూడడం మొదలు పెట్టిన యవనికకి పద్మిని అర్థం కావడం చాలా కష్టం. వసంత చెప్పినట్టు యవనిక తల్లి అనుభవించిన బాధలు చూసినా, ఈ రంగులు, వెలుగులు, జిలుగులు అందరికీ పట్టుపాన్పులే వేయవని, చాలామందికి అంపశయ్యలని అర్థం చేసుకునేంతగా ఆమె మానసిక స్థాయి ఎదగలేదు.

పద్మిని ఒద్దు అని చెప్పిందే కానీ, ఎందుకు ఒద్దంటోందో స్పష్టంగా ఆ పిల్లకి అర్థమయేలా వివరించి చెప్పలేకపోయింది.

చదువుతో విజ్ఞానం అనే సంపద కలుగుతుందని, ఆ సంపద వయసుతో పాటు పెరిగేదేకానీ, తరిగేది కాదని, ఆ సంపద సంఘంలో గౌరవాన్ని, జీవితానికి భద్రతని కలగచేస్తుందని చెప్పకపోవడం పద్మిని తప్పే కానీ, యవనిక తప్పుకాదు.

ఇవాళ నేనెందుకు నా కిష్టమైన ఎలక్ట్రానిక్ రంగంలో ముందుకు పోకూడదు అని యవనిక అడుగుతుంటే తనేమని సమాధానం చెప్పగలడు.

నిజానికి స్త్రీగా పద్మినేకాదు పురుషుడైన తాను కూడా ఎన్నో రకాల అనుభవాలు పొందాడు.

అవమానాలు సహించాడు, అడుగడుగునా తన ప్రగతికి అడ్డుపడేవాళ్ళని చూసాడు.

చిన్న అవకాశం తనకి వచ్చినా ఏ అవకాశం లేక తనపట్ల అసూయతో రగిలిపోయినవాళ్ళని చూసాడు.

తనెక్కడ ఎదిగిపోతాడో అని కాళ్ళు పట్టుకుని కిందకి లాగేవాళ్ళని, తల మీద చేయి పెట్టి అణగదొక్కాలనుకునే వాళ్ళనీ చూసాడు.

భరించాడు, సహించాడు, అన్నిటినీ సహించాడు.

ఆకలిని, అవమానాలను, అసూయలను అన్నిటినీ సమానంగా స్వీకరించాడు.

తను మగవాడు ఎవరు ఎంతగా అణగదొక్కడానికి ప్రయత్నించినా గాలి కొట్టిన బెలూన్‌లా పైగి ఎదగడానికే కృషి చేసాడు. కొంతవరకూ సఫలం అయాడు. కనీసం తన భార్యని పోషించగలిగేంతగా సంపాదించుకోగలుగుతున్నాడు.

యవనికకి ఇవన్నీ ఎలా తెలుస్తాయి?

ఆమెకి తన అందం మీద తనకెంతో విశ్వాసం,

తన ప్రతిభ మీద ఎంతో అతిశయం.

తను ఖచ్చితంగా ఈ రంగంలో పైకి వస్తుందన్న ఆమె నమ్మకాన్ని కాదనే హక్కు ఎవరికి మాత్రం ఉంది.

పైగా యవనిక మేజర్, ఆమె ఇప్పుడు ఎవరి మాటా వినాలన్న నియమం లేదు.

అలా అని ఇప్పుడు యవనికని సమర్ధిస్తే పద్మిని పరిస్థితి ఏంటి?

సంతోష్ ఆలోచనలనుంచి తెప్పరిల్లి ముందు నువ్వెళ్ళి " ఫ్రెష్ అయిరా తరువాత మాట్లాడదాం" అన్నాడు నచ్చచెప్పే ధోరణిలో.

వెక్కుతూనే లోపలికి వెళ్ళింది యవనిక.

పద్మిని వెక్కి, వెక్కి ఏడవసాగింది.

వసంతకి ఆమెనెలా ఓదార్చాలో అర్థం కాలేదు.

యవనిక మీద ఎన్నో ఆశలు పెట్టుకుని ఎక్కడికక్కడ జీవితం ఈమెని అగాధంలోకి నెడుతూ ఉంటే చిన్న, చిన్న రాళ్ళను కూడా మెట్లుగా చేసుకుని పడుతూ, లేస్తూ ఒక దశకి వచ్చిన పద్మిని నమ్మకం మీద తేరుకోలేని దెబ్బ కొట్టింది యవనిక.

ఏ మాయా ప్రపంచం ఆ పిల్లని ప్రభావితం చేసి తనవైపు లాక్కోకూడదని పద్మిని ఆశించిందో ఆ మాయా ప్రపంచం పద్మిని కళ్ళుగప్పి యవనికను తన ఆకర్షణలో పడేసుకుంది.

ఇప్పుడింక ఆ పిల్లను బైటకి తీసుకురావడం చాలా కష్టం.

ఒక్కసారి అందులో కూరుకుపోతే పైకి రావడం అంత సులువు కాదని అనుభవపూర్వకంగా తెలుసు కాబట్టే పద్మిని తన కూతుర్ని ఆ ప్రస్తావన కూడా తీసుకురావద్దని నిర్బంధించింది.

గుప్పిట మూసి ఉంచినంతవరకు ఆ గుప్పెట్లో ఏముందో తెలుసుకోవాలన్న ఆరాటం ఈ వయసులో యవనిక లాంటి వాళ్ళందరిలో సహజం. పద్మిని గుప్పిట మూయకుండా తెరిచి అందులో ఉన్న గీతలు చూపించి ఉంటే యవనిక ఈ ఆకర్షణకి, ఈ ప్రలోభానికి గురి అయేది కాదేమో.

ఇప్పుడు పద్మినిని ఈ దుఃఖం నుంచి బైట పడేయడం తప్ప తనేం చేయలేదు.

కానీ, ఆశించినంత సులువు కాదు పద్మినిని ఓదార్చడం.

నిజానికి యవనిక చేసింది పెద్ద నేరమేమీ కాదు కానీ, పద్మిని పొందిన అనుభవాలను దృష్టిలో పెట్టుకుంటే ఓ తల్లిగా తన కూతురు బాగా చదువుకుని మంచి ఉద్యోగంలో స్థిరపడి, మంచి కుర్రాడికి భార్యగా, ఓ మంచి కుటుంబంలో కోడలిగా హాయిగా బతకాలన్న ఆ తల్లి ఆరాటంలో అనుచితం ఏమిలేదు.

అలా అని ఇప్పుడు యవనికకి మంచి కుర్రాడు లభించడనుకోడం మూర్ఖత్వం.

ఏమో! ఆ పిల్ల అదృష్టం బాగుంటే స్క్రీన్ మీద చూసిన తరువాత ఓ కలెక్టర్ ఆమెని ఇష్టపడి పెళ్ళిచేసుకున్నా ఆశ్చర్యం లేదు ఇదివరకటిలా ఇప్పుడు ఎలక్ట్రానిక్ మీడియా అంటే అదేదో అంటరానిది అనే భావన ఎవరిలో లేదు.

అన్ని ఉద్యోగాల్లాగే నటిగా, యాంకర్‌గా, న్యూస్ రీడర్‌గా ఇవీ ఉద్యోగాలే.

కష్టపడితే ఇందులోనే స్థిరపడొచ్చు. బాగా సంపాదించుకోవచ్చు. జనాదరణ పొందొచ్చు, అభిమానులను సంపాదించుకోవచ్చు. కారు, పెద్ద ఇల్లు, నగలు ప్రజాభిమానం, ఇప్పుడిప్పుడే యవ్వనంలో అడుగుపెడుతున్న యవనికకి అవకాశాలు రావన్న బాధేలేదు. ఆమెని వెతుక్కుంటూ వస్తాయి. పద్మిని ఎందుకింత మూర్ఖంగా ప్రవర్తిస్తోంది.

తను చేరుకోలేకపోయిన ఉన్నత స్థానం యవనిక చేరుకుంటుందేమోననే భయమా? అసూయా?

వసంత ఉలిక్కిపడింది తన ఆలోచనలకి.

నెమ్మదిగా పద్మిని భుజం మీద చేయేసి ఓదారుస్తూ అంది " అక్కా ఊరుకో. అదేం చిన్నపిల్లకాదు. ఈ కాలం పిల్లలు ఒక వయసు వచ్చాక పెద్దవాళ్ళ మాటలు అసలు వినడం లేదు. నువ్వు మరీ మొండిగా ఉంటే అది నీకు దూరంగా వెళ్ళిపోవచ్చు. అప్పుడింకా బాధపడతావు. కానీ, అయిపోయింది నువ్వు ఎంతగా నిర్భంధించినా తను చేయాలనుకున్న పని చేసింది. ఇంక మనం ఏం చేయలేం. అంగీకరించి, ఆమోదించి, ఆహ్వానించడం తప్ప. ఊరికే బాధపడకు. అయినా కాలం మారిందక్కా. నీ రోజుల్లోలా ఇప్పుడూ ఇండస్ట్రీ ఉంటుందని ఎందుకనుకుంటున్నావు. ఇప్పుడిక్కడ అసోసియేషన్‌లు, హక్కులు, అబ్బో చాలా వచ్చాయి. గవర్నమెంట్ ఉద్యోగాల్లాగే ఉంది తెలుసా.. కావాలంటే సంతోష్‌ని అడుగు. ప్లీజ్ అక్కా ఏడవకు.

పద్మిని చెంగుతో కళ్ళు తుడుచుకుంది.

మౌనంగా లేచి అంది " అవును వసంతా! నేను పిచ్చిదాన్ని. ఏదో అనుకున్నా కానీలే జీవితం అంటే ఇదేగా. మనం అనుకున్నది జరగదు. పదండి భోజనాలు చేద్దాం. ఏంటో మిమ్మల్ని కూడా బాధపెట్టాను. "

" అవేం మాటలక్కా మేము పరాయివాళ్ళమా? ముందు నువ్వు నిమ్మళించు తరువాత భోజనాలు చేద్దాం."

పద్మిని పేలవంగా నవ్వింది.

" నాకేం నేను బాగానే ఉన్నాను. బాగానే ఉంటాను కూడా. ఎవరికెవరు వసంతా! ఒంటరిగా ఈ లోకంలోకి వచ్చినదాన్ని ఒంటరిగానే వెళ్ళాలి. ఏంటో తాపత్రయం అంతే. పద, పద పాపం ఆకలేస్తోందో ఏంటో" అంటూ తలుపు తీసుకుని హాల్లోకి వెళ్తున్న పద్మిని వైపు అయోమయంగా చూస్తూ ఉండిపోయింది వసంత.

మరో నెలరోజులు గడిచిపోయాయి.

పద్మిని యవనికతో పూర్తిగా మాట్లాడటం మానేసింది.

తల్లి నుంచి అంగీకారం కానీ, అభిమానం కానీ వస్తుందని ఆశించలేదు, ఎదురుచూడలేదు యవనిక. తన దారిలో నిరాటంకంగా సాగిపోయింది.

అనూహ్యంగా నెలరోజుల్లో మూడు కార్యక్రమాలకి యాంకరింగ్ చేసి మూడువేలు సంపాదించుకుంది యవనిక.

ఆ డబ్బు తల్లికి చూపించి " చూసావమ్మా!? నెల రోజుల్లో నేను కష్టపడింది మూడు రోజులు.. మూడు వేలు సంపాదించాను. ఇంకొక నాలుగునెల్లు పోతే ఎంత సంపాదిస్తానో" అంది గర్వంగా.

పద్మిని మాట్లాడలేదు. ఆ డబ్బు ముట్టుకోలేదు.

పద్మినిని ఇప్పుడు ఫీల్డ్‌లో ఎవరూ పట్టించుకోడం లేదు. కనీసం పద్మిని అనే పేరుగల కళాకారిణి ఉందన్న విషయం కూడా ఎవరూ గుర్తుంచుకోలేదేమో అన్నట్టు ఆమెకి ఒక్క ఫోన్ కూడా రాలేదు.

సంతోష్ కూడా పద్మినికి అవకాశాలు ఇప్పించడానికి చాలా ప్రయత్నాలు చేసాడు.

ఆమె ఆసక్తి కనపరచకపోగా తనకోసం ఎలాంటి ప్రయత్నాలు చేయద్దని చెప్పేసింది.

క్రమంగా ఆమె దాచుకున్న డబ్బు మొత్తం కరిగిపోసాగింది. ఆమె మెడలో ఉన్న ఒంటిపేట గొలుసు కూడా అమ్మేసింది.

ఇప్పుడు ఆమె పూర్తిగా మౌనంగా, గంభీరంగా మారిపోయింది.

వసంత రోజు విడిచి రోజు పద్మిని దగ్గరకు వచ్చి తనకు చేతనైన విధంగా ఆమెలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది కానీ, పద్మిని మాత్రం అలాగే ఉంది.

ఓ రోజు అంది పద్మిని.

" వసంతా! ఈ ఫ్లాట్ ఖాళీ చేయాలి నేనింక ఇంత అద్దె కట్టలేను. యవనికని వేరే ఫ్లాట్ చూసుకోమను. "

వసంత నిర్ఘాంతపోయింది.

" అదేంటక్కా! చిన్నపిల్ల ఒంటరిగా ఎక్కడుంటుంది? అయినా నువ్వు ఎక్కడికి వెళతావు? "

పద్మిని నవ్వింది. " భూమి గుండ్రంగా ఉంటుంది కదూ వసంతా.!? "

" అంటే !? "

ఆమె ఏం మాట్లాడలేదు. శూన్యంలోకి చూస్తూ ఆలోచిస్తూ ఉండిపోయింది.

జీవితం అంచులదాకా వచ్చి జారిపోతున్న సందర్భంలో ఎక్కడో ఒకచోట ఏదో ఒక పట్టుకొమ్మలభిస్తూ జారిపోకుండా కాపాడుతూ వస్తోంది. అయిపోయింది ఇప్పుడింక ఎలాంటి ఆధారం లేదు.

ప్రేమించి, నమ్మించి, ఆశలు రేపి అమ్మా, నాన్నల నుంచి దూరంగా తీసుకెళ్ళినవాడు మోసం చేస్తే ఎవరెవరినో నమ్ముతూ, సాయం పొందుతూ చక్రధరం దగ్గరకు చేరింది.

తన ప్రతిభను మెట్లుగా చేసుకుని ఎదిగిన చక్రధరం తననో పావుగా వాడుకోవాలనుకున్నాడు. తననొక బొమ్మగా మలుచుకుని తనకు అనుకూలంగా చేసుకోవాలనుకున్నాడు.

ఆత్మాభిమానం అడ్డొచ్చి అతనికి శత్రువై ఏదో సాధించాలనుకుంది. సాధించలేకపోయింది తను అసమర్ధురాలా? దురదృష్టవంతురాలా?

వసంత తోడుగా ఉంటే మరి కొంత దూరం సాగాలనుకుంది. వసంత తన దారి తను చూసుకుంది.

కనీసం కన్న కూతురైనా ఉన్నతమైన స్థానంలో ఉంటే ఆ వటవృక్షం నీడలో శేషజీవితం వెళ్ళిపోతుందనుకుంది.

ఆలోచిస్తున్న పద్మిని పెదాలమీద జీవం లేని నవ్వు మెదిలింది.

ఎవరికెవరు ఈ లోకంలో ఎవరికి ఎరుక? ఏ దారెటుపోతుందో ఎవరినీ అడుగకా.

రేడియోలో తరచూ వినేపాట.. ఈ పాట రాసిన కవికి కూడా తనలాంటి అనుభవాలున్నాయా? లేక కవిగా అలాంటి అనుభవాలున్న జీవితాని ఊహించి రాసాడా?

" అక్కా! " వసంత పిలుపుకి ఈ లోకంలోకి వచ్చింది పద్మిని.

" నాకెందుకో నిన్ను చూస్తుంటే భయంగా ఉంది. నా మాట విని కొన్నాళ్ళు నా దగ్గర ఉండకూడదాక్కా!? "

అడ్డంగా తలూపి అంది పద్మిని. " థాంక్స్ వసంతా. నీ ఆహ్వానం మన్నించలేకపోతున్నాను. నాకెందుకో కొన్నాళ్ళు ఏదన్నా ఊళ్ళు తిరిగిరావాలనిపిస్తోంది. "

ఆ మాటకి వసంత ఆనందంగా అంది " చాలా మంచి ఆలోచనక్కా. కనీసం నీక్కొంత మనశ్శాంతి లభిస్తుంది తప్పకుండా వెళ్ళిరా.. అందాకా యవనిక నా దగ్గర ఉంటుంది. "

" ఒద్దు వసంతా అది పెద్దదైంది, చాలా తెలివైంది, ధైర్యస్తురాలు ఒక్కదాన్నే ఉండనీ. ఫర్వాలేదు ఉండగలదు. "

" ఒద్దక్కా. నీకు తెలియదు అసలే రోజులు బాగాలేవు. "

వసంత మాటలకి ఫక్కున నవ్వింది పద్మిని. " నీకూ, నాకూ రోజులు బాగోలేవు, ఉండవు. యవనికలాంటి వాళ్ళకి బాగానే ఉంటాయి. ఉండనీ ధైర్యంగానే ఉండనీ మనలా ఒద్దు వసంతా. దానిష్టం వచ్చినట్టు బతకనీ. ఎక్కడున్నా, ఎలా బతికినా అది సుఖంగా ఉంటే చాలు. "

" ఎందుకక్కా అంత విరక్తిగా మాట్లాడుతున్నావు!?. నువ్వు అనుకునేంత చెడ్డదికాదు తను. "

" నేను తను చెడ్డది అన్నానా? "

" అదికాదు నీ మాటలేంటోగా ఉన్నాయి. నాకు భయంగా ఉంది. ఈ భయమే మన జీవితాలనిలా చేసింది. ఫర్వాలేదు నీ పట్ల దేవుడు దయచూపించాడు కనీసం అందుకే సంతోష్‌నిచ్చి నీ జీవితంలో సంతోషం నింపాడు. నేను గత జన్మలో ఏదో పాపం చేసాను అందుకే దేవుడు నాకు శిక్ష మీద శిక్ష వేస్తున్నాడు. అందుకే అలా తీర్థయాత్రలు చేసి నా పాపాలకి ప్రాయశ్చిత్తం చేసుకుంటాను. "

వసంత పద్మిని వైపు జాలిగా చూసింది.

ఆ రోజే సంతోష్‌కి పద్మిని నిర్ణయం చెప్పింది వసంత.

" పోనీలే వసంతా ఆవిడ ఈ నిర్ణయం తీసుకుని మంచిపని చేసారు. కొంత మనశ్శాంతన్నా దొరుకుతుంది ఆవిడకి. ఎక్కడికి వెళ్తారో, ప్లాన్ ఏంటో అడుగు టికెట్స్ రిజర్వ్ చేయిస్తాను. లేదంటే ఏదన్నా ట్రూప్ వెళ్తుంటే చూసి చెప్తాను" అన్నాడు సంతోష్.

అదే విషయం పద్మినికి చెప్పింది వసంత.

అందుకు అంగీకరించింది పద్మిని.

పాతికమందితో ఒక ట్రూప్ సౌత్ ఇండియా టూర్ వెళ్తుంటే వాళ్ళతో మాట్లాడాడు సంతోష్.

తల్లి యాత్రలకు వెళుతోందని తెలుసుకున్న యవనికకి చాలా కోపం వచ్చింది.

ఫ్లాట్ ఖాళీ చేయాలి కాబట్టి తనని వేరే అకామిడేషన్ వెతుక్కోమని చెప్పిందని వసంత చెప్పడంతో మరింతగా రెచ్చిపోయింది.

ఆ రోజు ఉదయం ఆదివారం..

స్నానం, పూజ ముగించి లలితా సహస్రనామం చదువుకుంటున్న తల్లి దగ్గరకు సుడిగాలిలా వచ్చింది యవనిక.

" ఏంటమ్మా నీ ఉద్దేశం?" మండిపడుతూ అరిచింది.

ఆవిడ తలెత్తలేదు. అకస్మాత్తుగా కూతురు అలా అరుస్తుంటే కొంచెం ఆశ్చర్యపోయింది ముందు. తరువాత నిర్లిప్తంగా ఉండిపోయింది.

"నేనేం తప్పు చేసానని నన్నిట్లా వేధిస్తున్నావు? " మళ్ళీ అడిగింది యవనిక.

అప్పటికీ మాట్లాడలేదు పద్మిని.

"నేను నీ కూతుర్నా, శత్రువునా? కూతుర్ని అయితే నన్ను కనలేదా? ఎక్కడినుంచీ అయినా ఎత్తుకొచ్చావా? మాట్లాడవేం?"

పద్మినికి ఏ మాత్రం సమాధానం చెప్పాలనిపించలేదు.

"మాట్లాడవేం? అయినా నిన్ను సుఖపెట్టాలనేగా నేను కష్టపడతాననేది. ఇంతకాలం నువ్వేగా నన్ను పోషించావు. ఇప్పుడు నేను సంపాదిస్తాను హాయిగా ఉండకుండా నీకీ పంతం ఏంటి? నాకు చిరాకు వేస్తోంది మాట్లాడవేం? ఇప్పుడు ఏం జరిగిందని నువ్వు నన్ను తప్పించుకుని పారిపోవాలి. అయినా నువ్వు వెళితే నేనెందుకు ఈ ఫ్లాట్ ఖాళీ చెయ్యాలి.? "

అప్పుడు తలెత్తింది పద్మిని.

"ఈ ఫ్లాట్ నేను తీసుకున్నాను. అది కట్టాల్సిన బాధ్యత నాది. నేను కట్టే పరిస్థితిలో లేను అందుకే ఖాళీ చేస్తున్నాను. నీ అంతస్తుకి తగిన ఫ్లాట్ తీసుకుని నువ్వు సంతోషంగా ఉడు నీమీద నాకేం కోపం లేదు సరేనా? " అంటూ మరో మాట మాట మాట్లాడడానికి అవకాశం ఇవ్వకుండా అక్కడినుంచి వెళ్ళిపోయింది.

యవనిక కణ, కణలాడే నిప్పులా మారింది.

విసురుగా లోపలికి వెళ్ళి గబగబా తన బట్టలు, వస్తువులు, పుస్తకాలు, రెండు పెట్టెల్లో సర్దుకుని రెడీ అయి బైటికి వెళ్ళిపోయింది.

మరో పదినిమిషాలలో ఆటో తీసుకొచ్చి ఆటోలో పెట్టుకుని ఒక్కమాట కూడా చెప్పకుండా వెళ్ళిపోయింది.

యవనిక చేష్టకి అచేతనంగా నిలబడిపోయింది పద్మిని.

ఆమె గుండెలో సప్తసముద్రాలు పొంగసాగాయి.

**ఆటో సికింద్రాబాద్ రైల్వే** స్టేషన్ చేరింది. వసంతా, పద్మిని దిగారు. వసంత ఆటోలోంచి సూట్‌కేసు దింపుతుంటే పద్మిని మీటర్ చూసి డబ్బులు చెల్లించింది.

వసంత సూట్‌కేసు పట్టుకోగా, పద్మిని బ్యాగ్ భుజానికేసుకుని, హాండ్‌బాగ్ కుడిచేతిలో పట్టుకుంది.

ఇద్దరూ స్టేషన్‌లోపలికి నడుస్తూ ఎంక్వైరీలో చెన్నై ఎక్స్‌ప్రెస్ ఎక్కడికి వస్తుంది అని అడిగారు.

నాలుగో నెంబర్ ప్లాట్‌ఫామ్ మీదకి వస్తుందని చెప్పాడతను.

ఇద్దరూ ఎలివేటర్ వైపు నడిచారు.

"వీళ్ళంతా ప్లాట్‌ఫామ్ మీదకి వచ్చేసి ఉంటారు,, " అంది వసంత.

పద్మిని మాట్లాడలేదు.

సంతోష్ ఎంక్వైరీ చేసి తెలుసుకున్న సౌత్ టూర్ వివరాల ప్రకారం పాతికమంది వేరు, వేరు కుటుంబాలనుంచి ఇద్దరు, ముగ్గురు చొప్పున ఈ టూర్‌కి బయలుదేరారు. ముందుగా అందరూ ట్రైన్‌లో చెన్నై వెళ్ళి అక్కడి నుంచి ట్రావెలర్స్ ఏర్పాటు చేసిన టూరిస్టు బస్సులో చూడాల్సిన ప్రదేశాలకు వెళ్ళేలోగా నిర్ణయించారు. అంతా కలిపి మనిషికి పదివేలు చొప్పున కలెక్ట్ చేసారు. ఆ డబ్బు సంతోష్ కట్టేసాడు. పద్మిని ఎంతగా వద్దన్నా వినలేదు అతను.

సంతోష్‌కి షూటిగ్ ఉండడం చేత వసంత పద్మినిని రైలెక్కించడానికి స్టేషన్‌కి తోడు వచ్చింది.

యవనిక వెళ్ళిపోయాక పద్మిని మరీ గంభీరంగా మారిపోయింది. వెళ్ళేరోజు కూడా యవనిక కలవాలని, తనకి చెప్పాలని ఆవిడకి తోచనందుకు వసంత బాధపడినా ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయింది. పద్మినికి తెలియని విషయం యవనిక, వసంత దగ్గర

ఉంది. ఇంటినుంచి నేరుగా వసంత దగ్గరకు వెళ్ళి, తను అక్కడ ఉన్నట్టు తల్లికి చెప్పద్దని మాట తీసుకుంది వాళ్ళదగ్గర. అందుకే వసంత యవనిక ఎక్కడుందో తనకి తెలియనట్టే ప్రవర్తిస్తోంది.

ప్లాట్‌ఫామ్ మీదకు వచ్చేసరికి ప్రయాణీకులతో కిక్కిరిసి ఉంది.

బోగీ నెంబర్ చెప్పింది పద్మిని.

ఇద్దరూ మరి కొంత ముందుకు నడిచి చెన్నై వెళ్ళే ప్రయాణీకులను గమనించి అక్కడ ఆగిపోయారు.

"సూట్‌కేస్ కిందపెట్టి ట్రైన్ రావడానికి ఇంకో అరగంట పడుతుందేమో అక్కా" అంది వసంత.

"నువ్వు ఇంటికి వెళ్ళిపో వసంతా.. మళ్ళీ ఒక్కదానివే వెళ్ళాలి కదా" అంది పద్మిని.

"ఏం పర్లేదు నాకేం భయం వెళ్ళగలను. నిన్ను ట్రైన్ ఎక్కించి వెళతాను. పుస్తకాలేమన్నా పెట్టుకున్నావా రైల్లో చదువుకోడానికి? " అడిగింది వసంత.

"పెట్టుకున్నాను."

"జాగ్రత్తక్కా నీ మొబైల్ నుంచి ఫోన్ చేస్తుండు. ఇప్పుడు ఇండియాలో ఎక్కడికి వెళ్ళినా మొబైల్ పనిచేస్తుంది. నేను చేస్తే నీకు ఇన్‌కమింగ్ రోమింగ్ పడుతుందేమో?"

"ఏదైనా ఒకటే వసంతా. డబ్బులు అవుతాయని ఫోను మాట్లాడుకోకుండా ఎలా?" నవ్వింది పద్మిని.

"ఆరోగ్యం జాగ్రత్త."

"అలాగే." వసంత మాటల్లోని ఆప్యాయతకి చలించిపోతూ అంది పద్మిని.

"అక్కా ఒక్క మాట అడగనా? " వసంత మాట పూర్తయేలోపలే పద్మిని చేతిలో ఫోన్ మోగింది.

పద్మిన్ ఫోన్ చూస్తూ "వసంతా! శివ ఫోన్ అంది."

అలా అనడంలో ఆమె మొహంలో కనిపించిన ఆనందం చూడగానే శివని ఎంత ఆత్మీయంగా భావిస్తుందో అర్ధం అయింది వసంతకి. నిజానికి అంతేగా ఎంతో సుదీర్ఘమైన అనుబంధం ఉంది అతనితో. అలాంటిది చెప్పా, చేయకుండా శివ వెళ్ళిపోవడం చాలా దారుణం అనుకుంది.

"శివా" పద్మిని స్వరంలో చనువు.

"ఎక్కడినుంచి శివా?"

అవతలనుంచి శివ స్వరం "బాగున్నావా పద్మినీ."

"నేను బాగున్నాను కానీ, నీ సంగతి చెప్పు ఎక్కడున్నావు? ఎలా ఉన్నావు?"

"బాగున్నాను పద్మినీ! క్షమించు పద్మినీ.. నీతో చెప్పకుండా వచ్చేసాను పరిస్థితులు అలా వచ్చాయి. వచ్చిన దగ్గర్నించీ ఫోన్ చేయాలనుకుంటూనే తాత్సారం చేసాను.. వసంత ఎలా ఉంది? సంతోష్ బాగా చూసుకుంటున్నాడా?"

"ఆ, ఆ వసంత చాలా ఆనందంగా ఉంది శివా! ప్రస్తుతం ఇక్కడే నాతోటే ఉది. నేను టూర్ వెళ్తున్నాను నన్ను రైలెక్కించడానికి వచ్చింది."

"అలాగా..ఏ ఊరు?"

"చాలా ఊళ్ళులే అదంతా తరవాత నీ సంగతి చెప్పు. ఏం చేస్తున్నావు? పిల్లలు, రజని ఎలా ఉన్నారు?"

"రజనీతో చాలా బాధపడ్డాను పద్మినీ. నేను సినిమాల్లో కోట్లు సంపాదించి పోస్తాననుకుని హైదరాబాద్ రమ్మనగానే వచ్చింది. వచ్చిన దగ్గర్నించీ మీరు సంపాదించేది ఇదా? దీనికోసమా నాచేత ఉన్న ఊరు నుంచి లాక్కొచ్చారు. ఈ మాత్రం సంపాదనకి మనకి అక్కడ ఉండదా? అందరూ తెలిసినవాళ్ళు, మనవాళ్ళు ఉన్న ఊరునుంచి ఈ దిక్కుమాలిన పట్నం లాక్కొచ్చారు. పైగా ఈ సినిమా జనం మధ్య పెట్టారు. నాకు తెలుసు మీరా పద్మిని కోసమే వచ్చారు అంటూ నానాగొడవా చేస్తుండేది. నువ్వు, వసంత ఫ్లాట్‌లోకి మారాక మరీ ఎక్కువైపోయింది. చాలా భరించాను. ఇంక నాక్కూడా పెద్దగా అవకాశాలు లేకపోవడంతో తన పోరన్నా తగ్గుతుదని మళ్ళీ వెనక్కి, మన ఊరు వచ్చేసాను పద్మినీ. నీకో సంగతి తెలుసా?"

"చెప్పు శివా. " అతని మాటలకి సిగ్గు, అవమానం ఏకకాలంలో కలిగి మొహం ఎర్రబడగా అంది"

"చక్రధరం లేడూ.."

చక్రధరం పేరు వినగానే ఉలిక్కిపడింది పద్మిని. ఇప్పుడతని సంగతి ఎందుకు?

"లేదు.. అతను పోయాడు"

"అవునా? " షాక్ తగిలినట్టుగా అరిచింది. "ఎలా? ఎప్పుడు?"

"బాగా సిగరెట్లు కాల్చేవాడుగా లంగ్ క్యాన్సర్ వచ్చి చనిపోయాట్ట. రెండు నెలలైంది."

కొంచెం బాధగా అనిపించినా ఆ వార్త వినగానే ఆమె అప్రయత్నంగానే తేలిగ్గా నిట్టూర్చింది.

ఇంతలో రైలు వస్తున్నట్టుగా ఎనౌన్స్‌మెంట్ వినిపించడంతో పద్మిని హడావుడిగా అంది "శివా! నీకు వసంత ఫోన్ చేసి మిగతా విషయాలు చెప్తుంది. రైలొస్తోంది నేను వెళ్ళాలి, మళ్ళీ చేస్తాలే,, వీలు చూసుకుని. జాగ్రత్త." అంటూ ఫోన్ కట్ చేసింది.

పెద్ద శబ్దంతో రైలు రావడం ప్రయాణీకులు చిందర, వందరగా పరిగెట్టడం చూసి "నువ్వుండిపో వసంతా. అదిగో బోగీ మనం నిలబడ్డ దగ్గరే ఆగిందిలే. నేను వెళ్తాను. నువ్వు జాగ్రత్త.. ఇంటికి వెళ్ళి శివకి ఫోన్ చేసి విషయాలన్నీ చెప్పు" అంటూ "ఉండక్కా నేనూ వస్తాను" అని అంటున్న వసంత మాట వినిపించుకోకుండా సూట్‌కేసు, ఎయిర్ బ్యాగ్, రెండు చేతుల్తో లాగుతూ పరిగెత్తింది పద్మిని.

వసంత ఆమె వెనకాలే వెళ్ళింది.

పద్మిని తన బెర్త్ దగ్గరకు వెళ్ళి కిటికీలోంచి చూసి చేయి ఊపింది వసంతకి. అప్పటికే వసంత దగ్గరగా వచ్చి ఆయాసపడుతూ "ఏంటక్కా తొందర ట్రైను కదలడానికి ఇంకా పదినిమిషాలుంది బయలుదేరడానికి. ఇంకా ఐదు ఇరవై అయింది ఎందుకంత కంగారు పడ్డావు" అంది.

"ఏమో వసంతా రైలు ఎక్కి, దిగడాలు అలవాటు లేదుగా భయం అంతే" అంది పద్మిని.

"సరేనక్కా జాగ్రత్త.. " మరోసారి హెచ్చరించింది వసంత.

"వసంతా!" చాలా సేపటి తరవాత అదోరకమైన బాధతో పిలిచింది పద్మిని.

"ఏంటక్కా?" అడిగింది వసంత.

పద్మిని కొన్ని క్షణాలు ఎటో చూస్తూ కళ్ళ చివర కదిలిన కన్నీటి చుక్క తుడుచుకుంటూ అంది "యవనిక ఎక్కడుందో తెలుసుకో వసంతా వీలైతే నీ దగ్గరకు తెచ్చుకో.."

"యవనిక నా దగ్గరే ఉంది" వసంత నోట్లో మాట బైటికి రాకుండానే రైలు కదిలింది.

వసంత కొంచెం గట్టిగా అరిచింది "యవని నాదగ్గరే ఉంది."

కానీ రైలు చేస్తున్న శబ్దం, మైకులో వినిపిస్తున్న ఎనౌన్స్‌మెంట్ గోలలో పద్మినికి ఆ మాట వినిపించలేదు.

వసంతకి దుఃఖం పొంగివచ్చింది.

ఒక్కసారిగా ఆమెకి తను మొదటిసారి పద్మినిని కలిసిన రోజు గుర్తొచ్చింది.

ఆ రోజు తనిలాగే జీవితం తరిమి కొడుతుంటే ఏం చేయాలో తెలియక, ఎటు వెళ్ళాలో తోచక కనిపించిన రైలెక్కి, ఆఖరిగా ఆగిన ఊళ్ళో దిగింది.

ప్లాట్‌ఫారమ్ మీద పంపు దగ్గర మొహం కడుక్కుని, ఫ్లాస్కుతో టీ పట్టుకుని అటూ, ఇటూ తిరుగుతూ అమ్ముతున్న కుర్రాడి దగ్గర నాలుగు రూపాయలిచ్చి ఉద్ధరిణెడు టీ తాగి కడుపులో ఆకలి, దుఃఖం పోటీపడి నరాలని మెలితిప్పుతుంటే నిస్త్రాణగా బెంచీమీద కూర్చుంది. అప్పుడే ఆగిన రైల్లోంచి మరో ఊళ్ళో నాటకమాడి వచ్చిన పద్మిని ట్రూపు బిలబిల్లాడుతూ రావడం తనని చూసిన పద్మిని జాలిపడి పలకరించడం, ఆ కాస్త ఆప్యాయతకి తను నిలువెల్లా కరిగి కన్నీరై అంతా చెప్పేయడం, పద్మిని చేతులు తనని గుండెల్లో పొదుపుకుని ఇంటికి తీసుకెళ్ళడం ఇంకా గుర్తుంది.

ఆ తరువాత వసంతకెప్పుడూ తను పడిన కష్టాలు గుర్తురాలేదు.

పద్మిని అందించిన స్నేహహస్తం అందుకుని, కొత్త జీవితం ప్రారంభించింది. ఆ జీవితంలో భోగభాగ్యాలు లేవు, పంచభక్ష్యపరమాన్నాలు లేవు. అయినా ఆమెతో కలిసి కష్టాలనీ, సుఖాలనీ ఆనందంగా పంచుకుంది.

ఇన్నేళ్ళనుంచీ ఎప్పుడూ తనని ఆమె పరాయిదానిలాగా చూడలేదు. తన స్వంత తోబుట్టువులాగే చూసింది.

జీవితంతో పోరాడడం నేర్పింది. సమస్యలొస్తే కంగారుపడకుండా నిబ్బరంగా నిలబడి పరిష్కరించుకోడం నేర్పింది.

చదువు, సంధ్యా లేక బతకడం తెలీక అయోమయంలో ఉన్న తనకి బతకడానికి ఉద్యోగాలే అవసరం లేని, ఉపాధిమార్గాలు చాలా ఉన్నాయని వాటిలో నటన కూడా ఒకటని నటన నేర్పింది తనకి. ఎవరైనా సరే గౌరవనీయంగా, నీతిగా బతకడానికి చాలా మార్గాలున్నాయని అవి వెతికి పట్టుకుని వివేకంతో ఉపయోగించుకుంటే ఎలాంటి పరిస్థితిలో కూడా జీవితం పట్ల మమకారమేకానీ, విరక్తి కలగదని నిరూపించింది."

అలాంటి పద్మిని ఈరోజు జీవన సంధ్యా సమయంలో, ఏ కూతురుకోసమైతే తన ఆనందాలని, సుఖాన్ని త్యాగం చేసి ఆ పిల్లకి ఉజ్జ్వలమైన భవిష్యత్తునివ్వాలని ఆరాటపడిందో ఆ కూతురే గుండెమీద తంతే గుండె పగిలి రక్తం కారుతోంటే వంటరిగా శాంతిని వెతుక్కుంటూ బయల్దేరింది.

"భగవంతుడా అక్క క్షేమంగా వచ్చేలా అనుగ్రహించు" మనసులో మౌనంగా ప్రార్థిస్తూ వసంత స్టేషన్ బైటకి వచ్చింది.

వసంత కనుమరుగవుతుంటే కళ్ళు తుడుచుకుని తన సూట్‌కేసు, బ్యాగు సీటుకిందకి తోసేసి కాళ్ళు కొద్దిగా జాపుకుంది పద్మిని.

పద్మినికి సైడ్ లోయర్ బెర్త్ వచ్చింది. అప్పర్ బెర్త్ పాతికేళ్ళ యువతిది అప్పటికే ఆ అమ్మాయి సీటు పూర్తిగా వేసేసి బాసింపట్టు వేసుకుని కూర్చుంది. ఆమె వేసుకున్న చుడీదార్ చాలా పాతగా ఉంది, వంకీల జుట్టు జడలో ఇమడని వెంట్రుకలు గాలికి చెల్లాచెదురుగా ఎగురుతున్నాయి. చామనఛాయకన్నా కొంచెం తక్కువ రంగు, చాలా మామూలుగా ఉంది. మెడలో గానీ, చెవులకి కానీ, చేతులకికానీ, ఎలాంటి ఆభరణాలు లేవు. ఎంతో నిరాడంబరంగా, సాత్వికంగా ఉంది.

మిగతా వాళ్ళంతా అంతకు ముందే ఒకరికొకరు పరిచయం ఉన్నారన్నట్టుగా మాట్లాడేసుకుంటున్నారు.

అదికాక మరో రెండు కంపార్ట్‌మెంట్స్‌లో కూడా ఈ ట్రూప్‌కి సంబంధించినవాళ్ళే ఉన్నారేమో అటు వాళ్ళు ఇటు, ఇటువాళ్ళు అటు తిరుగుతూ సందడి చేస్తున్నారు.

రైలు వేగం పుంజుకుంది. కొన్ని క్షణాల్లోనే ప్లాట్‌ఫామ్ దూరమైంది.

టూర్‌కి బయలుదేరిన వాళ్ళంతా ఆడవాళ్ళే కావడం పద్మినికి ఆసక్తికరంగానూ, హాయిగానూ అనిపించింది. సౌకర్యంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా వెళ్ళచ్చు అనుకుంది.

ఎవరు సీట్లలో వాళ్ళు సెటిల్ అయాక అందరూ పరిచయాలు ప్రారంభించారు. కొందరు గృహిణులు, ఇరుగు, పొరుగువాళ్ళు పిల్లలంతా ఎవరిదారిన వాళ్ళు సెటిల్ అవడంతో సరదాగా ఈ ట్రూప్‌కి కలిసి బయలుదేరారు. కొందరు ఉద్యోగినులు రొటీన్ లైఫ్ నుంచి మార్పు కోసం వెళ్తున్నవాళ్ళు.

ఒకరినొకరు పరిచయాలు చేసుకుంటుంటే పద్మినికి తన గురించి చెప్పుకోడానికి సిగ్గనిపించింది.

అందరూ చదువుకున్నవాళ్ళు, డబ్బున్నవాళ్ళు, సుఖంగా, హాయిగా బతుకుతున్నవాళ్ళు. తను బతకడానికి మొహానికి రంగేసుకుని తనది కాని అనేక స్వభావాలను, రూపాలను మార్చుకుంటూ నటిస్తూ బతికిన అతిసాధారణ స్త్రీ. తన వృత్తి గురించి చెబితే వీళ్ళంతా నవ్వుతారో, ఎగతాళి చేస్తారో ఆలోచిస్తున్న పద్మిని అకస్మాత్తుగా వినిపించిన ప్రశ్నతో ఉలిక్కిపడింది.

తన ఎదురుగా కూర్చుని వేరుశెనగపప్పులు ఒకటొకటే నోట్లో వేసుకుంటున్న యువతి అడిగింది.

"మీరు టి.వి సీరియల్స్‌లో చేస్తారు కదూ."

ఎవరూ గుర్తుపట్టరనుకుంది. ఈ అమ్మాయి గుర్తుపట్టేసింది. సీరియల్స్ చూడ్డమే పనిగా ఉండేవాళ్ళు తప్ప ఎవరు గుర్తుపడతారు అనుకుంది.

అవునని చెప్పడానికి అవమానంగా అనిపించింది. మొహం ఎర్రబడింది.

ఆ మాటతో అందరికళ్ళు పద్మినివైపు కుతూహలంగా తిరిగాయి

కొద్దిరోజుల్లోనే పూర్తిగా పండిపోయిన తల, కళ్ళకింద నల్లటి వలయాలు, నుదుట ఎర్రని స్టిక్కరు తప్ప మరో అలంకారం లేదు. వంటి మీద ఆభరణాలూ లేవు, మెత్తటి పసుపురంగు కాటన్ చీర.

మరో ఇద్దరు స్త్రీలు వాళ్ళ సీట్లలోంచి లేచి గభాల్న పద్మినికి, ఆ యువతికి మధ్యలో వచ్చి ఇరుక్కుని కూర్చుంటూ ఉత్సాహంగా అన్నారు. "కరెక్ట్ ఎక్కడో చూసాము అని ఇందాకట్నించి ఆలోచిస్తున్నాం మీరు సీరియల్స్‌లో వేసారు మీ పేరు, మీ పేరు.." గుర్తుకు తెచ్చుకుంటూ ఆగిపోయింది ఒకావిడ.

"అవునండి మీరు రెండు, మూడు సీరియల్స్‌లో అత్తగారిగా వేసారుకదూ. " మరికొన్ని స్వరాలు ఆసక్తిగా పలికాయి.

ఎదురుగా కూర్చున్న యువతి కొంచెం ముందుకు వంగి "అపస్వరాలు సీరియల్‌లో మీ నటన సూపర్ అందులో చాలా యంగ్‌గా ఉన్నారు" అంది.

క్షణంలో అందరి అటెన్షన్ పద్మినివైపు తిరిగింది. అందరూ వాళ్ళకి తోచిన ప్రశ్నలు వర్షంలా కురిపించసాగారు.

ఊహించని ఆ పరిస్థితికి కొద్దిసేపు పమిని ఉక్కిరి, బిక్కిరి అయింది.

కాసేపట్లోనే అంతా మర్చిపోయి వాళ్ళ ప్రశ్నలకి తనకి తోచిన సమాధానాలివ్వసాగింది.

"అత్తగారనగానే గయ్యాళిగా ఎందుకు చూపిస్తారు?"

"ఎవరన్నా కిచెన్‌లో సరుకులు పెట్టుకునే దగ్గర విషం సీసాలు పెట్టుకుంటారా? సీరియల్స్‌లో వాళ్ళు అనుకోగానే విషం అలా ఎలా రెడీగా ఉంటుంది? గ్యాస్ స్టవ్‌లు, ఎలక్ట్రికల్ స్టవ్‌లు వాడే రోజులు, పైగా సీరియల్స్‌లో చాలా రిచ్‌గా చూపించే వాళ్ళ ఇంట్లో కిచెన్‌లో రెడీగా కిరోసిన్ ఎందుకుంటుంది? ఆడవాళ్ళని అంత రాక్షసులుగా ఎందుకు చూపిస్తారు? మేకప్‌లు అంత అసహ్యంగా చేస్తారెందుకు?

కథ లేకుండా సంవత్సరాల తరబడి సీరియల్స్ లాగుతారెందుకు? వేలకొద్దీ ఎపిసోడ్‌లు చేస్తారెలా?" ఇలాంటి రక, రకాల ప్రశ్నలతో ఊపిరిసలపకుండా చేసారు.

అన్నిటికీ పద్మిని చిరునవ్వుతో ఓపిగ్గా సమాధానం చెప్పింది. "నా పాత్ర వరకే నాకు తెలుసండి, నాకు అవకాశాలు రావడం మాత్రమే చూస్తాను. అదెలాంటి పాత్ర అనేది పట్టించుకోను, నాకు డబ్బులు కావాలి అంతే" అంటూ ఆమె చెప్పిన సమాధానాలు అసంతృప్తిగా అనిపించడంతో ఎవరి సీట్లలోలి వాళ్ళు వెళ్ళిపోయారు.

హమ్మయ్య అనుకుని ఊపిరి పీల్చుకుని కిటికీలోంచి కదులుతున్న చెట్లనీ, అల్లనల్లన సాగిపోతున్న మేఘాలనీ చూస్తూ మౌనంగా ఉండిపోయింది పద్మిని. ఆమెకి అలసిపోయినట్టుగా అనిపిస్తోంది. సూర్యాస్తమయం అవుతున్నదేమో ఆకాశంలో లేత నారింజరంగు పరుచుకుంది. సూర్యుడు చూస్తుండగానే అగ్నిగోళంలా ఎర్రగా మారి పడమటవైపు కదిలిపోసాగాడు. ఎన్నిసార్లు చూసినా సంధ్యా సమయంలో కొత్త అందాలు కనిపిస్తాయి. ఎంతసేపు చూసినా తనివి తీరదు.

ఆమెకి తను పుట్టి పెరిగిన ఊరు, అమ్మా, నాన్న, అక్కలు, తమ్ముడు గుర్తొచ్చారు.

ఆనాటి రెండు జడల పద్మిని ఇవాళ ముగ్గుబుట్ట పద్మిని అయింది.

లేడిలా పరుగులు పెట్టే పద్మిని కొంచెం నడవగానే ఆయాసంతో చతికిలపడుతోంది.

తన నవ్వుతో పరిసరాలను కాంతిమయం చేసిన పద్మిని నవ్వులో జీవమే కోల్పోయింది.

కొండమీద కోవెల్లో రావిచెట్టు కింద శేషగిరి ఒడిలో పడుకుని అస్తమిస్తున్న సూర్యబింబం చూస్తూ మైమరిచిపోయిన రోజులేవి? టన్నుల కొద్దీ ప్రేమ కురిపించిన శేషగిరి ఏడి?

ఏమై ఉంటాడు? చనిపోయి ఉంటాడా? అవును అలాంటివాళ్ళు చావాలి కానీ, పాపి చిరాయువు అని అలాంటి వాళ్ళకే దేవుడు నూరేళ్ళ ఆయుష్షు ఇస్తాడు. కానీ, అంతకన్నా పాపిష్టివాడు చక్రధరం అప్పుడే చనిపోయాడే పాపం పద్మినికి ఎక్కడో ఏదో మూల అతని మరణం పట్ల చిన్న బాధ కలిగింది. చక్రధరం పీడ తనకి శాశ్వతంగా పోయిందనమాట. అతను చనిపోకున్నా పోతుంది కారణం తను వృద్ధాప్యానికి చేరువవుతోంది. ఇంక తన వైపు ఎవరూ కాంక్షతో కన్నెత్తి చూడరు. ఎంతబాగుంది ఇలా.

నవ్వొచ్చింది పద్మినికి.

ఇదేనా జీవితం అంటే.

అప్రయత్నంగా ఆమె దృష్టి అక్కడ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్న మిగతా స్త్రీలవైపు మళ్ళింది.

లోకంలో ఉన్న సంతోషాన్నంతా తామే అనుభవిస్తున్నట్టున్నారు. దాదాపు అందరూ వయసు మళ్ళినవాళ్ళే.. నలుగురు తప్ప. కానీ, అందరి జుట్టు నల్లగా ఉంది, అందరి మొహాల్లోనూ కాంతి ఉంది. చిరునవ్వులో ధైర్యం, ఆత్మవిశ్వాసం ఉంది. అందరూ తలకి రంగేసుకుని కనుబొమలు కత్తిరించుకుని అలంకరణకి ప్రాధాన్యం ఇచ్చారు.

"మేడమ్.. " ఎదురుగా కూర్చున్న యువతి పిలిచింది.

పద్మిని ఆమె వైపు తిరిగింది.

ఇప్పుడు ఆ సీటులో ఇద్దరే ఉన్నారు. గాలి విపరీతంగా వీస్తోంది. ఆ యువతి చున్నీ తీసుకుని తలమీద జుట్టు ఎగిరిపోకుండా స్కార్ఫ్‌లా చుట్టుకుంది.

"మేడమ్ ఏం ఆలోచిస్తున్నారు? " అడిగింది నవ్వుతూ.

నవ్వింది పద్మిని " ఏం లేదు."

"మీరు ఎప్పట్నించీ సీరియల్స్ చేస్తున్నారు?"

ఏం చెప్పాలో తోచలేదు పద్మినికి. ఆ ప్రస్తావన ఇష్టంలేదు. తనిప్పుడు నటికాదు. తన నట జీవితం గురించి ఎవరికీ చెప్పాలని, తల్చుకోవాలని కూడా లేదు. అయిపోయింది ఆ అంకం ముగిసిపోయింది. తన నట జీవితానికి శాశ్వతంగా తెరవేసింది. ఆ తెర తీయబడదు. మరో అంకం మొదలుకాదు. ఇప్పుడు ఈ అమ్మాయికి ఒక ప్రశ్నకి సమాధానం చెబితే మరో పదిప్రశ్నల వస్తాయి.

"ఇలా అడుగుతున్నానని ఏమీ అనుకోకండి. నాకు నటనంటే చాలా ఇష్టం. సీరియల్లో ట్రై చేయడానికి హైదరాబాద్ వచ్చాను. మాది ఒంగోలు అసలు."

అలాగా అన్నట్టు చూసింది.

"ఎంతో ట్రై చేసానండి. నాకు అవకాశాలు రాలేదు. తెలిసినవాళ్ళుంటే వస్తాయిటగా."

ఏం చెప్పాలి? తనకి ఎవరు తెలుసని? శివ... శివ గట్టిగా పట్టుపట్టి పరిచయాలు సంపాదించి అతను దూరి, తనసీ, వసంతనీ దూర్చాడు.

"నేను ఎక్కువగా చదువుకోలేదండి. మంచి జాబ్ కూడాలేదు. ఒక స్కూల్లో కొంత కాలం ఆయాగా చేసాను, కొంతకాలం ఒక నర్సింగ్ హోమ్లో ఆయాగా చేసాను. ఇప్పుడు మీ అందరితోపాటు మీ అందరికీ వంట చేసి పెట్టడానికి కాంట్రాక్టు కుదుర్చుకుని వస్తున్నాను. నాకిద్దరు పిల్లలండి. ఇద్దరూ అమ్మాయిలే, ఒంగోల్లో మా అమ్మ దగ్గర ఉండి చదువుకుంటున్నారు. నేను, ప్రతినెలా వాళ్ళకి తిండికీ, స్కూలు ఫీజులకి డబ్బు పంపాలి. "

ఆ యువతి పద్మినికి మరికొంత దగ్గరగా జరిగి స్వరం తగ్గించి చెప్పసాగింది. "మిమ్మల్ని చూస్తుంటే మీరు కూడా చాలా కష్టాలుపడి జీవితాన్ని లాక్కొస్తున్నారనిపిస్తోంది. అందుకే ఆత్మీయంగా అనిపిస్తున్నారు."

ఆ యువతి మొహంలోకి ఆశ్చర్యంగా చూసింది పద్మిని పట్టుమని పాతికేళ్ళున్నాయా అన్నట్టుగా ఉంది. ఈమెకి అప్పుడే పెళ్ళి అవడం, ఇద్దరు పిల్లలు, వాళ్ళ చదువులు, బాధ్యతలు ఏంటీ జీవితం?

"మీ వారేం చేస్తారు?" అడిగింది పద్మిని.

ఆమె నవ్వింది పేలవంగా " వారే ఉంటే నాకీ కష్టాలు దేనికి మేడమ్. లేడు చచ్చాడు" కసిగా అంది.

"అవునా? " మరింత ఆశ్చర్యంగా చూసింది పద్మిని.

ఆమె నిట్టూర్చింది.

"నా పేరు ఫాతిమా. మా అబ్బా మెకానిక్ షాపులో పనిచేసేవాడు, మేము ముగ్గురు అక్కచెల్లెళ్ళం, ముగ్గురు అన్నదమ్ములం. మా అక్కలకి పదకొండేళ్ళకే పెళ్ళిళ్ళు చేసాడు అబ్బా. నాకు పదమూడేళ్ళకే పెళ్ళయింది. నేను పదకొండేళ్ళకే రజస్వల అయాను. మా అబ్బా డబ్బు కోసం మా అందరినీ కూడా నలభై ఏళ్ళ వాళ్ళకిచ్చి పెళ్ళిచేసాడు. అక్కలిద్దరూ అరబ్ వెళ్ళిపోయారు. మా అన్నలు ఎక్కడున్నారో తెలియదు. అబ్బా పెద్ద తాగుబోతు. ఎంత డబ్బు ఆయన తాగుడుకే చాలదు.

నా పెళ్ళి అయాక నా భర్త నాలుగేళ్ళు నాకు నరకం చూపించాడు. అప్పటికే నాకిద్దరు పిల్లలు. రెండో పాప పుట్టాక వాడు మళ్ళీ పెళ్ళిచేసుకుని వచ్చాడు. వాడికీ, వాడి మొదటి పెళ్ళానికీ, మూడో పెళ్ళానికి నేను సేవలు చేయాలి, చేయకపోతే కొట్టేవాళ్ళు. ముగ్గురు కలిసి వాతలు పెట్టేవాళ్ళు. అందుకే భరించలేక ఒక రాత్రివేళ నేను బైటకొచ్చేసాను."

"ఎలా? అతను వెతకలేదా?"

"కనిపించకపోతే వెతకడు. పట్టుబడితే మాత్రం చంపేసేవాడు, కానీ, నేను పట్టుబడకుండా చాలా జాగ్రత్తగా ముందు పిల్లల్ని తీసుకొచ్చి మసీదులో దాచి, కాసేపటి తరువాత నేను బైటకొచ్చాను. అమ్మావాళ్ళది ఒంగోలు, వాడిది చీరాల. పిల్లలతో ఒంగోలు వచ్చి ఇంటికి వెళ్ళాను. మా అబ్బా అలా వెళ్ళినందుకు బాగ కొట్టాడు. తిరిగి వెళ్ళిపొమ్మని, నాకూ, నా పిల్లలకీ తిండిపెట్టలేనని ఇంట్లోంచి వెళ్ళగొట్టాడు. కానీ, నేను మా అమ్మకి నా ఒంటిమీద దెబ్బలు చూపించి నాకు నా పిల్లలకీ ఆశ్రయం ఇస్తే చాలని, నేను నలుగురిళ్ళల్లో పనిచేసి పిల్లలని పోషించుకుంటానని బతిమాలాను. అమ్మ నాన్నకి నచ్చచెప్పింది.

ఆ తరువాత రెండేళ్ళకి నాన్న చనిపోయాడు.

అమ్మ పిల్లల్ని చూసుకుంటుంటే నేను అమ్మనీ, పిల్లల్నీ పోషిస్తున్నాను."

**చెంపల మీద చల్లగా** అనిపించడంతో తన కళ్ళనుంచి నీళ్ళు కారుతున్నాయని గ్రహించింది పద్మిని.

ఎంత దయనీయమైన గాథ.

"కానీ, ఈ సమాజంలో కష్టపడి పనిచేసుకుని కూడా బతకనీయరు ఆడవాళ్ళని కదా మేడమ్?" ఫాతిమా ప్రశ్నకి తెల్లబోతూ చూసింది.

"అవును నేను పనిచేసే చోట రెండుసార్లు నామీద దాడి జరిగింది. ఆ యజమానులు నీచులు, వాళ్ళ భార్యలు ఇంట్లో లేని సమయంలో నామీద"

ఆమె కళ్ళల్లో కన్నీళ్ళు.

"ఒకసారి చచ్చిపోవాలనుకుని రైలు పట్టాల మీద పడుకున్నాను. కానీ, పిల్లలు గుర్తొచ్చి వెంటనే ఆ ప్రయత్నం మానుకున్నాను."

"కానీ, మేడమ్ అందరూ చెడ్డవాళ్ళే ఉండరు కొందరు మంచివాళ్ళు కూడా ఉంటారని తెలిసింది రాజుగారిని కలిసాక. "

"రాజుగారెవరు?"

"నేను పనిచేసిన ఇంట్లో వాళ్ళబ్బాయి. అతను హైదరాబాదులో ఇంజనీరింగ్ చదువుకుంటున్నాడు. ఒకసారి సెలవలకి వచ్చి నన్ను చూసి, నువ్వు మా ఇంట్లో పనిచేయద్దు నీకు ఉద్యోగం ఇప్పిస్తా అని తీసుకొచ్చి ఒక స్కూల్లో ఆయాగా ఇప్పించాడు. కానీ, వాళ్ళు సరిగా జీతాలివ్వలేదు. మరో స్కూల్లో ఆ తరువాత నర్సింగ్ హోమ్‌లో అన్నీ రాజుగారే ఇప్పించారు. చాలా మంచాయన. అక్కడ కూర్చున్నారే ఎర్రచీరావిడ..!?" కళ్ళతో చూపించింది ఫాతిమా.

పద్మిని చూసీ చూడనట్టు అటు చూసింది.

"ఆవిడకి రాజుగారు మేనల్లుడు. వాళ్ళు వేసుకున్న ఈ టూర్ ప్రోగ్రామ్‌లో వాళ్ళకి వంటలో, పాత్రలు కడుక్కోడంలో సాయంగా ఉండటానికి మనిషి కావాలంటే నన్ను పంపించారు. ఈ పదిరోజులకి నాకు జీతం బాగానే ఇస్తారుట. తిండి కూడా గడిచిపోతుంది. అందరితో కలిసి ఫ్రీగా నాలుగు ఊళ్ళూ చూడచ్చుకదా అని సరే అన్నాను."

ఫాతిమా వైపు పరిశీలనగా చూసింది పద్మిని.

కష్టాలతో రాటుదేలినట్టు మొరటుగా ఉంది పిల్ల. కొంచెం అనాగరికంగా కూడా ఉంది కానీ, ఈమె మంచి బట్టలు ధరించి, నాజూకుగా తయారైతే అందంగానే ఉంటుంది. సీరియల్స్‌లో చేసే వాళ్ళంతా అందమైన వాళ్ళే కాదుగా.

"మేడమ్ నాకు పనిమనిషి పాత్ర వచ్చినా సరే. కానీ, నాకు సీరియల్స్‌లో చేయాలని ఉందండి. డబ్బులు బాగా వస్తాయిటగా."

అమాయకంగా అడుగుతున్న ఆమెవైపు జాలిగా చూసింది.

"నువ్వు పనిచేసే చోట పొందిన కష్టాల్లాంటివి అక్కడ కూడా ఉండచ్చు తట్టుకోగలవా? " అడిగింది.

ఆమె కళ్ళలో భయం స్పష్టంగా కనిపించింది "అవునా? " అంది.

పద్మిని కిటికీలోంచి బైటకి చూస్తూండిపోయింది. ఆడదానికి అందులోనూ కష్టాల్లో ఉన్న ఆడదానికి అలాంటి సమస్యలు ఎక్కడైనా ఉంటాయమ్మా. చిన్నపిల్లవి, ఏ ఆధారమూ లేని దానివి నువ్వా రంగుల ప్రపంచంలోకి వెళ్ళద్దు పద్మిని మనసులో చెలరేగుతున్న -భావాలు మనసులోనే అదిమేసింది. తనకు తెలిసిందే ప్రపంచం అనుకోడం మూర్ఖత్వం. అదే ఆ అమ్మాయి మనసులో కూడా నాటడం అంటే జీవితాన్ని వంకరగా చూపించి భయపెట్టడం తప్ప మరేం లేదు.

నెమ్మదిగా అంది. "నాకు తెలిసినవాళ్ళెవరూ లేరు ఫాతిమా! నాతో కూడా మా ఊరినుంచి వచ్చిన ఒకతను స్టూడియోల చూట్టూ తిరిగి మాకు అవకాశాలు ఇప్పించాడు. అయినా నేనిప్పుడు చేయడంలేదు మానేసాను. "

"ఎందుకని మేడమ్? " అడిగింది ఫాతిమా.

"ఊరికినే కొంతకాలం రెస్ట్ తీసుకుందామని."

"మేడమ్ మీకు పిల్లలెందరు?"

ఆ ప్రశ్న మండుతున్న గుండెలో మరో సమిధ వేసి జ్వలింపచేసినట్టు అనిపించింది. కళ్ళల్లో పల్చటి నీటితెర కమ్మింది.

ఇంతలో ఎవరో ఫాతిమా అని పిలవడంతో ఆమె లేచి అటు వెళ్ళింది.

మరికొద్ది నిమిషాల్లో ఫాతిమా అందరికీ పేపర్ ప్లేట్సులో మిక్చర్, స్వీటు పెట్టి ఇచ్చింది పద్మినికి కూడా ఇస్తూ "తీసుకోండి" అంది.

"ఒద్దమ్మా" మొహమాటంగా అంది పద్మిని.

"మేడమ్ ఇక్కడ మొహమాటాలు, బిడియాలు ఉండకూడదు అందరూ ఒక ఫ్యామిలీలాగా కలిసి వెళ్తాం, వస్తాం వచ్చాక ఎవరి దారి వారిది" అంది పక్కనున్న సీట్లోంచి ఒకావిడ.

మౌనంగా ప్లేటందుకుంది పద్మిని.

ఆ తరువాత అందరూ కలిసి అంత్యాక్షరి ఆడుతుంటే తానూ వాళ్ళల్లో కలిసిపోయింది పద్మిని.

మర్నాడు తొమ్మిది అవుతుండగా చెన్నై చేరింది ట్రైను.

ఆరోజు అక్కడే చూడాల్సినవి చూసి రెండోరోజు మహాబలిపురం దర్శించుకోడానికి వెళ్ళాలని నిర్ణయించారు.

యాంత్రికంగా అనుసరించడం తప్ప పద్మిని తనే నిర్ణయమూ తీసుకోలేదు.

అడుగడుగునా ఫాతిమా పద్మినిని కనిపెడుతూ తన పనులన్నీ అయాక ఎక్కువ సమయం పద్మినితోటే గడపసాగింది.

చెన్నై నుంచి ఏ.సి బస్సు ఏర్పాటు చేసారు నిర్వాహకులు.

బస్సులో కూడా ఫాతిమా పద్మిని పక్కనే కూర్చుని కబుర్లు చెప్పింది.

తమిళనాడు ఆలయాలు చూస్తుంటే ఆ శిల్ప సంపదకి, ఆ కట్టడాలకి ముగ్ధురాలైంది పద్మిని. అవడానికి ముస్లిం అయినా ఫాతిమా హిందూ దేవాలయాల్లోకి వచ్చేటప్పుడు చీర కట్టుకుని నుదుట బొట్టుపెట్టుకుని వస్తుంటే ముచ్చటేసింది పద్మినికి.

మహాబలిపురం చూసి భారతీయ శిల్ప సంపద ఎంత అపురూపం అనుకుంది. భారతదేశంలో ఎంత గొప్ప శిల్పులుండేవారో కదా. ఈ దేశంలో ఏం కొరత ఉందని ఈ మధ్య యువత విదేశాలకు వలస వెళ్తోంది అనిపించింది పద్మినికి.

మధుర మీనాక్షి ఆలయం చూస్తుంటే ఎంత పెద్దది అని విస్తుపోయింది. నాలుగు ద్వారాలు ఒకేలా ఉండడంతో ఎటునుంచి వెళ్ళారో, ఎటునుంచి బైటకి వస్తున్నారో అంతా కన్ఫ్యూజింగ్‌గా అనిపించింది. నల్లటి అమ్మవారి విగ్రహం చూస్తుంటే పద్మిని ఆ శక్తికి కళ్ళు తిరిగినట్టు అయింది. దర్శనానికి మూడుగంటల పైగా పట్టింది. బాగా రద్దీగా ఉంది.

ఆలయ ప్రాంగణంలో తిరుగుతున్న ఏనుగులు, ఆ ప్రాంగణం మనసుకి తెలియని శాంతిని కలగచేయసాగాయి.

నాలుగురోజులు తరువాత "అమ్మ ఫోన్ చేసిందా పిన్నీ?" అనడిగింది యవనిక.

"లేదు యవనీ! వీలు కాలేదేమో చేయలేదు" అంది వసంత.

యవనికకి ఆ రోజు షూటింగ్ లేదు ఇంటిదగ్గరే ఉంది. డిగ్రీ ఫైనల్ ఇయర్ పరీక్షలు రాసింది. ఇప్పుడు యవనికకి మరో రెండు కార్యక్రమాలకి యాంకరింగ్ అవకాశాలు వచ్చాయి. ఆమె సంపాదన పెరిగింది. తల్లి తనని అర్థం చేసుకోకుండా ఇంటినుంచి వెళ్ళగొట్టడం ఆ పిల్ల జీర్ణించుకోలేకపోతోంది. తనతోపాటు యాంకరింగ్ చేస్తున్న అమ్మాయిలను వాళ్ళమ్మలే దగ్గరుండి షూటింగ్‌కి తీసుకొచ్చి తీసుకెళ్తారు. వాళ్ళలో కొందరికి సినిమాల్లో కూడా చిన్న, చిన్న పాత్రలు వస్తున్నాయి. వేరే ఆలోచించకుండా ఒప్పేసుకుని అంది వచ్చిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుంటూ హాయిగా సంపాదించుకుంటున్నారు.

కాలం మారిపోతోంది. డబ్బుకి ఎంతో ప్రాధాన్యత ఉంది ఈ రోజుల్లో. వీళ్ళ దగ్గర డబ్బుందా? కారుందా? నగలున్నాయా? పెద్ద ఇల్లుందా అని చూస్తున్నారు కానీ, ఇవన్నీ ఎలా వచ్చాయి అని ఎవరైనా ఆలోచిస్తున్నారా? అమ్మకేం తెలుసు డబ్బులేనివాళ్ళు గడ్డిపోచతో సమానం అని. తనకి తెలుసు. కాలేజీలో తను వేసుకున్న బట్టలు చూసి నవ్వినవాళ్ళు, తన దగ్గర మొబైల్ లేదని వింతగా చూసినవాళ్ళు, కాలేజీకి బండిమీద కాక, బస్సులో వెళ్తున్నందుకు అపహాస్యం చేసినవాళ్ళు. ఎన్ని అవమానాలు భరించిందో తను అమ్మకేనాడన్నా చెప్పిందా? ఎందుకు చెప్పలేదు అమ్మ బాధ పడుతుందనేగా. తను పెద్దయాక డబ్బు సంపాదించాలనుకుంది. సంపాదిస్తోంది తప్పేం ఉంది. తనేమన్నా అవినీతిగా సంపాదిస్తోందా?

ఎంతసేపూ తన అనుభవాలు మనసులో పెట్టుకుని అందరికీ అవే ఆపాదించుకుంటే ఎలా? తనకి తెలియదా సొసైటీలో ఎలా మెలగాలో, ఎవరితో ఎలా ప్రవర్తించాలో, అవన్నీ తెలుసుకోకపోతే తను బతకడం అసాధ్యం అని కూడా తెలుసు. తనకి వివేకం ఉంది, విచక్షణ ఉంది, ఎదుటివారిని స్టడీ చేయగలదు, ఆత్మవిశ్వాసం ఉంది, ధైర్యం ఉంది. ఆధునిక యువతులందరిలో ఉండాల్సిన ప్రాథమిక లక్షణాలన్నీ తనకీ ఉన్నాయని అమ్మకి చెప్పడం ఎలా?

"ఏం ఆలోచిస్తున్నావు?" యవనీ ఉతికిన బట్టలు మడతలు పెడుతున్న వసంత ప్రశ్నకి ఆలోచనలనుంచి తెప్పరిల్లి "ఏం లేదు పిన్నీ అమ్మ నన్నెప్పుడూ అర్థం చేసుకుంటుందా" అని ఆలోచిస్తున్నాను.

వసంత చేతిలో చీర మంచం మీద పక్కన పడేసి యవనిక దగ్గరగా వచ్చి ఆ పిల్ల తలను గుండెకి అదుముకుంటూ ఓదారుస్తున్న స్వరంతో అంది "తప్పకుండా అర్థం చేసుకుంటుంది. చూస్తుండు యాత్రల నుంచి వచ్చాక అమ్మ మారుతుంది. అమ్మ చూసిన ప్రపంచంలో కష్టాలు, కన్నీళ్ళు తప్ప మరేం లేవు యవనీ. అందుకే నీడని చూసినా ఉలిక్కిపడుతూ భయపడుతుంది. మీలాంటి ఆధునిక యువతుల భావాలు అర్థం చేసుకోవాలంటే నీలాంటి మరో నలుగురు యువతులు అమ్మకి తెలియాలి. అమ్మ చేస్తున్న ప్రయాణంలో తప్పకుండా అలాంటివాళ్ళు ఎదురవుతారు. అమ్మకి తెలియని జీవితపాఠాలు తెలియచేస్తారు. అప్పుడు అమ్మ నిన్నర్థం చేసుకుంటుంది. "

వసంత మాటలు బీటలు వారిన గుండె నేల మీద తొలకరి జల్లుల్లా హాయినిస్తుంటే ఆమె వెచ్చని స్పర్శలో సాంత్వన పొందుతూ మౌనంగా ఉండిపోయింది యవనిక.

వసంత ఫోన్ మోగింది.

ఇద్దరూ ఒకేసారి ఉలిక్కిపడ్డారు "అమ్మేమో" అంది యవనిక ఆశగా.

వసంత నెంబర్ చూసి అంది "కాదు శివ."

"ఓ శివ మావయ్యా! ఎలా ఉన్నాడు?"

వసంత "హలో శివా" అంది.

అవతలి నుంచి శివ స్వరం వినిపిస్తుంటే యవనిక వినసాగింది.

"యవనిక ఎలా ఉంది వసంతా?" అడిగాడు శివ.

"బాగానే ఉంది శివా. అక్క ఫోన్ కోసం ఎదురుచూస్తోంది."

"అవును మావయ్యా" అంది యవనిక కొంచెం గట్టిగా.

"చేస్తుందిలేమ్మా. వెళ్ళిన చోట సిగ్నల్స్ ఉండాలి. ఏదన్నా టెంపుల్‌కి వెళితే మొబైల్స్ అనుమతించరు. తమిళనాడులో అన్నీ కూడా చాలా పెద్ద గుడులుంటాయి. చాలా బాగుంటాయి కూడా. బస్సులో ఉన్నా మొబైల్ పనిచేయకపోవచ్చు చేస్తుందిలే దిగులుపడకు" అన్నాడు.

"నేనూ అదే చెప్పాను శివా" అంది వసంత.

"సంతోష్ ఏమంటున్నాడు?" అడిగాడు.

"మూడు రోజులు సినిమా షూటింగ్ ఏదో అవుట్ డోర్ ఉంది రాజమండ్రి వెళ్ళాడు."

"అలాగా! పోనీలే మీ లైఫ్ హ్యాపీగా ఉందికదా!"

"చాలా చాలా సంతోషంగా ఉన్నాను శివా. అంతా అక్క దీవెన" మనస్ఫూర్తిగా అంది.

"ఏంటో తన జీవితమే ఎటూ కాకుండా అయింది నిట్టూర్చాడు" శివ.

"అలా అనకు మావయ్యా అమ్మని నేను సుఖపెట్టాలనుకుంటున్నాను. మా పేదరికం ఎప్పటికీ అలాగే ఉండాలనుకోడంలేదు. నేను సంపాదిస్తాను బాగా సంపాదించి అమ్మని రాణీలా చూసుకుంటాను."

శివ నవ్వాడు. "పద్మిని చాలా ఆత్మాభిమానం ఉన్న స్త్రీ యవనీ. కూతురు సంపాదనతో ఎంజాయ్ చేయాలనుకోదు కాకపోతే నువ్వు సుఖంగా ఉంటేచాలు. అమ్మా, నేను, వసంతా అందరం అదే కోరుకుంటాం. త్వరలో మంచి సంబంధం చూస్తాను పెళ్ళిచేసుకో యవనీ. మంచి కుర్రాడు దొరికి నీకు మోరల్ సపోర్టు ఇవ్వగలిగితే నీ జీవితం స్థిరపడినట్టే."

యవనిక వసంత వైపు చూసి నుదుట చిన్నగా చేత్తో కొట్టుకుంటూ "ఎవరు నోరు విప్పినా ఈ పెళ్ళి అనే మాట తప్ప మరో మాటరాదు. ఇప్పుడే కదా నేను నా కెరియర్ ప్రారంభించాను. అప్పుడే పెళ్ళంటే ఎలా? నాకెవరిస్తారు అవకాశాలు?" అంది.

"ఆ మాటలు విన్న శివ సరే, సరే తల్లీ నీ ఇష్టం వచ్చినపుడు చేసుకో" అన్నాడు గబ గబా.

యవనిక చిన్నగా నవ్వి అక్కడినుంచి హాల్లోకి వెళ్ళిపోయింది.

"ఇంకేవిటి సంగతులు శివా. రజని ఎలా ఉంది?"

"శివ కొంచెం చిరాగ్గా అన్నాడు దానికి రాను, రాను మతిపోతోంది మెంటల్‌గా తయారవుతోంది. పిల్లలు పెద్దవాళ్ళు అయారు. మంచి చదువులు చదవాలి కనీసం గుంటూరన్నా వెళదాం అంటే ఆ ఊరునుంచి రానంటుంది ఏం చేయను చెప్పు. పెద్దవాడిని

గుంటూరు కాలేజీలో చేర్పించాను. చిన్నవాడికి టెన్త్ పరీక్షలు. అవి అయిపోగానే వాడిని కూడా అక్కడే చేర్పించి ఇద్దర్నీ హాస్టల్లో చేర్పిస్తాను.''

''ఎలాగోలా పిల్లలకి మంచి భవిష్యత్తు ఇస్తే నీ బాధ్యత తీరిపోతుందిలే శివా. ఆ తరువాత మీ ఇష్టం వచ్చినట్టు బతకచ్చు'' అంది వసంత.

''నేనూ అదే అనుకుంటున్నా వసంతా. సరేలే ఉంటాను పద్మిని ఫోన్ చేస్తే నాక్కూడా చేయమని చెప్పు'' అంటూ ఫోన్ పెట్టేసాడు శివ.

వసంత మిగతా బట్టలన్నీ మడతలు పెట్టి అన్నీ బీరువాల్లో సర్దేసింది.

యవనిక బట్టలు కూడా తనే మడతలు పెట్టాల్సి రావడం, యవనికకు పనిమీద శ్రద్ధ లేకపోవడం గమనిస్తున్న వసంతకి ఆ విషయంలో కొంచెం అసంతృప్తిగా అనిపించసాగింది.

ఆడపిల్ల కదా కొంచెమన్నా పనీ, పాటా వచ్చి ఉండాలి దీనికి తన బట్టలు సర్దుకోడం, తను తిన్న కంచం కడుక్కోడం కూడా బద్ధకం ఎలా ఈ పిల్లని సరిదిద్దాలి అనుకుంటూ తను కూడా హాల్లోకి వచ్చింది.

యవనిక ఒక కుర్చీ మీద కాళ్ళు చాపుకుని మరో కుర్చీలో కూర్చుని టీ.వి చూస్తోంది.

ఈ మధ్య యవనిక వేషధారణలో కూడా బాగా మార్పు వచ్చింది. మోకాళ్ళ దగ్గరకు ఉండే ప్యాంట్లు, ఒంటిని అతుక్కుని ఉండే టీ షర్ట్స్ వేసుకుంటోంది.

వెంట్రుకలు సినిమాల్లో హీరోయిన్స్‌లా కట్ చేయించుకుంది. కనుబొమలు షేవ్ చేయించుకుని సన్నటి నల్లటి స్టిక్కర్ పెట్టుకుంది బొట్టుగా. మేకప్‌లో తప్ప విడిగా ఒంటిమీద గొలుసుకానీ, చెవులకి కానీ ఏమీ పెట్టుకోడంలేదు.

''ఏంటో ఈ ఫ్యాషన్లు!? '' అనుకుంటూ కిచెన్‌లోకి వెళ్ళిపోయింది వసంత.

❦❦❦

పద్మిని బయల్దేరే రోజున్నంత నిరుత్సాహంగా, నీరసంగా లేదిప్పుడు. ఒక్కో ప్రదేశం చూస్తుంటే ఆమెలో కొత్త ఉత్సాహం పరవళ్ళు తొక్కసాగింది.

వాళ్ళ షెడ్యూలు ప్రకారం చెన్నైలో చూడాల్సిన ప్రదేశాలు, అక్కడినుంచి మహాబలిపురం, పాండిచ్చేరి, మధుర మీనాక్షి టెంపుల్, తంజావూరు, కొచ్చిన్. మధ్యలో కొందరి కోరిక మీద మహాబలిపురం నుంచి నేరుగా మధుర మీనాక్షిని దర్శించుకుని అక్కడి నుంచి బెంగుళూరు వెళ్ళారు. అక్కడినుంచి మైసూరు వెళ్ళాలని కూడా నిర్ణయించారు.

ఎక్కడికి వెళ్ళినా పద్మినితోపాటు ఆమె గదిలో ఫాతిమా, కాంచన అనే మరో యువతి కలిసి ఉండసాగారు. ఫాతిమాది ఒక రకమైన విషాదగాథ అయితే కాంచనది మరో విషాదం.

కాంచన ఎం.బి.ఏ చదువుకుని హైదరాబాదులో ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ముప్పై ఐదు సంవత్సరాలుంటాయి.

తనతో పాటు చదువుకునే కుర్రాడిని ప్రేమించి, తనవైపు పెద్దలు కాదన్నా అతన్ని పెళ్ళిచేసుకుంది. ముందు కొడుకు ప్రేమని అంగీకరించి పెళ్ళికి ఒప్పుకున్న అతని తల్లి, తండ్రులు పెళ్ళి చేసుకుని భార్యని కాపురానికి తీసుకొచ్చాక కాంచనని టార్చర్ పెట్టడం మొదలుపెట్టారు. అతను మెడికల్ రిప్రజెంటేటివ్ అవడంతో ఎక్కువగా బైట తిరిగేవాడు. అది అదనుగా చేసుకుని ఇంట్లో లేనప్పుడు ఆమెని నానా కష్టాలు పెట్టడం, తిండి పెట్టకుండా మాడ్చడం, విడాకులిచ్చి వెంటనే వెళ్ళిపొమ్మని బెదిరించడం చేసేవాళ్ళు.

భరించి, భరించి చివరికి ఒకరోజు భర్తకి అన్ని విషయాలు చెప్పేసింది కాంచన.

అది విన్న భర్త తన తల్లి, తండ్రుల మీద అకారణంగా నిందవేస్తూ, తనతో వేరు కాపురం పెట్టించడానికి ఆమె పన్నాగం పన్నుతోందని అనుమానించి ఆ క్షణం నుంచీ తాను ఆమెని హింసించడం మొదలుపెట్టాడు.

ఏడాదిపాటు భరించిన కాంచన ఒక రాత్రికి రాత్రి చెప్పా చెయ్యకుండా బైటకి వచ్చి నేరుగా హైదరాబాదు చేరి, తన దగ్గర ఉన్న కొద్దిపాటి బంగారం అమ్మి ఆ డబ్బుతో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్లో ఓ గది తీసుకుని ఉద్యోగం వేట ప్రారంభించింది. అదృష్టవశాత్తూ త్వరగానే ఆమెకి ఉద్యోగం వచ్చింది. కాంచనది చాలా తీయని స్వరం. ఆమె మాట్లాడుతుంటే పాటపాడుతున్నట్టుగా శ్రావ్యంగా, హాయిగా ఉంటుంది.

పద్మినిని ఆంటీ అని పిలుస్తూ కొన్ని గంటల్లో చనువుగా చేరువైంది. ఫాతిమాకి మంచి స్నేహితురాలైంది. కాంచనకి కూడా సినిమాల్లో డబ్బింగ్ చెప్పాలని కోరిక.

అవన్నీ వింటుంటే పద్మినికి ఒక్క విషయం మాత్రం స్పష్టంగా అర్థమైంది. ప్రస్తుతం మీడియా అనేది యువతీ, యువకుల మనసుల మీద బలంగా ప్రభావాన్ని చూపిస్తోంది. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చు అన్న నమ్మకం వాళ్ళ మనసుల్లో దృఢంగా పడింది. కొన్ని సంవత్సరాల క్రితం చిన్న మొక్కగా ప్రారంభమైన టీ.వి అనే దృశ్యమాధ్యమం ఇప్పుడు శాఖోపశాఖలుగా విస్తరించి మొత్తం ప్రపంచాన్ని ఆక్రమించుకుని ఆధిపత్యం చెలాయిస్తోంది.

ఒకప్పుడు ప్రభుత్వోద్యోగాలకోసం, బ్యాంకు ఉద్యోగాల కోసం అనేక రకాల పోటీ పరీక్షలుండేవి. అలాగే టీచర్ ట్రైనింగ్, నర్స్ ట్రైనింగ్ కోర్సులుండేవి, పాలిటెక్నిక్, ఐ.టి.ఐ అనే వృత్తివిద్యాకోర్సులుండేవి. టైపిస్టు, స్టెనో, టెలిఫోన్ ఆపరేటర్, రిసెప్షనిస్టు వగైరా అనేక రకాల పోస్టులుండేవి. ఎవరికి నచ్చిన, అనుకూలంగా ఉన్న కోర్సువాళ్ళు పూర్తి చేసి ఉద్యోగాల వేటలో పడేవాళ్ళు. ఇప్పుడు అవన్నీ ఉన్నా ఎక్కడో మచ్చుకి ఉన్నాయి. చిన్న ఉద్యోగానికి కూడా పెద్ద ట్రైనింగ్, రకరకాల అర్హతలు అడుగుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలపైన కొంతకాలం బాన్ ఉంది. కాన్వెంట్‌లు ఎక్కువై స్కూలు ఫైనల్ తరువాత టీచర్ ట్రైనింగ్ అనే కోర్స్ పోయింది. కనీస విద్యార్హత పోస్ట్ గ్రాడ్యుయేషన్ అయింది. దానికి తోడు టీ.వి ఛానెల్స్ కూడా విపరీతంగా పెరిగిపోడమో ఉన్నత చదువులు చదువుకున్నవాళ్ళు విదేశాలకు వెళ్తుంటే చిన్న చదువులు చదువుకున్నవాళ్ళు యాంకర్స్‌గా, డబ్బింగ్ ఆర్టిస్టులుగా, కళాకారులుగా తయారవుతున్నారు. ఈ ఉద్యోగాలైతే నెలంతా చాకిరీ చేస్తే చేతిలో పడే జీతం రాళ్ళుకాదుకదా. రోజుకింత అని నిర్ణయించే ఇస్తున్నారు. ఈజీమనీ తేలికైన ఉద్యోగం, ఖరీదైన జీతం. ఖరీదైన జీవితం కూడా. ఈ ఉద్యోగంలో మెదడుకి పదును పెట్టక్కర్లేదు. పెద్దగా వాళ్ళల్లో ప్రతిభను కూడా ఎవరూ చూడడంలేదు. అందం, ఫిగర్ చూస్తున్నారు.

తెలుగులో తమ సంభాషణ తాము చెప్పుకునే హీరోయిన్లు, ఇతర కళాకారిణులు లేకపోవడంతో తెలుగు మాట్లాడగలిగిన వాళ్ళచేత డబ్బింగ్ చెప్పిస్తున్నారు.

చక్కటి ఉచ్చారణ, మధురమైన స్వరం ఉంటే చాలు డబ్బింగ్ చెప్పేయచ్చు, అంతో, ఇంతో అందం, ఫోటోజెనిక్ ఫేస్ ఉంటే చాలు నటించేయచ్చు అన్నట్టుగా అయిపోయింది ఇండస్ట్రీ.

ఈ విధమైన పరిస్థితి అప్పుడు ఉండి ఉంటే తన జీవితం ఇలా అయేది కాదు. కనీసం తనలో ఉన్న ప్రతిభకు ఒక గుర్తింపు, ఆర్థికంగా బలమైన స్థానం పొంది ఉండేది.

విరక్తిగా నవ్వుకుంది పద్మిని.

బెంగుళూరుకి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకున్నారు. కోటిలింగాల గుడిని దర్శించుకున్నారు. టిప్పు సుల్తాన్ సమ్మర్ ప్యాలెస్, బృందావన గార్డెన్, మొదలైనవి చూసి, మైసూరు బయల్దేరారు.

"ఆంటీ ఆలోచిస్తుంటే నాకో ఐడియా వచ్చింది" అంది బస్సులో పక్కనే కూర్చున్న కాంచన పద్మినితో.

"ఏంటది చెప్పు, చెప్పక్కా" అంది ఫాతిమా ఉత్సాహంగా.

"ఏం లేదు ఆంటీ మంచి నటి. చాలా ఎక్స్‌పీరియన్స్‌డ్ ఇప్పుడు ఆంటీకి నటించాలని లేదు. ఆమె రెస్ట్ తీసుకోవాలనుకుంటున్నారు. కానీ, ఏదో ఒకటి చేస్తేగానీ ఫైనాన్షియల్‌గా గడవదు. అలాంటప్పుడు నాకేమనిపిస్తోందంటే..!?"

పద్మిని కుతూహలంగా కాంచనకేసి చూసింది.

"నాలాంటి, ఫాతిమాలాంటి నటన పట్ల, డబ్బింగ్ పట్ల ఆసక్తి ఉన్న అమ్మాయిలకి ఆంటీ ట్రైనింగ్ అంటే నటన, డబ్బింగ్ నేర్పిస్తే ఎలా ఉంటుంది?"

"నేనా? నేను నేర్పించాలా? " విస్తుబోయింది పద్మిని.

"అదేంటాంటీ అంత ఆశ్చర్యపోతారేంటి? ముప్పై ఏళ్ళుగా అనేక రకాల పాత్రలు అటు రంగస్థలం మీదా, ఇటు టీ.వీల్లో పోషించి ఎన్నోఓ బహుమతులు, ప్రశంసలు పొందిన మీరుకాక ఇంకెవరు నేర్పిస్తారు? మీలాంటి వాళ్ళు అజ్ఞాతంగా ఉండకూడదు. నిజం చెబుతున్నాను మీరు నా మాట విని హైదరాబాదు వెళ్ళగానే నటశిక్షణాలయం పెట్టండి. స్టూడెంట్స్‌ని నేను తెస్తాను. ఒక్కో బ్యాచ్‌కి ఆరునెల్లుగానీ, మూడునెలలు గానీ కోర్స్. ఈచ్ కోర్స్‌కి ఇంత అని ఫిక్స్ చేద్దాం."

"భలే బాగుందక్కా నీ ఐడియా. మేడమ్ ఒప్పుకోండి మేడమ్. చాలా మంచి ఐడియా. హుషారుగా అంది ఫాతిమా."

"నేను పాతకాలం నటినమ్మా! నేనేం శిక్షణ ఇవ్వగలను. అనవసరంగా నా మీద అంత పెద్ద బాధ్యత పెట్టకండి" అంది పద్మిని.

"లేదాంటీ మీకు తెలియదు. మీలాంటి వాళ్ళు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం చాలా ఉంది. సీరియల్స్ చూస్తున్నా కదా ఎవరికీ నటనంటే తెలియదు. ప్రతి ఫీలింగ్‌కీ ఒకటే ఎక్స్‌ప్రెషన్. చికాకేస్తుంది. మీరు నా మాట వినండి ఒప్పుకోండి మొండిగా" అంది కాంచన.

"ఒప్పుకోండి మేడమ్" ఒత్తిడి చేసింది ఫాతిమా.'కొ

"చూద్దాంలే ముందు మన ట్రిప్ పూర్తి అయి హైదరాబాదు వెళ్ళాక ఆలోచిద్దాం" అంది పద్మిని అయిష్టంగానే.

"చూద్దాం కాదు చేద్దాం" దృఢంగా అంది కాంచన.

బస్సు మైసూరు ప్రవేశించడంతో అందరూ "జై చాముండేశ్వరీ!!" అని జయ, జయధ్వానాలు చేయడంతో సంభాషణ ఆగిపోయింది.

**పూర్తిగా తెల్లవారకుండానే** యవనిక నిద్రలేచి స్నానం పూర్తిచేసుకుంది.

ఆరోజు కొత్త సీరియల్ షూటింగ్ ప్రారంభం అవుతోంది. అందులో యవనిక ఒక హీరోయిన్‌గా వేస్తోంది. మొదటిసారిగా సీరియల్‌లో నటిస్తోంది.

ఈ విషయం వసంతకి చెప్పలేదు యవనిక. చెపితే ఒద్దంటుందేమో అనే భయం, వసంతకి చెప్పాల్సిన అవసరం ఏంటి అనే నిర్లక్ష్యం ఆమెకి చెప్పకపోడానికి కారణాలు.

తను వెళ్ళేసరికి వసంత, సంతోష్ నిద్రలేవరన్న నమ్మకంతో వాళ్ళకి చెప్పకుండా షూటింగ్‌కి సిద్ధం అయి కూర్చుంది. అయితే వసంత మామూలుగా ఐదున్నర, ఆరింటికల్లా లేచేస్తుంది. ఆ రోజు కూడా ఐదున్నరకి లేచి తలుపు తీసుకుని హాల్లోకి వచ్చేసరికి యవనిక బైటకి వెళ్ళడానికి రెడీ అయి ఎవరికోసమో ఎదురుచూస్తున్న దానిలా సోఫాలో కూర్చుని మొబైల్‌లో ఏవో మెసేజెస్ చూసుకుంటోంది.

వసంత ఆశ్చర్యంగా చూసింది "ఏంటి అప్పుడే లేచావేం?" అడిగింది.

కొంచెం తడబడిన యవనిక నవ్వుతూ అంది "అరే లేచేసావా? నిన్ను సర్‌ప్రైజ్ చేద్దామనుకున్నా" అంది.

"ఏంటా సర్‌ప్రైజ్" అడిగింది వసంత.

యవనిక నవ్వుతూ అంది "నేను కొత్త సీరియల్‌లో హీరోయిన్‌గా సెలక్ట్ అయాను పిన్నీ. ఇవాళే షూటింగ్ ప్రారంభం. షూటింగ్‌కి వెళ్ళాక ఫోన్ చేసి చెప్పాలనుకున్నా"

"ఏంటి? సీరియల్‌లో చేస్తున్నావా?" నిర్ఘాంతపోతూ అడిగింది వసంత.

ఆమె అడిగిన తీరుకి చిరాకొచ్చినా తమాయించుకుంటూ "ఇందులో అంత ఆశ్చర్యపోడానికేం ఉంది పిన్నీ, ఎప్పుడో ఒకప్పుడు నేను సీరియల్ చేయాల్సిందేగా.. కాకపోతే నేనూహించిన దానికన్నా కొంచెం ముందే అవకాశం వచ్చింది. ఇదంతా నా అదృష్టం రియల్లీ అయామ్ లక్కీ" అంది ఒకింత గర్వంగా.

వసంత సమాధానం చెప్పకుండా నిశ్శబ్దంగా ఆ అమ్మాయి మొహంలోకి పరికించి చూస్తూ అంది "ఒక్కమాట అమ్మతో చెప్పి అంగీకరించాల్సిందేమో యవనీ. యాంకరింగ్ వరకు అమ్మ ఒప్పుకున్నా సీరియల్ అంటే ఏమంటుందో."

నిర్లక్ష్యంగా చూసింది యవనిక.

"నేను తెరమీద కనిపించడం ఆవిడకి ఇష్టంలేదు. కానీ నాకిష్టం. తనకిష్టం లేకుండా నేను తెరమీద కనిపించానేగా నన్ను ఇంట్లోంచి నిర్దాక్షిణ్యంగా వెళ్ళగొట్టింది. ఇంక నా విషయాలేవీ ఆవిడకి చెప్పక్కర్లేదు పిన్నీ. అనవసరం కూడా. నన్ను ఆవిడ వదిలేసుకుంది. నేనే పిచ్చిదాన్ని ఇంకా అమ్మ ఫోన్ చేస్తుందని నన్ను ఇంటికి రమ్మంటుందని ఎదురుచూస్తున్నా. ఆ ఆశ కూడా పోయిందిలే. ఇంక ఆవిడ నాకు అమ్మకాదు. నేనావిడకి కూతుర్నికాను."

వసంత మనసు చివుక్కుమంది. ఎంతమాట అంటోంది యవనిక. ఈ పిల్లకోసమేగా ఆ తల్లి అన్ని కష్టాలు పడింది. ఈ పిల్ల సుఖం కోసమేగా ఆ తల్లి తన సుఖాలు త్యాగం చేసింది. ఇదేనా త్యాగమయి అయిన తల్లిపట్ల ఈ కూతురు చూపించాల్సిన విశ్వాసం? మనసు కష్టపడింది కాబట్టి ఆవేశంతోటో, ఆక్రోశంతోటో తాత్కాలికంగా కూతుర్ని వెళ్ళిపొమ్మని ఉంటుంది పద్మిని. అంతేగానీ ఏ తల్లీ తన పిల్లలకి శాశ్వతంగా దూరం కాగలుగుతుంది. చిన్నప్పుడు లేలేత పాదాలతో గుండెలమీద తన్నినపుడు మురిపెంతో ముద్దుపెట్టుకుంటుంది ఆ పాదాలను, పెద్దయ్యాక స్వార్థంతోటో, తన మాట నెగ్గలేదన్న పంతంతోటో కాలదన్ని వెళ్ళిపోయినా ఆ పాదాలకు ముళ్ళు గుచ్చుకోకూడదని తన అరిచేతులు అడ్డం పెడుతుంది. అదే తల్లి మనసంటే. ఆ తల్లి మనసు అర్థంకావడానికి ఈ అమ్మాయి అమ్మగా మారాలి అందాకా ఇలాగే ఆలోచిస్తుందేమో నిట్టూర్చింది వసంత.

చేసేదిలేక "జాగ్రత్త యవనీ. యాంకరింగ్ చేసేటప్పుడు నీతో ఉండేవాళ్ళు కెమెరామాన్, డైరెక్టర్, ప్రొడక్షన్ అసిస్టెంట్, ఫ్లోర్‌బోయ్ అలా ఏ నలుగురో, ఐదుగురో ఉంటారు. వాళ్ళతో నీకు పెద్దగా స్నేహం ఉండదు, అవసరమూ ఉండదు కానీ సీరియల్ అంటే చాలా మందితో నువ్వు కలిసి ఉండాల్సి వస్తుంది. అలాంటప్పుడు ఏ ఒక్కరితో అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదమే. అందుకే పెద్దదానిగా హెచ్చరిస్తున్నాను జాగ్రత్తగా ఉండు. నీ పని నువ్వు చూసుకుని బైటపడు అంతే." అంటూ అక్కడినుంచి కదిలి వెళ్ళిపోయింది వసంత.

పద్మిని చాదస్తం ఈవిడకీ వచ్చింది అనుకుంది యవనిక.

మరికాసేపటికి కారు వచ్చినట్టుగా హారన్ మోగడంతో యవనిక హుషారుగా పరిగెత్తిపోయింది.

ఆ పిల్ల హుషారు చూస్తుంటే బాధగానూ, దిగులుగానూ అనిపించింది వసంతకి.

సంతోష్ నిద్రలేచి వచ్చాక అంది వసంత "యవనిక హీరోయిన్‌గా చేస్తోందిట నీకు తెలీదా?"

"లేదే ఏ సీరియల్?" బ్రష్ చేసుకుంటున్న సంతోష్ ఆశ్చర్యంగా అడిగాడు.

"ఏదో కొత్త సీరియలట ఎవరు ప్రొడ్యూసర్, బ్యానర్ ఎవరిది ఏమీ చెప్పలేదు. అయినా నీకు తెలియకపోవడం ఏంటి?"

"నేనేమన్నా ఛానెల్ హెడ్‌నా?" నవ్వాడు

"ఇంతకీ ఏ ఛానల్‌కో తెలుసా?"

"తెలియదు నేనడగలేదు. సీరియల్‌లో చేస్తుందనగానే నాకు భయం వేసింది సంతోష్, యవనిక ముక్కుపచ్చలారాని పిల్ల. అన్నీ తెలుసు అనుకుంటున్న ఏమీ తెలియని పిల్ల.. మంచివాళ్ళెవరో, దుర్మార్గులెవరో ఎలా తెలుసుకుంటుందో ఏంటో?"

"నువ్వు అంతగా ఆలోచించాల్సిన అవసరం లేదు వసూ. యవనిక నువ్వు అనుకునేంత అమాయకురాలుకాదు. చాలా గడుసుది, తెలివైనది. చదువుకున్న అమ్మాయి, మోడరన్ గర్ల్. వాళ్ళకి తెలియనిదంటూ ఏమీలేదు. ఎవరన్నా ఈమె చేతిలో మోసపోతారు కానీ, ఈమెనెవరూ మోసం చేయలేరు. ఆ విషయం నాకు తెలుసు" అన్నాడు సంతోష్ బ్రష్ చేసుకోవడం ముగించి టవల్‌తో మొహం తుడుచుకుంటూ.

"అంత నమ్మకంగా ఎలా చెప్పగలుగుతున్నావు?" కాఫీ గ్లాసు అందిస్తూ అడిగింది.

"నీకో రహస్యం చెపితే నీ గుండె ఆగిపోతుంది."

"ఏంటది?" భయంగా అడిగింది.

సంతోష్ కాఫీ సిప్ చేస్తూ కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయాడు. ఆ మౌనం భరించలేనిదనిలా చెప్పు అంది వసంత విసుగ్గా.

సంతోష్ కాఫీ తాగడం ఆపి నెమ్మదిగా అన్నాడు "యవనిక ఫీల్డ్‌లో ఒకతనితో అఫైర్ పెట్టుకుంది. వాళ్ళిద్దరూ కలిసి, మెలిసి తిరుగుతున్నారని వినికిడి. అతనే ఈ అవకాశం ఇప్పించాడంటున్నారు."

పెద్ద విస్ఫోటనం జరిగినట్టు ఉలిక్కిపడి చూసింది వసంత "ను...నువ్వు చెప్పేది ని..జమా?"

"ఇందులో నమ్మశక్యం కానిదేం లేదు వసంతా. యవనిక యవ్వనంలో ఉంది. ఈ వయసుకి ప్రేమా, ఆకర్షణా చాలా సహజం. మనం ఒద్దని అరచేయి అడ్డం పెడితే ఆగుతుందా? పద్మిని ఏ విషయంలో భయపడుతూ యవనికను ఈ రంగానికి దూరంగా ఉంచాలనుకుందో ఆ విషయంలో ఆలోచనకి కూడా ఆస్కారం ఇవ్వనంతగా యవనిక ఎదిగింది. త్వరలో అతడిని పెళ్ళి చేసుకుంటుందని కూడా విన్నాను."

"లేదు అలా జరక్కూడదు" వసంత హఠాత్తుగా కుర్చీలో కూలబడి వెక్కి వెక్కి ఏడవసాగింది.

సంతోష్ ఆమెనలా చూసి నిర్ఘాంతపోయాడు. ఆమె భుజాలు పట్టుకుని దగ్గరకు తీసుకుని "నువ్వెందుకు అంతగా బాధపడుతున్నావు? జరిగేదాన్ని ఆపడానికి మనమెవరం? అయినా రెక్కలొచ్చిన పక్షిని ఎగరొద్దంటే మానుతుందా చెప్పు? ఊరికే నువ్వు మనసు పాడుచేసుకోకు. యవనిక పద్మినికాదు మోసపోడానికి, దగాపడ్డానికి. యవనిక యవనికే. తను హాయిగా, దర్జాగా బతుకుతుంది నామాట నమ్ము వసంతా" అంటూ ఓదార్చసాగాడు.

వసంత ఏడుస్తూనే ఉండిపోయింది. ఆమె కళ్ళముందు మొదలు నరికిన చెట్టులా కూలిపోయి ఏడుస్తున్న పద్మిని కనిపిస్తోంది.

ఇప్పటికే ఆశలన్నీ అడియాసలైపోయి తను చేసిన త్యాగాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు అయాయని మనసు చెదిరి, గుండె పగిలి మనశ్శాంతి కోసం దేశాటనం చేస్తున్న పద్మినికి ఈవార్త తెలిస్తే అసలు తిరిగి వస్తుందా?

యవనిక ప్రేమిస్తున్న వ్యక్తి తనని నిజంగా పెళ్ళిచేసుకుంటాడా? అవసరం తీరాక అవతల పారేస్తాడా? ఆ తరవాత యవనిక పరిస్థితేంటి? నిజంగా సంతోష్ అన్నట్టు యవనిక తెలివైనది, గడుసుది అయితే సమస్యేలేదు. అమాయకురాలైతేనే కష్టాలు ఆ పిల్లని ఎవరు రక్షిస్తారు? ఎలా?

"వసంతా నాకర్థం కావడంలేదు నువ్వింతగా ఎందుకాలోచిస్తున్నావు? ఈ ఫీల్డ్‌లో ఇవన్నీ మామూలేగా. ఇలా జరుగుతుందని మనం ముందే ఊహించాం కూడా కదా జరక్కపోతే ఆశ్చర్యపోవాలిగానీ, జరిగితే బాధపడడం దేనికి? ఇంక పద్మిని సంగతంటావా? తను అన్నిటికీ ఎప్పుడో మానసికంగా సిద్ధపడిపోయింది. కొత్తగా ఇప్పుడు ఆవిడ బాధపడ్డానికి ఏమీలేదు. ఒకసారి ఆవిడకి ఇష్టంలేని రంగంలోకి కూతురు అడుగుపెట్టడంతోటే ఆమెకి అంతా అర్థమైపోయింది. కాబట్టి నువ్వు అనవసరంగా ఆందోళనపడకు."

సంతోష్ ఓదార్పుగా, మందలింపుగా మెత్త, మెత్తగా చెబుతుంటే కొద్ది, కొద్దిగా తను కూడా మనసుకి సర్దిచెప్పుకోడానికి ప్రయత్నిస్తూ లోపలికి వెళ్ళిపోయింది వసంత.

పద్మిని యాత్ర ముగిసింది.

షెడ్యూలులో కొంత మార్పు వచ్చి మైసూరు నుంచి తిరుపతి వెళ్ళి అక్కడినుంచి విజయవాడ వెళ్ళి అక్కడినుంచి రైల్లో వరంగల్ దాకా వచ్చి అక్కడ భద్రకాళి, రామప్ప చూడాలని నిర్ణయించారు. బెంగుళూరు దగ్గర పళని, ధర్మపురి మొదలైనవి వెళ్ళలేదు. కొంతమందికి ఇళ్ళ దగ్గరనుంచి ఫోన్‌లు వచ్చాయి త్వరగా వచ్చేయమని అంచేత ఈ మార్పు చేసారు.

అనుకున్నదానికన్నా రెండురోజులు ముందే తిరిగి హైదరాబాదులో అడుగుపెట్టింది పద్మిని. లకిడీకాపూల్‌లో దింపేసారు అందర్నీ కారులో. అక్కడ్నించి ఎవరిదారిన వాళ్ళు ఆటోల్లోనో, వాళ్ళపిల్లలో, భర్తో కారు తెస్తే కారులోనో ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. ఫాతిమా విజయవాడలో ఆగిపోయి ఒంగోలు వెళ్ళిపోయింది. వెళ్తూ వెళ్తూ పద్మిని దగ్గర తనకి ఏదో ఒక టీ.వి ఛానెల్‌లో అవకాశం ఇప్పిస్తానన్నమాట తీసుకుని "త్వరగా మిమ్మల్ని హైదరబాదులో కలుస్తాను మేడమ్" అంటూ వెళ్ళిపోయింది.

ఆమె బలవంతం మీద మాట ఇచ్చింది కానీ తాదూర సందులేదు మెడకో డోలా? నాకే దిక్కులేదు నీకేం ఇప్పించగలను అనుకుంది మనసులో.

కాంచన పద్మినితోపాటు అదే ఆటోలో తను ఉంటున్న పంజాగుట్ట ఏరియాకి వెళ్ళిపోయింది. వెళ్తూ, వెళ్తూ "మేము చెప్పిన విషయాలు ఆలోచించండి మేడమ్. అందరం దాదాపు ఒకే బాటలో ప్రయాణిస్తున్నాం. ఒంటరిగా ప్రయాణించేకన్నా కలిసికట్టుగా ఉంటే ఏదన్నా సాధించగలం అనిపిస్తోంది నాకు. కాకపోతే మీలాంటి అనుభవజ్ఞుల సపోర్టు ఉంటే ఇంకా ధైర్యంగా ఉంటుంది" అంది.

"తప్పకుండా కాంచనా" అంది పద్మిని.

అందరూ వారి, వారి ఫోన్ నెంబర్లు ఇచ్చిపుచ్చుకున్నారు.

ఏంటో ఈ పిల్లలు తన మీద మరీ ఎక్కువ నమ్మకం పెట్టుకుంటున్నారు అనుకుంటూ నిట్టూర్చి కృష్ణానగర్ వైపు పోనిమ్మంది ఆటోని.

యవనిక వెళ్ళిపోగానే పద్మిని తన సామానంతా కృష్ణానగర్‌లో తను మొట్టమొదట హైదరాబాదు వచ్చినపుడు ఉన్న ఏరియాలోనే ఒక గది తీసుకుని అక్కడ పెట్టేసింది. ఇప్పుడు అదే రూములోకి చేరుకుంది.

తాళం తీసి లోపలికి వెళ్ళగానే మనసు, గది, బతుకు అంతా శూన్యంగా అనిపించింది. ఇన్నిరోజులు నలుగురితో కలిసి, మెలిసి తిరుగుతుంటే జరిగిన సంఘటన అంతగా గుర్తువచ్చి మనసుని బాధించలేదు. ఎప్పుడన్నా ఆ ఆలోచనలు మీదపడి భూతాల్లా బాధపెడుతుంటే కాంచన, ఫాతిమా ఆ బాధ గుండెదాకా పాకకుండా కాపాడారు. ఇప్పుడు మళ్ళీ ఒంటరిగా నిలబడడంతో గాయం కెలికినట్టు అయి మంటపెడుతోంది.

యవనిక ఎక్కడుందో, ఏం చేస్తుందో, వసంత దగ్గర ఉన్నా తనలా వసంత చూసుకుంటుందా? ముక్కుపచ్చలారని పిల్లని తను మరీ అంత రాక్షసంగా శిక్షించకుండా ఉంటే బాగుండేది. అందరు అమ్మాయిల్లాగే యవనిక్కూడా మీడియా మత్తు ఒంటినిండా పాకింది. మెల్లగా, ఒక తల్లిలా ఆ పిల్లకి అర్థమయ్యేలా అందులోని సాధక, బాధకాలు తెలియచేసి ఆ మత్తునుంచి బైటపడేయాల్సిన తనే ఆవేశపడిపోయి అమానుషంగా ప్రవర్తించాక అది ఎక్కడికి వెళ్తుంది? ఎవరున్నారు ఆదుకోడానికి? కొత్తగా పెళ్ళిచేసుకున్న వసంత ఇదివరకులా యవనికను ఆదరిస్తుందా? వాళ్ళిద్దరి మధ్యా యవనిక అడ్డు అవదా? ఎంత పని చేసింది తను.

చాలాసేపు ఆలోచనలతో ఏమీ చేయకుండా అలా కూర్చుండిపోయిన పద్మిని కళ్ళు తిరుగుతున్నట్టు అయి బ్రష్ చేసుకోడానికి బాత్‌రూమ్‌కి వెళ్ళిపోయింది.

పద్మిని కాలకృత్యాలు, స్నానం కానిచ్చి తలుపు తాళం వేసి బైటకు వచ్చి ఆటో చేసుకుంది. బ్యాగ్‌లోంచి సెల్ తీసి వసంతకి ఫోన్ చేసింది.

వెంటనే ఫోన్ తీసింది వసంత. "వసంతా ఎక్కడున్నావు?" అడిగింది పద్మిని.

"అక్కా నువ్వా? ఎప్పుడొచ్చావు?" ఆనందంగా అడిగింది వసంత.

"ఉదయం వచ్చాను వసంతా ఇప్పుడు నీ దగ్గరకే బయలుదేరాను."

"అలాగా రా అక్కా. అయినా అదేంటి బుధవారం వస్తానన్నావుగా. ముందు చెప్పి ఉంటే తను స్టేషన్‌కి వచ్చేవాడుగా."

"లేదులే వసంతా. ప్రోగ్రామ్‌లో చిన్న మార్పొచ్చింది. చెప్తాలే వస్తున్నాగా. కారులో అందర్నీ లక్డికాపూల్‌లో దింపేసారు" చెప్పింది పద్మిని.

"అయ్యో అలాగా.. అంతా బాగనే ఉందిగా! నీ ఆరోగ్యం ఎలా ఉంది?"

"బాగున్నాను వసంతా. నాకు రైల్లో నీలాంటి అమ్మాయిలు ఇద్దరు పరిచయం అయారు. నన్ను వదలకుండా నాతోటే ఉన్నారు. వాళ్ళతో ఉండటం వలన ఏ ఆలోచనలు నన్ను బాధపెట్టలేదు. కాకపోతే ఇక్కడికి రాగానే నా మీద దండయాత్ర చేసాయి" బలవంతంగా నవ్వింది పద్మిని.

"నువ్వు వచ్చాక మాట్లాడుకుందాంలే అక్కా" అంది వసంత.

అవును అనుకుంటూ ఫోన్ కట్ చేసింది పద్మిని.

పద్మిని వెళ్ళేసరికి వసంత చిక్కటి ఫిల్టర్ డికాషన్‌తో కమ్మటి కాఫీ రెడీగా ఉంచింది.

పద్మినిని చూడగానే ఆప్యాయంగా కౌగలించుకుని "ఎలా ఉన్నావక్కా?" అంది.

ఆమె కల్మషం లేని ప్రేమ పద్మినిని సిగ్గుపడేలా చేసింది.

ఈమె గురించేనా నేను మారిపోయిందేమో అని తప్పుగా ఆలోచించాను అనుకుంది.

ఈమె గురించేనా యవనిక విషయంలో నేను భయపడ్డాను. మారదు. వసంత ఎప్పటికీ మారదు. ఈ వసంత తన చెల్లెలు ఆ తరువాతే సంతోష్ భార్య అనుకుంది.

"కాఫీ తాగి ఉండవు నాకు తెలుసు. నువ్వు బైటెక్కడా తాగవుగా ముందు కాఫీ తాగు తరువాత ఇడ్లీ తిందాం" అంటూ కాఫీగ్లాసు అందించింది.

పద్మిని కళ్ళు చెమర్చాయి.

"ఎలా ఉన్నావు? సంతోష్ ఏడి?"

"లేడక్కా ఏదో షూటింగ్ అని లొకేషన్‌కి వెళ్ళాడు."

పద్మిని కొన్ని క్షణాలు కప్పులో ఉన్న కాఫీ కేసి తదేకంగా చూస్తూ నెమ్మదిగా అడిగింది. "యవనిక ఎలా ఉంది వసంతా?"

వసంత కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"దానికేం చాలా సంతోషం ఉందక్కా. ఏదో కొత్త సీరియల్ ప్రారంభం అయింది అందులో ఒక నాయికగా యవనిక వేస్తోంది. ప్రస్తుతం ఆ సీరియల్ షూటింగ్‌కే వెళ్ళింది. ప్రారంభించి రెండురోజులైంది" అంది.

పద్మిని చేతిలో కప్పు వణికింది.

సీరియల్‌లో వేస్తోందా? అనుకున్నంతా అయింది. అయిపోయింది యవనిక ఇంక ఆ ఊబిలో కూరుకుపోయింది. బైటకు రావడం అసాధ్యం.

"నువ్వు దానిగురించి బాధపడకక్కా. యవని చాలా తెలివైంది. గడుసుది, ధైర్యస్తురాలు. ఎవరిని ఎలా మాయచేయాలో, ఎవరిని ఎక్కడ నొక్కాలో దానికి బాగా తెలుసు. సంతోష్ కూడా అదే చెప్పాడు యవనిక ఇంక తన బతుకు తను బతకగలదు."

పద్మిని తలాడిస్తూ అంది "మంచిదేగా వసంతా నాకు అంతకన్నా ఏం కావాలి?" అంది వణికే పెదాలు బిగించి దుఃఖం ఆపుకుంటూ.

పద్మిని మనసులో చెలరేగుతున్న ఆవేదన కళ్ళల్లో ప్రతిఫలిస్తుంటే యవనిక ప్రేమకథ చెప్పాలనిపించలేదు వసంతకి. ఇప్పుడు ఆ విషయం చెబితే పద్మిని గుండె పగలొచ్చు, లేదా ఆవేశపడచ్చు. ఎలా స్పందించినా చేసేదేం లేదు. అందుకే మాట మారుస్తూ "చెప్పక్కా నీ ప్రయాణం విశేషాలు చెప్పు" అంది.

పద్మిని కళ్ళు తుడుచుకుని తన వెంట తెచ్చిన క్యారీబ్యాగ్ లోంచి మైసూరు జార్జెట్ చీర తీసి వసంతకిచ్చింది. చిలకపచ్చకి నారింజరంగు బార్డరు చీర చాలా బాగుంది.

వసంత కళ్ళు మెరుస్తుండగా అది అందుకుని అది "ఎందుకక్కా ఇంత ఖరీదు పెట్టి తెచ్చావు?"

"ఎంతో ఖరీదులేదు వసంతా.. మా తోటి ప్రయాణీకుల్లో ఒకావిడ చెల్లెలుంది మైసూరులో ఆవిడ ఫ్యాక్టరీకి తీసుకెళ్ళి మా అందరికీ తక్కువ ధరలో చీరలు ఇప్పించింది" అంటూ శాండల్‌వుడ్ పౌడర్‌తో చేసి బొమ్మలు ఇచ్చింది.

అలాగే యవనిక కోసం కొన్న చీర కూడా ఇస్తూ అంది "దానికి నచ్చుతుందనే కొన్నాను. ఇప్పుడు తన అభిరుచులన్నీ మారిపోయి ఉంటాయి పెద్దదైందిగా. ఇది ఇవ్వు ఒద్దంటే నువ్వే ఉంచుకో."

మంచి పండు మిరప రంగు షిఫాన్ చీరకు వేలెడు జరీ బోర్డరు ఎంతో బాగుంది చీర మెత్తగా అరిచేతిలో ఇమిడిపోతూ.

"ఇంత మంచి చీర నచ్చకపోతే దానికి ఏమీ తెలియనట్టే. ఎంత బాగుందో చీర" అంది వసంత చీర చూస్తూ.

పద్మిని నవ్వి ఊరుకుంది.

"నీకేం తెచ్చుకున్నావక్కా?" అడిగింది వసంత.

"నాకా.. విరక్తిగా నవ్వింది పద్మిని "నాకింక ఇలాంటి చీరలెందుకు వసంతా..? ఏవో హ్యాండ్‌లూమ్ చీరల్తో గడిచిపోతుంది."

"ఏంటక్కా ఆ మాటలు? నీకేం వయసుమించిపోయిందని. ఏం అరవై వచ్చాయా? డెబ్బై వచ్చాయా? అస్సలు నన్నడిగితే యవనిక దాని బతుకు అది బతుకుతోంది కాబట్టి నువ్వు హాయిగా ఎవరినైనా పెళ్ళిచేసుకుని ఇప్పటికైనా సుఖంగా ఉండు."

"చాల్లే వసంతా ఇంక ఇలాంటి మాటలు నా దగ్గర మాట్లాడకు. ఇది పెళ్ళిచేసుకునే వయసుకాదు. ఆధ్యాత్మిక మార్గంలో నడిచి ఆ పరమేశ్వరుడిని చేరుకోడానికి చూడడమే నేను చేయాల్సింది."

"ఈ మధ్యే ఎక్కడో చదివానక్కా ఎవరో యాభై అయిదేళ్ళ స్త్రీ, డెబ్బై ఏళ్ళ వ్యక్తి పెళ్ళిచేసుకున్నారుట. ఎందుకంటావు? శారీరక సుఖం కోసమా? పరస్పరం కష్టం, సుఖం పంచుకోడానికి, మనసులో కదిలే భావాలు ఒకరికొకరు చెప్పుకోడానికి, దుఃఖం కలిగితే ఒకరినొకరు ఓదార్చుకోడానికి అంతేకానీ ఎవరూ ఈ వయసులో శారీరక సుఖాల గురించి ఆలోచించరు."

"ఎవరిష్టం వారిదిలే వదిలెయ్. ఇవాళ వంటేం చేసావు" అంటూ లేచింది పద్మిని.

వసంత కూడా లేచి "ముందు ఇడ్లీ తిందాం ఇకా పదిన్నరే అయింది. వంట ఎంతసేపు చేస్తాను. దొండకాయ ముక్కలు తరిగి ఉన్నాయి. అవి వేయించి సాంబారు చేస్తాను, ఆమ్లెట్ వేస్తాను" అంది.

అలాగేలే అంది పద్మిని. సాయంకాలందాకా కూర్చుని వసంత ఉండమని ఎంత బలవంతం చేసినా తన చిన్నగదికి వెళ్ళిపోయింది.

మరో వారం రోజులు గడిచాయి.

ఈ వారం రోజులు పద్మిని గదిలోంచి బైటకు రాలేదు. వసంత చెప్పిన విషయాలు చెవుల్లో మారుమోగుతున్నాయి. యవనిక తనతో కనీసం ఒక్కమాట చెప్పకుండా సీరియల్‌కి ఒప్పుకోడం, తనకి ఫోన్ చేసి అమ్మా నన్ను క్షమించు నేను తప్పుచేసాను అని చెప్పకపోవడం ఆమె గుండెల్లో సూదుల్తో గుచ్చుతున్నంత బాధను కలిగిస్తోంది. ఈ కాలం పిల్లలు ఇంత త్వరగా తల్లి చేసిన త్యాగాలు, కురిపించిన ప్రేమానురాగాలు మర్చిపోతారా?

నువ్వు మాత్రం ఏం చేసావు? అంతరాత్మ ఛెళ్ళున కొట్టినట్టు అడిగింది.

పద్మిని ఉలిక్కిపడింది. అవును నేను మాత్రం ఏం చేసాను? అనుకుంది.

పిల్లలకోసం, వాళ్ళ ఉన్నతి కోసం శ్రమపడుతూ తన పిల్లలు క్రమశిక్షణతో పెరిగి ఆదర్శవంతంగా జీవించాలని ఆశించిన తండ్రిని, తను చేసిన చిన్న, చిన్న తప్పులని కడుపులో దాచుకుని కాపాడిన అమ్మని, ఎంతో ప్రేమించిన అమ్మని, పుట్టిన దగ్గరనుంచి ఎంతో జాగ్రత్తగా కళ్ళల్లో పెట్టుకుని కాపాడుకున్న అమ్మని, ఎంతో ప్రేమించిన అమ్మని, పుట్టిన దగ్గరనుంచి ఎంతో జాగ్రత్తగా కళ్ళల్లో పెట్టుకుని కాపాడుకున్న అమ్మని, తోడబుట్టిన అక్కలను, తమ్ముడిని ఇంత మందిని వంచించి ప్రేమమైకంలో ఇంట్లోంచి పారిపోయింది.

ఆ తరువాత ఒక్కసారి, ఒక్కసారన్నా వాళ్ళెలా ఉన్నారో చూసిందా? వాళ్ళు ఏమైపోయారో ఆలోచించిందా? వాళ్ళకాళ్ళ మీద పడి క్షమార్పణ అడిగితే వాళ్ళు కాదనేవాళ్ళా?

ఎంతో పరువుగా, గౌరవంగా బతుకుతున్న కుటుంబాన్ని అప్రదిష్టపాలు చేసింది. ఆ తరువాత ఏం జరిగిందో అమ్మ ఏమైందో, నాన్న ఏమైనాడో, తమ్ముడు ఏం చేస్తున్నాడో తను తెలుసుకోలేదు. తనంత స్వార్ధపరురాలు, నీచురాలు ఈ ప్రపంచంలో ఉంటుందా? ఇవాళ ఏ మొహం పెట్టుకుని తన కూతురిని తప్పు పడుతోంది. అయినా అది ఏం తప్పుచేసిందని. ఇరవై ఏళ్ళు దాటుతున్న పిల్ల తనకి నచ్చిన రంగంలో తన జీవితాన్ని సెటిల్ చేసుకోవాలనుకుంది. తన బతుకు తను బతకాలనుకుంది. అమ్మని వదిలి అది ఎటూ పారిపోలేదు. పైగా నిన్ను కూడా నేనే పోషిస్తానమ్మా అని చెప్పింది. అలాంటి పిల్లని తన మూర్ఖత్వంతో, అవివేకంతో దూరం చేసుకుంది. ఇప్పుడు ఎంత కుమిలిపోతే ఏం లాభం?

**అయిపోయింది.** ఇంక తనతో యవనిక బంధం తెంచేసుకుంది.

దాని జీవితం దానిది.

ఎలా బతికినా, ఎక్కడ బతికినా, ఆమెకి ఇష్టమైన వాళ్ళని పెళ్ళిచేసుకున్నా అడిగే హక్కు తనకేమాత్రం లేదు.

తను ఆదర్శంగా బతికినప్పుడు కదా ఎదుటివాళ్ళని ఆదర్శంగా బతకమని చెప్పే అర్హత ఉండేది.

ఇలా జరగడం దేవుడు తనకి వేసిన శిక్ష.

అవును చేసిన తప్పుకి శిక్ష అనుభవించాలి.

పద్మినికి మనసంతా భారంగా అయింది. గుండె పగిలేలా ఏడవాలనిపించినా కన్నీళ్ళు రాలేదు.

ఉదయం తొమ్మిదిదాటుతున్నా పక్కమీంచి లేవాలనిపించలేదు.

రేపట్నించీ ఏం చేయాలి? ఎలా బతకాలి? బ్యాంకులో దాచుకున్న డబ్బులు అయిపోతున్నాయి. అందులో ఉన్న బ్యాలన్స్‌తో తన తిండీ, బట్టా గడవాలి. ఎలా? ఎంతకాలం గడుస్తుంది. గడవదు. మహా అంటే ఓ ఆర్నెల్లు, అది కూడా ఒకపూట తిండికి, గది అద్దెకట్టడానికి సరిపోతుంది. తరువాత ఏం చేయాలి? చేయాలి ఏదన్నా చేయాలి. ఏం చేయగలదు. నటనలో పుట్టకపోయినా నటనతో బతికిన తను నటించాల్సిందే

నిజానికి ఆవిడకి నటించడం రాదు. ఆమె ఎప్పుడూ ఎవరి దగ్గరా తన మనసులోని ప్రేమ, ఆప్యాయత నటించలేదు.

ఎవరితో గౌరవం నటించలేదు.

ఎవరితో ఆదరణ నటించలేదు.

ఎవరితో స్నేహం నటించలేదు.

జీవితంలో జీవించింది. కానీ, బతకడానికి నటించింది. నటించినప్పుడు కూడా తను వేసిన ప్రతిపాత్రలో జీవించింది. నటించలేక జీవించింది. అందుకే ఆమె మహానటి అయింది.

కానీ, పాత్రలో ఎంత బాగా జీవించినా నటించడం తెలియనందుకు ఓడిపోయింది.

అటు పూర్తిగా పేరు, ప్రతిష్టలు రాలేదు, ఇటు హాయిగా జీవించడానికి సరిపడా ఆర్థికబలమూ రాలేదు. మరి ఏం సాధించినట్టు.

ఏమీ సాధించలేదు.

జీవితంలో సగభాగం గడిచిపోయిందో, ముప్పాతిక భాగం గడిచిపోయిందో, మిగిలి ఉన్న జీవితం కూడా ఓ ప్రశ్నగానే మిగిలిపోయింది.

ఇంక ఈ పాత్ర ముగిసిందని తన జీవన్నాటకానికి తెరవేయలేకపోతోంది.

ఈ జీవనవేదిక మీద ముగింపు తెర ఇంకా ఎప్పుడు పడుతుందా అని ఎదురుచూస్తూ ఇలా బతకాల్సిందేనా?

బతకాలంటే మరి ఏదో ఒకటి చేయాలికదా. చేయడానికి ఏమీలేదు. ఒకే ఒక్క పని అదే చేయాలి. మళ్ళీ నటించాలి.

ఎక్కడ? ఎక్కడ నటించాలి? జీవితంలోనా? తెరమీదనా? రంగస్థలం మీదనా?

ఫోన్ మోగడంతో పద్మిని ఆలోచనలు చెదిరిపోయాయి.

ఫాతిమా..

ఫాతిమా నుంచి ఫోన్. దాదాపు పదమూడు రోజులు తనని అంటిపెట్టుకుని ఈ భయంకరమైన ఆలోచనలు తనమీద దాడి చేయకుండా కాపాడుతూ ఆప్యాయత పంచిన అమాయకురాలు.

ఫాతిమా ఆప్యాయంగా పిలిచింది.

"మేడమ్ నమస్తే బాగున్నారా? ఏం చేస్తున్నారు మేడమ్? మీరు ఫోన్ చేస్తారని ఎదురుచూసాను. చేయకపోయేసరికి నేనే చేస్తున్నాను. ఎలా ఉన్నారు?" ఒకేసారి గబ, గబా మాట్లాడేసింది.

"నేను బాగున్నాను తల్లీ నువ్వెలా ఉన్నావు?" అడిగింది.

"నేను ఇంటికి వెళ్ళేసరికి నా కొడుక్కి జ్వరం మేడమ్. మొన్ననే తగ్గింది. చేతిలో ఉన్న డబ్బులన్నీ ఖర్చయాయి. ఏదో ఒక ప్రోగ్రామ్ వస్తే బాగుండని ఎదురుచూస్తున్నాను. పాపకి స్కూలు ఫీజు కట్టాలి. బాబుకి బలమైన తిండి పెట్టాలి. ఏం చేయాలో అర్ధంకావడంలేదు."

ఆమె స్వరంలో వినిపిస్తున్న ఆవేదన, గుండెల్ని కోసే ఆక్రోశం.

భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారిన వేళ ఏదో ఒక సమాధానం కోసం చేస్తున్న అన్వేషణ.

ఫాతిమా.. పాతికేళ్ళకే వందేళ్ళ అనుభవాలు పొందిన పరాజిత.

ఈమెకి తను ఏమన్నా సాయం చేయాలి. ఏం చేయాలి? తనే నాలుగురోడ్ల కూడలిలో నిలబడి ఎటువెళ్ళాలో తెలియక అగమ్యంగా తిరుగుతున్న బాటసారి. తనేం దారి చూపించగలదు.

ఒక్కచేయి సాధించలేనిది మరో నాలుగు చేతులు కలిస్తే సాధించగలదు ఎవరో, ఎక్కడో అన్నమాట.

నిజం ఇలాంటి మాటలు మనిషికి ఆత్మస్థైర్యాన్ని ఇస్తాయి. అగమ్యగోచరంగా ఉన్నవారికి ఓ దారి చూపిస్తాయి. పెద్దల మాటలు వరహాల మూటలు అవి దాచుకుని, అప్పుడప్పుడూ చూసుకోవాలి. స్ఫూర్తినిచ్చే మాటలు, ఓదార్పునిచ్చే మాటలు. ఇలాంటి వన్నీ ఎంతో జీవితానుభవం ఉన్నవాళ్ళే చెప్పగలరు.

మరి తనెందుకు చెప్పలేకపోతోంది. ఇంత జీవితానుభవం ఉన్నా తన మాటలు ఎవరికీ ఏ విధమైన స్ఫూర్తినివ్వవేం.

తనకి మాట్లాడడం రాదా, సరిగా ఆలోచించడం రాదా?

"మేడమ్ మాట్లాడరేం హలో లైనులో ఉన్నారా?"

"ఆ, ఆ ఉన్నానమ్మా.. మాట్లాడుతున్నాను కలవరంగా అంది."

"ఏమిటి మేడమ్ మీ గొంతు అలా ఉందేం?"

"ఏం లేదు ఇప్పుడే లేస్తున్నాను. తలనొప్పిగా ఉంటేనూ."

"అయ్యో అలాగా ఎవరన్నా ఉన్నారా ఇంట్లో మీకు మందులు తెచ్చేవాళ్ళు. అంకుల్‌గానీ, మీ పిల్లలు గానీ."

వాళ్ళ వ్యక్తిగత విషయాలు, వాళ్ళబాధలు వింది కానీ, తన గురించి వాళ్ళకేం చెప్పలేదు. అందుకే అడుగుతోంది ఫాతిమా.

పద్మిని పెదాల మీదకి చిరునవ్వు పాక్కుంటూ వచ్చింది.

"ఉన్నారు. అందరూ ఉన్నారు."

"పోనీలెండి అదృష్టవంతులు. ఆ!.. మేడమ్ నాకేదన్నా సాయం చేస్తారా?" ఆశగా అడిగింది.

పద్మిని గాఢంగా నిట్టూర్చింది. "చేస్తాను తప్పకుండా చేస్తాను ఫాతిమా. నువ్వు హైదరాబాదు రాగలవా? చార్జీలు ఇస్తాను రాగానే. నీ దగ్గర లేకపోతే ఎవరి దగ్గరన్నా తీసుకుని రా, రాగానే ఇస్తాను తీర్చేద్దువుగాని."

"తప్పకుండా వస్తాను మేడమ్. నిజంగా రమ్మంటున్నారా?" ఆత్రంగా, ఉద్వేగంగా అడిగింది.

"అవును నిజంగానే రమ్మంటున్నారు. రా వచ్చాక మనం ఏం చేయాలో చెప్తాను."

"అలాగే తప్పకుండా వస్తాను రేపే బయల్దేరతాను. ఎక్కడికి రావాలి మీ ఇంటికి రమ్మంటారా?"

"బస్‌లో వస్తావో, రైల్లో వస్తావో రాగానే నా నెంబర్‌కి కాల్ చెయ్యి నేను నిన్ను తీసుకుని వెళ్తాను సరేనా?"

"థాంక్యూ మేడమ్ థాంక్యూ వెరీమచ్."

ఫోన్ పెట్టేసింది.

దుప్పటి తొలగించి మంచం మీద నుంచి దిగింది.

దుప్పటి మడతపెట్టి, బాత్‌రూమ్ వైపు నడిచింది.

ఇప్పుడామె నడకలో నీరసం లేదు, నిరాశా, నిస్పృహ ఏమీ లేవు. ఆత్మ విశ్వాసం అణువణువునా వెల్లివిరుస్తుంటే చిరునవ్వుతో తనని తాను ప్రక్షాళనం చేసుకోడానికి బయలుదేరింది.

"యవనిక పెళ్ళిచేసుకుంటోందిట." వసంత బాధగా, కోపంగా, నిస్సహాయంగా.

పద్మిని ఆమె వైపు చిరునవ్వుతో చూసింది.

"ఎప్పుడు?"

వసంత ఆశ్చర్యంగా చూసింది. మొదలు నరికిన చెట్టులా కూలిపోతుందనుకుంది. గుండె పగిలి నిర్జీవంగా వాలిపోతుందనుకుంది.

మధురంగా నవ్వుతూ, చిలిపిగా చూస్తున్న పద్మినిని విస్తుబోయి చూసింది.

"అబ్బాయి ఎవరు? ఏం చేస్తుంటాడు?"

వసంత ఇప్పుడు సంతోష్ వైపు తిరిగింది ఏంటి అక్కకేమైంది అన్నట్టుగా.

సంతోష్ కళ్ళతో సైగ చేసాడు.

"నీకు తెలుసా సంతోష్. అబ్బాయి ఏం చేస్తున్నాడో?" అడిగింది పద్మిని.

"అతనుకూడా మీడియాలోనే ఉన్నాడు మేడమ్. మంచి కుర్రాడే యవనికని బాగా ఎంకరేజ్ చేస్తున్నాడు. మంచి పరపతి ఉంది కాబట్టి అవకాశాలు కూడా ఇప్పిస్తున్నాడు."

"అలాగా అతనేమన్నా సంపాదిస్తున్నాడా? ఎందుకడుగుతున్నానంటే మనకి తెలుసు కదా భార్య సంపాదన మీద ఆధారపడి తింటూ ఆ భార్యనే హింసించే భర్తలు చాలామంది ఉన్నారీ ఫీల్డ్‌లో"

"అతనికి బోలెడాస్తి ఉంది. మంగళగిరిలో స్థలాలున్నాయట. అక్కడికి దగ్గరలో పొలాలున్నాయట. సినిమాలమీద ఆసక్తితో సినిమా తీస్తానంటూ హైదరాబాద్ వచ్చాడు. ఒక్కడే కొడుకు."

"అబ్బాయి మంచివాడేనా?"

"మంచివాడే"

"పోనీలే అది సుఖంగా ఉంటుంది కదా అది చాలు. ఆ వసంతా! మనం మహిళా కళాకారుల వేదిక పెట్టాం గుర్తుందా? ఇక్కడికి వచ్చేసేటప్పుడు ఆ బ్యానర్ కూడా పట్టుకొచ్చాం అదెక్కడుందో తెలుసా?" అడిగింది పద్మిని.

అసలే అయోమయంగా చూస్తున్న వసంత పద్మిని హఠాత్తుగా అడిగిన ప్రశ్నకి కొన్ని క్షణాలు కలవరపడి నెమ్మదిగా గుర్తుచేసుకుని అంది "ఉందక్కా నా దగ్గరే ఉంది."

"నాకదికావాలి" అంటున్న పద్మిని వైపు వింతగా చూసింది. దేనికి? ఏం చేయబోతోంది ఆ బ్యానర్‌తో. అదే అడిగింది "ఎందుకక్కా?"

పద్మిని కూర్చున్న దగ్గర నుంచి లేచి డైనింగ్ టేబుల్ మీద ఉన్న అరటిపండు తీసుకుని తొక్క ఒలుస్తూ అంది. "నేను ఇంకా కొంతకాలం బతుకుతానుగా వసంతా.. బతకాలంటే ఏదన్నా చేయాలిగా అందుకు.."

దానికీ, దీనికీ సంబంధం ఏంటి? ఆ బ్యానర్‌తో ఏం చేయగలదు. మళ్ళీ ప్రయత్నిస్తే టీవీలో ఏదో ఒక అవకాశం వస్తుందికదా.

వసంత చూపులు గ్రహించినదానిలా నవ్వుతూ అంది. "ఖంగారుపడకు వసంతా. నేను ఇకనుంచీ ఒక కొత్త జీవితం ప్రారంభించబోతున్నాను. ఆ జీవితంలో నాకు నేను కోరుకునే సంతోషం, తృప్తి, సుఖం భద్రత అన్నీ లభిస్తాయనే నా విశ్వాసం. అవును వసంతా తప్పకుండా నేను కోరుకున్నవన్నీ లభిస్తాయి. ఆ బ్యానర్ తీసిపెట్టు. సంతోష్ వైపు తిరిగి అంది "సంతోష్ కృష్ణానగర్‌లో నాకు ఒక పెద్ద హాలు, రెండు గదులు ఉన్న పోర్షన్ కావాలి చూసి పెడతావా?"

సంతోష్‌కి కూడా ఈవిడకేమన్నా మతి చలించిందా అనిపించింది. అంత పెద్ద ఇంటికి ఎంత అద్దె అవుతుందో ఈవిడకి అర్థంకావడంలేదా? అవగాహనలేదా?

"అద్దె కడతాను సంతోష్ తప్పకుండా కడతాను. భయపడకు. త్వరలో నాకలాంటి పోర్షన్ చూసిపెట్టు" అంది పద్మిని.

వసంతా, సంతోష్ కొత్త మెరుపులతో కళకళ్ళాడుతున్న పద్మిని మొహంలోకి వింతగా చూస్తూ ఉండిపోయారు.

అరటిపండు తింటూ బాల్కనీలోకి వెళ్ళిపోయింది పద్మిని.

ఫాతిమా హైదరాబాదు వచ్చింది. ఈలోగా పద్మిని కాంచనకి ఫోన్ చేసి పిలిపించింది. ముగ్గురూ కలిసి పద్మిని ఇంట్లో భవిష్యత్తుకి ఒక పకడ్బందీ ప్రణాళిక రచించారు.

జీవితం అనే రంగస్థలం మీద కొత్తగా ప్రారంభించబోతున్న జీవన్నాటకానికి పద్మినినే కథ, మాటలు రచించింది.

"మేడమ్ మీరు వేసిన ప్లాన్ తప్పకుండా సక్సెస్ అవుతుంది. నాకూ కొంత పరపతి ఉంది కాబట్టి మనకి స్టూడెంట్స్‌ని నేనే తీసుకొస్తాను" అంది కాంచన.

"మేడమ్ మూడునెల్ల కోర్స్‌కి పదిహేనువేలు ఫీజు అని చెబుదాం. అంతకన్నా తక్కువ అయితే మనకి గిట్టుబాటుకాదు" అంది ఫాతిమా.

అన్నిటికీ చిరునవ్వుతో సరే అంది అంది పద్మిని.

సరిగా పదిహేనురోజుల్లో సంతోష్ పద్మిని సూచించిన పోర్షన్ వెతికాడు. అద్దె పదివేలు.

పద్మిని సంతోషంగా ఒప్పుకుంది.

ఫాతిమాను, కాంచనను వసంతకీ, సంతోష్‌కీ పరిచయం చేసి తను రచించిన ప్రణాళిక వివరించింది.

అంతా విన్న వసంత దంపతులు పద్మిని మనోధైర్యానికి ఆశ్చర్యపోయారు.

ఇంత త్వరగా కోలుకుంటుందని, పైగా ఇంత విశ్వాసంతో, ఇంత ధైర్యంగా అడుగు ముందుకు వేస్తుందని ఎవరూ ఊహించలేదు నిజంగా పద్మిని గ్రేట్ అనుకున్నారు.

తన వేలికి ఉన్న ఉంగరం, చెవులు దిద్దులు తీసి వసంతకిస్తూ అంది పద్మిని "యవనికకు ఇంతకన్నా ప్రస్తుతం నేనేమీ కానుకలివ్వలేను వసంతా. ఇవి తన పెళ్ళికి నా కానుకలుగా ఇచ్చి నా దీవెనలు అందచేయి. వచ్చేనెల పదోతారీకు ఉదయం పదిన్నరకి నా సంస్థ ప్రారంభోత్సవం చేస్తున్నాను. అందులో నువ్వు భాగస్వామ్యం తీసుకోవాలనుకుంటే ఇదే నా ఆహ్వానం. లేదంటే మీరిద్దరూ అతిధులుగా రండి. అలాగే యవనికను కూడా ఈ సంస్థకి ఆహ్వానించానని చెప్పు. దంపతులిద్దరిని రమ్మన్నానని చెప్పు."

వసంతకి కన్నీళ్ళాగలేదు. "ఏంటక్కా ఇది? నాకు భయంగా ఉంది" అంది.

"ఎందుకు వసంతా ఇప్పుడు భయం దేనికి? ఇది నువ్వు సంతోషించాల్సిన సమయం తెలుసా?" దగ్గరకు తీసుకుని వీపు మీద నిమురుతూ అంది పద్మిని.

"అవును వసంతగారూ. మేడమ్ మేము ఆవిడ పిల్లలం. ఆవిడని వదిలి ఎప్పుడూ ఎక్కడికీ వెళ్ళం మా ఊపిరి ఆగిందాకా ఈ సంస్థ అభివృద్ధికి కృషిచేస్తాం. ఈ సమాజంలో మంచి కళాకారులను తయారు చేస్తాం. మా సంస్థలో తయారైన కళాకారులు భవిష్యత్తులో అలనాటి మహానటీమణులైన సావిత్రి, కన్నాంబగారు, భానుమతిగారు, మధుబాల, మీనకుమారిలా గొప్ప నటీమణులు అవుతారు. అందుకు మీ ఇద్దరి సహకారం కూడా మాక్కావాలి సంతోష్‌గారూ" అంది ఫాతిమా.

"అంటే ఏం చేస్తారు?" ఆసక్తిగా అడిగాడు సంతోష్.

"నేను చెప్తాను" అంటూ చెప్పింది పద్మిని. "నా అనుభవం అంతా రంగరించి ఔత్సాహిక యువతలకు నిజమైన నటన నేర్పిస్తాను. కళ అంటే కాసుకోసం కాదు, కల కళకోసమే అని వాళ్ళకి తెలియచేస్తాను. నటన నేర్పి నా సంస్థ తరపున నెలకి ఒక మంచి నాటకం వేయిస్తాను. అటు మీడియాకి, ఇటు రంగస్థలానికి కూడా తమ నటనతో ప్రాభవాన్ని తెచ్చే కళాకారులను తయారు చేస్తాను."

వసంత, సంతోష్ ఆమె చెప్పింది విని ముగ్ధులయారు. "మీ ఆలోచన చాలా బాగుంది. మీ ప్రయత్నం విజయవంతం కావాలి మేడమ్" అన్నాడు సంతోష్.

"అవునక్కా ఆ రోజు అనుకున్నది ఇప్పుడు ఆచరించడమే కాదు, విజయం కూడా సాధించాలి. అది మన ఆశయం తప్పకుండా నేనూ భాగస్వామ్యం తీసుకుంటాను" మనస్ఫూర్తిగా అంది వసంత.

ఆ రోజు పదవతేదీ, సమయం పది ఇరవై.

మరో పదినిమిషాల్లో మహిళా కళాకారుల వేదిక సంస్థ ప్రారంభోత్సవం జరగబోతోంది.

ముఖ్య అతిధులుగా రెండు టీ.వీ ఛానెల్ అధిపతులను, ఇద్దరు సినిమా నిర్మాతలను, ఇద్దరు ప్రముఖ సినీనటులను పిలిచారు.

ఆ ప్రాంగణం అంతా బంతిపూలతో, రంగు కాగితాలతో అలంకరించారు.

అందంగా అలంకరించిన సభావేదిక రమణీయంంగా ఉంది.

మంచి చీరలతో, మొహాలనిండా ఆనందకాంతులతో హడావుడిగా అటూ, ఇటూ తిరుగుతూ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు పద్మిని, వసంత ఫాతిమా, కాంచన. కాంచనకి తెలిసిన మరి నలుగురు అమ్మాయిలు అప్పుడే అందులో చేరడానికి ఆసక్తిగా ముందుకు వచ్చి వారి, వారి సహకారం అందిస్తున్నారు.

సంతోష్ బ్యానర్ కట్టి దానిమీద శాటిన్ నీలం రంగు తెరకప్పాడు ఒక అతిధి ఆ తెర తొలగించి ప్రారంభోత్సవం చేస్తాడు.

అంత హడావుడిలోనూ పద్మిని కళ్ళు ఎవరికోసమే అన్వేషిస్తున్నట్టు తిరుగుతున్నాయి.

వసంతని నెమ్మదిగా అడిగింది "పెళ్ళయిపోయిందా నేనిచ్చిన కానుకలిచ్చావా? " అంటూ.

వసంత జాలిగా చూసింది "ఇచ్చానక్కా. రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్ళి చేసుకున్నారు."

"తీసుకుందా?" ఉద్వేగంగా అడిగింది.

"తీసుకుంది. థాంక్స్ అంది."

"వస్తానందా ఇవాళ?" అడగబోయి ఆగిపోయింది.

గేటు అవతల కార్లు వచ్చి ఆగాయి.

అతిధులు వచ్చారు, అందరూ హడావుడిగా గేటు దగ్గరకు బయల్దేరారు అతిధులకి స్వాగతం పలకడానికి.

ఆహ్వానించిన అతిధులంతా వచ్చారు.

సమయం పదిన్నర.

సంస్థ బ్యానర్ మీద కప్పిన నీలం రంగు శాటిన్ తెర తొలగించాలి.

ఒక అతిధి దీపారాధన చేయాలి.

మరొక అతిధి పద్మిని ప్రారంభించబోతున్న కళాకారుల వేదిక అనబడే ఆమె కొత్తగా తీసుకున్న ఇంటి తలుపు తీయాలి.

పత్రికా విలేఖరులు, ఎలక్ట్రానిక్ మీడియా వారు సిద్ధంగా ఉన్నారు.

వాళ్ళని ఆహ్వానించి ఇవాళ ఇక్కడికి రావడానికి సాయం చేసిన సంతోష్ చిరునవ్వుతో నిలబడి ఎదురుచూస్తున్నాడు.

ప్రముఖ నిర్మాత సిద్ధంగా ఉంచిన స్టూలు మీద ఎక్కాడు.

బ్యానర్ మీద ఉన్న చిన్న తెరను తొలగించడానికి ఆయన చేతులు సాచాడు.

ఎప్పటికీ ఇంక రాదు అనుకుంటున్న పద్మిని గుండె తడి కళ్ళల్లోకి పాకి అక్కడున్న వాళ్ళంతా మసకగా కనిపించారు.

కళ్ళు తుడుచుకుంటూ తలెత్తింది.

తెర తొలిగింది. "యవనిక మహిళా కళాకారుల వేదిక. "

అందరూ చప్పట్లు కొట్టారు.

"యవనిక వచ్చింది" చెవిలో వసంత స్వరం శంఖం ఊదినట్టు వినిపించి గభాల్న తలతిప్పి చూసింది పద్మిని.

ఖరీదైన చీరలో తళ, తళ మెరిసిపోతూ అందంగా, అప్సరసలా గేటులోపలికి వచ్చింది యవనిక, ఆమె పక్కన ఈడూ, జోడుగా అందంగా ఉన్న యువకుడు దర్జాగా అడుగుపెట్టాడు.

పద్మిని మాతృహృదయం వాత్సల్యానురాగాల అమృతధారలు కురిపిస్తూండగా ఆమె యవనికకు ఎదురువెళ్ళింది.

*సహృదయులైన పాఠకులకి*

*నేను ఎంతో కాలంగా రాయాలనుకుంటూ నిర్లక్ష్యం చేసిన కథావస్తువు ఈ నవల. రాయడం ప్రారంభించాక కూడా ఏదో అసంతృప్తి, ఏదో వెలితి. సరిగా రాయలేకపోతున్నానేమో, నేను ఆశించినంత ఆర్ద్రంగా లేదేమో, పాఠకుల అభిమానం పొందలేకపోతున్నానేమో అనే నిస్పృహతో ఎప్పటికప్పుడు ఆపేద్దామా అనుకుంటున్న సమయంలో 'ఒద్దు, ఒద్దు, చాలా బాగుంది ప్లీజ్ పూర్తిచేయండి ' అంటూ తన అభిమానం అనే అమృతం కురిపిస్తూ ప్రోత్సహిస్తూ, నేనీ నవల పూర్తిచేయడానికి దోహదం చేసిన కౌముది కిరణం కాంతికి, నా ఈ నవలను ఆదరించిన పాఠకులకు ధన్యవాదాలతో మీ,*

**అత్తలూరి విజయలక్ష్మి**